# TELUGULO SOUNDARYA SASTRA VIMARSA - OKA ADHYAYANAM

**A Dissertation submitted to the University of Hyderabad in Partialfulfillment of the degree of**

**DOCTOR OF PHILOSOPHY**

**In**

**TELUGU**

**By**


**MAJJI DURGA RAO**



**Department of Telugu**
**School of Humanities**
**University of Hyderabad**
**(P.O) Central University, Gachibowli**
**Hyderabad – 500 046,**
**Andhra Pradesh,**
**India**


**JANUARY – 2013**

# తెలుగులో సౌందర్యశాస్త్ర విమర్శ- ఒక అధ్యయనం

(పురాణం సూరిశాస్త్రి, సంజీవదేవ్, శ్రీశ్రీ, చలం, బుచ్చిబాబు రచనలపై ప్రత్యేక పరిశీలన)

(పిహెచ్.డి పట్టా కొరకు హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం)


పరిశోధన

**మజ్జి దుర్గారావు**

**తెలుగు శాఖ**

**మానవీయశాస్త్ర విభాగం**

**హైదరాబాద్ విశ్వవిద్యాలయం**

**గచ్చిబౌలి, హైదరాబాద్**

**ఆంధ్రప్రదేశ్ జనవరి,2013**

Date:

# DECLARATION

I, **DURGARAO MAJJI**, Register No: **07HTPH01** hereby declare that this thesis entitled " ***TELUGULO SOUNDARYA SASTRA VIMARSHA- OKA ADHYAYANAM*** **"** submitted by me under the guidance and supervision of **Dr. DARLA VENKATESWARA RAO** is a bonafide research work. I also declare that this had not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree / diploma.

Name: MAJJI DURGA RAO

Signature of the Student

Regd.No. **07HTPH01**

Date :

# CERTIFICATE

This is to certify that the Thesis entitled ***TELUGULO SOUNDARYA SASTRA VIMARSHA - OKA ADHYAYANAM*** submitted by **DURGARAO MAJJI** bearing Regd. No. **07HTPHO1** in partial fulfillment of the requirement for the award of Doctor of Philosophy in Telugu is a bonafide work carried out by him under my supervision and guidance.

The thesis has not been submitted previously in part or in fill to this or any other University or Institution for the award of any degree or diploma.

**Signature of the Supervisor**

**//Countersigned//**

**Head**
**Department of Telugu**

**Dean**
**School of Humanities**

## అంకితం

ప్రేమను పంచుతున్న తల్లిదండ్రులకు...

విద్యను పంచుతున్న గురువులకు...

వినయంతో...

–మజ్జి దుర్గారావు.

# కృతజ్ఞతలు

నాకు పరిశోధన చేయడానికి అవకాశం కల్పించిన తెలుగుశాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయం వారికి కృతజ్ఞతలు.

తడబడుతూ పడే తొలి అడుగులోనూ వారి ఆనందాన్ని, పయనిస్తూ సాగే ప్రతి నడకలోనూ నా జీవితాన్ని ఆకాంక్షిస్తూ నా రూపానికి ప్రతిరూపం అయిన నా తల్లిదండ్రులు అప్పలరాజు, కృష్ణవేణి గార్లకు మరియు మా అక్కలు ఆదిలక్ష్మీ, అరుణ, బావలు లక్ష్మణ, ఆదినారాయణ గార్లకు పాదాభివందనాలు.

నా ఈ పరిశోధన పూర్తి కావటానికి సంపూర్ణ సహకారం అందించిన మా గురువు మరియు పరిశోధన పర్యవేక్షకులు డా. దార్ల వెంకటేశ్వరరావు గారికి కృతజ్ఞతలు.

మా ప్రస్తుత తెలుగుశాఖ అధ్యక్షులు ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణి గారికి, ఈ పరిశోధన సీటు వచ్చేటప్పుడు తెలుగుశాఖ అధ్యక్షులుగా ఉన్న ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారికి కృతజ్ఞతలు

నేను ఎం.ఏ విద్యార్థిగా చేరినప్పటి నుండి పాఠాలు బోధించిన మా గురువులు ఆచార్య. పరిమి రామనరసింహంగారికి, ఆచార్య యన్.ఎస్. రాజుగారికి, ఆచార్య తుమ్మల రామకృష్ణగారికి, ఆచార్య జి.అరుణకుమారిగారికి, ఆచార్య ఆర్.వి. రామకృష్ణశాస్త్రి గారికి, డా. పిల్లలమర్రి రాములుగారికి, డా.పమ్మి పవన్‌కుమార్ గారికి, డా. డి. విజయలక్ష్మీగారికి కృతజ్ఞతలు.

సమాచార సేకరణలో సహకరించిన వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన ఆచార్యులు ఆచార్య కె. కుసుమారెడ్డి (ఉస్మానియా విశ్వవిద్యాలయం), ఆచార్య ఎండ్లూరి సుధాకర్ (పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, రాజమండ్రి), ఆచార్య బన్న అయిలయ్య (కాకతీయ విశ్వవిద్యాలయం), ఆచార్య కొండపల్లి సుదర్శనరాజు (ఆంధ్ర విశ్వవిద్యాలయం), ఆచార్య వెలమల సిమ్మన్న (ఆంధ్ర విశ్వవిద్యాలయం), ఆచార్య వెలుదిండ నిత్యానందరావు (ఉస్మానియా విశ్వవిద్యాలయం) మొదలైన వారికి నా కృతజ్ఞతలు.

నాకు సాహిత్యం పట్ల అభిరుచి, ఆసక్తిని గ్రహించి సాహిత్య సువాసనలు చూపించి హైదరాబాదు విశ్వవిద్యాలయంలో ప్రవేశానికి కారకులైన గుమ్మా సాంబశివరావు గారికి కృతజ్ఞతలు.

మా మేడం మంజుశ్రీ గారికి కృతజ్ఞతలు.

సమాచార సేకరణలో సహకరించిన యు.ఎ.నరసింహమూర్తి, కాకుమాను శ్రీనివాసరావు గార్లకూ కృతజ్ఞతలు.

నా పరిశోధనలో సహాయసహకారాలు అందించిన నా జూనీయర్, సీనియర్ పరిశోధక మిత్రులందరికి, నన్ను నిరంతరం ప్రోత్సహించే నా మిత్రులందరికి కృతజ్ఞతలు.

నా చిన్ననాటి స్నేహితులైన గోపి, రామ, హరి బావలకు. సుధా, నారాయణలకు కృతజ్ఞతలు.

పరిశోధనలో భాగంగా ఆంగ్ల, హిందీ గ్రంథాలను పరిశీలించేటప్పుడు ఓపికగా ఎంతగానో సహాయం చేసిన శ్రీమతి బిందు, హేమంత్ లకు కృతజ్ఞతలు.

పరిశోధన సిద్ధాంత రూపం దాల్చడానికి ఆర్థికంగా, సాంకేతికంగా ఎంతగానో సహాయం చేసిన ఆలి, సతీష్, సంజూ, గుప్పు, ఆర్.వి., రాజగోపాల్, నాగరాజు, సిద్దార్థ, రవి, కళ్యాణ చక్రవర్తి, రామ్ సురేష్, ఈశ్వర్, రెడ్డప్ప, ఉప్పె, మధు, కిషోర్, రామారెడ్డి, కళ్యాణ్ లకు కృతజ్ఞతలు.

తెలుగుశాఖలో ప్రస్తుత బోధనేతర సిబ్బంది అయిన భవానీ శంకర్, రాంబాబు, గణేష్ గార్లకూ, ఇంతకుముందు బోధనేతర సిబ్బందిగా పనిచేసిన విష్ణువర్ధన్, శ్రీధర్, కిషన్‌లకు, గార్లకు కృతజ్ఞతలు.

సమాచార సేకరణలో తమ పూర్తి సహకారం అందించిన ఇందిరాగాంధీ లైబ్రరీ (యూనివర్సిటి ఆఫ్ హైదరాబాదు) సిబ్బందికి, ఆంధ్ర యూనివర్సిటి (విశాఖపట్నం) తెలుగుశాఖ అధ్యాపకులకు, లైబ్రరీ సిబ్బందికి, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (హైదరాబాదు మరియు రాజమండ్రి) లైబ్రరీ సిబ్బందికి, నగరకేంద్ర గ్రంథాలయం (హైదరాబాదు) సిబ్బందికి, సుందరయ్య విజ్ఞాన కేంద్ర గ్రంథాలయం (హైదరాబాదు) సిబ్బందికి, సిబ్బందికి కృతజ్ఞతలు.

ఇంకా రాయలేకపోయిన వాళ్ళుంటే వాళ్ళందరికీ కృతజ్ఞతలు.

–దుర్గారావు మజ్జి

# ప్రవేశిక

## (Preface)

తెలుగు సాహిత్యవిమర్శకు సుమారు 125 సంవత్సరాల చరిత్ర ఉందని కందుకూరి వీరేశలింగం 'విగ్రహతంత్రవిమర్శనం' నుండి కొంతమందీ; నూరు సంవత్సరాల దగ్గర్లో ఉందని కట్టమంచి రామలింగారెడ్డి 'కవిత్వతత్త్వవిచారం' నుండి ఇంకొంతమంది విమర్శ చరిత్రను పరిగణిస్తున్నారు. విమర్శ ఆధునిక ప్రక్రియ అయినప్పటికీ, ఈ రెండింటికీ నేపథ్యాన్ని అందించినదంతా భారతీయ కావ్యశాస్త్రమని కూడా మరికొంతమంది విమర్శకులు భావిస్తున్నారు.

భరతుడు ప్రధానంగా రూపకాలను దృష్టిలో పెట్టుకొని రససిద్ధాంతాన్ని, మరికొన్ని భావనలను వివరించాడు. దాన్ని తర్వాత కాలంలో కావ్యానికి అనువర్తించారు. అలాగా మిగతా భారతీయాలంకారికులు కూడా కావ్యాలను, మరికొన్ని సాహిత్య ప్ర క్రియలను దృష్టిలో పెట్టుకొని తమ ప్రతిపాదనలు, వాదనలు, సిద్ధాంతాలను రూపొందించారు. వీటన్నింటినీ అవసరమైనంతమేరకు స్వీకరిస్తూనే ప్రధానంగా సాహిత్యానికే విమర్శకులు అన్వయించే ప్రయత్నం చేశారు. భారతీయ కావ్యశాస్త్రం ముఖ్యంగా సాహిత్యంలోని ఆస్వాదనను కలిగించే సౌందర్యాంశాలను గుర్తించేప్రయత్నం చేశారు.

కావ్యం లేదా నాటకం, ఇతర సాహిత్య ప్రక్రియల్లో భాష, అలంకారాలు, ఛందస్సు, ఇతివృత్తం, శైలి వంటి అంశాలతో పాటు రసం, ధ్వని, ఔచిత్యం మొదలైనన్నింటి వల్ల 'సాహిత్య సౌందర్య' అభివ్యక్తమవుతుందని వివిధాంశాలను సమన్వయించి, వివరించడం వల్ల భారతీయకావ్యశాస్త్రాలను లేదా భారతీయాలంకారిక గ్రంథాలను 'సౌందర్యశాస్త్రాలు' అని కూడా పిలుస్తారు. కానీ, విమర్శ ప్రధానంగా ఆధునిక సాహిత్య విభాగానికి చెందినదిగా భావించడంతో పాశ్చాత్య సాహిత్య సిద్ధాంతాల ప్రభావం వల్ల ''విమర్శశాస్త్రం''

''సౌందర్యశాస్త్రం'' అనేవి పరస్పర పోషకాలుగా ఉన్నప్పటికీ, స్వతంత్ర అస్తిత్వమున్న శాస్త్రాలుగా తెలుగుసాహిత్య విమర్శకులలో గుర్తించే ప్రయత్నాలు కనిపిస్తున్నాయి. అందువల్ల ఈ రెండింటికీ ఉన్న ప్రత్యేకతలను, స్వతంత్ర అస్తిత్వాలను గుర్తిస్తూ, అటువంటి విమర్శ చేసినవారినీ; వారి విమర్శ తీరుతెన్నుల్ని పరిశీలించడం అవసరమని భావించి ఈ పరిశోధన చేయాలనుకున్నాను.

తెలుగు సాహిత్యవిమర్శను ''సౌందర్యశాస్త్ర దృష్టితో అధ్యయనం చేసే వీలుందని ముదిగొండ వీరభద్రయ్య , వడలి మందేశ్వరరావు, సూర్యసాగర్, సంజీవ్ దేవ్ మొదలైన వారు ఈ దృష్టితో రాసిన గ్రంథాలను చదివిన తర్వాత మరింత విశ్వాసం కలిగింది. ఈ దృష్టితో తెలుగు విమర్శను పరిశీలిస్తుంటే, విమర్శ ఆధునిక రంగానికి చెందినదని కట్టమంచివారి 'కవిత్వతత్వవిచారం'నుండీ ఈ రకమైన అధ్యయనానికి అవకాశం ఉందనిపించింది. ఆ తర్వాత ఈ దృష్టితో విమర్శను కొనసాగించినవారిలో పురాణం సూరిశాస్త్రి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, కొండూరి వీర రాఘవా చార్యులు, విశ్వనాథ సత్యనారాయణ, గుంటూరు శేషేంద్ర శర్మ, పింగళి లక్ష్మీకాంతం, తుమ్మపూడి కోటేశ్వరరావు, సంజీవ్‌దేవ్, .వి. సుబ్రహ్మణ్యం, కొండపర్తి శేషగిరి మొదలైన వాళ్ళెంతోమంది కనిపించసాగారు. వీరితో పాటు సృజనాత్మక రచయితలుగా ఎంతగానో ప్రసిద్ధిపొందిన చలం, శ్రీశ్రీ, బుచ్చిబాబు మొదలైనవారిలో కూడా ఆధునిక సౌందర్యశాస్త్ర దృష్టితో పరిశీలించే అవకాశం ఉందనిపించింది.

సంజీవ్ దేవ్, చలం రచనల్లో గల సౌందర్యశాస్త్ర అంశాలను విడివిడిగా కొంతమంది అధ్యయనం చేశారు. అలాగే విమర్శ దృష్టితో నేను పైన పేర్కొన్నవారిలో చాలామందిపై పరిశోధనలు జరిగినా, నేడు సౌందర్యశాస్త్రమని స్వతంత్రప్రతిపత్తిగల శాస్త్రమనే దృష్టితో జరగలేదు. కానీ, ఆ విషయాలను అక్కడక్కడా కొన్ని వ్యాసాల్లో కొంతమంది పరిచయాత్మకంగా పేర్కొన్నారు. వీటన్నింటినీ గమనించిన తర్వాత ఆధునిక సౌందర్య శాస్త్ర

దృష్టితో, అంటే క్రోచీ, బౌమ్ గార్టెన్, శాంతాయన తదితరుల సైద్ధాంతిక సమన్వయాన్ని అధ్యయనం చేయడం అవసరమనిపించింది. దీనివల్ల తెలుగు విమర్శకుల్లో ఆధునిక సౌందర్యశాస్త్ర దృష్టితో సౌందర్యశాస్త్రవిమర్శను కొనసాగిస్తున్నవారినీ, వారి విమర్శవిధానాన్ని గుర్తించడానికి ఈ పరిశోధన చేయడమవసరమనిపించింది.

పరిశోధన పరిధి

పై అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ పరిశోధనలో తెలుగులో సౌందర్యశాస్త్ర విమర్శకులను పరిచయం చేస్తూ, కాలపరిమితి దృష్ట్యా వారిలో కొంతమందిపై ప్రత్యేక అధ్యయనాన్ని పరిశీలించడం నా పరిశోధన పరిధిగా తీసుకున్నాను. పురాణం సూరిశాస్త్రి, సంజీవ్ దేవ్, శ్రీశ్రీ, చలం, బుచ్చిబాబుల రచనలపై ప్రత్యేక పరిశీలనతో ఈ పరిశోధనను చేస్తున్నాను. ఇదే నా పరిశోధన పరిధి.

అధ్యాయాలు వారిగా పరిశోధన ఫలితాంశాలను సింహావలోకనంలో వివరిస్తాను.

నా పరిశోధనకున్న ఈ పరిధినీ, పరిమితులను గుర్తింపవలసినదిగా కోరుతున్నాను.

– మజ్జి దుర్గారావు

# విషయసూచిక


| | | పుట సంఖ్య |
|---|---|---|
| అంకితం – | | iv |
| కృతజ్ఞతలు | | v |
| ప్రవేశిక | | vii |

మొదటి అధ్యాయం

తెలుగులో సాహిత్యవిమర్శ: సౌందర్యశాస్త్ర పరిచయం (1-36)

| | | |
|---|---|---|
| 1.0. | ఉపోద్ఘాతం | 1 |
| 1.1. | విమర్శ నిర్వచనాలు–ప్రయోజనం | 1 |
| 1.2. | విమర్శకుడు: లక్షణాలు | 3 |
| 1.3. | తెలుగు సాహిత్య విమర్శ: నేపథ్యం | 8 |
| 1.4. | విమర్శ పద్ధతులు | 12 |
| 1.4.1. | నైతిక విమర్శ | 13 |
| 1.4.2. | గ్రంథ పరిష్కార విమర్శ | 14 |
| 1.4.3. | ఆర్కిటైపల్ / పౌరాణిక విమర్శ | 15 |
| 1.4.4. | చారిత్రక విమర్శ | 16 |
| 1.4.5. | సాంఘిక విమర్శ | 17 |
| 1.4.6. | కవి జీవిత విమర్శ | 18 |
| 1.4.7. | మనో వైజ్ఞానిక విమర్శ | 19 |
| 1.4.8. | మార్క్సిస్ట్ విమర్శ | 21 |
| 1.4.9. | ప్రక్రియా విమర్శ | 22 |
| 1.4.10. | శైలీ విమర్శ | 24 |
| 1.4.11. | ఆలంకారిక విమర్శ | 24 |

| | | |
|---|---|---|
| 1.4.12. | సౌందర్య శాస్త్ర విమర్శ / కళా విమర్శ | 25 |
| 1.5. | పాశ్చాత్య కళాతత్త్వ శాస్త్రం: వికాసం | 29 |
| 1.6. | సౌందర్య శాస్త్రం: నిర్వచనాలు | 31 |
| 1.7. | సౌందర్యం యన్నిష్ఠం | 33 |
| 1.8. | తెలుగులో సౌందర్య శాస్త్ర విమర్శ – విమర్శకుల పరిచయం | 35 |


## రెండవ అధ్యాయం

## భారతీయ, పాశ్చాత్య సౌందర్యశాస్త్ర సిద్ధాంతాలు (37–85)


| | | |
|---|---|---|
| 2.0. | ఉపోద్ఘాతం | 37 |
| 2.1. | భారతీయ సౌందర్య శాస్త్ర సిద్ధాంతాలు | 39 |
| 2.1.1. | భరతుడు | 39 |
| 2.1.2. | భామహుడు | 40 |
| 2.1.3. | దండి | 40 |
| 2.1.4. | ఆనందవర్ధనుడు | 41 |
| 2.1.5. | వామనుడు | 43 |
| 2.1.6. | రాజశేఖరుడు | 44 |
| 2.1.7. | అభినవగుప్తుడు | 45 |
| 2.1.8. | మమ్మటుడు | 47 |
| 2.1.9. | కుంతకుడు | 48 |
| 2.1.10. | భోజుడు | 50 |
| 2.1.11. | మహిమ భట్టుడు | 52 |
| 2.1.12. | విశ్వనాథుడు | 53 |
| 2.1.13. | పండితరాజ జగన్నాథ | 55 |
| 2.2.0. | పాశ్చాత్య సౌందర్య శాస్త్ర దృక్పథం | 58 |
| 2.2.1. | The Hedonistic – Moral Theory | 59 |

| | | |
|---|---|---|
| 2.2.2. | The Realistic – Typical Theory | 61 |
| 2.2.3. | Intellectualist Theories | 61 |
| 2.2.4. | Emotionalist Theories | 62 |
| 2.2.5. | Intellectualist Theories | 63 |
| 2.2.6. | The expressionist Theory | 64 |
| 2.2.7. | ప్లేటో (Plato) | 67 |
| 2.2.8. | అరిస్టాటిల్ (Aristotle) | 69 |
| 2.2.9. | అగస్టిన్ (Augustine of Hippo) | 70 |
| 2.2.10. | అక్వినస్ (Thomas Aquinas) | 71 |
| 2.2.11. | హచెసన్ (Francis Hutcheson) | 72 |
| 2.2.12. | బౌమ్‌గార్టెన్ (Alexander Gottlieb Baumgarten) | 73 |
| 2.2.13. | హ్యూమ్ (David Hume) | 74 |
| 2.2.14. | కాంట్ (Immanuel Kant) | 74 |
| 2.2.15. | హెగెల్ (Georg Wilhelm Friedrich Hegel) | 76 |
| 2.2.16. | ఎమర్సన్ (Ralph Waldo Emerson) | 78 |
| 2.2.17. | కొపెన్ హ్యాయ్యర్ (Arthur Schopenhauer) | 78 |
| 2.2.18. | షిల్లర్ (Johann Christoph Friedrich von Schiller) | 79 |
| 2.2.19. | షెల్లింగ్ (Friedrich Wilhelm Joseph Schelling) | 80 |
| 2.2.20. | క్రోచే (Benedetto Croce) | 80 |
| 2.2.21. | కొలింగ్ ఉడ్ (Robin George Collingwood) | 81 |
| 2.2.22. | శాంతాయన (George Santayana) | 83 |
| 2.2.23. | లాంజినస్ (Longinus 213–273AD) | 83 |

మూడవ అధ్యాయం

తెలుగులో సౌందర్యశాస్త్ర విమర్శ – విమర్శకులు (86–138)


| | | |
|---|---|---|
| 3.0 | ఉపోద్ఘాతం | 86 |
| 3.1 | ప్రాచీనాంధ్ర ఆలంకారికులు | 86 |
| 3.2. | కావ్యాలలో లక్షణ ప్రతిపాదిత ఆంధ్రాలంకారిక కవులు | 88 |
| 3.3. | భారతీయ, పాశ్చాత్య సౌందర్య సమన్వయ విమర్శకులు | 89 |
| 3.3.1 | సూరిశాస్త్రి పురాణం (1888–1941) | 90 |
| 3.3.1.1 | పురాణం సూరిశాస్త్రి రచనలు | 91 |
| 3.3.1.2. | పురాణం సూరిశాస్త్రి: సామాజిక కళా సేవ | 93 |
| 3.3.1.3. | పురాణం సూరిశాస్త్రి: సౌందర్యవిమర్శ | 95 |
| 3.3.1.4. | పురాణం సూరిశాస్త్రి: విమర్శ పద్ధతులు | 96 |
| 3.3.1.5. | విమర్శ పదజాలం | 97 |
| 3.3.2. | అనంతకృష్ణశర్మ. రాళ్లపల్లి (1893–1979) | 98 |
| 3.3.3. | గుడిపాటి వెంకట చలం (1894–1979) | 100 |
| 3.3.3.1. | చలం రచనాశైలి | 110 |
| 3.3.3.2. | మహాప్రస్థానానికి ముందుమాట | 110 |
| 3.3.4. | సత్యనారాయణ విశ్వనాథ (1895–1976) | 115 |
| 3.3.4.1. | విశ్వనాథ రచనలు | 117 |
| 3.3.5. | రామిరెడ్డి దువ్వూరి (1897–1947) | 120 |
| 3.3.6. | శ్రీనివాసరావు శ్రీరంగం (1910–1983) | 122 |
| 3.3.6.1. | శ్రీశ్రీ రచనలు | 126 |
| 3.3.7. | వీరరాఘవాచార్యులు కొండూరు (1912–1995) | 127 |
| 3.3.7.1. | కొండూరి వీరరాఘవాచార్యులు రచనలు | 128 |
| 3.3.8. | సంజీవ్‌దేవ్ (1914–1999) | 129 |
| 3.3.8.1. | సంజీవ్ దేవ్ రచనలు | 133 |

| | | |
|---|---|---|
| 3.3.9. | బుచ్చిబాబు (1916-1967) | 136 |
| 3.3.9.1. | బుచ్చిబాబు రచనలు | 137 |


## నాల్గవ అధ్యాయం

## పురాణం సూరిశాస్త్రి, సంజీవ్ దేవ్ సౌందర్యశాస్త్ర విమర్శ (139-192)


| | | |
|---|---|---|
| 4.0. | ఉపోద్ఘాతం | 139 |
| 4.1. | పురాణం సూరిశాస్త్రి కళావిమర్శ సమన్వయం | 139 |
| 4.1.1. | కళా ప్రయోజనం | 140 |
| 4.1.2. | కళా స్వరూపం | 140 |
| 4.1.3. | కళా స్వరూప ప్రాశస్త్యం | 144 |
| 4.1.4. | కళా సాధనాలు | 145 |
| 4.1.5. | కళయొక్క పరమావధి | 145 |
| 4.1.6. | కళా సౌందర్యం | 145 |
| 4.1.7. | సౌందర్యం | 146 |
| 4.1.8. | సౌందర్య లక్షణాలు | 149 |
| 4.1.9. | రస సౌందర్యం | 152 |
| 4.1.10. | రస సౌందర్యం మానస వ్యాపారం | 153 |
| 4.1.11. | రస సౌందర్యానుభవంలో ఇంద్రియాల పాత్ర | 154 |
| 4.1.12. | సౌందర్యం ప్రేక్షకపక్షం | 156 |
| 4.1.13. | పురాణం సూరిశాస్త్రినాటక కళా విమర్శ | 157 |
| 4.1.14. | నాటక కళా విమర్శ దృక్పథం | 157 |
| 4.1.15. | అనుభవజ్ఞాన ప్రమాణం | 157 |
| 4.1.16. | లోకానుభవజ్ఞాన ప్రమాణం | 159 |
| 4.1.17. | నాటక బహిస్స్వరూపం | 159 |
| 4.1.18. | నాటక పరికరాలు | 162 |

| | | |
|---|---|---|
| 4.1.19. | నాటకం అభినయం | 162 |
| 4.1.20. | నటులకు ఉండవలసిన లక్షణాలు | 163 |
| 4.1.21. | ప్రపంచ నాటకాలు – దేశీయ కళాభిమానం | 164 |
| 4.1.22. | కళ ప్రేక్షకపక్ష అధ్యయనం | 165 |
| 4.1.23. | కావ్య రచన – కళా దృక్పథం | 166 |
| 4.1.24. | కావ్య వస్త్వానుశీలన | 166 |
| 4.1.25. | పురాణం సూరిశాస్త్రికళాతత్త్వ శాస్త్ర ఆలోచనలు | 167 |
| 4.1.26. | రసానుభవం | 168 |
| 4.1.27. | రసాస్వాదన | 169 |
| 4.1.28. | శాస్త్రం– రస విచారణ | 171 |
| 4.1.29. | కావ్య సౌందర్య వివేచన | 171 |
| 4.1.30. | కళాతత్త్వ శాస్త్ర ప్రయోజనం | 175 |
| 4.2. | సంజీవ్‌దేవ్ సౌందర్య దృక్పథం | 176 |
| 4.2.1. | సంజీవ్ దేవ్ సౌందర్య లక్షణాలు | 178 |
| 4.2.1.1. | నవ్యత | 178 |
| 4.2.1.2. | శాస్త్రం తెలియనక్కరలేదు | 179 |
| 4.2.1.3. | సమగ్రత | 179 |
| 4.2.1.4. | చలనం | 180 |
| 4.2.1.5. | ఇంద్రియ సంబంధం | 181 |
| 4.2.1.6. | విశ్వజనీనత | 181 |
| 4.2.1.7. | నిరంతరావిష్కారం | 182 |
| 4.2.1.8. | అలౌకికం | 182 |
| 4.2.1.9. | నైరూప్యం | 183 |
| 4.2.1.10. | ఆధ్యాత్మికత | 183 |
| 4.2.1.11. | అసౌందర్యం | 184 |

| | | |
|---|---|---|
| 4.2.1.12. | సౌందర్యం – ఆనందం | 184 |
| 4.2.2. | సత్యం,శివం, సుందరం భావనలు | 185 |
| 4.2.3. | సౌందర్యం యన్నిష్టం | 191 |


## ఐదవ అధ్యాయం

## శ్రీశ్రీ, చలం, బుచ్చిబాబు సౌందర్యశాస్త్ర విమర్శ (193–241)

| | | |
|---|---|---|
| 5.0. | ఉపోద్ఘాతం | 193 |
| 5.1. | శ్రీశ్రీ సౌందర్య దృక్పథం | 193 |
| 5.1.1. | సౌందర్యం మనోగతం | 198 |
| 5.1.2. | కళా దృక్పథం | 202 |
| 5.2. | చలం సౌందర్య దృక్పథం | 209 |
| 5.2.1. | సౌందర్యం మనోగతం | 212 |
| 5.2.2. | సౌందర్యానుభవం చలం | 214 |
| 5.2.3. | చలంసౌందర్యశాస్త్ర విమర్శ | 220 |
| 5.2.4. | కళల పట్ల చలం అభిప్రాయాలు | 223 |
| 5.3. | బుచ్చిబాబు సౌందర్య దృక్పథం | 228 |
| 5.3.1. | బుచ్చిబాబు దృష్టిలో సౌందర్య అస్తిత్వం | 229 |
| 5.3.2. | సౌందర్యానుభవం | 232 |
| 5.3.3. | చివరకుమిగిలేది నవల– సౌందర్య దృక్పథం | 235 |
| 5.3.4. | బుచ్చిబాబు తార్కికం అనుభవం | 237 |
| 5.3.5. | సౌందర్యం అనేది తార్కిక జ్ఞానం కాదు | 239 |

## ఆరవ అధ్యాయం

## తెలుగులో సౌందర్యశాస్త్ర విమర్శకుల ప్రతిపాదనలు (242–256)


| | | |
|---|---|---|
| 6.0. | ఉపోద్ఘాతం | 242 |
| 6.1. | పురాణం సూరిశాస్త్రి – సౌందర్యశాస్త్ర విశేషాంశాలు | 242 |
| 6.2. | సంజీవ్ దేవ్ – సౌందర్యశాస్త్ర విశేషాంశాలు | 247 |
| 6.3. | శ్రీశ్రీ – సౌందర్యశాస్త్ర విశేషాంశాలు | 251 |
| 6.4. | చలం – సౌందర్యశాస్త్ర విశేషాంశాలు | 252 |
| 6.5. | బుచ్చిబాబు – సౌందర్యశాస్త్ర విశేషాంశాలు | 254 |
| 6.6. | ముక్తాయింపు | 255 |


## ఏడవ అధ్యాయం


సింహావలోకనం (257–263)

ఉపయుక్త గ్రంథసూచిక (264–282)

## మొదటి అధ్యాయం

# తెలుగులో సాహిత్యవిమర్శ:

# సౌందర్యశాస్త్ర పరిచయం

మొదటి అధ్యాయం

# తెలుగులో సాహిత్యవిమర్శ: సౌందర్యశాస్త్ర పరిచయం

## 1.0.ఉపోద్ఘాతం

తెలుగులో వచ్చిన సౌందర్యశాస్త్ర విమర్శకులను పరిచయం చేయటానికి వారి ప్రత్యేకతలను గుర్తించటానికి వీలుగా తెలుగు సాహిత్య విమర్శ స్వరూప స్వభావాలను సంక్షిప్తంగా పరిచయం చేయటమే ఈ అధ్యాయం లక్ష్యం.

సృజనాత్మక సాహిత్య రచనలను మూల్యాంకనం చేసేది విమర్శ. వస్తు స్వరూప, స్వభావాల పరిశీలన ద్వారా గుణ, దోష విచారణ చేసి, దాని తత్వాన్ని నిరూపించడమే విమర్శ. సాహిత్య రచనను సమగ్రంగా అధ్యయనం చేసి విశ్లేషణ ద్వారా దాని మంచి చెడులను చర్చించిచ రచన విలువలను, ప్రభావాన్ని అంచనా వేయడమే సాహిత్య విమర్శ. స్థూలంగా చెప్పాలంటే సాహిత్య తత్త్వ వివేచనే సాహిత్య విమర్శ. విమర్శ ప్రధానంగా బుద్ధి వ్యాపారం. విమర్శకు వర్ణనం, విశ్లేషణం, వివేచనం, సమన్వయం, అనుశీలనం అనేవి ప్రధాన లక్షణాలుగా చెప్పవచ్చు. ఒక రచనను సమగ్రంగా శాస్త్రీయ దృష్టితో పరిశీలించి మంచి చెడులను వివేచించి ఆ మంచి చెడులకు గల కారణాలను వివరించి రచనాతత్త్వాన్ని నిరూపించడం విమర్శ.[1]

## 1.1.విమర్శ నిర్వచనాలు-ప్రయోజనం

*'విమర్శ'* అనే పదానికి తెలుగు నిఘంటువులలో అనేక అర్థాలు కనిపిస్తున్నాయి. అవి పర్యాలోచనం, సమీక్షణం, పరిశోధించు, పరిశీలనం, అవలోచనం, ఆలోచన చేయు, వివేచించు, అరయు మొదలైన అర్థాలు ఉన్నాయి. ఈ అర్థాలను బట్టి విమర్శ అంటే తనకు లక్ష్యమైన సాహిత్యాన్ని లోతులను వెతికి పరిశీలిస్తుందనీ, పరిశోధిస్తుందనీ, అందులోని అంశాలను మళ్ళీ మళ్ళీ ఆలోచలను పెట్టి నిగ్గుతేల్చి ఒక క్రమంలో వివేచించి చూపేదని, సాహిత్య తత్త్వాన్ని సమీక్షిస్తుందనీ తెలుస్తుంది.

1. ముదిగొండ వీరభద్రయ్య 1990 విమర్శ మౌలిక లక్షణాలు పుట:7

విమర్శను నిర్వచించటానికి పాచ్య పాశ్చాత్యులు చాలామంది సాహితీవేత్తలు ప్రయత్నించారు. వాటిని ఇప్పటికే వివిధ పరిశోధకులు సమగ్రంగా వివరించారు. కనుక ముఖ్యమైన నిర్వచనాలను కింద పేర్కొంటున్నాను.

*''ఒకరు చేసిన పనియందలి బాగోగులను ఇంకొకరు వివేచించి తెలుపుట విమర్శ''* అని పింగళి లక్ష్మీకాంతం చెప్పారు.[2]

*''విమర్శ రూపిణీ విద్యా అని పరాదేవిని విమర్శ రూపిణీగా పూర్వులు వర్ణించారు. వేదాంతము నందు విమర్శయనగా ఆత్మానాత్మ వివేకము. వాఙ్మయము నందు కావ్యగత గుణ దోష విచారము విమర్శ నామముతో చెల్లుచున్నవి.''* అని ఖండవల్లి లక్ష్మీరంజనం చెప్పారు.[3]

*''ఒక గ్రంథం గైకొని అందలి లోపములను, ఔచిత్యా నౌచిత్యములను, భావ గంభీరతను, అలంకార రచనా పాటవమును, ధ్వని విశేషమును, శయ్యా సౌభాగ్యమును, వస్తు నిర్మాణ సౌష్ఠవమును, పాత్రపోషణ, రసపోషణ, సన్నివేశ కల్పనాదులను వేయేల ఆ గ్రంథమునకు గల స్థానమును నిరూపించుటయే విమర్శ యనబడును''* అని కె.వి.ఆర్ నరసింహం చెప్పారు[4]

*''ప్రకటితము కాకుండా నుండు ప్రతి యొక్క దానిని కనిపెట్టి అధవాప్రతులను సంగ్రహించి ఆ కృతిని శాస్త్రీయంగా సంపాదించి ప్రకటించునది పరిశోధనమైతే, అట్లు ప్రకటితమైన కృతి యొక్క గుణావ గుణాములను గూర్చి వివరించునది విమర్శ''* అని జి.వి. సుబ్రహ్మణ్యం చెప్పారు.[5]

---

2. సాహిత్య శిల్ప సమీక్ష పుట:342

3. లక్ష్మీరంజన వ్యాసావళి పుట:93

[4] సాహిత్య దర్శనము పుట: 16

[5] జి.వి.యస్ వ్యాసాలు పుట:16

*''విమర్శయన్నది కావ్యానిష్కృతికి పూర్వముగా కావ్యానుభూతికి పరముగా సాగెడు విశేష ప్రక్రియ''* అని కోవెల సంపత్కుమారాచార్య చెప్పారు[6]

*''నేర్పుతో చేయబడిన యొక్క పని యొక్క తత్వమును తెలుసుకొని దాని గుణములను పరిశీలించి తగునభిప్రాయం కలుగచేసికొని యానందిచుట విమర్శ''* అని కోరాడ రామకృష్ణయ్య చెప్పారు.

*''విమర్శయనగా నేదైన గ్రంథమును గాని కళా రూపమును గాని లెస్సగా పరిశీలించి, దానిని గూర్చి మననము చేసి చర్చా పురస్సరముగా నందలి బాగోగులను ప్రదర్శించుట''* అని దివాకర్ల వెంకటావధాని చెప్పారు. [7]

*''ఒక వస్తువు యొక్క స్వరూపమును బాగుగా పరిశీలించి దాని మంచి చెడులను వివరించుటయే విమర్శనము కావున విమర్శ యనగా వస్తుతత్వ నిరూపణమని స్పష్టమగుచున్నది''* అని ఎస్.వి.రామారావు చెప్పారు.[8]

*''రచనల స్థాయినీ పెంచేదే కాదు, పాఠకుల అవగాహన స్థాయిని పెంచి ఆరోగ్యకరమైన అభిరుచుల్ని కనుగ జేసే ఒక దృక్పథాన్ని ఇవ్వగలిగేది విమర్శ''* అని సంజీవమ్మ చెప్పారు.[9]

పాశ్చాత్య సాహిత్యవేత్తలు కూడా విమర్శను నిర్వచించే ప్రయత్నం చేశారు. వాటిలో ముఖ్యమైన కొన్ని నిర్వచనాలు,

*''కళా రూపాల్ని అక్షర రూపంలో వ్యాఖ్యానించేది, వివేచించేది విమర్శ''* అని టి.ఎస్. ఇలియట్ పేర్కొన్నారు.

*''సాహిత్యం యొక్క ప్రామాణికమైన చక్కని పరిష్కారం విమర్శ''* అని డ్రైడన్ పేర్కొన్నారు.

---

6 ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ సాంప్రదాయక రీతి పుట:2

7 సాహిత్య సోపానాలు: పుట:01

8 తెలుగు సాహిత్య విమర్శ, పుట:01

9 సాహిత్య విమర్శ మార్క్సిస్టు దృక్పథం: అభ్యుదయ (విమర్శ విశేష సంచిక) మా.స, 1980. ఆగస్టు. పుట:30–35

*''ఒక గ్రంథమును గైకొని అందలి లోపాలోపములను, ఔచిత్యానౌచిత్యాములను, భావ గంభీరతను, ఆలంకార రచన పాటవమును, ధ్వని విశేషములను, శయ్యా సౌభాగ్యమును, వస్తు నిర్మాణ సౌష్టవమును, పాత్ర పోషణ, రస పోషణ, సన్నివేశ కల్పనాదులను వేయేల ఆ గ్రంథమునకు సంబంధించిన సర్వ విషయములను కూలంకషముగా చర్చించి, వాఙ్మయమున నా గ్రంథమునకు గల స్థానం నిరూపించుటయే విమర్శ యనబడును''* అని హడ్సన్ పేర్కొన్నారు.

*''అనుభూతుల తారతమ్యాల్ని వివేచించి, వాటి విలువల్ని అంచనా వేసేది విమర్శ''* అని ఐ.ఏ. రిచర్డ్స్ పేర్కొన్నారు. *''రాగద్వేషాలకు అతీతంగా ప్రపంచంలో ఉత్తమమైన దాన్ని నేర్చుకోవడం దాన్ని వ్యాప్తి చేయడం విమర్శ''* అని మాథ్యూ ఆరాల్డ్ పేర్కొన్నారు.

*''విమర్శకుడు ఇష్టా రాజ్యంగా మంచి కానీ, చెడు కానీ చేసే పని విమర్శ''* అని విక్టర్ హ్యూగో పేర్కొన్నారు.

*''ఏదైనా సాహిత్యం లేదా లలిత కళ యొక్క గుణ, గణాల్ని, లక్షణాల్ని గూర్చి అక్షర రూపంగా చేసిన పరిశీలనే విమర్శ''* అని ఎడ్మండ్ గూస్ పేర్కొన్నారు.

*''సాహిత్యంలోని కళాత్మకతని విశదీకరించి, సాహిత్య విలువల్ని వ్యాఖ్యానిస్తూ ఉండే బుద్ధి వ్యాపారం విమర్శ''* అని ఎట్‌కిన్స్ పేర్కొన్నారు.

ఈ విధంగా భారతీయులు, పాశ్చాత్యులు, విమర్శకులు, కవులు, రచయితలు, పండితులు, సాహిత్యవేత్తలు విమర్శ గూర్చి తమ తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

విమర్శ వల్ల సాహిత్యంలో అసలైన సృజన రూపాన్ని కేవలం అనుభూతి తుల్యంలో కాక ఆలోచనల వెలుగులో అవగాహన చేసుకోవడానికి వీలవుతుంది. అంతేగాక సమాజాన్ని, జీవితాన్ని సరైన మార్గంలో ఆలోచించి అవగాహన చేసుకోవడానికి పాఠకుడికి సాహిత్య విమర్శ తోడ్పడుతుంది. ఇది పాఠకుడికి ఎంతో ప్రయోజనకరం.

*''జీవితం గూర్చి తగుమాత్రం తెలిసిన వాళ్ళకి ఏ రకం కవిత్వం ఏ సమయంలో సంఘానికి హానికరంగా పరిణమిస్తుందో తెలుసుకోవటానికి..... కళల తాలుకూ సమర్థా*

*సమర్థతలు నిర్ణయించి సామాన్య ప్రజలకు కావలసిన కళలేవో తెలియజేస్తుంది. సంఘం కళల ద్వారా నిర్వీర్యం కాకుండా కాపాడుతుంది విమర్శ''* అని కొడవటిగంటి కుటుంబరావు పేర్కొన్నారు[10]

**1.2.విమర్శకుడు: లక్షణాలు**

ఒక రచనను సమగ్రంగా అధ్యయనం చేసి, విశ్లేషించి దాని బాగోగులను చర్చించి, సాహిత్య చరిత్రలో దాని విలువలను, ప్రభావాన్ని, రచయిత స్థానాన్ని నిర్ణయించే వాడే విమర్శకుడు. *''విమర్శకుడు ఒక రచన వెలువడిన సామిజిక, చారిత్రక సందర్భాన్ని, దానిలోని సౌందర్యాన్ని రచయిత వ్యక్తిత్వం రచనలో ప్రతిఫలించిన తీరుని, రచనపై పడిన ప్రభావాలని శాస్త్రీయంగా విశ్లేషించి వ్యాఖ్యానించి, రచయిత యొక్క సాహిత్య, సామాజిక దృక్పథాలను విశదం చేస్తాడు. కవి వ్యక్తిత్వానికి, సంఘానికి, రచనకి గల మౌలిక సంబంధాన్ని విమర్శకుడు గుర్తిస్తాడు''*[11]

జి.వి.యస్ *''సాహిత్య విమర్శకు వర్ణనం లేదా వివరణం (Description), విశ్లేషణం (Analysis), వివేచనం (Discrimination), సమన్వయం (Interpretation), అనుశీలనం (Evaluation), సిద్ధాంత దర్శనం (Theory of Literature) అనేవి సహజ ధర్మాలు. వీటిలో ఉత్తరోత్తరాలు ఉత్తములు. ఈ ఆరు ఒక విమర్శకునిలో ఉండటం అసంభవం కాదు అపూర్వం''* అని పేర్కొన్నారు.[12]

కావ్య హేతువులైన ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం కవికి అవసరమైనట్లే విమర్శకునికి ఎంతో అవసరం. విమర్శకునికి సాహిత్య, సామాజిక అంశాలతో గాఢమైన అభినివేశం ఉండాలి. విమర్శకుడే విమర్శించే ముందు సహృదయంతో రచనను అధ్యయనం చేసి అనుభూతికి తెచ్చుకోవాలి. శాస్త్రీయమైన అధ్యయనం, విషయైక దృష్టి, సత్యాన్వేషణ విమర్శకుడికి అవసరమైన లక్షణాలు. విమర్శకుడు ఒక కవి దర్శనాన్ని పరిశీలించిన తర్వాత,

---

[10] కొడవటిగంటి కుటుంబరావు: సాహిత్య ప్రయోజనం 1969 పుట:72

[11] కొల్లు వెంకటేశ్వర రావు: విమర్శకునిగా కె.వి. రమణారెడ్డి 2004 పుట:02

[12] జి.వి. సుబ్రహ్మణ్యం 'తెలుగులో సాహిత్య విమర్శ రీతులు 2004 పుట:01

ఆయన రచనలోని సాహిత్య, సాహుత్యేతర అంశాలను విశ్లేషించి దాని విలువలను నిర్ణయిస్తాడు. రచయిత దృక్పథాన్ని వివరిస్తాడు.[13]

తెలుగు సాహిత్య విమర్శ అవతరణ – వికాసములు అనే గ్రంథంలో ఎస్వీ రామారావు విమర్శకునికి ఉండవలసిన లక్షణాలను ఈ విధంగా వివరించారు. సాహిత్య విమర్శ చేసేటప్పుడు విమర్శకుడు ఎటువంటి అనుచితాలకు తావివ్వకుండా కావ్యంలో ఉన్న గుణాలను, దోషాలను నిష్పక్షపాత దృష్టితో విమర్శ చేయాలి. కాలానుగుణంగా వచ్చిన సాహిత్యాన్ని ఆ కాలానికి మాత్రమే అనువర్తింప జేసి విమర్శ కావించాలి. అలకానిచో ఆ విమర్శ పెడదోవన పడుతుంది. విమర్శకునికి ప్రధాన లక్షణం సానుభూతి. కవి హృదయంతో కావ్యాన్ని అర్థం చేసుకొని విమర్శించాలి. కావ్యంలోని మంచి చెడులను అర్థం చేసుకొని కావ్యతత్త్వాన్ని నిరూపించాలి. అలాంటి వ్యక్తి కవి హృదయాన్ని అర్థం చేసుకున్న విమర్శకుడని పేర్కొన్నారు[14]

'అనుశీలన' అన్న గ్రంథంలో వడలి మందేశ్వర రావు విమర్శకునికి ఉండవలసిన లక్షణాలను ఈ కింది విధంగా పేర్కొన్నారు.

1. విమర్శకుని ప్రధాన లక్షణం భావుకత. కవి ప్రయాణం చేసిన మార్గాన్న విమర్శకుడు పయనాన్ని సాగించాలి[15]

2. కావ్యాన్ని చూడగానే తొలుత కనబడేది శబ్దం. ఆ శబ్దం యొక్క లక్షణం విమర్శకునికి తెలియాలి... శబ్దం ఔచిత్యాన్ని వివరించటమే కాక, అది సహృదయునిలో కలిగించే హృదయ స్పందనాన్ని కూడా వినగల్గాలి[16]

3. సాహిత్యంలో విశిష్ట స్థానమున్న కవి, ఏ రెండు యుగాలకూ ఒకే విధంగా కనపడక పోవచ్చును. కాలంతో పాటు భాష, అభిరుచులు, సారస్వత విలువలు, సాహిత్య ప్రక్రియలు మారడం వల్ల, ఆ కవిని చూసే పద్ధతిలో మార్పులు తప్పనిసరి అవుతాయి.

---

[13] కొల్లు వెంకటేశ్వర రావు: విమర్శకునిగా కె.వి. రమణారెడ్డి 2004 పుట:02

[14] ఎస్వీ రామారావు, తెలుగు సాహిత్య విమర్శ అవతరణ – వికాసములు 1989 పుట:4–6

[15] ఎస్వీ రామారావు, తెలుగు సాహిత్య విమర్శ అవతరణ – వికాసములు 1989 పుట: 33

[16] ఎస్వీ రామారావు, తెలుగు సాహిత్య విమర్శ అవతరణ – వికాసములు 1989 పుట: 33

అందుకే ఏ యుగానికాయుగం, ఏ తరానికాతరం కవిని పరిశీలించుకొని అవగాహన చేసుకోవలసిన అవసరం ఏర్పడుతుంది. విమర్శకునిలోని భావకుడు దీన్ని బాగా ఆకళింపు చేసుకోవాలి.[17]

4. సాహిత్యాన్ని పరీక్ష చేయటానికి విమర్శకునికి ప్రధానంగా అలవడవలసిన, అలవరచుకోదగిన లక్షణం నిర్మమత [18]

5. విమర్శకుని మూర్తిమత్వం విమర్శలలో ప్రతిఫలించడం మంచిది కాదు. విమర్శకుని స్వాతంత్ర్యం, అతని ప్రతిభ విమర్శలో ప్రతిఫలిస్తే ప్రమాదం లేదు. కాని అతని ఇష్టాయిష్టాలన్నీ విమర్శలో ప్రతిఫలిస్తే అది విమర్శ కాక రచయిత యొక్క అభిరుచులను పట్టి ఇచ్చే వ్యాసమవుతుంది.[19]

6. విమర్శకుడు కవి వంటి వాడే... తన అభిమానాలకు పూర్తిగా వ్యతిరేకమైన దృక్పథాన్ని కూడ సామరస్యంతో, కవి ఏ దృక్పథంతో చూశాడో ఆ దృష్టితో చూడడం ఎంత కష్టమైన విమర్శకునికి అవసరం[20]

7. సాహిత్య సిద్ధాంతాలకు లోబడి జరిగే విమర్శలు కొన్ని ఉన్నాయి... ఇటువంటి సందర్భాలలో మమకారాదులకు అసలే అవకాశం లేదు. ఉన్న కావ్యాలను నిర్ణీతమైన సూత్రాలతో శాస్త్రీయమైన పద్ధతులతో పరిశీలించడమే ఇక్కడ విమర్శకుని పని.[21]

8. కవి సమకాలిక జగత్తు స్పందనలను తన కావ్యంలో వినపింపజేస్తాడు. విమర్శకుడు సమకాలీన సహృదయులలో ఆ కావ్యం కలిగించే స్పందనలను తన విమర్శలో వినపింపజేస్తాడు.[22]

---

[17] ఎస్వీ రామారావు, తెలుగు సాహిత్య విమర్శ అవతరణ – వికాసము 1989 పుట: 39
[18] ఎస్వీ రామారావు, తెలుగు సాహిత్య విమర్శ అవతరణ – వికాసము 1989 పుట: 40
[19] ఎస్వీ రామారావు, తెలుగు సాహిత్య విమర్శ అవతరణ – వికాసము 1989 పుట: 40
[20] ఎస్వీ రామారావు, తెలుగు సాహిత్య విమర్శ అవతరణ – వికాసము 1989 పుట: 42
[21] ఎస్వీ రామారావు, తెలుగు సాహిత్య విమర్శ అవతరణ – వికాసము 1989 పుట: 42
[22] ఎస్వీ రామారావు, తెలుగు సాహిత్య విమర్శ అవతరణ – వికాసము 1989 పుట: 43

9. నిరంతర కావ్య పఠనం వల్ల పదును తేలిన హృదయంతో సాహిత్య సిద్ధాంతాలను మథించాలి. వాటి విలువలను మదింపు కట్టాలి.... విమర్శకు అలంకార శాస్త్రంలోని పారిభాషిక పదాల తూకపు రాళ్లలా ఉండకూడదు.[23]

10. విమర్శకునికి చారిత్రక దృక్పథం కూడా చాలా అవసరం... కవి దేశ కాలాలతో ఆరంభమై, కవిగా అతడు పోషించిన విలువలతో, సాధించిన సాహిత్య గుణాలతో సాగిపోయి, సమస్త సాహిత్యంలోనూ అతని స్థానాన్ని నిర్ణయించడానికి తోడ్పడేట్లుగా ఉండాలి.[24]

11. విమర్శకునికి ప్రధానంగా కావలసినవి కేవలం రచయిత జీవితంలోని జాబితలు కావు. విమర్శకుడాతని భావుకతలోని వైవిధ్యాన్ని, మేధలోని నైశిత్యాన్ని పరిశీలించాలి. ఇవి రచనల్లో సహస్రముఖులుగా ఎలా విస్తరిల్లి, రచయిత ఎలా ద్రష్ట కాగల్గాడో కూడా విమర్శ నిరూపించాలి.[25]

**1.3. తెలుగు సాహిత్య విమర్శ: నేపథ్యం**

125 సం.రాలు పైగా చరిత్ర గల తెలుగు సాహిత్య విమర్శ శబ్ద చర్చలతో ప్రారంభమై కవికాల నిర్ణయం, కర్తృత్వ వివాదాలు, ఏక కవి రచనల అనుశీలనలతో తెలుగు సాహిత్య చరిత్ర ముందుకు నడిచింది. 19వ శతాబ్ది ద్వితీయార్థంలో తెలుగులో సాహిత్య విమర్శ ఒక సాహిత్య ప్రక్రియగా రూపొందింది. అంతకు ముందు కూడా సాహిత్య చర్చలు, విశ్లేషణలు ఉన్నప్పటికీ అవి ప్రక్రియా రూపం దాల్చలేదు. విమర్శ భిన్న స్వరూపాలలో కొనసాగేది. తెలుగునో సాహిత్య విమర్శ ప్రాచీన కావ్యాలకు వ్యాఖ్యాన రూపంలో మొదలైనట్లు కనిపిస్తుంది.

తెలుగు సాహిత్య ఆవిర్భ కాలాన్ని పరిశీలించినట్లైతే మొదటి దశలో వెలసిన కావ్యాలన్ని సంస్కృత సాహిత్య ప్రభావానికి లోనై ఉన్నట్లు కనిపిస్తాయి. ఆనాటి చాలా కావ్యాలు సంస్కృత కావ్యాలకు, నాటకాలకు అనావాదాలుగానో, అనుకరణ ప్రాయాలు గానో వ్రాయబడినవే. ఈ

---

[23] ఎస్వీ రామారావు, తెలుగు సాహిత్య విమర్శ అవతరణ – వికాసములు 1989 పుట: 52

[24] ఎస్వీ రామారావు, తెలుగు సాహిత్య విమర్శ అవతరణ – వికాసములు 1989 పుట: 53

[25] వడలి మందేశ్వర రావు: అనుశీలన 1992 పుట: 53

దశలో వెలసిన కావ్యాలలో మంచి చెడులను గురించి చర్చించవలసి వచ్చినప్పుడు మన తెలుగు సాహిత్యంలో లక్షణ గ్రంథాలు లేకపోవడం వల్ల పండితులు సంస్కృతంలో వెలసిన లక్షణ గ్రంథాల పైన ఆధారపడి ఆయా కావ్యాల ప్రామాణికతను నిర్ణయించడం జరిగేది. ఈ విధంగా ఆనాడు పండితులు చేసిన చర్చలన్ని విమర్శ పేరుతో లేక పోయినను విమర్శ లక్షణాలు కలిగి ఉన్నట్లుగా తెలుస్తుంది.

ప్రాచీన కాలంలో సంస్కృత లాక్షణికులచే రచించబడిన విమర్శ సూత్రాలు ప్రత్యేక కావ్యానికి కాకుండా కావ్య సామాన్యానికి వర్తిస్తున్నాయి. ఆనాటి అలంకార శాస్త్రం సమగ్రమైన సాహిత్య విమర్శ శాస్త్రంగా రూపొందింది. ఈ విధంగా లాక్షణికులచే కూర్చబడిన అలంకార శాస్త్రం కావ్యతత్త్వ వివేచనము, కావ్య హేతువు, కావ్య ప్రయోజనం, కావ్య శోభా హేతువులు, కావ్య భేదాలు మొదలైన కావ్యాంశాలను, కావ్యగతాలైన సూక్ష్మాంశాలను వివరించింది. ప్రాచీన కాలంలో తెలుగులో సాహిత్య విమర్శ పేరుతో ఏమీ లేకపోయినప్పటికి కవులు తమ కావ్యావతారికలలో కవిత్వాన్ని గురించి, తమ కవిత్వాన్ని గురించి, ఇతర కవుల గురించి, తమ రచనా పద్ధతిని గురించి కొన్ని అభిప్రాయాలను వెల్లడించారు. మరి కొందరు కథా సందర్భంలో వీలు చూసుకొని కావ్య విమర్శ చేశారు. ఇదే మన విమర్శ సంప్రదాయం. ప్రాచీన కవులు చాలా మౌలికమైన అభిప్రాయాలు వెల్లడించారు. నన్నయ్య తన భారతావతారికలో *''సారమతిం గవీంద్రులు.. జగద్ధితంబునన్''* అనే పద్యంలో ప్రసన్న కథా కలితార్థయుక్తి, అక్షర రమ్యత అనే రెండు సాహిత్య విమర్శకు సంబంధించిన భావనలను చెప్పారు. నన్నెచోడుడు చేసిన కవి స్తుతిలోనూ, కుకవి నిందలోనూ సాహిత్య విమర్శ సంబంధి శబ్దాలున్నాయి. ఆదికవి వాల్మీకినీ 'వస్తు కావ్యాబ్జ రవి' అన్నాడు. భారవి కవిత్వాన్ని కూడా 'వస్తు కవిత' అనే అన్నాడు. ఉద్భటుడు 'గూఢ వస్తుమయు కావ్యముగా' కుమార సంభవము చెప్పినట్టు పేర్కొన్నాడు. కుకవి నిందలో *'మార్గకుమార్గ'* మనీ, *'అల్ప రస కృతి'* అనే మాటలు వాడాడు. ''పదబంధంబుల నగ్గలించి...'' అనే పద్యంలో సత్కృతిని మదనాగముతో పోల్చాడు. అష్టాదశ వర్ణనలు, దశ గుణాలు, నవరస భావ భరితంబై షట్త్రింశదలంకారాలంకృతమై రమణీయంగా కావ్యం ఉండాలన్నారు. తాను

అట్లాంటి రచన చేస్తున్నానన్నాడు. తిక్కన నిర్వచనోత్తర రామాయణంలో 'కుకవినింద చేస్తూ'' కవిత్వాన్ని గురించి కొన్ని మాటలు చెప్పారు.[26]

ద్విపద కావ్య ప్రారంభకుడైన పాల్కురికి సోమనాథుడు పండితారాధ్య చరిత్రలో కవిత్వ లక్షణాలను పేర్కొంటు 49 గుణాలను 25 దోషాలను పేర్కొనెను. కుకవి నింద చేసేను. శ్రీనాథుడు శృంగార నైషధంలో సంస్కృత కవుల కవిత్వ విశేషాలను, శ్రీ హర్షుని వైదుష్యాన్ని, సంస్కృత నైషదము నందలి ప్రౌఢ కవిత్వాన్ని ప్రశంసించాడు. ఇతర కావ్యాలలోని కుకవి నిందను శ్రీనాథుడు భీమ ఖండవతారికలో ప్రవేశపెట్టాడు. ఇదే కోవలో అల్లసాని పెద్దన, పింగళి సూరన ఆయా కవుల కావ్యావతారికలోని విమర్శ స్పర్శను స్పృశించారు.[27]

ప్రాచీనమైన చాటు పద్యాలలో కూడా సాహిత్య విమర్శ అంతర్లీనమై ఉంది. చాటువులలో శ్రీనాథుని చాటువులు ప్రసిద్ధమైనవిగా చెప్పవచ్చు. ఎంతో ప్రచారంలో ఉన్న తెనాలి రామలింగని చాటువులలో అతని సూక్ష్మ పరిశీలనా దృష్టి విమర్శక హృదయం కనిపిస్తుంది. శ్రీనాథుడు ప్రౌఢ దేవరాయల ఆస్థానం నందు ప్రముఖుడైన ముమ్మ కవిని దర్శించిన సందర్భాలలో చెప్పిన చాటు పద్యాలలో అతని స్వీయ కవితా గుణాలును చెప్పెను. కావ్య లక్షణాలు వివరించేది లక్షణ గ్రంథం. లాక్షణికుల విమర్శ హృదయానికి ప్రతీకలు లక్షణ గ్రంథాలు. ఇవి కూడా ప్రాచీన యుగంలోని కావ్య విమర్శ స్వభావాన్ని తెలుసుకోవడానికి ఆధారమైనాయి.

ప్రాచీన యుగంలో పండితులు కావ్యాలకు వ్యాఖ్యాన రూపమైన టీకలు వెలిశాయి. ఇవి కవి హృదయాన్ని ఆవిష్కరిస్తూ నాటి వ్యాఖ్యాతల విమర్శ దృక్పథాన్ని చాటుతున్నాయి. ఆంధ్ర సాహిత్యంలో టీకా రచన 16వ శతాబ్దం నుండి ప్రారంభమైనట్లు తెలుస్తుంది.

ఈ విధంగా కావ్యావతారికలు, చాటు పద్యాలు, లక్షణ గ్రంథాలు, వ్యాఖ్యాలు, ప్రాచీన యుగ సాహిత్య విమర్శకు నిదర్శనమై ఉన్నప్పటికీ వీటన్నిటినీ విమర్శ సాహిత్యంగా పరిగణించలేమని, కావ్యం చదివిన పాఠకుడు ఏదో ఒక అభిప్రాయాన్ని వెలువరించినంత

---

[26] *సాహిత్య వ్యాస రింఛోళి*: చేకూరి రామారావు పుట: 40, 41

[27] ఎస్వీ రామారావు, తెలుగు సాహిత్య విమర్శ అవతరణ – వికాసములు 1989 పుట:61–63

మాత్రాన సహృదయుడు ఎట్లుకాలేడో కవి అయిన ప్రతివాడు కవిత్వ లక్షణాలను చర్చించినంత మాత్రానా విమర్శకుడు కాలేడని ఎస్వీ రామారావు గారి అభిప్రాయం.[28]

ప్రాచీన కవులు కావ్యాలలో సందర్భానానుసారంగా కావ్య విమర్శకు సంబంధించిన అభిప్రాయాలను వెల్లడించారు. ఆనాటి కవులందరూ సంస్కృత సాహితీ సంప్రదాయాన్ని అనుసరించారని తెలుస్తుంది. విన్నకోట పెద్దన, రామరాజభూషణుడు, అనంతామాత్యుడు, అప్పకవి మొదలైన అలంకారికులు తెలుగు భాషలో సాహిత్య శాస్త్ర గ్రంథాలను రాశారు. ''ప్రాచీనాంధ్ర మహాకవులు కావ్య విమర్శకు సంబంధించిన తమ ఆలోచనలను పలు విధములుగా వ్యక్తం చేసినారు. తమ తమ కావ్యావతారికలల్లో వ్యాస వాల్మీకాది సంస్కృత కవులను ప్రస్తుతిస్తున్నప్పుడూ, కృతి భర్తలూ, కృతి కర్తలను ప్రశంసిస్తున్నప్పుడూ, కుకవి నింద చేస్తున్నప్పుడూ, కావ్య ప్రశస్తిని ఉగడిస్తున్నప్పుడూ, ఇష్ట దేవతా స్తుతి సందర్భంలో వాగ్దేవత సరస్వతిని సంశ్లోకిస్తున్నప్పుడూ, కావ్య స్వరూపాన్ని, కావ్య ప్రయోజనాన్ని గూర్చి తమకున్న విశ్వాసాలను, తమకు ప్రీతి పాత్రమైన విలువలనూ, కావ్య సృష్టి పట్ల తమకున్న దృక్కోణాలను చమత్కార పేశలంగా, ధ్వనిమంతంగా, శ్లేషను ప్రాణితంగా, హాస్య జల్పితంగా, శ్రవణ సుభంగా ప్రకటించుకున్నారు. కొందరు ప్రబంధ కవులు కథాగతమైన పాత్రలలో ప్రసక్తాను ప్రసక్తంగా కావ్య విమర్శను పరిమళించే భావాలను విరజిమ్మినారు.''[29] ఈ విధంగా ప్రాచీన కవులు తమ రచనా సూత్రాలను, దృక్పథాలను ప్రకటించి కావ్యాన్ని అర్థం చేసుకొనే మార్గాన్ని సుగమం చేశారు.

సాహిత్యం సమాజం పరిణామశీలమయినవి. సాహిత్య విలువలను మూల్యాలను, పరిణామాలను, ప్రయోగాలనూ వివేచించే, విశ్లేషించే సాహిత్య విమర్శకు కూడా పరిణామం తప్పదు. కాలానుగుణంగా సృజన పద్ధతులు మారినట్లుగానే విమర్శ పద్ధతులు కూడా మారాయి. సృజన విమర్శ రంగాలలో మార్పు అనేది అనివార్యంగా జరుగుతూనే ఉంది.

[28] ఎస్వీ రామారావు, తెలుగు సాహిత్య విమర్శ అవతరణ – వికాసములు 1989 పుట:83–84

[29] ఇరివెంటి కృష్ణమూర్తి, 'సంప్రదాయోద్యమం: విమర్శ', మీనన్, కె.ఎ. (సం) రజత రంజని, 1988 పుట: 39

ఉంటుంది కూడా. సృజన – వ్యవస్థకు భాష, సాహిత్యం, విమర్శ అనేవి మూడు ముఖాలు వంటివి.[30]

తెలుగు సాహిత్య విమర్శ ఆవిర్భావానికి దోహదం చేసినది పాశ్చాత్య సాహిత్య విమర్శ. తెలుగు భాషలోని సాహిత్య విమర్శతత్త్వాన్ని దాని క్రమ పరిణామ వికాసాన్ని విశ్లేషించడానికి అనేక విమర్శ పద్ధతులు చోటు చేసుకున్నాయి. ఒక గ్రంథాన్ని పరిశీలించడానికి అనేక విమర్శ పద్ధతులు ఏర్పడ్డాయి. ప్రాచీన కాలంలో విమర్శలన్నీ వ్యాఖ్యాన పద్ధతుల్లో నడిచాయి. కాని కాలనుగుణంగా అనేక నూతన విమర్శ పద్ధతులు సాహిత్యంలో వెలిశాయి. ''శబ్ద చర్చలతో ప్రారంభమైన సాహిత్య విమర్శ కవి కాల నిర్ణయం, కర్తృత్వ వివాదాలు, ఏక కవి రచనలు అనుశీలనలతో ముందుకు నడిచింది. ఈ ప్రయాణంలో అనేక పద్ధతులు సాహిత్య విమర్శలో ఏర్పడ్డాయి.''[31]

### 1.4. విమర్శ పద్ధతులు

ప్రధానంగా విమర్శ పద్ధతి రెండు విధాలు. ఒకటి ప్రాచీన విమర్శ పద్ధతి. రెండు అర్వాచీన విమర్శ పద్ధతి. ప్రాచీన విమర్శ పద్ధతి మళ్ళీ రెండు విధాలు 1. అస్వతంత్ర విమర్శ 2. స్వతంత్ర విమర్శ.( Deductive criticism & Inductive criticism). ఆధునిక విమర్శ పద్ధతులు చాలా ఉన్నాయి. అవి వివరణాత్మక విమర్శ, అభినందనాత్మక విమర్శ, తులనాత్మక విమర్శ, నిర్ణయాత్మక విమర్శ, గ్రంథ పరిష్కార విమర్శ, ఆలంకారిక విమర్శ, సాంప్రదాయిక విమర్శ, పునర్నవ సాంప్రదాయిక విమర్శ, కాల్పానిక విమర్శ, సాంకేతిక విమర్శ, సామాజిక విమర్శ, జీవతానుశీలన పద్ధతి, మనస్తత్వ శాస్త్ర విమర్శ, చారిత్రక విమర్శ, మార్క్సిస్ట్ విమర్శ,ఔప దేశిక విమర్శ పద్ధతి, సౌందర్య దృక్పథ విమర్శ, ప్రయోదకాముక విమర్శ, సిద్ధాంత విచార విమర్శ (సూత్ర విమర్శ), మౌలిక విమర్శ, మౌలిక పరిణామ దృక్పథ విమర్శ, తర్కసహ విమర్శ, సముద్దేశ నిర్ణయ విమర్శ, విశదీకరణ విమర్శ, వర్ణనాత్మక విమర్శ, ప్రాదేశిక విమర్శ, న్యూక్రిటిసిజం (నవ్య విమర్శ), అన్వయ విమర్శ, అభిరుచి విమర్శ, అభివ్యక్తి విమర్శ, ఆచరణాత్మక విమర్శ, కవిజీవిత కావ్య సమన్వయ విమర్శ, కావ్య లక్షణ విమర్శ, పిడివాద

---

[30] ఆధునిక సాహిత్య విమర్శ రీతులు: A.V. College పుట: □X

[31] ఆధునిక సాహిత్య విమర్శ రీతులు: A.V. College పుట: □X

విమర్శ (సిద్ధాంత విమర్శ), స్త్రీవాద సాహిత్య విమర్శ, దళిత వాద సాహిత్య విమర్శ, రూపవాద విమర్శ, లాక్షణిక విమర్శ, వస్త్వాశ్రయ విమర్శ, వాద ప్రతివాద విమర్శ, విప్లవ సాహిత్య విమర్శ, విశ్లేషణాత్మక విమర్శ, బహుళ వాద విమర్శ, ప్రాయోగిక విమర్శ, ప్రాగ్రూప విమర్శ, ప్రకృతి వాద విమర్శ, పురాణ విమర్శ, నైతిక విమర్శ, నేపథ్య విమర్శ, కళా విమర్శ, గ్రాంథిక విమర్శ, పౌరాణిక విమర్శ, ప్రక్రియా విమర్శ, శైలీ విమర్శ, ప్రతీక వాద విమర్శ ఇవేగాక అనేక రకాలైన విమర్శ పద్ధతులు ఆధునిక సాహిత్య విమర్శలో ఉన్నాయి.

ఆధునిక సాహిత్య విమర్శ రీతులెన్ని ఉన్నప్పటికి విమర్శ స్వరూపాన్ని అనుసరించి 1. లక్షణ విమర్శ 2. లక్ష్య విమర్శలుగా, విమర్శకుని దృక్పథాన్ని అనుసరించి 1. సాహిత్య స్పృహతో చేసే విమర్శ 2. సామాజిక స్పృహతో చేసే విమర్శలుగా కొనసాగుతున్నాయి. ఆధునిక విమర్శ రీతులలో ప్రధానమైనవిగా చారిత్రక విమర్శ, సాంఘిక విమర్శ, కవి జీవిత విమర్శ, మనో విశ్లేషణాత్మక విమర్శ, ప్రక్రియా విమర్శ, శైలీ విమర్శ, ప్రతీక వాద విమర్శ, రూపవాద విమర్శ, మార్క్సిస్ట్ విమర్శ మొదలైనవి చెప్పవచ్చు. వీటితో పాటు సౌందర్య శాస్త్ర విమర్శ/కళా విమర్శ ఆధునిక విమర్శ రీతులలో ప్రధానమైన విమర్శగా పరిగణించవచ్చును.

### 1.4.1. నైతిక విమర్శ

నైతిక విమర్శను ఆంగ్లంలో Ethical Criticism అని అంటారు, నైతికమైన ఆదర్శాలను ప్రమాణంగా తీసుకొని ప్రాతిపదికపై సాహిత్యాన్ని పరామర్శించటాన్ని నైతిక విమర్శ అంటారు. నైతిక విమర్శను ప్రాచీన కాలంలో ప్లేటో, హోరేస్, సర్ ఫిలిప్ సిడ్ని, రస్కిన్ మైదలైన వారు ఆధునిక కాలంలో మేథ్యూ ఆర్నాల్డ్, ఇర్వింగ్ బాచిట్, టి.ఎస్. ఎలియట్, ఎడ్మండ్ ఫుల్లర్ మొదలైన వారు అనుసరించారు. పాల్ ఎల్మార్‌మోర్ ఈ రంగంలో ప్రసిద్ధులుగా చెప్పవచ్చు.[32]

నైతిక విమర్శకులు కవి 'ఎలా చెప్పాడు' అన్న దాని కంటె 'ఏం చెప్పాడు' అన్న విషయానికి అధిక ప్రాధాన్యాన్ని ఇస్తారు. వీరినే నవ్య మానవతావాదులు (Neo–Humanists) అని కూడా అంటారు. మేథ్యూ ఆర్నాల్డ్ ఈ నైతిక విమర్శ పద్ధతినంతటిని

[32] తెలుగు సాహిత్య విమర్శ: 1999 పుట: 189

“Literature is a criticism of life” అనే వాఙ్మయ నిర్వచనము నందు సూత్రీకరించాడు. నైతిక విమర్శకులు కవితా శిల్పమును ఒక సాధనముగానే భావిస్తారు.[33] భారతీయాలంకారికులు నైతిక విమర్శకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. మమ్మటుడు మొదలైన వారు ఈ విమర్శకు అధిక ప్రాముఖ్యాన్ని ఇచ్చారు. కావ్యాన్నికి విలువ కట్టడంలో కేవలం సాహిత్య ప్రమాణాలే కాక నైతిక ప్రమాణాలకు ప్రాముఖ్యం కలదని వీరు భావిస్తారు.

**1.4.2. గ్రంథ పరిష్కార విమర్శ**

గ్రంథ పరిష్కార విమర్శను ఆంగ్లములో Bibliographical Criticism అని, Testual Criticism అని, Exegetical Criticism అని పిలుస్తారు. కావ్యం యొక్క మూల ప్రతిని నిర్ణయించడం లేదా శుద్ధ ప్రతిని రూపొందించడం ‘గ్రంథ పరిష్కార విమర్శ’ లక్ష్యంగా చెప్పవచ్చు. రచయితల రచనలకు గల మూలాలను, ఆకరాలను అన్వేషించటం, కాల నిర్ణయాన్ని చేయటం, పూర్వాపర్వ విచారణ చేయటం గ్రంథ పరిష్కారం చేయటం మొదలైనవి ఈ విమర్శలో కనబడే ప్రధానాంశాలు.[34]

గ్రంథ పరిష్కార విమర్శలో మొదలైన పాశ్చాత్య పండితుల కృషి నిర్దుష్టం కాకపోయినా, ఈ పద్ధతికి గట్టి పునాదులు వేసింది. జాన్సన్ కాలంలో ఈ పద్ధతి మంచి వికాసాన్ని సాధించింది. “గ్రంథ పరిష్కార విమర్శలో పరిష్కర్తలు భాషా పండితులు కావడం ప్రాథమిక అవసరం. వారు సాహిత్య విమర్శకులై కూడా ఉంటే ఈ విమర్శకు ఉభయ తారకం”[35] అని జి.వి. సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. సి.పి. బ్రౌన్, మెకంజి లాంటి వారి కృషితో ఈ విమర్శ నిర్దుష్ట రూపాన్ని సంతరించుకుందని చెప్పవచ్చు.

ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య ఈ విమర్శలోని ప్రధాన సూత్రాలను ఇలా చెప్పారు.

1. గ్రంథం శిథిలమైనప్పుడు రచనలో పరిష్కర్త పురాణాన్ని కవి హృదయానికీ, రచనా రీతికి అనుకూలంగా చేయాలి.

---

33 సాహిత్య దర్శనము: 1985: పుట21

34 ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం: 1983: పుట:144

35 ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం: 1983: పుట:144–145

2. సాధ్యమైనన్ని ఎక్కువ ప్రతులను సంపాదించి పాఠ నిర్ణయం చేయాలి.

3. పాఠ భేదాల్ని పాద సూచికలుగా చేయాలి.[36]

గ్రంథ పరిష్కార విమర్శ స్వతహగా సాహిత్య విమర్శ అనిపించుకోదు. ఆయా గ్రంథాలను పరిష్కర్తలు వెలయించే పీఠికల్లో పాఠ నిర్ణయకాంశాలను కాక గ్రంథానుశీలనాంశాలకూ అధిక స్థానముంటే అప్పుడది సాహిత్య విమర్శ కావచ్చును. అందువల్ల సామాన్యంగా ఈ విమర్శ పద్ధతి సాహిత్య విమర్శకు పూర్వ రంగం సిద్ధం చేసేదై ఉంటుంది.[37]

**1.4.3. ఆర్కిటైపల్ / పౌరాణిక విమర్శ**

పౌరాణిక విమర్శను ఆంగ్లంలో Archetypal Totemic Criticism, Mythological Criticism, Ritualistic Criticism అని కూడా పిలుస్తారు. ఈ విమర్శ పద్ధతి ఇటీవల కాలంలోనే వ్యాప్తి చెందుతుంది. ఈ విమర్శకు ఒక్కొక్క అంశమునందు ఒక్కొక్క విమర్శనా విధానంతో సంబంధం కూడి ఉంటుంది. అలా అని ఇది కలగూర గంప వంటిది కాదు. దీనికి కూడా కళా విమర్శ మాదిరిగానే సూక్ష్మాతి సూక్ష్మం సమగ్రమైన కావ్య పరిశీలన ఎంతో అవసరం. ఈ విమర్శ కళలతో సంబంధంలేని విషయాలను కూడా పరిగణలోకి తీసుకుంటుంది. ఈ విమర్శ ఒక జాతి యొక్క అవ్యక్త చేతనకు, అంటే సామూహిక అవ్యక్త చేతనకు సంబంధించి ఉంటుంది.[38]

ఈ విమర్శ పురాణ గాథలను, జానపద కథలను మొదలైన వాని నిర్మాణములోని సంకేతాలను గుర్తించి వాటి మౌలిక రూపాలను వివరించడానికి ఎంతగానో తోడ్పడుతుంది. ఈ విమర్శకు యూంగ్ ప్రతిపాదించిన 'సామూహిక అచేతన' సిద్ధాంతం ఆధారం. యూంగ్ అచేతనను వైయక్తికము, సామూహికం అని రెండు పొరలుగా విభజించి సామూహిక అచేతనలో జాతులకు జాతులకు, మతాలకు అతీతంగా సర్వమానవ జాతికి సమానమైన

---

[36] విమర్శ మౌలిక లక్షణాలు: 1990 పుట 91

[37] ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం: 1983: పుట:145

[38] సాహిత్య దర్శనము: కె.వి.ఆర్ పుట:32

భావాలు దాగి ఉంటాయని, ఈ సమాన భావాలే వివిధ జాతుల పురాణ గాథలలోని విశ్వాసాలు, ఆచారాలు మొదలైన సంకేతాలుగా ఒక క్రమ పద్ధతిలో పునరావృతమౌతాయని వాటినే ఆర్కిటైప్ అని పేర్కొన్నాడు. ఈ విమర్శ సాహిత్యములోని ఈ మౌలిక సాంస్కృతిక రూపములను గుర్తించి, అవి ఏ ఆర్కిటైపుకు చెందుతాయో వివరిస్తుంది. ఈ విమర్శ పురాణ కథలలోని సంకేతార్థాలను సుగమము కావిస్తుంది.[39]

ఒక కళా నిర్మాణం నందు మౌలిక సాంస్కృతిక రూపమును నిరూపించటానికి ఈ విమర్శ ప్రయత్నిస్తుంది. పురాణ గాథాదులలో కన్పించే సంకేతాలను, ఏ మౌలిక రూపానికి సంబంధించినవో తెలుసుకోవటమే పౌరాణిక విమర్శ యొక్క ప్రధాన ధ్యేయంగా చెప్పవచ్చు[40] తెలుగు జానపద సాహిత్య విమర్శపై ఈ విమర్శ ప్రభావం కన్పిస్తుంది.

**1.4.4. చారిత్రక విమర్శ**

దీన్ని ఆంగ్లంలో Historical Criticism అని పిలుస్తారు. *"ఒక యుగంలో ఒక కావ్యంలో వెలసిన కావ్యం యొక్క విలువను నిర్ధారించటానికి ఆ ప్రక్రియ యొక్క చారిత్రక జ్ఞానం అవసరం. ప్రక్రియ యొక్క పుట్టు పూర్వోత్తరాలు, వికాశ దశ మొదలైన వాటి యొక్క చారిత్రక పరిణామ పరిజ్ఞానం లేనిదే సాహిత్యపు విలువను నిగ్గు తేల్చడం సాధ్యం కాదని భావించే విమర్శ విధానం చారిత్రక విమర్శ"*[41] ఈ విమర్శ గ్రంథంలోని వివిధ అంశాలను చారిత్రక దృష్టితో పరిశీలించి పూర్వాపర సంబంధ స్వరూప స్వభావాలను, పరిణామ వికాసాలను నిరూపిస్తుంది. సాహిత్య సిద్ధాంతాల క్రమ వికాసాన్ని, సాహిత్య ప్రస్థానాల ప్రగతినీ, ప్రయోగ పరిణామాల ప్రవర్తననూ పరిశీలించటానికీ ఈ విమర్శ అత్యంత ఉపయోగంగా చెప్పవచ్చు.

'16వ శతాబ్దంలోనే ఈ విమర్శ పద్ధతి కవి జీవిత చరిత్ర రచనా ప్రక్రియలో ప్రభవించింది. లీలండ్, బేల్, టానర్, మెకంజీ మొదలైన వారు దీని అభివృద్ధి పరిచారు. డ్రైడన్, జాన్సన్, థామస్, వార్టన్ మొదలైన విమర్శకులు 18వ శతాబ్దంలో ఈ విమర్శకు ప్రాచుర్యాన్ని

[39] తెలుగు సాహిత్య విమర్శ: 1999 పుట: 194–195

[40] సాహిత్య దర్శనము, కె.వి.ఆర్ 1985 పుట: 35

[41] ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం: 1983: పుట:149

తెచ్చారు. ఈ కాలంలోనే ఈ విమర్శ విస్తృతిని, వైవిధ్యాన్ని సాధించింది. అయితే 20వ శతాబ్దంలో ఈ విమర్శ ప్రత్యేక ఉద్యమ ప్రతిపత్తిని కోల్పోయి సాంఘిక విమర్శలో అంగంగా అంతర్భవించింది.[42]

**1.4.5. సాంఘిక విమర్శ**

దీని సామాజిక విమర్శ అని కూడా అంటారు. ఆంగ్లంలో Sociological Criticism అని పిలుస్తారు. *''కవిపై దేశ, కాల, సంఘ పరిస్థితులకు గల ప్రభావమును వివరింప యత్నించు విమర్శనే సాంఘిక విమర్శ అందురు''*[43] ఈ విమర్శ సమాజానికి సాహిత్యానికి గల పరస్పర సంబంధాన్ని విశదీకరిస్తుంది. గ్రంథంలోని వివిధ అంశాలను చారిత్రక దృష్టితో పరిశీలించి పూర్వాపర సంబంధాలను, స్వరూప స్వభావాలను, పరిణామ వికాసాలను నిరూపిస్తుంది.

*''రచయిత జీవితము, దేశ కాలములు, నాటి సాంఘిక విశ్వాసములు, మత రాజకీయ పరిస్థితులు మున్నగు విషయాలను కేంద్రంగా నిడికొని కావ్య వివేచనము కడంగుట ఈ విమర్శ లక్షణము దీనికే చారిత్రక విమర్శ అనియు వ్యవహారము గలదు''* [44] ఫ్రాన్స్ దేశస్థుడగు టైనే అను పండితుడు ఈ సాంఘిక విమర్శకు ప్రథమాచార్యుడు. సమాజమును ప్రభావితం చేసిన కవులును లేక పోలేదని ఈ విమర్శలు గుర్తించారు. తిక్కన భారతంలో ఆ కాలం నాటి రాజకీయాలను, యుద్ధాలను, తెలుగు వారి పెళ్ళిళ్ళను, అశ్వ శిక్షణ మొదలైన అనేక విషయాలను వర్ణించారు. అదే విధంగా కృష్ణ దేవరాయలు రాసిన 'ఆముక్త మాల్యద'లో కూడా వాస్తవిక జీవిత విశేషాలు, రాజనీతి, లోకం పోకడలు, సంసార సంగతులు చోటు చేసుకున్నాయి. రామరాజ భూషణుడు రాసిన 'వసుచరిత్ర'లో కూడా అనేక సామాజిక విషయాలను తెలియజేశాడు. అంతేగాక సంగీత కళా రహస్యాల్ని, జ్యోతిశాస్త్ర విశేషాలని తెలియజేశాడు. తెలుగు సాహిత్యంలో దక్షిణాంధ్ర యుగంలో అనేక యక్షగానాలు వెలుశాయి. ఇవన్నీ సామాజిక ప్రతిబింబాలే. ఆధునిక విషయానికొస్తే ఇంచుమించు అన్ని ప్రక్రియలలో

---

[42] ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం: 1983: పుట:149–150

[43] సాహిత్య దర్శనము 1985: పుట:26

[44] తెలుగులో సాహిత్య విమర్శ 1999: పుట:190

సామాజిక ఇతివృత్తాన్ని ఆధారంగా చేసికొని రచనలు సాగుతున్నాయి. ఈ రచనలన్ని ఈ విమర్శ ద్వారా పరిశీలిస్తారు.

### 1.4.6. కవి జీవిత విమర్శ

దీన్ని కవి జీవిత కావ్య సమన్వయ విమర్శ అని కవి జీవిత చారిత్రాత్మక సాహిత్య విమర్శ గాను కొందరు పేర్కొంటున్నారు. దీని ఆంగ్లంలో Biographical criticism గా పిలుస్తారు. కవి జీవిత ఘట్టాలు, వారి మానసిక స్థితులు, వారి తాత్త్విక భావాలు, వారి రచనలలో ఎలా ప్రతిబింబించాయని కానీ, వారి వ్యక్తిత్వాలు కృతులను ఎలా రూపొందింపచేశాయని గానీ వివేచించే విమర్శ పద్ధతి కవి జీవిత విమర్శ[45] కవి యొక్క జీవిత సాహిత్యాల సమన్వయ వివేచన దీనిలో ప్రధానమైనది. కవి యొక్క బహిర్జీవిత ఘట్టాలు ఎలా రచనలో ప్రవేశించాయో, వివిధ ప్రాధాన్యత అంశాలు ఆయన మనస్సుకి ఏ విధంగా ప్రభావితం చేసి రచనలో ప్రతి ఫలించాయన్న వాటిపై ఈ విమర్శ దృష్టి సారిస్తుంది.[46] ఆంగ్ల సాహిత్యంలో ఈ విమర్శ శాఖను ఆరంభించిన వారు డ్రైడెన్. 18వ శతాబ్దానికి చెందిన సామ్యుయెల్ జాన్సన్ Lives of poets అనే గ్రంథంలో కవి జీవిత సాహిత్య సమన్వయ విమర్శ పద్ధతిని గొప్పగా అనుసరించడమే గాక రచయిత గురించి 'నాకున్న పరిజ్ఞానాన్ని దూరంగా ఉంచి అతని రచనకు విలువ కట్టడం నాకు చేత కాదు'[47] అని సూటిగా ప్రకటించాడు.

19వ శతాబ్దానికి చెందిన ఫ్రెంచ్ విమర్శకుడు సెయింట్ బ్యూ ద్వారా ఈ విమర్శకు గొప్ప ఖ్యాతి లభించిందని చెప్పవచ్చు. ఈ విమర్శ వల్ల సాహిత్య సృజన లోని మెలుకువలు, లోకంలోని వస్తువు కావ్య వస్తువుగా మారితే ఎటువంటి గుణాలు నిలుపుకుంటుంది. ఏమి సంతరించుకుంటుంది. అనే విషయాలు పాఠకునికి విశదమవుతుంది. తెలుగులో ఈ విమర్శ పద్ధతి ఈ నాటికీ ఒక విధానంగా వ్యాప్తి లోకి రాలేదనే చెప్పాలి. అందుకు సాక్ష్యమే అతి తక్కువ సంఖ్యలో వెలువడ్డ కవి జీవిత సాహిత్య చరిత్ర విమర్శ రచనలు. 1820లో వచ్చిన

---

[45] ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం: 1983: పుట:145

[46] ఆంధ్ర సాహిత్య విమర్శ రీతులు 2004: పుట: 74

[47] ఆంధ్ర సాహిత్య విమర్శ రీతులు 2004 పుట:82

కావలి వెంకట రామస్వామి గారి 'దక్కను కవుల చరిత్ర' Biographical sketches of Deccan poets తో తెలుగులో కవుల చరిత్రలు, సాహిత్య చరిత్రలు మొదలైనాయి. రాళ్ళపల్లి అనంత కృష్ణశర్మ రచించిన 'వేమన' కవి జీవిత సాహిత్య చరిత్రలకు తలమానికంగా నిలుస్తుంది. కవి జీవితాన్ని కవిత్వాన్ని విశ్లేషించి ప్రామాణికంగా రూపొందించిన ఈ గ్రంథం Biographic Literature స్థాయిలో తెలుగులో విలువ గల రచనగా జి.వి. సుబ్రహ్మణ్యం అభిప్రాయపడ్డారు. కె.వి.రమణారెడ్డి 'మహోదయం', 'కవి కోకిల గ్రంథాలు నమూనాగా పేర్కొనదగిన కవి జీవిత చారిత్రాత్మక సాహిత్య విమర్శ రచనలు. రచయిత ఒకానొక చారిత్రక దశలో జీవించిన సామాజిక జీవిగా గుర్తించి, సాహిత్యానికి సామాజిక పరిణామంలో ఉన్న అవినాభావ సంబంధాన్ని విశ్లేషిస్తూ సాహిత్య చరిత్రలో ఆ కవికి గల స్థానాన్ని నిరూపించే పద్ధతి కవి జీవిత సాహిత్య సమన్వయ విమర్శలో వచ్చిన పరిణామం.[48] ఈ విమర్శలో క్రమంలో రచయితల మనస్తత్వ విశ్లేషణం అధికమవ్వడంతో ఇది మనస్తత్వ విమర్శలో లీనమై పోయింది.[49]

### 1.4.7. మనో వైజ్ఞానిక విమర్శ

దీన్ని మనస్తత్వ విమర్శ అని కూడా పిలుస్తారు. ఆంగ్లంలో దీన్ని Psychological criticism అని అంటారు. ఆధునిక కాలంలో ఈ విమర్శ పెక్కు విధాలుగా అభివృద్ధి గాంచినది. 'మానసిక శాస్త్రవేత్తలైన ఫ్రాయిడ్ ఆడ్లర్, యాంగ్ ప్రతిపాదించిన సాద్ధాంతాలు సృజనాత్మక సాహిత్య రంగాలలో కూడా వ్యాపించుటతో సాహిత్య విమర్శలో మనస్తత్వ విశ్లేషణ (Psychoanalysis) ఆద్యాతన కాలమున ప్రాముఖ్యం వహించసాగింది.[50] మానసిక తత్త్వ విశ్లేషణ సాద్ధాంతాలను సాహిత్యానికి అన్వయించి చూసే అనుశీలనం ఈ విమర్శ శాఖలో ఎక్కువగా కనిపిస్తుంది.[51]

---

[48] ఆంధ్ర సాహిత్య విమర్శ రీతులు 2004: పుట:82

[49] ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం: 1983 పుట:146

[50] తెలుగులో సాహిత్య విమర్శ 1999: పుట:193

[51] ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం: 1983: పుట:147

సిగ్మండ్ ఫ్రాయిడ్ (1856-1939) వ్యక్తి అచేతనలోని (Unconscious) అహేతుకమైన కోరికల సమూహము (Libido) అజ్ఞాతముగా అణచి వేయబడిన కోరికల ప్రతిరూపము (Dreams) శైశవ అవస్థలోని తల్లిదండ్రుల ప్రభావం (ఈడిపస్ కాంప్లెక్స్) మొదలగు వాటిని తన గ్రంథంలో విశదీకరించి మానసిక శాస్త్రమునకు మార్గ దర్శకుడు అయ్యెను. ఫ్రాయిడ్ ప్రతిపాదించిన 'మనో విశ్లేషణాత్మక సిద్ధాంతం' (Theory of psychoanalysis) ఈ 'అచేతన'కు అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. ఆల్‌ఫ్రెడ్ ఆడ్లర్ ప్రతిపాదించిన ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్, సుపీరియారిటీ కాంప్లెక్స్, జి.జి. యాంగ్ ప్రతిపాదించిన సామూహిక ప్రజ్ఞా చేతన పాత్రల మనో విశ్లేషణలో సాహిత్య విమర్శకు సాధనాలుగా ఉపయోగ పడుతున్నాయి.

'మనో విశ్లేషణాత్మక విమర్శ ప్రధానంగా రెండు విధాలుగా జరుగుతుంది.

1. పాత్రల ప్రవర్తనలోని వైచిత్రిని సైకో ఎనాలసిస్ సిద్ధాంత నేపథ్యంలోంచి విశ్లేషించి వివరించడం.

2. రచయిత సృష్టించిన పాత్రల నేపథ్యంలోంచి, అతను జీవించిన కాలం నాటి పరిస్థితుల నేపథ్యంలోంచి, రచయిత అంతరంగ ప్రవృతిని అంచనా వెయ్యడం' [52]

రచయిత సృజన వ్యాపారంలో భాసించే మానసికావస్థల అనుశీలనం గానూ, అతని మానసికావస్థలకూ రచనలోని విశిష్ట లక్షణాలకూ మధ్య ఉన్న సంబంధాన్ని వివేచించే పరిశీలనం గానూ ఈ విమర్శ పనికివస్తుంది. రచయిత మనస్తత్వాన్ని విశ్లేషించటానికి మారుగా పాత్రల చిత్త వృత్తులను వివేచించటానికీ, ఆధునిక మనస్తత్వ సిద్ధాంతాలు పాత్ర చిత్రణలో ఎలా తోడ్పడ్డాయో పరిశీలుంచడానికి ఈ విమర్శ పద్ధతులను వినియోగిస్తున్నారు.[53] ఎర్నెస్ట్ జోన్స్ ఫ్రాయిడ్ ఈడిపస్ కాంప్లెక్స్ ఆధారముగా షేక్‌స్పియర్ హామ్లెట్ మనస్తత్వమును విశ్లేషించి ఈ విమర్శకు మార్గదర్శకుడయ్యెను.[54] ఈ విమర్శను తెలుగు వారికి పరిచయం చేసింది

---

[52] ఆంధ్ర సాహిత్య విమర్శ రీతులు 2004: పుట:159

[53] ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం: 1983: పుట:148

[54] ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం: 1983: పుట:148) (తెలుగులో సాహిత్య విమర్శ 1999: పుట:194

బుచ్చిబాబు. అయితే దానిని అభివృద్ధి పరిచింది ఆర్.ఎస్.సుదర్శనం . *"మనో విశ్లేషణాత్మక విమర్శ రచయిత యొక్క గానీ, పాత్రల యొక్క గానీ మానసిక చిత్తవృత్తులను తెలుసుకోవటానికి తోడ్పడినా, రచన యొక్క విలువను, ఉత్తమధమత్వాలను నిర్ణయించటానికి సహాయకారి కాదు. ఈ విమర్శ విధానం ఎంత శాస్త్రీయమైన సమగ్రం కాదు. ఇది సాహిత్య తత్త్వాన్ని సాక్షాత్కరింపజేయలేదు."*[55] అని జి.వి.సుబ్రహ్మణ్యం అభిప్రాయపడ్డారు. మనస్తత్వ శాస్త్ర పరిణామంలో అస్తిత్వ వాదాన్నికి కూడా పాముఖ్యం ఉంది.

**1.4.8. మార్క్సిస్ట్ విమర్శ**

దీన్ని ఆంగ్లంలో Marxist criticism అంటారు. *"మార్క్సిస్ట్ విమర్శ పరిశీలిస్తున్న సాహిత్యం వల్ల నిర్వచింపబడదు. పరిశీలించే పద్ధతి వల్ల నిర్వచింపబడుతుంది.*[56] *ఏది మార్క్సిస్ట్ విమర్శ అన్న ప్రశ్నకు ఈ వాక్యం సమాధానం"*[57] సాహిత్యంను గతి తార్కిక భౌతిక వాద దృష్టితో సమాలోచించు విమర్శనా రీతి మార్క్సిస్ట్ విమర్శ.[58] మార్క్స ఏంగిల్ ప్రతిపాదించిన గతి తార్కిక భౌతికవాదం (Dialectical materialism) ఆధారంగా ఈ విమర్శ విధానం 19వ శతాబ్దంలో వాస్తవ విమర్శ నుండి 20వ శతాబ్ద ప్రథమ పాదంలో పుట్టి పెరిగింది. సామ్యవాద వాస్తవికత (Socialist realism) దీని ప్రాతిపదిక "Literature must socialist party work" (లెనిన్) అన్నది దీని స్వభావం.[59]

ఈ విమర్శ సాహిత్యాన్ని భౌతిక వాద దృక్పథంతో పరిశీలించును. కళ కళ కొరకు కాదని సామాజిక ప్రయోజనాల కొరకని వాదించును. సామాజిక ప్రేరణ లేకుండా ఏ సాహిత్యం ఉద్భవించదని, సమాజంతో సంబంధం లేని సాహితోద్యమాలు, రచనలు సామాజిక వాస్తవికత నుండి పారిపోవడానికి చేసే ప్రయత్నాలని భావించును. ఈ విమర్శకుల దృష్టిలో వాస్తవికతను ప్రతిబింబించేది ఉత్తమ రచన. శ్రమ జీవుల చైతన్యాన్ని చిత్రించే సామాజిక వాస్తవికత మిగుల ఉత్తమమైనది. వర్గ సమాజం ఉన్నంత వరకు వర్గ దృష్టి తప్పదని అందువల్ల రచయితలు పీడిత

---

55 ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం: 1983: పుట:148

56 సుబ్బారావు, సి.వి. విభాత సంధ్యలు. ముందుమాట

57 ఆంధ్ర సాహిత్య విమర్శ రీతులు 2004: పుట:93

58 తెలుగులో సాహిత్య విమర్శ 1999: పుట:191

59 ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం: 1983: పుట:154

ప్రజల పక్షాన్ని అవలంబించాలని వీరి అభిప్రాయం.[60] ఈ విమర్శకుల వాస్తవికత ఉత్తమమైన రచనా పద్ధతి.

*"శ్రామిక వర్గము చైతన్యవంతము కావడం, తిరుగుబాటు, విప్లవాదుల ద్వారా సామ్యవాద సమాజ స్థాపనము, దానికి తగిన విధమైన దోహదీ కరణము ప్రధానములు. ఈ విధమైన పూర్వ నిర్ణయముతో మార్క్సిస్ట్ సాహిత్య విమర్శ సాగును."*[61] ఈ విమర్శ సాహిత్యాన్ని విమర్శించటానికి సాహిత్య ప్రమాణాలతో పాటు సాహిత్యేతర ప్రమాణాలనూ కూడా సమానంగా స్వీకరిస్తుంది. తెలుగులో ఈ విమర్శ అభ్యుదయ సాహిత్యంతో పాటు పుట్టింది. 1946 మే 11 నుండి జూన్ 10 వరకు నెల రోజుల పాటు తెనాలి ప్రాంతం పెదపూడిలో జరిగిన సాహిత్య పాఠశాలలో మద్దుకూరి చంద్రశేఖర రావు 'ఆంధ్ర సాహిత్యంలో కొత్తపోకడలు' అనే అంశం మీద చెప్పిన పాఠం తొలి తెలుగు మార్క్సిస్ట్ సాహిత్య విమర్శగా గుర్తింపు పొందింది. మార్క్సిస్ట్ సాహిత్య విమర్శను సుసంపన్నం చేసిన విమర్శకులలో కొడవటిగంటి అగ్రగామి.[62] తెలుగు సాహిత్యంలో ఈ విమర్శపై గణనీయమైన కృషి జరిగింది. మద్దుకూరి చంద్రశేఖర రావు, రమణా రెడ్డి, రారా, రాంభటు, త్రిపురనేని మధుసూదనరావు, వరవరరావు, చలసాని ప్రసాద్ మొదలైన విమర్శకులు ఈ పద్ధతిలో మంచి కృషి చేశారు.[63]

### 1.4.9. ప్రక్రియా విమర్శ

దీన్ని ఆంగ్లంలో Genre criticism అని అంటారు. *"ఒక రచన సృజింపబడుతున్నప్పుడే దాని స్వభావాన్ని అదే అభివ్యక్తం చేసుకుంటుంది. అలా అభివ్యక్తమయ్యే కావ్య స్వభావం తర్కబద్ధంగా ఉంటుంది. దీనిని అంగీకరిస్తే గతి తర్కాన్ని ఆశ్రయించి ఒక స్వరూప స్వభావాన్ని సంతరించుకున్న రచన ఒక వర్గంగా పరిగణింప బడుతుంది. ఇంగ్లీషులో ఈ వర్గాలనే Mode, kind, type అంటారు. అయితే ఈ తార్కిక వివేచన విధానానికి కూడా ఒక స్వయం సమగ్ర లక్షణ భావం ఉండాలి. అటువంటి తార్కిక*

---

[60] తెలుగులో సాహిత్య విమర్శ 1999: పుట:192

[61] ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ సాంప్రదాయక రీతి 1999: పుట:305, 306

[62] ఆంధ్ర సాహిత్య విమర్శ రీతులు 2004: పుట:94-99

[63] వల్లంపాటి సాహిత్య వ్యాసాలు, 1997. పుట:15

*వ్యవస్థ గల రూప భావానికి ప్రక్రియ అని పేరు. ఈ ప్రక్రియా సూత్రాన్ని వినియోగించుకుంటూ సాహిత్య స్వరూప స్వభావాలను తాత్త్విక కళాత్మకమైన విలువలనూ వివేచించే విమర్శ పద్ధతిని ప్రక్రియా విమర్శ''* అంటారని జి.వి.సుబ్రహ్మణ్యం ప్రక్రియను, ప్రక్రియా విమర్శను నిర్వచించారు.[64] ఈ విమర్శలో రూప ప్రాధాన్యం ఆధారంగానే ప్రక్రియా నిర్ణయం జరుగుతుంది. వస్తువు ప్రక్రియా భేదాలను నిర్ణయించడంలో ప్రధాన పాత్ర వహిస్తుందని చెప్పవచ్చు.

ఒక రచనలో బహిర, అంతర ధర్మాలను గుర్తించటం ప్రక్రియా విమర్శకు అవసరం. అది గుర్తించినప్పుడే ప్రక్రియా నిర్ణయం జరుగుతుంది. ఈ విమర్శ కేవలం ప్రక్రియా విమర్శ కోసమే కాదు. కావ్యానుశీలనం చేయడానికి సాహిత్య సదవగాహనకూ, వికాస స్ఫూర్తికి తాత్త్విక దర్శనానికి కూడా ఈ విమర్శ తోడ్పడుతుందని ప్రసిద్ధ విమర్శకులు భావిస్తున్నారు. ప్రక్రియా వివేచనను ఒక్కసారిగా విశ్లేషణాత్మక ప్రక్రియా విమర్శ వైపు మరలించినది హెన్రి జేమ్స్. ఐ.ఎ.రిచర్డ్స్, రెనెవెలెక్, ఆస్టిన్ వారెన్, ఆలిస్టర్ ఫాలర్ మొదలైన విమర్శకులు ప్రక్రియా విమర్శను దాని ప్రాధాన్యాన్ని, పద్ధతులను వివరించారు. తెలుగులో జి.వి.యస్  కృషి చేశారు. తెలుగులో ప్రక్రియా విమర్శ రెండు రకాలుగా జరిగింది.

1. ప్రక్రియను గుర్తించడానికి, లక్షణాలను ఏర్పరచడానికి ఈ పద్ధతి విమర్శకు కావలసిన మౌలిక సూత్రాలను అందించేది మొదటి పద్ధతి.
2. ఒక రచనను ప్రక్రియా దృష్టితో అనుశీలించి లక్షణాలను చెప్పే ప్రక్రియా వివేచన రెండవ పద్ధతిలోకి వస్తుంది. [65]

ప్రక్రియా విమర్శ కవులకు మార్గ దర్శకంగా, కావ్య లక్షణాలని ప్రతిపాదిస్తుంది. శాశ్వతమైన సాహిత్య ప్రమాణాలను నిర్దేశిస్తుంది.

---

[64] ఆంధ్ర సాహిత్య విమర్శ రీతులు 2004: పుట:221-222

[65] ఆంధ్ర సాహిత్య విమర్శ రీతులు 2004: పుట:226-229

**1.4.10. శైలీ విమర్శ**

దీన్ని ఆంగ్లంలో Stylistic criticism అని పిలుస్తారు. అద్యతన కాలంలో ప్రారంభమైన విమర్శనా రీతి శైలీ విమర్శ. రచనా శైలి నిరూపణకి ఈ విమర్శ ఉపయోగపడుతుంది. కవి భావంను అభివ్యక్తీకరించునది అతని కవితా శైలి. *''శైలిని నిరూపించటం రచయిత యొక్క అంతర్వ్యక్తిని ఆవిష్కరించటమే. అది యొక్క శాస్త్రం, ఒక కళ ఆ రెండింటిని మేళవించుకున్నది శైలి శాస్త్ర వివేచనం''*[66] శైలీ శాస్త్రం సంకేతాత్మకమైన, వ్యంగ్యాత్మకమైన కవిత్వ భాషను విశ్లేషించును. కవి భావాభివ్యక్తికి కావ్యంలోని భాష ఏ విధంగా ఉపయోగపడుతుందో భాషాశాస్త్ర పరంగా విశదీకరించును. *''అందులో ఎట్టి భాషా నమునాల (Linguistic patterns) వల్ల, వ్యూహాల వల్ల కథాశిల్ప విలువలు ఎలా ఆధారపడి యున్నాయో, అవి ఎలా ఏర్పడుతున్నాయో''*[67] అధ్యయనం చేయును.

తెలుగు సాహిత్యంలో నాయని కృష్ణ కుమారి, చేకూరి రామారావు, ఆధునిక కవులు, కవయిత్రులు పద ప్రయోగాలను, శైలీని వివేచించి శైలీ విమర్శకు దారి చూపారు. శైలీశాస్త్ర వివేచనకు ఆధారమైన గణాంక పద్ధతి గ్రంథ కర్తృత్వ నిరూపణకు తోడ్పడుతుంది. శైలీ విమర్శ పద్ధతికి స్పష్టమైన స్వరూపాన్ని ఏర్పరచిన ఏకైక గ్రంథంగా పేర్కొన తగినది పరిమి రామనరసింహం గారి ''ఆంధ్ర మహా భారత శైలీ పరిశీలనం'' (1996). శైలి విమర్శ కేవలం వ్యక్తిగతమైంది. ఆయా రచయితల గ్రంథాలలో శైలీ విమర్శ మనకు స్పష్టంగా కనిపిస్తుంది.

**1.4.11. ఆలంకారిక విమర్శ**

దీన్ని ఆంగ్లంలో Rhetorical Criticism అనీ, Deductive Criticism అని అంటారు. ఈ విమర్శ చాలా ప్రాచీనమైనది. అయినా ఈ విమర్శ ఆధునిక కాలంలో కూడా వ్యాప్తిలో ఉంది. కావ్య గుణాలను చక్కగా వెల్లడించడంలో ఈ విమర్శ ఎంతో నైపుణ్యాన్ని చూపిస్తుంది. లక్షణ గ్రంథాలలోని ప్రమాణాలకూ అనుగుణంగా కావ్య విమర్శ చేస్తే అది 'ఆలంకారిక విమర్శ' అవుతుంది. లక్ష్య లక్షణ సమన్వయంతో సంప్రదాయ మార్గంలో వచ్చే వ్యాఖ్యానాలు, శబ్ద సాధుత్వ చర్చలు ఛందో ఆలంకార విమర్శలు ఈ ఆలంకారిక విమర్శలోకి

[66] జి.వి. సుబ్రహ్మణ్యం, ఆంధ్ర మహా భారత శైలీ విమర్శ– మిత్ర వాక్యం

[67] వడలి మందేశ్వర రావు, ఆంధ్ర మహా భారత శైలీ విమర్శ–భాషా శాస్త్రజ్ఞుని సాహిత్య పాఠం

వస్తాయి. ఆలంకారం అంటే సౌందర్యం అని భామహుడు మొదలైన వాళ్ళు చెప్పటం వల్ల ఆలంకారిక విమర్శన సౌందర్య విమర్శ అని కూడా అంటారు. కావ్యంలోని ఛందస్సు, అలంకారాలు మొదలైనవన్ని వివరించటం అంటే ఆ కావ్య సౌందర్యానికి కారణమైన వాటిని వివరించటమే. అందువలన కూడా దీనిని సౌందర్యవిమర్శ అని కూడా అంటారు. అయితే ఆధునిక కాలంలో సౌందర్య శాస్త్ర విమర్శ అనేది ఒక ప్రత్యేక ప్రతిపత్తితో ముందుకు వస్తుంది. అందువలన దీనిని ప్రత్యేకంగా పరిగణించటం జరుగుతుంది.

### 1.4.12. సౌందర్య శాస్త్ర విమర్శ / కళా విమర్శ

ఒక గ్రంథాన్ని కళా దృష్టితో అంటే 'సౌందర్య దృక్పథ పద్ధతి'తో పరిశీలిస్తే 'సౌందర్య శాస్త్ర విమర్శ' అవుతుంది. సౌందర్యం పాఠకులకు ఆనందం కలిగిస్తుంది. ఆంగ్లంలో దీన్ని Aesthetic criticism అని పిలుస్తారు. ఈస్తటిక్స్‌ను మనం కళాతత్త్వ శాస్త్రమనీ, సౌందర్య శాస్త్రమనీ అంటున్నాం. '*నైతిక దృష్టితో కాక సౌందర్య దృష్టితో కావ్యమును పరిశీలించుట కళా విమర్శగా పరిగణింపబడుచున్నది.*[68] ఇది కళలకు సంబంధించిన మానవుని సంవేదనలను అధ్యయనం చేసే శాస్త్రం. మానవుడు కళల నుండి పొందుతున్న రసాస్వాదన గురించి ఈ శాస్త్రం చర్చిస్తుంది.

'కళాతత్త్వ శాస్త్రం అనే పదం Aesthesis అనే గ్రీక్ శబ్దం నుండి పుట్టింది. Aesthesis అంటే Sense perception ఇంద్రియాల వల్ల కలిగే అవగాహన. ఇది కళలను గురించీ, వానికి సహృదయుల ప్రతిస్పందనలనూ చర్చిస్తుంది. తొలినాళ్లలో ఇది తత్త్వ శాస్త్రానికీ ఒక అంగంగా ఉండేది. కళలలోని సౌందర్యాన్ని, దాని ప్రకాశాన్నీ (Manifestation) నూ చర్చించేది. నేటికీ అదే భావం ఉన్నా దీనికొక స్వతంత్ర ప్రతిపత్తి ఏర్పడింది. ఇది వివిధ మాధ్యమాలలోని కళలను విశ్లేషించి, పోల్చి వర్ణిస్తుంది. కళలు మానవునిలో కలిగించిన ప్రతిస్పందనలను, అనుభవాలను చర్చిస్తుంది'[69] 1750 నుండి ఈనాటి వరకు ఈ శాస్త్రం కళలకు సంబంధించిన అనేక ఆలోచనలను చేసింది. ఈ శాస్త్రానికి

[68] తెలుగులో సాహిత్య విమర్శ 1999: పుట:189

[69] సాహిత్య ప్రస్థానం – కొన్ని మజిలీలు 2002 పుట:01

ఆద్యుడైన బౌమ్ గార్టెన్ దీన్ని ఇంద్రియ చైతన్య శాస్త్రం అంటే, హెగెల్ లలిత కళలకు సంబంధించిన తత్త్వ శాస్త్రం అని అన్నాడు. ఆయన రాసిన గ్రంథం పేరే Philosophy of the art. ఆయన తర్వాతి వాళ్ళు దీన్ని పాకృతమైనది, కళాత్మకమైనది అయినప్పటికి సౌందర్యాన్ని విశ్లేషించి నిరూపించే శాస్త్రమన్నారు. అయితే నేటి కాలంలో దీన్నీ లలిత కళాతత్త్వ శాస్త్రంగానే గుర్తించారు. కె.సి.పాండే దీనికి స్వతంత్ర కళాశాస్త్రమని పేరు పెట్టారు.[70] కళాతత్త్వ శాస్త్రం ఈ పేర్లతో కాకుండా భారతదేశంలో అలంకార శాస్త్రంలో భాగంగా కొంత చర్చించబడింది.

కళతత్త్వ శాస్త్రం వివిధ మాధ్యమాలలోని కళలను విశ్లేషించి, పోల్చి వర్ణిస్తుంది. కళలు మానవునిలో కలుగించే ప్రతి స్పందనలనూ, అనుభవాలనూ చర్చిస్తుంది. ఇందులో లలిత కళలన్నింటి యొక్క తాత్త్వికాంశాల పైన మౌలికమైన చర్చ ఉంటుంది. ఏ ఒక కళకో అది పరిమితమై ఉండదు. ఈ శాస్త్రంలో చర్చించే విషయాలు మౌలికంగా అన్ని కళలకూ వర్తిస్తాయి. కావ్యంలో ప్రతిపాదించిన జీవిత విధానం విమర్శకుని అభిరుచికి అనుకూలంగా ఉండవలసిన అవసరం లేదని ఈ విమర్శకుల అభిప్రాయం. ''విజయవంతమగు కళా నిర్మాణము నందు సర్వ సామాగ్రి ఆకృతి యందే ఆంతర్లీనమగునని వీరి అభిప్రాయం''[71] కళను కళా దృష్టితోనే విమర్శించాలని మత సాంఘిక రాజకీయ నైతిక భావ వ్యక్తీకరణ సాధనముగా పరిగణించి విమర్శించ కూడదని వీరి సిద్ధాంత సారము. కవి ఆత్మీయతకును, కావ్యానికి గల సంబంధం గణనీయం కాదని ఒకప్పుడు కవి జీవిత విశేషాలు కావ్యంలో ప్రతిబింబించినా అవి యధాతథంగా వ్యక్తం కావని ఆ ప్రక్రియా సంబంధి సంప్రదాయ విశేషాలను బట్టి మార్పు చెందుతూ ఉంటాయని వీరి అభిప్రాయం.

సౌందర్య శాస్త్రాన్ని కళాతత్త్వ శాస్త్రం అని కూడా పిలుస్తున్నారు.[72] ముదిగొండ వీరభద్రయ్య 'కళాతత్త్వ శాస్త్రం – మౌలికాంశ వివేచన' పేరుతో ఒక పుస్తకం రాశారు. ఈ

---

[70] కళాతత్త్వ శాస్త్రం మౌలికాంశ వివేచన: 1993 పుట:02

[71] తెలుగులో సాహిత్య విమర్శ 1999: పుట:190

[72] కళాతత్త్వ శాస్త్రం – మౌలికాంశ వివేచన పుట:01 & 20వ శతాబ్ది విశ్వ సాహిత్య విమర్శ 1999: పుట: 74) & సంజీవ్ దేవ్ వ్యాసాలుI; 1990 ప్రస్థావన

పుస్తకంలో సౌందర్య శాస్త్రం గురించి విశ్లేషణాత్మక పరిచయం ఉంది. దానిని అనుసరించి మరికొన్ని అభిప్రాయాలతో సౌందర్య శాస్త్రం గురించి కింది విధంగా తెలుసుకోవచ్చు.

అందాన్ని – అది సహజము, స్వత స్సిద్ధము అయినా లేదా మానవ సృష్టే అయినా, చూసి దాని గుణ గణాలను విమర్శించటం, దానిని అనుశీలన చేయడం సౌందర్య శాస్త్రం అని పిలవడం జరుగుతుంది. ప్రాణికోటి అస్తిత్వానికి మూలం ఈ సౌందర్య భావనే! సౌందర్యాన్వేషణ ప్రతి మనిషిలో నిక్షిప్తమై ఉంటుంది. కళాతత్త్వ శాస్త్రం కళలకు సంబంధించిన మానవుని వేదనలను అధ్యయనం చేసే శాస్త్రం. ఒక విషయం యొక్క ప్రత్యేక క్షేత్రానికి సంబంధించిన విజ్ఞానాన్ని అధ్యయనం చేయడమే శాస్త్రం చేసే పని. సౌందర్య శాస్త్రం ప్రధానంగా సౌందర్యం గురించి వివేచిస్తుంది.

ఆస్‌బర్న్ చెప్పినట్లు *''తాత్త్విక శాస్త్రంలో సౌందర్యాన్ని గురించి మనం సుసంబద్ధంగా వ్రాసేటప్పుడు గాని, మట్లాడేటప్పుడు గాని ఏయే విషయాలపై నొక్కి చెప్పాలో వానిని గురించి పర్యాలోచించే భాగం సౌందర్య శాస్త్రం అని పిలవబడుతుంది. తర్క బద్ధంగా ఆలోచిస్తే కళాత్మకమైన సృజనలో సౌందర్య భావం అతి ముఖ్యమైన లక్షణం అని చూపడం, సౌందర్యానుభూతికి మూలమైన కొన్ని సూత్రాలను ప్రచురించడం దాని పని''* దీనినే సూక్ష్మంగా చెప్పాలంటే *''సౌందర్య శాస్త్రం తత్త్వ శాస్త్రంలో ఒక శాఖ. విజ్ఞాన సమాపార్జనే దాని ధ్యేయం. అంతే కాని అది ఆచరణ పద్ధతులను చూపే మార్గదర్శి మాత్రం కాదు.''* [73]

సౌందర్య శాస్త్రం ప్రారంభంలో తర్క శాస్త్రంలో భాగంగా ఉండేది. ఒక అంగంగా, శాఖగా ఉండేది. కళలలోని సౌందర్యాన్ని, దాన్ని ప్రకాశాన్ని (manifestation) చర్చించేది. నేటికీ అదే భావం ఉన్నా దీనికొక స్వతంత్ర ప్రతిపత్తి ఏర్పడింది. ఇది వివిధ మాధ్యమాలలోని కళలను విశ్లేషించి, పోల్చి వర్ణిస్తుంది. కళలు మానవునిలో కలిగించే ప్రతి స్పందనలనూ, అనుభవాలనూ సౌందర్య శాస్త్రం చర్చిస్తుంది.

ప్రాచీన కాలంలో సౌందర్య శాస్త్రం చర్చ భారతీయ కావ్య శాస్త్రంలో ప్రత్యక్షంగా జరగలేదు. కళాతత్త్వ శాస్త్రం పేరుతో అలంకార శాస్త్రంలో భాగంగా కొంత చర్చించబడింది.

[73] నాట్యకళ: డిశంబరు– 1968 పుట: 23

నాట్యకళను వివేచిస్తూ భరతుడు రాసిన ఈ కింది శ్లోకం ఈ విషయంలో ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.

*"నతత్ జ్ఞానం నతచ్ఛిల్పం నసా విద్యా నసాకలా*

*నసయోగో నతత్కర్మ నాట్యేస్మిన్ యన్నా-దృశ్యత్"*[74] అంటూ ప్రతీ కళ, ప్రతి విద్య, ప్రతి శిల్పం, నాట్యంలో ఉంటాయని భరతుడు పేర్కొనెను. ఆయన తన నాట్య శాస్త్రంలో నాట్యోత్పత్తి, నాట్య ప్రయోజనం, రస సిద్ధాంతం మొదలైన విషయాల మీద చర్చ జరుపుతూ లలిత కళల తత్త్వం గురించి వివేచన చేశాడు. భరతుని తర్వాత భారత ఆలంకారిక శాస్త్రంలో లలిత కళలపై విస్తృత ప్రాతిపదికపై జరగలేదు. భారతీయ కావ్య శాస్త్రం కళలను క్రియాత్మకమైనవిగా, విద్యలను జ్ఞానాత్మకంగా అభిప్రాయపడింది. భారతీయ కావ్య శాస్త్రాలలో అక్కడక్కడ ఉన్న సౌందర్యం, రామణీయకం, చమత్కారం, చాతురత, వక్రత, శోభ, విచ్ఛిత్తి ఇత్యాదుల వివేచన కళా రంగంలోని భారతీయుల సౌందర్య అధ్యయనాన్ని తెలుపుతున్నాయి.

*"కనిపించినదంతా సత్యం కానట్టే, కనిపించనిదంతా అసత్యం కానట్టే కనిపించే సౌందర్యం నుంచి కనిపించని సౌందర్యం వరకు, నశించే సౌందర్యం నుండి నాశనం లేని (అందం) సౌందర్యం వరకూ, అసమగ్రమైన అందం నుండి సమగ్రమైన అందం దాకా దృశ్యా దృశ్యము, భాసా భాసము అయిన చిదచిత్స్యాం దర్స దర్శనం వరకు కొనసాగిన అన్వేషణే భారతీయ సౌందర్య దర్శనము"*[75]

భారతదేశం కేవలం బయట చూపులకే సుందరమైంది కాదు. భారతదేశం యొక్క అంతరాత్మ బయటికి కనిపించే దానికన్నా కూడా సుందరమైనదని కె.ఎస్. రామస్వామి శాస్త్రి చెపూ్త భారతీయుల కళ, కళామీమాంసా శాస్త్రం వేల సంవత్సరాల చరిత్ర కలిగిందని అభిప్రాయ పడ్డారు. ….not only is outer India a home of beauty and romance but…. Inner India is even more fruely such a home. Indian

---

74 నాట్య శాస్త్రం: 15

75 విశ్వనాథ సౌందర్య దర్శనము: యు.ఎ. నరసింహ మూర్తి 2009 పుట:17

art and aesthetics have a history extending over thousands of years[76] అని దానికి సమర్ధకంగా వారు అభినవగుప్తుడు నిరూపించిన చారుత్వ ప్రతీతీని, రసమూ, ఆనందమూ అన్న వాటి మీద ఆలోచనలనూ ఆయన చూపారు. క్షేమేంద్రుని ఔచిత్య విచార చర్చ, భోజుడు విశ్లేషించిన షడ్విధ ఔచిత్యాలు (విషయ, వాచ్య, దేశ, సమయ, వక్తృ విషయ, అర్థౌచిత్యాలు) కేవలం రస నిష్పత్తికే కాకుండా లలిత కళలన్నింటికీ అన్వయం అవుతాయి. భారతీయ కళామీమాంసా శాస్త్రానికే ఇక్కడే అసలైన బీజం పడిందని చెప్పవచ్చు.

క్రీ.శ. 1729 లోని హరి ప్రసాదుని కావ్యాలోకం లోని *"విశిష్ట శబ్దరూపస్య కావ్యస్యాత్మా చమత్కృతి"* అన్న సిద్ధాంతం రస గంగాధరం లోని జగన్నాథరాయల యొక్క

*"రమణీయార్థ ప్రతిపాదక: శబ్ద కావ్యమ్*

*రమణీయతాదుల కోత్తరాహ్లాద జనక జ్ఞాన గోచరతా*

*లోకోత్తరత్వం చమత్కారా పరపర్యాయ:*

*అనుభవ సాక్షికో జాతి విశేష....."*

*సౌందర్యం చ చమత్కారాధాయ కత్వమ్*

*చమత్కృతి రానంద విశేష: సహృదయ హృదయ ప్రణాళిక"*[77] అన్న వివేచన కళామీమాంస కావ్య పక్షంలో నుండే అయినప్పటికీ భారతీయ కళామీమాంస ఎంత ప్రౌఢంగా జరిగిందో తెలుపుతున్నది. దీని బట్టి భారతీయ అలంకార శాస్త్ర మేధావులు కళామీమాంసను, కలల్లోని సౌందర్య వివేచనను గహనంగా, ప్రౌఢంగా చేశారని తెలుస్తుంది.

### 1.5. పాశ్చాత్య కళాతత్త్వ శాస్త్రం: వికాసం

పాశ్చాత్య దేశాలలో ఈ శాస్త్రం '*ఈస్తటిక్స్*' అనే పేరుతో ప్రసిద్ధమైనది. పాశ్చాత్య దేశాలలో ఈ శాస్త్రానికీ ప్లేటోతోనే అంకురార్పణం జరింగిందనుకోవచ్చు. ప్లేటో కవి కర్మ

[76] Indian Aesthetics– k.s. Rama Swamy Sastry 01

[77] Some concepts of Alankara Sastra: V. Raghavan 296

అంతా అనుకరణాత్మకమైనది అంటాడు. జగత్తులోని వస్తువులను చిత్రకారుడు రంగులతోనూ, రేఖలతోనూ తీర్చిదిద్దగా కవి దానినే శబ్ద మాధ్యమికం తోనూ, గాయకుడు నాద మాధ్యమికం తోనూ తీర్చిదిద్దుతాడు. అంటే 'అనుకరణ' అన్నది అన్ని కళనకూ సామాన్య ధర్మం అవుతుంది. ఈ అనుకరణ వల్ల కళలన్నీ ఒకే కుటుంబానికి చెందినవనీ సజాతీయమైనదనీ ప్లేటో తొలిసారిగా దర్శించాడు.

ప్లేటో కాలం నుండే కళాతత్త్వ శాస్త్రానికి సంబంధించిన విషయాలు చర్చించబడుతూనే ఉన్నాయి. ప్లేటో, అరిస్టాటిల్, హెగెల్, కాంట్, డిస్కార్టెస్, విల్ హెల్మ్, బేకన్, హాబ్స్, లెబనిజ్, షోపెన్ హోవర్, క్రోచీ ఇలా అనేక మంది పండితులు కాలానుగుణంగా ఈ శాస్త్రాన్ని చర్చిస్తూ వచ్చినా కళాతత్త్వ శాస్త్రానికి ఆద్యుడిగా జర్మన్ దేశస్థుడు అయిన[78] ను చెప్తారు. 1735 లో ఈయన రాసిన *"Reflection on poetry"* అనే గ్రంథంలో మొదటిసారిగా 'ఈస్తటిక్స్' శబ్దాన్ని ప్రయోగించాడు. కె.సె.పాండే  ఈ విషయాల గురించి తెలుపుతూ "*The word Aesthitics is borrowed from Greek, it is a modified form of the Greek word.", "which meant of or pertaing to things perceptible by senses, things material, as opposed to things thinkable or importable. It is the plural of "Aesthetic", used as collective singular it was used in its singular from 'aesthetic' by Baumgraten in his doctorate thesis for the first time as the name of special science in 1750 the brought out a voluminous treatise where in the world "Aesthetica" appeared as its title. According to Baumgratten 'aesthetic' was a science of sensitive cognition only"*[79]

''ఈ విధంగా బౌమ్‌గార్టెన్ ఈస్తటిక్ అంటే 'జ్ఞానేంద్రియ చైతన్య శాస్త్రమని పేర్కొన్నాడు. ఈ శాస్త్ర పరిధిలోకి మనస్సుకు తెలిపే వాస్తవాల కంటే ఇంద్రియాలకు అనుభూతమయ్యే

---

[78] Alexander Gottlief Baumgarten 1714-1762

[79] (Comparative of Aesthetics-ii 01)

వాస్తవాలు వస్తాయన్నాడు. ఇంద్రియ జ్ఞానం చేత పుట్టే అనుభూతి రమణీయమైన సత్యమనీ అది వ్యక్తి యొక్క చైతన్యంలోనే ఉంటుందని బౌమ్‌గార్టెన్ పేర్కొన్నారు.

బౌమ్‌గార్టెన్ Cognition అనే ఆంగ్ల శబ్దానికీ మూలమైన గ్రీకు శబ్దం AISTHESIS నుండి ఈ శాస్త్రానికి నామకరణం చేశాడు. తర్వాత ఈ AISTHESIS శబ్దమే AESTHETIC శబ్దంగా మారింది. బౌమ్‌గార్టెన్ మొదట ఈ శబ్దానే ప్రయోంగించాడు. తర్వాత చాలా కాలానికి 'S' అన్న వర్ణం చేరి AESTHETICS అనే శబ్దం వ్యాప్తిలోకి వచ్చింది. మొదట్లో ఈ శాస్త్రాన్ని తత్త్వ శాస్త్రంలో భాగంగా పరిగణించేవారు. గ్రీకు నాచురల్ ఫిలాసఫర్లు, పైథాగరియన్లు ఈ శాస్త్రాన్ని తత్త్వ శాస్త్రంలో భాగంగానే చూశారు. అరిస్టాటిల్ కాలానికి ఇది తత్త్వ శాస్త్రంలో భాగంగానే ఉంటూ ఒక ప్రత్యేక ప్రతిపత్తిని సంతరించుకుంది. తర్వాత క్రమంగా ఇది కావ్య శాస్త్రాన్నీ, కళల యొక్క తత్త్వాన్ని, సౌందర్యాన్ని అధ్యయనం చేసే శాస్త్రంగా పరిణామం చెందింది.

**1.6. సౌందర్య శాస్త్రం: నిర్వచనాలు**

బూదరాజు రాధాకృష్ణ గారి ఆధునిక వ్యవహార కోశంలో Aesthetics అంటే 'సౌందర్య శాస్త్రం, రసజ్ఞాన విద్య'గా పేర్కొన్నారు.[80] జి.యన్.రెడ్డి గారి ఇంగ్లీషు తెలుగు నిఘంటువులో AESTHETICS అంటే 'సుందర వస్తువుల యోగత్యను నిర్ణయించడానికి సంబంధించిన, సౌందర్య నిర్ణయం చెయ్య గల యోగ్యత గల ఉత్తమాభిరుచికి సంబంధించిన సూత్రాల ననుసరించి ఉన్నది' అని పేర్కొన్నారు.[81]

తెలుగు విశ్వ విద్యాలయం వారి లలిత కళా పదకోశంలో Aesthetic అంటే *'సౌందర్య తత్త్వ సంబంధం, సౌందర్య విషయిక; రసాత్మక'* అని అర్థానిచ్చారు. అదే పదకోశంలో Aestheticism అంటే 'సౌందర్య భావనా వాదము' అనే అర్థంలో 'కళ' అనేది స్వయంభూతమైన సత్తా కలిగింది అనీ, దానికి ఇతరమైన ధ్యేయమేదీ ఉండదనీ తెలిపే ఒక అతి మాత్రపు కళా వాదము. ఇదే చివరకు *'కళ కొరకే కళ'* అనే వాదానికి దారితీసింది. అనే

[80] బూదరాజు రాధాకృష్ణ: ఆధునిక వ్యవహార కోశం; ప్రాచీ పబ్లికేషన్స్, హైదరాబాదు: డిశంబర్ 2000; పుట:07
[81] ఇంగ్లీషు – తెలుగు నిఘంటువు: సం. ఆచార్య జి.యన్. రెడ్డి; తెలుగు అకాడమి: హైదరాబాదు 2001: పుట 19

అర్థాన్ని, AESTHETICS అంటే 'సౌందర్య మీమాంస' అనే అర్థంలో 'ఈస్తటిక్స్' అనేది గ్రీకు భాషా పదము. ఇంద్రియ వేద్యత అని దీని అర్థము. 18వ శతాబ్ధి మధ్య భాగంలో గాట్లీబ్ బోమ్ గార్టెన్ (1714–62) అనే పండితుడు, ఇంద్రియ వేద్యమయ్యే సౌందర్యాన్ని విశదీకరించే సిద్ధాంతవాదానికి ఈ పేరు ఉపయోగించారు. 1859 నాటికి ఇది రూఢతను అర్జించింది. పాశ్చాత్యులు లలిత కళలుగా ఆనాటికి గుర్తించిన సాహిత్యము, సంగీతము, చిత్ర లేఖనము, శిల్పము, వాస్తు విద్య, నాట్యము అనునవి ఆ సౌందర్యాన్ని స్ఫోరకం చేసేవిగా గుర్తించబడి, ఆ సౌందర్యాన్ని విశదీకరించే శాస్త్రానికి ఈ పేరు వచ్చింది. ఇది భారతీయుల 'రస' విచారానికి కొంత వరకు సన్నిహితం అని పేర్కొనెను.[82]

బ్రౌణ్య ఇంగ్లీషు – తెలుగు నిఘంటువులో AESTHETICS అంటే 'గోచరమైన, స్థూలమైన, దృష్టి గోచరమైన సావ్యమైన, శ్రవణ గోచర, దృష్టి గోచర' అని పేర్కొనెను.[83]

ఎస్. ఎస్. నళిని గారి సాహిత్య విమర్శ పదాల డిక్షనరీలో AESTHETICS అంటే 'కళా సౌందర్య వాదం, శుద్ధ కళావాదం, సౌందర్య శాస్త్రం' అని పేర్కొనెను. సౌందర్య శాస్త్రాన్ని 'సౌందర్య స్వభావాన్నీ, దృక్పథాన్నీ తాత్త్వికంగా నిర్ధారించే, అంచనా వేసే ప్రయత్నాన్నికి సంబంధించిన శాస్త్రం అని సాహిత్యానికి వస్తే, సాహిత్య సిద్ధాంతాలను రూపొందించి కళను గురించీ, కళాత్మక అభిరుచిని గురించి చర్చించడం జరుగుతుందని పేర్కొనెను.[84]

*''సంవేదనల తత్త్వ చింతనే సౌందర్య శాస్త్రం''* అని కాంట్ పేర్కొనెను.[85]

*''అభివ్యక్తి (Representative or imaginative) వ్యాపార శాస్త్రమే ఈస్తటిక్స్''* అని క్రోచీ పేర్కొనెను. *"Aesthetics is the Science of the expressive (Representative or imaginative) activity". "Aesthetics is the branch of*

---

[82] లలిత కళా పదకోశం: తెలుగు విశ్వ విద్యాలయం; హైదరాబాదు 1991: పుట 10

[83] (బ్రౌణ్య ఇంగ్లీషు – తెలుగు నిఘంటువు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం; హైదరాబాదు 2000 (ఐదవ ముద్రణ): పుట 10

[84] సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ: ఎస్. ఎస్. నళిని; రమేష్ పబ్లికేషన్స్; హైదరాబాదు: జనవరి 1999 పుట:196,221

[85] Comparative Aesthetic: K.C. Pandey; Page–294

*Knowledge which deals with the historically determined essence of human values, their creation perception, appreciation and assimilation"* [86] మానవ జీవితంలో అతడి ఇంద్రియాల ద్వారా నిరూపించే ఆస్వాదనకు, ముఖ్యంగా కళలను ఎలా ఆస్వాదిస్తున్నాడో, సౌందర్యాన్ని ఎలా అనుభవిస్తున్నాడో అధ్యయనం చేసే శాస్త్రమే కళాతత్త్వ శాస్త్రం అని పేర్కొనెను.

**1.7. సౌందర్యం యన్నిష్ఠం**

సౌందర్య శాస్త్రంలో సౌందర్యం ఉనికిని గూర్చి చర్చలు జరుగుతూనే ఉన్నాయి. సౌందర్యం వస్తువులో ఉందా? వ్యక్తి పరంగా ఉన్నదా? అన్న చర్చ. అయితే వస్తు పరంగా సౌందర్యం ఉన్నదని చెప్పినా అది వ్యక్తి అనుభవములోకి వచ్చినప్పుడు వెలుగును చూస్తుందనే కేవలం వస్తుగత సౌందర్యం, సౌందర్యం కాదనీ, వస్తుగత సౌందర్యానికి ప్రతిస్పందించినప్పుడే దానికి విలువ ఉంటుందనీ దాదాపు కళాతాత్త్వికులందరూ అంగీకరించారు. ఈ నేపథ్యంలో శ్రీనివాస్ నాలుగు రకాలైన చర్చలు చేశాడు.[87] అవి

1. వస్తు గుణంగా సౌందర్యం
2. ఆనందానుభూతిగా సౌందర్యం
3. ఆస్వాద ఆస్వాదక సంబంధంగా సౌందర్యం
4. ఉత్పాద్యంగా సౌందర్యం

భారతీయాలంకారికుల రస సిద్ధాంత చర్చ కూడా ఇట్లాంటిదే. రసము సామాజిక నిష్ఠమని చెప్పి అది కూడా జన్మ సంస్కార విశేషమని చెప్పటం ఇక్కడ గమనర్హాం భరతుడు

''*సవాతనానాం సభ్యానాం రసాస్యాస్వాదనం భవేత్*

*నిర్వాతవాస్తు రంగాంణ్ణ కాష్ఠకూడ్యాశ్మ సన్నిభ్గా*''[88]

[86] Aesthetics: yuri Borev 13

[87] కళాతత్త్వ శాస్త్రం: మౌలికాంశ వివేచన; ముదిగొండ వీరభద్రయ్య: పుట:03

[88] కళాతత్త్వ శాస్త్రం: మౌలికాంశ వివేచన; ముదిగొండ వీరభద్రయ్య: పుట:83

రసమన్నది జన్మ సంస్కార విశేషము. ఇది ప్రేక్షకునిలో లేకపోతే రంగంలోని గోడలతో, కొయ్యలతో సమానమని చెప్తున్నాడు. అంటే ఇత: పూర్వము రస స్పృహ అన్నది మనలో ఉన్నప్పుడు విభావాల ద్వారా అది వెలుపలకి వస్తుంది.

సౌందర్యమన్నది తనకు తెలియకుండానే అంతర్గతంగా ఉంటుందనీ ఆ సౌందర్యమే బాహ్యమైన వస్తువు ద్వారా వెలుగును చూస్తుందనీ మనం భావించవచ్చు. సౌందర్య అస్తిత్వాన్ని నిర్ధిష్టంగా చెప్పినది సంజీవ్‌దేవ్. ఆయన సౌందర్యాన్ని వ్యక్తిగతంగానూ, వస్తుగతంగానూ కూడా ఉంటుందని భావించాడు.[89] సౌందర్యం వ్యక్తిగతంగా ఉన్నప్పుడే దానిని వస్తువులో చూస్తామంటాడాయన. ''*నిజానికి ఈ జగత్తులో ఏ వస్తువులో కూడా వస్తుగత సౌందర్యమనేది లేదు. సౌందర్యం వ్యక్తిగతం గనుక అది రస దృష్టిలో మాత్రమే ఉంటుంది. సౌందర్యం వస్తుగత సత్యమే అయివుంటే సుందర వస్తువు ప్రతీవారికీ ఒకే రకమైన ఆనందాన్ని కలుగజేసేది. కానీ అదృష్టవ శాత్తు అది ఆ విధంగా కాకుండా ఉంది. ప్రతి వ్యక్తి సౌందర్యాన్ని గురించి తన సొంత అనుభవాన్ని కలిగి ఉంటాడు. ఒకరికి సుందరంగా గోచరించింది ఇంకొకరికి కురూపంగా గోచరించవచ్చు. అందుకని సౌందర్యం వస్తుగతం కాదు. వ్యక్తిగతం మాత్రమే. సౌందర్యం వస్తువులో కాక వ్యక్తి హృదయంలో మాత్రమే ఉంటుంది.*[90]

సౌందర్యమన్నది వస్తువులో ఉంటే ఒక వస్తువు అందరికీ సుందరంగా తట్టాలి. కానీ ఇట్లు జరగటం లేదు. కొందరికి సుందరంగా అనిపించిన వస్తువులు మరికొందరికి సుందరమని అనిపించటము లేదు. కాబట్టి సౌందర్యము వ్యక్తిలోనే ఉండాలని చెప్తున్నా సంజీవ్‌దేవ్ ప్రతి వ్యక్తి సౌందర్యాన్ని గురించి ఒక సొంత అనుభవాన్ని కలిగి ఉంటాడు అని చెప్తున్నాడు. అప్పుడు సౌందర్యం వస్తుగతం కావటానికి వీలులేదు.

సౌందర్యం సృష్టి అంతా వ్యాపించి ఉన్నా సౌందర్య దృష్టి అన్నది మనలో లేనప్పుడు ఆ సౌందర్యాన్ని మనము అనుభవించలేము. కాబట్టి ఆ సౌందర్యాన్ని అనుభవించ గల రసదృష్టి

[89] సంజీవ్‌దేవ్: సంజీవ్ వ్యాసావళి; పుట: 18

[90] సంజీవ్‌దేవ్: సంజీవ్ వ్యాసావళి; పుట: 18

మనలో ఉండాలి. ఇదే మాట శ్రీ అరవిందులు అంటున్నారు. *"సౌందర్యాన్ని విశ్వాత్మ సృష్టించింది. దానికి వ్యక్తులు ప్రతిస్పందించే తీరే సౌందర్యం"*

సౌందర్యం వ్యక్తిగత సత్యమే అయినా దానికి ఓ వెలుగు నివ్వాలంటే తప్పని సరిగా ఒక రూపాన్నో, ఒక వస్తువునో ఆలంబనగా తీసుకోవలసిందే కానీ అంతమాత్రమున సౌందర్యం వస్తుగత సత్యం అయిపోదు. ఇదే మాటలను విశ్వనాథ సత్యనారాయణ ఇలా పేర్కొన్నారు *"రసమనగా నేమి? లోకమునకు సంబంధించినది. వట్టి మనోవృత్తి జన్యమైనది. దాని యందు భావ స్పర్శయే కాని వ్యక్తి స్పర్శ లేదు."*[91] సౌందర్య అస్తిత్వం మీద ఇట్లాంటి వివేచననే కాంట్ అందించాడు. కాంట్ తన వివేచనలో రూపానికెంతో ప్రాధాన్యతనిస్తాడు. కానీ రూపం అన్నది వస్తువుకు సంబంధించినది కాదని రూపమెప్పుడూ కళాకారుని తీర్పు నుండీ వస్తుందనీ చెప్పాడు.[92] సౌందర్యాన్ని అనుభవించే వేళలో తప్పనిసరిగా వస్తువన్నది ఆలంబనగా ఉంటుంది. కానీ ఆ వస్తువే సౌందర్యం కాదు ఆ వస్తువు ఆధారంగా మనం సౌందర్యాన్ని ఆస్వాదిస్తాం. ఒక విశిష్ఠ స్థితిలో ఆ వస్తువు తన ఉనికిని కోల్పోతుంది.

*వస్తుగతం సౌందర్యం నశింపును పొందుతుందనీ వ్యక్తిగత సౌందర్యము శాశ్వత సత్యమనీ సంజీవ్‌దేవ్ వివేచన[93] వస్తువులో ఉండేది సుందరమనీ, అది అనుభవింపబడినప్పుడు సౌందర్యమవుతుందనీ సుందరం నశిస్తుంది కానీ సౌందర్యం నశించదనీ చెప్తాడు సంజీవ్‌దేవ్.[94]*

**1.8. తెలుగులో సౌందర్య శాస్త్ర విమర్శ - విమర్శకుల పరిచయం**

తెలుగు కళాతాత్త్వికులలో కళల గురించి, కళల మౌలిక తత్త్వాన్ని గురించి కేవలం కళా తాత్త్వికులే కాకుండా కవులు కూడా వారి కావ్యాలలో వివేచన చేశారు. వీరు కళా తత్త్వాన్ని కవిత్వమయంగా వ్యక్తీకరించారు. అయితే వీరి లక్షణాలు కవిత్వమయంగా ఉండటం విశేషం.

---

91 విశ్వనాథ: కావ్యానందం; పుట: 127

92 కళాతత్త్వ శాస్త్రం: మౌలికాంశ వివేచన; ముదిగొండ వీరభద్రయ్య: పుట:22

93 సంజీవ్‌దేవ్: సంజీవ్ వ్యాసావళి; పుట: 07

94 సంజీవ్‌దేవ్: సంజీవ్ వ్యాసావళి; పుట: 07

ఆధునిక రీతిలో సౌందర్యాన్ని వివేచించిన వారిలో కొందరు సౌందర్య శాస్త్రాన్ని పరిచయం చేస్తే కొందరు తులనాత్మకంగా వివేచించారు. వారిలో ఈ కింది వారు ప్రసిద్ధులు.

పురాణం సూరిశాస్త్రి, బసవరాజు అప్పారావు, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ, *కొండూరి వీర రాఘవ వ్యాసావళి,* కొండూరి వీర రాఘవా చార్యులు, విశ్వనాథ సత్యనారాయణ, గుంటూరు శేషేంద్ర శర్మ, పింగళి లక్ష్మీకాంతం, తుమ్మపూడి కోటేశ్వరరావు, సంజీవ్‌దేవ్, జి.వి. సుబ్రహ్మణ్యం, కొండపర్తి శేషగిరి, ముదిగొండ వీరభద్రయ్య, వడలి మందేశ్వరరావు, వీరితో పాటు కోవెల సంపత్కుమారాచార్య, సుప్రసన్నాచారి, రాంభట్ల కృష్ణమూర్తి, దువ్వూరి రామిరెడ్డి, బుచ్చిబాబు మొదలైన వారు తమ గ్రంథాలలో ఈ శాస్త్ర సంబంధ వివేచన చేశారు. ఇంకా శ్రీశ్రీ, చలం, సూర్యసాగర్, వాడ్రేవు చినవీరభద్రుడు, బాలగోపాల్, జి. లక్ష్మీనరసయ్య, ఎండ్లూరి సుధాకర్, కొలకలూరి మధుజ్యోతి, శిఖామణి, సతీష్ చందర్ మొదలైన వారి రచనలలో కూడా కళాతత్త్వ శాస్త్రానికి సంబంధించిన అంశాలున్నాయి.

తెలుగులో కళాతత్త్వ శాస్త్ర దృక్కోణంతో వివేచించిన వారిలో మొదటి వ్యక్తి పురాణం సూరిశాస్త్రి. ఆయన 1925 వ సంవత్సరంలోనే 'విమర్శక పారిజాతము' అనే గ్రంథాన్ని రాశారు. ఇందులో 'కళా రహస్యం' అనే అధ్యయనం పూర్తిగా కళాతత్త్వ శాస్త్రానికి సంబంధించినది.

1926వ సంవత్సరంలో శ్రీ బసవరాజు అప్పారావు 'ఆంధ్ర కవిత్వ చరిత్రము' రాశారు. ఈ గ్రంథంలో కూడా కళాతత్త్వ శాస్త్ర అంశాలపై వివేచన జరిగింది. తన వివేచనలో ఆయన చిత్ర శిల్ప కళా విషయాలను కూడా అక్కడక్కడా ప్రస్తావించారు. వీరి ఇరువురి వివేచన సాహిత్య ప్రధానంగానే కొనసాగింది. వీరితో పాటు కళా సౌందర్యాన్ని సాహిత్యపరంగా వివరించిన వారి కృషిని పేర్కొనదగినది.

వీరందరిని పరిచయం చేసేముందు భారతీయ, పాశ్చాత్య సౌందర్య దృక్పథంలోని ముఖ్యాంశాలని రాబోయే అధ్యాయంలో తెలుసుకుందాం.

రెండవ అధ్యాయం

# భారతీయ, పాశ్చాత్య సౌందర్యశాస్త్ర సిద్ధాంతాలు

రెండవ అధ్యాయం

# భారతీయ, పాశ్చాత్య సౌందర్యశాస్త్ర సిద్ధాంతాలు

**2.0. ఉపోద్ఘాతం**

ఈ అధ్యాయంలో భారతీయ, పాశ్చాత్య సౌందర్యశాస్త్ర సిద్ధాంతాలను వివరించి, వాటిని తెలుగు సౌందర్య శాస్త్ర విమర్శకుల భావాలతో సమన్వయించడానికి వీలుగా ఈ అధ్యాయాన్ని వివరిస్తున్నాను.

'*కనిపించినదంతా సత్యమూ కానట్టే, కనిపించనిదంతా అబద్ధమూ కానట్టే. కనిపించే అందం నుండి కనిపించని అందం వరకూ, నశించే అందం నుండి నాశనం లేని అందం వరకూ, అసమగ్రమైన అందం నుండి సమగ్రమైన అందం వరకూ దృశ్యాదృశ్యము, భాసాభాసము అయిన చిదచిత్సౌందర్య దర్శనం వరకు కొనసాగిన అన్వేషణే భారతీయ సౌందర్య దర్శనము.*'[1] అని భారతీయ కళాతత్త్వ వేత్తల అభిప్రాయం.

కళాతత్త్వ శాస్త్రం ఎప్పుడు, ఎక్కడ, ఎలా ఆరంభమైందో తెలపటం చాల కష్టం. ఎందుకంటే కళాతత్త్వ శాస్త్రానికి, భాషకి, మనిషికి, ప్రకృతికి ఒక అవినాభావ సంబంధం ఉంది. మనిషి భాష నేర్చినప్పటి నుంచి ఇంకా చెప్పాలంటే ఆలోచన నేర్చినప్పటి నుంచీ ప్రకృతిని ఆరాధించటం నేర్చాడు.తన మెదడులో ఏర్పడిన భావ సంచలనాన్ని వ్యక్తీకరించడానికి సరైన భాష అందుబాటులో లేకపోయినప్పటికీ చిత్ర లేఖనాల ద్వారా అనేక వివిధ పద్ధతుల ద్వారా ఎప్పుడు దానిని ప్రకటించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. ప్రకృతి పుట్టుక ఎలాగైతే అనిశ్చితమో, భాష పుట్టుక మరియు భావ వ్యక్తీకరణ రెండూ కూడా అనిశ్చితంగానే ఉన్నాయి. మన పూర్వీకులు చెప్పిన 64 కళలలో భావ వ్యక్తీకరణ కూడా ఒక కళే. అసలు నిజానికి భావ వ్యక్తీకరణే కళకు ఆద్యమని కూడా చెప్పవచ్చు. ఈ విధంగా కళ దాని అధ్యయనం అన్నీ కొన్ని వేల సంవత్సరాలుగా నిరంతరం కొనసాగుతున్న ప్రక్రియ. వైదిక వాఙ్మయంలోను, లౌకిక వాఙ్మయం లోను ప్రాచీన భారతీయ కవులు ప్రకృతిని, సమస్త చరాచర సృష్టిని ప్రతీకలుగా

---

1 నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:17

గ్రహించి  ఆ ప్రతీక ముఖంగా దివ్యము, అనశ్వరము, అనంతము అయిన సౌందర్యాన్ని దర్శించారు.[2]

''సౌందర్యం అంటే ఏమిటి? సౌందర్య సిద్ధికి మూల కారణాలను వివరించడానికి ప్రాచీన భారతీయులు ప్రగాఢము, సుదీర్ఘము అయిన తత్త్వ విచారాన్ని కొనసాగించారు. వారి సౌందర్య తత్త్వ నిరూపణలో వేల సంవత్సరాలుగా ఒక అనుస్యూతము, క్రమ బద్ధమూ అయిన పరిణతి కనిపిస్తుంది. ''ఏక సత్ విప్రాః బహుధా వదంతి'' అన్న న్యాయాన్ననుసరించి ఈ సౌందర్య తత్త్వ గవేషణ బహుముఖంగా కొనసాగినా ఒకే చరమ లక్ష్యాన్ని ఎంచుకొన్నది. కావ్యానికి ఆత్మ ఏది? అన్న మీమాంసకు పూనుకొన్న వామనుడు. దండి, భామహుడు గుణాలంకార రీతి సంప్రదాయాలను ప్రవర్తింపజేసి ప్రధానంగా కావ్యగత బహిరంగ సౌందర్య నిరూపణ పరమైన తత్త్వాన్వేషణను కొనసాగించారు. ధ్వని, వక్రోక్తి, ఔచిత్య సంప్రదాయ ప్రవర్తకులైన ఆనందవర్ధనుడు, కుంతకుడు, క్షేమేంద్రుడు కావ్యగతమైన బహిరంగ సౌందర్యమంతా తదాత్మ గతమైన అంతరంగ సౌందర్య ప్రకాశన ప్రధానమైన లక్ష్యంతో ఉండదగినదని నిరూపించారు.''[3]

మానవుని జీవన విధానమే సౌందర్యం. ఎందుకంటే ఆదిమ మానవుడి నుండి నేటి వరకూ ప్రకృతి నుండి మానవుడు పాఠం నేర్చుకున్నాడు. తన అవసరాలకు అనుగుణమైన జీవితాన్ని ఏర్పరుచుకున్నాడు. ఆ జీవితంలో ఆహార సేకరణ దానిని తినటంలో, భద్రపరుచుకోవటంలో అనుభవపూర్వక జ్ఞానాన్ని సాధించాడు. అలాగే ప్రకృతి నుండి రక్షించుకోవడానికి నివాసాలను ఏర్పరుచుకున్నాడు. ఇలా దశల వారిగా, ఆహారన్వేషణ, నివాసం, వినోదం మొదలైన దశలలో మానవుడు నిరంతర ప్రయత్నంతో జీవితాన్ని సౌందర్యమయం చేసుకున్నాడు. అందువల్ల సౌందర్యాన్ని శాస్త్రీయంగా ఫలానా కాలం నుండే ప్రమాణాలను నిర్ణయించారని చెప్పడం కుదరదని తెలుస్తుంది. అయినప్పటికి లభించిన ఆధారాలను బట్టి వాటిని వివరించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఈ భావనలు, సిద్ధాంతాలను ప్రధానంగా రెండు విభాగాలుగా చేసుకొని పరిశీలించవచ్చు.

---

2 నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:21)

3  నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:18

1. భారతీయ కళాతత్త్వ సిద్ధాంతాలు, 2. భారతీయేతర కళాతత్త్వ సిద్ధాంతాలు. వీటినే భారతీయ, పాశ్చాత్య సౌందర్య సిద్ధాంతాలుగా చెప్పారు. అందువల్ల భారతీయ, పాశ్చాత్య సౌందర్య శాస్త్ర సిద్ధాంతాలుగా వీటిని విభజించి పరిశీలిస్తున్నాను.

### 2.1. భారతీయ సౌందర్యశాస్త్ర సిద్ధాంతాలు

భారతీయ ఆలంకారికులలో మొదటివాడు ఎవరనే విషయంలో కొంత వివాదం ఉంది. ఆచార్య పుల్లెల శ్రీరామ చంద్రుడు ఈ విషయాన్ని ఆలంకార శాస్త్ర చరిత్రలో ప్రస్థావిస్తూ  రాజశేఖరుడు కావ్య మీమాంసలో భరతుడితో పాటు 21మందిని ప్రస్తావించాడని, కాని లభిస్తున్న ఆధారాలు ప్రకారం నాట్యశాస్త్రం రాసిన భరతుడినే మొదటి భారతీయ ఆలంకారికునిగా గుర్తిస్తున్నారని వివరించారు.

### 2.1.1. భరతుడు

వాల్మీకి ఆది కవి, కవిత్వ సాంప్రదాయానికి ఆద్యుడైతే సాంప్రదాయకంగా భరతుడు నాటక శాస్త్ర పితామహుడు. ఈయన నాట్య శాస్త్రం ఆశ్వ ఘోషుడు, భాసుడి (క్రీ.శ. 250) సమయాల కంటే ముందుదని తెలుస్తుంది. పతంజలి సౌందర్య శాస్త్ర పదంగా విశదీకరించిన 'రస' అన్న పదం ఈయన ఉపయోగించినదే. క్రీ.శ. 150 రుద్రదాముని శాసనంలో ఆయన మిగతా వాటితో పాటు గాంధర్వం లేదా సంగీతం ఒక ప్రత్యేక విద్య లేదా ప్రత్యేక శాఖగా దాని సౌందర్య శాస్త్ర లక్షణాలైన గుణాలు (లక్షణాలు), అలంకారాలు లేదా భాషా రూపాలను కలిగి ఉంటుందని తెలిపాడు.

భరతుడి 'రస' సిద్ధాంతం సౌందర్య శాస్త్రానికి ఆయన ఇచ్చిన గొప్ప నివేదనగా భావించవచ్చు. భరతుని ఉద్దేశ్యం విశ్లేషణలో కళ లేదా జీవితపు ముడిసరుకు మానవుని మానసిక ప్రపంచం, ఇది అన్నివేళలా భావనలు, ఉద్వేగాలు, మానసిక స్థితులతో నిండి ఉండి అతన్ని నడిపిస్తూ ఉంటుంది. కానీ నిజ జీవిత భావనలు కళాత్మకంగా ఉండవు. జీవితంలో మానసిక స్థితులు తమదైన శైలిలో సుఖ దుఖాలను కలిగి ఉంటాయి. ఒక కళాకారుడు వాటిని చూసినపుడు వాటిని ఒక శైలిలో తన ఊహని జోడించి పెట్టి భూమి మీద ఉండని విధంగా నడిపిస్తాడు. కేవలం ఈ శైలీకృత మానసిక స్థితులు, ఊహాత్మక, సృష్టి మేధావితనపు

నియమాలను అనుగుణంగా నడిచేవి మాత్రమే శాస్త్రీయంగా భావాలుగా పిలువబడతాయి. సృష్ట్యాత్మక ఊహా ప్రక్రియ భావనగా పిలువబడుతుంది. ఇది కళాత్మక సునిశితత్వానికి ఉదాహరణ[4]

భరతుని తరువాత పేర్కొనదగిన ఆలంకారికులలో భామహుడు మరొకడు.

### 2.1.2. భామహుడు

సౌందర్యం అలంకారం అనీ, అందం లేని పదార్థం అందమైన దానితో కలిస్తే అందంగా కనిపించడానికి ఆశ్రయం సౌందర్యమన్నాడు భామహుడు.[5] భామహుడు తత్త్వశాస్త్ర మేధావి. ముఖ్యంగా దిన్నగుని బౌద్ధ తత్త్వం. (క్రీ.శ. 500). ఈయన పాణిని అతని వ్యాకరణ విశ్లేషణకి ఆరాధకుడు. దండికి పూర్వికుడు. ఈయన కవిత్వపు ముఖ్య అంశాల విశ్లేషణలను అందరూ అంగీకరించారు. ఆనంద వర్ధనంలో కూడా భామహుడి విశ్లేషణల ప్రస్తావన ఉంది. అభినవగుప్తుడు మరియు మమ్మటుని ఈయనకి సంస్కృత కవిత్వ శాస్త్రపు అలంకార 'ప్రస్థాన లేదా అలంకార శాస్త్ర పితామహునిగా అభివర్ణిస్తారు. భామహుడు కావ్యం లేదా కవిత్వంలో అలంకార లేదా సౌందర్య భావనలకి సంబంధించి నియమాలని రూపొందించాడు. ఈయన ఉద్దేశ్యం ప్రకారం మంచి కవిత్వం కళ మరియు జీవితంలో సంతోషం, పేరుతో పాటు మంచి విలువలని అందిస్తుంది. సౌందర్య శాస్త్ర పరిశోధకునిగా మనకి ఆసక్తి కలిగించే అంశం భామహుడి 'అలంకార' సిద్ధాంతం. భామహుడు రెండు రకాల సౌందర్యాన్ని గుర్తించాడు. అవి సహజ సౌందర్యం, కవిత్వ సౌందర్యం. ఈయన 'శబ్దాలంకారం' మరియు 'అర్థాలంకారం' భాదాల మీద విస్తృత కార్యం చేశారు. ఈయన 'వక్రోక్తి'కి పెద్ద పీట వేశారు.

భామహుని తరువాత పేర్కొనదగిన ఆలంకారికులలో దండి మరొకడు.

### 2.1.3. దండి

సంస్కృతంలో గద్య కావ్య ప్రముఖ రచయితలైన ముగ్గురిలో దండి ఒకడు. ఇతని మూడు రచనలు ప్రసిద్ధి చెందినవి. అవి 1. దశ కుమార చరిత్ర 2. కావ్య దర్శనం 3. అవంతి

4 . cultural leaders of India Aestheticians P.No. 6

5 నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:40

సుందరి కథ. కావ్యానికి సరైన నిర్వచనం చేసిన వారిలో ప్రథముడు దండి. ఈయన కావ్యంలో రెండు ప్రధానాంశాలను గుర్తించాడు. 'శబ్ధ', 'అర్థ' ఈయన కావ్య శరీరాన్ని "A series of words characterized by agreeable or desired meaning" (**शरीरं तावदिष्टार्थव्यवच्छिन्ना पदावली**)[6] గా వివరించాడు. ఈ పదావళి లేదా వాక్యం అనేక రకాల కవిత్వ శైలీలతో లేదా అలంకారాలతో వాటి సరైన ఉదాహరణలతో వివరించబడింది. ఈయన అలంకారాల పరిశీలనలో భామహుడు కంటే నిజ శైలిని ప్రదర్శించినప్పటికీ వక్రోక్తిని గౌరవించాడు. ఈయన ఉద్దేశ్యంలో అలంకారాలు కావ్యానికి అందాన్ని ఆపాదిస్తే రసాలు కవిత్వానికి తీయదనాన్ని చేకూరుస్తాయి. చివరిగా దండి తన అనుయాములలతో 'రీతి' గా విశదీకరించబడిన 'మార్గ' సిద్ధాంతానికి పునాది వేసిన వారిలో ఒకడిగా మనం చెప్పుకోవచ్చు.

అవంతి సుందరి కథ దండి వ్యక్తిగత జీవిత చరిత్ర గురించి కొన్ని విషయాలను తెలుపుతుంది.

దండి తరువాత పేర్కొనదగిన ఆలంకారికులలో ఆనందవర్ధనుడు మరొకడు.

### 2.1.4. ఆనందవర్ధనుడు

కావ్య కళా సౌందర్యాన్ని అనితర సాధ్యమైన రీతిలో సిద్ధాంత బద్ధం చేసి ధ్వని సంప్రదాయాన్ని అధునాతన కళాతత్త్వ శాస్త్రజ్ఞుల శిరఃకంపానికి కారకమైన దానిగా రూపొందించి సౌందర్య శిఖరారోహణం చేసినవాడు ఆనందవర్ధనాచార్యులు.[7]

భారతీయ అలంకారికులలో ఆనందవర్ధనుడు అగ్రగణ్యుడని చెప్పటంలో ప్రాచీన అలంకారికులలో కానీ ఆధునిక అలంకారికులలో కానీ ఎటువంటి సందేహం లేదు. ఈయన వల్లనే ఈయన మాతృ భూమి కాశ్మీరం శారద దేశంగా పిలువబడింది. ఈయన సర్వోత్కృష్ట రచన 'ధ్వన్యాలోకం' కవిత్వ సౌందర్యాని ధృక్కోణాన్ని చూపింది. ఇది సౌందర్య శాస్త్రానికి

---

6 kavyadarsa 1, 10

7 నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:21

సంబంధించినంత వరకూ ప్రాచీన విమర్శా వాదానికి మరియు ఆధునిక విమర్శా వాదానికి మధ్య ఒక పెద్ద అంతరాన్ని తీసుకోవచ్చి విమర్శకుల దృష్టికోణాన్ని మార్చివేసింది.

ఆనందవర్ధనుడి ప్రకారం నిజమైన కవి మరియు ఉదాత్త విమర్శకుడు సాధారణంగా ఒకే సామాన్య అంశాన్ని కలిగి ఉంటారు. అది ప్రతిభ (కల్పన) లేదా ఆలంకారిక సామర్థ్యం. ఉదాత్త విమర్శకుడిని సహృదయ లేదా రసికుడు అంటారు. కవి కవిత్వాన్ని రచిస్తే విమర్శకుడు దానిని తన కల్పనలో పున్న సృష్టించి ఆనందిస్తాడు. అందువలన మంచి అభిరుచి కలవారు మాత్రమే కవిత్వాన్ని అర్థం చేసుకొని, విశ్లేషించి ఆనందిస్తారని ఇందులో ముఖ్యంగా కళాత్మక సౌందర్యం గురించి మాట్లాడటంలో తాత్వికులకి ఎలాంటి స్థానం లేదని ఆనందవర్ధనుని అభిప్రాయం. అందుకే ధ్వన్యలోకంకు మరోపేరు సహృదయలోకం అని వచ్చింది.

ఆనందవర్ధనుడు తన సిద్ధాంతమంతా రసం ఏ విధంగా అలంకారం లేదా గుణం లేదా మిగతా ఇతర కవిత్వ సౌందర్యానికి సంబంధించి ఉండదో, అది అంతర్గతంగా ఏ విధంగా కవి యొక్క కల్పనని ఆస్వాదించవచ్చో తెలుపుతుంది. ఆనందవర్ధనుడు రసం గురించే కాక వస్తు మరియు అలంకారాల గురించి కూడా ప్రస్తావించాడు. ఈయన వస్తు ధ్వని, రస'ధ్వని, అలంకార 'ధ్వనుల గురించి వివరించాడు. ఆనందవర్ధనుడు తన ధ్వన్యాలోకంలో అభిరుచికి అనుగుణంగానే సౌందర్యావిష్కారం జరుగుతుందని పేర్కొన్నాడు. కవిత్వ నిర్ణయానికి సంబంధించిన రసం ఔచిత్య రసమేనని ఆనందవర్ధనుడు తెలిపారు. ఈయన వ్యాకరణం, తత్త్వ మొదలైన వాటి ప్రభావం నుండి సౌందర్య శాస్త్రాన్ని వేరు చేయడమే కాక రసాభాస కూడా సౌందర్య శాస్త్ర పరిధిలో ఒక రసమేనని నిరూపించారు. చివరిగా ఆనందవర్ధనుడు సౌందర్య శాస్త్రాన్ని ఒక శాస్త్రంగా పూర్తి విశ్లేషణలతో ఇప్పటికీ అందరికీ ఆసక్తిని కలిగించే విధంగా తీర్చిదిద్దిన ఆచార్యుడు అని మనం చెప్పవచ్చు.

ఆనందవర్ధనుడు తరువాత పేర్కొనదగిన ఆలంకారికులలో వామనుడు మరొకడు.

### 2.1.5. వామనుడు

వామనుడు సౌందర్యమే అలంకారమన్నాడు.[8] అలంకార శాస్త్రంలో తగినన్నీ పరిశోధనలు చేసిన రచయితలలో వామనుడు ఒకడు. వామనుడు తన రచన కావ్యాలంకార సూత్రాలలో వ్యాఖ్యాలతో పాటు తన పూర్వపు కవులైన మఘుడు మరియు భవభూతుల రచనల నుంచి ఉదాహరణలు తీసుకొని విశదీకరించాడు. తన రచనలను అధికరణాలు, అధ్యాయాలుగా రచించాడు. ఈయన మొత్తం 317 సూత్రాలతో తన రచన చేశాడు.

ఈయన కవిత్వ శైలి (రీతి)కి అధిక ప్రాధాన్యతనిచ్చారు. మొదటి అధికరణం 'శరీర'లో కవిత్వ శాస్త్ర అధ్యయన ప్రాముఖ్యత, దాని లక్షణాలు, కవి లక్షణాలను గురించి చర్చించారు. వామనుడు తన మొదటి సూత్రంలో కవిత్వం దాని అలంకారాల వలన గుర్తింపబడుతుందని తెలిపాడు. రీతిని వామన కవిత్వపు ఆత్మగా అభివర్ణించాడు. ఈయన రీతిని మూడు రకాలుగా విభజించాడు. అవి1. వైదర్భి, 2. గౌడి, 3. పాంచాల.

"వామనాచార్యుడు మొదట 'కావ్యం గ్రాహ్యమలంకారాత్, సౌందర్య మలంకారః సదోష గుణాలంకార హానాదానాభ్యామ్' అనే సూత్రాల ద్వారా సౌందర్యమే కావ్యోపాదేయతకు మూలమని 'ఆ సౌందర్యం సాధించడానికి సాధనాలు – ప్రయోజకాలు – దోషాలు విడిచి గుణాలంకారాలు పరిగ్రహించడం' అని సూక్ష్మంగా ప్రతిపాదించాడు. ఇక్కడ సౌందర్య శబ్దాన్ని విస్తృతమైన పరిధిలో అర్థం చేసుకోవలసి ఉంది. దీని వల్ల సౌందర్య దర్శనమే సాహిత్య శాస్త్ర పరమ లక్ష్యమని తేలింది."[9]

గుణాలు అలంకారాల వలే కవిత్వానికి అదనపు ఆకర్షణలు అన్న అంశాన్ని వామనుడు అంగీకరించాడు. అతని ఉద్దేశ్యంలో గుణాలు అంతర్గతంగా కవిత్వానికి విలక్షణ ఆకర్షణని అందిస్తాయి గనుక అవి అత్యావాశ్యకమని అలంకారాలు కవిత్వానికి అదనపు ఆకర్షణలు ఆపాదించటం వలన అవి అవసరం లేవని అవి స్వాభావికంగా అందమైన అమ్మాయికి నగలు ఎలా అదనపు ఆకర్షణని అందిస్తాయో అలానే ఇవి కూడా అని చెప్పాడు.

---

8 నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:39

9 నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:18

అలంకారాలలో ఈయన శబ్దార్థాలంకారాలు రెండింటికీ సమ ప్రాధాన్యమిస్తూ ముఖ్యంగా యమక మరియు అనుప్రాసాలను బహుళంగా చర్చించాడు.[10] సౌందర్య శాస్త్ర రీతిలో కవిత్వపు విశ్లేషణ చేసిన వారిలో ముఖ్యుడు వామనుడు.

వామనుడు తరువాత పేర్కొనదగిన ఆలంకారికులలో రాజశేఖరుడు మరొకడు.

**2.1.6. రాజశేఖరుడు**

రాజశేఖరుడు కవి, నాటక రచయిత మరియు అలంకారికుడు. రాజశేఖరుడికి ముందు అనేక మంది కవులు వారి కవిత్వ ప్రతిభకి ప్రసిద్ధి చెందినప్పటికీ రాజశేఖరుడు కేవలం నలుగురి గురించి మాత్రమే ఉల్లేఖించాడు. వారు అకలజలముడు, సురనందుడు, తరళుడు మరియు కవిరాజుడు. రాజశేఖరుడు తన రచనలలో తన గురించిన సమాచారిన్ని తెలియజేశాడు. ఇతని తండ్రి దుహికుడు. ఇతని తల్లి శీలవతి. రాజశేఖరుడు తనని తాను యయావరుడిగా పరిచయం చేసుకున్నాడు. రాజశేఖరుడు (బ్రాహ్మణుడు) చౌహన్ వంశానికి చెందిన ఒక క్షత్రియ కన్య అయిన అవంతి సుందరిని వివాహమాడాడు. రాజశేఖరుడు తన మొదటి రచన అయిన బాల రామాయణంలో ఇతను ముందే ఆరు ప్రబంధాలు రచించినట్టు ఉల్లేఖించాడు. కానీ ఇవి లభ్యం కావడం లేదు. బాల రామాయణం పది ఆశ్వాసాలలో 780 శ్లోకాల కంటే ఎక్కువగా చాలా వరకు శార్దూల విక్రీడితం మరియు శ్రాగ్ధరలలో సాగిన దీర్ఘ రచన. ఇతను భవభూతి రామాయణాన్ని పున్ణ సృష్టించినట్టుగా వర్ణించాడు. ఇతని బాల భారతం రెండు ఆశ్వాసాల రచన, ఇది అసంపూర్ణమైనా కావచ్చు లేదా మనకు అలభ్యం అయినా కావచ్చు. దొరికిన ఆశ్వాసాలలో ద్రౌపదీ స్వయంవరపు వర్ణన ఉంది. దీనికి 'ప్రచండ పాండవ' అన్న మరోపేరు కూడా ఉంది.

ఇతను కావాన్ని 'Beautiful expression' (ఉక్తి-విశ్లేష)గా వర్ణించాడు. ఇతని రచనలైన కర్పూర మంజరి మరియు విద్ధసాలభూణిలు కాళిదాసుని మాళవికాగ్ని మిత్ర, రత్నావళి మరియు హర్షుని ప్రియదర్శికల నకళ్ళుగా చెప్పవచ్చు. రాజశేఖరుని ఆలోచనలు చాలా వరకు సాంప్రదాయ బద్ధంగా అనిపించినప్పటికీ కొన్నిసార్లు నిజ ఊహా శక్తిని

---

10 VI.1 వ శ్లోకం 6వ పాదం మరియు IV.1 వ శ్లోకం 9వ పాదం

ప్రతిబింబిస్తాయి. ఇతని కావ్య మీమాంస కవిత్వానికి సంబంధించినంత వరకు సమాచార గని అని చెప్పవచ్చు. ఇది 'విజ్ఞాన సర్వస్వపు' (Encyclopedia) శైలికి చెందినది. ఇతని 18 అధ్యాయాల రచనలో కేవలం కవి రహస్యమనే మొదటి అధ్యాయం మాత్రమే దొరికి ప్రచురింపబడింది. ఇది కౌటిల్యుని అర్థశాస్త్రం, వాత్స్యాయనుడి కామ సూత్ర తరహాలో సాగిన రచన. కొన్నిచోట్ల రాజశేఖరుడు ఇతరుల అభిప్రాయాలతో పాటు తన అభిప్రాయాలని యయావరుని పేరుతో ఉల్లేఖించాడు. ఇది కవులు కావాలని భావించే వారికి మంచి దిక్సూచీలా పనిచేస్తుంది. ఇందులో మొదటగా కావ్య విద్య అన్న పేరుతో 18 అధ్యాయాలలో పేర్కొన్న కవుల సమాచారాన్ని అందించాడు. ఇందులో అతను వారి రచనలు అలభ్యమైనందున వాటి గురించి 18 అధికరణాలలో క్లుప్తంగా వివరిస్తున్నట్టు తెలిపాడు. ఇందులో మొదటిది మాత్రమే మనకి లభ్యమైంది. ఇందులో రాజశేఖరుడు చాలా ఆసక్తికర అంశాలని చర్చించాడు. ఇతను సాహిత్య విద్యని ఐదవ విద్యగా అభివర్ణించాడు. ఈ ఐదవ విద్యకి కూడా సాంప్రదాయకంగా గుర్తించిన నాలుగు విద్యలైన 1) వేదాలు 2) వ్యాపారం, వ్యవసాయం 3) పరిపాలన 4) భౌతిక శాస్త్రాల లానే అధిక ప్రాధాన్యత ఉంది.

రాజశేఖరుడు తరువాత పేర్కొనదగిన ఆలంకారికులలో అభినవగుప్తుడు మరొకడు.

### 2.1.7. అభినవగుప్తుడు

అభినవ గుప్తుడు కాశ్మీరుకి చెందిన విజ్ఞాన సర్వస్వ తాత్త్వికుడు. ఒక రచయిత రచనల గురించి తెలుసుకోవాలంటే రచయిత గురించి కూడా తెలుసుకోవలసిన ఆవశ్యకతని గుర్తించిన వీరు వీరి రెండు రచనలలో అతని జీవిత చరిత్రను ఉల్లేఖించాడు. అవి తంత్ర లోకం మరియు పరత్రింశిక వివరణ. ఇతనికి చారిత్రక జ్ఞానం కూడా ఉంది. ఈయన తన రచనల కాలాన్ని సప్తర్షి యాగం లోవిగా వివరించాడు. ఇవి క్రీస్తు శకానికి 3076 సంవత్సరాల పూర్వపు కాలంకు చెందిన i) క్రమ స్తోత్రం 990 A.D. ii) ఈశ్వర ప్రత్యాభిజ్ఞ విపృత్తి విమర్శిని 1014 A.D. iii) భైరవాస్తవ 992 A.D. వీటిని బట్టి ఈయన 960 A.D. లో పుటినట్టుగా, తన 30వ యేట సాహిత్య వృత్తిని ప్రారంభించినట్టుగా తెలుస్తుంది.

అభినవగుప్తుని తండ్రి పేరు నరసింహ గుప్తుడు (చుకులుడు), ఇతని తల్లి పేరు విమల కళ, కుటుంబ వాతావరణం ఆధ్యాత్మిక, సాహిత్యాల మేళవింపుగా ఉండేది. పాఠశాలలో ఇతని ప్రతిభకు మెచ్చి ఆచార్యులు ఇతనికి 'అభినవ గుప్త పామదని' పేరు పెట్టారు. ఇతని చిన్న వయస్సులోనే ఇతని తల్లి మరణించగా, తండ్రి ఆధ్యాత్మిక సాధనలో మునిగి పోవడంతో ఇతను జీవితంలో పెళ్ళి చేసుకోకూడదని నిర్ణయించుకొని కాశ్మీర్ చుట్టు ప్రక్కల విద్యా సాధనకై తిరిగాడు. వ్యాకరణంలో ఇతని తండ్రి నరసింహ గుప్తుడు ఇతని గురువు. ద్వైత తంత్రాలలో వామనాథుడు, బ్రహ్మ విద్యలో భూతిరాజుడు, శైవతత్త్వంలో భూటి రాజతనయుడు, క్రమ మరియు త్రిక వ్యవస్థలలో లక్ష్మణ గుప్తుడు, ధ్వని శాస్త్రంలో ఇందు రాజుడు, నాటక శాస్త్రంలో భట్ట తోట, కుల వ్యవస్థలో శంభునాథుడు ఇతని గురువులు. ఇతను జీవన్ముకుడై, అద్భుత శక్తులని కలిగి అన్ని శైవ తంత్రాలలో ప్రావీణ్యాన్ని పొందాడు. ఇతను అన్ని శైవ మతాలకి ఆధ్యాత్మిక అధిపతిగా ఉండి శ్రీకాంతుని పునర్జన్మగా భావింపబడేవాడు.

అభినవగుప్తుడు సుమారు 50కి పైగా రచనలు చేశినట్టు తెలుస్తుంది. అవి. 1) బోధ పంచదశిక 2) మాలిని విజయ వర్తిక 3) పరత్రింశిక వివృత్తి 4) తంత్ర లోకం 5) తంత్ర సారం 6) తంత్రావతధనిక 7) ధ్వన్యాయవలోక లోచన 8) అభినవ భారతి 9) భార్గవద్గితర్థ సంగ్రహం 10) పరమార్థ సారం 11) ఈశ్వర ప్రత్యాభిజ్ఞ వివృత్తి విమర్శిని 12) ఈశ్వర ప్రత్యాభిజ్ఞ విమర్శిని 13) పర్యంత పంచశిఖ 14) ఘటకర్పూర కళిక వివృత్తి 15) కర్మ స్తోత్రం 16) దేహస్థ దేవత చక్ర స్తోత్రం 17) భైరవ స్తోత్రం 18) పరమార్థ ద్వాదశిక 19) పరమార్థ చర్చ 20) మహోపదేశ వింశతిక 21) అనుత్త రస్తిక 22) అనుభవ నివేదన 23) రహస్య పంచదశిక 24) తంత్ర ఛాయ 25) పురురోవొవిచిత 26) కామ కేళి 27) శివ దృష్ట్యాలోచన 28) పూర్వ పంచిక 29) పదార్థ ప్రవేశ నిర్ణయాఠిక్ 30) ప్రకీర్ణక వివరణ 31) ప్రకరణ వివర్ణ 32) కావ్య కేతుక వివరణ 33) కథాముఖ తిలక 34) లగ్వి ప్రక్రియ 35) భేద పద వివరణ 36) దేవీస్తోత్ర వివరణ 37) తత్వధ్వ ప్రకాశిక 38) శివ సక్త్వ వినభ స్తోత్రం 39) అనుత్తర శతకం 40) ప్రకరణ స్తోత్రం 41) నాట్యాలోచన 42) అముత్తర తత్త్వ విమర్శన వివృత్తి మొదలగున్నవి.

ఇవేకాక పంచికలు, శ్రీపూర్వ శాస్త్రాలు, ఇతర స్తోత్రాల మీద వ్యాఖ్యలు మొదలగున్నవి ఉన్నాయి. ఈయన ఇతరుల స్తోత్రాలను ఉల్లేఖించేటప్పుడు ''మయైయవ స్తోత్ర'' అని ఉల్లేఖించాడు.

ఇతని సాహిత్య ప్రక్రియ మూడు దశలుగా సాగింది. అవి తాంత్రిక, అలంకారిక మరియు తాత్త్విక దశలు. ఇతని అలంకారిక శాస్త్ర దృష్టి రెండవ దశకి చెందినదిగా ఇతని రచనలైన ధ్వన్యావలోక లోచన మరియు అభినవ భారతాల ద్వారా తెలుస్తుంది. ఇతని రచనలలో నృత్యం, సంగీతం, నటన మొదలనైనటువంటి ఇతని ఉదాహరణలు, ఉల్లేఖనలను బట్టి ఇతనికి మంచి కళాత్మక దృష్టి లేదా సౌందర్య దృష్టి ఉన్నట్టుగా మనకి అర్థమవుతుంది.

అభినవగుప్తుడు నిజమైన అలంకారికుడు. ఇతను అలంకారిక శాస్త్ర సమస్యలను చారిత్రక, విశ్లేషణాత్మక, మానసిక, తత్త్వ, తాత్త్విక ధృక్కోణాల నుంచి పరిష్కరించేవాడు. 'రసం' సమస్యలను ఈయన చారిత్రక ధృక్కోణం నుండి పరిష్కరించేవాడు. రసం గురించి పూర్వులైన భట్టులోల్లటుడు (830 A.D.), శ్రీశంఖుకడు (850 A.D.), భట్ట నాయకుడి (883 A.D.) అభిప్రాయాలను ఉల్లేఖించాడు. వీరిలో భట్ట లల్లటుడి ధృక్కోణం అన్నింటికంటే కొంచెం నిజానికి దగ్గరగా ఉన్నట్లుగా అభినవగుప్తుడు భావించాడు. శ్రీ శంఖుకుడి పద్ధతి సైద్ధాంతిక పరంగా ఉంటుంది. ఇతని సైద్ధాంతిక లోపాలను భరతుని నాట్యశాస్త్ర వ్యాఖ్యగా అభినవగుప్తుడు రచించిన అభినవ భారతిలో చర్చించాడు.

అభినవగుప్తుడు తరువాత పేర్కొనదగిన ఆలంకారికులలో మమ్మటుడు మరొకడు.

### 2.1.8. మమ్మటుడు

మమ్మటుడికి భారతీయ సాహిత్య విమర్శలో ప్రత్యేక స్థానం ఉంది. ఇతని కావ్య ప్రకాశం వంటి కావ్యం మరోకటి లేదని ముఖ్యంగా ఈ శాస్త్రంలో నిస్సందేహంగా చెప్పవచ్చు. దీనిలాగా మరే ఇతర కావ్యాన్ని దేశమంతటా అధ్యయనం చేయటం జరుగలేదనే చెప్పాలి. ఇది భట్టోజీ ధీక్షితుని సిద్ధాంత కౌముది స్థాయిని అందుకుంది. ఉద్భటుడు, వామనుడు, ఆనందవర్ధనుడు, భట్ట నాయకుడు, కుంతకుడు, అభినవ గుప్తుడు మరియు మహిమ భట్టుల

వారసత్వాన్ని అందిపుచ్చుకొని మమ్మటుడు విమర్శ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని సృష్టించాడు. కావ్య ప్రకాశపు ప్రాచుర్యానికి దాని మీద వచ్చిన వ్యాఖ్య రచనలే బలమైన ఉదాహరణ. ఇతని వ్యక్తిగత చరిత్ర గురించి మాత్రం మనకు తెలిసింది అత్యల్పమనే చెప్పాలి. ఇతను ఇతని రచన కావ్య ప్రకాశంలో కానీ మరెక్కడా కానీ ఇతని వ్యక్తిగత వివరాలను వెల్లడించలేదు. కానీ ఇతని ఇతర రచన అయిన శబ్దవ్యాపారవిచారంలో మాత్రం ఇతని గురువుల గురించి కొంత సమాచారాన్ని వెల్లడించాడు. అనేక వ్యాఖ్యానాలు తరువాతి రచయితల ఉల్లేఖనాలను బట్టి మమ్మటుడు 11వ శతాబ్దపు మధ్య కాలానికి చెందినవాడుగా తెలుస్తుంది. కావ్య ప్రకాశం 'ఉల్లాసాలుగా' పిలవబడే 10 అధ్యాయాల విస్తృత కావ్యం. పేరుకి తగ్గట్టుగా ఇది కవిత్వపు కోణాలని ప్రకాశింపజేస్తుంది. ఇతను రసాన్ని విస్మరించి విమర్శలకు తెరతీశాడు. ఈ సిద్ధాంతంలో ఇతని భాగంగా ధ్వని విభిన్నతలను గణిత శాస్త్ర సహితంగా సంగణకం చేసి 10404 మరియు 10455 రకాల ధ్వనులని విశ్లేషించాడు. ఇతని కావ్య ప్రకాశం ఇతని అస్థిరతల వలన, కారిక మరియు వృత్తుల విశ్లేషణల వలన విమర్శలకు గురైంది. మమ్మటుడు తన రచనలో కేవలం వృత్తుల గురించి మాత్రమే రాశాడు. ఇతను తన రచనలో తరుచుగా పూర్వ విమర్శకులైన బామహు, ఆనందవర్ధన, భట్టనాయక, అభినవ గుప్తులని వారి పేర్లు చెప్పకుండా ఉల్లేఖించాడు. ఇతనిని విమర్శకులు 'వాగ్దేవతయతర' (వాక్దేవి పునర్జన్మగా) అభివర్ణించటం కావ్య ప్రకాశపు గొప్పతనాన్ని తెలుపుతుంది.

మమ్మటుడు తరువాత పేర్కొనదగిన ఆలంకారికులలో కుంతకుడు మరొకడు.

**2.1.9. కుంతకుడు**

కుంతకుడు కవుల వాక్కులు నిరంతర రసోద్గార గర్భ సౌందర్య నిర్భరములని అన్నాడు.[11] కుంతకుడు ప్రాచీన భారతపు అలంకారికులలో ఒకడు. ఇతని రచన పేరు 'వక్రోక్తి జీవిత'. వక్రోక్తి జీవత వక్రోక్తి ప్రాధాన్యతని తెలుపుతూ అలంకార సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. నాటక కర్త రాజశేఖరుడు మరియు మహిమభట్టుల ఉల్లేఖనలు ద్వారా

---

11 . నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:40

ఇతను 11వ శతాబ్దపు మధ్యముడిగా, ఇతని బిరుదు 'రాజనిక' ఆధారంగా కాశ్మీరానికి చెందిన వాడుగా తెలుస్తుంది. కుంతకుడిని ఆనందవర్ధని సమకాలికునిగా భావించవచ్చు. ఇతను ఆనందవర్ధునుని ధ్వనికారునిగా ఉల్లేఖించాడు.

కుంతకుని వ్యక్తి జీవిత ఉన్మేషాలనబడే నాలుగు అధ్యాయాల రచన. ఈ రచన కారికాలనే శ్లోకాలతో వాటికి వృత్తులనే గద్య వ్యాఖ్యాలతో సాగిన రచన. ఈ గద్య వృత్తులలో కూడా విశదీకృత శ్లోకాలున్నాయి. కుంతకుని రచన 'వక్రోక్తి' సిద్ధాంతానికి పెద్ద పీట వేస్తుంది. వక్రోక్తి అంటే వంకర మాట అని అర్థం. వక్రోక్తి ఒక అసాధారణ భావ ప్రకటన ఇది సాధారణంగా కవిత్వంలో ఎక్కువగా కనిపిస్తుంది. ఇది అలంకార శాస్త్రంలో రకరకాలుగా వర్ణించబడింది. కొందరు దీనిని ఒక రకమైన అలంకారంగా గుర్తిస్తే, మరికొందరు అలంకారులకి మూలంగా గుర్తించారు. కుంతకుడు వక్రోక్తిని కవిత్వపు జీవం (జీవితగా) గుర్తించి తన రచనకి 'వక్రోక్తి జీవిత' అని పేరు పెట్టాడు. సముద్ర బంధుడు మూడవదైన కవిత్వ క్రియ మరియు సౌందర్య వ్యక్తీకరణని కావ్య ప్రత్యేకతగా వక్రోక్తి జీవితకారుడు (కుంతకుడు) వర్ణించాడని తెలిపాడు. కుంతకుడు కేవలం వక్రోక్తి మీదనే కాకుండా మిగతా శాఖలైన సాహిత్య, కవి వ్యాపార, గుణ, ఔచిత్యాల గురించి తన అభిప్రాయాలను వెల్లడించాడు. కుంతకుడు బామహుడి వక్రోక్తి భావలతో స్ఫూర్తి పొంది వక్రోక్తి సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

కుంతకుని ప్రకారం అలంకారం వక్రోక్తికి మారు పేరు మాత్రమే. కవిత్వపు జీవం వక్రోక్తి కావున వక్రోక్తి లేకుండా ఎటువంటి కవిత్వము ఉండదు. దీనితో పాటు కుంతకుడు రసాన్ని దాని ప్రాముఖ్యతని గుర్తించి అది ప్రకరణ వక్రోత్త మరియు ప్రబంధ వక్రతల కిందకి వస్తుంది. ఆనందవర్ధనుని ధ్వని సిద్ధాంతాన్ని కుంతకుడు తన వక్రోక్తిలో చిన్న, చిన్న మార్పులతో అవసరమైన చోట క్రొత్త ఉదాహరణలతో ప్రస్తావించాడు. కుంతకుని రసవాద అలంకార భావన కూడా చాలా ఆసక్తికరంగా సాగుతుంది. పూర్వ అలంకారికులకు భిన్నంగా కుంతకుడు రసవాద అలంకారాలకు రస స్థాయిని ఇచ్చాడు. ఇది 'రసాన తుల్యం వర్తమానం' గా గుర్తించబడింది. కుంతకుడు ధ్వని సిద్ధాంతకర్తలను రస'సిద్ధాంతకర్తలుగా అంగీకరించాడు. కుంతకుని ప్రకారం 'శబ్దార్థౌ సహితౌ కావ్యం'. కుంతకుడు ఔచిత్య మరియు రసాల ఆధిక్యతని గుర్తించి వాటిని తన కొత్త సిద్ధాంతమైన వక్రోక్తిలో చూపించటమే కాక అలంకార శాస్త్రపు అనేక

విషయాలను చర్చించి భారతీయ అలంకారికులలో అగ్ర గణ్యునిగా పేరు గడించాడు. ''సాహిత్యార్థ సుధా సింధు సారోర్మీలనానికి పూనుకొన్న కుంతకుడు కావ్య పరిజ్ఞానం వల్ల లభించే సౌందర్యం ఏ విధమైనదో తెలుపుతూ ''కీ దృశ్యం తత్సౌందర్యమ్? నూతనౌచిత్యమ్. నూతన మభినవ మలౌకిక మౌచిత్య ముచిత భావోయస్య'' (వ.జీ-2). ఈ వాక్యం వల్ల కుంతకుడు కావ్యంలో అలౌకికము, అనిర్వచనీయము అయిన సౌందర్యాన్ని దర్శించినట్లు తెలుస్తుంది.[12]

కుంతకుడు తరువాత పేర్కొనదగిన ఆలంకారికులలో భోజుడు మరొకడు.

**2.1.10. భోజుడు**

సాధారణంగా జీవిత చరిత్రల గురించి సరైన సమాచారం దొరకని సంస్కృత కవులకి భిన్నంగా భోజుని గురించి, అతని వ్యక్తిగత, రాజకీయ, సాహిత్య వ్యక్తిత్వాల గురించి మనకి చాలానే సమాచారం లభిస్తుంది. ఇతను గొప్ప రాజుగా పేరు గడించాడు. ఇతను గొప్ప నిర్మాణకర్త, గొప్ప పరిశోధకుడు, మహా కవి, గొప్ప విమర్శకుడు, గొప్ప శాస్త్రజ్ఞుడు, ప్రయోగ కర్త ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో. భోజుని భోజశాల శాసనాల నుంచి లభ్యమైన సమాచారం ప్రకారం ఇతను రెండు కూర్మ శతకాలను రచించాడు. ఇందులో మొదటిది అవని కూర్మ శైలిలో రచించినది. భోజుని శిలా శాసనాల కంటే కూడా తామ్ర శాసనాలు ఇతనిని మహాకవిగా మనకి పరిచయం చేసి సాహిత్య చరిత్రలో ఇతని పేరుని శాశ్వతం చేశారు.[13] భోజుడు 84 నుండి 104 రచనలు చేసినట్టు రెండు రకాలైన విజ్ఞాన సర్వస్వాలలో ఆధారాలున్నాయి. అందులో ఒకటి మేరుతుంగుని 'ప్రబంధ చింతామణి', మరొకటి జైన రచయిత ఆజామని భోజుని 'సరస్వతి కంఠాభరణం' మీద వ్యాఖ్య. ఈ రచనలన్నీ వివిధ రకాలైన శాస్త్రాలకి సంబంధించినవి. వీటిలో వ్యాకరణ నుంచి వాస్తూ వరకూ, భౌతిక శాస్త్రం నుండి అలంకార శాస్త్రం వరకూ అన్ని రకాల శాఖలూ ఉన్నాయి.

12 నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:18-19

13 cultural leaders of India Aestheticians; P: 88

ఈయనని కవిరాజు, కవి బాంధవుడు అని సంబోధించాడు. చారిత్రక ఆధారాలన్నీ ఆయనని కవిగా సంబోధించాయి కానీ ఈయన శాస్త్ర జ్ఞానం గురించి మాత్రం ఎటువంటి వ్యాఖ్యాలు చేయలేదు. ఈయన రచనల మీద, శాస్త్ర పరిజ్ఞానం మీద అనేక సందేహాలు ఉన్నప్పటికీ ఈయన కవిత్వ పాండిత్యం మీద మరియు కవిత్వాల మీద మాత్రం ఎవరికీ ఎటువంటి సందేహం లేదు. ఈయనని ప్రబంధ కవి చరిత్రలో 'విద్వచ్ఛక్ర శిరోమణి' అని కొనియాడింది. ఇందలో దాదాపు ఈయనవి 30 నుండి 40 వరకూ రచనలను ప్రస్తావించారు. భోజుడు సాహిత్య విమర్శ మీద రెండు రచనలు చేశాడు. అవి 1) శృంగార ప్రకాశం 2) సరస్వతి కంఠాభరణం. వీటిలో సరస్వతి కంఠాభరణం కొంచెం పాతది మరియు చిన్నది. శృంగార ప్రకాశం డా. రాఘవన్ ప్రకారం భోజుడు ఉత్కృష్ట రచన. ఇది భోజుడే సూచించిన సాహిత్య ప్రకాశ శైలికి చెందినది. సాహిత్య ప్రకాశ శైలి భోజుడు గుర్తించిన 24 రకాల శ్రావ్య రచనలలో గొప్పది. అలంకారాలను భోజుడు శాబ్దాలంకారాలు, అర్థాలంకారాలు, ఉభయ అలంకారాలుగా విభజించాడు. ఆఖరి అధ్యాయం రసాన్ని గురించి వివరిస్తుంది.

భోజుని విశ్లేషణాశక్తికి తార్కాణంగా అనురాగాన్ని ఆయన వర్ణించిన తీరుని చెప్పుకోవచ్చు. ఇది ఆయన విశ్లేషణాత్మక శక్తికి ఒక మచ్చు తునక మాత్రమే. అనురాగాన్ని 64 రకాలుగా విభజించాడు. ప్రతి రకాన్నీ 8 ఉప రకాలుగా, సందర్భాలను బట్టి మళ్ళీ ఒక్కొక్క రకం మరలా 8 ఉప రకాలుగా విభజించబడింది. వీటిలో మరలా ఒక్కొక్కదానికి 3 ఉప విభాగాలున్నాయి. గణిత శాస్త్రం ప్రకారం ఇవి 64x8x24 అంటే మొత్తం 12,228 రకాలు. ఉప విభాగాలు అన్ని కూడా వేరు, వేరు ఉదాహరణలతో ప్రత్యేక వ్యాఖ్యాలతో ఉల్లేఖించబడ్డాయి. సరస్వతి కంఠాభరణం మరియు శృంగార ప్రకాశం భోజుని ప్రతిభను ప్రపంచానికి తెలియజేశాయి. ఇందులో భోజుడు చర్చించిన అంశాలను మాట్లాడటానికి కూడా ఇప్పటికీ ఎంతో మంది పండితులు సిగ్గుపడుతుంటారు. ఇవి విమర్శలో అత్యున్నత గ్రంథాలుగా కీర్తించబడుతున్నాయి.

భోజుడు తరువాత పేర్కొనదగిన ఆలంకారికులలో మహిమ భట్టుడు మరొకడు.

**2.1.11. మహిమ భట్టుడు**

మహిమ భట్టుడు అతని పేరు రాజనాక సూచించిన విధంగా కాశ్మీరీ పండిత కుటుంబానికి చెందినవాడు. ఇతను సంస్కృత సాహిత్య విమర్శలో 'వ్యక్తి వివేక' రచన రచయితగా మిక్కిలి ప్రసిద్ధుడు. ఇతని మరొక రచన 'తత్త్వోక్తి కోశం' అలభ్యం. వ్యక్తి వివేకం విమర్శలనబడే మూడు అధ్యాయాలుగా విభజించబడింది. దీని మీద తరువాత వచ్చిన రుయ్యకుని వ్యాఖ్య సగం మాత్రమే లభ్యమైంది.

మొదటి అధ్యాయంలో మహిమ భట్టుడు ధ్వని గురించి చర్చించి ఇది ఏ విధంగానూ భిన్నంగా లేదని ప్రతిపాదించాడు. అలాగే కుంతకుని వక్రోక్తి మరియు భక్తి కూడా ఈయన రచనలో ప్రస్తావించబడ్డాయి. మహిమ భట్టుడు తన విమర్శలో మహాకవి కాళిదాసుని వంటి మహా మహులను కూడా వదలలేదు. రెండవ అధ్యాయమంతా సౌందర్య శాస్త్రపు అంశాల విమర్శ మీద సాగింది. ఆఖరి అధ్యాయంలో ఇతను ఆనందవర్ధనుని ధ్వని సిద్ధాంతపు విశ్లేషణల ఆధారంగా కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు.

కావ్య ప్రకాశపు వ్యాఖ్యాత భట్ట గోపాలుడు ఊహాత్మక సౌందర్య శాస్త్ర సిద్ధాంతకర్తను పొగడ్తలతో ముంచెత్తుతూ ఈ విధంగా అన్నాడు. "While the great master, the author of dhvani, is plunged into ambrosial river of rasa, the glory of inference does not forsake the assembly of literary critics." (रसामृतनदीमग्ने ध्वनिकारे महागुरौ अनुमाया हि काव्यंगोष्ठिम् न मुञ्चति |)[14]

ఈ సిద్ధాంతం అనేక చర్చలకు విమర్శలకు కేంద్రబిందువైంది. తరువాత వచ్చిన అలంకారికులందరూ దీనిని గురించి చర్చించారు. ఉదాహరణకి రుయ్యకుడు, విద్యాధరుడు, విశ్వనాథుడు మరియు జగన్నాథుడు మొదలగువారు.

ఈయన సందర్భం (విభవ), మానసిక స్థితి (స్థాయిన్) మధ్య గల సంబంధాన్ని ఒడిసి పట్టుకున్నాడు. ఇతను ఆనందవర్ధనుని ధ్వని సిద్ధాంతాన్ని ఖండించాడు. ఇతని ప్రకారం

14 cultural leaders of India Aestheticians; P: 111

విభావాలు, అనుభవాలు మరియు వ్యభిచార భావాలు హేతువులకి చాలా భిన్నం. ప్రతీతి భావన రసానందం ''ప్రతీతి ' పరమారస్ ఏవ ఛ రసవాద్ణ''[15] క్రియ శృతి ముఖ్య లక్ష్యం వేదాల లక్ష్యం కొన్ని చర్యల జ్ఞానాన్ని అందివ్వటం. "Activity being the aim of sruti, passages which have no such aim are useless."[16] ఆనందవర్ధనుని వలె మహిమభట్టుడు కూడా కవిత్వార్థాన్ని 3 రకాలుగా విభజించాడు. అవి వస్తు, అలంకార మరియు రసాలు. సౌందర్యాతిరేక నిష్పత్తి కోసమే కవి కావ్యారంభం చేస్తాడని మహిమభట్టు వ్యక్తి వివేకంలో చెప్పాడు.[17] మహిముడు ధ్వని సిద్ధాంతపు విమర్శకులలో అగ్రగామిగా మనం చెప్పవచ్చు.

మహిమభట్టుడు తరువాత పేర్కొనదగిన ఆలంకారికులలో విశ్వనాథుడు మరొకడు.

### 2.1.12. విశ్వనాథుడు

'సాహిత్య దర్పణ' రచయిత విశ్వనాథ కవిరాజ కపింజల గొత్రపు ఒరిస్సాకు చెందిన ప్రఖ్యాత కుటుంబానికి చెందినవాడు. ఇతను గజపతి రాజుల ఆస్థాన కవి. ఇతని కొడుకు అనంతదశుడు సాహిత్య దర్పణ వ్యాఖ్యాలలో ఈయన గురించి ప్రస్తావిస్తూ..

"Sri Viswanatha was the moon of the milk ocean of Kapinjala family, the minister of the king o f Trikalinga, illustrilous, beloved master of many languages, pilot of the ocean of the literary learning, head of those who were well versed in the path of dhvani and at the same time, a great poet"[18] అని ప్రస్తావించాడు. విశ్వనాథుడు ఈ కింది రచనలు చేశాడు. అవి 1) చంద్ర కళా నాటిక, 2) ప్రభావతీ పరిణయం (నాటకం), 3) రాఘవ విలాసం (కవిత), 4) రాఘవ విలాపం (కవిత), 5) కువల యస్వ చరిత (ప్రాకృతపు కవిత), 6) ప్రశస్తి

15 Vyakti – Viveka (V.V.) Chowkhamba ed, P.73

16 Jaimini Sutra 1.2.1

17 నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:39

18 cultural leaders of India Aestheticians; P: 119

రత్నావళి (16 భాషలలో), 7) నరసింహ విజయం (చిన్న కవిత) 8) సాహిత్య దర్పణం 9) కావ్య ప్రకాశ దర్పణం (వ్యాఖ్య), 10) కంసవధ (కవిత), 11) లక్ష్మీస్త్వ మరియు కొన్ని సంస్కృత, ప్రాకృత గద్య కావ్యాలు రచించాడు.

ఇతని కవితలు, శాసనాలు, ఇతరుల రచనలలో ప్రస్తావనల ఆధారంగా ఇతని కాలాన్ని 1378 – 1434 A.D. గా గుర్తించారు. ఇతను ఇతని రచన సాహిత్య దర్పణంతో ప్రసిద్ధిగాంచాడు. ఇతడు దీనికోసం కావ్య ప్రకాశపు పద్ధతిని అవలంభించాడు. (తీసుకున్నాడు). ఇందులో కారికాలు, వృత్తులు, ఉదాహరణలని మూడు భాగాలున్నాయి.

మొదటి అధ్యాయంలో విశ్వనాథుడు కవిత్వార్థాన్ని విశ్లేషించాడు. ఇతను మమ్మటుడు, ఆనందవర్ధనుని సిద్ధాంతాలను వ్యతిరేకించాడు. రెండవ అధ్యాయంలో ఈయన కావ్యాన్ని 'వాక్యం రసాత్మకం కావ్యం' అని నిర్వచించి వాక్యాలను, అర్థాలను వాటి భిన్నార్థాలను చర్చించాడు. మూడు రకాల పద శక్తి రకాల విశ్లేషణలు (శబ్ద శక్తి) అభిద, లక్షణ మరియు వ్యంజన తాత్పర్య వృత్తిని గురించిన విశ్లేషణ కూడా ఉంది. మూడవ అధ్యాయంలో రసాన్ని విశ్లేషించి 48 రకాల నాయకాలను మరియు 384 రకాల నాయికలను వర్ణించాడు. నాలుగవ అధ్యాయం ప్రత్యేకంగా ధ్వని మరియు గుణిభూత భ్యంగ్య ఆధారంగా కావ్య విభజనకి అంకితం. ఐదవ అధ్యాయంలో విశ్వనాథ వ్యంజ్యనాన్ని ప్రత్యేక వృత్తిగా పరిగణించాడు. ఆరవ అధ్యాయం పూర్తిగా నాటకానికి అంకితము. ఏడవ అధ్యాయంలో పద, పదాంశ, వాక్య, అర్థ, రస దోషాలనబడే ఐదు కావ్య దోషాలని గురించి చర్చించాడు. ఎనిమిదవ అధ్యాయం మూడు రకాలైన గుణాలను చర్చించాడు. ఇందులో విశ్వనాథుడు వామనుడు మరియు భోజుని 20 రకాల శబ్దార్థ గుణాల విభజనను అంగీకరించలేదు. తొమ్మిదవ అధ్యాయంలో భిన్న రకాలైన రీతులు (విదర్భ, గౌడ, పాంచాల వంటివి)ను చర్చించాడు. ఆఖరి పదవ అధ్యాయం అన్ని రకాల అలంకారాలు మరియు వాటి ఉప విభాగాలను చర్చిస్తుంది.

సంస్కృత సాహిత్యం శ్రావ్య (కవిత్వాలు), దృశ్య (నాటికలు) లను విశ్వనాథుడు మొదటిసారిగా రెండింటి గురించి చర్చించాడు. దీని గురించి అనంత దశుని మాటల్లో..

''శ్రావ్యాభినేయాలంకారతత్త్వం సత్కవి సమ్మతం

యదిహస్తి తదాన్యత్ర యన్నేహస్తి న తత్ క్వచిత్''[19] విశ్వనాథుడు తన సొంత రచన గురించి అంచనా వేస్తూ ఈ విధంగా అన్నాడు.

"Oh scholars, looking at Sahihyadarpana you may know all the essential tenets of Rhetorics with ease"[20] సాహిత్య దర్పణం అక్కరలేని అంశాలను వదిలివేసింది. ఇక్కడ ముఖ్యమైన విషయాలను మాత్రమే చర్చించటం జరిగింది. సాహిత్య దర్పణపు ఇటువంటి లక్షణాల గురించి అనంత దశుదు ప్రస్తావిస్తూ

''స్వల్పాక్షర్ణ శబ్దోర్థ్ణ ప్రధస్తశేష – దోషాన్నా

సాహిత్య దర్పణో నమ గ్రంథస్థేన వినిర్మిణ్ణ''[21] అని అన్నాడు.

దీని అర్థం ''విశ్వనాథుడు సాహిత్య దర్పణాన్ని సంక్షిప్తంగా, దోష రహితంగా రచించాడు'' అని. ఇది భారతదేశపు అలంకార శాస్త్ర అభివృద్ధిలో ప్రత్యేక స్థానం పొందింది. విశ్వనాథుడు ధ్వని శాస్త్ర అలంకారికులలో అగ్రగణ్యుడు.

విశ్వనాథుడు తరువాత పేర్కొనదగిన ఆలంకారికులలో జగన్నాథ పండితరాయుదు మరొకడు.

### 2.1.13. పండితరాజ జగన్నాథ

''సౌందర్యంచ చమత్కృత్యాధాయకత్వమ్'' అని జగన్నాథ పండితుడన్నాడు.[22] పండితరాజ జగన్నాథునికి సంస్కృత సాహిత్యం, విమర్శలలో ప్రత్యేక స్థానం ఉంది. జగన్నాథుడు 1600 A.D. మధ్య ప్రాంతానికి చెందినవాడు. ఇతడు ప్రస్తుతపు ఆంధ్రప్రదేశ్ తూర్పుగోదావరికి చెందిన ముంగండ (కోనసీమ) గ్రామానికి చెందినవాడు. ఇంకొక

---

19 cultural leaders of India Aestheticians; P: 122

20 cultural leaders of India Aestheticians; P: 123

21 cultural leaders of India Aestheticians; P: 123

22 నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:40

సాంప్రదాయం ప్రకారం ఇతను గుంటూరు జిల్లా తెనాలికి చెందిన దవళూరు గ్రామానికి చెందినవాడు. ఇతని ఇంటిపేరు ఉపద్రష్ట, ఇతని తల్లిదండ్రులు పేరుభట్టుడు, లక్ష్మీ. ఒక్క వ్యాకరణం తప్ప మిగతా అన్ని శాస్త్రాలు ఇతను మహా గురువు అని పిలుచుకొనే తన తండ్రి వద్దే నేర్చుకున్నాడు. ఇతని వ్యక్తిగత జీవితం గురించి అనేక కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. కానీ వీటిలో ఆధారాలు లేవు. జగన్నాథునికి అనేక మంది శిష్యులున్నారు. అందులో ఒకరు శ్రీకులపతి మైరా ఇతను తన రచన సంగ్రాయసారంలో తన గురువు జగన్నాథుని పేరు ప్రస్తావించాడు.[23] జగన్నాథుడు కేవలం కవి- విమర్శకుడే కాక గొప్ప సంగీతకారుడని కూడా కొంతమంది పండితుల ద్వారా తెలుస్తుంది. సురేంద్రనాథ్ ఠాగుర్ తన 'Universal history of Music'- లో "During Shahjahan's reign (1628-58) the following musicians lived, Jagannatha, Bairanga Khan and Lalkhan, the son-in-law of Bailas, son of Tansen. Jagannatha and Bairanga Khan were weighted in silver and received Rupees 4500 each"[24] జగన్నాథుడు తననితాను 'పండిత రాజ'గా అది షాజహాన్ బిరుదాంకితంగా కొన్ని చోట్ల ప్రస్తావించాడు.

జగన్నాథుడు గంగాలహరి, అమృతలహరి, కరుణాలహరి, లక్ష్మీలహరి, సుధాలహరి, యమునా వర్ణనం, అసఫా విలాసం, భమినీ విలాసం, చిత్ర మీమాంస ఖండన, మనోరమ కుచమర్ధన, రస గంగాధరం (ఇతని ముఖ్య రచన. ఇది కవిత్వాలంకార శాస్త్రంలో ధ్వన్యావలోకం మరియు కావ్య ప్రకాశాలంతా పేరుగాంచింది.) అనే రచనలు చేశాడు. శృంగారం లేదా ప్రేమని ఔచిత్యంగా ఈయన తెలియజేశాడు. ప్రబంధాలలో రసాన్ని చూపడం సులభం కానీ చిన్న శ్లోకం (ముక్తకం)లో రసాన్ని చూపడం కష్టం దీనిని జగన్నాథుడు విజయవంతంగా చేసి చూపాడు.

అన్యోక్తులను ఉపయోగించడంలో జగన్నాథుడు ప్రావీణుడు. దానికి ఉదాహరణ

---

23 (cultural leaders of India Aestheticiansప P: 127)

24 cultural leaders of India Aestheticians; P: 127

हारं वक्षासि केनापि क्षिप्तमज्ञेन मर्कटः |

लेढि जिघ्रति संक्षिप्य कुरुते चोच्चमासनम् ‖[25]

ఇతని కవిత్వపు మరో ప్రత్యేకత ప్రసాదం. ఇతని రచన రస గంగాధరంలో దీని గురించి ప్రస్తావిస్తూ నా రచనలన్నింటినీ ప్రసాదానికి ఉదాహరణగా తీసుకోవచ్చు అని తెలిపాడు.

భారతీయ దార్శనికులు కొన్ని వేల సంవత్సరాల కితమే దృగోచరం కాని సౌందర్య తత్త్వాన్ని అధ్యాత్మ విద్యతో దర్శించి కళాముఖంగా దానిని అభివ్యక్తం చేయడానికి పూనుకున్నారు. ఆధ్యాత్మిక రంగంలోనే కాకుండా కళాతత్త్వ దర్శనంలో కూడా వారు ముందంజ వేశారు. భారతీయ సౌందర్య దర్శనం క్షణ ప్రభ కాదు. ఇప్పటికీ ప్రపంచమంతా దానిని శిరోధార్యంగా భావిస్తోంది. వేదాలలో, ఉపనిషత్తులలో, పురాణేతిహాసాలలో గూఢంగా ఉన్న ఈ సౌందర్య దర్శనం వ్యాపారం సుమారు రెండు వేల సంవత్సరాలుగా ఒక ప్రత్యేక ప్రతిపత్తిని సాధించి నిరవధిక సౌందర్య తత్త్వాన్ని ఆకళించుకొన్న పాశ్చాత్య కళాతత్త్వగవేషకులు ఇటీవలి కాలంలో నూతనంగా కళాతత్త్వ శాస్త్రాన్ని కావ్య శాస్త్రంలో ఒక ప్రత్యేక శాఖగా భావించి కావ్య సౌందర్య దర్శనం కోసం నడుము కట్టారు. వారి ఆలోచనల నన్నింటినీ సమన్వయించి ఆలోచించినప్పుడు భారతీయ ఋషుల సౌందర్య దర్శనంలోని మహత్త్వం, సమగ్రత మనకు తెలుస్తుంది.[26]

వామనుని నుండి పలురీతులుగా అనుస్యూతంగా పండితరాయల దాకా కొనసాగి వచ్చిన సౌందర్య తత్త్వాన్వేషణ ''సౌందర్యంచ చమత్కృత్యాధాయతకత్వమ్ – చమత్కృతిరానంద విశేషః సహృదయ హృదయ ప్రమాణకః'' అన్న తీర్పుతో పరిపుష్టము, సమగ్రము అయింది. పండితరాజు పేరు తలుచుకోగానే మన మనోనేత్రం ముందు లౌకిక, అలౌకిక ఆనంద సంచయమంతా నిండిన ఒక సుందరమూర్తి సాక్షాత్కరిస్తుందని పుల్లెల శ్రీరామచంద్రుడు భావించడంలోని అంతరార్థమిదే. “The mention of the name

25 cultural leaders of India Aestheticians; P: 131

26 నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:25

jagannatha or Panditraja brings before our mental eye a man of beautiful personality devoted alike to the earthly pleasures and heavenly pursuits." (P.S. Sriramachandrudu, Panditaraja Jagannatha Aestheticians, Publications Division, Ministry of Information and Broadcasting, Govt. of India, 1990. P:133) ఈ వివరణను బట్టి వస్తుగతమైన భౌతిక సౌందర్యం బాహ్య సౌందర్యంగానూ, తాత్త్విక సౌందర్యం అంతర సౌందర్యం గాను భావించవలసి ఉంటుంది. కానీ నిజానికి కొన్ని సందర్భాలలో ఈ రెండూ పరస్పర పరిపోషకాలుగా ఉంటాయి.[27]

ఈ విధంగా భారతీయ సౌందర్య దృక్పథంలోని ముఖ్యాంశాలను గమనించిన తరువాత పాశ్చాత్య సౌందర్య దృక్పథంలోని ముఖ్యాంశాలను తెలుసుకుందాం.

### 2.2.0. పాశ్చాత్య సౌందర్య శాస్త్ర దృక్పథం

భారత దేశంతో పాటు సమకాలిన దేశాలలో కళాతత్త్వ శాస్త్రం ఒకే సమయంలో కాకపోయినా కొంచెం ముందు, వెనుకగా వేళ్ళూనుకుంది. అది ఎప్పుడు, ఎలా అన్న ప్రశ్న కంటే పాశ్చాత్య సిద్ధాంతాల అధ్యయన ప్రక్రియ ఎలా జరిగిందనేది; పాశ్చాత్య సిద్ధాంతాల మార్పు ఎలా జరిగిందో గమనించటం ఇక్కడ ప్రధానంగా తీసుకున్నాను.

ముఖ్యంగా పాశ్చాత్య దేశాలలో కశాతత్త్వ శాస్త్ర అధ్యయనం, దానిలోని మార్పు చేర్పులు, పరిణామ ప్రక్రియ మీద ఎక్కువ ఆసక్తిని కనబరుస్తున్నాము. 'భావాత్మక పునరుజ్జీవనపు' వేయి సంవత్సరాల తరువాత 18వ శతాబ్దపు చివరి సమయంలో కళాతత్త్వ సిద్ధాంతం పుట్టినప్పుడు అది కళలో ముఖ్యాంశం. నైతికత అనే భావన ద్వారా పూర్తిగా వక్రీకరించబడింది. దివ్యమైన డ్రైడెన్ సిద్ధాంతాలు నైతిక సిద్ధాంతాల ఆధారంగా మిగతా వారికి భిన్నంగా నిలిచాయి. ఇది ఒక సైద్ధాంతిక పరమైన అన్ని వైపుల నుంచి దృష్టి పెట్టవలసిన తప్పుగా చెప్పవచ్చు. కానీ మనుషులకి కవిత్వపు అందం, ప్రకృతి అందం సమానమేనని తెలియ చెప్పటం, వారు అర్థం చేసుకోవటం గగన సదృశ్యమైంది.

---

27 నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:19

చివరిగా ఆధునిక ధృక్పథంలో కళలోని ముఖ్యానందం కళాకారుని నైపుణ్యాన్ని ఆరాధించటమే. కళాకారుడి ప్రదర్శనలోని ఉత్తమ గుణాలను చూడాలే తప్ప అతను ఏ విధంగా పని చేసాడు అన్న దానిని చూడకూడదన్నది ప్రధాన ఉద్దేశ్యం. అందం పూర్తిగా హస్తలాఘవం మీద ఆధారపడి ఉన్నదా అన్నది కూడా పరిశీలించ వలసిన విషయం. కాలానికి దేనితోనూ సంబంధం ఉండదు. మౌలిక పరిశోధనలో తేలిన అంశాలు ఏమిటంటే మనిషి ఊహాత్మక ఆలోచనలో సృష్టిలో ప్రతిదీ అందమైనదే, దానిని మనిషి తన అనుభవాల తోనూ, ఆలోచనల తోనూ సున్నితంగా, అందంగా వ్యక్తీకరిస్తాడు. సర్ థామస్ బ్రౌన్ మాటల్లో చెప్పాలంటే 'ఈ సృష్టిలో ఏదీ ఆకార హీనం, అంద వికారం కాదు. ఖచ్చితంగా చెప్పాలంటే ప్రకృతి భగవంతుని కళా సృష్టి మిగతావన్నీ కృతిమమైనవి'. దీనిని సమర్థించే కొన్ని సిద్ధాంతాలు ఇలా ఉన్నాయి. దీనిని తెలుగులో వాడటం కంటే యధాతథంగా వాడుతున్నాను. ఆ సిద్ధాంతాలను తెలుగులో అనువదించి వాడే అవకాశం ఉంది కానీ చాలా మంది రకరకాల పేర్లతో అనువదించారు. అందువల్ల వాటిని ఆంగ్లంలోనే యధాతథంగా ఉంచుతున్నాను.

### 2.2.1. The Hedonistic – Moral Theory[28] (ప్లేటో, టాల్‌స్టాయ్ మరియు రస్కిన్)

దీన్ని తెలుగులో ఆనందనైతిక సిద్ధాంతమని, ఆనందాన్ని అనుభవించేటప్పుడు నైతిక సూత్రాలతో కూడినటువంటి నియమనిబంధనాలను కళాకారుడు, కళాస్వాదకుడు ఎంతవరకు పాటించాలనే సిద్ధాంతం. దీన్ని ప్లేటో (Plato), టాల్ స్టాయ్ (Tolstoy), రస్కిన్ (Russkin) మొదలైనవారి భావాలు ఈ సిద్ధాంతానికి అనుగుణంగా ఉన్నాయి. కాబట్టి వీరి సిద్ధాంతాన్ని ఈ పేరుతో పిలుస్తున్నారు.

ప్లేటో రెండు అనిశ్చిత సిద్ధాంతాలను ప్రతిపాదించాడు. అందులో ఒక సిద్ధాంతం సౌందర్యాన్ని శిక్షణగా ఆదరిస్తుంది. కానీ ఇది కేవలం నియత, కళాత్మక, సహజ సౌందర్యానికి మాత్రమే అనువర్తింప జేయబడుతుంది. ఈ ధృక్పధానికి ఆధునిక మార్పులు చేర్పులలో భాగంగా సౌందర్యపు ప్రభావం వ్యక్తిత్వం మీద, కళ మీద మహాత్వపు ప్రభావం ఉంటుంది అని చెప్పబడింది. సామాజిక న్యాయం మీద కళ ఏ విధంగా ఆధారపడి ఉందో కూడా

[28] Carritt, E.F. The Theory of Beauty 1962; 31

చర్చించబడింది. దీనితో పాటుగా సౌందర్యం మరియు నైతికల మధ్య సంబంధం గురించిన ప్రస్తావన కూడా ఉంది. ప్లేటో మరో సిద్ధాంతం కళని ఒక అనుకరణగా, ప్రమాదకర సంతోషంగా చిత్రించడాన్ని ఖండించటం. ఇందులోని కొన్ని ముఖ్యాంశాలు ఇవి.

1. కళ ఆనందపు లక్ష్యాన్ని కలిగి ఉంటుందా? ఏ సౌందర్య మైనా ఆనందాన్నిస్తుంది కానీ అన్ని ఆనందాన్నిచ్చే వస్తువులు సౌందర్యంగా ఉండవు. సౌందర్యం ఆనందం ఎప్పుడూ ఒకే నిష్పత్తిలో ఉండవు. దీనికి ఆధునిక హంగులని ఇస్తూ టాల్ స్టాయ్, రస్కిన్‌లు కొన్ని మాటలని సిద్ధాంతీకరించారు. అవి

1. కళ కళ కోసం

2. కళ భావాల సున్నిత వ్యక్తీకరణ

3. వస్తువు భిన్నంగా ఉన్నప్పటికీ వాటిని భావాల ద్వారా సున్నితంగా వ్యక్తీకరించినప్పుడు అది అభినందనీయం.

టాల్ స్టాయ్ ప్లేటో సిద్ధాంతాన్ని సామాన్యులకి అర్థమయ్యేలా సరళీ కరించాలని సూచించాడు. అతని ప్రకారం అన్ని కళలు స్పష్టంగా, సరళంగా ఉండాలి. కానీ అతను ఈ రెండింటికీ సంబంధం కలుపుతూ వీటిలో మత భావాలు, మూఢ నమ్మకాలు, స్త్రీ పురుషుల ప్రేమ, గర్వం, దేశ భక్తి ఉంచాలా? లేదా? అన్నది చెప్పలేము. అలాగే ఆయన సంభాషణ, హావ భావాలనీ కలిపి కొంత గందర గోళాన్ని సృష్టించాడు. టాల్‌స్టాయ్ అతని ప్రధాన శిక్షణలో సరిగానే ఉన్నప్పటికీ ఈ కళాతత్త్వ వాదంలో కొంచెం అయోమయాన్ని కలిగి ఉన్నాడని చెప్పవచ్చు.

అరిస్టాటిల్ 'ది పర్గీషన్ సిద్ధాంతం'. అరిస్టాటిల్ విషాదం మన భావాలు నష్టంలేని విధంగా బయటకి వెళ్ళి మనకి ఒక తేలికైన, ఉత్సాహ జీవితాన్నిస్తాయని భావించాడు. నేటి విషాద రచయితలు కూడా అరిస్టాటిల్ సిద్ధాంతాల నుండి స్ఫూర్తిపొందిన వారే. వీరంతా కూడా విషాదం వారిని ముందుకంటే మంచి స్థితిలో ఉంచిందని భావించారు.

### 2.2.2. The Realistic – Typical Theory[29] (ప్లేటో, అరిస్టాటిల్)

దీన్ని తెలుగులో వాస్తవికసంక్లిష్ట సిద్ధాంతమని అనవచ్చు. ప్లేటో Theory of Ideas, Theory of Imitation సిద్ధాంతాలు, అరిస్టాటిల్ Theory of Imitation, Theory of Purgation, Mimesis మొదలైన సిద్ధాంతాలన్నీ దీనిలో వస్తాయి. అయితే ఇవన్నీ కళలోని వాస్తవికతను కళాకారుడు అభివ్యక్తీకరించేటప్పుడు, ఆదర్శీకరించేటప్పుడు జరిగే కళాత్మక ప్రక్రియకు సంబంధించిన సిద్ధాంతాలు. అందువల్ల వీటన్నింటిని కలిపి వాస్తవికసంక్లిష్ట సిద్ధాంతంగా పిలుస్తున్నారు.

ఈ సిద్ధాంతం కళ కొన్ని విషయాల అనుకరణ అని చెప్పుతుంది. ఈ అనుకరణ సిద్ధాంతం కేవలం కళకి మాత్రమే వర్తిస్తుంది. ఇందులో కూడా అన్ని రకాల కళలకి ఇది వర్తించదు. వీరి సిద్ధాంతం 'విశ్వానుకరణ' గ్రీకుల సంగీతం ఎలాగైతే పక్షి కూతల అనుకరణో, నృత్యం, వాస్తు కళ అన్ని కూడా ప్రకృతి యొక్క అనుకరణలే. అరిస్టాటిల్ తన విషాద సిద్ధాంతంలో కూడా సాంప్రదాయక పదం 'అనుకరణ'ని ఖండించలేదు. అరిస్టాటిల్ ప్లేటో సిద్ధాంతానికి సవరణలు చేసినప్పటికీ అవి అతని సిద్ధాంతాన్ని దిద్దాలన్న ఉద్దేశ్యంతో చేసినవి కావు. అరిస్టాటిల్ కాల్పనిక కవిత్వానికి 'సార్వజనీనత' ఊహాత్మక ఆలోచనని జోడించాడు.

### 2.2.3. Intellectualist Theories[30] (కాంట్ మరియు కాలరిడ్జ్)

దీన్ని తెలుగులో సౌందర్య జ్ఞానాత్మక సిద్ధాంతమని పిలవవచ్చు. సౌందర్యం లేదా అందం ఏ విషయాలమీద ఆధారపడుతుందనేది నిర్ణయించే దిశగా మేథోగతమైన ఆలోచనలకు సంబంధించింది గనుక దీన్ని intellectualist theory గా పిలుస్తారు. వస్తువు కలిగించే ఆనందం అపేక్ష (Inclination), అభిమానం (Favor), గౌరవం (Respect) అనే మూడు అంశాలపై ఆధారపడి ఉంటుందని కాంట్ అభిప్రాయం.[31]

---

[29] Carritt, E.F. The Theory of Beauty 1962; 51

[30] Carritt, E.F. The Theory of Beauty 1962; 63

[31] వీరభద్రయ్య, ముదిగొండ. కళాతత్త్వశాస్త్రం: 1993; 20

కాంట్ ప్రయోజనాపేక్షలేని, ఏ అవలంబనా లేని స్వేచ్ఛాయుతమైన సౌందర్యాన్ని సిద్ధాంతీకరించాడు. ఈయన free beauty అనీ, dependent beauty అని వర్గీకరించి, బహిరమైన ప్రయోజనంతో వస్తువుని ముడి పెడితే అది dependent సౌందర్యమనీ, "an object with definite internal end, a judgment of taste would only be pure, where the person judging either has no concept of this end... ఇలాంటిది free beauty అనీ అంటాడు. వస్తువుకి రూపాన్ని ఒప్పుకొంటూనే దానికి ప్రయోజనం లేకపోవడమే ప్రయోజనంగా kant తీర్పు.[32]

నియత మరియు వ్యక్తీకృత సౌందర్యపు తేడాలు. కాంట్ మెటా ఫిజిక్స్, ఎపిస్టమాలజీ (Critique of pure reason 1781), ఎథిక్స్ (The Ground work of the metaphysics of morals of 1785, critique of practical reason of 1788) లలో తన రచనలకి ప్రసిద్ధి చెందినప్పటికీ ఈయన సౌందర్య శాస్త్రంలో తన సిద్ధాంతాలకి కూడా పేరు గడించారు. సౌందర్య శాస్త్రం తత్త్వ శాస్త్రంలో ఒక భాగం అన్న కాంట్ భావన తరువాత 'Critique of pure reason తో విప్లవాత్మకంగా మారింది.

### 2.2.4. Emotionalist Theories[33] (షోపెన్ హ్యూయర్ మరియు నిట్షే)

దీన్ని తెలుగులో భావావేశాత్మక సిద్ధాంతమని పిలవవచ్చు. షోపెన్ హ్యూయర్‌కి సంబంధించినంత వరకూ అందం కేవలం భావనాత్మకమైనది. సౌందర్య శాస్త్ర దృష్టి చాలా వరకు దీనిలోని నిరాశ వాదాన్ని ప్రక్కకు పెట్టి ఈ సిద్ధాంతాన్ని అంగీకరించనప్పటికీ దీని సత్యంతో ఇవి ఏకీభవించడం లేదు. చివరిగా షోపెన్ హ్యూయర్ (Schopenhauer) సంగీతం మరియు ఇతర అన్ని రకాల సౌందర్య భావనల మధ్య భేదాన్ని సృష్టీకరిస్తే నిట్షే (Nietzsche) దాని తన సిద్ధాంతం ఆధారంగా వృద్ధి చేశాడు. ఇది షోపెన్ హ్యూయర్ స్వీకరించిన కాంట్స్ సౌందర్యం మరియు ఉదాత్త భావనల భేదం వంటిదే. కాంట్ సౌందర్యాన్ని ఉదాత్తత నుండి

---

[32] వీరభద్రయ్య, ముదిగొండ. కళాతత్త్వశాస్త్రం: 1993; 21

[33] Carritt, E.F. The Theory of Beauty 1962; 82

వేరు చేస్తే, షోపెన్ హ్యూయర్ సంగీతం, ఇచ్ఛ యొక్క ప్రత్యక్ష భావనగా కళ నుంచి భావ వ్యక్తీకరణగా వేరు చేయగా, నిట్షే డియో నియజిక్ లేదా విషాద కళ నుండి అపోలైన్ లేదా ప్లాస్టిక్ ను వేరు చేసారు. అలాగే హెగెల్ చిహ్నాత్మక, శాస్త్రీయ మరియు రొమాంటిక్‌ల మధ్య భేదాలను తెలిపారు. షోపెన్ హ్యూయర్ కవిత లోని కొన్ని పాదాలు ఉదాహరణకి:

"Old, unhappy, far off things

And battles long ago.

And in–

Natural sorrow loss, on pain

That has been, and may be again"[34] షోపెన్ హ్యూయర్ అరిస్టాటిల్ తన 'పొయిటిక్స్'లో ఈ భేదాన్ని గురించి చర్చించారని కాకపోతే కేవలం సంగీతమే ఎందుకు వాసన, రంగు మొదలైన వాటిలో కూడా ఉంటాయని తెలుపుతూ ప్లేటోస్ అభిప్రాయమైన సంగీతం మానవ భావనల సూటి వ్యక్తీకరణగా ఉల్లేఖించారు. కానీ దీని వృద్ధిని షోపెన్ హ్యూయర్ ఊహించలేక పోయారు. అలాగే నిట్షే నియత మరియు ప్రాతినిత్య కళల మధ్య భేదం విషయంలో కొంత అయోమయానికి గురయ్యారని చెప్పవచ్చు. దీని సారాశంగా నిట్షే సిద్ధాంతం మీద ఆధారపడి కళ అందాన్ని లక్ష్యంగా చేసుకొని కాక అది ఉద్భవించిన భావాన్ని లక్ష్యంగా చేసుకొని ఉండాలని తరువాతి సిద్ధాంతీకర్తలు అంగీకరించారు.

### 2.2.5. Intellectualist Theories[35] (హెగెల్)

సౌందర్య జ్ఞానాత్మక సిద్ధాంతంగానే హెగెల్ వాదాలను కూడా భావిస్తారు. అయితే హెగెల్ అనగానే భావవాద సిద్ధాంతం గుర్తుకొస్తుంది. దీన్ని నుండే మార్క్సిస్ట్ సిద్ధాంతం పుట్టుకొచ్చిందని కొంతమంది విమర్శకులు భావిస్తారు. ప్రకృతిని నిర్లక్ష్యం చేసి కళని ఒక

[34] Carritt. E.F. The Theory of Beauty Page:93

[35] Carritt, E.F. The Theory of Beauty 1962; 102

రకమైన వస్తు విషయాగత వ్యక్తీకరణ రూపంగా చూశారు. దానిలో కళ వర్గీకరణ ఉద్భవించింది. వస్తు విషయాగత కళ దాని అవసరం మేరకు మరింత సంయుక్తమై 1) సింబాలిక్ ఆర్ట్ 2) క్లాసికల్ ఆర్ట్ 3) రొమాంటిక్ ఆర్ట్‌గా వర్గీకరించబడింది. ఈ శ్రేణులన్నీ 1) వాస్తుకళ 2) శిల్ప కళ 3) చిత్ర కళ, సంగీతం మరియు కవిత్వం అన్ని సమపాళ్ళలో కలిగి ఉంటాయి. హెగెల్ సిద్ధాంతపు లోపం రొమాంటిక్ శ్రేణికి చేరగానే కళాతత్త్వ శాస్త్రంలోకి మారి అదృశ్యమైపోయింది. ఈ సిద్ధాంతం తర్క వక్రతకి దారితీసి సత్య ఉల్లంఘన చేసింది. దీనికి కారణం హెగెల్ సహజ ప్రకృతి సౌందర్యాన్ని స్వీకరించక పోవటం.

హెగెల్ భావనను ఆయన మాటలలోనే చూస్తే 'The romantic content does not remain essentially artistic, but leaves the determination both of the content and of the form to arbitrary invention; excluding nothing, but representing everything which man is capable of making his own, whether this is proper to any definite stage of art or no'[36] దీనికి విరుద్ధమైన పాత భావన ఈ కింది విధంగా ఉంది. "The highest function of art is best performed by something which has ceased to be art; art was perfectly art only at a relatinely low stage"[37] దీనిని బట్టి హెగెల్ సిద్ధాంతం సౌందర్య శాస్త్ర భావన కన్నా తత్త్వశాస్త్ర భావనని లోతుగా కలిగి ఉన్నదని చెప్పవచ్చు.

### 2.2.6. The expressionist Theory[38] (క్రోచి)

దీన్ని తెలుగులో భావవ్యక్తీకరణాత్మక సిద్ధాంతమని లేదా అభివ్యక్తివాద సిద్ధాంతమని[39] పిలవవచ్చు. క్రోచి సాహిత్య సమాలోచనకు అభివ్యక్తవాదాన్ని ప్రతిపాదించాడు.[40] క్రోచి తత్త్వధారలో Intuition కు expressionలకు ప్రత్యేక ప్రతిపత్తి ఉంది. ''ఈ నిర్వికల్ప

---

[36] Carritt. E.F. The Theory of Beauty Page 113

[37] Carritt. E.F. The Theory of Beauty Page:112

[38] Carritt, E.F. The Theory of Beauty 1962; 123

[39] మందేశ్వరరావు, వడలి. పాశ్చాత్యసాహిత్యవిమర్శ చరిత్ర–సిద్ధాంతాలు. 1994:211

[40] మందేశ్వరరావు, వడలి. పాశ్చాత్యసాహిత్యవిమర్శ చరిత్ర–సిద్ధాంతాలు. 1994:211

జ్ఞానాన్ని పొందడమే అభివ్యక్తీకరించడమంటూ క్రోచీ to intuite is to express; and nothing else (nothing more, but nothing less) than to express అని సిద్ధాంతీకరిస్తాడు. ఇట్లా ఆయన నిర్వికల్ప జ్ఞానానికీ అభివ్యక్తికీ నడుమున అవధినికానీ, భేదాన్ని కానీ గుర్తించక తన సిద్ధాంతానికి ఒక విలక్షణతను సాధించాడు.''[41] క్రోచీ వివేచనలో కళ అంటే అతీంద్రియతే, మనసున ఏర్పడిన భావముద్రల అభివ్యక్తి.[42]

'క్రోచీ తన పరిమితార్థంలో అభివ్యక్తే కళకు చాలని పేర్కొంటూ మనస్సులోని అభివ్యక్తమయినదానికి మించి మరేమి అవసరంలేదంటాడు. When we have mastered the internal word, when we have vividly and clearly conceived a figure or a statue, when we have found a musical theme, expression is born and is complete, nothing more is needed అని అభిప్రాయపడ్డాడు. సంపూర్ణమైన నర్వికల్ప జ్ఞానమే సంపూర్ణమైన అభివ్యక్తినిస్తుందని అప్పుడే అది కళ అని పేర్కొన్నాడు.'[43]

సౌందర్య శాస్త్ర క్రియ అంతర్గతంగా పూర్తవుతుంది. దీనిని స్వీయ వ్యక్తీకరణగా నిర్వచించవచ్చు. ఈ క్రియని తరుచుగా ''సెంటిమెంట్'' అని దీనిని జ్ఞానం మరియు వాహకత నుంచి వేరు చేస్తారు. కానీ ఈ జ్ఞానం విశ్వం నుంచి లేదా చారిత్రక సత్యం నుండి ఉద్భవించింది కాక వ్యక్తిగతం నుండి ఉద్భవించింది. క్రోచి ఈ గుర్తింపు ఆదర్శ వాదానికి అవసరమని తెలిపారు. భావ వ్యక్తీకరణలలో సౌందర్యాలు వ్యక్తీకరణని బట్టి మారుతుంటాయి. వాటి మూల సౌందర్యం వ్యక్తీకరణలో ఉంటుంది. వ్యక్తీకరణకి ఉండవలసిన ఒకే ఒక ముఖ్య లక్షణం స్వచ్ఛత. సౌందర్య శాస్త్ర సంతృప్తి లేదా విమర్శక విషయం కేవలం విషయం మాత్రమే. సౌందర్య కోణాలు దాని వ్యాప్తి, అనుబంధాలు, స్పష్టతల మీద ఆధారపడి ఉంటాయి.

పాశ్చాత్య దేశాలలో సౌందర్య శాస్త్ర వృద్ధి, పరిణామం, సౌందర్య శాస్త్రజ్ఞులు, వారి రచనలు, వారు ఏ విధంగా సౌందర్య శాస్త్ర వృద్ధికి దోహదం చేశారు అన్న విషయాలను

[41] వీరభద్రయ్య, ముదిగొండ. కళాతత్త్వశాస్త్రం: 1993; 27

[42] మందేశ్వరరావు, వడలి. పాశ్చాత్యసాహిత్యవిమర్శ చరిత్ర-సిద్ధాంతాలు. 1994:212

[43] వీరభద్రయ్య, ముదిగొండ. కళాతత్త్వశాస్త్రం: 1993; 28

పరిశీలించిన మీదట మనకి ఈ కింది విధమైన అభిప్రాయమేర్పడుతుంది. అది సౌందర్య శాస్త్రం కొన్ని శతాబ్దాల వరకు తత్త్వ శాస్త్రంతో అంతర్గత విభాగంగా ఉంది. అది ఒక ప్రత్యేక శాఖగా పరిణమించడానికి చాలా ఎక్కువ కాలం పట్టింది. మరలా అందులో సౌందర్య శాస్త్రానికి, కళాతత్త్వ శాస్త్రానికి మధ్య భేదం గురించిన వాదోపవాదాలు, విమర్శా ' ప్రతి విమర్శలు మనల్ని ఆలోచనలో పడవేస్తాయి. మొత్తం మీద పాశ్చాత్య సాహిత్యంలో సౌందర్య శాస్త్రపు లక్షణాలు, కోణాల కంటే అది అసలు ఒక శాస్త్రమా, కాదా అన్న చర్చే ఎక్కువగా జరిగిందని మనం భావించవచ్చు. ఈ క్రమంలో తలెత్తే మరో ప్రశ్న అసలు సౌందర్య శాస్త్రపు సిద్ధాంతాల కంటే సౌందర్య శాస్త్రం అన్న అంశమే ఎక్కువ చర్చాత్మకమేమో అని?

17వ శతాబ్దం ముగింపు దశలో కళాత్మక విషయాలలో అభిరుచి (Taste) ఒక పారిభాషిక పదంగా పరిగణనలోకి వచ్చింది. ఈ అభిరుచి ఆత్మకు సంబంధించిన విషయమని ఇది ఆనంద పరవశుడైన రచయిత సృష్టించే సౌందర్యం నుండి అవతరిస్తుందని, అయిష్టత అనేది అసమగ్రమైన త్మానుభవం కారణంగా వెలువడుతుందని జోసెఫ్ ఎడిసన్ తన Spectator వ్యాసంలో పేర్కొన్నాడు. 18వ శతాబ్దంలో ఇది కళాతత్త్వ శాస్త్ర పరిభాషగా స్థిరపడింది. ముఖ్యంగా తత్త్వ శాస్త్రంలోను, కళా తత్త్వ శాస్త్రంలోను భీతావహమైన జ్ఞానేంద్రియ చైతన్యం విషయంలో ఇది ప్రసక్తమయింది. కాలరిడ్జ్ దీనిని చైతన్య గతమైన శక్తులను గతానికి చెందిన మానవాతీత ప్రకృతి శక్తులకు, బుద్ధికి, జ్ఞానేంద్రియ చైతన్యానికి మధ్య నుండే వారధిగా గుర్తించడమే కాకుండా గతం చేత ఆవరింపబడిన ప్రకృతి శక్తులు, జ్ఞానేంద్రియ చైతన్యం కారణంగా ఏర్పడిన భావ ప్రతిమలను ప్రకృతానికి, మేధకు అందేలా వికసింపజేయడమే ఈ అభిరుచి వ్యాపారమని వివరించాడు.[44] అభిరుచి ఆత్మాశ్రయమైంది. అయినా అది విశ్వజనీనమైనపుడే దానికొక విలువ ఏర్పడుతుంది. ఇందువల్ల కళాతత్త్వ శాస్త్రమనేది అభిరుచి, సౌందర్యం అనే రెండు విషయాలకు సంబంధించినదని రెండు ఒకటి కావని తెలుస్తుంది.[45]

---

[44] J.A. Cuddon, The Penguin Dictionary of literary Theory, Fourth Edition, 1992, Page:902

[45] నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట: 26–27

19వ శతాబ్దంలో సౌందర్యారాధన మనేది ఒక ఉద్యమంగా ఒక సంప్రదాయంగా, ఒక చైతన్య మార్గంగా వ్యాపించింది. కళ స్వయం సమగ్రమైనదని, నిరపేక్షమైనదని, కళ కళ కోసమే ననీ, దానికి ప్రయోజనంతో పని లేదని ఒక భావం బలపడింది. నీతి, ధర్మము వంటి ఇతర ప్రాపంచిక విషయాలకు, కేవలం సౌందర్యానుభవం కలిగించే కళకు ఏ సంబంధమూ లేదని ఆ ఉద్యమకారులు భావించారు. ఈ సిద్ధాంతం కాల్పనికోద్యమ కాలం నాటి జర్మనీలో మొదలయింది. కళాకారుడు సర్వ స్వతంత్రుడనీ అతణ్ణి ఏ ఆంక్షలూ కట్టి పడవేయలేవని కాంట్, షెల్లింగ్, Goethe, Schiller వంటి వారు భావించారు. వీరి ప్రభావం ఖండాతరాలకు వ్యాపించింది. బ్రిటన్ లో Coleridge, Carlyle లు, అమెరికాలో Edgar Allan Poe, Emerson లు, ఫ్రాన్స్ లో Madame de stail, Victor Cousin, Theophile Jouffroy వంటి వారు ఈ మార్గాన్ని చేపట్టారు.[46]

పాశ్చాత్య విమర్శకులు ప్రతిపాదించిన భావాలను కూడా ప్రత్యేకించి వివరించుకునే అవకాశం ఉంది. అందువల్ల ఇక్కడ వారి కృషిని వివరిస్తున్నాను.

### 2.2.7. ప్లేటో (PLATO 427-347 BC)

సౌందర్యవాదంలో అతీంద్రియ దృష్టికి, అలౌకిక జ్ఞానానికి స్థానం కల్పించిన వాడు ప్లేటో.[47] కళ గురించి ప్లేటో రచనలు అలంకార శాస్త్ర చరిత్రలో పునాది రాళ్ళ వంటివి. కళ గురించి ప్లేటో ఆలోచనలు, అనితర సాధ్యమైన రచన శైలీ, నైతిక విలువలు, భౌతికి దృష్టితో కూడిన అభిప్రాయ వ్యక్తీకరణలు ప్లేటోని "Of all philosophers ...... the most poetical"[48]అని ఋజువు చేస్తాయి. అధునిక దృక్పథంలో ఆలోచిస్తే ఇప్పుడు మనం కళగా భావించేవాటికి ప్లేటో అసలు విలువ ఇవ్వలేదు. మొదటిగా విద్యలో కళల పాత్రని గురించి చర్చించాడు. ఈయని రిపబ్లికన్ 10లో ప్లేటో కళల గురించి చేసిన విస్తృత విమర్శలు ఉన్నాయి. మిమెసిన్ ఇందులో ప్రధానాంశం. ఇందులో ప్లేటో కవి జ్ఞాన దూర రూపాలని

---

46 నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:28

47 (నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:45,46)

48 Sidney, P. (1973) "A Defense of Poetry," in K. Duncan – Jones and J. van Dorsten (eds) Miscellaneous Prose of Sir Philip Sidney, Oxford: Oxford University Press. Page:107

మాత్రమే సృష్టిస్తాడని పేర్కొన్నాడు. “All Poetic imitators, beginning with Homer, imitate images of virture and all the other things they write about and have no grasp of the truth (Republic 600e)”[49] వారు కేవలం మానవ జీవిత దృశ్యాలని మాత్రమే ఉత్పత్తి చేస్తారు. దీనికి జీవితంలో మంచేదీ, చెడేదీ అన్న సత్యపు అవగాహన అవసరం లేదు.

కవి జీవితంలోని మంచిని తన కవిత్వంలో చూపించటం ద్వారా ప్రజలు మంచి వైపు ఆకర్షితులవుతారని మంచి కవిత్వం ప్రభావాలని గురించి తెలుపుతూ

"One of the heroes sorrowing and making a long lamenting speech or singing and beating his breast.... we enjoy it, give ourselves up to following it, sympathize with the hero, take his sufferings seriously, and praise as a good poet the one who affects us most in this way (Republic 605c)”[50]

“Only a few are able to figure out that enjoyment of other people’s sufferings is necessarily transferred to our own and that the pitying part, if it is nourished and strengthened on the sufferings of others, won’t be easily held in check when we ourselves suffer. (Republic 606b)”[51]

ప్లేటో అందాన్ని, దాన్ని ప్రభావాన్ని వివరిస్తూ తన సిపోజియంలో ఈ విధంగా వ్యాఖ్యానించాడు.

---

[49] Berys Gaut and Dominci McIver Lopes. The Routledge companion to Aesthetics. 2nd edition P: 5-6

[50] Berys Gaut and Dominci McIver Lopes. The Routledge companion to Aesthetics. 2nd edition P:6

[51] Berys Gaut and Dominci McIver Lopes. The Routledge companion to Aesthetics. 2nd edition P:7

"If someone got to see the Beautiful, absolute, pure, unmixed, not polluted by human flesh or colors or any other great nonsense of morality... only then will it become possible for him to give birth not to images of virtue (because he's in touch with no images) but to true virtue (because he is in touch with the true beauty). (Symposium 211e-212a)"[52] అలాగే కవిత్వానికి స్ఫూర్తినిచ్చే అంశాలని, కవి ఆలోచనలకి వ్యక్తీకరిస్తూ ప్లేటో "The poets tell us that they gather songs at honey - flowing springs, from glades and gardens of the Muses, and that they bear songs to us as bees carry honey, flying like bees. And what they say is true. For a poet is an airy thing, winged and holy and he is not able to make poetry until he becomes inspired and goes out of his mind and his intellect is no longer with him (Ion 534a-b)"[53] ఆర్థర్ డాంటో అభిప్రాయం ప్రకారం "From the Perspective of philosophy art is a danger and aesthetics the agency for dealing with it"[54] ఇతను ప్లేటోని నిర్ద్వందంగా అలంకారశాస్త్ర అభివృద్ధి కర్తగా పేర్కొన్నాడు.

### 2.2.8. అరిస్టాటిల్ (Aristotle 384-322 BC)

కళారూపాల గురించి విస్తృత స్థాయి తత్త్వశాస్త్ర అధ్యయనాలను అందించినవారిలో మొదటివాడిగా అరిస్టాటిల్ ను చెప్పవచ్చు. కానీ కవిత్వం మీద వీరి ఇతర రచనలు అలభ్యాలు. మనకి అందుబాటులో కేవలం 'పొయిటిక్స్' మాత్రమే ఉంది. తత్త్వశాస్త్ర చరిత్రలో ప్లేటో కవిత్వ విమర్శకి సమాధానంగా గుర్తించిన రచనల్లో పొయిటిక్స్ ఒకటి. పొయిటిక్స్ విలువ చారిత్రక

[52] Berys Gaut and Dominci McIver Lopes. The Routledge companion to Aesthetics. 2nd edition P:9-10

[53] Berys Gaut and Dominci McIver Lopes. The Routledge companion to Aesthetics. 2nd edition P:11

[54] Danto, A. C. (1986) The Philospphical Disenfranchisement of Art, New York: Columbia University Press. P: 13

ప్రాధాన్యతకి మించినది. అరిస్టాటిల్ కవిత్వం అంటే ఏమిటి ? అది ఎందుకు, ఎలా పనిచేస్తుంది అన్న విషయాల మీద అభిప్రాయాలు హత్తుకునేలా ఉంటాయి. తన పొయిటిక్స్ లో మిగతా వాదాల కన్నా ఈ ప్రక్రియ యొక్క అలంకారశాస్త్ర నైతిక వాదనలను ఎక్కువగా చర్చించాడు, దీని వెనుక ఇతని ముఖ్య ఉద్దేశ్యం మిమెసిస్ జ్ఞానాన్ని అందిస్తుందని విషాదంలో ఆ పాత్ర కన్న కథ ఆత్మ వంటింది.

అలంకారశాస్త్రాన్ని అరిస్టాటిల్ అందానికి సూచనగా వాడాడు. అతను 'అందం' (Kalos) .... అన్న పదాన్ని పొయిటిక్స్ లో 19 సార్లు ఉపయోగించాడు. ఈ అందం "The master – concept of the poetics"[55] అని Else 1938 అన్నాడు.

### 2.2.9. అగస్టిన్ (Augustine of Hippo 354-430 AD)

ఇతడినే సెయింట్ ఆగస్టిన్ అనికూడా అంటారు. ఇతడు మత తాత్త్వికుడు. అగస్టిన్ పాశ్చాత్య చర్చలు అందిచిన నియోప్లేటోనిస్ట్ తత్వాన్ని మరియు క్రైస్తవ సిద్ధాంతాలని బాగా ప్రచారం చేశాడు. అలంకారశాస్త్రం, అందం గురించి అగస్టిన్ అభిప్రాయాలు ఈ కింది విధంగా ఉన్నాయి. "One should distinguish between beauty and beautifulness as the cause embracing at once all beauty. For, having made this distinctions in all being between participation and things participating, we call beautiful the thing which participates in beautifulness, because from it is imparted to all reality the beauty appropriate to every thing, and also because it is the cause of proportion and brilliance."[56]

---

[55] Else, G.F. (1938) "Aristotle on the Beauty of Tragedy," Harvard Studies in Classical Philology 49: 179–204

[56] Tatarkiewicz, W. (1970) Medieval Aesthetics, trans. R.M. Montgomery, The Hague: Mouton. Page:33

ఈయన ఉద్దేశ్యంలో సౌందర్యానికి అన్వయించే సౌందర్యం మరియు సౌందర్య భావనని ముందుగా మనం వేరు చేసి చూడాలి. అంటే పాల్గొనే క్రియని మరియు పాల్గొనే వారిని వేరు చేసి చూడటం లాగా అన్న మాట. సౌందర్య భావనలో పాల్గొనే వస్తువులు లేదా విషయాలని మనం సౌందర్యంగా భావిస్తాం. వాస్తవానికి సౌందర్యం అన్నింటిలో, అంతటా వ్యాపించి ఉంటుంది.

ఈయన ఉద్దేశ్యంలో సహజ సౌందర్య భావన దైవ సౌందర్య భావన. అంటే ఒక సంక్లిష్ట సౌందర్య భావన దైవ సౌందర్యం అని అర్థం. ఇతని సిద్ధాంతం ప్రకారం ఉత్కృష్ట సౌందర్యం అన్న భావన దేవుని సృష్టి, ఇతని అభిప్రాయాలు చాలా వరకు భగవంతుని సృష్టి మరియు ప్రకృతుల మధ్య సమతౌల్యానికి ప్రయత్నించిన మధ్యయుగపు క్రైస్తవ చర్చి అభిప్రాయాలకి సమానంగా ఉంటాయి.

దీనికి ఉదాహరణగా ప్రతీక సౌందర్యాన్ని అగస్టిన్ వివరించిన తీరు 'సిటీ ఆఫ్ గాడ్' (1972) లో రోమ్ ని వివరించిన తీరుకి సమానంగా ఉన్న విధంగా చెప్పవచ్చు.

**2.2.10. అక్వినక్ (Thomas Aquinas 1225-1274)**

ఇతని పూర్తిపేరు సెయింట్ థామస్ అక్వినస్. ఇతని అక్వినో అనికూడా పిలుస్తారు. ఇటలీకి చెందిన తత్త్వవేత్త. సృష్టి మరియు సృష్టికర్తల మధ్య తేడాల గందరగోళపు పొడుపు కథని పూరించడానికా అన్నట్టుగా అక్వినస్ అగస్టిన్ నియోప్లేటో నిస్ట్ అంశాన్ని స్వీకరించకుండా కళ యొక్క క్రైస్తవ భావనని సామాన్య ఉద్దేశ్యంలో పున:సిద్ధాంతీకరించాడు.

దీనికోసం ఇతను కొన్ని ఖచ్చితమైన విషయాలకి అరిస్టాటిల్ భావాలని స్వీకరించాడు. "Beauty demands the fulfillment of three conditions: the first is integrity, of perfection, of the thing, for what is defective is, in consequence, ugly; the second is proper proportion, or harmony; and

the third is clarity – thus things which have glowing color are said to be beautiful. (Aquinas 1942)"[57]

సౌందర్యం ముఖ్యంగా మూడు నియమాలని పూరించాలని చెపుతుంది. అవి సంపూర్ణత, సమతూకం మరియు స్పష్టత అక్వినస్ కళని మనుషులు బాగా సంతృప్తి చెందినప్పుడు ఉద్భవించే భావనే కానీ సహజ వస్తువుల అనుకరణ కాదని స్పష్టం చేశాడు. ప్రకృతి అనుకరణ కాక ప్రకృతి ఉత్పాదన అనుకరణంగా వర్ణించాడు. ఈ సందర్భంలోనే అలంకారశాస్త్రంలో చిత్రలేఖనం, శిల్పశాస్త్రం వంటి కళలను కూడా చేర్చాడు.

14, 15 శతాబ్దాలలో అలంకారశాస్త్రం ప్రాముఖ్యత మరియు వాస్తవికతల మధ్య ఊగిసలాడింది. అగస్టిన్ సిద్ధాంతాలను అంది పుచ్చుకోని ఉంటే దాంటోపాటి సంప్రదాయ ధృక్పథాలని కూడా ఆవలోకిస్తూ కొత్త సిద్ధాంతాలని ప్రతిపాదించాడు.

### 2.2.11. హచెసన్ (Francis Hutcheson 1694-1746)

స్కాట్లాండ్ కు చెందిన ప్రసిద్ధ తత్త్వవేత్త. యూనివర్సిటి ఆఫ్ గ్లాస్కోలో ఉన్నతవిద్యను అభ్యసించాడు. సౌందర్యం నుండి మనం పొందగలిగే ఆనందం ఏమిటి ? అన్న ప్రశ్నకి సమాధానంగా హచెసన్ "An Inquiry Concerning Beauty, Order, Harmony, Design (the first of the two treatises constituting his Inquiry into the Original of Our Ideas of Beauty and Virtue (Hutcheson 1973)"[58] లు ప్రతిస్పందనలుగా మనం భావించవచ్చు.

సౌందర్యపు ఆనందం కారణం లేకుండా కేవలం సున్నితంగా ఉద్భవిస్తుంది. హచిసన్ ఈ భావనలు సహజంగా, అవసరంగా, వెంటనే జ్ఞానం పెరగకుండా ఉద్భవిస్తాయని తెలిపాడు. సౌందర్యపు ఆనందం సౌందర్య వస్తువుల జ్ఞానం మీద ఆధారపడకుండా ఉంటుంది. ఎలాగైతే

---

57 Berys Gaut and Dominci McIver Lopes. The Routledge companion to Aesthetics. 2nd edition P:36–37

58 Berys Gaut and Dominci McIver Lopes. The Routledge companion to Aesthetics. 2nd edition P:42

తియ్యదనం ఒక లక్షణం ఎలాగో అలాగా మొత్తానికి జ్ఞానం కానీ, కారణం కానీ అందరికీ రసాస్వాదనలో ఏటువంటి పాత్ర పోషించవు అని హచిసన్ అభిప్రాయ పడ్డాడు.[59]

### 2.2.12. బౌమ్‌గార్టెన్ (Alexander Gottlieb Baumgarten 1714 - 1762)

జర్మనీ దేశానికి చెందిన తత్త్వవేత్త. పాశ్చాత్య కళాశాస్త్ర చరిత్రలో మొట్ట మొదటి సారిగా కళలకు ఒక స్వతంత్ర స్థానం, ప్రతిపత్తి ఉన్నదనే విషయాన్ని ప్రతిపాదించిన వాడు బౌమ్ గార్టెన్. ఈయన కళా సమస్యలను ఒక ప్రత్యేక విజ్ఞాన శాస్త్రంగా పరిగణించాలని చెప్పాడమే కాకుండా దీనికి ఈస్థటిక్ అనే పేరుని సూచించాడు. బౌమ్‌గార్టెన్‌ను కళాతత్త్వా శాస్త్రానికి ఆద్యుడిగా విమర్శకులు పేర్కొంటున్నారు. 1735లో ఈయన రాసిన 'Reflections on poetry' అనే గ్రంథంలో మొదటిసారిగా 'ఈస్తటిక్స్' అనే పదాన్ని ప్రయోగించాడు. 1750లో ఈన 'ఈస్తటికా' అనే గ్రంథంలో 'ఈస్తటిక్స్' అంటే Science of sensory అని జ్ఞానేంద్రియ చైతన్య శాస్త్రమని సంభావించాడు. ఈ శాస్త్ర పరిధిలోకి మనస్సుకు తెలిసే వాస్తవాల కన్నా ఇంద్రియాలకూ అనుభూతమయ్యే వాస్తవాలు వస్తాయన్నాడు. ఆయన తన ముందు వారు చెప్పిన సైద్ధాంతిక జ్ఞానానికి బదులు ఇంద్రియ గ్రాహ్య జన్య జ్ఞానానికి ప్రాముఖ్యాన్నిచ్చి ఈ శాస్త్రాన్ని కళలలో ఇంద్రియాల ద్వారా ఏ రకమైన ఆస్వాదన జరుగుతుందో దానిని గుర్తించి వివరించే శాస్త్రంగా తీర్చిదిద్దాడు. తన నూతన సిద్ధాంతాన్ని సాంప్రదాయిక పండిత మార్గంలో అందించాడు. పుట్టని బిడ్డకి బౌమ్ గార్టెన్ నామకరణం చేశాడని ఈ పేరు కొత్తదైనా ఇందులో కొత్త విషయం అంటూ ఏమి లేదని, ఆ తాత్త్విక కవచం వెనుక బలిష్టమైన దేహం లేదని క్రోచే అన్నాడు.[60] కానీ బౌమ్ గార్టెన్ పెట్టిన ఆ పేరే ఇప్పటికి మిగిలిపోయింది. బౌమ్‌గార్టెన్ ఈ శాస్త్రాన్ని గురించి "It analyzed the sensual cognition of the world through art"[61] అని వివరించాడు.

---

[59] Hutcheson, F. (1973) An Inquiry Concerning Beauty, Order, Harmony, Design, ed. P. Kivy, The Hague: Martinus Nijhoff. Page: Sect. II, art. XIV

[60] Benedetto Croce, Aesthetic, IV Chapter, Page: 218, 219

[61] Aesthetics: yuri Borev 13

### 2.2.13. హ్యూమ్ (David Hume 1711-1776)

ఇతడు స్కాట్లాండ్ దేశానికి చెందిన తత్త్వవేత్త. ఎడిన్ బరో విశ్వవిద్యాలయంలో చదువుకున్నాడు. హచిసన్ అభిప్రాయం రసభావనని క్లిష్టతరం చేస్తుందని సిద్ధాంతీకరించడమే హ్యూమ్ యొక్క అలంకారశాస్త్ర సిద్ధాంతాలలో అతని మొదటి అడుగు. హ్యూమ్ హచిసన్ ప్రశ్నలు మరియు సమాధానాలు రెండింటినీ ఏ వాదనా లేకుండా కొట్టివేశాడు. డేవిడ్ హ్యూమ్ సౌందర్య గవేషణకు మూలమైనది వస్తుగత లక్షణాలలో కాక మనసులోన సౌందర్య గ్రహణ శక్తిలో ఉందని భావించాడు. ఈయన దృష్టిలో సౌందర్యం వ్యక్తి నిష్టమైనది. వస్తు నిష్ఠమైనది కాదు. హ్యూమ్ సౌందర్యాస్వాదన ఇంద్రియాల కారణాల రెండింటి కలయిక వలన ఏర్పడుతుంది అని అన్నాడు. “Beauty is no quality in things themselves,” but merely a ‘sentiment’ in “the mind that contemplates them”[62] సౌందర్యం వస్తు విషయం కాదు. ఇది హృదయంలోని ఒక భావన అని దీని అర్థం. ఈయన సిద్ధాంతాలు అలంకారశాస్త్ర విషయాలను అర్థం చేసుకోవటానికి కావలసిన ప్రాథమిక జ్ఞానాన్ని అందిస్తున్నాయి.

### 2.2.14. కాంట్ (Immanuel Kant 1724-1804)

జర్మనీ దేశానికి చెందిన తత్త్వవేత్త. సౌందర్యానుభవం అనేది సహృదయునిలో గోచరించే ప్రత్యేక మానసిక వ్యాపారంగా మొదట చెప్పిన వాడు కాంట్. వస్తువులోని సౌందర్యం రూపం ద్వారా ఆవిష్కారమై అది మనలో అభిరుచిని కలిగిస్తుందంటాడు కాంట్. ఒక వస్తువు మనకు అభిరుచిని కలిగిస్తున్నదంటే దానికి మూలం ఆ వస్తువు యొక్క రూపమేనని కాంట్ అభిప్రాయం. ఆయన ఏ ప్రయోజనాన్ని అపేక్ష లేకుండా ఒక వస్తువును, లేక దాని ప్రతీకను అది అందించే ఆనందం ద్వారా విలువ కట్టే వ్యాపారాన్ని అభిరుచిగా పేర్కొన్నాడు. కాంట్ సౌందర్యాన్ని నిర్వచిస్తూ సౌందర్యం అంటే ఒక వస్తువులోని ప్రయోజకత్వం యొక్క

62 Hume, D. (1985) “Of the standard of Taste,” Essays Moral, Political and Literary, ed. E. Miller, Indianapolis: Liberty Classics. Page: 229–230

రూపం, కాని అది ప్రయోజన విరహితంగా గ్రహింపబడుతుందని చెప్పెను. ఆయన ప్రయోజన విరహితంగా ఒక వస్తువు యొక్క ఉత్కృష్ట రూప సిద్ధియే సౌందర్యం అని చెప్పాడు. కాంట్ వస్తు రూపానికి ప్రాధాన్యం ఇవ్వడమేగాక సౌందర్యం ఈ రూప సృష్టిలో ఉన్నదని కాంట్ పేర్కొన్నాడు. సౌందర్యానికీ, అభిరుచికీ మధ్య గల పరస్పర సంబంధాన్ని కాంట్ తన సిద్ధాంతంలో నిరూపించాడు. అభిరుచికి అనుగుణంగానే సౌందర్యావిష్కారం జరుగుతుందని ఆనందవర్ధనుడంటే సౌందర్యావిష్కారం అభిరుచికి కారణమవుతుందని కాంట్ పేర్కొన్నాడు.

ఇమాన్యుయెల్ కాంట్ రచన 'Critique of Judgment' ఇది 1790లో ప్రచురింపబడింది. ఇది ఆధునిక తత్త్వ అలంకారశాస్త్రానికి ఒక పునాది వంటిది. ఇతని క్రిటిక్ ఆఫ్ జడ్జ్ మెంట్ మొదటి భాగం 'సౌందర్య విశ్లేషణ' అన్న పేరుతో ఉంటుంది. ఇందులో కాంట్ "What is required in order to call an object beautiful"[63] అంటే సౌందర్య వస్తువు అని పిలవబడడానికి కావల్సిన లక్షణాలను 'మెమెంట్స్' అనే నాలుగు భాగాలలో విశ్లేషించాడు. ఇవి ముఖ్యంగా నాణ్యత, క్వాంటిటీ, సంబంధం మరియు మొడాలిటీ అన్న నాలుగు.

ఒక మూల భావన లేకుండా లేదా అవసరం లేకుండా విశ్వజనీనంగా అందరికీ ఆనందాన్నిచ్చేదే నిజమైన సౌందర్యం అని తెలిపాడు [64]. "The beautiful is that which apart from concepts is represented [vorgestellt wird] as the object of a universal satisfaction."[65] విశ్వజనీనంగా అందరికీ సంతృప్తి నిచ్చేదే నిజమైన సౌందర్యమని ఇతని ఉద్దేశ్యం. ప్రకృతిని, కళని అనుసంధానిస్తూ ప్రకృతి కళ వలె అందమైనది, కళ ప్రకృతి వలె కనిపించినప్పుడు మాత్రమే దాన్ని మనం అందంగా భావించాలని అన్నాడు. "Nature is beautiful because if looks like art, and art can only be

---

[63] Kant, I. (1951) Critique of Judgment, trans. J. H. Bernard, New York: Haffner. Page: $1n

[64] Kant, I. (1951) Critique of Judgment, trans. J. H. Bernard, New York: Haffner. Page: $9

[65] Berys Gaut and Dominci McIver Lopes. The Routledge companion to Aesthetics. 2nd edition P:58

called beautiful if we are conscious of it as art while yet it looks like nature"[66]

కాంట్ సిద్ధాంతంలో ప్రధానాంశాలు ఇవి

1. ఒకే సమయంలో అభిరుచి తర్కసహంగానూ, తర్కాతీతంగానూ ఉండడం.

2. ఊహల స్వేచ్ఛా సంచారాన్ని నొక్కి చెప్పడం.

3. సౌందర్యానుభవం భావనాతీతం గానూ, వర్ణ్య వస్తువు పట్ల అనాసక్తం గానూ ఉంటుందనడం.

4. సౌందర్యాసక్తికి కేంద్రమైన వస్తువు కళ కాదు ప్రకృతి మాత్రమే.

5. సౌందర్యానుభవం లోని నైతిక, ఆధ్యాత్మిక, చైతన్య వివరణ సహృదయునికి సృష్టిలో గర్భితమైన అలౌకికతా స్వభావాన్ని దర్శింపజేస్తుందనడం.[67]

### 2.2.15. హెగెల్ (Georg Wilhelm Friedrich Hegel 1770-183)

జర్మనీ దేశానికి చెందిన తత్త్వవేత్త. జార్జ్ విల్ హెల్మ్ ఫ్రెడరిక్ హెగెల్ (Georg Wilhelm Friedrich Hegel 1770–1831) Fichte మరియు షెల్లింగ్ లతో పాటు కాంట్ ని అనుసరించిన 'జెర్మన్ ఐడియాలిస్ట్' ల త్రయంలో ఒకడు. కాంట్ వలనే హెగెల్ తొలి రచనలలో అలంకారశాస్త్ర ప్రస్తావన బహుకొద్ది. ఇతని ప్రయాణం సైన్స్ నుంచి అలంకారశాస్త్ర దిశగా సాగింది. ఈయన కళని మతంలో ఉంచి విశ్లేషించాడు. తర్వాత కళ మెదడు వృద్ధికి దోహదపడుతుందని భావించి కళాసౌందర్యం మీద దృష్టి సారించాడు. ఇతను ప్రకృతి సౌందర్యం మీద కంటే కళాసౌందర్యం మీద ఎక్కువ దృష్టి సారించాడు. ఈయన చరిత్రలో కళ యొక్క మహత్యాన్ని తెలుపుతూ "the form of art has ceased to be the supreme need of the spirit. No matter how excellent we find the statues of the

[66] Kant, I. (1951) Critique of Judgment, trans. J. H. Bernard, New York: Haffner. Page: 45

[67] విశ్వనాథ సౌందర్య దర్శనము: యు.ఎ. నరసింహ మూర్తి 2009 పుట:29

Greek gods, no matter how we see God the Father, Christ and Mary so estimably and perfectly portrayed: it is no help; we bow the knee no longer."[68] ఇతను కళని మతానికి అనుసంధానించి విశ్లేషించడం విమర్శకి కారణమయ్యింది. సైన్స్ నుండి మతానికి మెదడు నుండి కళకి ఈ విధంగా ఈయన సిద్ధాంతం అనేక సంక్లిష్టతలను కలిగి ఉంటుంది.

హెగెల్ ఈ శాస్త్రాన్ని లలిత కళలకు సంబంధించిన తత్త్వ శాస్త్రం అని పేర్కొన్నాడు. ఈ పదాన్ని ఆయన విశిష్టమైన పరిమితార్థంలో ప్రయోగించాడు. అందువల్ల ఆయన తన గ్రంథానికి 'Philosophy of Fine art' అని పేరు పెట్టాడు. దీనిలో అతడు స్వతంత్ర కళల సమస్యలకు పరిష్కారాలను చూపాడు. హెగెల్ సౌందర్యాన్ని కళను వేరు వేరుగా చూశాడు. ''అంతర్గత ఘర్షణలకు, పరిష్కారాలకు ఒక భౌతిక రూపాన్ని కల్పించి అందులోని చైతన్యానికి జ్ఞానేంద్రియ గ్రాహ్యమైన రూపకల్పన చేసి తద్వారా ఆత్మీయతావిష్కారాన్ని పొందడమే 'కళ' అని హెగెల్ ఒక నూతనమైన, ప్రత్యేకమైన నిర్వచనాన్ని ఇచ్చాడు.''[69] కేవలం మనస్సు తన అపరిమిత తత్త్వాన్ని తెలుసుకోవడానికీ పొందే పరిణామంలో ఒక దశగా మాత్రమే కళను భావిస్తే సౌందర్యాన్ని ఇంద్రియ ప్రపంచం ఉన్న ముసుగు ద్వారా కేవలం మనస్సు (Absolute) సౌందర్యంగా ప్రకాశిస్తుందని పేర్కొన్నాడు. ''In this way Beauty may be defined as the sensible appearance of the idea''[70] అంటే ఇంద్రియ గ్రహణకు వీలైన వస్తువు ద్వారా కేవలం మనస్సు ప్రకాశించడమే సౌందర్యం అనే అర్థంలో చెప్పి దానికి రూపం ఉండి తీరాలంటాడు.

హెగెల్ కళకు నిర్ధిష్టమైన అస్తిత్వం దాని రూపం ద్వారానే కలుగుతుందంటాడు.'' An Ideal content must gleam through the sensible form: form is spiritualized by the ideal light.''[71] కళలకు సౌందర్యానికి ఉన్న పరస్పర సంబంధం

---

[68] Hegel, G. W. F. (1975) Aesthetics: Lectures on Fine Art, trans. I. M. Knox, Oxford: Oxford University Press. Page: 103

[69] విశ్వనాథ సౌందర్య దర్శనం: 2009 పుట 29

[70] Aesthetic: B.Crore 299

[71] Aesthetic: B. Crore 299

గురించి హెగెల్ చేసిన చర్చ విస్తృతంగా ఉంది. 'కళ సౌందర్యాలు భిన్నమైనవని ఇతని అభిప్రాయం.'[72] మానవ మనస్సు నుంచి స్వీకరించేదే ఉత్తమ కళ అంటాడు హెగెల్. సౌందర్యం Ideal గా ఉంటుందన్నది ఆయన అభిప్రాయం. ప్రకృతి సౌందర్యం కన్నా, కళా సౌందర్యం గొప్పదని హెగెల్ తీర్పు. హెగెల్ లలిత కళాతత్త్వ విచారం చేస్తూ కళలను మూడు ప్రాతిపదికల మీద మూడు విధాలుగా విభజించాడు. ఏ రకమైన విభజన చేసినా అత్యున్నతమైన కళా సాహిత్యమే అని ఆయన నిశ్చితాభిప్రాయం.

### 2.2.16. ఎమర్సన్ (Ralph Waldo Emerson 1803-1982)

అమెరికాకు చెందిన ప్రసిద్ధ కవి, విమర్శకుడు. హార్వార్డ్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేశాడు. సౌందర్యాన్ని విశిష్టమైన విషయంగా భావించిన వాళ్ళలో ఎమర్సన్ ఒకడు. ఈయన అభిప్రాయంలో కళ అన్నది దాని స్రష్ట తన కృతికి వేసిన బాట. స్వచ్ఛమైన, పవిత్రమైన దేహంలోని నిర్మలమైన ఆత్మకే రమణీయ దర్శనం కలుగుతుంది అన్నాడు ఎమర్సన్. ఈయన సౌందర్యాన్ని ఒక విషయంగా భావించకుండా, అది (ప్రకృతిగతమైన సౌందర్యం) దాన్ని ప్రేమించే కన్ను తటస్థపడినప్పుడు ద్విగుణీ కృతమవుతుందంటాడు.[73] అంటే ఆస్వాదకుని హృదయంలోనే సౌందర్యం వాసనా రూపంగా ఉండి ప్రకృతిగతంగా ఉండే సౌందర్యం యొక్క ప్రోద్దీపనలో అది ఉద్బుద్ధమవుతుందని అర్థం. ఎమర్సన్ సౌందర్యాన్ని పరమేశ్వర సృష్టికే సృజన శక్తిగా పేర్కొన్నాడు. సృష్టి సుందరంగా తీర్చిదిద్దబడలేదని అది మొదటి నుండి సుందరమైనదే అని అంటాడు. సౌందర్యంతోనే సృష్టి పుట్టిదంటాడు. ఎమర్సన్ సౌందర్యం పై మౌళికమైన (Original) వివేచన చేస్తూ సౌందర్యం ఆస్వాదకుని హృద్గతంగానే ఉంటుందన్నాడు.

### 2.2.17. కొపెన్ హ్యూయ్యర్ (Arthur Schopenhauer 1788-1860)

ఈయన జర్మనీకి చెందినవాడు. ఆర్థర్ కొపెన్ హ్యూయ్యర్ (Arthur Schopenhauer) (1788 – 1860) కాంట్, ప్లేటో మరియు ఆసియన్ ముఖ్యంగా

[72] Comparative Aesthetics: K.C. Padey 393

[73] విశ్వనాథ సౌందర్య దర్శనము: యు.ఎ. నరసింహ మూర్తి 2009 పుట:31

భారతీయ బౌద్ధ మరియు హిందూ మత తత్త్వజ్ఞుల అభిప్రాయలని క్రోడీకరించి ఒక కొత్త సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. ఈయన తన పుస్తకం " The world as will and representation (1966) లో కాంట్ అభిప్రాయాలని మరియు అతని ముందుతరం వారి అభిప్రాయాలనీ ధిక్కరిస్తూ పాశ్చాత్య అలంకార శాస్త్రంలో ఇచ్ఛ (లేదా) కోరిక (లేదా) వాంఛని పరిచయం చేశాడు. ఇచ్ఛని బట్టి అంతా ఉంటుందని అన్నాడు.

"Pure willing or will satisfies the essential criteria for thing – in – itself by virtue of being excluded from the principle of individuation and principle of sufficient reason; in effect, will as a result transcends space, time and causality, precisely as Kant requires of thing – in – itself"[74] దీని గురించి ఇతను వివరంగా తన తరువాతి పుస్తకాలలో "Human, all too Human (1986) మరియు on the genealogy of Morality (1998) వివరించాడు.

### 2.2.18. షిల్లర్ (Johann Christoph Friedrich von Schiller 1759-1805)

ఇతడు జర్మనీ కవి, తత్త్వవేత్త. జోహన్న్ క్రిస్టాఫ్ ఫెడరిక్ వాన్ షిల్లర్ (Johann Christoph Friedrich von Schiller) (1759–1805) తన రచనలైన "On the Aesthetic Education of Man in a Series of Letters (1965) మరియు "On Naïve and Sentimental Poetry (1981) లో విషాద కళ మరియు విషాద వస్తువుల వలన కలిగే ఆనందం వంటి అంశాలను చర్చించాడు. కాంట్ చేత ప్రబోధితుడైన Schiller వర్ణ్య వస్తువు పట్ల అనాసక్తి కారణంగా సౌందర్యానుభవం, నైతిక, రాజకీయ జ్ఞాన సముపార్జనా మార్గంగా మారుతుందని భావించాడు.[75] ఇతను తన సిద్ధాంతాలతో పాటుగా తన నాటకాలకి కూడా ప్రసిద్ధుడు. ఇతను తన నాటకాలైన Sturm und Drang (storm and stress), The Robbers మొదలైన వంటి వాటిలో తన అలంకారశాస్త్ర సిద్ధాంతాలని నిరూపిస్తూ తత్త్వజ్ఞులని అబ్బురపరిచాడు.

[74] Schopenhauer, A. (1966) The World as Will and Representation, 2 vols, trans. E.F.J. Payne, New York: Dover. Page: 1.98–110, 2.191–200

[75] నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:29

**2.2.19. షెల్లింగ్ (Friedrich Wilhelm Joseph Schelling 1775-1854)**

ఇతను జర్మనీ తత్త్వవేత్త. ఫ్రెడరిక్ విల్ హెల్మ్ జోసెఫ్ వోన్ షెల్లింగ్ (Friedrich Wilhelm Joseph von Schelling) (1775–1854) ఈ త్రయంలో అఖరివాడు. ఇతను కూడా షెల్లర్ వలె ఇతను కూడా రొమాంటిసిజమ్ ని అనుసరించాడు. ఇతను ప్రకృతిని కళా వస్తువుగా భావించాడు. ఇతను చరిత్రని ఒక నాటకంగా అభివర్ణించి ఇది కళ యొక్క పనితనంగా మెచ్చుకొన్నాడు. ఇతను కళకి ఎక్కువ ప్రాధాన్యమిచ్చాడు .

**2.2.20. క్రోచే (Benedetto Croce 1866-1952)**

ఇటలీకి చెందిన తత్త్వవేత్త. నోబుల్ బహుమతి గ్రహీత. సౌందర్య మీమాంసాలో క్రోచే ప్రతి పాదించిన అంశాలు ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి. క్రోచే 1920లో 'ఈస్తటిక్స్' అనే గ్రంథాన్ని రాశారు. క్రోచే అనుభూతిని కళా విషయంగా లేదా కళలోని ప్రధానాంశంగా చెయ్యడం ద్వారా కళకు, కళాత్మక విలువకు గల నిర్వచనాన్నే మార్చివేసాడు. అనుభూతి అనేది ఒక రకమైన గాఢంగానూ, ఉద్వేగంగానూ ఉంటుందని, ఇది గుర్తింప దగిన స్వభావం గల దర్శనాభివ్యక్తి ననుసరించి ఉంటుందే గానీ దీనికి వేరే లక్షణం ఉండదని క్రోచే పేర్కొన్నాడు. మానవ చైతన్యంతో నిర్మితమైన ప్రకృతి కంటే భిన్నమైన పరిశుద్ధ ఆధ్యాత్మిక చైతన్యంతో నిండిన కళా ప్రపంచాన్ని గూర్చి క్రోచే వివరించాడు. క్రోచే సిద్ధాంతంలో కళలో వికృతత్వానికి స్థానం లేదు.[76] క్రోచే కళని ఒక ఉద్దేశ్యంగా భావించాడు. క్రోచి "Art is symbol, all symbol, that is all significant. But symbol of what? Signifying what? Intuition is truly artistic, is truly intuition and not a chaotic accumulation of images, only when it has a vital principle which animates it and makes for its complete unit."[77]

---

[76] విశ్వనాథ సౌందర్య దర్శనము: యు.ఎ. నరసింహ మూర్తి 2009 పుట:30, 31

[77] Croce, B. (1965) Guide to Aesthetics, trans. P. Romanell, New York: Bobbs–Merrill. Page:23

తీవ్రభావనని సూచించేదే కళ అని , కళని తీవ్ర భావాలకి సంకేతంగా వాడతారని అంటాడు. కానీ ఇతని సిద్ధాంతాలకి చాలా అభ్యంతరాలు ఉన్నాయి.

క్రోచే రూపాన్ని గురించి చెప్తూ కళ, సంగీతం, కావ్యం పుస్తకాలలో లేదని అది కళాకారుని ఆత్మలో ఉందంటాడు. ఆయన కళ ఆంతరికం, అవిభాజ్యంగా చెప్పెను. నైరుప్య కళ ఒక రోగమని ఆరోగ్యమైన కళ కాదంటాడు క్రోచే. క్రోచే సఫలీ కృత అభివ్యంజన లేక అభివ్యక్తే సౌందర్యమని నిర్వచించెను. సౌందర్యంలో పరిణామ భేదం ఉండదంటాడు క్రోచే. ఇతడు కళను ఇంద్రియ ప్రభావాల సంస్కారాల అఖండ పరస్పర ప్రగాఢ సమ్మేళనంగా భావించాడు. ఆయన కళా ప్రక్రియకు నాలుగు దశలను పేర్కొన్నాడు. 1. ఇంద్రియగత ప్రభావాలు 2. అభివ్యక్తి 3. సౌందర్యాత్మక ఆనందం 4. సౌందర్యం భౌతిక రూపాలలో ఉంటే ధ్వనుల్లో, రేఖల్లో, రంగుల్లో, లయల్లోకి రూపాంతరం చెందడం.

ఈ నాలుగింటిలో అభివ్యక్తే ప్రధానమంటాడు క్రోచే. క్రోచే కళ దేశ కాలాలకు అతీతం కాదని, కళను ఒక పరిపూర్ణ ప్రక్రియగానూ, సమగ్రమైనది గానూ, సంశ్లిష్టమైనది గానూ గుర్తించి కళా స్వభావం లోతుల్లోకి వెళ్లాడు. ఈయన కళాకృతిని అర్థం చేసుకోవాలంటాడు. ఎందుకంటే, కళాకారుని వ్యక్తిత్వం రూపొందేది వీటి వల్లనే గనుక కళకు అనువాదం అసంభవం అంటాడు క్రోచే.

### 2.2.21. కొలింగ్ ఉడ్ (Robin George Collingwood 1889-1943)

ప్రసిద్ధ ఆంగ్ల తత్త్వవేత్త మరియుచరిత్రకారుడు ఆక్స్ ఫర్డ్ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేశాడు. కళకు సంబంధించిన సౌందర్యతత్త్వాన్ని వివరిస్తూ 20యవ శతాబ్దపు అలంకార శాస్త్ర ప్రధాన రచనలో ఒకదానిగా గుర్తించిన Principles of Art (1938) ని రచించాడు. కళ సౌకర్యం కాదు, చెడు కళని మనం భరించలేము. మనల్ని మనం తెలుసుకోవటమే జీవితానికి అర్థం. ఇది భేదికానుభావానికి ఆవల ఉంటుంది. మనం చేసే ప్రతి పనీ ప్రతి పలుకు కళా రచనే .అందుకే మనం ప్రక్కవారిని ఎంతగా మోసం చేసినా మనల్ని మనం మోసం చేసుకోరాదు. అలా గనుక చేస్తే అది చెడు విత్తనం నాటితే విషవృక్షం వచ్చినట్లుగా ఎటువంటి మానసిక రుగ్మతకైనా దారి తీయవచ్చు. ఇది సమాజ నాశనానికి

హేతువు ఇదే విధంగా కళాకారుడి గురించి వివరిస్తూ కోలింగ్ ఉడ్ "The artist's business is to express emotions; and the only emotions he can express are those which he fells, namely his own.... If he attaches any importance to the judgment of his audience, it can only be because he thinks that the emotions he has tried to express are... shared by his audience... In other words he undertakes his artistic labour not as a personal effort on his own private behalf, but as a public labour on behalf of the community to which he belongs."[78] కళాకారుని పని భావ వ్యక్తీకరణా. అతను వ్యక్తీకరించగలిగే భావాలు అతను అనుభవించినవి అంటే కేవలం అతనివి మాత్రమే. అతను ప్రేక్షకుల నిర్ణయానికి అనుబంధంగా ఏమన్నా ఊహిస్తే అది కేవలం అతని భావ వ్యక్తీకరణలు అతను ప్రేక్షకులు పంచుకున్నట్టుగా భావించటం వలన మాత్రమే ఇంకోరకంగా చెప్పాలంటే అతను కళ అనే శ్రమని తన వ్యక్తిగత ప్రయత్నంగా వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా సమాజపు శ్రమగా అతను ఉన్న వర్గ సముదాయపు తరపున చేస్తాడు. అంటే వారు కేవలం కళాకారులే కాదు వారు సమాజపు ప్రతినిధులన్న మాట.

కాలింగ్ వుడ్ శిల్పం కళా సృజనకు సాధనమే కాక లక్ష్యమని కూడా భావించాడు. కళ కూడా కాలింగ్ వుడ్ దృష్టిలో ఒక అభివ్యక్తి కావడం చేత అభివ్యక్తికి కూడా అభివ్యక్తే లక్ష్యం. అభివ్యక్తి కళాకారుడి స్వేచ్ఛా మనః ప్రవృత్తికి రూపం ఇచ్చేదిగా భావించరాదు. ఆ అనుభూతి రూపంలో మాత్రమే ఇమిడి ఉంటూ ఆ రూపం నుండి మాత్రమే పొందగలిగేలా ఉంటుంది. అలాకానప్పుడు కళ అంతకు పూర్వమే స్థిరపడినవీ, దేనికదిగా గుర్తించడానికి వీలుపడేవీ అయిన మనో వ్యాపారాలను వ్యక్తం చేస్తూ శిల్ప రూపాలలో ఒకటిగా మారి తన ప్రత్యేకతను కోల్పోతుందని పేర్కొన్నాడు. క్రోచేలాగే కాలింగ్ వుడ్ కూడా వర్ణనను విడిచి అభివ్యక్తిని

[78] Collingwood, R.G. (1938) Principles of Art, Oxford: Clarendon Press. Page: 314–315

సమర్థించాడు. సౌందర్యం వికృతత్వంతోను, వికృతత్వం సౌందర్యంతోను కలిసి ఉంటుందని ఆయన భావించాడు.[79]

### 2.2.22. శాంతాయన (George Santayana 1863-1952)

ఇతడు అమెరికాకు చెందిన తత్త్వవేత్త. హార్వార్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకున్నాడు. సౌందర్యం గురించి లోతైన విచారణ గావించిన తాత్త్వికుడు శాంతాయన. 'The Sense of Beauty' ఈయన రాసిన ప్రముఖ గ్రంథం. ఈ గ్రంథంలో సౌందర్యం అంటే ఏంటో వివరంగా పేర్కొన్నాడు. 'సౌందర్యం అనేది మూర్తీభవింప జేయబడిన సముఖమైన, ఆంతరంగికమైన విలువ' అని చెప్పాడు. దీన్నే మరొక విధంగా నిర్వచిస్తూ 'ఒక వస్తువు యొక్క గుణంగా గుర్తింపబడిన ఆనందమే సౌందర్యం' అన్నాడు. సౌందర్యం యొక్క స్వరూప, స్వభావాల గురించి చెబుతూ, సౌందర్యానికి స్వతంత్ర అస్తిత్వం లేదని, ఆస్వాదన తప్ప దీనికీ వేరే ఉనికి లేదన్నాడు. ఆస్వాదింపబడిన సౌందర్యం అనుభవించని ఆనందం ఒక్కటే అని పేర్కొన్నాడు.

ఈయన దృష్టిలో సౌందర్యం వస్తువు యొక్క విలువగానే భావింపబడింది. దేనిని అయినా మనం మంచిది కాబట్టి కోరుకోము, దాన్ని మనం కోరుకుంటున్నాం కాబట్టే మంచిదవుతుంది. అని సౌందర్య సిద్ధాంతాన్ని ప్రతిష్టాపించాడు సాంటాయానా.

### 2.2.23. Longinus (లాంజినస్ 213-273AD)

ఇతడు గ్రీక్ తత్త్వవేత్త. లాంజినస్ కాలం విషయంలో స్పష్టత లేదు. సౌందర్యశాస్త్రంలో లాంజినస్ ప్రతిపాదించిన సిద్ధాంతం On the sublime. దీని తెలుగులో రమణీయోదత అని వడలి మందేశ్వరరావు వివరించారు.[80] కవితలో, వచనంలో, వకృత్వంలో ఒక్కొక్క చోట భాష రెక్కలువిప్పుకొని వినువీదికి ఎగసినట్లు కనబడుతుంది. అలాంటప్పుడు దాన్ని ఔనత్యం మనకి

---

[79] D.E. Berylyne. Characterization of Art & Beauty, Aesthetics and Psychobiology, Appleton Century – Crofts, Educational Division, Meridith Corporation, University of Torento, P:118

[80] మందేశ్వరరావు, వడలి. పాశ్చాత్యసాహిత్యవిమర్శ చరిత్ర–సిద్ధాంతాలు. 1994: 57

దిగ్భ్రాంతిని కలిగిస్తుంది. ఒకవైపు అనుభూతిని మరొకవైపు ఉపదేశాన్ని, మరోకవైపు సమ్మోహనాన్ని ఏకకాలంలో కలిగించే ఇటువంటి గుణాన్ని రమణీయోదాత్తత అంటారని లాంజినస్ అభిప్రాయం.[81] మాటగాని, కవివర్ణనగాని, రసావేశాన్ని కలిగించడానికి గల కారణమేమిటనేది ఈ రమణీయోదాత్తత వివరిస్తుంది. కవినుంచి ఉందయించే ఉదాత్తభావం ఉవ్వెత్తుగా ఎగసిపడినప్పుడు శ్రోతకి లేదా పాఠకుడికి ఆనందం కలిగిస్తుంది. దీనికి కొన్ని లక్షణాలను చెప్పాడు. 1. Good or Bad Style of writing. 2. Elevation of Style 3. Essence of Simplicity అనేవి ప్రేక్షకుని లేదా శ్రోతని కట్టిపడేసే అంశాలు. వీటిని On the sublimity of sourcesగా ఐదింటిని చెప్పాడు. 1.Great Thoughts, 2. Strong Emotions, 3. Cretan figures of thoughts, 4.cretan figures of speech and noble diction, 5. Dignify word arrangement ఇవన్నీ రమణీయోదాత్తతను కలిగించే అంశాలన్నాడు.[82]

సౌందర్య శాస్త్రం బౌమ్ గార్టెన్ తో సిద్ధాంతరూపంలో కనిపించినా తర్వాత కాలంలో అనేక మంది ఈ శాస్త్రం గురించి కృషి చేశారని ఇంతవరకు వివరించిన దానిని బట్టి తెలుస్తుంది.

భారతీయాలంకారికులు కవిత్వాన్ని లేదా సాహిత్యాన్ని ప్రధాన కేద్రంగా చేసుకొని తమ సౌందర్య సిద్ధాంతాలను ప్రతిపాదించారని, అలాగే సత్యం, శివం, సుందరం అనే భావనలను ఆధ్యాత్మిక దృష్టితో వివేచించారని తెలుస్తుంది. అలాగే లలిత కళల గురించి కొంతమంది ప్రస్తావించినా, వాటన్నింటిని సాహిత్య కేంద్రంగానే సమన్వయించే ప్రయత్నం చేశారు. నాట్యాన్ని సమాహార కళగా భావించి దానిలో అంతర్భాగంగా చూశారు. వాటితోపాటు మనోభావాలను వివరించటంలో చాలా లోతులకు వెళ్ళారు. అలాగే శబ్దార్థాల నిర్మాణాన్ని అది చూపే ప్రభావాన్ని బలంగా విశ్లేషించారు. అందుకనే భారతీయాలంకారిక శాస్త్రాలు కావ్య సౌందర్యంలో భాగంగానే భాషను కూడా చూశారు.

[81] మందేశ్వరరావు, వడలి. పాశ్చాత్యసాహిత్యవిమర్శ చరిత్ర–సిద్ధాంతాలు. 1994:58

[82] www.wikipedia.com./ longinus

పాశ్చాత్యులు సౌందర్యాన్ని కేవలం కావ్యానికి మాత్రమే సరిపెట్టకుండా ఆధ్యాత్మిక దృష్టికే పరిమితం కాకుండా ఇతర అన్ని కళలకు జీవిత వాస్తవికానుభవాలకు ప్రాధన్యతనిస్తూ సామాజిక కేంద్రంగా సౌందర్యాన్ని చూశారు. అందుకనే కళ ప్రయోజనం, ఇతర కళలలో సౌందర్య అంశాల వివేచన, ఇంద్రియానుభూతుల పరిగణన వంటి అంశాలపై వారి దృష్టిని కేంద్రికరించారు. ఈ అంశాలన్ని పై సిద్ధాంతాలలో సాధ్యమైనంత స్పష్టంగా వివరించే ప్రయత్నం చేశాను.

ఈ సైద్ధాంతిక అవగాహనతో తెలుగులో వచ్చిన సౌందర్య శాస్త్రాన్ని, విమర్శకులను రాబోయే అధ్యాయంలో వివరించే ప్రయత్నం చేస్తాను. దీనివల్ల ఈ సిద్ధాంతాల అవగాహన వారి విమర్శలో ఎంతమేరకు ఉందనే అంశాలను గుర్తించడానికి వీలవుతుందని అనుకుంటున్నాను.

## మూడవ అధ్యాయం

# తెలుగులో

# సౌందర్యశాస్త్ర విమర్శ – విమర్శకులు

మూడవ అధ్యాయం

# తెలుగులో సౌందర్యశాస్త్ర విమర్శ - విమర్శకులు

### 3.0 ఉపోద్ఘాతం

తెలుగులో సౌందర్య శాస్త్ర విమర్శ మూడు రకాలుగా కనిపిస్తుంది. సంస్కృతాలంకార శాస్త్రాలను కొనసాగిస్తూ వచ్చిన లక్షణ గ్రంథానుగుణ విమర్శ. దీనిని పూర్తిగా ఆధునికశాస్త్రదృష్టితో దాన్ని విమర్శగా పరిగణించకపోయిన సౌందర్యదృష్టితో చూసినప్పుడు దీనిలో గ్రహించాల్సిన అనేకాంశాలున్నాయి. అందువల్ల సంస్కృతాలంకారిక సూత్రాలను ఆధారంగా చేసుకొని వచ్చిన తెలుగు సాహిత్యవిమర్శను ఒక భాగంగానూ, తెలుగు కవులు వ్యక్తం చేసిన సౌందర్య శాస్త్ర అంశాలను మరోక విభాగంగానూ, పాశ్చాత్య విమర్శ సౌందర్య శాస్త్ర, సంస్కృతాలంకారిక శాస్త్రాలతో సమన్వయంతో వచ్చినటువంటి విమర్శగా మూడు రకాలుగా కనిపిస్తుంది. దీనిలో మొదటి దానిని లక్షణ గ్రంథాలకే పరిమితం చేసిన వాళ్ళు కొందరైతే దాని ఆధారంగా వచ్చిన కవుల అభిప్రాయాలుగా కావ్యావతారిక విషయాలుగా పరిగణించేవారు ఇంకొందరు. (జి. నాగయ్య, రాచపాళెం చంద్రశేఖర రెడ్డి తదితరులు). మూడింటిని సమన్వయం చేసిన వాళ్ళు ఇంకొందరు. (విశ్వానాథ, జీవియస్, సంజీవ్ దేవ్, ముదిగొండ తదితరులు). భారతీయ లాక్షణిక విమర్శగా చెప్పే సంస్కృతాలంకారిక సూత్రాలను, సిద్ధాంతాలను సమన్వయం చేస్తూనే సౌందర్య దృష్టిని పదర్శించేవారు కట్టమంచి రామలింగారెడ్డి, పురాణం సూరిశాస్త్రి, దువ్వూరి రామిరెడ్డి, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ, కొండూరి వీర రాఘవా చార్యులు తదితరులను చెప్పుకోవచ్చు.

### 3.1 ప్రాచీనాంధ్ర ఆలంకారికులు

తెలుగులో వ్యాకరణ ఛందోలంకార గ్రంథాలను కూడా తొలినాళ్ళలో అలంకారిక గ్రంథాలగానే భావించారు. అందవల్ల ఆంధ్ర శబ్ధ చింతామణి సంస్కృతంలో ఉన్నప్పటికి అందులో తెలుగు వ్యాకరణ విషయాలను చెప్పినప్పటకీ దానిని కూడా ఆలంకారికశాస్త్ర గ్రంథంగానే భావిస్తున్నారు. ఈ గ్రంథకర్త కర్తృత్వంపై వివాదాలు ఉన్నాయి. నన్నయ అని

కొందరు కాదని మరికొందరు వాదోపవాదాలు చేసారు. ఒకవేళ నన్నయ కృతమే అయితే పదకొండవ శతాబ్దంలో తొలి ప్రాచీనాంధ్రాలంకారికుడిగా నన్నయను గుర్తించవచ్చు. దానిలో ''విశ్వ శ్రేయః కావ్యమ్'' అనే లక్షణం కావ్యానికి సంబంధించిందే. మిగితావన్ని వ్యాకరణానికి సంబంధించినప్పటికి ఈ పై శ్లోకం ఎంతో విలువైంది.

ఆయన తరువాత వేములవాడ భీమకవి కవిజానాశ్రయం రాసినట్లుగా చెబుతారు. క్రీశు శకం 1080-1150 మధ్య ప్రాంతంలో దీనిని రాసినట్లుగా భావిస్తున్నారు.[1]

వీరి తరువాత విన్నకోట పెద్దన (క్రీ.శ. 1377-1407) కావ్యాలంకార చూడామణి రాశాడు. దీనిలో అలంకారశాస్త్రానికి సంబంధించిన, భావ రసాదులకు సంబంధించిన లక్షణాలను చెప్పాడు. అలాగే నాయిక, నాయకుల గురించి చర్చించాడు. కవుల రకాల గురించి కూడా వివరించాడు. అందుకని దీనినే తొలి ఆంధ్రాలంకారశాస్త్రంగా చెబుతున్నారు. ఆ విధంగా తొలి ఆంధ్రాలంకారికుడిగా విన్నకోట పెద్దనను పేర్కొనవచ్చు.

గౌరన (క్రీ.శ. 1380-1450) రాసిన లక్షణదీపిక, విద్యానాథుడు (క్రీ.శ.14వ శతాబ్దం) రాసిన ఆంధ్ర ప్రతాపరుద్రయశోభూషణం, అనంతామాత్యుడు (క్రీ.శ. 1435 ప్రాంతం) రాసిన రసాభరణం, ఛందోదర్పణం, కాచిరాజు బసవన్న (క్రీశ. 1480-1530) రాసిన కవిసర్పగారుడం, వెల్లంకి తాతంభట్టు (క్రీ.శ. 1500) రాసిన కవిచింతామణి, తిమ్మయ్య మంత్రి (క్రీశ. 16వ శతాబ్దం) రాసిన లక్షణ మంజరి, చిత్రకవి పెద్దన (క్రీ.శ. 1550) రాసిన లక్షణ సార సంగ్రహం, రామరాజ భూషణుడు (క్రీ.శ. 1557) రాసిన కావ్యాలంకార సంగ్రహం, వడ్డి కవివర్య (క్రీ.శ.1600) రాసిన శృంగార రసాలవాలం, కృష్ణాద్వరి (క్రీ.శ.1613-1631) రాసిన రఘునాథ భూపాలనీయం, కాకుమారి అప్పకవి (క్రీ.శ. 16శతాబ్దం) రాసిన అప్పకవీయం, వార్తాకవి  రఘునాథయ్య (క్రీ.శ. 1650) రాసిన లక్షణదీపిక, గణపవరపు వెంకటకవి (క్రీ.శ. 1675-1689) రాసిన సర్వ లక్షణ శిరోమణి, గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన అహోబలపతి (క్రీ.శ. 1677) రాసిన అహోలబల పండితీయం ఆంధ్ర శబ్ద చింతామణి వ్యాఖ్యానం, కళువె వీరరాజు (క్రీ.శ. 1679) రాసిన

[1] బాలిరెడ్డి, వడ్డి. తెలుగులో అలంకారశాస్త్రవికాసం:1995; 48

వీరభూపాలీయం, పొత్తపి వెంకట రమణ కవి (క్రీ.శ.1740-788 ) రాసిన లక్షణ శిరోమణి, ఆడిదం సూరికవి (క్రీ.శ. 1570-85) రాసిన ఆంధ్రా చంద్రాలోకం, వేదం వెంకటరాయశాస్త్రి 1882లో రాసిన ఆలంకార శాసనాలు, చలవచయ్య రంగాచార్యులు రాసిన 1944 అలంకార వసంతం మొదలైనవన్ని ఆంధ్రాలంకారికుల కృషిని వివరిస్తున్నాయి. అయితే ఇవన్ని సంస్కృత కావ్యాలంకారాలకు వ్యాఖ్యానాలుగా, సార సంగ్రహాలుగా తెలుగు పద్యాలలో వివరించిన లక్షణ గ్రంథాలుగా తెలుస్తున్నాయి.

### 3.2. కావ్యాలలో లక్షణ ప్రతిపాదిత ఆంధ్రాలంకారిక కవులు

తెలుగు కవులలో కొంతమంది కావ్యాలను రాస్తున్న సందర్భంలోనే కావ్య సౌందర్యానికి కావలసిన లక్షణాలను వివరించడం కనిపిస్తుంది. దీన్ని 1968లో *'తెలుగు కావ్యావతారికలు'* అనే గ్రంథంలో ఆచార్య జి. నాగయ్య, 1992లో *'ప్రాచీనాంధ్రకవుల సాహిత్యాభిప్రాయాలు-అభిరుచులు'* గ్రంథంలో తెలుగు కవులు ప్రతిపాదించిన కావ్య సౌందర్య విషయాలను వివరించారు.[2] అలాగే విశ్వనాథ సత్యనారాయణ *'నన్నయగారి ప్రసన్న కథాకలితార్థయుక్తి', 'అల్లసానివాని అల్లికజిగిబిగి'* మొదలైన గ్రంథాలలో ఈ విధమైన కృషే కనిపిస్తుంది.

పదకొండవ శతాబ్దానికి చెందిన నన్నయ (ప్రసన్న కథాకలితార్థయుక్తి, అక్షరరమ్యత, నానా రుచిరార్థసూక్తి), ఇంచుమించు అదే శతాబ్దానికి చెందిన నన్నెచోదుడు (ప్రబంధ లక్షణాలు), పన్నెండవ శతాబ్దానికి చెందిన పాల్కూరికి సోమన తది తర శివకవులు కావ్య సౌందర్యానికి చెందిన కొన్ని కావ్య లక్షణాలను చెప్పారు. అలాగే పదమూడవ శతాబ్దానికి చెందిన తిక్కన (నానారసాభ్యుదయోల్లాసి), ఎర్రన (సూక్తివైచిత్రి), నాచన సోమన (సంవిధాన చక్రవర్తిత్వం), శ్రీనాథుని (ఉద్దండలీల, ఉభయ వాక్ప్రౌఢి, రసాభ్యుచిత బంధము, సూక్తివైచిత్రి) మొదలైనవారు కావ్య సౌందర్యానికి సంబంధించిన కొన్ని అంశాలను తమ కావ్యావతారికలలోను, కావ్యవర్ణనల సందర్భాల్లోను ప్రకటించారు. ఇవన్నీ ఈ వర్గానికి చెందిన ఆంధ్రాలంకారికులుగా వివరించుకునే అవకాశం ఉంది. ఇవన్నీ సంస్కృతాలంకారిక లక్షణాల ప్రభావంతో వచ్చినవే అయినప్పటికీ, పరిభాష విషయంలో కొత్తదనం కనిపిస్తుంది.

[2] చంద్రశేఖర రెడ్డి,రాచపాళెం.:1992 తెలుగు అకాడమి హైదరాబాదు

### 3.3. భారతీయ, పాశ్చాత్య సౌందర్య సమన్వయ విమర్శకులు

పై రెండు వర్గాలకూ కాకుండా ఆధునిక విమర్శలో అంతర్భాగంగా ఆధునిక సౌందర్యశాస్త్రాంశాలతో సమన్వయిస్తూ తమ విమర్శను కొనసాగించిన వారిలో కట్టమంచి, పురాణం సూరిశాస్త్రి, రాయప్రోలు సుబ్బారావు, బసవరాజు అప్పారావు, రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ, దువ్వూరి రామిరెడ్డి, పింగళి లక్ష్మీకాంతం, విశ్వనాథ సత్యనారాయణ, జి.వి. కృష్ణారావు, కొండూరి వీరరాఘవాచార్యులు, డా. సి. నారాయణరెడ్డి, ఆర్.యస్. సుదర్శనం, శ్రీశ్రీ, కొడవటిగంటి కుటుంబరావు, గుంటూరు శేషేంద్రశర్మ, గుడిపాటి వెంకటాచలం, బుచ్చిబాబు, పాపినేని శివశంకర్, డా. బి. సూర్యసాగర్, వడలి మందేశ్వరరావు, జి.వి. సుబ్రహ్మణ్యం, తుమ్మపూడి కోటేశ్వరరావు, కోవెల సంపత్కుమారాచార్య, బేతవోలు రామబ్రహ్మం, చేకూరి రామారావు, ముదిగొండ వీరభద్రయ్య, జి. లక్ష్మీనరసయ్య, బి. తిరుపతిరావు, అఫ్సర్, మో, ఎండ్లూరి సుధాకర్, సతీష్ చందర్, యు.ఎ.నరసింహమూర్తి, కొలకలూరి మధుజ్యోతి, వాడ్రేవు చినవీరభద్రుడు, కాత్యాయని విద్మహే మొదలైన వాళ్ళంతా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో భారతీయ, పాశ్చాత్య సౌందర్యశాస్త్ర సిద్ధాంతాలతో విమర్శను కొనసాగించినవారే. వీరితేపాటు సాహిత్య సౌందర్యాన్ని మనోవైజ్ఞానిక విమర్శ పద్ధతిగా సాహిత్య సౌందర్యాన్ని విశ్లేషించిన వారిలో కోడూరి శ్రీరామూర్తి, డి. విద్వేశ్వరి, ఆనందారామం, రావి ప్రేమలత, ముదిగొండి సుజాతరెడ్డి తదితరులను పేర్కొనవచ్చు. వీరందరీ విమర్శలోను అంతఃసూత్రంగా సౌందర్యశాస్త్ర విషయాలున్నాయి.

నా పరిశోధన పరిధిని అనుసరించి పురాణం సూరిశాస్త్రి, సంజీవ్ దేవ్, శ్రీశ్రీ, చలం, బుచ్చిబాబులు చేసిన సౌందర్య శాస్త్ర విమర్శ కృషిని ఈ పరిశోధనలో అధ్యయనం చేస్తున్నాను అందువల్ల ముందుగా వీరిని ఈ అధ్యాయంలో పరిచయం చేస్తాను.

తెలుగు సాహిత్య విమర్శ విరేశలింగంతో ప్రారంభమైనట్టు పరిశోధకులు భావిస్తున్నారు. అయితే కట్టమంచి రామలింగారెడ్డి విమర్శతో నిజమైన ఆధునిక సాహిత్య విమర్శ ప్రారంభమైనట్లు భావించవచ్చు. అంతకు ముందు వరకు కావ్యాలను విశ్లేషించే పద్ధతి

ఉండేది. కానీ కట్టమంచి కావ్యార్థాలను విలువ కట్టడం మొదలుపెట్టారు.[3] ఆయన భావనాశక్తి, వస్వైకం ప్రమాణాలుగా తీసుకొని విమర్శ చేశారు. తెలుగు విమర్శకు సృజనాత్మకతను అద్దిన విమర్శకుడిగా కళాగౌరవాన్ని పొందిన విమర్శకుడిగా జీవియస్ వ్యాఖ్యానించడాని బట్టి చూస్తే[4] తెలుగులో సౌందర్య శాస్త్ర విమర్శ మూలాలున్న తొలి విమర్శకుడిగా కట్టమంచి రామలింగారెడ్డినే పేర్కొన్నవచ్చు.

ఇటువంటి కళా విమర్శను 1914లోనే చేశారు. అయితే కళల కంటే కళా సౌందర్యాన్ని విశ్లేషించడం కంటే కళాతత్త్వాన్ని కొంతవరకు పరిశీలించాడు కానీ, పాశ్చాత్యులు భావించిన కళాతత్త్వం లేదా సౌందర్య శాస్త్రం అనే దృష్టితో సాహిత్య విమర్శను చేసి పుస్తకం కూడా ఆ తత్త్వాన్ని ప్రతిఫలించేటట్టు *'విమర్శకపారిజాతము'* అనే పేరు పెట్టిన వాడు పురాణం సూరిశాస్త్రి. అందువల్ల తొలి తెలుగు కళాతత్త్వ విమర్శకుడిగా పురాణం సూరిశాస్త్రిని గుర్తిస్తున్నారు.[5]

### 3.3.1 సూరిశాస్త్రి పురాణం (1888-1941)

తెలుగు కళా విమర్శకులలో పురాణం సూరిశాస్త్రి ప్రథమ వరసలో ఉన్నారు. రచనలు, కులపరంగా కూడా పురాణం సూరిశాస్త్రి గారే ప్రథములు. ఆగర్భ శ్రీమంతులైన పురాణం సూరిశాస్త్రి కృష్ణాజిల్లా లోని మచిలీపట్నంలో 1888లో జన్మించారు. వీరి తల్లిదండ్రులు రాజ్యలక్ష్మి, వెంకటప్పయ్య గార్లు. వీరి తండ్రి ప్రముఖ న్యాయవాది.

పురాణం సూరిశాస్త్రి బందరులో ప్రాథమిక, ఉన్నత విద్యలను అభ్యసించారు. 1911 నుండి 1915 వరకు చెన్నపురిలో రసాయన శాస్త్రం ప్రధాన విషయంగా సైన్స్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. కలకత్తాలో రసాయన శాస్త్రాన్ని ప్రధాన అంశంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ చెయ్యాలనుకున్నారు. కానీ కారణాంతరాల వల్ల మధ్యలోనే ఆపివేశారు. చెన్నపురిలో చదువుతూ ఉండగానే తెలుగు సాహిత్యం పట్ల ఆసక్తి పెంచుకున్నారు. ఆయన ఆగర్భ

[3] సుబ్రహ్మణ్యం, జి.వి. ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం: 1996; 28

[4] సుబ్రహ్మణ్యం, జి.వి. ఆంధ్ర సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం: 1996; 28

[5] వీరభద్రయ్య, ముదిగొండ. కళాతత్త్వ శాస్త్ర విమర్శ మౌలిక భావనలు: 6

శ్రీమంతులు కావడం వలన ఎక్కడా ఉద్యోగం చెయ్యలేదు. కాని తెలుగు, సంస్కృతం, ఆంగ్ల సాహిత్యాన్ని బాగా అధ్యయనం చేశారు. తాము చదివిన సాహిత్య ప్రేరణతో వ్యాసాలను కూడా రాసేవారు. ఆయన మెట్ట మెదటి రచనగా *'నాట్యాబుజం'* (1923) చెప్పవచ్చు. ఆయన వ్యాసాలు కాశీనాథుని నాగేశ్వరరావు వెలువరించిన *'విజ్ఞాన సర్వస్వం', 'కృష్ణా పత్రిక'*, లలోను ఇంకా అనేక పత్రికలలో ప్రచురితమయ్యాయి.

పురాణం సూరిశాస్త్రి గారికి మెదటి నుండి సాంస్కృతిక అంశాల పట్ల ఆసక్తి ఎక్కువగా ఉండేది. అందువల్ల నాటకాలను విరివిగా చూసేవారు. తాను చూసిన నాటకాలలోని లోపాలను, మంచి అంశాలను స్నేహితుల దగ్గర బాగా చర్చించేవారు. కేవలం తెలుగు నాటకాలే కాకుండా తమిళ, కన్నడ, పారశీక, ఆంగ్ల నాటకాలను కూడా చూసేవారు. ఆ నాటక లక్షణాలకు సంబంధించిన గ్రంథాలను కూడా చదివేవారు. లక్షణ గ్రంథాలలోని విషయాలకు నటుల, నటనా వైదుష్యానికి ఇక్కడ తారతమ్యాలను పరిశీలించేవారు. ఆ విధంగా నాటకాల పట్ల మంచి పరిజ్ఞానాన్ని సాధించారు. నాటక పోటీలను కూడా నిర్వహించే వారు. నాటకంలో ఉండవలసిన అనేక అంశాలను గురించి కళా కోవిధులను రప్పించి ఉపన్యాసాలను ఇప్పించేవారు. ఈ విషయాలన్నింటిని శ్రద్ధతో పరిశీలించిన పురాణం సూరిశాస్త్రి పలు గ్రంథాలను రాశారు.

#### 3.3.1.1 పురాణం సూరిశాస్త్రి రచనలు

1. నాట్యాంబుజము (1923), 2. పౌరుల నాట్యాంబుజము (నాట్యాంబుజమునకు సంక్షిప్త రూపం 1923) , 3. నాట్యోత్పలము (1924), 4. విమర్శక పారిజాతము (1925), 5. ఆంధ్ర నాటక సంస్కరణము (1925), 6. నాట్య అశోకము (1925-1927)[6]

వ్యాసాలు

1. గీర్వాణ నాటకము (1910 ఆంధ్ర భారతి(2) సాధా.58), 2. రఘు వంశము (చిత్ర లేఖన ప్రశస్తి) (1910 ఆంధ్ర భారతి(4) సాధా. 152), 3. కృష్ణ రాయుడు కృష్ణా

[6] కృష్ణమూర్తి, నే.శ్రీ.:1984; 849.

పత్రిక (1923 ఆంధ్ర పత్రిక ఉగాది సంచిక రుధి. 73), 4. నాటోత్పలము (సమీక్ష) (1924 అక్టో. భారతి1 (10) రక్తాక్షి. ఆశ్వ. 149), 5. యెంకి పాటలు (1925 ఆంధ్ర పత్రిక ఉగాది సంచిక. క్రోధన 103), 6. కృష్ణా పత్రికలో 'కావ్య మిమాంస' పేరుతో 1923-1924 వరకు వ్యాసాలు రాశారు.

ఈ వ్యాసాలే కాకుండా వారి '*నాట్యాంబుజము*', '*నాట్య అశోకము*'లు కూడా మెదటగా వ్యాసాలుగా వెలువడి తర్వాత గ్రంథాలుగా ప్రచురితమాయ్యాయి.

పురాణం సూరిశాస్త్రి గారికి సాహిత్యం పట్ల అభిరుచి పెరగటానికి ఇంటా బయటా గల సాహితీ మిత్రుల సాహచర్యం ఎంతగానో తోడ్పడింది. ఇంట్లో తండ్రి న్యాయవాది అయినా ఆయన సాహిత్య అభిరుచి కలిగిన వ్యక్తి అగుటచే వీరికి పింగళి లక్ష్మీకాంతం, అబ్బూరి రామకృష్ణా రావు, వి.యస్. భూషణ్, సోమనాథ్ వెల్లటూర్, బ్రహ్మ, వేణుగోపాల్, నెల్లూరు నాగరాజ రావు, మంజూలూరి కృష్ణారావు, హరి నాగభూషణం, గరికపర్తి పాపయ్య దేవర, మల్లాది రామకృష్ణ శాస్త్రి, కాటూర్లూ, పసుమర్తి యజ్ఞ నారాయణ శాస్త్రి, కోట ఆంజనేయులు, పారుపల్లి సుబ్బారావు మొదలైన చాలా మంది కవి, నట మిత్రులు ఉండేవాళ్ళు. నాటక విషయాలలో నిత్యం సంప్రదింపులు జరుగుతూ ఉండేవి. విద్యా నిలయంలో నిరంతరం పండిత గోష్ఠులు, చర్చలు జరుగుతూ ఉండేవి. అందుకనే పురాణం సూరిశాస్త్రి చదివింది సాహిత్యేతర విద్య అయినప్పటికీ అనగా రసాయన శాస్త్రం ప్రధాన అంశంగా గల సైన్స్ గ్రాడ్యుయేషన్ అయినా సాహిత్యం పట్ల మంచి పట్టుని సాధించగలి. ఆయన ఒక చోట ఇలా అన్నారు.

*"నేను నటుడను కాను. కవిని గాను. సంగీతమందావంతయేనియు నాలాపించలేను. నాట్య రంగములు జిత్రించు నేర్పరిని కాను. కాని కావ్య సంగీతాభినయముల రస స్వరూపమును, సరసముగ ననుభవించు విమర్శక విచక్షణ మెదటి నుండియు నాకెట్టులో అలవడినది. నవలలు, నాటకములు, పద్య కావ్యములు విశేషముగ జదివియు చిత్ర ప్రపంచమందలి భావ ప్రకటనము మనసార గ్రోలియు, నుత్తమా నాట్య సంగీత విద్యా ప్రదర్శనంబు లనేకముల జూచియు, నాటకములందలి మంచి చెడ్డలు గుర్తించు వివేక మెప్పుచుంటిని. రస లక్ష్యములచే కన్న, గ్రంథావలోకనముచే కన్న, ప్రపంచమును నవరస*

*భరితమైన అవస్థలలో జక్కగ బరికించి చూచుట వలన నాకు కావ్య నాటక కళా లక్షణములు విస్పష్టముగా బోధపడినవి. కళలన్నిటియందును సమానమైన ఆదరణాభిమానములు వానిలోని యందచందములారయ విజ్ఞానానుభవములు నా విద్యాభ్యాస కాలాంతమునకు జక్కగ కుదిరినవి.''*[7]. దీనిని బట్టి పాండిత్య ప్రకర్షను ప్రదర్శించటానికి ప్రయత్నించే వ్యక్తి కానీ, వినయ శీలం వీరిలో కనిపిస్తుంది.

పురాణం సూరిశాస్త్రి గారికి వివిధ సంస్థలతో అనుబంధం ఉంది. 1915 డిశంబరులో బందరులో కానుకొలను వెంకట్రామయ్య గారిచే నెలకొల్పబడిన *'ఆంధ్ర నాటక ప్రోత్సాహక సంఘము'*నకు రెండు సంవత్సరాలు కార్యదర్శిగా ఉన్నారు. *'చిత్ర కళాభివర్ధనీ'* సంఘంలో సభ్యుడిగా ఉన్నారు. దీని వలన కూడా నాటకంలో గన అనేక సూక్ష్మ అంశాలను తన రచనలో పేర్కొన్నారు.

**3.3.1.2. పురాణం సూరిశాస్త్రి: సామాజిక కళా సేవ**

పురాణం సూరిశాస్త్రి *'పర్ణశాల'* పేరుతో సంస్కృత కళాశాలను స్థాపించారు. ఇందులో కుల, మత భేదం లేకుండా అందరికీ సంస్కృతాన్ని అభ్యసింప చేశారు. దీనిని చనిపోయిన తన కుమారుడు శివ ప్రసాద్ జ్ఞాపకార్థం చిట్టి గూడూరులో కట్టించారు. విద్యా నిలయం పక్కన ఒక తటాకం, ఒక ప్రక్క రామాలయం మరో ప్రక్కన శివాలయం కట్టించారు. గానీ శివాలయంలో విగ్రహ ప్రతిష్ట జరగలేదు. పక్కనే నాట్యశాలను కట్టించారు. ఇది గ్రీకు శాలను పోని ఉందని విమర్శకులు పేర్కొన్నారు.[8] పురాణం సూరిశాస్త్రి సామ్యానులకు వేదసారం అందాలని 'తులసి భవనం' పేరుతో ఒక భవనాన్ని నిర్మించారు. అక్కడకు ప్రసిద్ధ వేద పండితుడు ఉప్పులూరి గణపతి శాస్త్రి గారిని రప్పించి వేద సారాంశాన్ని తెలుగులో వివరింప చేసేవారు. సామాన్య ప్రేక్షకుల మధ్య కూర్చోని నాటక ప్రదర్శన పట్ల వారి ప్రతి స్పందనలను గమనించేవారు.

1930లో గాంధిజీ ఉప్పు సత్యాగ్రహం ముమ్మరంగా సాగుతున్న రోజులలో పురాణం సూరిశాస్త్రి తన తులసి భవనాన్ని సత్యాగ్రహ శిబిరంగా చేసి తన దేశ భక్తిని చాటుకున్నారు.

[7] సూరిశాస్త్రి, పురాణం:1923;11

[8] రామరాజు, బిరుదురాజు (సం.మం):1988; 826

దీనికి ఆయన లాఠీ దెబ్బలతో పాటు ఆరు నెలల కారాగార శిక్షకు గురయ్యారు. ఆయన దేశ భక్తికి గుర్తుగా ఆయన ఇంటి రాతి పలక మీద *'ఆంధ్ర సేవకుడు'* అనే పేరు లిఖించి ఉంటుంది.

పురాణం సూరిశాస్త్రి నాటక రంగానికి విశేషమైన కృషి చేశారు. వీరు చిన్న నాటి నుండి అనేక నాటకాలను స్వయంగా చూడటం వల్ల వీరికి నాటకాలపై అధిక ప్రీతి ఏర్పడింది. వీరు చిన్న నాటి నుండి అనేక నాటకాలను స్వయంగా చూడటం వల్ల వీరికి నాటకాలపై అధిక ప్రీతి ఏర్పడింది. వీరు *''నవలలు, నాటకములు, పద్య కావ్యములు విశేషముగా జదవియు చిత్ర ప్రపంచమందలి భావ ప్రకటనము మనసార గ్రోలియు, నుత్తమ నాట్య సంగీత విద్యా ప్రదర్శనంబులనేకముల జూచియు, నాటకమందలి మంచి చెడ్డలను గుర్తించు వివేక మొప్పుచుంటిని అని రస లక్ష్యములచే కన్న, గ్రంథావలోకనముచే కన్న, ప్రపంచమును నవరస భరితమైన అవస్థలలో జక్కగా బరికించి చూచుట వలన నాకు కావ్య నాటక కళా లక్షణములు విస్పష్టముగ భోదపడినవి.''*[9] అని పేర్కొన్నారు. అంతేగాక 1915 డిశంబరులో బందరుపురం కానుకొలను వెంకట్రామయ్య గారిచే నెలకొల్పబడిన ఆంధ్ర నాటక ప్రోత్సాహక సంఘానికి కార్యదర్శిగా ఉండి గుంటూరు, నెల్లూరు, విశాఖ పట్టణం మొదలైన అనేక చోట్ల నాటక పరీక్షల గురించి నాటక సంస్కరణల గురించి ఉపన్యాసాలు ఇచ్చారు. వీటితో పాటు నాటక అభిలాషులచే నాటకాభినయముల గురించి విమర్శనలు తెప్పించి కృష్ణా పత్రికలో ప్రచురింప చేసేవారు. దీనితో పాటు నాటక సాహిత్య విషయాలను చర్చించే ఉపన్యాసాలను, సభలను బందరులోను ఇతర చోట్ల జరిపించి వీనిలో ప్రముఖులైన వారిని గౌరవించేవారు.

పురాణం సూరిశాస్త్రి గొప్ప 'రామభక్తుడు'. ఆయన మనస్సులో నిత్యం రాముడి తలపే! వారి రామభక్తికి నిదర్శనం పర్ణశాల తటాకం ప్రక్కన వారు నిర్మించిన రామాలయమే. దానితో పాటు ఆయన శివాలయం కూడా నిర్మించారు. అంతేగాక వారి సంస్కృత కళాశాలకి 'పర్ణశాల' అని తన రచనకు *'నాట్య అశోకము'(1927)* అని పేర్లు పెట్టి తన రామభక్తిని చాటుకున్నారు. పురాణం సూరిశాస్త్రి కాశ్మీరం నుండి కన్యాకుమారి సింహాళం వరకు అఖిలభారత పర్యటన

[9] సూరిశాస్త్రి, పురాణం:1923; 11

గావించినప్పటికీ రామభక్తుడు కావటం వల్ల శ్రీ రామనవమి నాటికి స్వస్థలం చేరి ఆయనే స్వయంగా తన చేతుల మీదగా సీతరామ కళ్యాణం జరిపించేవారు.

పురాణం సూరిశాస్త్రి మేధావి, రచయిత, విద్యా కళా పోషకుడు, విమర్శకుడు, భక్తుడు, త్యాగి మాత్రమే గాక జీవిత మాధుర్యాన్ని, రసానుభూతిని అన్ని కోణాల నుండి అనుభవించిన వారు. వీరు రామనామ స్మరణతోనే 1941లో భౌతికంగా మరణించినా ఆయన రచనల వలన నేటికీ వివిధ చర్చలలో జీవించే ఉన్నారు. భారతీయ కళా విమర్శలో తొలితరం విమర్శకుడిగా గుర్తింపు పొందుతూనే ఉన్నారు.

### 3.3.1.3. పురాణం సూరిశాస్త్రి: సౌందర్యవిమర్శ

సుమారు పదిహేను వందల సంవత్సరాల తెలుగు సాహిత్య చరిత్రను పరిశీలిస్తే విమర్శ కూడా విస్తృతంగా వెలువడింది. అలాంటి విమర్శలో పురాణం సూరిశాస్త్రివిమర్శ కూడా గణనీయమైన స్థానంలోనే ఉంది. విమర్శ సృజనాత్మక సాహిత్యాన్నికి వినూత్న దర్శనాన్ని గాని అనుభవ అనుశీలన విధానాన్ని గాని అందించి ప్రయోగ ప్రస్థానాలకు ప్రగతి మార్గాలను చూపించాలని భావించిన విమర్శకులు ఉన్నారు.[10] అలాంటి విమర్శకులలో పురాణం సూరిశాస్త్రి కూడా ఒకరని వారి జీవిత రేఖలను బట్టి తెలుస్తుంది.

పురాణం సూరిశాస్త్రి విమర్శను *"విమర్శనమునకు పాశ్చాత్య పర్యాయ పదము క్రిటిసిజము. అనగా క్రిటిక్కు యొక్క సారస్వత వ్యాపారము. క్రిటిక్కు అంటే విషయము యొక్క మంచి చెడ్డలారసి గుణ దోష వివేచన మొనర్పెడి వివేకశీలుడగు సమపర్తి. దినినే తెలుగున విమర్శకుడందుము."*[11] అని పేర్కొంటూ *"గుణ గ్రహణమే విమర్శనమన జెల్లును.... అని కళా స్వరూపముల ప్రాశస్త్యమును గూర్చి నిర్ధారణ జేయు వివేకమునకును దానిని ప్రకటించు వ్యాపారమునకును విమర్శనమని పేరు వ్యుత్పత్యర్థ సూచితంబుగ నొప్పియున్నది. ఇందు క్రిటిసిజము అనగా జడ్జిమెంటు వంటిది విమర్శనమనగా గుణ వివేకము."*[12] అంటూ

[10] (ఆధునిక సాహిత్య విమర్శ ఆంగ్ల ప్రభావం పుట:17)

[11] (విమర్శక పారిజాతము 1925 పుట:28)

[12] (విమర్శక పారిజాతము 1925 పుట:29)

*“విమర్శనమనగా అనుషంగిక పరీక్ష (Comparative). విజ్ఞాన ప్రపంచమందంతట నుపయోగించెడి యనగమన సాధనము. ఒక్కే కార్యమును సాధించు వివిధ సాధనములను, మార్గములను బరిశీలించి పోల్చి చూచుటయే విమర్శకతత్త్వము.”*[13] అని విమర్శ గురించి క్షుణంగా తమ అభిప్రాయాలను తెలియజేశారు.

పురాణం సూరిశాస్త్రి కేవలం విమర్శ గురించి మాత్రమే కాకుండా విమర్శ యొక్క వ్యవహార అర్థాలను, విమర్శ యొక్క ప్రయోజనాన్ని, త్వత్తార్థములను, విమర్శకు సంబంధించిన ఇతర శాస్త్రాలను, విమర్శన రీతులను, కావ్య విమర్శన పద్ధతులను, విమర్శనోద్దేశ్యాన్ని ఫలితాన్ని, విమర్శన కావ్య కల్పనను, విమర్శక లక్షణాలను, విమర్శక సూత్రాలను మొదలైన వాటి గురించి ‘*విమర్శక పారిజాతము*’లో వివరంగా పేర్కొన్నారు.

### 3.3.1.4. పురాణం సూరిశాస్త్రి: విమర్శ పద్ధతులు

విమర్శ గ్రంథాన్ని మూడు పద్ధతుల్లో రాయవచ్చునని పురాణం సూరిశాస్త్రి అభిప్రాయపడ్డారు.

1) ప్రపంచనుభవం, కళా పరిజ్ఞానం, విమర్శక పద్ధతులను అనుసరించి విస్తరిస్తూ ఆత్మీయానుభవ నిరూపక స్వతంత్ర గ్రంథ రచనా విధానం.

2) ప్రామాణిక లాక్షణిక గ్రంథాల్లో వాద ప్రతివాదాలను అనుసరించి, తను అభిమానించే వాదాన్ని బలపరుస్తూ రాయడం.

3) ప్రామాణిక లాక్షణికుల అభిప్రాయాలను రసిక విమర్శకుల అభిప్రాయాలన్ని వివిధ అంశాలుగా విభజించి విశ్లేషిస్తూ రాయడం అని విమర్శక పారిజాతము మూడవ పద్ధతిలో చేరుతుందని ఆయనే చెప్పుకున్నారు.[14]

---

[13] (విమర్శక పారిజాతము 1925 పుట:29, 30)

[14] (విమర్శక పారిజాతము పుట: ii, iii)

### 3.3.1.5. విమర్శ పదజాలం

పురాణం సూరిశాస్త్రి విమర్శ పదజాలం గురించి తమ అభిప్రాయాలను ఈ విధంగా పేర్కొన్నారు.

1) తెలుగు లిపిలో ఆంగ్ల గీర్వాణ పదాలను ఉదాహరిస్తూ తెలుగులో వ్యాఖ్యానిస్తున్నాం. మన దేశ భాషల్లో ఇంకా సంస్కృత పదాలను చేర్చుకోవాలి.

2) నవీన శాస్త్ర పరిభాషను ఆంగ్ల పదజాలం నుండి స్వీకరించ వలసిన అవసరం ఉంది.[15]

*''తెలుగు భాషకు ఇంగ్లీషెంత దూరమో, సంస్కృతము కూడా నంతే దూరము''*[16] అని సూరిశాస్త్రి అభిప్రాయపడ్డారు.

3) ఆంగ్ల విద్యలను నూతన సంభాషను కూర్చడం కంటే, తెలుగు లిపిలోనే ఆంగ్ల పదాలను వాడటం వల్ల పాఠకులకు ప్రామాణిక గ్రంథాలను చదివే అవకాశం లభిస్తుంది.[17]

4) సామాన్య పదాలు ఏ భాషలోనైనా రెండు మూడు వందల కంటే ఎక్కువగా ఉండవు. పారిభాషిక పదాలు అసంఖ్యాకంగా ఉంటాయి. అందువల్ల వీటిని నేర్చుకోవడం వల్ల మూల గ్రంథాల నుండి సులభంగా చదవవచ్చు. అని పురాణం సూరిశాస్త్రి ఆ కాలంలోనే తెలుగు విమర్శ పదజాల లోటును పారిభాషిక పదాల ఆవశ్యకతను తెలిపారు.

పురాణం సూరిశాస్త్రి విమర్శన రీతులు గురించి చెబుతూ విషయాన్ని బట్టి, పద్ధతిని బట్టి, రెండు విధాలైన విమర్శలు ఏర్పడుతున్నాయని, విషయాన్ని బట్టి శాస్త్ర విమర్శనము, చరిత్ర విమర్శనము అన్నారు. కావ్య విమర్శనం మొదలైన విమర్శ భేదాలు ఉన్నాయి. ఇంకా ''ఏ పద్ధతి ననుసరించి దానిలో యే శాస్త్ర మర్యాదల నవలంబించి విషయ విమర్శన మొనర్చుచున్నాడో దాని పేరిట నా విమర్శన బరుగు చున్నది. అనగా ఒక కావ్యమును చరిత్ర పద్ధతుల మీదను

---

[15] (వి.పా. పుట: vi)

[16] (వి.పా. పుట: vi)

[17] (వి.పా. పుట: vii)

తత్వార్థమునను ప్రకృతి శాస్త్ర సందర్భముల బట్టియు కావ్య మర్యాదల ననుసరించియు వేర్వేరు రీతుల వివిధ ప్రయోజనములతో విమర్శింపవచ్చును. *"(Historical Criticism – Scientific Criticism – Psychological, Philosophical Art Criticism – and Literary Criticism)"* అని అన్నారు.[18]

ఈయన తన విమర్శలో భారతీయ, పాశ్చాత్య సౌందర్య సిద్ధాంతాలను సమన్వయిస్తూ చేసిన విమర్శ తీరుతెన్నులను రాబోయే అధ్యాయంలో విశ్లేషిస్తాను.

**3.3.2. అనంతకృష్ణశర్మ. రాళ్లపల్లి (1893-1979)**

వీరు అనంతపురం జిల్లా కళ్యాణ దుర్గం తాలుకాలోని రాళ్ళపల్లి అనే కుగ్రామంలో 1893 జనవరి 23న జన్మించారు. వీరి తల్లిదండ్రులు కృష్ణమాచార్యులు, ఆలివేలు మంగమ్మ గార్లు. తండ్రి వద్దనే సంస్కృత, ఆంధ్ర భాషలలో ప్రావీణ్యత సంపాదించి మైసూరు పరాకాల మఠంలో ఉన్నత సంస్కృత విద్యను అభ్యసించారు.1912 లో మైసూరు మహారాజా కళాశాలలో తెలుగు పండితులుగా చేరి దాదాపు మూడు దశాబ్దాలు పాటు పనిచేశారు.

రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ తమ ఉపన్యాసాల ద్వారా, గ్రంథ పీఠికల ద్వారా ఉత్తమ సాహిత్యాభిరుచిని కలిగించారు. వీరు సాహిత్య విమర్శ పద్ధతిలో మాథ్యూ ఆర్నాల్డ్, వాల్టర్ పీటరు, సెయింట్ చ్వో (ఫ్రెంచి)ల కోవకు చెందుతారు. 70 యేళ్ళ క్రితమే వేమన గురించి వేమనోపన్యాసాలలో అనేక విషయాలను ఆవిష్కరించారు. *'నిగమశర్మ అక్క', 'నాచన సోముని నవీన గుణములు', 'తిక్కన తీర్చిన సీతమ్మ', 'రాయల నాటి రసికత'*, అనే వీరి వ్యాసాలు ఎంతో ప్రసిద్ధి చెందాయి. రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ గారికి తండ్రి సాహిత్య గురువులైతే తల్లి సంగీత గురువులు. వీరు తల్లి నేర్పిన పాటలను యధాతధంగా పాడేవారు. మేనమామప్రోత్సహంతో ఫిడేలు వాయించడం కూడా బాల్యంలోనే నేర్చుకున్నారు. సంగీత, సాహిత్య సాధనతో పాటు వారి నిత్య కృత్యాలలో గ్రంథ పరిశోధన ఒకటి. *'తారాబాయి'(1991),'మీరాబాయి' (1913)*ల వంటి మనోహరమైన ఖండ కావ్యాలను రచించారు. 1910 లో కట్టమంచి రామలింగా రెడ్డిమైసూరు మహారాజా కళాశాలలో చరిత్ర,

[18] (వి.పా. 1925 పుట: 34)

తత్త్వశాస్త్రం, ఆంగ్లసాహిత్యం, తర్కం భోదించు ఆచార్యులుగా పనిచేశారు. రెడ్డి ప్రోద్బలంతో మహారాజ కాలేజిలో మొట్ట మొదటిసారిగా ఏర్పరిచిన తెలుగు పండిత పదవిని జులై 2, 1912 న చేపట్టారు. ఆనాటి నుండి తెలుగులో రచనా వ్యాసాంగానికి శ్రీకారం చుట్టారు. కాళిదాసు విరచితమైన రఘువంశం ఆంధ్రీకరించారు. *'పెద్దన పెద్దతనము'* పేరుతో ఒక విమర్శనాత్మక వ్యాసాన్ని రాశారు. వేమనపై ఉపన్యాసాలిచ్చారు. వీరి పద్యాలు విన్న చిలుకూరి నారాయణ రావు మిత్రగోష్ఠిలో *'కీర్తినీయ చరిత కృష్ణశర్మ'* అనే మకుటంతో కొన్ని పద్యాలు రాసి రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ గారిని అభినందించారు.

రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ గురుతుల్యులుగా భావించిన రెడ్డిగారి పీఠికలనే విమర్శించినా వారి సభ్యతకు భంగం వాటిల్లలేదు. పరస్పర గౌరవాభిమానాలు వర్ధిల్లాయి. కృష్ణప్పవద్ద నాలుగైదు సంవత్సరాలు సంగీతాభ్యసన చేశారు. వీరికి 1911-1912 లో వివాహం జరిగింది. ఉద్యోగ విరమణానంతరం 1950-1957 వరకు తాళ్ళపాక కవుల సంకీర్తనల మీద స్వర కల్పన గావించారు. వీరికి *'గాన కళా సింధు', 'సంగీత కళారత్న'* అనే బిరుదులు కలవు. కేంద్ర సంగీత నాటక అకాడమీ 18 అక్టోంబర్ 1970 లో ఫెలోషిప్ నిచ్చి సత్కరించింది. శ్రీ వెంకటేశ్వర విద్యాలయం 30 ఏప్రిల్ 1974 లో గౌరవ డిలిట్ పట్టంతో గౌరవించింది. వీరికి ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. రేడియోకు *'ఆకాశ వాణి'* అని పేరు పెట్టిన వారు రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ గారే. సత్యం, శివం, సుందరం అనే గుణాలు రాళ్ళపల్లి వారి వ్యక్తిత్వ లక్షణాలు. రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ 1979 మార్చి11 న స్వర్గస్థులయ్యారు.[19]

రాళ్లపల్లి అనంత కృష్ణశర్మదృష్టిలో సౌందర్యానికి ఆధారం సృష్టిలోని *'లయం'*, ఈ లయ వస్తువుల జాతి, గుణం, క్రియ అన్నింటిలోనూ వ్యాపించి ఉండి సృష్టిలో అనంతము, అమేయమైన మూల ధర్మంగా భాసిస్తూ ఉంటుంది. అలాగే సౌందర్యం అనే భావానికి కూడా ఈ లయే ఆధారమని అంటారు రాళ్ళపల్లి వారు. వీరు లయ పదానికి సమానార్ధకంగా *'సౌమ్యము'* ను పేర్కొన్నారు. వీరు లయ సృష్టి అంతా వ్యాపించి ఉందని ఈ సహజమైన

[19] విజ్ఞాన సర్వస్వం: తెలుగు సంస్కృతి-2 ; పుట: 8,9

లయను వ్యక్తం చేసే మానవ ప్రవృత్తులే కళలు అని చెప్పి ఈ కళల నుండీ మనం పొందేది *'ఆనందం'* అని చెప్పారు. వీరు సుఖం, ఆనందం వేరు వేరని సుఖం అనేది ఆనందం యొక్క రూపమనీ పేర్కొన్నారు.

రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ *'ఆనందాన్ని'* ఈ విధంగా నిర్వచించారు. *''ఆనందమనగా సుఖము కాదు. సుఖము ఇంద్రియాలకు సంబంధించినది. ఆనందము ఆధ్యాత్మికము. అనగా ఆత్మకెక్కువ సంబంధించినది.... సుఖము ఆనందము యొక్క మిత స్వరూపము మరియు చంచలము. సుఖమే దుఃఖమునూ అగును. ఆనందము అట్టిది కాదు. సంపాదించుకొనగలది. అనుభవింప వచ్చును. అనుభవించు కొలది ఆశలూరును అమేయమగును.''*[20]

ఈయన తన విమర్శలో భారతీయ, పాశ్చాత్య సౌందర్య సిద్ధాంతాలను సమన్వయిస్తూ చేసిన విమర్శ తీరుతెన్నులను రాబోయే అధ్యాయంలో విశ్లేషిస్తాను.

### 3.3.3. గుడిపాటి వెంకట చలం (1894-1979)

చలంగా ప్రసిద్ధుడైన గుడిపాటి వెంకట చలం సుప్రసిద్ధ తెలుగు రచయిత, వేదాంతి మరియు సంఘసంస్కర్త. హేతువాది .ఆధునిక తెలుగు సాహిత్యాన్ని ప్రభావితం చేసిన అతి ముఖ్య వ్యక్తుల్లో చలం ఒకడు. చలం రచనలు చాలా వరకు స్త్రీల జీవితాలను ఇతివృత్తంగా చేసుకుని ఉంటాయి. ముఖ్యంగా సమాజంలో వారికి ఎదురయ్యే శారీరక మరియు మానసిక హింసలు, వాటిని వారు ఎదుర్కొనే విధానాలను చర్చించాడు. చలం రచనలలో ఇతివృత్తమూ, తాత్వికతా, రచనాశైలీ ఆయనకు ఆధునిక తెలుగు రచనా రంగంలో అనన్యమైన స్థానాన్ని సంపాదించిపెట్టాయి.

గుడిపాటి వెంకటచలం 1894, మే నెలలో 18న మద్రాసు నగరంలో జన్మించాడు. చలం తల్లి వేంకటసుబ్బమ్మ, తండ్రి కొమ్మూరి సాంబశివరావు. అయితే తన తాత గుడిపాటి వేంకటరామయ్య దత్తత తీసుకోవడంతో, ఇంటిపేరు మారి గుడిపాటి వెంకటచలంగా పేరొందాడు. చిన్నతనంలో సంధ్యావందనం వంటి ఆచారాలను నిష్టగా పాటించాడు.

[20] నాటకోపన్యాసములు; 1968 ; పుట: 13

హైస్కూలు చదువులు పూర్తి కాకముందే ఇతిహాస పురాణాలను క్షుణ్ణంగా చదివాడు. తన తండ్రి తల్లిని వేధించే తీరు ఆ చిన్నవాని హృదయంపై బలమైన ముద్ర వేసింది. తన చెల్లెలు '*అమ్మణ్ణి*' పెళ్ళి ఆగిపోవడం కూడా స్త్రీల పట్ల జరుగుతున్న అన్యాయాలపైకి అతని దృష్టిని గాఢంగా మళ్ళించింది.

చలం తన పుట్టుకను గురించి *''మొదలంటూలేని ఈ సృష్టికైన ప్రథమ చలనం శూన్యంలో స్పందించినప్పుడు పంచభూతాలతో పాటు అవ్యక్తంగా నేనూ జన్మించాను. ఈ లక్షన్నర కోటి ప్రాణులతో కలిసి కాంతికి, శబ్దానికి, స్పర్శకి క్రమంగా స్పందించి స్పందించి వ్యక్తిత్వాన్ని ప్రతిష్ఠించుకున్నాను.''*[21] అని ఆత్మకథలో తాత్వికంగా తెలియజేశారు.

చలం చిన్నప్పటినుండే పార్శ్వపు తలనొప్పితో బాధపడుతూ ఉండటం వలన బాల్యాన్ని ఆటపాటలకు దూరంగానే గడపాల్సి వచ్చింది. చలానికి నలుగురు తమ్ముళ్ళు, నలుగురు చెల్లెళ్ళు. తాతగారి ప్రభావం చలం మీద అధికంగా ఉండుటచే నిత్యం సంధ్యావందనాలు చేస్తూ, కులాచారాలు పాటిస్తూ, పూజా పునస్కారాలు నిర్వహిస్తూ, పురాణ శ్రవణానికి హాజరయ్యేవారు. బడి ఎగేసి కూడా పురాణ కాలక్షేపమే చేస్తుండేవారు. ఎంతోమంది పౌరాణికులతో చర్చలు జరుపుతుండేవారు.

చలం తనమీద తానే ఒక పుస్తకాన్ని వ్రాసి (1972), దానికి *"చలం"* అని పేరు పెట్టాడు. అదే అతని ఆత్మకథ. తన ఆత్మకథలో చలం తనతండ్రి తనను కొట్టడం గురించి వ్రాసాడు, కానీ ఆయన పేరు మాత్రం వ్రాయలేదు. *''నా మొదటి జ్ఞాపకం అయిదేళ్ళప్పుడు మా నాన్న నన్ను కొట్టడం, రెండో జ్ఞాపకం ఆయన నన్ను కొట్టడం, మూడో జ్ఞాపకం మళ్ళీ కొట్టడం. ఇంతకన్నా ఏదన్నా వరమడిగితే నిరంతరం, వీణ్ని కొట్టే వరమియ్యమని అడుగుతాడు. ఆ మధ్య ఓ సంవత్సరం ఆయనే చదువు చెపుతానని బడి మాన్పించాడు. పాఠాలు చెప్పమంటే – ప్రశ్నలడిగి కొట్టడం, మా నాన్న అంటేనే ద్వేషం నాకు. ఆ నాన్న నించి వీలైనంత తప్పుకు తిరిగేవాణ్ణి. ఇంట్లో దాక్కునేవాణ్ణి. ఆ ద్వేషం జీవితమంతా నిలిచిపోయింది. ఈనాటి వరకు గూడ, ఆయన్ని ''నాన్న'' అనిగాని, ఇంకేమనిగాని పిలిచి, ఎరుగను అంత అసహ్యం. ఎంత*

---

[21] చలం ఆత్మకథ. పుట:1

*కొట్టినా ఇంక చాలుననిగాని, ఇంక చెయ్యననిగాని, భరించలేననిగాని నేను అనలేదు. ఊరికే ఏడుస్తాను బాధ భరించలేక. ఎంతసేపు ఏడుస్తానో చూద్దామని ఆయన పంతం పట్టి కొట్టేవాడు. అట్లా ఇద్దరికీ జన్మవిరోధ మేర్పడింది''*[22] తన తల్లి భర్తతోను పిల్లలతోను పుట్టింటనే అవస్తపడటం గురించి వ్రాసాడు, కానీ ఆవిడ పేరు కూడా రాయలేదు. (చలం ఆత్మకథలో ఇద్దరి పేర్లు లేవు). ఈ ఆత్మకథకు ముందుమాట తనే వ్రాసుకున్నాడు. ఆ ముందుమాట చలం అంతర్గతాన్ని తెలియజేస్తుంది – ఆత్మకథలంటే నాకసహ్యం. ఆత్మకథ వ్రాయడమంటే తను లోకానికి ముఖ్యమైన మనిషైనట్టు, తానేదో ప్రజలకి తీరని ఉపకారం చేసినట్టు, తన సంగతి చెప్పుకోకపోతే లోకానికి తన గొప్ప తెలియనట్టు, తెలియకపోతే లోకానికి నష్టమైనట్టు అనుకొంటున్నాడన్నమాట, రాసినవాడు. ఎందుకు పుట్టానా? పుట్టినవాణ్ణి చప్పున చావక ఎందుకింత కాలం తన పరిసరాలని ఇంత కల్మషం చేశానా అనుకునే నావంటివాడు తనకథ సిగ్గులేకుండా చెప్పుకొంటున్నాడంటే ఏమాత్రం క్షమించదగిన విషయం కాదు. జీవితంలో ప్రేమకోసం, ప్రేమించబడగల ఆదర్శమూర్తుల కోసం చలంలో అన్వేషణ ప్రారంభమయింది. ఆ సందర్భంలో చలం *''నాకెంత దిగులు పుట్టేదో! ప్రతిరాత్రి ప్రతిజ్ఞలు తీసుకొనేవాణ్ణి.*

*1. ఎన్నటికీ పెళ్ళి చేసుకోకూడదు, 2. పెద్దవాళ్ళు బలవంతాన చేసినా పిల్లల్ని కనకూడదు, 3. పిల్లల్ని కన్నా వాళ్ళని ఏడిపించకూడదు, 4. వాళ్ళు ఏడ్చినా, ఏమైనా సరే వాళ్ళని కొట్టకూడదు.''*[23]

చలం 1911లో పిఠాపురం మహారాజా కళాశాలలో చేరాడు. ఆ సమయంలో బ్రహ్మర్షి రఘుపతి వేంకటరత్నం నాయుడు నాయకత్వంలో అక్కడ నడుస్తున్న బ్రహ్మసమాజం వైపు ఆకర్షితుడయ్యాడు. తరువాత బి.ఎ.చదువు కోసం మద్రాసు వెళ్ళాడు. అంతకు ముందే చిట్టి రంగనాయకమ్మతో చలం వివాహం జరిగింది. మద్రాసులో తాను డిగ్రీ చదువుతూనే తన భార్యను కాన్వెంట్‌లో చేర్చి, తాను కాలేజీకి వెళ్ళేటప్పుడు ఆమెను సైకిల్ పై స్కూల్లో దించేవాడు. దీనిని అంతా వింతగా చూసేవారట. మామగారైతే చలంను తన ఇంటి గడపే తొక్కవద్దన్నాడు. అప్పటికి చలం భార్య వయసు 13 సంవత్సరాలు. చదువు అయిన తరువాత కాకినాడలో

[22] చలం ఆత్మకథ. పుట: 4

[23] చలం ఆత్మకథ. పుట: 6

ట్యూటర్‌గా ఉద్యోగంలో చేరాడు. ఆ అవకాశంతో చలం బ్రహ్మసమాజ కార్యకలాపాలను ముమ్మరం చేశాడు. మానవ సౌభ్రాతృత్వం చలాన్ని ఎంతగానో ఆకర్షించింది. చలం, చలం స్నేహితులు అతివాదులుగా చలామణి అవుతుండేవారు. బ్రహ్మసమాజంలో చలం యజ్ఞోపవీతం తీసివేస్తే, భార్య రంగనాయకమ్మ మంగళసూత్రం తీసివేసి తన పేరు మాలతీబాయిగా మార్చుకొంది. చలాన్ని అన్నివిధాలా అనుసరించింది. స్త్రీ స్వేచ్ఛా పోరాటాన్ని చలం మొదట తన జీవితం నుండే ప్రారంభించాడు. భార్య రంగనాయకమ్మను అత్తవారింట్లో రకరకాల దాసీపనుల్ని చేయటాన్ని మాన్పించాడు. స్త్రీ స్వాతంత్ర్యాన్ని కోరి, కుల చిహ్నాలని ఛేదించి, విగ్రహారాధన తిరస్కరించి, స్వచ్ఛమైన బ్రహ్మసమాజకుడుగా చలామణి అయిన చలం తరువాత తన జీవితంలో ఎదురైన ఒక ప్రేమ సంఘటన పట్ల తనలో రగుల్కొన్న నైతికా నైతిక మీమాంస కారణంగా బ్రహ్మసమాజం నుండీ బయటకొచ్చేశాడు. 1919 రాజమండ్రిలో ఉపాధ్యాయ శిక్షణ పూర్తి చేసుకున్నాక హోస్పేటలోని మున్సిపల్ హైస్కూల్లో చలం ప్రధానోపాధ్యాయుడిగా చేరాడు. యాజమాన్యంతో సరిపడక ప్రధానోపాధ్యాయ వృత్తికి రాజీనామా చేయవలసి వచ్చింది. తరువాత ఉపాధ్యాయుడిగా, శిక్షణ పాఠశాల ఉపాధ్యాయుడుగా, పాఠశాల పర్యవేక్షకుడిగా తెనాలి, గుంటూరు, నర్సారావుపేట, బెజవాద, కనిగిరి, విశాఖపట్టణం, ఏలూరు, భీమునిపట్నం, నూజివీడు మొదలైన ప్రదేశాలలో పనిచేశాడు. తన ఉద్యోగం గురించి తాను రచించిన "మ్యూజింగ్స్" లో [24] ఈవిధంగా వ్యాఖ్యానం చేశాడు రాతిని, ప్రభుత్వ బానిసను. స్కూళ్ళ తనిఖీదారుణ్ణి, ఉపాధ్యాయవర్గ ప్రాణ మూషికాలకి మార్జాలాన్ని.

చిన్నప్పటినుండీ చలానికి ఆడపిల్లలతో పరిచయం ఎక్కువ. బాల్యం నుంచే వాళ్ళపై అభిమానం చూపడం, వాళ్ళ అభిమానం పొందడం జరిగేది. హైస్కూలు చదివేటప్పుడు 12వ ఏట ఒక అమ్మాయికి ప్రేమలేఖ కూడా రాశారు చలం. చలం బాల్యప్రేమను గురించిన స్మృతులు మనం *''మ్యూజింగ్స్''* ప్రథమ భాగంలో చూడవచ్చు. ఆడపిల్లలతో ఆయనకు గల ఆ పరిచయాలు ప్రేమలుగా మారి ఆయన జీవితంలో యదార్ధ సంఘటనలుగా రూపొందాయి. *''మ్యూజింగ్స్'', ''ప్రేమలేఖలు''*లో కొన్ని కథలలో ఎదురయిన వ్యక్తులు, కొన్ని పాత్రలు అతడికి

---

[24] 72వ పుట,5వ ముద్రణ 2005

తారసపడ్డవారే. వున్నత పాఠశాలలో చదివే రోజుల్లో చలం యింట్లోనే రామాయణ భారత భాగవతాదులే కాకుండా ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాల ప్రచురణలూ, వేదం వేంకటరాయశాస్త్రిగ్రంథాలూ, ప్రాచీన అధునాతన గ్రంథాలూ ఎక్కువగా చదివేవారు.

అప్పట్లో చలానికి బాగా నచ్చిన నాటకాలు ప్రతాపరుద్రీయం, కన్యాశుల్కం. ఆ రెండింటిలోనూ అప్పుడప్పుడూ వేషాలు కూడా వేస్తుండేవారు. తానే కొన్ని నాటకాలు రాసి ప్రదర్శనలు కూడా ఇస్తూండేవారు. చలం ఫోర్తు ఫోరం చదువుతున్న రోజుల్లో హన్రీవుడ్ నవల అనువాదం చేయడం ప్రారంభించాడు. ఆంధ్ర ప్రచారిణి గ్రంథమాల వారిని ప్రచురించమని అడిగితే వారు కొన్ని పేజీలు పంపమని చూసి, *"ఎవరో పెద్ద రచయిత పంపారనుకొని చాలా బావుంది. ఆ పుస్తకమంతా పంపమన్నారు."* అలా అతడి మొట్టమొదట రచన బావ మీద ద్వేషంతో మొదలైనట్లు తన ఆత్మకథలో చలం చెప్పారు.

చలం రచనల్లో అతను వ్యక్తపరచిన భావాలు, ప్రతిపాదించిన విషయాలు, అప్పటి సమాజం మీద ఎంతగానో ప్రభావం చూపాయి. కానీ, సమాజం అతన్ని అపార్థం చేసుకున్నది. అతను స్త్రీస్వేచ్ఛ పేరుతో విశృంఖల జీవన విధానాన్ని ప్రచారం చేస్తున్నాడని, అతని కథల్లో బూతులు ఉన్నాయని ప్రచారం జరిగింది. చలం పుస్తకాలను బహిరంగంగా చదవటానికి భయపడిన రోజులవి. ఆసక్తి గల పాఠకులు, చలం పుస్తకాలని దాచుకుని చదివేవారట. చలం తన కథలు, నవలల్లో వ్రాసిన విషయాలకు అప్పటి సమాజం తట్టుకోలేక పోయింది. అతను తన అనేక రచనల్లో వ్యక్తపరచిన భావాలు, మచ్చుకి కొన్ని, ఈ వ్యాసంలో చలం వ్యాఖ్యలు,అభిప్రాయాలుగా ఉటంకించడం జరిగింది, అక్కడ చూడవచ్చును. దీనికి తోడు, అతని వ్యక్తిగత జీవితంలో అతని ప్రవర్తన (స్త్రీ లోలత్వం)కూడా అభ్యంతరకరముగా పరిగణింపబడింది. మొత్తంమీద, అతను సంఘంలో ఒక *"విపరీత వ్యక్తి"*గా చెడ్డ పేరు తెచ్చుకున్నాడు. దీనివలన, అతనితో ఎవరూ మాట్లాడేవారుకాదట. అతనికి ఇల్లు అద్దెకివ్వడానికి కూడా వెనకాడేవారట. ఇంతెందుకు, చివరకు అతని దగ్గరబంధువులు కూడా అతన్ని దగ్గరకు రానిచ్చేవారు కాదు. చలం ముఖ్యంగా తన రచనవలన మరియు కొంతవరకు తన అసాధారణ వ్యక్తిగత ప్రవర్తన వలన సంఘంనుండి వేరుపడి ఒంటరివాడయ్యాడు. అతని భార్య కూడా అతని మూలాన బంధువులకు దూరమయ్యింది. ఆతనిని సమర్థించి అతనితోనే

ఉండటానికి నిర్ణయించుకోవడం మూలాన ఆమె తండ్రి, ఇతర బంధువులు కూడా ఆమెను దగ్గరకు చేరనిచ్చేవారు కాదు. కాని ఆమె, చలంను కొంతవరకు అర్థంచేసుకుని, ఆర్యసమాజ భావాలను ప్రచారం చేయడంలో ఉత్సాహంగా అతనికి సహాయం చేసేదట. కాని, కొంతకాలానికి, ఆమె కూడా చలం ప్రవర్తనతో విసిగిపోయింది. ఇద్దరిమధ్య కీచులాటలు ప్రారంభమై ఒకరితో ఒకరు మాట్లాడుకోని పరిస్థితి ఏర్పడింది. ఇద్దరి మధ్య అన్యోన్యత కరవైంది.

1920లో టీచర్ ట్రైనింగ్ కోసం రాజమండ్రి వెళితే *'చెడిపోయినవాడు'* అని ఎవరూ ఇల్లే ఇవ్వలేదు. చివరకు ఒక పశువుల పాకలో తలదాచుకొన్నాడు. గోదావరి ఒడ్డున గడిపిన సాయంకాలాల్లో అతను అనుభవించిన సంఘబహిష్కరణను తనతోబాటు పాట్లుపడుతున్న రంగనాయకమ్మపట్ల జాలిని వ్యక్తం చేస్తాడు చలం.

చలం మొదటి సంతానమైన రవికి 1929లో మరణించటంతో చలంలో నిరీశ్వరవాదం తలెత్తింది. రవి జబ్బుతో వున్నప్పుడు అతనితో గడిపిన ఆరేళ్ల వ్యధాత్మక జీవితం పూర్తి వేదనతో నిండిపోకుండా రవికీ–చలానికీ మధ్య ప్రేమైక మూర్తిగా చలం వదిన డాక్టర్ రంగనాయకమ్మ రక్షణగా నిలిచింది. 1921 ఏప్రిల్ 13న చలం హోస్పేటలో ఉండగానే రెండవ సంతానం సౌరిస్ జన్మించింది. 'సౌరిస్' అన్నది ఒక ఆంగ్ల నవలలోని ఫ్రెంచి కథానాయిక పేరు. సౌరీస్ పై చలం ప్రభావం ఎంతో వుంది. చలం 1921లో హోస్పేటలో ఉండగానే *'శశిరేఖ'* నవల రాశాడు. అప్పటికే చలం రచయితగా ఖ్యాతి సంపాయించుకున్నాడు. ముద్దుకృష్ణతో కలిసి, *'జ్వాల'* అనే పత్రిక కూడా నడిపారు. తరువాత పత్రికా సంపాదకత్వ బాధ్యతను ముద్దుకృష్ణకే వదిలి చలం వైదొలి. చలం చివరి దశలో సౌరిస్ సంరక్షణలోనే ఉన్నారు. చలం మూడవ సంతానం వసంత్‌కుమార్. చలం తాను రాసిన *'బిడ్డల శిక్షణ'* (1924) పుస్తకంలో పిల్లల పెంపకాన్ని గురించి, కుటుంబ జీవనంకి సంబంధించి అతడు ఏమి ఆశిస్తున్నాడో వివరంగా చెప్పాడు. అది ఆ రోజుల్లో విప్లవాత్మకమైన పుస్తకంగా పరిగణించబడింది. చలానికి నాలుగో సంతానంగా నిర్మల. చలం అయిదో సంతానం చంపక. చలం పెంచుకొన్న అమ్మాయి పేరు నర్తకి. నర్తకి అసలుపేరు రాజ్యలక్ష్మి. తన పదవయేట భర్తను వదిలి, చలం కుటుంబంలో

ప్రవేశించిన చలం కుటుంబ భారాన్ని నిర్వహించింది. చలాన్ని చివరి క్షణాల దాకా నర్తకి సంరక్షిస్తూ వచ్చింది.

చలం ఇంటికి దేవులపల్లి వేంకట కృష్ణశాస్త్రి, వేదుల సత్యనారాయణ, మల్లవరపు విశ్వేశ్వరరావు, జల సూత్రం, రుక్మిణీ నాథ శాస్త్రి, నండూరి సుబ్బారావు, చింతా దీక్షితులు, బి.వి. నరసింహారావు, హరీన్, శ్రీశ్రీ, మొదలైన వారు వస్తుండేవారు. సుహృద్భావ వాతావరణం ఏర్పడేది. చింతా దీక్షితులు చలం మొదటి కథ '*రుక్మిణీ*'ని కొడాలి ఆంజనేయులు సంపాదకత్వంలో వెలువడే 'సాహితీ'లో అచ్చయ్యేలా చూసి చలం లాంటి కథకుడిని పాఠకలోకానికి పరిచయం చేశారు. చలం జీవితంలో మరో ముఖ్య మలుపుకు కూడా చింతా దీక్షితులే కారకులయ్యారు. చలంలో ఆధ్యాత్మిక చింతన ప్రేరేపించేందుకు రమణ మహర్షి దగ్గరకు తాను వెళ్తూ చలాన్ని కూడా తీసుకెళ్ళాడు. అలా చలం జీవితంపై ప్రభావాన్ని కనబరచిన వ్యక్తుల్లో చింతా దీక్షితులు ఒకరు.

1924లో చలం ప్రమోషన్ మీద బందరు బదిలీ అవ్వడంతో అహోబలరావుతోనూ, జంగం కోటయ్య దేవర కొడుకు సుబ్రహ్మణ్య దేవరతోనూ స్నేహం ఏర్పడింది. అహోబలరావును చలం తానెరిగిన గొప్ప వ్యక్తులలో ఒకడిగా పేర్కొన్నారు. 1927-28 మధ్య ఏలూరులో నండూరి సుబ్బారావుతో స్నేహం యేర్పడింది. అతడు ఎంకి పాటల్ని చలానికి వినిపిస్తూ వుండేవారు.

1930లో చలం స్త్రీ పుస్తకాన్ని ప్రచురించాడు. 1933లో ఆంధ్రయూనివర్శిటీ పెట్టిన నవలల పోటీకి చలం 'మైదానం' నవల పంపారు. 1935లో చలానికి బెజవాడ నుండీ కనిగిరికీ, అక్కడి నుండీ 1936లో నెల్లూరుకీ బదిలీ అయింది. 1936లో చలం జీవితంలో గొప్ప సంఘటన చోటు చేసుకుంది. అదే రమణ మహర్షి దర్శనం కలగడం. 1935-36లో చలం 'మ్యూజింగ్స్' రాయడం ప్రారంభించాడు. మరోపక్క అతడి ఆరోగ్యం కూడా అంతంత మాత్రంగా వుంది. తనకున్న బాధల్ని ఉత్తరాల ద్వారా రమణ మహర్షికి తెలియజేస్తూండేవారు. 1938లో కాశీలో సంస్కృతి విద్యామందిర్ అనే సంస్థ చలానికి "*సాహిత్య మనీషి*" అనే బిరుదు ఇచ్చింది. ఆర్భాటాలకు అంతగా ఇష్టపడని చలం బిరుదులూ, సన్మానాలూ, సభలంటే ఇష్టం

లేదంటూ ఆ బిరుదును సున్నితంగా తిరస్కరించారు. 1939 చలాన్ని టెక్ట్స్‌బుక్ కమిటీకి మెంబరుగా వేసుకున్నామని అధికారులు తెలియపరచగా, 'యెంత దుర్గతిలోకి పతితుణ్నయ్యానో' అని తన సహజ ధోరణిలో ఆ గౌరవాన్ని నిరాకరించారు. 1941లో లీల చలం జీవితంలోకి ప్రవేశించింది. అప్పుడు చలానికి గుడివాడ నుండీ ఏలూరికి బదిలీ అయ్యింది. 'మ్యూజింగ్స్'ను లీలకే అంకితమిచ్చాడు. 1949లో లీల చలాన్ని విడిచిపెట్టింది 1940లో చలానికి ఏలూరు నుంచీ భీమిలికి బదిలీ జరిగింది. ఐదేళ్ళ తరువాత తిరిగి మళ్ళీ భీమిలి నుంచి ఏలూరుకే రావడం జరిగింది. 1948లో ఆయన స్వయంగా ఉద్యోగ విరమణ చేశాడు.

1950లో జీవితంలో ఎదురైన ఎన్నో ఎదురుదెబ్బల వలన ఎంత మార్చాలని ప్రయత్నించినా మారటం అనేమాట పక్కనపెట్టి ఇసుమంతైనా కదలిక లేని సమాజం పట్ల విసుగు చెందటమే కాకుండా, తెలుగు దేశంపై, రచనా వ్యాసాంగంపై తలెత్తిన తిరస్కారభావం ఇలా అన్నీ కారణమై తిరిగి మళ్ళీ చలం కుటుంబంతో సహా తిరువణ్ణామలై తిరిగి వెళ్ళిపోయాడు.

1960లో చలం 'బుజ్జిగాడు' అనే పిట్ట కథ రాశారు. *"1960 ప్రాంతాల్లో చిత్తూరు నుంచి శారదా పీఠం ఆధ్వర్యంలో కీ.శే. కె.సభా (1923-1980) నాయకత్వంలో వందమందికి పైగా రచయితలూ, కళాకారులూ తిరువణ్ణామలైకు తరలి వచ్చి, రమణాస్థాన్‌లో చలానికి సన్మానం చేశారు. అది ఆయనకి జరిగిన మొదటి సన్మానం."* [25] 1961లో 'భగవాన్ పాదాల ముందు దివాన్' లాంటి కావ్యరచనలు చేశారు చలం.

1970లో తిరువణ్ణామలైలో చలం భార్య అయిన రంగనాయకమ్మ మరణించారు. 1974 జులైలో చలానికి పక్షవాతం వచ్చింది. చలం వ్యక్తిగత జీవితంలో పెద్దగా సుఖపడలేదని చెప్పవచ్చు. భార్య అతని ప్రవర్తనతో విసుగెత్తి, అతనితో ఉండలేక బంధువులదగ్గరకు వెళ్ళలేక మానసిక క్షోభ అనుభవించిందట. కొంతకాలానికి, ఆమె తీవ్ర విచారంలో (Depression) మునిగి పోయిందట. పెద్ద కొడుకు చిన్నతనంలోనే జబ్బు చేసి మరణించాడు. రెండవ కొడుకు

[25] చలం ఆత్మకథ; పుట : 49

దురలవాట్లకు బానిసై, ఇల్లు వదలి ఎటో వెళ్ళి పోయాడు. కూతురు సౌరిస్ వివాహం చేసుకోలేదు, సన్యాసినిగా మారింది. పిల్లలను ఎలా పెంచాలో అన్న విషయం మీద "*బిడ్డల శిక్షణ*" అనే పుస్తకం వ్రాసిన చలంకు ఈ పరిస్థితి ఎదురు కావటం విచిత్రం!

సమాజం తన పట్ల చూపుతున్న ఏహ్యాభావం, తన రచనల పట్ల వచ్చిన వివాదం, చివరకు అతనికి ఎంతగానో దగ్గరైన వదిన (వొయ్యి గా పిలుచుకున్న పెద్ద రంగనాయకమ్మ, అతని భార్య సవతి సోదరి. ఈమె బెజవాడలో వైద్యురాలు, ఆమెకు వైద్య విద్య చలమే చెప్పించాడు)మరణం చలాన్ని కుంగతీసి, ఆంధ్ర దేశం నుండి వెళ్ళిపోయి ఏదైనా ప్రశాంత వాతావరణంలో బతుకుదామన్న నిర్ణయం తీసుకునేలా చేసాయి. 1950 ఫిబ్రవరి 9న చలం బెజవాడలోని తన సొంత ఇంటిని అమ్మివేసి,తన కుటుంబముతో అరుణాచలం వెళ్ళిపోయాడు. అప్పటివరకు ధార్మిక విషయాలమీద విముఖత చూపిన చలం, ఒక్కసారిగా రమణ మహర్షి ఆశ్రమాని వెళ్ళటం చర్చనీయాంశమయ్యింది. చలాన్ని రమణ మహర్షి దగ్గరకు, అతని మిత్రుడు, సహోద్యోగి దీక్షితులు 1930లలో తీసుకుని వెళ్ళాడు. అప్పటి నుండి చలం అప్పుడప్పుడు రమణాశ్రమానికి వెళ్ళివస్తూండేవాడట. ప్రముఖ సినీ రచయిత పింగళి నాగేంద్రరావుకు చలంకు ఈ విషయంలో జరిగిన సంభాషణ:

పింగళి 'ఎందుకండీ అరుణాచలంవెళ్ళారు మీరు?

చలం 'శాంతికి'

పింగళి 'శాంతికా! ఎందుకు కావాలి?'

చలం 'వ్యధ భరించలేక, నాలో, నా మనసులో పుట్టే ఈ అరాటపు బాధ భరించడం అశక్యమై'

పింగళి బాధ పోయి శాంతివస్తే ఇంక మీరేం రాస్తారు? ఇప్పటి మీ మ్యూజింగ్స్ లో మీ రాతకి వెర్రి దూకుడు తగ్గి ఓ స్తిమితం, ఓ మార్గం ఏర్పడ్డది. రాతే మాని, ఇంతలో చావు శాంతిలోకి పోతారా?'

చలం 'రాయకపోతేనేం'

పింగళి 'దానికి జవాబు మీరే అంటున్నారన్న మాట. చెత్త రాతలు గాక, వాస్తవం పలికేవన్ని బాధలోంచే బైలుదేరేయి మరి!'

చలం 'కావొచ్చు, మీరందరూ హాయిగా చదువుకునేందుకు,రాత్రింబవళ్ళు నేను భరించలేని వేదనతో గడపమంటారా?'

ఈ జవాబు విని పింగళి సహృదయంతో నవ్వారని, చలం *"విషాదం"* వ్యాస సంపుటిలోని *"బాధ"* అనే వ్యాసంలో స్వయంగా వ్రాశారు [26] దీనివల్ల, చలం ఎంత క్షోభపడి, ఎన్నిరకాలుగా అలోచించి, సమాజంలో జరుగుతున్న కనపడని అన్యాయాల గురించి మధనపడి తన రచనలు సాగించాడనిపిస్తుంది. చివరకు తన మధనకు, బాధకు సరైన స్పందన రాకపోవటం అతని అరుణాచల యాత్రకు ఒక కారణమయ్యిందనవచ్చును.

చలం తన చివరి కాలంలో, తన కూతురు సౌరిస్ లో ఈశ్వరుణ్ణి చూసుకున్నాడట. ఏపని చేసినా 'ఈశ్వరుడు చెప్పాలి' అనేవాడట. *"ఈశ్వరుడు"* అంటే అతని దృష్టిలో సౌరిస్. ఆమె ప్రభావంలోనే చలం 1961లో *"ప్రళయం"* వస్తుందని ప్రచారం చేసాడు. తెలిసిన వారందరికి ఉత్తరాలు వ్రాసి సురక్షిత ప్రాంతాలకు వెళ్ళమని, లేదా అరుణాచలం వచ్చేయమని సలహా ఇచ్చాడు. అతని అభిమానులు కొంతమంది సహాయ శిబిరాలను కూడా ఏర్పరిచారట. కాని, అటువంటి ప్రమాదం ఏమీ జరగక పోవటంతో, చలం నవ్వులపాలైన మాట నిజం.

ఈయన వెళ్ళిన అతికొద్ది కాలానికే రమణ మహర్షి ఇహలోక యాత్రను చాలించారు. చలం అక్కడి ప్రశాంత వాతావరణంలో కొంత ధార్మిక విషయాల మీద సాధన చేశాడు. అక్కడే భగవద్గీతకు చక్కటి వివరణ వ్రాశాడు. ఎందరో మోసపోయిన స్త్రీలకు ఆశ్రయం కల్పించాడు. అతని భార్య హృద్రోగంతో అరుణాచలంలోనే మరణించింది. చివరి రోజులలో అతని కూతురు సౌరిస్, ఎంతగానో సేవ చేసింది. అరుణాచలంలో మూడు దశాబ్దాలు జీవించి, 1979 మే 4న అనారోగ్యంతో చలం మరణించాడు. అతని అంత్యక్రియలు కూతురు సౌరిస్ జరిపించింది.

[26] విషాదం 88వ పేజీ,ముద్రణ 1992

### 3.3.3.1. చలం రచనాశైలి

తన రచనా శైలి గురించి తన ఆత్మ కథలో వ్రాసుకున్నది ఆయన శైలి గురించి కొంత తెలియచేస్తుంది. నేను రచనలు సాగించేటప్పటికి నాకు తెలీకుండానే, నేను మాట్లాడే భాషలోనే రాశాను. తక్కిన కథలని పుస్తకాల భాషలో రాశాను. అసలు ఆనాడు భాషా ఉద్యమం అనేది ఒకటి ఉందని నాకు తెలీదు. చింతా దీక్షితులు (ఈయన కూడ రచయిత, చలంగారికి సహ ఉద్యోగి) గారినించే విన్నాను గిడుగు రామ్మూర్తిపేరు. వారి శిష్యులు ఆలోచించి, భాషని ఎంతవరకు మార్చవచ్చో తూచి రాసేవారు. ఆ యత్నాలు, మడి కట్టుకోటాలు చదివితేనే నాకు అసహ్యం వేసింది. భాష ఎట్లా మారాలో నాకు శాసించాలని చూసేవారు. భర్తని యెన్ని ముద్దులు పెట్టుకొవాలో శాసించినట్లు. కాని ఈ చలం ఓ వరదల్లె వూడ్చుకొచ్చాడు. నా భాషాధాటికి వారికెంత భయమో! పైగా ఆ భాష, భయంలేని, సంకోచంలేని, భీతిలేని, పాత గోడల్ని పడగొట్టే తీవ్రవాది ఓ master stylist చేతిలో పడ్డది. చాలా త్వరలో వీళ్ళ కృతక భాషలన్నీ కుప్పకూలాయి. చలం శైలిలో, రాతలో అంత తీవ్రత అంత invisibility అంత భయంకరాకర్షణ ఉండిపోయింది. ఒక్కొక్కరే ప్రతిఘటించబోయి, పరాజితులై, నా భాషనే అనుకరించారు గతిలేక. ఇంకో విధంగా రాస్తే వాటిని చదవరు ఎవ్వరూ. ఈ భాష, ఈ భావాలు వీలులేదు అని ఎంతమంది మొత్తుకున్నా, ప్రజలు ఎగబడి చదువుతున్నారు. రచయితలు, పత్రికలు చలం పేరు చెప్పకుండా చలాన్ని అనుకరించటం ప్రారంభించారు. భాషాదిగ్గజాల మొకాళ్ళూగిసలాడే పాత నీతుల గోడలు విరిగి కింద కూలాయి.[27]

### 3.3.3.2. మహాప్రస్థానానికి ముందుమాట

చలం, శ్రీ శ్రీ వ్రాసిన మహాప్రస్థానంకు ముందుమాట వ్రాసాడు. మహాప్రస్థానంలోని రచనలకు దీటుగా ఈ ఉపోద్ఘాతం తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధమైంది. "*యోగ్యతా పత్రం*" అన్న శీర్షికతో వ్రాయబడిన ఈ ముందుమాట తెలుగు రచనలలో అత్యంత ప్రసిద్ధమైన

[27] ఆత్మకథలో 74-75వ పుటలు

ముందుమాటలలో ఒకటి. చలం మాటల్లో అంత శక్తి, వాడి(పదును) అలోచింపజేయగల శక్తి ఉన్నాయి. అందులో కొన్ని వాక్యాలు క్రింద ఉదాహరింపబడినాయి.

* ఇది మహా ప్రస్థానం సంగతి కాదు. ఇదంతా చెలం గొడవ. ఇష్టం లేని వాళ్ళు ఈ పేజీలు తిప్పేసి (దీంట్లో మీ సెక్సుని ఉద్రేకించే సంగతులు ఏమీ లేవు) శ్రీ శ్రీ అర్ణవంలో పడండి. పదండి ముందుకు. అగాథంలోంచి బైలుదేరే నల్లని అలలు మొహాన కొట్టి, ఉక్కిరిబిక్కిరై తుఫానుహోరు చెవుల గింగురుమని, నమ్మిన కాళ్ళకింది భూమి తొలుచుకుపోతోవుంటే, ఆ చెలమే నయమని వెనక్కి పరిగెత్త చూస్తారు.

* శ్రీ శ్రీ కవిత్వమూ, పాల్ రోబ్సన్ సంగీతమూ ఒకటే రకం అంటుంది సౌరిస్. ఆరెంటికీ హద్దులూ, ఆజ్ఞలూ లేవు. అప్పుడప్పుడు లక్షణాలనూ, రాగాలనూ మీరి చెవి కిర్రుమనేట్టు ఇద్దరూ అరుస్తారు. ఏమీ రసం లేకుండా flat గా ఎక్కడికో, ఏమీ చేతగానివాళ్ళమల్లే జారిపోతారు. కాని ఆ అరుపుల్లో, చీకట్లో మొహాలూ, తోకలూ కనపడక వెతుక్కునే ప్రజల రొద, గాలిదెబ్బలకింద ఎగిరిపడే సముద్రపు తుఫాను గర్జనం, మరఫిరంగుల మరణధ్వానం, గింగురుమంటాయి. కంఠం తగ్గించి వినపడకండా తగ్గుస్థాయిలో మూలిగారా, దిక్కులేని దీనుల మూగవేదన, కాలికింద నలిగిన చీమల కాళ్ళు విరిగిన చప్పుడు, నీళ్ళులేక ఎండుతున్న గడ్డిపోచ ఆర్తనాదం వినిపింపజేస్తారు. బుద్ధి వున్నవాడెవ్వడూ అతనిది సంగీతమని కాని, ఇతనిది కవిత్వమని కాని వొప్పుకోడు; వొప్పుకోటమూ లేదు. ఎందుకంటే ఈ ఇద్దరి Appeal బుద్ధిని, వివేకాన్ని, కళాబంధనల్ని మించిన ఏ అంతరాళానికో తగులుతుంది –ఆ అంతరాళం అనేది వున్న వాళ్ళకి.

* ...శ్రీ శ్రీ *"ఆకలేసి"* నక్షత్రాలు అదిరిచూసే *"కేకలేశాడు."* ఈ కవికి ఆకలివేస్తే రా–యింటికెళ్ళి శ్లాఘించి భత్యఖర్చు తెచ్చుకుని, భోజనం చేసి ప్రియురాలిమీద గీతం వ్రాశాడు

రచనలు

మైదానం (చలం రచన), దైవమిచ్చిన భార్య, ప్రేమ లేఖలు, స్త్రీ, మ్యూజింగ్స్ వంటివి చలం రచనలలో సుప్రసిద్ధమైనవి. చలం తన భావాలను వ్యక్త పరచటానికి అనేక రచనా

ప్రక్రియలు వాడాడు. కథలు, నవలలు అందులో ముఖ్యమైనవి. నాటకాలు కూడ ఉన్నాయి కాని, అందులో వ్యంగ నాటికలు ఎక్కువ. ఈజాబితాలో ఉదహరించినవి చలం వ్రాసిన అసంఖ్యాకమైన రచనలలోనివి కొన్ని మాత్రమే. అనేకమైన కథలు ఏవేవో పత్రికలలో పడినవి దొరకనివి చాలా ఉన్నవట. అలా దొరకని కథలను వెదికి పుస్తక రూపంలోకి తేవటానికి ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి.

ఆత్మ కథ

చలం (చలం ఆత్మకథను అంగ్ల భాషలోకి తర్జుమా చేసారు.)

నవలలు

మైదానం, జీవితాదర్శం, శశిరేఖ, దైవమిచ్చిన భార్య, బ్రాహ్మణీకం, బుజ్జిగాడు, అమీనా, అనసూయ–చుక్కమ్మ, సావిత్రి, వివాహం, హంపికన్యలు, విచిత్ర నళీయం, అరుణ

కథలు

ప్రేమ పర్యవసానం, వాణీ – ఏ స్టడీ, అవతారమా?, ఆమె త్యాగం, మామగారి మర్యాద, చిరుగు గౌను, అదృష్టం, ఆశాశ కురుపు, భాషన్నా తెలీదు, మోసం చేసిందా?, యవనవ్వనం, రెడ్డి రంగమ్మ, మధుర మీనాక్షి ఆర్గ్యుమెంటు, లక్ష్మి ఉత్తరం, వితంతవు, నాయుడు పిల్ల, సుశీల, నేను చేసిన పని, భార్య, శేషమ్మ, రామ భక్తుడు, అప్పుడూ — ఇప్పుడూ, దోష గుణం, జెలసీ, మణి, నేనేం చేశాను?, బిడ్డ, ఏం తప్పు?, భోగం మేళం, అట్ల పిండి, అభినవ సారంగధర, కలియుగ ధర్మం, నాటకం, పాట కచ్చేరి, నా మొదటి క్రాఫ్, అవణ దర్శనం, విచిత్ర నళీయం, సినిమా సాయం, ముక్కాలి పీట, అనుసూయ, చుక్కమ్మ, ఆత్మార్పణ, ఈ లోకం, ఉషారాణితో ఇంటర్వ్యూ, ఒరేయ్, వెంకటచలం!, ఓ పువ్వు పూసింది, కర్మమిట్లా కాలింది, కళ్యాణి, జానకి, పతివ్రత, పాప ఫలాలు, 1960, మనోహర ప్రజ్ఞ, లంచం, వాళ్ళు నలుగురూ, వెన్నెల తోటలు, సీతయ్య, సుగంధి, శమంతకమణితో ఇంటర్వ్యూ, హంకో మొహబత్, హంపి కన్యలు, దయ్యాలు, ఆత్మహత్య, కొత్త చిగుళ్ళు, ఒంటరితనం, దెయ్యమేనా?, ఎందుకు?, కర్మఫలం, కళారాధన, ఆ రాత్రి, ఎదగనే లేదు, అమ్మగారి అవసరం, ఎరుకలమ్మ, హరిజన సమస్య, మచ్చలు, పరీక్షలు, హిందూ ముసల్మాన్, హరిజన విద్యార్థి, లక్ష్మిదేవి, రుషులూ– యోగులూ, మాదిగ అమ్మాయి, హత్య విచారణ, ముక్తి మార్గం, దస పుత్రులు,

స్టేషన్ పంపు, అవసరం లేని ఆపరేషన్, కోర్కి, ఆమె పెదవులు, మర్యాదస్తునికో కథ, లిల్లీతో స్నేహం ఎలా అయ్యిందంటే, ఆరంభింపరు..., నేనూ– మా ఆవిడా మిగిలాం, వేదాంతం, సీత తల్లి, ఏం తప్పు?, తరుణుల చిత్తంబు..., పేదరాసి పెద్దమ్మ.

నాటకాలు

విడాకులు, సావిత్రి, చిత్రాంగి, త్యాగం, మృత్యువు, పురూరవ, శశాంక, మంగమ్మ, పద్మరాణి, జయదేవ.

నాటికలు

ఆడవాళ్ళ ఆకలి, ఈర్ష్య, జానకి ఆవేదన, తెలుగు నవల, సత్యం, శివం, సుందరం, హరిశ్చంద్ర, భానుమతి, పంకజం, ద్రౌపది, నరసింహావతారం, రంగదాసు, సత్యవంతుడు, వెలయాలి అబద్ధాలు, వీరమ్మ, స్వతంత్రం, కొండడు, చివరి కుండ, జానకి సమస్య, ఏం జబ్బు?, ఇన్జెక్షన్లు, ఆత్మ సంపర్కం, దేవీ ప్రసన్నం, హంతకుడు, స్వర్గ నరకాలు, భక్త కుచేల, మామయ్యలు, యముడి ముందు చలం, కుచేలుడు, శావలిని, సీత అగ్ని ప్రవేశం, మిస్ కోమలం, పండగ భిక్ష, పోలీసు దొంగ, ప్రహ్లాదుడు.

వ్యాఖ్యానాలు, వ్యాసాలు

బిడ్డల శిక్షణ, భగవద్గీత, కొత్త చిగుళ్ళు, అనసూయ, స్త్రీ, ఆనందం, విషాదం, చలం ఆత్మకథ, బుజ్జిగాడు, ఆత్మార్పణ, కవి హృదయం, రూబాయిలు, కాన్క, ప్రేమ లేఖలు, సావిత్రి, చలం సాహిత్య సుమాలు.

చలం ఉత్తరాలు(13 సంపుటాలు) – తన భావాలను, సాహితీ వ్యాసంగాన్ని, ముఖ్యంగా ఇతర సాహితీకారులతో పంచుకొనే ఆలోచనలను కూర్చిన ఉత్తరాల సంపుటి.

ఇతర ముఖ్య రచనలు

స్త్రీ, బిడ్డల శిక్షణ, మ్యూజింగ్స్, ప్రేమ లేఖలు, బుజ్జిగాడు, చలం మిత్రులు, చలం (ఆత్మ కథ)

వ్యాసాలు

కవి హృదయం, మరవరాని మిత్రుడు, గురువర్యుడు, సినిమా ప్రియులు, పిన్నికి లేఖ, ఆద్మీ ఫిలిమూ: ఆంధ్రదేశమూ, పుణ్యం – పాపం, భయం, ద్వేషం – ఈర్ష్య, కామం, సెక్స్ కంట్రోల్, హిందూ ప్రతివత, అన్యకాంతలడ్డంబైన, ప్లేటోనిక్ లవ్, పత్రికలు చేసే అపచారం, కవిత్వం దేనికి?, బాధ, ఆనందం, నిగ్రహం, అశ్లీలాలూ: బూతులూ, స్త్రీలూ: నాట్యరంగం, ధర్మంచర, ఆదర్శవంతంగా చూపతగినది మానవుడి ప్రేమ, సినిమా జ్వరం, త్యాగం, ఆధ్యాత్మిక దేశము, సుందరుల తత్వము, ఏది సాధ్యం కాదు?, కలా వాస్తవం.

ఉత్తరాలు

చలం ఉత్తరాలు, చలం లేఖలు, మహాస్థాన్, శ్రీ రమణస్థాన్, కవిగా చలం, చలం మిత్రులకు, జలసూత్రం రుక్మిణీనధ శాస్త్రికి, సూర్యప్రసాద్కిర, జవహర్కిగ, జీవన్కి

తాత్వికత భావాలు

మ్యూజింగ్స్ – చలం భావాలను, తాత్వికతను ప్రతిబింబించే అనేక వ్యాసాల సంపుటి. ఒక సబ్జెక్టుకు కట్టుబడకుండా స్వేచ్ఛగా సాగించిన రచన.

ఇతర రచనలు

అనువాద కవిత్వం, టాగోర్ గీతాంజలి, టాగోర్ ఉత్తరణ, టాగోర్ ఫలసేకరణ, టాగోర్ వనమాలి, టాగోర్ కాన్క, ఉమర్ ఖయామ్ రుబాయీలు.

ఆధ్యాత్మిక రచనలు

చలం గీతాలు, సుధ (కవితలు), వెలుగు రవ్వలు (కథలు), భగవద్గీత (అనువాదం), అక్షర మణిమాల, ధర్మ సాధన (వ్యాసాలు), బగవాన్ స్మృతులు (వ్యాసాలు), జీసస్ జీవితం, నిర్వికల్పం, మార్తా (నవల)

ఈయన తన విమర్శలో భారతీయ, పాశ్చాత్య సౌందర్య సిద్ధాంతాలను సమన్వయిస్తూ చేసిన విమర్శ తీరుతెన్నులను రాబోయే అధ్యాయంలో విశ్లేషిస్తాను.

**3.3.4. సత్యనారాయణ విశ్వనాథ (1895-1976)**

తెలుగు సాహిత్యంలో తొలి జ్ఞానపీఠ అవార్డు గ్రహీత అయిన విశ్వనాథ సత్యనారాయణ 1895 సంవత్సరం అక్టోబర్ 9వ తేదీన పార్వతమ్మ, శోభనాద్రి దంపతులకు మూడవ బిడ్డగా జన్మించారు. విశ్వనాథ తండ్రి మహా శివభక్తులు వీరు *"1902లో కాశి నుంచి శివలింగం తెచ్చి నందమూరులో శివాలయాన్ని నిర్మించి, అందులో ప్రతిష్ఠింపచేశారు. ఆ విశ్వేశ్వరుడే విశ్వనాథ వారి యింటి ఇలవేల్పున విశ్వనాథ వారు ఆ దేవుడి గురించి విశ్వేశ్వర శతకాన్ని రాసి ఆ దేవుడిపై తనకు గల భక్తి ప్రవత్తులను చాటుకున్నారు. అంతేకాక రామాయణ కల్పవృక్షాన్ని సైతం ఆ దేవుడికి అంకితమిచ్చారు."*[28]

విశ్వనాథ సత్యనారాయణ నందమూరు, పెదపాడు, ఇందుపల్లి, వెలినూతల, నాగవరప్పాడ లలో ప్రాథమిక విద్యను నేర్చుకున్నారు. ఆ పిమ్మట శ్రీ గుటనిపూడి వీరభద్రయ్యగారి దగ్గర మనుచరిత్రతో పాటు గణ యతి ప్రాసలను పద్య రచనను నేర్చుకొన్నారు. విశ్వనాథ సత్యనారాయణ గారికి నాటకలంటే అమితంగా ఇష్టపడేవారు. వీరికి గొల్ల బాగవతులు ఆడే వీధి నాటకాలు, కూచిపూడి భామా కలాపాలు, భట్రాజుల చాటు పద్యాలు అంటే ఎంతో ఇష్టపడేవారు. వీరు ఓ మహాకవిగా ఎదిగేందురు ఇవి ఎంతగానో ఉపయోగపడ్డాయి.

విశ్వనాథ సత్యనారాయణతండ్రి గారికి ఆంగ్ల విద్యపై ఆసక్తి అధికంగా ఉండేది. దానితో విశ్వనాథ వారికి ఆంగ్ల విద్యను నేర్పించాలనే ఉద్దేశ్యంతో ఉన్న కొద్ది పొలాన్ని కౌలుకిచ్చి విశ్వనాథ వారిని బందరు హైస్కూల్ లోని మొదటి ఫారంలో చేర్పించారు. కానీ విశ్వనాథ వారు పాఠ్య పుస్తకాలను చదవకుండా చిన్నతనంలోనే పద్యాలను రాసేవారు. ఇది గమనించిన వారి తండ్రి కోపంతో 'నీవేదో పెద్ద ఉద్యోగము చేయుదువని ఆంగ్లము చెప్పించుచుండగా నీకు తెలుగు కవిత్వమేమిరా?' చాలు ఇంకా చదువు మానుకోమని పుస్తకాలన్ని కట్టకట్టి పారవేసిరట. వారించుక శాతించిన పిమ్మట విశ్వనాథ వారు 'నేనొకసారి చదివిన పుస్తకము మరొకసారి చదువలేను. అది నాకు చేతకాదు. నేనే ఫారము తప్పిన ఆ ఫారముతోనే చదువు మాన్పింపుము

[28] (వేయి పగడలు విశ్లేషణాత్మక విమర్శ–పుట:05)

ఇదే షరతు' అని చెప్పి వారి తండ్రి గారికి భవిష్యత్‌లో రామాయణాన్ని పద్య రూపంలో రచించెదనని మాట ఇచ్చి దానిని రామాయణ కల్పవృక్షముతో నిలుపుకున్నారు.[29]

విశ్వనాథ వారు హైస్కూల్ చదివే రోజులోనే కూచిబట్లు సీతారామశాస్త్రిప్రథమ పుత్రిక వరలక్ష్మమ గారితో వివాహం జరిగింది. విశ్వనాథ వారు హిందూ హైస్కూల్ లో చదివేటప్పుడు చెళ్ళపిళ్ళ వెంకట శాస్త్రి తెలుగు పండితులుగా ఉండేవారు. అంతేగాక పింగళి కాటూరి కవులు విశ్వనాథ వారికి సహాధ్యాయులు. గురువుల ప్రోత్సాహంతో విశ్వనాథ వారికి చక్కటి కవితలను రాసేవారు. విశ్వనాథ వారు హైస్కూల్ విద్యను పూర్తి చేసిన తర్వాత 1916లో నోబుల్ కళాశాలలో ఎఫ్.ఏ.ను పూర్తి చేశి అక్కడే బి.ఏ.లో చేరారు. విశ్వనాథ వారు బి.ఏ.లో మూడు నాలుగు సార్లు తప్పడం జరిగింది. ఆ సమయంలోనే వారికి సంస్కృతాంగ్ల భాషల్లో పట్టు సాధించారు.

విశ్వనాథ వారు బి.ఏ. తప్పడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదురవ్వడంతో వాటిని తట్టుకొనేందుకు నోబుల్ కాలేజీలోనే ట్యూటర్‌గా పనిచేశారు. ఆ సమయంలోనే విశ్వనాథ వారు భారతీస్వాములుగా పేరుగాంచిన కానుకొలను త్రివిక్రమరావుగారి యొద్ద కౌముదిని, బందరులోని కంభంపాటి రామ మూర్తి శాస్త్రిగారి వద్ద సంస్కృత వ్యాకరణమును, శ్రీ పరిమి నరసింహ శాస్త్రుల వారి దగ్గర సూత్ర భాష్యాన్ని అభ్యసించారు. వాటితో పాటు ఆంగ్ల భాషా అధ్యయనం వీరి దినచర్యలో ఒక భాగమై పోయింది. ఆ తరువాత కొంతకాలం నిరుద్యోగ సమస్యను ఎదుర్కొన్నారు. బందరులో జాతీయ కళాశాల స్థాపించిన తర్వాత దానిలో 1921–26ల మధ్య తెలుగు పండితులుగా పనిచేశారు. ఇక్కడే వారి కవి జీవితం ప్రారంభమైంది. స్వాతంత్రపోరాటం ముమ్మరంగా సాగుతున్న సమయమది. ఆ కాలంలోనే విశ్వనాథ వారు కిన్నెరసాని పాటలు, గిరికుమారుని ప్రేమగీతాలు, నర్తనశాల నాటకం మొదలైన రచనలతో పాటు కాలగర్భంలో కలసిపోయిన ఎన్నో చారిత్రక వాస్తవాలని వెలికితీసి 'ఆంధ్రప్రశస్తి' ని రచించి దానిని శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారికి అంకితమిచ్చారు.

[29] (వేయి పగడలు విశ్లేషణాత్మక విమర్శ–పుట:05).

విశ్వనాథ సత్యనారాయణ శ్రీకోలవెన్ను రామకోటేశ్వరరావు గారితో కలసి 'జయంతి' అనే ద్వైమాసిక పత్రికకు సాహితీ సమితి సభ్యులుగా, సంపాదకులుగా పనిచేశారు. 1921లో వీరికి మొదటి సంతానంగా అచ్చుత దేవరాయలు జన్మించారు. తరువాత వారికి ఇద్దరు కుమార్తెలు కలి. 1927లో విశ్వనాథ వారు బి.ఏ పాసవడంతో పాటు పితృ వియోగం కూడా కలిగెను. ఆ తరువాత రెండేళ్ళలో ఎం.ఏ పూర్తిచేసి బందరూ హిందూ కళాశాలలో 1931 వరకూ, 1933 వరకూ ఆంధ్రోపన్యాసకులుగా పనిచేశారు. 1932లో వారి సతీమణి వరలక్ష్మమ్మ మరణించారు. విశ్వనాథ వారు 1933 నుండి 1938 వరకు నిరుద్యోగ సమస్యతోనే బాధపడుతూనే ఆంధ్రదేశమంతటా వారి రచనలతో ఉపన్యాసాలతో కవిగా, ఉపన్యాసకుడుగా, విమర్శకుడుగా ఖ్యాతి గడించారు.

### 3.3.4.1. విశ్వనాథ రచనలు

విశ్వనాథ వారు 25 పైచిలుకు కావ్యాలు, 6 శతకాలు, 13 గేయకావ్యాలు, 15 నాటకాలు, 88 నవలలు, 10 సంస్కృత నాటకాలు, 10 విమర్శనా గ్రంథాలు, మరెన్నో వ్యాసాలు, ఉపన్యాసాలు రాశారు. ఆయన రచనలను కొన్ని ఇతర భాషలలోకి అనువదించారు. రేడియో కోసం నాటకాలు, ప్రసంగాలు రూపొందించారు.[30]

విశ్వనాథ సత్యనారాయణ 1934లో 'వేయిపడగలు' నవల రచించి అడవి బాపిరాజుగారి 'నారాయణరావు' నవలతో పాటు ఆంధ్ర విశ్వకళా పరిషత్తు వారి బహుమతిని అందుకొన్నారు. ఆ సంవత్సరంలోనే రామాయణ కల్పవృక్ష కావ్యాన్ని రాయడం ప్రారంభించారు. బందరులో ఒక సాహిత్య సమాజం వారు సన్మాన సభను ఏర్పాటు చేసి, ఆ సభలో 'కవి సమ్రాట్' బిరుదు ఇచ్చారు. 1938లో విశ్వనాథ వారికి రెండవ వివాహం జరిగింది. ఆమెను కూడా విశ్వనాథవారు వరలక్ష్మమ్మపేరుతోనే పిలిచేవారు. ఆయొకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె జన్మించారు. రెండవ వివాహం విశ్వనాథ వారికి అన్ని విధాలా

[30] 20వ శతాబ్ది తెలుగు వెలుగులు: పుట 895

కలిసొచ్చింది. కానీ ఓ బాధాకరమైన సంఘటన ఏమిటంటే వారి కుమారుడైన రామచంద్రుడు మరణించడం, ఆ సంఘటన విశ్వనాథ వారికి వైరాగ్యభావాలు కలగడానికి కారణమైంది.[31]

విశ్వనాథ సత్యనారాయణ వారి సాహిత్య నేపథ్యానికి సంబంధించి అందులోనూ నాటక ప్రక్రియకు సంబంధించిన విషయాలు ప్రస్తావించవలసి వచ్చినప్పుడు వారు అంతకు ముందే రాసిన నాటకాలు ఏంటో తెలుసుకోవాలి. విశ్వనాథ సత్యనారాయణ 1918లోనే ధన్య కైలాసం, 1920లో సౌప్తిక ప్రళయం, అవతార పరివర్తనం, 1924లో నర్తనశాల, 1924-25లో అనార్కలి, 1933-34లో 'వేనరాజు' 1935లో తల్లికాని పిల్ల, 1937లో త్రిశూలం రచించడం జరిగింది.[32]

1938 సంవత్సరంలో బెజవాడలోని ఉన్న సి.వి.ఆర్ కళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా నియమించబడి 1957 వరకు సమర్ధవంతంగా నిర్వహించారు. నవ్యసాహిత్య పరిషత్తుకు 1940లో అధ్యక్షత వహించారు. విశ్వనాథ సత్యనారాయణ గారికి గుడివాడలో 1942లో గజారోహణోత్సవం జరిగింది. రామాయణమే కాకుండా ఖండకావ్యాలు, నవలలు, రేడియో నాటికలు, మరెన్నో విమర్శలు పుంఖాను పుంఖాలుగా రాసి సాహిత్య ప్రక్రియలన్నింటిలోనూ స్రష్టలయ్యారు. గుడివాడలోనూ, కరీంనగర్‌లోను 1956లో షష్టిపూర్తి మహోత్సవం మహాద్భుతంగా జరిగింది. 1957లో ఉద్యోగ విరమణ చేయడం జరిగింది. ఆ తరువాత కొన్ని ఏళ్ళకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ఉపాధ్యక్షుడుగా మే 1985లో నియమించబడ్డారు. అంతేకాక అప్పటి ప్రభుత్వం చేత శాసనమండలి సభ్యులుగా నియమించబడ్డారు. దానికి రాజీనామ చేసి కరీంనగర్ కళాశాలకు అధ్యక్షులయ్యారు. రామాయణ కల్పవృక్షాన్ని 1962లో పూర్తి చేసి 'కవి సమ్రాట్' బిరుదుకు సార్ధకత దక్కించుకున్నారు. ఆ మధ్యకాలంలో 1946-48లలో 'కావ్య వేద హరిశ్చంద్రములు', 1951లో 'అంతా నాటకమే', ఆకాశరాజు, 1957లో ప్రవాహం, 1963లో భస్మాసుర చయనం, లోపల-బయట, 1964లో సత్యాగ్రహం అనే నాటకాలు రచించారు.[33]

---

[31] (వేయి పగడలు విశ్లేషణాత్మక విమర్శ-పుట:07)

[32] *విజ్ఞాన సర్వస్వము (రెండవ సంపుటము, తెలుగు సంస్కృతి-2)* పుట 759

[33] 20వ శతాబ్ది తెలుగు వెలుగులు: పుట 896

నవలా సాహిత్యం

వేయిపడగలు, స్వర్గానికి నిచ్చెనలు, చెలియలికట్ట, ఏకవీర, తెఱచిరాజు, మాబాబు, జేబుదొంగలు, వీరవల్లడు, వల్లభమంత్రి, విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు, పులుల సత్యాగ్రహము, దేవతల యుద్ధము, పునర్జన్మ, పరీక్ష, నందిగ్రామరాజ్యం, బాణావతి, అంతరాత్మ, గంగూలీ ప్రేమకథ, ఆఱునదులు, చందవోలు రాణి, ప్రళయనాధుడు, హాహాహూహూ, మ్రోయు తుమ్మెద, సముద్రపు దిబ్బ, దమయంతీ స్వయంవరము, నీల పెండ్లి, శార్వరి నుండి శార్వరి దాక, కుణాలుని శాపము, ధర్మచక్రము, కడిమిచెట్టు, వీరపూజ, స్నేహఫలము, బద్దన్న సేనాని, దిండు క్రింది పోకచెక్క, చిట్లీచిట్లని గాజులు, సౌదామిని, లలితాపట్టణపు రాణి, దంతపు దువ్వెన, దూతమేఘము, కవలలు, యశోవతి, పాతిపెట్టిన నాణెములు, సంజీవకరణి, మిహిరకులుడు, భ్రమరవాసిని, పురాణవైర గ్రంథమాల (పన్నెండు నవలలు), భగవంతునిమీది పగ, నాస్తిక ధూమము, ధూమమరేఖ, నందో రాజా భవిష్యతి, చంద్రగుప్తుని స్వప్నము, అశ్వమేధము, అమృతవల్లి, పులిమ్రుగ్గు, నాగసేనుడు, హెలీనా, వేదవతి, నివేదిత, నేపాళరాజ చరిత్ర (ఆరు నవలలు – దిన్డు క్రిన్ది పోకఛెక్క, ఛిట్లి ఛిట్లని గాజులు, సౌదామిని, లలిత పట్ట్ణపు రాణి, దూతమేఘము), కాశ్మీర రాజ చరిత్ర (ఆరు నవలలు – కవలలు, యశొవతి, పాతిపెట్టిన నాణీములు, సన్జీవ కరణి, మిహిర కులుడు, భ్రమర వాసిని)

పద్య కావ్యాలు

శ్రీమద్రామాయణ కల్పవృక్షము (6 కాండములు), ఆంధ్రప్రశస్తి, ఆంధ్రపౌరుషము, విశ్వనాథ మధ్యాక్కఱలు, ఋతు సంహారము, శ్రీకుమారాభ్యుదయము, గిరికుమారుని ప్రేమగీతాలు, గోపాలోదాహరణము, గోపికాగీతలు, భ్రమరగీతలు, ఝాన్సీరాణి, ప్రద్యుమ్నోదయము, రురుచరిత్రము, మాస్వామి, వరలక్ష్మీ త్రిశతి, దేవీ త్రిశతి (సంస్కృతం), విశ్వనాథ పంచశతి, వేణీభంగము, శశిదూతము, శృంగారవీధి, శ్రీకృష్ణ సంగీతము, నా రాముడు, శివార్పణము, ధర్మపత్ని, భ్రష్టయోగి (ఖండకావ్యము), కేదారగౌళ (ఖండకావ్యము), గోలోకవాసి, దమయంతీస్వయంవరం

నాటకములు

అమృతశర్మిష్ఠమ్ (సంస్కృతం), గుప్తపాశుపతమ్ (సంస్కృతం), గుప్తపాశుపతము, అంతా నాటకమే, అనార్కలీ, కావ్యవేద హరిశ్చంద్ర, తల్లిలేని పిల్ల, త్రిశూలము, నర్తనశాల, ప్రవాహం, లోపల – బయట, వేనరాజు, అశోకవనము, శివాజి – రోషనార, ధన్యకైలాసము, నాటికల సంపుటి (16 నాటికలు)

విమర్శలు

అల్లసానివారి అల్లిక జిగిబిగి, ఒకనాడు నాచన సోమన్న, కావ్య పరీమళము, కావ్యానందము, నన్నయగారి ప్రసన్న కథాకలితార్థయుక్తి, విశ్వనాథ సాహిత్యోపన్యాసములు, శాకుంతలము యొక్క అభిజ్ఞానత, సాహిత్య సురభి, నీతిగీత, సీతాయాశ్చరితమ్ మహత్, కల్పవృక్ష రహస్యములు, సాహితీ మీమాంస.

ఇతరములు

కిన్నెరసాని పాటలు, కోకిలమ్మ పెండ్లి, పాము పాట, చిన్న కథలు, ఆత్మ కథ, విశ్వనాథ శారద (3 భాగాలు), యతిగీతము, What is Ramayana to me

విశ్వనాథ వారు హృద్రోగ్యంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో దైవధ్యానంతో అక్టోబర్ 18,1976న స్వర్గస్తులయ్యారు. కవి నిష్క్రమించడంలో సాహిత్య లోకంలో పెనుచీకట్లు అలముకున్నాయి. పండిత లోకాన్ని దుఃఖం కమ్మేసింది. ఆ మహాకవి కటిక దారిద్ర్యాన్నే కాక అష్టైశ్వర్యాలను చవిచూసి చివరకు శివైఖ్యం పొందారు.

ఈయన తన విమర్శలో భారతీయ, పాశ్చాత్య సౌందర్య సిద్ధాంతాలను సమన్వయిస్తూ చేసిన విమర్శ తీరుతెన్నులను రాబోయే అధ్యాయంలో విశ్లేషిస్తాను.

### 3.3.5. రామిరెడ్డి దువ్వూరి (1897-1947)

దువ్వూరి రామిరెడ్డి 1897 లో నెల్లూరు జిల్లాలో జన్మించారు. ఇరవై యేళ్ళ వయస్సులోనే (1917) స్వకుటుంబ వృత్తమైన *'నలదొరమ్మ అగ్ని ప్రవేశమునకు'* చకిత

స్వాంతులై కావ్యం అల్లారు. 1918 లో రాసిన కావ్యం *'వన కుమారి'* కి విజయనగర సంస్థానం వారు నిర్వహించిన కావ్య పరీక్షలో ఉత్తీర్ణత పొందింది. దీనిలో ఎనిమిది మంజురులు కలవు. సంభాషణ ధోరణిలో ప్రకృతి వర్ణనలతో విలసిల్లే ఆ కావ్యం *'నానా దేశస్థ రసిక హృదయాలను'* అలరించింది. ఈ కవి కావ్యాలన్నింటిలో ప్రశస్తి వహించినది *''కృషీవలుడు''* (1919) అని చెప్పవచ్చు. అంతేగాక 1920 లో రచించిన జలదాంగన, యవక స్వప్నము, *కడపటి వీడుకోలు* (1934) అనే ఖండ కావ్యాలు పరిణతి కవి హృదయాన్ని అందిస్తున్నవి. ఉన్నత భావుకత్వాన్ని మనస్తత్వ పరిశీలనా శక్తిని, స్వాతంత్ర్య కాంక్షను వెలిబుచ్చుతున్నాయి. పారశీక భాషపై పట్టు సాధించి 1934 లో *'పానశాల'* అనే ప్రసిద్ధ కావ్యం రాసి ఆంధ్ర రసిక జనుల మెప్పుపొందారు. దేశ స్వాతంత్ర్యం, ప్రేమ, ప్రకృతి మొదలైన వస్తు వైవిధ్యంతో కూడిన వీరి ఖండ కావ్యాలు 1936లో ఒక సంపుటంగా వెలువడ్డాయి. వీరిని బెజవాడలో *'ఆంధ్ర మహాసభ'* వారు *'కవి కోకిల'* గౌరవంతో సన్మానించారు.

కొంత కాలం తర్వాత దువ్వూరి రామిరెడ్డి *'కడపటి వీడుకోలు'* రచించారు. అంతేగాక *'కవి సంశయావస్థ'* అని కొన్ని పద్యాలుతో పాటు *'మీరబాయి'* (కుంభా రాణా) నాటకం; *'మాధవ విజయం'* అనే నాటకాన్ని రాశారు. చివరి రోజుల్లో *'పలికేశము', 'గులాబి తోట'* లను రాశారు. 1923లో *'కళ'* అనే పత్రికలో ప్రకటితములైన వీరి వ్యాసాలు 1935 నాటికి *'సారస్వత వ్యాసములు'* అనే గ్రంథ రూపాన్ని దాల్చాయి. సినిమా సంస్థలతో సంబంధం ఉండేది. వీరికి శాస్త్ర విజ్ఞానంపై మక్కువతో పాటు ప్రజ్ఞ కూడా ఉండేది. వీరు 1947 లో కన్నుమూశారు.[34]

సౌందర్యం గురించి విచారించిన కళాతాత్త్వికులలో ప్రముఖులు దువ్వూరి రామిరెడ్డి .వీరు సౌందర్యానికి పర్యాయ పదంగా 'రామణీయకం' అనే పదాన్ని ఉపయోగించారు. ఆయన సౌందర్యాన్ని నిర్వచించటం కష్టమంటూ సౌందర్యాన్ని సమిష్టి దృష్టితోనే చూడాలంటూ *''రామణీయక మనునది యేక వస్తువు గాదు. అది సమిష్టి భావము రోజా పువ్వు రమ్యముగ నున్నదనుటలో దాని యాకారము, రంగు, పరిమళము మున్నగున్నవి చేరియున్నవి.*

[34] 20వ శతాబ్ది తెలుగు వెలుగులు పుట: 570, 571

*సౌందర్యమును గ్రహింపవలయునన్న సింహావ లోకనము చేయవలయును అనగా సమిష్టి దృష్టితో జూడవలయును''*[35] మాములు ప్రేక్షకునిలో ఇటువంటి దృష్టి ఉండదు. కనుక, అతడు తన దృష్టికి అతీతంగా ఉన్న వస్తువును వదిలేస్తాడు. వాటిని సైతం కళాకారుడు తన కళలో ప్రతిఫలించి ప్రేక్షకునికి సౌందర్య దర్శనం చేయిస్తానంటారు దువ్వూరి రామిరెడ్డి . ఆయన కళా జగత్తులో జరిగే సౌందర్య సృష్టి గురించి విచారించారు.

దువ్వూరి రామిరెడ్డి సౌందర్యం కవి ప్రతిభ చేత సృష్టించబడుతుందని చెప్తూ బాహ్య ప్రపంచంతో సౌందర్యం వస్తుగతంగా మనోగతంగా కనిపించినా కళలలో ఆ రెండింటిని సమ్మేళన పరిచి ఒక సమిష్టి మోహనత్వాన్ని కళాకారుడు సంపాదిస్తాడు అంటూ, దానినే సౌందర్యంగా పేర్కొన్నారు. దువ్వూరి రామిరెడ్డి సౌందర్యం మనోగుణంలోను, వస్తుగతంలోను రెండింటి లోను ఉదంటూ వస్తుగతంగా ఉన్న సౌందర్యాన్ని తెలుసుకోవాలంటే జ్ఞానం అవసరమని చెప్పారు. చివరికి సౌందర్యం ఉభయగతం అని చెప్పారు. కాని కళా జగత్తులో మాత్రమే సౌందర్య విలసనం సంపూర్ణంగా జరిగి ఆనంద సృష్టి జరుగుతుందని చెప్పారు. ఈయన సౌందర్యం అనుభవింపబడినప్పుడే దానికి అస్తిత్వం ఉంటుందనీ, కనుక సౌందర్యానికి ప్రమాణము దానిని తెలుసుకో గలిగే మానవుని బుద్ధి నిర్ణయమే అని పేర్కొన్నారు.

ఈయన తన విమర్శలో భారతీయ, పాశ్చాత్య సౌందర్య సిద్ధాంతాలను సమన్వయిస్తూ చేసిన విమర్శ తీరుతెన్నులను రాబోయే అధ్యాయంలో విశ్లేషిస్తాను.

### 3.3.6. శ్రీనివాసరావు శ్రీరంగం (1910-1983)

ఆధునిక యుగంలో తెలుగు సాహిత్య ప్రపంచంలో 'శ్రీశ్రీ' అనే సంక్షిప్త నామంతో విస్తృతమైన ఖ్యాతి పొందిన యుగకవి శ్రీనివాసరావు, శ్రీరంగం . ఇరవయ్యవ శతాబ్దపు తెలుగు సాహిత్యాన్ని శాసించిన మహాకవి శ్రీశ్రీ. శ్రీరంగం శ్రీనివాసరావు. విప్లవ కవిగా, సాంప్రదాయ, ఛందోబద్ధ కవిత్వాన్ని ధిక్కరించినవాడిగా, అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షుడిగా, విప్లవ రచయితల సంఘం స్థాపక అధ్యక్షుడిగా, సినిమా పాటల రచయితగా ఆయన ప్రసిద్ధులు. ఆయన సృజించిన కవితా! ఓ కవితా! అనే కవిత గురించి శ్రీశ్రీ .జీవిత కథకుడు, ప్రసిద్ధ

[35] కవి కోకిల గ్రంథావళి: పుట:04

రచయిత, భాషావేత్త, బూదరాజు రాధాకృష్ణ ఇలా రాసారు: *"కనీసం వేయి సంవత్సరాల చరిత్ర ఉన్న తెలుగు సాహిత్యంలో కవితను ఇలా నిర్వచించి,ఇంత కవితాత్మకంగా వర్ణించి, ఇంత అద్భుత సృష్టి చేసిన మరో కవి లేనే లేడు. ఇదే అతణ్ణి సాహితీ శిఖరాగ్రాన నిలిపింది."*[36] వీరు విశాఖపట్నంలోని వెంకట రమణయ్య, అప్పలకొండ దంపతులకు 1910 జనవరి 2న జన్మించారు. ( శ్రీశ్రీ తన అనంతం పుస్తకంలో పుట్టిన రోజు గురించి వివరణ ఇచ్చారు. తను ఏప్రిల్లో పుట్టానని, తండ్రి పాఠశాలలో అవసరం నిమిత్తం 2-1-1910 అని రాయించారని పేర్కొన్నారు)

శ్రీరంగం సూర్యనారాయణకు దత్తుడగుట వలన ఈయన ఇంటిపేరు శ్రీరంగంగా మారింది. వీరి పుట్టిన రెండేళ్ళ లోపే తల్లి మరణించటం వల్ల వీరి తండ్రి గారే వీరిని తల్లి లేని లోటును తెలియకుండా పెంచి పెద్దచేశారు. వీరి చదువు మొత్తం విశాఖపట్నంలోనే కొనసాగింది. SSLC పాసయ్యారు. విశాఖపట్నంలోని ఎ.వి.ఎన్. కాలేజీలోను, మద్రాసు క్రిస్టియన్ కాలేజీలోను విద్యాభ్యాసం చేశారు. 1925 లో వెంకట రమణమ్మతో పెళ్ళి జరిగింది. 1931 లో మద్రాసు విశ్వ విద్యాలయం లో బియ్యే (జంతుశాస్త్రము) పూర్తి చేసాడు.

1935 లో విశాఖ లోని మిసెస్ ఎ వి ఎస్ కాలేజీ లో డిమాన్స్ట్రేటరు గా చేరాడు. 1938 లో మద్రాసు ఆంధ్ర ప్రభలో సబ్ ఎడిటరు గా చేరాడు. ఆ తరువాత ఆకాశవాణి, ఢిల్లీ లోను, మిలిటరీ లోను, నిజాము నవాబు వద్ద, ఆంధ్ర వాణి పత్రికలోను వివిధ ఉద్యోగాలు చేసాడు. ఆ తరువాత ఉద్యోగ్యాల రిత్యా వివిధ ప్రాంతాలలో ఎన్నో ఉద్యోగాలు చేసి చివరకు సినిమా రచయితగా చెన్నైలో 1950లో స్థిరపడ్డారు. వీరు *'నీరా ఔర్ నందా'* అనే హిందీ చిత్రాన్ని *'ఆహుతి'* పేరుతో తెలుగులో డబ్ చేశారు. వీరు మాటలు - పాటలు కూర్చిన మొదటి సినిమా కూడా ఇదే. ఆ తరువాత వీరు ఎన్నో తెలుగు సినిమాలకు మాటలు - పాటలు రచయితగా పనిచేసి ఆ రంగంలో గణనీయతను పొందారు. కానీ వీరికి తెలుగు నాట అజరామర ఖ్యాతిని కల్పించింది వీరి సాహిత్య కృషి అని చెప్పవచ్చు. భావ కవిగా కవిత్వాన్ని ప్రారంభించిన వీరు ఈ శతాబ్దపు ముప్పదుల ముగిసే నాటికి అభ్యుదయ కవిగా

[36] బూదరాజు రాధాకృష్ణ రచించిన శ్రీశ్రీ జీవిత చరిత్ర పుస్తకం

పరిణమించారు. తన కాలపు యుగవాణిని బలీయంగా వినిపించిన కవులలో అత్యంత శక్తివంతమైన గొంతు వీరిది.

శ్రీశ్రీ ఈ శతాబ్దపు కవితా ధోరణికి, కవితా శక్తికి ప్రతీకగా నిలిచారు. జీవితంలో ఎన్ని ఒడిదుడుకులకు గురైనా, చివరి వరకు పీడిత వర్గపు కవిగా తనను తాను గుర్తించుకుని వర్గ రహిత సమాజ స్థాపనే తన ఆదర్శంగా కృషి చేశారు శ్రీశ్రీ . తెలుగు సాహిత్యంలో కొన్ని క్రొత్త ప్రక్రియలు ప్రవేశ పెట్టారు. శ్రీశ్రీ అభ్యుదయ కవితా పథంతో పాటుగా అధివాస్తవిక కవిత్వంలో కూడా కొన్ని ప్రయోగాలు చేశారు. వీరు 'ప్రాస క్రీడలు' పేరుతో తెలుగులో కార్టూన్ కవిత్వాన్ని ప్రవేశపెట్టారు. *'లిమ రిక్కులు'* పేరుతో కేవలం హాస్య ధోరణి కవితలు వీరి రచనలో ఉన్నాయి. తెలుగు మొట్ట మొదటి సారిగా *'చైతన్య స్రవంతి'* పద్ధతిని కథలలో ప్రవేశపెట్టింది వీరే. 1950 లో వీరు రచించిన గీతాల సంపుటి *'మహా ప్రస్థానం'* మొట్టమొదటి సారిగా అచ్చయింది. వీరికి అనంత ఖ్యాతిని తెచ్చిన పెట్టిన గ్రంథం ఇది. (1933 నుండి 1940 వరకు ఆయన రాసిన మహాప్రస్థానం, జగన్నాథుని రథచక్రాలు, గర్జించు రష్యా వంటి గొప్ప కవితలను సంకలనం చేసి మహాప్రస్థానం అనే పుస్తకంగా ప్రచురించాడు. తెలుగు సాహిత్యపు దశనూ, దిశనూ మార్చిన పుస్తకం అది.)

1985లోపే దాదాపు ఇరవై ముద్రణలు పొందింది ఈ గ్రంథం. శ్రీశ్రీ చాలా చిన్న వయసులోనే తన రచనా వ్యాసంగాన్ని మొదలు పెట్టాడు. తన 18 వ ఏట 1928 లో *''ప్రభవ''* అనే కావ్య సంపుటిని ప్రచురించాడు. ఈ రచనను సాంప్రదాయ పద్ధతిలోనే రాసాడు. తరువాతి కాలంలో సాంప్రదాయికమైన గ్రాంధిక శైలి, ఛందస్సు వంటి వాటిని పక్కన పెట్టి వాడుక భాషలో మాత్రా ఛందస్సులో కవిత్వం రాయడం – ఇది గురజాడ అడుగుజాడ అని ఆయన అన్నారు – మొదలు పెట్టి గొప్ప కావ్యాలను రచించాడు.

1950 లో మహాప్రస్థానం కావ్యం మొదటిసారిగా ప్రచురితమైంది. మహాప్రస్థానం, జగన్నాథుని రథచక్రాలు, బాటసారి, భిక్షువర్షీయసి మొదలైన కవితల సంపుటి అది. ఆధునిక తెలుగు సాహిత్యం లో ఈ కావ్యం అత్యున్నత స్థానంలో నిలిచి శ్రీశ్రీ ని మహాకవి చేసింది. తరువాత మరోప్రస్థానం, ఖడ్గ సృష్టి అనే కవితా సంకలనాలను, చరమరాత్రి అనే కథల

సంపుటిని, రేడియో నాటికలు రచించాడు. మహాప్రస్థానం వంటి గీతాలన్నీ మార్క్సిజం దృక్పథం తో రాసినవే అయినా అవి రాసేనాటికి మార్క్సిజం అనేది ఒకటుందని ఆయనకు తెలియదు. 1981లో లండన్ లో ప్రచురితమైన మహాప్రస్థానం (శ్రీశ్రీ స్వదస్తూరితో దీనిని ముద్రించారు, దానితో పాటు శ్రీశ్రీ పాడిన ఈ కావ్య గీతాల క్యాసెట్టును కూడా వెలువరించారు) కు ముందుమాటలో ఆయన ఈ విషయం స్వయంగా రాసాడు. ఈ వాస్తవాలన్నింటికీ నేను స్పందించినా, ఇలాంటి రచనలను 'సామాజిక వాస్తవికత' అంటారనీ, దీని వెనుక దన్నుగా మార్క్సిజం అనే దార్శనికత ఒకటి ఉందనీ అప్పటికి నాకు తెలియదు. ఇప్పుడొక్కసారి వెనక్కు తిరిగి చూసుకుంటే, మహాప్రస్థాన గీతాల లోని మార్క్సిస్టు స్ఫూర్తి, సామాజిక స్పృహా యాదృచ్ఛికాలు కావని స్పష్టంగా తెలుస్తోంది.

తెలుగు వారిని ఉర్రూతలూగించిన ఎన్నో గొప్ప సినిమా పాటలను ఆయన రచించాడు. అల్లూరి సీతా రామ రాజు సినిమాకు ఆయన రాసిన *''తెలుగు వీర లేవరా..''* అనేది శ్రీశ్రీ రాసిన ఆణిముత్యాల్లో ఒకటి. రెండవ భార్య సరోజ తో కలిసి సినిమాలకు మాటలు రాసాడు.

ప్రాసకూ, శ్లేషకు శ్రీశ్రీ పెట్టింది పేరు. అల్పాక్షరాల్లో అనల్పార్థాన్ని సృష్టించడంలో శ్రీశ్రీ మేటి. *''వ్యక్తికి బహువచనం శక్తి''* అనేది ఆయన సృజించిన మహత్తర వాక్యమే! శబ్ద ప్రయోగంలో నవ్యతను చూపించాడు. ప్రగతి వారపత్రిక లో ప్రశ్నలు, జవాబులు (ప్రజ) అనే శీర్షిక ను నిర్వహించాడు. పాఠకుల ప్రశ్నలకు సమాధానాలిచ్చే శీర్షిక అది. చతురోక్తులతో, శ్లేష లతో కూడిన ఆ శీర్షిక బహుళ ప్రాచుర్యం పొందింది.

వీరి *'ఖడ్గ సృష్టి*కి సోవియట్ లాండ్ నెహ్రూ అవార్డు లభించింది. శ్రీశ్రీ గారికి ఎన్నో సాహిత్య సంఘాలతో, సాహిత్య ఉద్యమాలతో సజీవ సంబంధం ఉంది. 1926లో వచ్చిన కవితా సమితిలోను, ఆ తరువాత వచ్చిన నవ్య సాహిత్య పరిషత్తులోను వీరు సాధారణ సభ్యులు. 1943 తరువాత వీరు అభ్యుదయ రచయితల సంఘానికి అధ్యక్షులు గా ఎన్నుకోబడ్డారు. వివిధ దేశాల్లో ఎన్నోమార్లు పర్యటించారు. ఎన్నో పురస్కారాలు పొందాడు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు, మొదటి *''రాజా లక్ష్మీ ఫౌండేషను''* అవార్డు వీటిలో కొన్ని. అభ్యుదయ రచయితల సంఘానికి (అరసం) అధ్యక్షుడిగా పని చేసాడు. 1970 లో ఆయన

షష్ఠి పూర్తి ఉత్సవం విశాఖపట్నం లో జరిగింది. ఆ సందర్భంగానే ఆయన అధ్యక్షుడు గా విప్లవ రచయితల సంఘం (విరసం) ఏర్పడింది.

పిల్లలు లేని కారణం చేత 1949 లో ఒక బాలికను దత్తత తీసుకున్నాడు. 1956 లో సరోజను రెండవ వివాహం చేసుకున్నాడు. రెండవ భార్య ద్వారా ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు కలి. అమాయకత్వాన్ని, ప్రగాఢత కలగలసిన మనస్తత్వం శ్రీశ్రీ గారిది. శ్రీశ్రీ వ్యక్తిగతంగా హాస్య ప్రియులని, వీరి హాస్యోక్తులతో పరిచితి కలవారు అంటారు. వీరిలో పసివాని మనస్తత్వం వేద్యమయ్యేదని వారి కథనం. ఎల్లప్పుడు 'కష్టజీవి'కి అండగా నిలిచిన వీరు కొంతకాలం క్యాన్సరు వ్యాధి బాధకు లోనై 1983 జూన్ 15న పరమపరించారు. 1983లో అతడు భౌతికంగా మరణించినా మరికొన్ని సహస్రాబ్దాల పాటు అతడి కవిత్వం బతికే ఉంటుంది. తన జీవిత కాలంలోనే చరిత్ర ప్రసిద్ధుడైన శ్రీశ్రీ అనంతర కాలంలోనూ అలాగే జీవిస్తాడు. కవిత్వమున్నంత కాలం, కవిత్వ రసాస్వాదన ఉన్నంత కాలం కవితానుభూతి ఉన్నంత కాలం అతడు ఉంటాడు. శ్రీశ్రీ జీవిత చరిత్ర పుస్తకాన్ని ముగిస్తూ రచయిత రాసిన వాక్యాలివి. విశాఖపట్నం లోని బీచ్ రోడ్డులో ఆయన నిలువెత్తు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

### 3.3.6.1. శ్రీశ్రీ రచనలు

శ్రీశ్రీ తన రచనా వ్యాసంగాన్ని తన ఏడవ యేటనే ప్రారంభించారు. తన మొదటి గేయాల పుస్తకం ఎనిమిదవ యేట ప్రచురింపబడింది. అందుబాటులో ఏదుంటే అది – కాగితం గాని, తన సిగరెట్ ప్యాకెట్ వెనుక భాగంలో గాని వ్రాసి పారేశేవారంట. శ్రీశ్రీ రచనల జాబితా ఇక్కడ ఇవ్వబడింది

ప్రభవ (1928), వరం వరం (1946), సంపంగి తోట (1947), మహాప్రస్థానం (1950), మహాప్రస్థానం – శ్రీ శ్రీ స్వంత దస్తూరితో, మరియు స్వంత గొంతు ఆడియోతో – లండన్ నుండి – (1981), అమ్మ (1952 – 1967), మేమే (1954), మరో ప్రపంచం (1954), రేడియో నాటికలు(1956), త్రీ చీర్స్ ఫర్ మాన్ (1956), చరమ రాత్రి (1957), మానవుడి పాట్లు (1958), సౌదామిని (పురిపండా గేయాలకు ఆంగ్లానువాదం) (1958), గురజాడ (1959), మూడు యాభైలు (1964), 1 + 1 = 1 (రేడియో నాటికలు) (1964–

1987), ఖడ్గసృష్టి (1966–1984), వ్యూలు, రివ్యూలు (1969), శ్రీశ్రీ సాహిత్యం (1970), Sri Sri Miscellany – English volumes (1970), లెనిన్ (1971), రెక్క విప్పిన రివల్యూషన్ (1971), వ్యాస క్రీడలు (1980), మరో మూడు యాభైలు (1974), చీనా యానం (1980), మరోప్రస్థానం (1980), సిప్రాలి (1981), పాడవోయి భారతీయుడా (సినిమా పాటలు) (1983), శ్రీ శ్రీ వ్యాసాలు (1986), New Frontiers (1986), అనంతం (ఆత్మకథ) (1986) ( శ్రీశ్రీ తన ఆత్మ కథను అనంతం అనే పేరుతో వ్రాశాడు. దీనిలో శ్రీశ్రీ తన జీవితంలోని ముఖ్య ఘట్టాలు, ఒడిదుడుకులు వివరించాడు. అతడి సమకాలీన కవులు, రచయితలు, ప్రసిద్ధ వ్యక్తులు మనకు ఈ పుస్తకంలో పరిచయం చేశాడు.), ప్రజ (ప్రశ్నలు జవాబులు) (1990), తెలుగువీర లేవరా (సినిమా పాటలు), విశాలాంధ్రలో ప్రజారాజ్యం 1999, ఉక్కు పిడికిలి, అగ్నిజ్వాల 2001, ఖబర్దార్ సంఘ శత్రువు లారా 2001.

ఈయన తన విమర్శలో భారతీయ, పాశ్చాత్య సౌందర్య సిద్ధాంతాలను సమన్వయిస్తూ చేసిన విమర్శ తీరుతెన్నులను రాబోయే అధ్యాయంలో విశ్లేషిస్తాను.

### 3.3.7. వీరరాఘవాచార్యులు కొండూరు (1912-1995)

కొండూరు వీరరాఘవాచార్యులు 1912 సెప్టెంబర్ 26న గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని కోపల్లె గ్రామంలో జన్మించారు. వీరి తల్లిదండ్రులు నాగలించాచార్యులు, పార్వతమ్మ దంపతులు. వీరి తల్లి తిరువళ్లూరు వీర రాఘవస్వామి భక్తురాలైనందున వీరికి ఆ పేరు పెట్టారు. వీరు సంప్రదాయక సంచార్షేయ విశ్వబ్రహ్మణ వంశానికి చెందిన వారు. వీరు తెనాలి సంస్కృత కళాశాలలో ఉన్నత విద్యాభ్యాసం చేసి *'ఉభయ భాషా ప్రవీణ'* పట్టా పొందారు. 1938 నుంచి సంస్కృతాంధ్ర అధ్యాపకులుగా పనిచేశారు. ఉన్నవ లక్ష్మీనారాయణపరిచయంతో గుంటూరులో వారి శారదానికేతనం లో ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన వీరు తరువాత కావలి, బుచ్చిరెడ్డి పాలెంలో గుంటూరు జిల్లా బోర్డు స్కూళ్లలోను, తరువాత సత్తెనపల్లిలో శరభయ్య హైస్కూల్ లోను పనిచేసి, ఆ తరువాత తెనాలి వి.ఎస్.ఆర్. & ఎస్.వి.ఆర్. కళాశాలలో ఆంధ్రాధ్యాపకునిగా పనిచేశారు.[37]

[37] *విజ్ఞాన సర్వస్వము (రెండవ సంపుటము, తెలుగు సంస్కృతి–2)* పుట 455

### 3.3.7.1. కొండూరి వీరరాఘవాచార్యులు రచనలు

కొండూరు వీరరాఘవాచార్యులు తమ 83 యేళ్ల జీవిత కాలంలో ఐదున్నర దశాబ్దాల పాటు శిల్ప, సాహిత్య, తత్త్వ వాఙ్మయ సేవకు అంకితం చేసి ముప్పై ఐదుకు పైగా పద్య, గద్య విమర్శ సమీక్షా గ్రంథాలను వ్రాశారు. వీరు విద్యార్థి దశలోనే కాశీ, అయోధ్యల నుంచి వెలువడే సంస్కృత పత్రికలలో శ్లోక, వ్యాస రచలను ప్రచురించారు. వీరు వడ్డెపాటి నిరంజన శాస్త్రి సాహచర్యంతో ప్రభావితులై వారి జీవితాన్ని *'నిరంజన విజయం'* అనే పేరుతో రాసి ప్రచురించారు. ఇదే వీరి తొలి రచన. తరువాత ఆసియా ఖండాన్నే కాక యావత్ ప్రపంచాన్ని తమ త్యాగం, ప్రేమ, అహింస సందేశాలతో ప్రభావితం చేసిన బుద్ధుడు, క్రీస్తు, మహమ్మద్, మహాత్మా గాంధీ జీవిత చరిత్రలతో *'ఆసియా జ్యోతులు'* అనే పుస్తకం రాశారు. మైసూరు రాష్ట్రంలోని శిల్పకళా క్షేత్రాలైన శ్రవణ బెళ గొలలోని గోమటేశ్వరాలయం, బేలూరులోని చెన్నకేశవాలయం మొదలగు క్షేత్రాలను సందర్శించి సవిమర్శకంగా వాటి శిల్ప కళా రహస్యాలను విపులీకరిస్తూ ఆయా పత్రికలలో అనేక వ్యాసాలు పండిత, పామర జనరంజకంగా రాశారు. ఈ వ్యాసాలనే తరువాత *'శిల్ప కళా క్షేత్రాలు'* పేరుతో రెండు భాగాలుగా ప్రచురించారు. వీరు అప్పుడప్పుడు *'భారతి'* పత్రికలో రాసిన పద్య కవితలను 'తోరణము' అనే ఖండకావ్య సంపుటిగా ప్రచురించారు. వీరు ఉద్యోగ జీవతం గడుపుతూనే 'ఆత్మ దర్శనము', *'శిల్ప దర్శనము'* అనే లోతైన గ్రంథాలు రాశారు. అమరావతి అనే పద్య కావ్యం *'మూడు కావ్యాలు'* పేరుతో భారత, భాగవత, రామాయాణాల సమీక్షను రాశారు. వీరు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ప్రధాన శిష్యులైన సిద్దప్ప జీవితాన్ని, ఆయన గురుభక్తిని వర్ణిస్తూ, *'సిద్దప్ప చరిత్ర'*ను వచనంలో రాశారు. ఆ తరువాత శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి జీవితాన్ని సమీక్షిస్తూ 'మన గురుదేవుడు' అనే గ్రంథాన్ని రాశారు.

వీరి పాండితీ ప్రతిభను గుర్తించిన అయోధ్య సంస్కృత పరిషత్ 1938లో వీరికి 'విద్యాధురీణ' అనే గౌరవం ఇచ్చింది. వీరు మైసూరు మహారాజా జయచామరాజ ఒడయార్ గురువులైన సిద్ధలింగేశ్వర స్వామి అధ్యక్షతన మైసూరులో జరిగిన ఆధ్యాత్మిక మహాసభలో ఆత్మతత్త్వం గురించి ఉపన్యసించారు. ముప్పై సంవత్సరములు కూడా నిండని వీరు ఆత్మతత్త్వం గురించి చేసిన మహోపన్యాసాలకు అచ్చెరువొందని మహా పండితులు వీరిని *'గృహస్థ సన్యాసి'*

అనే ప్రశంసించారు. వీరు తమ *'ఆత్మ దర్శనము', 'శిల్ప దర్శనము'* అనే లోతైన గ్రంథ రచనల ద్వారా *'దర్శనాచార్య'* అనే గౌరవం పొందారు. వీరు 19-1-1995న పరమపదించారు.[38]

ఈయన తన విమర్శలో భారతీయ, పాశ్చాత్య సౌందర్య సిద్ధాంతాలను సమన్వయిస్తూ చేసిన విమర్శ తీరుతెన్నులను రాబోయే అధ్యాయంలో విశ్లేషిస్తాను.

### 3.3.8. సంజీవ్‌దేవ్ (1914-1999)

మానవునిలోని సృజనాత్మకత శక్తిని పాఠశాలలు, కళాశాలలు కంటే అతని లోని అనువంశీయత, ధృడతద దీక్ష, నిరంతర కృషి, తపనలే బహిర్గతం చేసి అతడిని పరిపూర్ణ వ్యక్తిగా మనిచేందుకు దోహదకారులవుతాయని నిరూపించిన వారు సంజీవ్‌దేవ్ . సృజనాత్మక ప్రతిభ, విశ్లేషణ శక్తి, వివేక ప్రజ్ఞ కలిగిన చైతన్య మూర్తి. జీవితంలో ఆనందాన్ని పండించుకున్న రసమయిజీవి సంజీవ్‌దేవ్ .శ్రీ సూర్యదేవర సంజీవ్‌దేవ్ 1914 వ సంవత్సరం జూలై 3వ తేదిన గుంటూరు జిల్లా లోని దుగ్గిరాల మండలం తుమ్మపూడి గ్రామంలో వెంకాయమ్మ, రామ దేవరాయలు దంపతులకు జమీందారీ కుటుంబంలో జన్మించారు.

సంజీవ్‌దేవ్ చిన్ననాడే తల్లి మరణించుటతో కొంతకాలం కృష్ణాజిల్లా నందిగామ సమీపంలోని కోనాయపాళెం గ్రామంలో మాతామహుల సంరక్షణలో పెరి. ఇక్కడే కొంతకాలం స్కూల్ విద్య నభ్యసించి తిరిగి తుమ్మపూడి వెళ్ళిన తరవాత ఇల్లు, ప్రకృతే పాఠశాలలుగా తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లీషు, బెంగాలీ భాషల్ని దాదాపు స్వంతంగానే నేర్చుకున్నారు. చాలా చిన్న వయసులోనే అనేక ఉత్తమ గ్రంథాన్ని అధ్యయనం చేశారు. సంజీవ్‌దేవ్ సాంస్కృతిక జీవిగా రూపొందడానికి చిన్ననాడు వారి పెద్దతండ్రి చినవెంకట కృష్ణయ్యప్రభావం చాలా ఉంది. థియోసాఫికల్ సొసైటీ మెంబర్ అయిన ఈయనకు ఇంట్లోనే చిన్నసైజు లైబ్రరీ ఉండేది. ఇందులో అత్యుత్తమ గ్రంథాలే కాక రెగ్యులర్‌గా వార్తా పత్రికలు, మాస పత్రికలు వస్తూండేవి. వీరు సంజీవ్‌దేవ్ గారికి శాంతినికేతన్ లోని రవీంద్రుని గురించి, కలకత్తాలోని జగదీశ్ చంద్రబోస్ గురించి, పుదుచ్చేరి లోని అరవిందఘోష్ గురించి సవివరంగా చెప్పేవారు. వీరితో పాటు జిడ్డు కృష్ణమూర్తి గురించి, అనీబిసెంట్ గురించి చెప్పటమే కాక సంజీవ్‌దేవ్‌కు ఎనిమిది

[38] 20వ శతాబ్ది తెలుగు వెలుగులు: పుట 662, 663

సంవత్సరాల వయసున్నప్పుడే మద్రాసు తీసుకువెళ్ళి వారిని చూపించారు.హిమాలయాల గురించి, అక్కడ నివసించే యోగుల గురించి వీరు చెప్పిన వివరాలు సంజీవ్‌దేవ్‌పై చాలా ప్రభావం చూపాయి. [39]

సంజీవ్‌దేవ్ చిన్న వయస్సులోనే బెంగాలీ బాగా నేర్చుకొని ఠాగూర్, ప్రేమ్‌చంద్, శరత్‌చంద్ మొదలైన బెంగాలీ రచయితల పుస్తకాలను తెప్పించుకుని చదివేవారు. అంతేగాక శిశుసాథీ, చిచిత్రా, బంగశ్రీ అనే బెంగాలీ మాస పత్రికలకు, విశాల భారత్ అనే హిందీ మాస పత్రికకు, ModernReview అనే ఇంగ్లీషు మాస పత్రికకు చందాదారుడుగా చేరి వాటిని శ్రద్ధగా చదివేవారు. సంజీవ్‌దేవ్ చిన్ననాడే వారి పెదతండ్రి స్వంత లైబ్రరీ లోని ఎన్నో గ్రంథాలను చదివారు. అందులో మహర్షి దేవేంద్రనాథ్‌స్వీయ చరిత్ర సంజీవ్‌దేవ్‌జీవితంపై శాశ్వత ముద్ర వేసింది. ఈ గ్రంథంలోని దేవేంద్రనాథ్ చేసిన పర్యటనన వర్ణన ప్రత్యేకించి హిమాలయ పర్యటనల వివరాలు ఆయన్నెంతో పరవశింపజేశాయి. ఇదే సంజీవ్‌దేవ్ హిమాలయ పర్యటనకు, ఆ తర్వాత స్వీయచరిత్ర రచనకు ప్రేరణగా నిలిచాయి. [40].

సంజీవ్‌దేవ్ ప్రేరణగా నిలచిన మరొక వ్యక్తి స్వామి రామతీర్థ . వీరి గురించి తన 'తెగిన జ్ఞాపకాలు' రచనలో ఇలా పేర్కొన్నారు. *''నా పదునాలుగో ఏట స్వామి రామతీర్థ జీవితంతోను, ఆయన రచనలతోను పరిచయం ఏర్పడింది. ఆయన హిమాలయాల పర్యటనలూ, ఆయన చేసిన హియాలయ వర్ణనలూ నాలో హిమాలయాల మీద తీవ్రమైన ఆసక్తిని సృష్టించాయి. హిమాలయాల పేరులోనే ఏదో లోకోత్తర ఆకర్షణ తోచేది. హిమశిఖరాలు, దేవదారు అరణ్యాలు, జలపాతాలూ ఇవన్నీ నన్ను తమవైపు ఆకర్షించసాగాయి. తమను ఒకసారి చూచి పొమ్మని ఆహ్వానించసాగాయి. హిమాలయాలను చూడాలనే ఆకాంక్ష క్రమేణా వృద్ధికాసాగింది. హిమాలయాలను గురించిన పుస్తకాలు చదవటంలో ప్రత్యేకానందం తట్టసాగింది. సాధ్యమైనంత త్వరలో హిమాలయాలను సందర్శించాలనే నిర్ణయం స్థిరపడిపోయింది.''* [41]

[39] సంజీవ్‌దేవ్, తెగిన జ్ఞాపకాలు 1999 పుట: 96

[40] సంజీవ్‌దేవ్, తెగిన జ్ఞాపకాలు 1999 పుట 96

[41] సంజీవ్‌దేవ్, తెగిన జ్ఞాపకాలు:1999 పుట 96

సంజీవ్‌దేవ్ చిన్న వయస్సులోనే హిమాలయ పర్యటన చేసినట్టు స్వయంగా వారే తమ స్వీయ చరిత్రలో *"హిమాలయాలకు వెళ్ళుతున్నాను నా పదహారోయేట. నాకు ఇదివరలో గడిచిపోయిన సంవత్సరాల కంటే ఈ పదహారో సంవత్సరం ఎంతో ధన్యమైందో మరి నన్ను హిమాలయాలకు తీసుకువెళ్ళుతుంది"* [42] రాసుకున్నారు. రామకృష్ణ మిషన్ వారి *"Prabudda Bharath"* ను శ్రద్ధగా చదివే సంజీవ్‌దేవ్ ఆనాటి ఆ పత్రిక సంపాదకులైన స్వామి పవిత్రానందతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి తాను అక్కడికి వెళ్ళి ఆయనతో ఉండడానికి పవిత్రానంద అనుమతి సంపాదించారు. (ప్రబుద్ధ భారత కార్యాలయం హిమాలయ ప్రాంతంలోని అల్మోరా జిల్లా 'మాయావతి' అనే ప్రదేశంలో ఉంది.) సంజీవ్‌దేవ్ హిమాలయ పర్యటనకు స్వామి సత్యదేవ్ రాసిన 'మేరీ కైలాస్ యాత్ర' అనే హిందీ పుస్తకం ఎంతో ఉపకరించింది.[43] హిమాలయాలకు చేరుకున్న సంజీవ్‌దేవ్‌కు అక్కడ స్వామి పవిత్రానంద సాంగత్యం, ప్రబుద్ధ భారత పత్రికలో పనిచేసే ఇతర స్వామీజీల సాహచర్యం, అక్కడి లైబ్రరీ ఇవన్నీ సంజీవ్‌దేవ్‌ని తీర్చిదిద్దాయి. పవిత్రానంద సహాయంతో పాశ్చాత్య తర్క శాస్త్రమూ, పాశ్యాత్య తత్త్వ శాస్త్రమూ అధ్యయనం చేశారు. లాజిక్, మెటాఫిజిక్స్, ఎపిస్టామాలజి, అంటాలజి మొదలయిన పాశ్చాత్య తాత్త్విక విధానాలతో సన్నిహిత సంబంధాన్ని ఏర్పర్చుకున్నారు. ఐ.ఎ. రిచర్డ్స్, జాన్‌డ్యూయీ, ప్లేటో, అరిస్టాటిల్, టాల్ స్టాయ్, రోజర్ ఫ్రై, ఇలియట్, కాంట్, హెగెల్, క్రోచీ, జీన్‌పాల్ సాత్రే మొదలగు ఎంతో మంది రచనల్ని అధ్యయనం చేశారు.[44] హిమాలయాల నుండి తిరిగి వచ్చేటప్పుడు రవీంద్రనాథ ఠాగూర్ మేనకోడలు కొడుకు అయిన అసిత్‌కుమార్ హల్దార్ ఇంట లక్నోలో కొంతకాలం ఉండి తుమ్మపూడి తిరిగి వచ్చారు. వారి ఇరువురి స్నేహానికి గుర్తుగా అన్నట్టు హల్దార్ తన 'మానసముకుర్'ను సంజీవ్‌దేవ్ గారికి అంకితం ఇస్తే, సంజీవ్‌దేవ్ తిరిగి తన 'రసరేఖలను' హల్దర్ గారికి అంకితం ఇచ్చారు.

---

[42] సంజీవ్‌దేవ్, తెగిన జ్ఞాపకాలు:1999 పుట 127

[43] సంజీవ్‌దేవ్, తెగిన జ్ఞాపకాలు:1999 పుట 123,124

[44] సంజీవ్‌దేవ్, తెగిన జ్ఞాపకాలు:1999 పుట 150

సంజీవ్‌దేవ్  హిమాలయాల నుండి తిరిగి వచ్చిన కొంతకాలం తర్వాత కులూ లోయలోని నికోలస్‌రోరిక్ దగ్గరికి వెళ్ళి అక్కడ కొంతకాలం చాలా ఆనందంగా గడిపారు. ఆ ప్రయాణ విశేషాలను, అక్కడి రోరిక్కుల విశేషాలను, వారితో గడిపిన వారి జీవిత యాత్ర మొదలైన వాటన్నింటిని గురించి వ్యాసాలుగా రాసి ప్రతి ఆదివారం ఆంధ్రప్రభ ఎడిటర్ నార్ల వెంకటేశ్వరరావు గారికి పంపేవారు. వారు వీరి వ్యాసాలకు సుందరమైన శీర్షికలు ఏర్పరిచి ప్రతి ఆదివారం ఆంధ్రప్రభలో ప్రచురించేవారు. ఆ పత్రికలోనే మరోక పేజీలో గోపిచంద్ 'అసమర్ధుని జీవయాత్ర' నవల కూడా వెలువడుతూండేది.[45] రోరికల్ నుండి వచ్చిన తర్వాత దేశ విదేశ పర్యటనలు తప్పిస్తే జీవితమంతా తుమ్మపూడిలోనే గడిపారు.

సంజీవ్‌దేవ్ 1950లో సులోచనతో వివాహం జరిగింది. వీరికి 1952లో ఒక కుమారుడు పుట్టి చనిపోయారు. ఆ తర్వాత వీరికి ఇద్దరు మగ పిల్లలు జన్మించెను.వారి ఇరువురి పేర్లు జోగేంద్ర, మహేంద్ర. సంజీవ్‌దేవ్  సెప్టెంబర్ 25న 1999 వ సంవత్సరంలో స్వర్గస్థులయ్యారు. సంజీవ్‌దేవ్  అందర్నీ సమానంగా చూసేవారు. వీరు చిన్నా పెద్ద, కులమత అనే తేడాలేవీ చూపేవారు కారు. ఆయన పరిచయస్థుల్లో ఎంతో మంది మేధావులు, కళాకారులు, ప్రతిభాసంపన్నులు ఉన్నప్పటికీ ఆయన విలువనిచ్చేది హృదయం మేల్కొని ఉన్న వ్యక్తులకేనని చెప్తూ

*''నేను పాండిత్యానికి విలువ ఇవ్వను. కళా ప్రతిభలకు విలువ ఇవ్వను. తెలివి తేటలకు విలువ ఇవ్వను. హృదయ స్పందనకు విలువ ఇస్తాను. హృదయ స్పందన అంటే ప్రేమ, జాలి, దయ, కరుణ, సానుభూతి, వీటికే నేను విలువ ఇచ్చేది. అవి ఎవరిలో ఉన్నా సరే, స్త్రీలలో ఉన్నా, పురుషులో ఉన్నా, పెద్దలలో ఉన్నా, పిన్నలలో ఉన్నా వారిలో విద్య ఉన్నా సరే, లేకపోయినా సరే వారు నాకు ప్రియులు. హిందూ ధర్మం, క్రైస్తవ ధర్మం, ఇస్లాం ధర్మం మొదలైన అనేక ధర్మాల్లో కల్లా హృదయ ధర్మమే సర్వోత్కృష్టమైనది! హృదయ స్పందనే ప్రాణ స్పందన, ప్రాణ స్పందనే ఆత్మానందం''.*[46] అని తమ లేఖల్లో పేర్కొన్నారు. ఆయన తమ లేఖల్లో ఎన్నో విషయాలను క్రోడికరించారు. వీరు తమ జీవిత లక్ష్యం గురించి చెప్తూ *''నా జీవిత లక్ష్యం ఏమిటని నన్ను*

[45] సంజీవ్‌దేవ్, తెగిన జ్ఞాపకాలు:1999 పుట 150

[46] సంజీవ్‌దేవ్, లేఖల్లో సంజీవ్‌దేవ్:1982 పుట129

*మీరు ప్రశ్నించారు. మరణ పర్యంతం శాంతితో, ఆనందంతో నేను జీవిస్తూ, ఇతరులను జీవింప చేయటం నా జీవిత లక్ష్యం''*[47] అని అంటారు. అలాగే జీవించారు కూడా.

### 3.3.8.1. సంజీవ్ దేవ్ రచనలు

సంజీవ్‌దేవ్ 1939లో మొదటిసారిగా రచన చేయడం ప్రారంభించారు. వీరి మొదటి రచన తెలుగులో 'కళాజ్ఞానము' అనే వ్యాసం.[48] ఇది 1939లో అచ్చయింది. ఆంగ్లంలో వీరి మొదటి వ్యాసం Land Scape Art. ఇది 1945లో కృష్ణాపుష్కరాల సందర్భంగా వెలువడిన సంచికలో ప్రచురింపబడింది. సంజీవ్‌దేవ్ 1960 నుంచి చిత్ర రచన చేయడం ప్రారంభించారు. సంజీవ్‌దేవ్ తాను మరణించే వరకు చిత్ర రచనలోనో, సాహిత్య రచనలోనో నిండు ఉత్సాహంతో నిమగ్నమయి ఉండేవారు. వీరు ఈ కింది రచనలు గావించినట్టు తెలుస్తుంది.

రస రేఖలు (1963/1982) (ఈ గ్రంథాన్ని కన్నడంలోకి 'హరి హరప్రియ' అనువదించారు.), సంజీవ్‌దేవ్ లేఖలు (1964), తేజో రేఖలు (1965), రూపా రూపాలు (1969), తెగిన జ్ఞాపకాలు (1970) (సంజీవ్‌దేవ్ స్వీయచరిత్ర), సమీక్షా రేఖలు (1973), దీప్తిధార (1975), తెల్లమబ్బులు (1975), Grey and Green (1975)స్మృతి బింబాలు (1976/1989) (సంజీవ్‌దేవ్‌స్వీయచరిత్ర)

గతంలోకి (1978) (సంజీవ్‌దేవ్‌స్వీయచరిత్ర) A. Paidi Raju – A critical appreciation (1978) లేఖల్లో సంజీవ్‌దేవ్ (1982), కాంతిమయి (1982), లలితకళలు సమీక్ష - వికసన చరిత్ర (1985) (తెలుగు విజ్ఞాన సర్వస్వంలోని 'లలిత కళలు' సంపుటం.), Bio – Symphony (1985) లేఖా స్రవంతి (1988), రూపదర్శిని (1988), ఉదా - అరుణ ఉద్ధృత రేఖలు (Purple sparks) (1990), Her life (1992), Blue Blooms (1992), Creative Analysis – Collected works of Dr. Sanjivadev

---

[47] సంజీవ్‌దేవ్, లేఖల్లో సంజీవ్‌దేవ్:1982 పుట253

[48] సంజీవ్‌దేవ్, తెగిన జ్ఞాపకాలు:1999 పుట 186

పై రచనలలో 'Bio – Symphony' (1985) అన్న ఆంగ్ల గ్రంథం ఆయన రచనలలోకెల్లా ఉన్నతమైంది. ఆ గ్రంథంలో వీరు విశ్వసృష్టి, జీవోత్పత్తి, మానవ పరిణామం, సంస్కృతి, భాషలు, కళలు, జీవితం, మృత్యువు, పునర్జన్మ, పంచకోశాలు, మతాలు, దర్శనాలు మొదలైన వాటికి సంబంధించిన తాత్త్విక వైజ్ఞానిక ధోరణులను గురించి వివిధ శాస్త్రాల్లో చెప్పిన అనేక విషయాలను సమగ్రదృష్టితో ఆకళింపు చేసుకొని ఆ భావాలను ఈ గ్రంథంలో తనదైన ప్రత్యేక శైలిలో స్పష్టంగా చెప్పారు. ఈ గ్రంథంలో 'సైకో హ్యూమనిజం' (మానసవాదం) అనే నూతన జీవన తాత్త్విక సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఇంకా ఈ గ్రంథానికి కవిత్వమయమైన సంజీవ్‌దేవ్ ఆంగ్ల గద్యశైలి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొంతమంది ఈ గ్రంథాన్ని సంజీవ్‌దేవ్ 'మాగ్నమ్ ఓపస్'గా భావించారు.[49]

పైన పేర్కొన్న రచనలతో పాటు సంజీవ్‌దేవ్ అనేల రచనలు, వ్యాసాలు వివిధ తెలుగు, ఆంగ్ల ప్రతికలలో ప్రచురింపబడ్డాయి. తెలుగు ప్రతికలలో ప్రధానంగా భారతి, సాహితి, హంస, కళారత్న, నెత్తురు కలం, జ్వాల, మురళి, విహారి, నెలవంక, జ్యోత్స్న, తెలుగు విద్యార్థి, ఆంధ్రజ్యోతి, ఆంధ్రప్రభ, వార్త, సుభాషిణి, నారీలోకం, అభ్యుదయ, ఆంధ్ర శిల్పి, ఆంధ్ర పత్రిక ఉగాది సంచిక, కృష్ణా పత్రిక ఉగాది సంచిక, జమీన్ రైతు ఉగాది సంచిక, కలకత్తా ఆంధ్ర సాహిత్య పరిషత్ సంచిక మొదలైనవి. ఆంగ్ల ప్రతికలలో ప్రధానంగా Himalayan Times, Silpi, View finder, Rhythm, Mankind, Orient Review, Comet, Art & Culture, Twentieth Century, The Hindustan Review, Dawn of India (ఈ మాస పత్రికలో వీరు ప్రతి నెలా వివిధ విషయాలపై 'Flickers of the Flame' అనే శీర్షిక రాసేవారు.)

పైన పేర్కొన్న వివిధ ప్రతికలలోని సంజీవ్‌దేవ్‌వ్యాసాలలో సంజీవ్‌దేవ్‌ఆలోచనలన్నింటికీ అద్దం పట్టే మంచి వ్యాసాలన్నింటినీ డాక్టర్ ముదిగొండ వీరభద్రయ్యసంపాదకత్వంలో తెలుగు

[49] వరగు భాస్కర్‌రెడ్డి: సంజీవ్‌దేవ్–సౌందర్యతత్త్వం 2008 పుట:6,7

అకాడమీ వారు రెండు సంపుటాలుగా ప్రచురించింది. ఈ రెండు సంపుటాలలోని వ్యాసాలను సంపాదకులు–

1. శ్రీ సంజీవ్‌దేవ్ కళాతత్త్వ వివేచనా వ్యాసాలు, 2. కళాకారులూ మహావ్యక్తులపై శ్రీ సంజీవ్‌దేవ్ పరిచయ వ్యాసాలు, 3. శ్రీ సంజీవ్‌దేవ్ కళా చారిత్రక వ్యాసాలు, 4. శ్రీ సంజీవ్‌దేవ్ కళా సాహిత్య సమీక్షలు, 5. ఇతర వ్యాసాలు అనే ఐదు విభాగాలుగా విభజించి ప్రచురించారు.

సంజీవ్‌దేవ్ కళాకారుడిగానూ, కవిగానూ, పండితుడిగానూ మాత్రమే గాక వీరు ఎంతో సహృదయులు. వీరు ప్రజలందరి హృదయాలలో సన్మార్గం ఉండాలంటారు. అంతేగాక వీరు *"If there is righteousness in the heart, there will be beauty in the character if there is beauty in the character, there will be harmony in the home. If there is harmony in the home, there will be order in the nation. When there I order in the nation, there will be peace in the world"*[50] అంటూ హృదయంలో సన్మార్గం ఉంటే శీలంలో సౌందర్యం ఉంటుందని శీలంలో సౌందర్యం ఉంటే గృహంలో ఐక్యత ఉంటుందని గృహంలో ఐక్యత ఉంటే జాతిలో క్రమబద్ధత ఉంటుందని ఇక జాతిలో క్రమబద్ధత ఉన్నప్పుడు ప్రపంచంలో శాంతి ఉంటుందని పేర్కొన్నారు. వీరు తమ జీవితాన్ని విమర్శనాత్మకంగానూ విచక్షణాజ్ఞానంతో అనుభవించారు.

సంజీవ్‌దేవ్ బహు భాషావేత్త వీరికి అనేక భాషల్లో అపారమైన ప్రావీణ్యం కలదు. వీరికి తెలుగు, ఇంగ్లీషు, బెంగాలీ, హిందీ, ఉర్దూ, ఫ్రెంచి భాషలతో సహా మొత్తం ఎనిమిది భాషల్లో చక్కని ప్రావీణ్యం కలదు. వీరు ప్రపంచానికంతకూ ఏక భాష అవసరమంటారు. వీరు భాషే ప్రపంచంలో ఐక్యతకు హేతువంటారు. *'ప్రపంచానికి సామాన్య భాషగా ఎవ్వరి మాతృభాష ఉండకూడదని ఒక మాతృభాష ప్రపంచ భాషగా మారితే వేరే మాతృభాష వారికి చిన్నతనంగా ఉంటుందని వారు ఎంత శ్రమించినా ప్రపంచ భాష మాతృ భాషగా కలవారితో సమానంగా దక్షత సంపాదించలేరని అందుకే ప్రపంచ భాష అనేది ఎవరికీ మాతృభాష కానీ భాష అయిండాలని అప్పుడే అందరికీ సమాన అవకాశాలు లభిస్తాయని*

[50] sanjivadev, Her life: 1992, page:64

*ఎవ్వరికీ ఆ భాషపై ద్వేషముండదని అంటారు.'*[51] అంతేగాక వీరు *'ఎస్పరాంటో'* అనే కృతక భాషను నేర్చుకోని *'భారతదేశం లోని అన్ని రాష్ట్రాలకు ఎస్పరాంటోని రాష్ట్ర భాషగా తీసుకుంటే ఒక ప్రాంతంవారి మాతృ భాష మరో ప్రాంతం వారికి రాష్ట్ర భాషగా మారే ప్రమాదం తప్పుతుందని దాని వల్ల తోటి సోదరులతో పాటు మనం కూడా మన వాణిని విశ్వ వీణ మీద పలికించవచ్చు'*[52] ని అభిప్రాయపడ్డారు. వీరు భాషతో పాటు లిపి కూడా ప్రపంచమంతటా ఒక్కటే ఉండాలంటారు.

ఈయన తన విమర్శలో భారతీయ, పాశ్చాత్య సౌందర్య సిద్ధాంతాలను సమన్వయిస్తూ చేసిన విమర్శ తీరుతెన్నులను రాబోయే అధ్యాయంలో విశ్లేషిస్తాను.

### 3.3.9. బుచ్చిబాబు (1916-1967)

జీవిత సత్యాన్ని వడబోసిన గొప్ప కథా రచయిత, నవలాకారులు, చిత్రకారులు బుచ్చిబాబు . *''బుచ్చిబాబు''* అను సంక్షిప్త నామంతో ఖ్యాతిని అర్జించిన ప్రముఖ కథకుడు, నవలాకారుడు, నాటక కర్త అయిన ఈయన అసలు పేరు శివరాజు వెంకట సుబ్బారావు . ఈయన కలం పేరు తెలుగు రచనలలో *'బుచ్చిబాబు'*గాను, ఆంగ్ల రచలలలో *'సంతోష్ కుమార్'* గాను గ్రహించారు. బుచ్చిబాబు 1916 జూన్ 14న ఏలూరులోని ఒక నియోగి కుటుంబంలో సూర్య ప్రకాశరావు మరియు వెంకాయమ్మ దంపతులకు జన్మించారు. వీరి అక్షరాభ్యాసం కంకిపాడు లో జరిగింది. పాలకొల్లులో ఎస్.ఎస్.ఎల్.సిలో ఉత్తీర్ణులై, ఇంటర్మీడియట్ మరియు బి.ఏ. పట్టాలు గుంటూరు ఆంధ్ర క్రైస్తవ కళశాలలో చదివారు. తర్వాత మద్రాసు ప్రెసిడెన్సీ కళశాలలో బి.ఏ. ఆనర్సులో ఉత్తీర్ణులై, నాగపూర్ విశ్వ విద్యాలయం నుండి 1941 లో ఎం.ఏ. పట్టా పొందారు.1940లో ఐ.సి.యస్ పరీక్షకు ప్రయత్నించినప్పటికి కృతార్థులు కాలేకపోయారు. వీరి తండ్రి ఉద్యోగరిత్యా ఉభయ గోదావరలు, కృష్ణా, గుంటూరు జిల్లాలోని గ్రామాలలో పర్యటించవలసి రావటం వలన, వారితో వీరు కూడ తిరిగి, నిసర్గ రమణీయ గ్రామీణ ప్రకృతిని సందర్శించు వీరికి జన్మజాత ప్రకృతి సౌందర్య పిపాస విజృభించింది. విద్యార్థి దశ ముగిసినప్పటికీ వీరు ప్రాక్, పశ్చిమ (ముఖ్యంగా ఆంధ్ర, ఆంగ్ల

---

[51] సంజీవ్‌దేవ్, రసరేఖలు:1963 పుట 144,145

[52] సంజీవ్‌దేవ్, రసరేఖలు:1963 పుట 144,145

వాఙ్మయాలు, తత్త్వ, మానస శాస్త్రాలను తృప్తి తీర అధ్యయనం చేశారు. సంగీతం, అభినయం చిత్రలేఖనం, సాహిత్యం మొదలగు లలితకళలు వీరిలోని ప్రతిభను ప్రకాశితం, ప్రవృద్ధం చేశాయి. తత్ఫలితంగా గాయకులుగా, నటకులుగా, చిత్రకారులుగా, సాహిత్య కారులుగా వీరు పరిణతులయ్యారు[53] వీరు కొన్నాళ్ళు అనంతపురం మరియు విశాఖపట్నంలలో ఆంగ్ల ఉపన్యాసకుడిగా పనిచేశాడు. ఆ తర్వాత 1945 నుండి 1967లో మరణించే వరకు ఆలిండియా రేడియోలో పనిచేశారు.

బుచ్చిబాబు  బి.ఏ. విద్యార్థిగా ఉన్నప్పుడే ఆంధ్ర క్రైస్తవ కళశాల వార్షిక సాహిత్య సంచికలో (1936) వీరి ప్రప్రథమ రచలు *'జువెనిలియా', 'బ్రోకెన్ వయోలిన్'* అనే ఆంగ్ల కవితలు, *'పశ్చాత్తాపం లేదు'* అనే తెలుగు కథానిక ప్రచురించబడ్డాయి.  వీరు ఆంగ్ల సాహిత్యంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీ పొందారు. ఈయన వ్రాసిన చిన్న కథలు సాధారణంగా చాలా పొడవుగా ఉండి, పాత్ర చిత్రణలోనూ, కథ నెరేషన్‌లో విన్నూతమైన శైలిని కలిగి ఉంటాయి. బుచ్చిబాబుఆలోచనా స్రవంతిపై సోమర్‌సెట్ మామ్, ఓ హెన్రీ తదితర ఆంగ్ల రచయితల ప్రభావం మెండుగా కనిపిస్తుంది. కొన్ని నవలలు వ్రాసినా మంచి నవలా రచయితగా కూడా పేరు తెచ్చుకున్నారు. తెలుగు రచయితలు, కవులందరూ జాతీయవాదులు, మార్క్సిస్టులు లేదా ఏదో ఒక సంఘ సంస్కరణ ఉద్యమానికి చెందిన వారైన కాలంలో అతికొద్ది మంది ఆధునిక అభ్యుదయ రచయితల్లో బుచ్చిబాబు  ఒకరు.1967 సంవత్సరంలో వీరు పరమపదించారు.[54]

### 3.3.9.1. బుచ్చిబాబు రచనలు

బుచ్చిబాబు  సుమారు 82 పైగా కథలు, నవల, వచన కావ్యం, 40 పైగా వ్యాసాలు, 40 పైగా నాటిక – నాటకాలు, పరామర్శ గ్రంథం, స్వీయ చరిత్రకు చెందిన మొదటి భాగం, కొన్ని పీఠికలు, పరిచయాలు, అనువాదాలు వీరి లేఖిని నుండి వెలువడ్డాయి. వీరు

[53] 20వ శతాబ్ది తెలుగు వెలుగులు (మొదటి భాగం)2005: పుట: 389

[54] బుచ్చిబాబు వాఙ్మయ జీవత సూచిక: కాత్యాయనీ విద్మహే: 1983

ఆంగ్లలోను కథలు, నాటకాలు, కవితలు, వ్యాసాలు రచించారు. ఈయన రచనలలో అత్యంత పేరు పొందినవిగా చివరకు మిగిలేది (నవల), అజ్ఞానం (వచన కావ్యం), ఆశావాది, ఆద్యంతాలు మధ్య రాధ, నా అంతరంగ కథనం, షేక్స్పియర్ సాహిత్య పరామర్శ మొదలైన రచనలు చెప్పవచ్చు. వీరు తమ రచనలలో తెలిపిన సందేశాలలో *'ప్రతి తెలుగువాడూ తెలుగు భాషను తన ప్రాణంతో సమానంగా చూసుకుంటాడు. దేనినైనా మార్చుకుంటాడు గానీ మాతృ భాష మాత్రం మార్చుకోడు. అన్నది ఎంతో ప్రసిద్ధం. కాల్పనిక వాద ధోరణి నుండి అనుభూతాత్మక కథా కథన ధోరణికి, ఒక కొత్త మలుపును కొనివచ్చిన తెలుగు నవ కథా రచయితలలో ప్రముఖులు వీరు. క్రొంగ్రొత్త ఉపమలు. ప్రతీకలు, సూక్తులు, గాఢ కవితా కలిత వర్ణనలు, మానవ మానస జగద్విన్యాస చిత్రణం, రచనలో ఒక ఆవేదన, సంవేదన వీరి కథలలో కొట్టవచ్చినట్లు కనిపించే కొన్ని ముఖ్య లక్షణాలు. కథకులలో వీరి ప్రౌఢయవ్వనులు. కొందరి దృష్టిలో క్రియాశీలవాది, ఆశావాది. సౌందర్యారాధనం, మనస్తత్వావధనం సంగమించిన తావులు వీరి కథలు. 'మానవునికి జీవితంలో సమాధానపడుట తృదేమో' అనే సందేశం, సంకేతం వీరి కథా రచనలలో ధ్వనిస్తుంది. వీరి వ్యాసాలలో జ్ఞాన తృష్ణ, వివేచన కనిపిస్తుంటుంది. నాటకాలలో నాటక రచనా పాటవం ప్రస్ఫుటమవుతుంది.*[55] ఈయన తన విమర్శలో భారతీయ, పాశ్చాత్య సౌందర్య సిద్ధాంతాలను సమన్వయిస్తూ చేసిన విమర్శ తీరుతెన్నులను రాబోయే అధ్యాయంలో విశ్లేషిస్తాను.

నా పరిశోధన పరిధి, పరిశోధన కాలాన్ని దృష్టిలో పెట్టుకుని పురాణం సూరిశాస్త్రి, చలం, శ్రీశ్రీ, సంజీవ్ దేవ్, బుచ్చిబాబుల కృషిని ఇక్కడ వివరించాను. వీరందరి సౌందర్య విమర్శను రాబోయే అధ్యాయంలో సమన్వయించేందుకు ప్రయత్నిస్తాను.

[55] 20వ శతాబ్ది తెలుగు వెలుగులు (మొదటి భాగం)2005: పుట: 389–390

## నాల్గవ అధ్యాయం

# పురాణం సూరిశాస్త్రి, సంజీవ్ దేవ్ సౌందర్యశాస్త్ర విమర్శ

నాల్గవ అధ్యాయం

# పురాణం సూరిశాస్త్రి, సంజీవ్ దేవ్ సౌందర్యశాస్త్ర విమర్శ

## 4.0. ఉపోద్ఘాతం

తెలుగులో సౌందర్యశాస్త్రవిమర్శను భారతీయ పాశ్చాత్య దృక్కోణంతో పరిశీలించిన విమర్శకుల్లో పురాణం సూరిశాస్త్రి, సంజీవ్ దేవ్ ముఖ్యులు. అలాగే వీరు ప్రధానంగా సౌందర్యశాస్త్రాన్ని ఒకవిమర్శగా అనుశీలించిన వారు. సృజనాత్మక సాహిత్యానికంటే, సృజనాత్మక సాహిత్యం, కళలను ఆధారంగా చేసుకొని తమ పరిశీలనను కొనసాగించినవారు. అందువల్ల వీరి కృషి ప్రత్యేకంగా అధ్యయనం చేయడం అవసరమనిపించింది. ఆ దిశగా ఈ అధ్యాయాన్ని పరిశీలిస్తూ భారతీయ, పాశ్చాత్య సౌందర్యశాస్త్ర భావనలతో వీరి కృషిని సమన్వయించే ప్రయత్నం చేస్తాను.

## 4.1. పురాణం సూరిశాస్త్రి కళావిమర్శ సమన్వయం

తెలుగులో కళాతత్త్వ శాస్త్ర దృక్కోణంతో వివేచించిన వారిలో మొదటి వ్యక్తి పురాణం సూరిశాస్త్రి . ఆయన 1925లోనే *'విమర్శక పారిజాతము'* అనే గ్రంథాన్ని రాశారు. ఇందులో *'కళా రహస్యం'* అనే అధ్యాయం పూర్తిగా కళాతత్త్వ శాస్త్రానికి సంబంధించినది.[1] పురాణం సూరిశాస్త్రి *'విమర్శక పారిజాతము'*లోని 'ప్రవేశము'లో *"ప్రాచ్య పాశ్చాత్య కళాదర్శములు భేదములని కొందరు చెప్పుచుండ విని దాని లోతరయ జూచితిని, అరసి, యాంగ్ల భాషా మూలమున లభించు లక్షణ సర్వస్వమును, సంస్కృత మూలమున జేవికందు భారతీయ కళా మర్యాదలను, నొక్క తావున తెలుగు బాసలో గూర్పదలచితిని."*[2] అని ఆయనే స్వయంగా చెప్పుకున్న మాటలని బట్టి భారతీయ కళలపై వారికి గల జ్ఞానం, ఆసక్తి తెలుస్తున్నాయి. ఆయన దీనిలోనే *"లలిత కళా రహస్యముల దెల్పు దానినంతను నొక పుస్తకముగ జేర్చుచున్నాను."*[3]

---

[1] దుర్గారావు, మజ్జి. పురాణం సూరిశాస్త్రిగారి కళావిమర్శ దృక్పథం (ఎం.ఫిల్. అముద్రిత సిద్ధాంతవ్యాసం) 2007

[2] విమర్శక పారిజాతము 1925 పుట: i

[3] విమర్శక పారిజాతము 1925 పుట:vii

అని ఆ గ్రంథం గురించి స్వయంగా చెప్పారు. తెలుగు కళా విమర్శకులలో పురాణం సూరిశాస్త్రి ప్రథమ వరసలో ఉన్నారు.

#### 4.1.1. కళా ప్రయోజనం

పురాణం సూరిశాస్త్రి  కళాప్రయోజనాన్ని గురించి చెబుతూ కళలు రసభావములన గుర్తించి లోకులను తెలియపరచి విమర్శక సహాయ మొనర్చవలసి ఉన్నదని. ఇందుకు కళావిమర్శ ఒక సాహితీ వ్యాపారముగా, పత్రికోపజీవనముగా ఏర్పడవలసి ఉన్నదని[4] అని పేర్కొన్నారు. ఆయన *'కళావిమర్శ'*ను కింది ఉపశీర్షికలుగా గమనించవచ్చు.

#### 4.1.2. కళా స్వరూపం

పురాణం సూరిశాస్త్రి  కళాశిక్ష సామాన్యంగా ప్రసిద్ధ కళా స్వరూపముల లక్ష్యమున కనిపిస్తుందని, నిజంగా ప్రకృతియే కళోపాసకులు పరిశీలింపవలసిన రమ్యమాతృక. అనీ పూర్వకవి ప్రయోగములు, శిల్పాచారములు మాత్రమేకాక, దేశకాల పరిస్థితులు కూడ కళా స్వరూప నిర్ణయిస్తున్నాయని, అనగా ప్రకృతి, పూర్వాచారము, కవి ప్రతిభ, సమకాలిక పరిస్థితులు, ప్రేక్షక సమాజము, మత నైతికోద్యమాలు, ప్రస్తుత ప్రయోజనం మొదలైన అంశాలెన్నో చేరి కళా స్వరూపమును, స్వభావంను నిర్ణయిస్తున్నాయని అందువల్ల కళా స్వరూల పరిశీలనం వలన కవి యొక్క రసానుభవాన్ని ప్రకృతిలోని రమ్య సందర్భములను నిశ్చయింపలేమని పేర్కొన్నారు.[5]

ఇక్కడ ప్రాశ్చాత్య అలంకారికుడైన క్రోచే అభిప్రాయాలు తెలుసుకోవటం ఎంతైనా ఆవశ్యకం. ఈ అభ్యంతరాలకు సమాధానంగా కళని వ్యక్తీకరణగా నిరూపిస్తూ కొలింగ్ ఉడ్ 20యవ శతాబ్దపు అలంకార శాస్త్ర ప్రధాన రచనలో ఒకదానిగా గుర్తించిన Principles of Art (1938) ని రచించాడు. కొలింగ్ ఉడ్ భావాలు క్రోస్ రచనలని ఆరాధిస్తూనే వాటిలోని లోపాలను పూరించటానికా అన్నట్టుగా సాగుతాయి.

---

[4] విమర్శక పారిజాతము 1925 పుట:viii

[5] విమర్శక పారిజాతము 1925 పుట:253, 254

"Art is not a luxury, and bad art is not a thing we can afford to tolerate. To know ourselves is the foundation of all life that develops beyond the mere psychical level of experience.... Every utterance and every gesture that each one of us makes is a work of art. It is important to each one of us that in making them, however much he deceives others, he should not deceive himself. If he deceives himself in this matter, he has sown in himself a seed which, unless he roots it up again, may grow into any kind of wickedness, any kind of mental disease, any kind of stupidity, and folly and insanity. Bad art, the corrupt consciousness, is the true radix malorum."[6]

కళ సౌకర్యం కాదు, చెడు కళని మనం భరించలేము. మనల్ని మనం తెలుసుకోవటమే జీవితానికి అర్థం. ఇది భేదికానుభావానికి ఆవల ఉంటుంది. మనం చేసే ప్రతి పనీ ప్రతి పలుకు కళా రచనే .అందుకే మనం ప్రక్కవారిని ఎంతగా మోసం చేసినా మనల్ని మనం మోసం చేసుకోరాదు. అలా గనుక చేస్తే అది చెడు విత్తనం నాటితే విషవృక్షం వచ్చినట్లుగా ఎటువంటి మానసిక రుగ్మతకైనా దారి తీయవచ్చు. ఇది సమాజ నాశనానికి హేతువు ఇదే విధంగా కళాకారుడి గురించి వివరిస్తూ కోలింగ్ ఉడ్

"The artist's business is to express emotions; and the only emotions he can express are those which he fells, namely his own.... If he attaches any importance to the judgment of his audience, it can only be because he thinks that the emotions he has tried to express are... shared by his audience... In other words he undertakes his artistic labour not as a personal effort on his own private behalf, but as a public labour on behalf of the community to which he belongs."[7]

[6] Collingwood, R.G. (1938) Principles of Art, Oxford: Clarendon Press. Page: 284–285

[7] Collingwood, R.G. (1938) Principles of Art, Oxford: Clarendon Press. Page: 314–315

కళాకారుని పని భావ వ్యక్తీకరణా. అతను వ్యక్తీకరించగలిగే భావాలు అతను అనుభవించినవి అంటే కేవలం అతనివి మాత్రమే. అతను ప్రేక్షకుల నిర్ణయానికి అనుబంధంగా ఏమన్నా ఊహిస్తే అది కేవలం  అతని భావ వ్యక్తీకరణలు అతను ప్రేక్షకులు పంచుకున్నట్టుగా భావించటం వలన మాత్రమే ఇంకోరకంగా చెప్పాలంటే అతను కళ అనే శ్రమని తన వ్యక్తిగత ప్రయత్నంగా వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా సమాజపు శ్రమగా అతను ఉన్న వర్గ సముదాయపు తరపున చేస్తాడు. అంటే వారు కేవలం కళాకారులే కాదు వారు సమాజపు ప్రతినిధులన్న మాట.

క్రోచే శిష్యుడైన కాలింగ్ వుడ్ కళలో ప్రతిపాదన అనే అంశాన్ని నిరాకరిస్తూ సమకాలీన విప్లవాత్మక ఆచరణలను సమర్థించే మార్గంలో ఒక నూతన కళా సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. కాలింగ్ వుడ్ శిల్పం కళా సృజనకు సాధనమే కాక లక్ష్యమని కూడా భావించాడు. కళ కూడా కాలింగ్ వుడ్ దృష్టిలో ఒక అభివ్యక్తి కావడం చేత అభివ్యక్తికి కూడా అభివ్యక్తే లక్ష్యం. అభివ్యక్తి కళాకారుడి స్వేచ్ఛా మనః ప్రవృత్తికి రూపం ఇచ్చేదిగా భావించరాదు. ఆ అనుభూతి రూపంలో మాత్రమే ఇమిడి ఉంటూ ఆ రూపం నుండి మాత్రమే పొందగలిగేలా ఉంటుంది. అలాకానప్పుడు కళ అంతకు పూర్వమే స్థిరపడినవీ, దేనికదిగా గుర్తించడానికి వీలుపడేవీ అయిన మనో వ్యాపారాలను వ్యక్తం చేస్తూ శిల్ప రూపాలలో ఒకటిగా మారి తన ప్రత్యేకతను కోల్పోతుందని పేర్కొన్నాడు.

క్రోచేలాగే కాలింగ్ వుడ్ కూడా వర్ణనను విడిచి అభివ్యక్తిని సమర్థించాడు. అభివ్యక్తి సర్వసామాన్య మనో వ్యాపారాలు కాకుండా ఒక నిర్దిష్ట లక్షణాన్ని మాత్రమే అందిస్తుంది. కాలింగ్ వుడ్ ఊహకు సంబంధించిన సందర్భంలో తన సౌందర్య దర్శనాన్ని అమర్చి ఉంచాడు. కాలింగ్ వుడ్ బ్రిటన్ కు చెందిన ఆచరణవాదులు (Expiricists), అది భౌతిక ఆదర్శవాదులు చెప్పిన అభిప్రాయాలను సమన్వయించుకొని తన సిద్ధాంతాన్ని రూపొందించుకున్నాడు. ఏ కళా రూపమైతే సహృదయునిపై చెరగని ముద్ర వేసి ప్రభావితుణ్ణి

చేయలేదో దానిని 'క్రీడా కళ' (Play Art) గా కాలింగ్ వుడ్ తిరస్కరించాడు. సౌందర్యం వికృతత్వంతోను, వికృతత్వం సౌందర్యంతోను కలిసి ఉంటుందని ఆయన భావించాడు.[8]

ఇతను తన వాదానికి కొనసాగింపుగా కేవలం నాటకాలు, చిత్రలేఖ్యలే కాక కవిత్వాన్ని కూడా తీసుకొన్నాడు. ఇందులో భాగంగా ఇలియట్ కవిత "The waste land" గురించి విస్తృత చర్చ గావించాడు. దానిని వివరిస్తూ

"This poem is not in the least amusing. Nor is it in the least magical. The reader who expects it to be satire, or an entertaining description of vices, is as disappointed with it as the reader who expects it to be propaganda, or an exhortation to get up and do something. To the annoyance of both parties, it contains no indictments and no proposals. To the amateurs of literature, brought up on the idea of poetry as a genteel amusement, the thing is an affront. To the little neo-Kiplings who think of poetry as an incitement to political virtue, it is even worse; for it describes an evil where no one and nothing is to blame, an evil not curable by shooting capitalists or destroying a social system, a disease which has so eaten into civilization that political remedies are about as useful as poulticing a cancer."[9]

ఇందులో అంతా మంచి కవిత్వపు లక్షణాలు , మంచి కవిత్వపు అవసరం ఈ సమాజానికి ఎంత ఉంది ? అన్నదాని మీద సాగుతుంది. ఇతని దృష్టిలో ఈ కవిత ఏమంత అద్భుతమైనదేమి కాదని చెబుతూ  అది ఎందుకో వివరించాడు. వ్యక్తీకరణ వాదంలో ముందువారు చేసిన లోపాలను పూర్తిస్తూ దానిని ఒక గొప్ప సిద్ధాంతంగా లేదా వాదంగా

[8] D.E. Berylyne. Characterization of Art & Beauty, Aesthetics and Psychobiology, Appleton Century – Crofts, Educational Division, Meridith Corporation, University of Torento, P:118

[9] Collingwood, R.G. (1938) Principles of Art, Oxford: Clarendon Press. Page: 335

ముందు తరాలవారికి అందించటంలో కొలింగ్ ఉడ్ సఫలీకృతుడైనాడనే చెప్పవచ్చు. ఇది కళని ఒక కొత్త కోణంలో చూపించటమే కాకుండా కళాదృష్టికి , అలంకార శాస్త్రానికి ఒక కొత్త రూపునిచ్చింది.

#### 4.1.3. కళా స్వరూప ప్రాశస్త్యం

పురాణం సూరిశాస్త్రి *'కళావిమర్శ చేయుటకు సత్కళాస్వరూపములను చక్కగా పరిశీలించి అసూయ రహితమైన, భావవేశములకు ఆనందించెడి విప్పు చూపులతో, సహృదయతతో, వాని రసాన్ని, భావాన్ని గ్రహించాలి. ఇంతకన్న ముఖ్యమైన పని మనకు గోచరించెడి ప్రకృతిని సూక్ష్మ విచక్షణతో పరిశీలించి జ్ఞాపకం ఉంచుకొనవలెను.'*[10] అన్నారు.

అంటే భారతీయులు చెప్పిన సహృదయతను, పాశ్చాత్యులు చెప్పిన అసూయారాహిత్యాన్ని సౌందర్యాస్వాదనకు సమన్వయం చూపాడు. దీన్నే మరింత వివరిస్తూ ఆయన చెప్పిన అభిప్రాయాన్ని కింద గమనించవచ్చు.

*'ఆయన ఈనాటి విమర్శకులు కావ్య కళా ప్రపంచమును శాసింప నుద్యమించుటకు బదులు కవి హృదయాన్ని గ్రహించి కృతి సౌందర్యంను వెల్లడించెడి రస వ్యాఖ్యాన మొనర్చుచున్నారని'*[11] చెప్తూ *'పాశ్చాత్య విమర్శకులు తమ విమర్శనలలో సామన్యంగా లలిత కళలన్నింటిని చేర్చుకొని సింహావలోకనంబున వీక్షించి ఒక దానితో ఒకటి పోల్చి వాని రస సౌందర్య విచారణము చేస్తున్నారని. ఈ విమర్శనలు రస వ్యాఖ్యానములై సమస్త శాస్త్రముల సారానుభావాలు చూపుతున్నాయాని, అంటూ ప్రకృతి అనుసరించి లలిత కళలు ఏర్పడినవి అన్నారు. కళా ప్రకృతుల నవలోకించి విమర్శక గద్య కావ్యములు ఉదయించవని చెప్పారు'.*[12]

పురాణం సూరిశాస్త్రి కళా స్వరూపముల ప్రాశస్త్యమును గూర్చి నిర్ధారణ జేయు వివేకాన్ని దాని ప్రకటించే వ్యాపారాన్ని విమర్శ పేర్కొంటూ[13] విమర్శ కవులను ప్రోత్సహించి కావ్య కల్పనకు పురికొల్పుచుండును. అని ప్రజా కళాసౌందర్యమును వెల్లడించి

---

[10] విమర్శక పారిజాతము 1925 పుట:viii

[11] విమర్శక పారిజాతము 1925 పుట:25

[12] విమర్శక పారిజాతము 1925 పుట:26, 27

[13] విమర్శక పారిజాతము 1925 పుట:29

కావ్యాదులందును కళోపాసకులందును ఆదరణాభిమనములను ఏర్పరచునని కళా విమర్శనోద్దేశ్యాన్ని ఫలితాన్ని తెలియజేశారు.

**4.1.4. కళా సాధనాలు**

పురాణం సూరిశాస్త్రి కళా సాధనాలుగా రంగులు, రాళ్లు, పదములు మొదలైన వాటిని పేర్కొన్నారు.[14]

**4.1.5. కళయొక్క పరమావధి**

పురాణం సూరిశాస్త్రి *'ప్రకృతి యొక్క జీవితార్థము పరమావధి, ప్రకృతి స్వభావ నిరూపణమే. అదే విధంగా కళ యొక్క పరమావధి కళా స్వరూప నిరూపణమే, సౌందర్య స్వభావ ప్రచురణమే. అని అగాధ భావ గాంభీర్యమునను అకుంఠిత భక్తి పారవశ్యమును కళోత్పత్తి కలుగుతున్నది కాబట్టి కళా రచనకు ఏ విధమైన సంకల్పములు, ప్రేరణ హేతువులు కానేరవు. ఆవేశవశమున ఉపాసకుడు కళా నిర్మాణ మొనర్చునే గాని యదార రమణీయ వస్తుకల్పన కుతుహలంబున సంకల్ప ప్రేరితుడై, సత్కళా స్వరూపాలను నిర్మింపలేదు.'*[15] అని పురాణం సూరిశాస్త్రి భావించారు.

పురాణం సూరిశాస్త్రి *''కళా రహస్య విచారణమందు కళాతత్వము, కళ యొక్క వుత్పత్తి, మనుష్యుని కళా కలన సంకల్పములు, కవి కావ్య సంబంధములు, కళల క్రియా క్రమములు, కళా స్రష్టల ప్రతిభా విశేషములు, కళా విభేదములు, వివిధ కళల పరిణామ వికాసములు జర్చింపబడుచున్నవి.''*[16] అని కళా రహస్యంలో జరిగే విధులను పేర్కొన్నారు.

**4.1.6. కళా సౌందర్యం**

పురాణం సూరిశాస్త్రి లౌకిక ఉపయోగవిహీనమై, విజ్ఞాన ప్రభోధముకన్న జ్ఞాన ప్రదీపనమే ముఖ్యాంగముగ నెంచి విభావన శక్తులను ఆధారపరచుకొని రచించిన గద్య పద్యాత్మకమైన వాఙ్మయం అంతా సారస్వత కళా సౌందర్య మెప్పుచున్నది అని స్వారస్వతం ఒక కళాస్వరూపముగా పేర్కొన్నారు.[17]

---

[14] విమర్శక పారిజాతము 1925 పుట:162

[15] విమర్శక పారిజాతము 1925 పుట:110

[16] విమర్శక పారిజాతము 1925 పుట:204

[17] విమర్శక పారిజాతము 1925 పుట:72

**4.1.7. సౌందర్యం**

పురాణం సూరిశాస్త్రి సౌందర్య మచ్చంపుభావము కాదు. సౌందర్యం ఒక పరశక్తి. ఇంద్రియాలకు ఎన్నడును దీని విశుద్ధ స్వభావం గోచరించదు. కాని కళా స్రష్టత యల్లమున అనంతమగు రూపములంది వానిలో వెలుంగుచు వ్యక్తమగుచుండును. ప్రపంచం ఎన్ని రీతుల నగుపడుచుండునో అంత విభిన్న గుణవికాస వైభవంతో సౌందర్య తత్త్వపు వ్యక్త మూర్తులు అగుపడుచుండును. అని తానేర్పరచుకొనిన పద్ధతులలో స్వతంత్రముగ జక్కగ జరించెడి ధర్మనియతి విషయ సౌందర్యమునకు కారణముగుచున్నది.

ఆత్మీయ గుణ ప్రకాశము వలన సౌందర్యం ఏర్పడుతుందని. ప్రకృతిలో గుణ స్సమృద్ధిని బట్టి సౌందర్యం ఏర్పడుతుందని. కళా సౌందర్యం బుద్ధి గ్రాహ్యమగు వాస్తవ విషయ సందర్భాలను అతిక్రమించి అతిశయించి అందరాకుండును అని మరోక వైపు సౌందర్య తత్త్వావతారాలైన విషయాలను ఆశ్రయించి వ్యక్తమగు చుండును. అనగా సౌందర్యము, గుణ సంజనితమై వస్తువుల బాహ్య స్వరుపమున కతీతమై ఉన్న, విషయంలోనే దీని వ్యక్త స్వభావం తెలుసుకోగలమని అభిప్రాయ పడ్డారు. [18]

ఈ సందర్భంలో సౌందర్యం గురించి ప్రాచీన భారతీయ అలంకారికుల అభిప్రాయాలను ఒకసారి పరిశీలించినట్లయితే. అందం గురించి అగస్టిన్ అభిప్రాయాలు ఈ కింది విధంగా ఉన్నాయి. *"One should distinguish between beauty and beautifulness as the cause embracing at once all beauty. For, having made this distinctions in all being between participation and things participating, we call beautiful the thing which participates in beautifulness, because from it is imparted to all reality the beauty appropriate to every thing, and also because it is the cause of proportion and brilliance."*[19]

---

[18] విమర్శక పారిజాతము 1925 పుట:108, 109

[19] Tatarkiewicz, W. (1970) Medieval Aesthetics, trans. R.M. Montgomery, The Hague: Mouton. Page:33

ప్లేటో అందాన్ని, దాన్ని ప్రభావాన్ని వివరిస్తూ తన సిపోజియంలో ఈ విధంగా వ్యాఖ్యానించాడు.

*"If someone got to see the Beautiful, absolute, pure, unmixed, not polluted by human flesh or colors or any other great nonsense of morality... only then will it become possible for him to give birth not to images of virtue (because he's in touch with no images) but to true virtue (because he is in touch with the true beauty). (Symposium 211e-212a)"*[20] అలాగే కవిత్వానికి స్ఫూర్తినిచ్చే అంశాలని, కవి ఆలోచనలకి వ్యక్తీరిస్తూ ప్లేటో *"The poets tell us that they gather songs at honey - flowing springs, from glades and gardens of the Muses, and that they bear songs to us as bees carry honey, flying like bees. And what they say is true. For a poet is an airy thing, winged and holy and he is not able to make poetry until he becomes inspired and goes out of his mind and his intellect is no longer with him (Ion 534a-b)"*[21] ఆర్థర్ డాంటో అభిప్రాయం ప్రకారం *"From the Perspective of philosophy art is a danger and aesthetics the agency for dealing with it"*[22] ఇతను ప్లేటోని నిర్ద్వందంగా అలంకారశాస్త్ర అభివృద్ధి కర్తగా పేర్కొన్నాడు.

*"to say "This object is beautiful for me" is laughable, while it makes perfect sense to say "It is pleasant to me"... not only as regards that taste of the tongue, the palate, and the throat, but for whatever*

[20] Berys Gaut and Dominci McIver Lopes. The Routledge companion to Aesthetics. 2nd edition P:9-10

[21] Berys Gaut and Dominci McIver Lopes. The Routledge companion to Aesthetics. 2nd edition P:11

[22] Danto, A. C. (1986) The Philospphical Disenfranchisement of Art, New York: Columbia University Press. P: 13

*is pleasant to anyone's eyes and ears."*[23] ఏ మనిషికైనా ఇంద్రియాలన్నింటికీ ఆనందాన్ని అందించేది అందమని చెబుతూ *"ఇది నా దృష్టిలో అందమైనది"* అనటం హాస్యాస్పదం దాని బదులు 'ఇది నాకు ఆనందాన్ని ఇస్తుంది' అనటం సరిగ్గా ఉంటుంది అని తెలిపాడు. అదే విధంగా అందాన్ని వర్ణిస్తూ *"bold, overhanging, and as it were threatening rocks; clouds, piled up in the sky, moving with lightning flashes and thunder peals; volcanoes in all their violence of destruction; hurricanes with their track of devastation; the boundless ocean in a state of tumult; the lofty waterfall of a mighty river, and such like."*[24] మబ్బులతో నిండిన ఆకాశం, రగులుతున్న అగ్ని పర్వతం, చెలరేగుతున్న సుడిగాలులు, ఉరుములు, మెరుపులు, సముద్రం పెద్ద నది యొక్క చిన్న చిన్న జలపాతాలు ఇలా అన్నింటినీ పేర్కొన్నాడు. అంటే కాంట్ సౌందర్యంలో సహజ సౌందర్యానికి పెద్ద పీట వేశాడు. తన *Critique of Judgment* లో సహజ సౌందర్యాన్ని వివరిస్తూ మొదటిలోనే *"Natural beauty... brings with it a purposiveness in its form by which the object seems to be, as it were, preadapted to our judgment, and thus constitutes in itself an object of satisfaction"*[25] అని చెప్పాడు. అంతేకాక ప్రకృతిని, కళని అనుసంధానిస్తూ ప్రకృతి కళ వలె అందమైనది, కళ ప్రకృతి వలె కనిపించినప్పుడు మాత్రమే దాన్ని మనం అందంగా భావించాలని అన్నాడు.

*"Nature is beautiful because if looks like art, and art can only be called beautiful if we are conscious of it as art while yet it looks like nature"*[26]

---

[23] Kant, I. (1951) Critique of Judgment, trans. J. H. Bernard, New York: Haffner. Page: $7

[24] Kant, I. (1951) Critique of Judgment, trans. J. H. Bernard, New York: Haffner. Page: $28

[25] Kant, I. (1951) Critique of Judgment, trans. J. H. Bernard, New York: Haffner. Page: $23

[26] Kant, I. (1951) Critique of Judgment, trans. J. H. Bernard, New York: Haffner. Page: 45

కాంట్ సిద్ధాంతంలో ప్రధానాంశాలు ఇవి

1. ఒకే సమయంలో అభిరుచి తర్కసహంగానూ, తర్కాతీతంగానూ ఉండడం.

2. ఊహల స్వేచ్ఛా సంచారాన్ని నొక్కి చెప్పడం.

3. సౌందర్యానుభవం భావనాతీతం గానూ, వర్ణ్య వస్తువు పట్ల అనాసక్తం గానూ ఉంటుందనడం.

4. సౌందర్యాసక్తికి కేంద్రమైన వస్తువు కళ కాదు ప్రకృతి మాత్రమే.

5. సౌందర్యానుభవం లోని నైతిక, ఆధ్యాత్మిక, చైతన్య వివరణ సహృదయునికి సృష్టిలో గర్భితమైన అలౌకికతా స్వభావాన్ని దర్శింపజేస్తుందనడం.[27]

అందం లేని పదార్థం అందమైన దానితో కలిస్తే అందంగా కనిపించడానికి ఆశ్రయం సౌందర్యమన్నాడు భామహుడు.[28]

పురాణం సూరిశాస్త్రి కావ్య సౌందర్యాన్ని గురించి చెబుతూ 'కావ్యములు వాఙ్మయ ప్రపంచంలో దేశ కాల విచక్షణలు లిక నక్షయ రసార్ణవములై సౌందర్యరాసులై విజ్ఞ ప్రపంచమంతటా పేరొంది గౌరవింపబడుతున్నాయని. వీనిలో అసలైన సౌందర్యం ఉన్నదన్నారు.[29]

### 4.1.8. సౌందర్య లక్షణాలు

పురాణం సూరిశాస్త్రి *'ప్రేక్షక మానసము నాకర్షించి, రస సౌందర్య పర్యాలోచన మందు నియమించి రసానందమును, ప్రీతిని,యనుభవింపజేయగల వస్తుగుణములకు సౌందర్య లక్షణములను (ఈస్థెటికు క్వాలిటీస్) పేరొప్పుచున్నది. సౌందర్య లక్షణములు కొద్దిగానో విస్తారముగనో యొప్పియున్న విషయములు రసగణ్యత(వాల్యూ)గలవిగ*

[27] విశ్వనాథ సౌందర్య దర్శనము: యు.ఎ. నరసింహ మూర్తి 2009 పుట:29

[28] నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:40

[29] విమర్శక పారిజాతము 1925 పుట:149, 150

*దలపబడును. సౌందర్యము యొక్క నిత్య ఖండ స్వరూపమును మనుభవింపనేరము అనగా సౌందర్య లక్షణముల సమష్టి స్వరూపమును, యేక దేశ ప్రభా పరిపేర్ణతను నరులు జూడనేరరు. మన మందమైనవని మన్నించు విషయములతో కొన్ని సౌందర్య లక్షణములు మాత్రమే వ్యక్తమగుచుండును. ఇందుచేత వస్తు సౌందర్యమును అనుషంగిక పరీక్షచే మాత్రమే తెలిసికొనగలుగుచున్నాము.''*[30] అని సౌందర్య లక్షణాలను గురించి వివరంగా పేర్కొన్నారు. పురాణం సూరిశాస్త్రి 'రసికుడు కవి ప్రకృతి నవలోకించియే తన సౌందర్య లక్షణాలను నేర్పరచుకొనును'[31] అంటూ కళా స్వరూపముల విలువ రసజ్ఞుల రసానుభవంతో, సౌందర్య లక్షణములతో, ఇవి ఏకీభవించి సాదృశ్య మొందినంతలో ఉన్నది.[32] దీనికోసం ఇతను కొన్ని ఖచ్చితమైన విషయాలకి అరిస్టాటిల్ భావాలని స్వీకరించాడు. *"Beauty demands the fulfillment of three conditions: the first is integrity, of perfection, of the thing, for what is defective is, in consequence, ugly; the second is proper proportion, or harmony; and the third is clarity – thus things which have glowing color are said to be beautiful. (Aquinas 1942)"*[33]

వామనాచార్యుడు మొదట *'కావ్యం గ్రాహ్యమలంకారాత్, సౌందర్య మలంకారః సదోష గుణాలంకార హానాదానాభ్యామ్'* అనే సూత్రాల ద్వారా సౌందర్యమే కావ్యోపాదేయతకు మూలమని *'ఆ సౌందర్యం సాధించడానికి సాధనాలు – ప్రయోజకాలు – దోషాలు విడిచి గుణాలంకారాలు పరిగ్రహించడం'* అని సూక్ష్మంగా ప్రతిపాదించాడు. ఇక్కడ సౌందర్య శబ్దాన్ని విస్తృతమైన పరిధిలో అర్థం చేసుకోవలసి ఉంది.

అందం లేని పదార్థం అందమైన దానితో కలిస్తే అందంగా కనిపించడానికి ఆశ్రయం సౌందర్యమన్నాడు భామహుడు.[34] భామహుడు తత్త్వశాస్త్ర మేధావి. ముఖ్యంగా దిన్నగుని బౌద్ధ

---

[30] విమర్శక పారిజాతము 1925 పుట:245, 246

[31] విమర్శక పారిజాతము 1925 పుట:252

[32] విమర్శక పారిజాతము 1925 పుట:253

[33] Berys Gaut and Dominci McIver Lopes. The Routledge companion to Aesthetics. 2nd edition P:36–37

[34] నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:40

తత్త్వం. (క్రీ.శ. 500). ఈయన కూడా మన దేశంలోని అనేక ఇతర రచయితల లాగానే చాలా కాలం వెలుగుకి నోచుకోలేక పోయారు. ఈయన పాణిని అతని వ్యాకరణ విశ్లేషణకి ఆరాధకుడు. ఈయన అన్ని విధాలుగా దండికి పూర్వికుడు, దండి చాలాసార్లు భామహుడి అభిప్రాయాలని పునరుక్తించాడు. ఈయన బౌద్ధుడైనప్పటికీ ఈయనకి హిందూ పురాణాల మీద మంచి పట్టు ఉంది. ఈయన కావ్య వివరణలు, ఈయన మీద తరువాత జరిగిన విశ్లేషణలు ఉదాహరణకి ఉద్భటుని రచన 'భామహ వివరణ'లు నేడు అందుబాటులో లేవు. ఈయన కవిత్వపు ముఖ్య అంశాల విశ్లేషణలను అందరూ అంగీకరించారు. ఆనంద వర్ధనంలో కూడా భామహుడి విశ్లేషణల ప్రస్తావన ఉంది.

అభినవగుప్తుడు మరియు మమ్మటుని ఈయనకి సంస్కృత కవిత్వ శాస్త్రపు అలంకార 'ప్రస్థాన లేదా అలంకార శాస్త్ర పితామహునిగా అభివర్ణిస్తారు. భామహుడు కావ్యం లేదా కవిత్వంలో అలంకార లేదా సౌందర్య భావనలకి సంబంధించి నియమాలని రూపొందించాడు. ఈయన ఉద్దేశ్యం ప్రకారం మంచి కవిత్వం కళ మరియు జీవితంలో సంతోషం, పేరుతో పాటు మంచి విలువలని అందిస్తుంది.

సంస్కృత కవిత్వ శాస్త్రంలో మొట్ట మొదటిసారిగా భామహుడు కవిత్వపు 'ప్రతిభ'ని వెలికితీశాడు. ఇది కవిత్వాన్ని, శాస్త్రీయ రచన నుండి వేరు చేస్తుంది. ఒక మంద బుద్ధి కలవాడు కూడా ఆచార్యుని పర్యవేక్షణలో శాస్త్రాన్ని నేర్చుకోవచ్చు కానీ కవిత్వాన్ని కాదు. ఈయన ముఖ్యంగా కవికి, కవిత్వానికి ఉండవలసిన లక్షణాలని అది ఏ విధంగా శాస్త్రీయ రచనకి భిన్నంగా ఉంటుదన్న దాని మీద విశిష్ట పరిశోధన చేసి సూత్రీకరించాడు.

సౌందర్యశాస్త్ర పరిశోధకునిగా మనకి ఆసక్తి కలిగించే అంశం భామహుడి 'అలంకార' సిద్ధాంతం. భామహుడు రెండు రకాల సౌందర్యాన్ని గుర్తించాడు. అవి సహజ సౌందర్యం, కవిత్వ సౌందర్యం. ఒక అందమైన అమ్మాయి నగలు, రక రకాల అలంకరణలతో ఏ విధంగా మరింత అందంగా శోభిస్తుందో అదే విధంగా కవిత్వం రక రకాల పద ప్రయోగాలతో, అలంకారాలతో, సంధులతో, ఛందస్సుతో శోభిస్తుందని ఈయన భావన. ఒక చిన్న కవిత నుండి మహా కావ్యం వరకూ సౌందర్య నియమమైన 'వక్రోక్తి' (Artful expression) లేకుండా శోభించదని ఈయన భావన.

#### 4.1.9. రస సౌందర్యం

పురాణం సూరిశాస్త్రి *"రమ్య విషయానుభూతిలో, రస సౌందర్యమును జింతించునపుడు శరీరాంగములు నిశ్చలమై, మానస ప్రవృత్తు లన్యధా వ్యభిచరించ కుండును."* [35] అని రస సౌందర్యం యొక్క ఆవశ్యకతను, ఇంద్రియానుభవాల ప్రతిస్పందనను తెలిపారు. దీని గురించి భరతుని మాటలలోనే చెప్పాలంటే *"There is no rasa with out bhava; nor any bhava with out rasa. In staging, success depends on their mutual involvement (VI.36). When a subject or bhava finds a ready echo in the spectator it is transformed into rasa then and there. His whole body will be on fire with it as dry fuel caught by tire (VII.7)"*[36] సౌందర్యం అంటే ఏమిటి? సౌందర్య సిద్ధికి మూల కారణాలను వివరించడానికి ప్రాచీన భారతీయులు ప్రగాఢము, సుదీర్ఘము అయిన తత్త్వ విచారాన్ని కొనసాగించారు. వారి సౌందర్య తత్త్వ నిరూపణలో వేల సంవత్సరాలుగా ఒక అనుస్యూతము, క్రమ బద్ధమూ అయిన పరిణతి కనిపిస్తుంది. *"ఏక సత్ విప్రాః బహుధా వదంతి"* అన్న న్యాయాన్ననుసరించి ఈ సౌందర్య తత్త్వ గవేషణ బహుముఖంగా కొనసాగినా ఒకే చరమ లక్ష్యాన్ని ఎంచుకొన్నది. కావ్యానికి ఆత్మ ఏది? అన్న మీమాంసకు పూనుకొన్న వామనుడు. దండి, భామహుడు గుణాలంకార రీతి సంప్రదాయాలను ప్రవర్తింపజేసి ప్రధానంగా కావ్యగత బహిరంగ సౌందర్య నిరూపణ పరమైన తత్త్వాన్వేషణను కొనసాగించారు. ధ్వని, వక్రోక్తి, ఔచిత్య సంప్రదాయ ప్రవర్తకులైన ఆనందవర్ధనుడు, కుంతకుడు, క్షేమేంద్రుడు కావ్యగతమైన బహిరంగ సౌందర్యమంతా తాదాత్మికగతమైన అంతరంగ సౌందర్య ప్రకాశన ప్రధానమైన లక్ష్యంతో ఉండదగినదని నిరూపించారు.[37]

*"There is no rasa with out bhava; nor any bhava with out rasa. In staging, success depends on their mutual involvement (VI.36).*

---

[35] విమర్శక పారిజాతము 1925 పుట:208

[36] . cultural leaders of India Aestheticians P.No. 6

[37] నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:18

*When a subject or bhava finds a ready echo in the spectator it is transformed into rasa then and there. His whole body will be on fire with it as dry fuel caught by tire (VII.7)"*[38]

రసం ఏక వచనంలో 'సౌందర్యానందానికి' ప్రతీక అయితే, రసాలు బహు వచనంలో భరతుని రచనలో స్థాయి భావాలనూ సూచిస్తాయి. ఇవి ఎనిమిది రకాలుగా వర్గీకరించబడ్డాయి. అవి రతి లేదా ప్రేమ, ఉత్సాహ లేదా కథా నాయక శక్తి మొదలగున్నవి. మిగతావి శృంగార, వీర రసాల వంటివి. ఇందులో గమనించవలసిన ముఖ్య విషయం భరతుని ప్రకారం భాధాకర, విషాద భావనలు, వికారాలు కూడా రసాలే. ఇవి సౌందర్యశాస్త్ర విషయ లేదా పరిస్థితికి సంయుక్తంగా ఉండి భావాలని పలికించడమే కాక రకరకాల మానసిక స్థితులని తెలుపుతాయి. ఇవి స్థాయి భావాలు, 33 గా వర్గీకరించబడిన వ్యభిచారి భావాలు, విభావాలు, అనుభవాలు మొదలైనవి.

ఒక నాటక విజయానికి వివిధ రకాల రసాల సమపాళ్ళ ప్రయోగమే కారణమని చెప్పిన సిద్ధాంతం భరతుడి నాటక విమర్శకి తార్కాణం. ఆయన ఈ విధంగా తెలిపాడు. *"When, in the midst of diversity of psychic states, all transfigured by the imagination, there is are master – passion untying all of them like a thread; that is to be regarded as the ruling sentiment of a work of art, the rest are but momentary"*[39]

#### 4.1.10. రస సౌందర్యం మానస వ్యాపారం

*"రమ్య విషయం లీప్సితార్థములయ్యును వానిని జింతించునపుడు రస సౌందర్యముల ధ్యానించునపుడును మానసమున కెవ్విధమగు స్వార్థభావావేశము కలుగనేరదు. అనగా రసానుభవము నిస్సంగ మానసయోగమని యోరుంగునది. సామాన్య లౌకిక వ్యవహారములలో ననుభూతమగు విరోధములు, ఆపేక్షలు, ఆదుర్దా, ఆశాభంగము, నిర్వేదము మున్నగు కష్ట*

---

[38] . cultural leaders of India Aestheticians P.No. 6

[39] . cultural leaders of India Aestheticians P.No.7

*స్థితులు సౌందర్య పర్యాలోచన మందేర్పడవు. ఇంద్రియములు స్వార్ధ మపేక్షించుచుండ, చిత్తము పరమార్థ మన్వేషించుచుండును. రసానుభూతిలో చిత్తేంద్రియములు రెండును విశుద్ధమగు, సాధువగు, నిస్సంగమగు వ్యాపారమున నేకీభవించి పనిసేయుచు, వ్యభిచరించని సూటి చూపులో వస్తు సౌందర్యమును జింతించి, యానందించు చుండును.*

*సౌందర్య విచారణ మొనర్చెడి మానసము ప్రయోజనమును, ప్రకృతిపయోగమును, అభిలషింపకయే, వస్తువ నాదరించు చుండును. మనకెట్టి సన్నిహితోపకారమును జేయని మహనీయుల గౌరవించు ప్రవృత్తి వారి గుణ సౌందర్యమును చింతించు రసానుభూతి వలననే గలుగునున్నది. అనగా భక్తి, పూజ్య భావము, రమ్య విషయములందు ప్రీతియు, గుణరూప సౌందర్యములను నిస్సంగముగ జింతించు మానస వ్యాపారముల వలననే గలుగుచున్నవి. రసయోగమందు కామాభిమానాములు చిత్తముచే సంస్కరింపబడుచున్నవి. చిత్తము కామము, చేరి రసయోగ మేర్పడుచున్నవి. వస్తు సౌందర్యమును జింతించుట వలన మనకెట్టి లౌకిక ఫలములు సిద్ధింపవు.''*[40] పురాణం సూరిశాస్త్రి తమ అభిప్రాయాలను తెలిపారు.

**4.1.11. రస సౌందర్యానుభవంలో ఇంద్రియాల పాత్ర**

పురాణం సూరిశాస్త్రి రససౌందర్యాలను అనుభవించటానికి నేత్ర శ్రవణేద్రియాలు ఆధారపడుతున్నాయని. వాటి ఆవశ్యకతను తెలుపుతూ ఇవి దూరము నుండి విషయంను గ్రహింపగలవు. ముక్కు, నాలుక, చర్మము, దగ్గర ఉన్న వస్తువుల మంచి చెడ్డలనే గ్రహింపగలవు. త్వగింద్రియమునకు వస్తు స్పర్శ యావశ్యకము. మన దేహమును దాకెడి వస్తువులు అపాయకరములగునో కాదో చర్మము విచారిస్తుంది కాని యీ ఇంద్రియం ఆ సంగతి తెలిసికొనునప్పటికి వసువ సన్నిహితమై ఉంటుంది. ప్రమాద కరమైనదైతే ఈ అనుభవ మయిష్టముగా ఉంటుంది. ముక్కు, నోరు కేవలం శారీరక వాంచలను తేర్చు భోజ్యపదార్థముల జింతించుచుండును. వీటికి వస్తు సాన్నిధ్యం అవసరం. ఈ మూడిటిని జేరెడి విషయంలో కొన్ని ప్రమాదజనకములు, అనిష్టములుగా ఉంటాయి. అందువల్ల లెస్సగా పరిక్షించిగాని వస్తువుని ఈ మూడు యింద్రియాల చెంత చేరనీయం. చక్షుశ్శ్రోత్రిందియములు దూరం నుండి విషయంను

---

[40] విమర్శక పారిజాతము 1925 పుట:238, 239

గ్రహించగలవు. కాబట్టి ఎట్టి భయం లేకుండా అగ్ని పర్వతముల భీకర విస్ఫోటన, విలయ సౌందర్యం అవలోకించి, భీకర జలపాత నిర్ఘోష మాకర్ణించి, సంతసింపగలుగుతున్నాము.

కళ్లకు, చెవులకు, గోచరించెడి వస్తువులు భీతిజనకములు కావు శాంత చిత్తులమై వాని స్వభావమున అనుభవించగలం. నేత్రేంద్రియంను విషయచ్ఛాయలే జేరగలవు గాని విషయములు తాకనేరవు. అందుచేత, పంచజ్ఞానేంద్రియాలలో కన్ను, చెవి మాత్రమే దూరము నుండి నిస్సంగముగ వస్తువును పరిశీలించగలవు. నిస్సంగావలోకనాత్మకమగు రస సమాధికిని, రసానుభవమునకును, సౌందర్య పర్యాలోచనమునకును, చక్షుశ్రోత్రేంద్రియాలు ఆదాదమగుచున్నవి. ఇంతే కాకుండా వీటి సహాయంతో ఎందరైనను ఒకే పర్యాయం దృశ్యశ్రావ్య విషయాలను అవలోకింపగలరు. అందుచే నయన శ్రవణేంద్రియములు రసానుభవరూపమగు పరమోత్తమవిషయానుభూతికి సాధనములగుటయే గాక సంఘీభావమున మానవులందరును నిర్విరోధముగ ననుభవింపగల విషయానుభవంను కూడ కారణమలగుచున్నవి.[41] అని రస సౌందర్యం అనుభవించటంలో ఇంద్రియాల యొక్క ప్రాముఖ్యాన్ని అవి చేసే పనులను వివరంగా తెలియజేశారు. పురాణం సూరిశాస్త్రి రమ్య విషయాలన్నింటిలో మూడు గుణాలు మాత్రమే కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. అవి.

1) రూప సౌందర్యం, 2) ప్రేక్షకుల యింద్రియములను పులకరించెడి విషయాత్మక సౌందర్యము (సెన్షియస్‌బ్యూటీ), 3) భావార్ధముల వలనను, జీవ సంచలనము వలనను స్ఫురించెడి సౌందర్యము అని మూడు గణాలను పేర్కొంటునే ఈ మూడింటిని ఒక సూత్రాన ప్రతిపాదించలేమని ఈ మూడు చేరి వస్తువుల ఉత్కృష్టతను సర్వాంగ పరిణతిని యేర్పరచు చున్నవని చెప్పారు.[42]

రస సౌందర్య రహస్యాలని తెలుసుకోవడానికి పరిశీలించవలసిన అంశాలను పురాణం సూరిశాస్త్రి ఈ కింది విధంగా పేర్కొన్నారు. 1) లోకమాన్యమైన రమ్య విషయాలను అందలి రమణీయ అంశాలను చక్కగా పరిశీలించాలి. 2) ప్రకృతిలోని రసవంతమైన సందర్భాలను,

---

41 విమర్శక పారిజాతము 1925 పుట:248, 249

42 విమర్శక పారిజాతము 1925 పుట:244, 245

రమ్య దృశ్యములను, ప్రధాన మాతృకాలుగా గౌరవించి పరీక్షించాలి. 3) ప్రసిద్ధ శిల్పాదులను చూడాలి. 4) విఖ్యాత రసజ్ఞుల రసానుభవాలను తెలిపే విమర్శక రాజములను చదవవలెను. మొదలైన అంశాలను పేర్కొంటూ రసానుభవం కళోత్పత్తికి పూర్వమేర్పడుటయేగాక కారణం కూడ నగుచున్నదని. మానవ విజ్ఞాన అభివృద్ధి అయిన కొలది మానవ స్వరూపమునందే గాక చేతనాచేతనమగు సర్వ ప్రపంచమందును సౌందర్యం అవలోకించి ఆనందిచెడి ప్రవృత్తి వికసించెను.[43]

ఒక నాటక విజయానికి వివిధ రకాల రసాల సమపాళ్ళ ప్రయోగమే కారణమని చెప్పిన సిద్ధాంతం భరతుడి నాటక విమర్శకి తార్కాణం. ఆయన ఈ విధంగా తెలిపాడు. *"When, in the midst of diversity of psychic states, all transfigured by the imagination, there is are master – passion untying all of them like a thread; that is to be regarded as the ruling sentiment of a work of art, the res rest are but momentary"*[44]

**4.1.12. సౌందర్యం ప్రేక్షకపక్షం**

పురాణం సూరిశాస్త్రి సౌందర్యాన్ని ప్రేక్షకపక్షంగా చెబుతూ *"రసము, సౌందర్యము, వస్తువులందు లేవు. ప్రేక్షకుని యందేయున్నవి. నిసర్గమైన బుద్ధి నుపయోగించుచు, నిరహంకారమైన చిత్తముతో జూచువారికి, రమ్య విషయముల పట్ల రుచి భేదముండదు. రుచి భేదములన్నియు మన ప్రకృతాభ్యాసముల వలనను, ఆచారముల వలనను, అహంకారమువలనను, శాస్త్ర జన్య జ్ఞానమువలనను, అభిమానము వలనను, గలుగుచున్నవి."*[45] అని పురాణం సూరిశాస్త్రి రసాన్ని, సౌందర్యాన్ని వస్తుగతం కాకుండా ప్రేక్షక పక్ష అధ్యయనం చేశారు.

---

[43] విమర్శక పారిజాతము 1925 పుట:251

[44] . cultural leaders of India Aestheticians P.No.7

[45] విమర్శక పారిజాతము 1925 పుట:265

**4.1.13. పురాణం సూరిశాస్త్రినాటక కళా విమర్శ**

తెలుగు సాహిత్య విమర్శకులలో పాశ్చాత్య భావాలను అనుసరించి విమర్శ చేసిన తొలితరం విమర్శకుడు పురాణం సూరిశాస్త్రి . పురాణం సూరిశాస్త్రివిమర్శ అంతా కళను ఆశ్రయించుకునే కొనసాగింది. లలిత కళలోని నాట్యం, కవిత్వం, అక్కడక్కడ చిత్ర కళల గురించి వారి అభిప్రాయాలు కనిపిస్తున్నాయి. నాట్యాంబుజము(1923), నాట్యోత్పలము (1924), విమర్శక పారిజాతము (1925), నాట్య అశోకము(1925-1927) గ్రంథాలలో నాటకాన్ని ఆధారంగా చేసుకొని అత్యధిక శాతం ఆయన విమర్శ కొనసాగింది. అలాగే 'విమర్శక పారిజాతము'లో కూడా నాటకానికి సంబంధించిన కొన్ని భావాలు కనిపించినా సాహిత్య మంతటికీ అన్వయించే భావాలు కనిపిస్తున్నాయి. విమర్శక పారిజాతము ఆయన 'కళా దృక్పథాన్ని' స్పష్టపరిచే ముఖ్యమైన రచన.

పురాణం సూరిశాస్త్రి 'నాట్యం' అని వారి రచనలలో పేర్కొన్నప్పటికి లలిత కళల్లో ఒకటైన నాటకం గురించే వివరించే ప్రయత్నం చేశారు. నాట్యం నటుల అభినయం కనుక వారి ప్రతి రచనకీ 'నాట్య' అనే విశేషం రచనకు ముందు పెట్టడం వల్ల కేవలం నాట్యాన్ని మాత్రమే దృష్టిలో పెట్టుకొని ఆయన విమర్శ కొనసాగిందని అనుకోవడానికి అవకాశము ఉంది. కానీ అలా జరగలేదు. లలిత కళలకు సంబంధించిన అనేక విషయాలు ఉన్నాయి. భరతుని నాట్య శాస్త్రాన్ని ఆధారం చేసుకొనే చాలా వరకూ తన నాటక విమర్శను కొనసాగించారు.

**4.1.14. నాటక కళా విమర్శ దృక్పథం**

పురాణం సూరిశాస్త్రి ప్రాచ్య పాశ్చాత్య నాటకాలను అనేకం చదివారు.అనేక నాటకాలను చూశారు. అనేక నాటక పోటీలను నిర్వహించారు. ఈ అనుభవ జ్ఞానం ఆయన విమర్శ నిండా కనిపిస్తుంది. ఆ అనుభవ జ్ఞానంతో స్వీయ ప్రమాణాలను ఏర్పరిచే ప్రయత్నం చేశారు.

**4.1.15. అనుభవజ్ఞాన ప్రమాణం**

పురాణం సూరిశాస్త్రి విశేషమైన ఆత్మాభిమానం కలవారు. పూర్వజన్మ సుకృతం వలన జ్ఞానం లభిస్తుందని నమ్మేవ్యక్తి. తన రచనలన్నింటికి ఈ లోకంలో సంపాదించిన జ్ఞానం కంటే

పూర్వజన్మ సంస్కారమే మూలమని నమ్ముతారు. *'నాట్యోత్పలము'* (1924) ముందుమాటలో ఆయనే ఈ కింది విధంగా చెప్పుకున్నారు.

*''కవులు విమృర్శకులు, శాస్త్ర పరిశోధకులు స్వకీయ ప్రతిభా విలాసముననే మెప్పొందగలుగుదురు గాని యితరుల రచనలాధారపరుచుకొని యద్గంథముల రచింపనేరరు. నాకు నేనే ప్రమాణము, నాయింద్రియములు చూడగలిగిన విషయములే నా ప్రపంచము. నా మానసమున కవబోధమగు భావము లెవరివైనను నా పట్ల నుపయోగించు భావ జగత్తు''* [46] అని ఇంద్రియాను భవాన్ని ఒక ప్రమాణంగా భావించారు. దీన్ని జన్మాంతర సంస్కారంగా భావిస్తూ ఇలా అన్నారు.

*''నేననుభవించునదే రసము. నాయంతరాత్మ తెలుసుకొనగలిగినదే భగవత్స్వరూపము. అందుచేత నే నెన్ని పుస్తకముల జదివినను యెందరి గురు పాదమును గొలిచినను కుల క్రమాగతమగు నింద్రియ వికాస మేవరకు నాకేర్పడినదో జననాంతర వాసనా ఫలితంగ నెట్టి మానసాధ్యాత్మిక వికాసము నాయందగుపడునో అందుకు తగిన విజ్ఞానమే, సంస్కారమే, భావములే కరుణా ప్రవృత్తులే నను జేరగలవు. నా వలన వెలువడ గలవు. ఈ జన్మములో నేను విద్యాభ్యాసమునకుపయోగించిన ముప్పది సంవత్సరముల భూరికాలావశములో నిక్కముగ రెండు సంవత్సరముల భూరికాలా వశములో నిక్కముగ రెండు సంవత్సరముల కాలమే విజ్ఞాన సంపాదన కూపయోగపడి యుండును. ఇంతటి యల్పకృషి నా విజ్ఞాన మహాత్వమునకు కారణము కానేరాదు. 'బహుని మే వ్యతీతానిజన్మాని' వందల కొలది జననాంతరములలో నేననుభవించిన రసభావ పరం పరలు నా వంశమదనేక తరములలో బరిణమించి నన్ను జేరిన యింద్రియ వికాసము నా విజ్ఞానమున కాధారమగునే కాని యిహ మందు సంపాదించిన రెండు సంవత్సరముల విజ్ఞానము, నా మానసతత్వ మేర్పరచ జాలదు. మరియు నిప్పటి కృషికి గూడ ప్రాక్తన సంస్కారమే యధారమగుచు, నది తెరచిన దారులనే యది యవకాశ మిచ్చెడి పరిమాణముననే ప్రకృతి నవలోకించి గాని గ్రంథముల పఠించి గాని విజ్ఞాన సంపాదన మొనర్ప గలుగుచున్నాను.''* [47] అని అన్నారు.

---

[46] నాటోత్పలము 1927 పుట: అఆ

[47] నాటోత్పలము 1927 పుట: అఆ,అఆఆ

### 4.1.16. లోకానుభవజ్ఞాన ప్రమాణం

అందుచే రసానుభవమునకు, లోకానుభవమునకు, భావ ప్రదీపమునకు నాకు నేనే ప్రమాణము. నా రచనలకు సంబంధించినంత వరకు నేనే సృష్టిలోని పరమాధికారిని, సర్వద్రష్టను, కూట స్థానమును, నా రచనలు నా మనసతత్త్వమును నాస్వకీయానుభవములను, వెలిబుచ్చు నంతవరకేరు చింపగలవు, యుపయోగింపగలవు, అందగింపగలవు, దారి ద్రొక్కెడి ప్రతిభా ప్రభావమున రాజిల్లగలవు, కాని నా ప్రకటనలు యెంతవరకు లోకానుభవముతో నేకభవించునో అంతవరకే యాదరింపబడును. [48]

దీన్ని బట్టి వీరి కళా విమర్శకు అనుభవ జ్ఞానమే ప్రధానమైన ప్రమాణమని స్పష్టమవుతుంది. ఆ ప్రమాణాన్ని ఇతరులు అంగీకరించినా అంగీకరించక పోయినా ఆయన లెక్క చెయ్యరు. బహుశా ఇలాంటి అహంకారపూరిత ప్రకటనలు ఉండటం వల్లనేమో 20వల శతాబ్దం తొలిపాదంలోనే పాచ్య`పాశ్చాత్య విమర్శను ఆధారంగా చేసుకొని సూరిశాస్త్రి రచనలు చేసినా అవి తర్వాతి విమర్శకులపై పెద్దగా చూపలేకపోయాయి. విమర్శక పారిజాతములో (1925) కూడ ఇంచుమించు ఇలాంటి అభిప్రాయమే ఆయన ముందుమాటలో చెప్పుకున్నారు. *'తెల్లని కాగితం వలె ఉండె నిర్మలమైన చిత్తవృత్తితో రమ్యమైన విషయాలను అవలోకించి వాటిని తనలోక అనుభవంతోను జతపరిచి చూస్తే చక్కటి విమర్శ వైఖరి ఏర్పడుతుంది.'* [49] అని అన్నారు. ఈ అభిప్రాయాలన్నింటిని బట్టి వీరి కళావిమర్శ దృక్పథంలో ప్రధానమైనది అనుభవజ్ఞానం అని స్పష్టమవుతుంది.

పురాణం సూరిశాస్త్రి 'నాటకం' గురించి ఆయన వివిధ అంశాలను ప్రకటించారు.

### 4.1.17. నాటక బహిస్స్వరూపం

భరతుడు నాట్యశాస్త్రంలో నాటకం యొక్క బహిస్స్వరూపాన్ని చాలా వరకు వివరించారు. అయినప్పటికీ పాశ్చాత్యులు కూడా కొన్ని లక్షణాలు చెప్పారు. ఈ అంశాల పట్ల పురాణం సూరిశాస్త్రి కొంత వివేచన చేశారు. ప్రత్యక్షంగా నాటకాలని, నాటక పోటీలను

---

[48] నాట్యోత్పలము 1924 పుట: ఱఱఱ

[49] విమర్శక పారిజాతము:1925 పుట:ఱఞ

నిర్వహించేటప్పుడు ఎదురైన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని నాటక బహి స్వరూపంలో రావలసిన మార్పులను చర్చించారు.

1) వీరు నాటక రంగం తొలిదశ నుండి అది పాశ్చాత్య దేశాలలో ఏ విధంగా అభివృద్ధి చెందిదో ఎంత ఆధునికత సంతరించుకుందో తెలియజేస్తునే పాశ్చాత్య దేశాలలో నాటక రంగ స్థలాలను వర్ణించారు.

2) వీరు పాశ్చాత్య నాటక రంగాన్ని పరిచయం చేస్తూ పాశ్చాత్యులు ఇతర భాషా నాటకాల్లోని కళా స్వరూపాలను, సారస్వత రూపాలను స్వీకరించి వాటిని తమ భాషలలోకి అనువదించి ప్రదర్శించి వారి నాటకాన్ని అభివృద్ధి పరుచుకుంటారని అన్నారు. మన వాళ్ళు కూడ *"గర్వాభిమాన దురహంకారములు వదలి కనువిచ్చి విజ్ఞాన ప్రపంచమును చూచి మన యనుభవముల విస్తరించి మానవ జాతి యొక్క అనుభవ సమిష్టిని మన జాతీయ ప్రభోదముతో జత పరిచి సమన్వయము చేసి యణుక్షణము గతించిన మానవానుభవమును ఒక కంటితో చూచుచు మరియొక కంటిని నవ్యాదర్శములపై నిలిపి కళాజీవనము సలుపుచు లక్షణ శృంఖములలో చిక్కి కొనక గర్వభిమానత మిస్రమున గ్రుడ్డి వోవక నిరంతర భావ సంచలనమున నవ్య కళా స్వరూపముల బ్రయోగించి చూచుచు స్వతంత్రించి నడచిన గాని మన నాట్యకళ యభివృద్ధి నొందనేరదు."*[50] అని పేర్కొన్నారు.

అదే నాటకాల గురించి ప్రాచ్య, భారతీయ అలంకారికుల అభిప్రాయాలలో ముఖ్యమైనవి.

*"With a few rare exceptions it is able to corrupt even decent people (Republic 605c)"*[51] మంచి కవి జీవితంలోని మంచిని తన కవిత్వంలో చూపించటం ద్వారా ప్రజలు మంచి వైపు ఆకర్షితులవుతారని మంచి కవిత్వం ప్రభావాలని గురించి తెలుపుతూ

---

[50] నాట్యోత్పలము: 1927 పుట:140

[51] Berys Gaut and Dominci McIver Lopes. The Routledge companion to Aesthetics. 2nd edition P:6

*"One of the heroes sorrowing and making a long lamenting speech or singing and beating his breast.... we enjoy it, give ourselves up to following it, sympathize with the hero, take his sufferings seriously, and praise as a good poet the one who affects us most in this way (Republic 605c)"*[52]

*"Only a few are able to figure out that enjoyment of other people's sufferings is necessarily transferred to our own and that the pitying part, if it is nourished and strengthened on the sufferings of others, won't be easily held in check when we ourselves suffer. (Republic 606b)"*[53]

నాటక కళని మానవ దేహ ఉత్పత్తిగా భావిస్తూ అభినవగుప్తుడు సంధ్యాగాలనబడే అరవై నాలుగు ఉప విభాగాలుగా విభజించబడిన కార్యావస్థలు, అర్థ ప్రకృతాలుగా వర్ణించాడు. రసాన్ని ఆత్మగా భావిస్తూ నాటక కర్త వీటిలో ఎన్నింటినైనా ఉపయోగించవచ్చని ఇతను తెలిపాడు. రసాన్ని విషయకంగా కలిగి సందర్భం విభవ, అనుభవ, వ్యభిచారభావ, స్థాయి భావాలను అనుబంధాలుగా కలిగి ఉంటుంది. వీటిని అభినవగుప్తుడు భిన్న స్థాయిలలో భావం, కల్పన, భావన మొదలైన దశలలో వివరించాడు. ఇతని విశ్లేషణ భావ స్థాయి నుండి మొదలవుతుంది.

పురాణం సూరిశాస్త్రి నాట్యకళ అభివృద్ధి చెందడానికి రెండు ప్రధానమైన మార్గాలను సూచించారు. 1) గర్వభిమానాన్ని వదలాలి.2) పాశ్చాత్య విజ్ఞానాన్ని అవగాహన చేసుకొని స్వీయ ప్రతిభతో స్వతంత్ర కళా మార్గాన్ని ఏర్పరచాలి.3) నాటక శాలలలో రంగస్థలం, సభాంగణము, నడవలు, విశ్రమించు గదులు, ఉపాహారముల విక్రయ స్థలాలు మొదలైనవి

[52] Berys Gaut and Dominci McIver Lopes. The Routledge companion to Aesthetics. 2nd edition P:6

[53] Berys Gaut and Dominci McIver Lopes. The Routledge companion to Aesthetics. 2nd edition P:7

ప్రధాన అంశాలై ఉన్నాయని పేర్కొన్నారు. ఆయన వీటినన్నింటి యొక్క బాహిస్వరూపాన్ని వివరించి చెప్పారు.

#### 4.1.18. నాటక పరికరాలు

పురాణం సూరిశాస్త్రి స్వయంగా ఎన్నో నాటకాలను చూసిన అనుభవంతో వారు నాటకంలోని బహిస్వరూపాలైన నాటక పరికరాల గురించి, నాటక రంగం గురించి, దుస్తులు గురించి, రంగస్థలాన్ని గురించి చర్చిస్తూ వాటిలో జరగవలసిన మార్పులతో పాటు సమస్యలను కూడా చర్చించారు.

1) ఆంధ్ర దేశంలో నాటకాలు కేవలం ప్రధాన నగరాలలో మాత్రమే వ్యాపారంగా లాభాన్ని తెచ్చి పెడుతున్నాయి. అందువల్ల పెద్ల నాటక సమాజాలు కాని చెన్న నాటక సమాజాలు కాని, ఇతర రాష్ట్రాల నాటక పద్ధతులను, రంగ పరికరాలను, రంగ స్థలాలను, దుస్తులను అనుసరించి నష్టపడుతున్నారని[54] వివరించారు. దీనిలో ఆయనకున్న నాటకానుభవ జ్ఞానం వ్యక్తమవుతుంది.

2) నాటక సమాజాల నష్టాల్లో కూరుకుపోవడానికి వారు రంగపరికరాల మీద పెట్టే పెట్టుబడే కారణమని చెప్పారు. తెరలు పాతవై ఉపయోగం లేకుండా పోతున్నాయని, దుస్తులు చెడిపోతున్నాయని పేర్కొన్నారు. వీరు ఎక్కువగా నాటక దర్శన సమస్యల్ని చర్చించారు. ఆ సమస్యల్ని అధిగమించటానికి ప్రయత్నించాలన్నారు. అప్పుడే నాటకకళ అభివృద్ధి చెందుతుందన్నారు. కనుక, నాటక ప్రదర్శన గురించి వీరికి ఒక స్పష్టమైన దృక్పథం ఉందని స్పష్టమయ్యింది.

#### 4.1.19. నాటకం అభినయం

*"ప్రాచీన జాతుల మహూత్సవములందు నాటకము లంకురించినట్లు అభినయము కూడ దేవతారాధనమునందును, కులాచారములందును జనించినది."*[55] అని సూరిశాస్త్రి మొదట అభినయం మూకచేష్టలుగా, కేవలం ఆంగిక అభినయమై ఉండేదన్నారు. వీరు వీర గాథలు

---

[54] నాట్యాంబుజము: 1923 పుట 294`295

[55] నాట్యోత్పలం: 1927 పుట:141

పాడేటప్పుడు మేళ నాయకుడు రసావేశాన్ని పొంది వీరుని లక్షణాలను తనలో ఆరోపించుకొని తన మనోవృత్తులను ఆంగీక ఆహార్య వాచిక రీతులను ప్రకటించటానికి ప్రయత్నిస్తుంటాడని ఇదే నాటక అభినయంకు తొలి మెట్టుగా పేర్కొన్నారు. ఇవి ఇంచుమించు భరతుని నాట్యశాస్త్ర అభిప్రాయాలతో సరిపోతుంది.

### 4.1.20. నటులకు ఉండవలసిన లక్షణాలు

సూరిశాస్త్రి పాశ్చాత్యుల నాటకాలలోని నాటక అభినయాన్ని తెలుపుతూనే ఆదర్శప్రాయమైన నాటకాభినయాని కోరే నటులకు కొన్ని ప్రత్యక లక్షణాలుండాలని పేర్కొన్నారు.[56] వాటిని రాబోయే అధ్యాయంలో తెలుగు సౌందర్యవిమర్శకుల ప్రత్యేకతలో వివరిస్తాను.

నాటకంలోని ఆంగిక వాచికాభినయాలు *"నిత్య జీవనపు పలుకు చేతలను మించేడి విస్పష్టతతో రసభావ ప్రకోప స్వరూపమున నుండిన గాని. ప్రేక్షకులంది సంతుష్టి నేర్పరచజాలవు. అభినయములో శోకరసముకన్న లేనగవుతుళకు సొగసులు జిలికించు సందర్భము లెక్కువ కష్ట లభ్యములు."*[57] అంటూ అభినయం రూపకవి యొక్క భావాన్ని అంతా చూపలేక పోవుట గాని పెంచి మరి అందంగా చూపటం జరుగుతుందని చెప్పుతే నటుని యొక్క అభినయ స్వాతంత్రము అతని ప్రతిభా విశేషాలపై ఆధారపడి ఉంటుందని చెప్పారు. నాటక కవులు సూచించే కథావస్థల, రసభావ వ్యాఖ్యానాల విస్తీర్ణమంతా నటుని యొక్క ప్రతిభపై ఆధారపడి ఉంటుంది. అన్ని రకాల వేషాలను వేసి ప్రేక్షకులను మెప్పించే సామర్ధ్యం గల నటులు జనసామాన్యంలో గుర్తింపు పొందుతారు అని చెప్పారు.

పురాణం సూరిశాస్త్రి ఇప్పటి కవులు తమ నాటకాలలో కల్పనలకు, అలంకార సౌందర్యానికి బదులు నైతిక మానసిక వీధులలో సంచరించి భావనా ప్రపంచంన కావ్యపోషణ చేస్తున్నారని ఈ పద్ధతి భావకవులకు, గద్య కథకులకు, ఇతిహాసకులకు నీతి ప్రవక్తలకు సరైనదే కాని నాటకవులు మాత్రం వేదాంతులా, భావకవులా నిశ్చల నిశ్చంచల భావ విస్తరణతో

[56] నాట్యోత్పలం: 1927 పుట:147–150

[57] నాట్యోత్పలం: 1927 పుట:151

సంతృప్తి పొందకూడదు. నాటకాన్నికి ప్రధానమైనది 'అభినయ సంచలనం'గా పేర్కొన్నారు. ''నీతి నియములకును, అనురక్త విషయమునకును వైరుధ్య మేర్పడినప్పుడును కామితార్థమునకు విధి నిర్ణయము లడ్డము వచ్చినపుడును, రస ప్రకోప మేర్పడి భావము లుప్పొంగి వీనిచే మానస మొందు సంచలనము బాహ్యాంగములందు అభినయమై గేచరించును'' [58] అని పేర్కొంటూ నైతిక మానసిక వ్యాపార ఉల్లేఖనం చేసే నవీన నాటకాల్ని అభినయించే వారు స్వాతిక రస స్ఫూర్తిని ప్రకటింపగల మహా సమర్థకులై ఉండాలన్నారు.

### 4.1.21. ప్రపంచ నాటకాలు - దేశీయ కళాభిమానం

పురాణం సూరిశాస్త్రి *'నవ్య నాటక ధర్మాలను'* తెలుపుతూ కళా విషయాలలో దేశ కాల విభేదాలను పాటించకూడదని, విశాల హృదయంతో స్వాభిమాన దురహంకారాలను విడిచిపెట్టి కళా సౌందర్యానే, రస సమృద్ధినే ప్రధానంగా గ్రహించి కళా ప్రపంచాన్ని అవలోకించి అన్యోన్య సహాయంతో కళా స్వరూపాలను సంస్కరించాలి. దీని వలన మన దేశ కళలకు ఎటువంటి ప్రమాదం ఉండకపోవుటమే గాక ఇతర దేశాల ప్రతిభా సంపర్కముతో భావోద్రేకం కలిగి మన కళలు అభివృద్ధి చెందుతూ కాలానుగుణంగా కొత్త చిగురులు తొడుగుతుందన్నారు.

నాటక కళ అనేది ప్రజలందరికి సులభంగా అర్థమవుతూ మిక్కిలి సన్నిహితంగా ఉన్నదంటూ ఇతర కళలను ఆస్వాదించటానికి ప్రత్యేక శిక్షణ సంస్కారాలు అవసరం నాటకాన్నికి అలాంటి శిక్షణలు, అవసరం లేదన్నారు. అందువలన రూపక సాధనంతో నైతిక మర్యాదలను, జాతీయ భావాలను సదాచార మార్గాలను ప్రజలలో వారికి ఇష్టమైన రీతిలో వ్యాప్తి చేయవచ్చును. సంఘ సంస్కరణకు నాటకం ఎంతో ఉపయోగం పడుతుందన్నారు.

పురాణం సూరిశాస్త్రి నాట్య ప్రపంచ వృత్తాంతాన్ని పరిశీలిస్తే రెండు ముఖ్య విషయాలు తెలుస్తున్నాయన్నారు. 1) అభినయాన జీవితావస్థలను అనుకరించే పద్ధతి అన్ని దేశాలలో అన్ని కాలాలో కనబడుతుంది. అనుకరణ అనేది జంతుకాలంలో కూడా కనబడుతుంది. దీనికి ఉదాహారణగా ఆయన జంతువులు తల్లుల ప్రవర్తనను అనుసరించి జీవనోపాదులను

[58] నాట్యోత్పలం: 1927 పుట:172

సాధిస్తున్నాయి. 2) నాట్య చరిత్రను తెలిపే రెండవ అంశంగా ఆయన అవస్థానుకరణము మానవ మానసపు నిత్య స్వభావమైనను పాశ్యాత్య చరిత్రలో నాలుగు సార్లు మాత్రమే, నాలుగు ప్రత్యేక జాతీయ విజయ సందర్భాలలో రూప కవిత్వం అతిశయించి అల్లుకుంది. అవి యవన చరిత్రలో ఒకసారి, ఎలిజిబెత్ నాటి ఆంగ్ల విజయోత్సాహం ఒకసారి,14వ లూయీ నాటి పరాసు కళా మండపంబున ఒకమారు స్పెయిన్ దేశపు సామ్రాజ్య వికాస సందర్భమున నొకమారు మరల ప్రజాస్వామ్య స్వాతంత్ర్య సంతోషంను అనుభవించె పరాసు సీమలందు 19వ శతాబ్ధంలో రూప కవిత్వం అనంత దివ్య వైఖరులను విస్తరించిందని వివరించారు. పాశ్చాత్య నాటక పరిజ్ఞానం పురాణం సూరిశాస్త్రిగారి ప్రతి విషయంలోనూ కనిపిస్తుంది. ఆయన మానవ స్వభావాన్ని ఆశ్రయించి నాట్య వృత్తి జనిస్తుందంటూ భారత దేశంలో భక్తి వాఙ్మయం అభివృద్ధి చెందినట్లుగా నాటకం అభివృద్ధి చెందలేదన్నారు.

పురాణం సూరిశాస్త్రి నాటక కళ వొద్దిక సొబగులతో, వన్నెల చెన్నెల వెలుగొందుచు, కులుకుచు, నిలుచుచు, నడుచుచు, బలాయుష్య సంపదలతో నాట్య సుందరి మానవ చరిత్రాంకముల నలంకరించుచున్నది. అదే దేశకాల పరిస్థితులకు అనుగుణంగా మారుతూ ఉన్నప్పటికి ఏదో ఒక రూపంలో మానవ జీవితంలో అన్ని వేళలా ప్రత్యక్షమవుతూ తన కళ ప్రభావాన్ని కనబరుస్తునే ఉంటుంది.

### 4.1.22. కళ ప్రేక్షకపక్ష అధ్యయనం

నాటకం గురించి వివరించేటప్పుడు పురాణం సూరిశాస్త్రి ప్రేక్షకులనుండి ఆస్వాదనను గమనించాలన్నారు. ఈ సూచనలు చేస్తూనే ఆంగ్ల నాటకాలను ఉద్ధరించుటకు సూచించిన మార్గాలు తెలుగువారు కూడా అనుసరించ వలసి ఉన్నదని సూచించారు. అమెరికా, ఇంగ్లాడులో లాగా మన దేశంలో కూడా విత్త, విద్యా ప్రభావ ప్రతిష్టలప్పెడి పెద్దలు నాట్యకళను ఆదరించలేదన్నారు. [59]

---

[59] నాట్యోత్పలం: 1927 పుట:194–196

### 4.1.23. కావ్య రచన - కళా దృక్పథం

పురాణం సూరిశాస్త్రి 'సిద్ధంగ రచింపబడిన రమణీయ వాఙ్మయ స్వరూపంగా నిర్వచించారు. 'కావ్య రచనలో కావ్య ప్రవృతి రచనా సామర్థ్యం, నిజ ధర్మాలు నిర్వహించి కావ్యసిద్ధి కలిగి ఉంటాయి. ఆయన 'లోకములోని విషయ వ్యవహారంలోని అలౌకిక భావ స్ఫురణనను, లౌకికమైన ప్రయోజనంతో సంబంధంలేని నిత్య సౌందర్యాన్ని ఊహించగల మానస స్వభావమే కావ్య ప్రవృత్తి అనబడుతుందని కావ్యాన్ని రచించే శక్తి లేకపోయినప్పటికి కావ్య ప్రవృత్తి రచనా శక్తి ఈ రెండు ఉన్నప్పటికి వారు తమ ప్రతిభను కావ్యంగా వెల్లడించ లేకపోవచ్చు అందువలనే 'కావ్యము సిద్ధమైన కావ్య ప్రవృత్తుల వ్యక్త స్వరూపం'గా పురాణం సూరిశాస్త్రి పేర్కొన్నారు.[60]

### 4.1.24. కావ్య వస్త్వానుశీలన

పురాణం సూరిశాస్త్రి కావ్యంలో విస్తరించి ఉన్న కథాంశాన్ని 'ఆలంబిత విషయం'గా పేర్కొన్నారు. ఇది ఒక దేవుణ్ణో, దేశాన్నో, వీరపురుషుణ్ణో, అంగాన్నో తెలుపుతూ రసావేశాన మానవ జీవితాన్ని, స్వభావాన్ని, ప్రకృతిలోని ప్రియదర్శనాలను విషయాల అంతరార్థాన్ని విస్తరిస్తుందన్నారు. వీటితో పాటు కవియొక్క స్వతంత్ర భావాలు, తాత్పర్యాలు దీనిలో ఇమిడి ఉంటాయన్నారు.

పురాణం సూరిశాస్త్రి 'రమ్యమైన దృశ్య వర్ణనలను, వీర శృంగార కథాంశాలను, భావస్ఫూర్తి ప్రకటించే సందర్భాలు ప్రకృతిలో రహస్యంగా ఉండి యోగి సత్తములకు అర్థమయ్యే అవేద్యతత్త్వార్థాలు ఒక్కొక కాలంలో సర్వజనుల ఆమోదమైన కావ్యాంశాలు' అవుతున్నాయంటూ ఆయన *''మానవ మానసమానందసమాధిలోదేలునప్పుడు కావ్యము సహజముగానుద్భవించుచున్నది''*[61] అని మానవుని మనస్సు(కవి) అమితమైన ఆనందంలో పరవశిస్తునప్పుడు కావ్యం సహజంగానే ఉద్భవిస్తుందని భావించారు.

---

[60] విమర్శక పారిజాతము 1925 పుట:131

[61] విమర్శక పారిజాతము 1925 పుట:134

పురాణం సూరిశాస్త్రి కావ్యంలోని 'యమకం, గణ బంధంలు, పద్యం, ధారాసారళ్యం, భావగీతం, మహాకావ్యం, చిత్ర ప్రబంధం, మహా నాటకం, గేయ కావ్యం, ఋక్కులు మొదలగున్నవి కావ్యాన్ని అనేక విధాలుగా వ్యక్తపరిచే కావ్య స్వరూపాలుగా పేర్కొన్నారు. కావ్యోచిత్తమైన విషయాలను, కావ్య రూపాలను పై పద్ధతులతో సమన్వయిస్తే మనోహరమగు కావ్యం ఏర్పడుతుందన్నారు.

కావ్యాలు మనిషి యొక్క, ప్రకృతి యొక్క ప్రతిబింబాలుగా ఉన్నాయి. 'మహోద్ధతుమైన భావాలు, ఉజ్వలమైన రస అనుభవాలు, నిర్హేతుకమైన నైజ ప్రచారంలో ఉప్పొంగి తరలి వచ్చె సందర్భంలో కావ్యం' ఏర్పడుతుందని పురాణం సూరిశాస్త్రి అభిప్రాయపడ్డారు. వీరు *''రసవత్సందర్భములను అవలోకించి, తరువాత శాంత సమాధిలో రాగవిహీనముగ వీనిని దలపోసి, మన్నించు వేళల నట్టి ప్రశాంతర సమాధిలో సత్కావ్యోత్పత్తి గల్గుచున్నది.''* [62] అని చెప్పారు. ఒక విధమైన మైమరపులో పూనికలో కావ్యోదయం ఏర్పడుతుందన్నారు. కావ్యాంశాలన్ని సంప్రదాయాల నుండి గాని ప్రకృతిని, మానవ సంసారమును చూసి కవి భావించిన విభావాల నుండి పుడుతున్నాయన్నారు.

### 4.1.25. పురాణం సూరిశాస్త్రికళాతత్త్వ శాస్త్ర ఆలోచనలు

కళా ప్రపంచాన్ని పరిశోధించేటప్పుడు మనకు కొన్ని సామాన్య ధర్మాలు గోచరిస్తాయి. సారస్వతంలో ఈ ధర్మాలు రూపభేదంలో కనిపిస్తున్నాయి. పురాణం సూరిశాస్త్రి కళాతత్త్వ శాస్త్రాన్ని ''*కళా సౌందర్యమును, రస స్వరూపమును, జర్చించు శాస్త్రము రస విచారణ లేక ఆయీస్థటిక్సు అనబడుచున్నది.''*[63] అని నిర్వచించే ప్రయత్నం చేశారు.

పురాణం సూరిశాస్త్రి సౌందర్యశాస్త్ర అధ్యయనంవలన కావ్యవిమర్శనంలో కొత్త కోణాలను గమనించవచ్చన్నారు. వీటిని ప్రకృతితో సమన్వయించి చూపించారు. భారతీయుల నవరస సిద్ధాంతాన్ని అంగీకరిస్తూనే, కళను ప్రకృతితో చూడాలన్నారు. కళాప్రయోజనాన్నికూడా దృష్టిలో పెట్టుకోవాలన్నారు. ఇటువంటి భావనలే పాశ్చాత్య

---

[62] విమర్శక పారిజాతము 1925 పుట:135

[63] విమర్శక పారిజాతము 1925 పుట:197

కళాదృక్పథంలోనూ కనిసపిస్తున్నాయి. అంతేకాకుండా ఇంద్రియానుభవశాస్త్రంగా గుర్తించటం వలన సౌందర్యశాస్త్ర అధ్యయనంలో శారీరక సంబంధాలు, మానసిక సంబంధాలు, తత్వార్థక సమస్యలు మొదలైన సందర్భాలను గుర్తించాలన్నారు. [64] ఆయన కేవలం పై నాలుగు సమస్యలతో పాటు వాటిలో గల అంతర్లీన సమస్యలను కూడా వివరంగా పేర్కొన్నారు. ఒక విషయాన్ని లోతుగా అధ్యయనం చేయటానికి ఆ విషయాన్ని అనేక అంశాలుగా విభజించు కోవటం పురాణం సూరిశాస్త్రిసునిశిత పరిశీలనకు నిదర్శనం. అందుకనే సౌందర్యం, కళ, కళా స్వాదన వంటి అంశాలపై అనేక ప్రశ్నలను సంధించి ఆలోచింప చేస్తున్నారు.

హెగెల్ కళకు నిర్ధిష్టమైన అస్తిత్వం దాని రూపం ద్వారానే కలుగుతుందంటారు. *" An Ideal content must gleam through the sensible form: form is spiritualized by the ideal light."*[65]

'సౌందర్యం' ప్రధాన కేంద్రంగా Aesthetics అధ్యయనం జరుగుతుంది. అందువల్ల Aesthetics ని 'సౌందర్య శాస్త్రం', 'కళాతత్త్వ శాస్త్రం' వంటి పేర్లతో పిలుస్తున్నారు. పురాణం సూరిశాస్త్రి "'సౌందర్య, రస విచారణ, కళాతత్త్వ'' పదాలతో Aesthetics గురించి చర్చించారు. ఆయన 'సౌందర్యం యొక్క స్వభావ స్వరూపాలను, రసతత్వాన్ని నిర్ణయించే శాస్త్రమే ఈస్తటిక్స్' అనబడుతున్నదని చెప్పారు. ఆయన రుచి భేదాల పుట్టుకను, లలిత కళల మూల సూత్రాలను గురించి ఈ శాస్త్రం పరిశీలిస్తుందన్నారు. ఆయన గ్రీకు భాషలోని 'ఈస్తటిక్సు'కు ఇంద్రియాలచే గ్రహించటం, తెలుసుకోవటం అనే వ్యుత్పత్యార్థాలను పేర్కొన్నారు. వస్తు సౌందర్యాన్ని మనసా చింతించి ధ్యానించి రసానందాన్ని అనుభవించటానికి ఈ పదం బౌమ్‌గార్టెన్‌చే వ్యాప్తి చేయబడిందని చెప్పారు.

**4.1.26. రసానుభవం**

పురాణం సూరిశాస్త్రి మన మనస్సు ఒక విషయంలై కేంద్రీకరించినప్పుడు దానిని ఆనందంగా ఉత్సాహంగా ఆస్వాదిస్తున్నప్పుడు మన మనస్సులో రసయోగం అధిష్టించిందని,

[64] విమర్శక పారిజాతము 1925 పుట:197,198

[65] Aesthetic: B. Crore 299

అలాంటి పరిస్థితులో మనకు కలిగే మానస వ్యాపార విశేషాలు రసానుభవం అని పేర్కొన్నారు. రస సౌందర్య వస్తువులను ఆస్వాదించినప్పుడల్లా మనకు ప్రీతి, ఆనందం, సంతోషం కలుగుతుందని అలాంటి రసానందాన్ని అనుభవించే సమయాలలో మనలోని శక్తియిక్తులు బయటకు వచ్చి జీవ సంచలన వికాసాన్ని పొందుతున్నాయన్నారు.

**4.1.27. రసాస్వాదన**

రస హృదయుడు ఒక పాటనో, కావ్యాన్నో, నాటకాన్నో, చిత్రాన్నో సౌధ విగ్రహాలనో చూసి అందులోని సౌందర్యానికి ఆనందిస్తున్నాడేగాని అన్ని పాటలకు, చిత్రాలకు, కావ్యాలకు గల సామాన్యమైన సూత్రాలను ఏర్పరచటానికి ప్రయత్నించడు. ఇదే సందర్భంలో ఆనందవర్ధనుడు తన సిద్ధాంతమంతా రసం ఏ విధంగా అలంకారం లేదా గుణం లేదా మిగతా ఇతర కవిత్వ సౌందర్యానికి సంబంధించి ఉండదో, అది అంతర్గతంగా ఏ విధంగా కవి యొక్క కల్పనని ఆస్వాదించవచ్చో తెలుపుతుంది. నిజానికి విమర్శకుడు ఆస్వాదించనంత వరకూ ఆ కవిత్వంలో ఎటువంటి రసం ఉండదు. సౌందర్యశాస్త్ర సమస్య ఏమిటంటే ఒక శృంగార కళాకారుడు రంగులని, భాషని, ధ్వనిని మొదలగు వాటిని ఉపయోగించి ఏ విధంగా ఒక అభిరుచి గల వ్యక్తిలో రసాన్ని ప్రేరేపిస్తాడు అన్న విషయాన్ని వివరించటం.

కవితాత్మక సౌందర్యం రెండు రకాలు అవి 1. ధ్వని ప్రధానంగా ఉండే ప్రధాన వ్యంగ్యం 2. కల్పనా సౌందర్యానికి అనుబంధంగా ధ్వని ఉండే గుణిభూత వ్యంగ్యం. వాల్మీకీ, కాళిదాసులు మొదటి రకాన్ని విశదీకరిస్తే, బాణుడు మరియు మాఘుడు రెండవ రకాన్ని విశదీకరించారున. ఆనందవర్ధనుడు రసం గురించే కాక వస్తు మరియు అలంకారాల గురించి కూడా ప్రస్తావించాడు. ఈయన వస్తు ధ్వని, రస'ధ్వని, అలంకార 'ధ్వనుల గురించి వివరించాడు. అది ఈ ధ్వని అయినా చివరికి కవిత్వ నాణ్యత రసాన్ని బట్టే నిర్ణయించబడుతుంది. కొన్ని సందర్భాలలో కవిత్వంలో రసం వస్తు లేదా అలంకారాలకి అనుబంధంగా ఉంటుంది. ఇటువంటి అరుదైన సందర్భాలని కూడా ఆనందవర్ధనుడు రసవత్ అలంకారాలు అన్న శీర్షికతో వివరించారు.

ఆనందవర్ధనుడు తన ధ్వన్యాలోకంలో అభిరుచికి అనుగుణంగానే సౌందర్యావిష్కారం జరుగుతుందని పేర్కొన్ని. సౌందర్య సృష్టిలో కవి అభిరుచి కుండే పాత్ర ఎటువంటిదో తెలుపుతూ...

*''అపారే కావ్యసంసారే కవిరేకః ప్రజాపతిః*

*యథాస్మై రోచతే విశ్వం తథేదం పరివర్తతే*

*శృఙ్గారీ చేత్ కవిః కావ్యే జాతం రసమయం జగత్*

*స ఏవ వీతరాగశ్చేన్నీ రసం ఔతమేవ తత్*

*భావాన చేత నానపి చేత నవచ్చేత నాన చేతనవత్*

*వ్యవహార యతి యథేష్టం సుకవిః కావ్యే స్వతంత్ర తయా (ధ్వన్యా, తృతీయ)*

అని కవి శృంగారి అయినట్లైతే కావ్యంలో రసమయ జగత్తు అవతరిస్తుందని, అతడు విరక్తుడైతే కావ్యం నీరసమవుతుందని కవి హృదయంలోని భావానికి ఇక్కడ మనకి ప్రాధాన్యం కనిపిస్తుంది. శృఙ్గార పదం అనేది ఉప లక్షణ చేత ఇతర రసాలను కూడా గ్రహిస్తుందని పేర్కొన్నాడు. 'శృఙ్గారీ' అనగా రసావేశం కలవాడని అర్థం. ''ప్రత్యక్షంగా కనబడే ఈ పదార్థ జాతం లౌకికాలైన సుఖ – దుఖ – మోహాల మధ్య ఉండడాన్ని మాత్రమే ఇస్తున్నా కవి రసికుడు కానంత వరకు అలాంటి కవి యొక్క వర్ణనలో ప్రవేశించనంత వరకు లోకాతి క్రాంత (అలౌకిక) రసాస్వాద భూమిని అధిష్టించజాలదు అని అర్థం.[66]

ఆనందవర్ధనుడు కవి ప్రతిభని ఇంకో కొత్త ధృక్కోణంలో చూపిస్తూ అలౌకికల రస ప్రస్తావన చేసి దాని గురించి ఒక అధ్యాయమే రాశారు. కవిత్వ నిర్ణయానికి సంబంధించిన రసం ఔచిత్య రసమేనని ఆనందవర్ధనుడు తెలిపారు. ఈయన వ్యాకరణం, తత్త్వ మొదలైన వాటి ప్రభావం నుండి సౌందర్య శాస్త్రాన్ని వేరు చేయడమే కాక రసాభాస కూడా సౌందర్యశాస్త్ర పరిధిలో ఒక రసమేనని నిరూపించారు. చివరిగా ఆనందవర్ధనుడు సౌందర్య శాస్త్రాన్ని ఒక

[66] శ్రీరామ చంద్రుడు, పుల్లెల, ధ్వన్యాలోకము, జయలక్ష్మీ పబ్లికేషన్స్, 1998, పుటలు 895-899

శాస్త్రంగా పూర్తి విశ్లేషణలతో ఇప్పటికీ అందరికీ ఆసక్తిని కలిగించే విధంగా తీర్చిదిద్దిన ఆచార్యుడు అని మనం చెప్పవచ్చు.

### 4.1.28. శాస్త్రం- రస విచారణ

పురాణం సూరిశాస్త్రి తమ '*విమర్శక పారిజాతము*' (1925)లో శాస్త్రానికి రస విచారణకు మధ్య భేదాలను ఈ కింది విధంగా పేర్కొన్నారు.

1) శాస్త్ర దృష్టిలో విషయాన్నికి ఎటువంటి పాముఖ్యం లేదు. సృష్టి ధర్మాలను దర్శించటం కొరకే విషయాలు ఉపయోగపడుతున్నాయి. కాని రస విచారణలో విషయానికి, విషయాన్ని ఆశ్రయించి ఉన్న గుణ రూప సౌందర్యమే అత్యంత ప్రధానమైనది. దీనిలో ధర్మ నిరూపణ ముఖ్యాంశం కాదు.

2) శాస్త్రాలన్నీ విశేషం నుండి సామాన్యాన్ని ఊహిస్తాయి. కాని రసవిచారణ విశేషానికే ప్రాముఖ్యం ఇచ్చి అది వెల్లడించే ప్రీతిని అనుభవిస్తుంది.

3) శాస్త్రాలు ప్రత్యక్ష పద్ధతి, అనుమాన పద్ధతి అనే తత్త్వశాస్త్ర పద్ధతులపై ఆధారపడి ఉంటాయి కాని రసానుభవానికి ఇలాగే వేరేవాటి ఆశ్రయం ఏమిలేదు. అని 'ఆత్మయే వస్తు సౌందర్యాన్ని గ్రహించి రసానుభూతి పొందగల కోశముగా' చెప్తూ సౌందర్య పరిగణలో ఇంద్రియాలు కూడా ఆత్మకు తోడవుతున్నాయన్నారు.

### 4.1.29. కావ్య సౌందర్య వివేచన

పురాణం సూరిశాస్త్రి రస విచారణ కావ్యానికి గల మధ్య సౌందర్య విచారణ భేదాన్ని ఇలా తెలియజేశారు. కావ్యం రస విచారణ లాగా సౌందర్య విచారణను పురికొల్పుతున్నప్పటికి కావ్య నిర్ధిష్టమైన విషయాలు ఇంద్రియాలకు ప్రత్యక్షంగా గోచరించవని అంటూ "*పదాలకు, భావాలకు, వస్తువులకు, గల సంబంధాన్ని మన్నించి మానస కోశ మాపదములు నిరూపించెడి విషయములను మానస వీధిలో నగుపడునట్లు చేయును. ఇట్లు సాక్షాత్కరించిన విషయచ్ఛాయలను జింతించు రసానంద మనుభవించు చున్నాము. అందుచే కావ్య పఠనము వలన జనించెడి రసయోగము వ్యంగ్య ప్రభూతమై, పద సూతి, ప్రత్యక్షేతరముగ నుండును.*

*తక్కుంగల లలిత కళలు సూటిగా నింద్రియ గ్రాహ్యములై సౌందర్య సూచనలు లందించు చున్నవి''*[67] అని పేర్కొన్నారు. ఈ సందర్భంలో వామనుడు సౌందర్యమే అలంకారమన్నాడు.[68] అలంకార శాస్త్రంలో తగినన్నీ పరిశోధనలు చేసిన రచయితలలో వామనుడు ఒకడు. వామనుడు తన రచన కావ్యాలంకార సూత్రాలలో వ్యాఖ్యాలతో పాటు తన పూర్వపు కవులైన మఘుడు మరియు భవభూతుల రచనల నుంచి ఉదాహరణలు తీసుకొని విశదీకరించాడు. వామనుడు సూత్ర శైలిలో తన రచన చేశాడు. ఈయన తన సొంత వ్యాఖ్యాలను కవి ప్రియ రూపంలో సూత్రాల మీద ఆపాదించి ఇతర కవుల రచనల నుండి ఉదాహరణలతో పాటు తన సొంత ఉదాహరణలను కూడా జోడించాడు. ప్రాచీన సూత్ర కవుల వలె ఈయన కూడా తన రచనలను అధికరణాలు, అధ్యాయాలుగా రచించాడు. ఈయన మొత్తం 317 సూత్రాలతో తన రచన చేశాడు.

ఈయన కవిత్వ శైలి (రీతి)కి అధిక ప్రాధాన్యతనిచ్చారు. మొదటి అధికరణం 'శరీర'లో కవిత్వ శాస్త్ర అధ్యయన ప్రాముఖ్యత, దాని లక్షణాలు, కవి లక్షణాలను గురించి చర్చించారు. వామనుడు తన మొదటి సూత్రంలో కవిత్వం దాని అలంకారాల వలన గుర్తింపబడుతుందని తెలిపాడు. రీతిని వామన కవిత్వపు ఆత్మగా అభివర్ణించాడు. ఈయన రీతిని మూడు రకాలుగా విభజించాడు. అవి

1. వైదర్భి, 2. గౌడి, 3. పాంచాల రీతులు ఆయా దేశాల్లో ఆ సమయంలో అధిక ప్రాచుర్యం పొందటం వలన వాటికి ఆ దేశపు పేర్ల మీదుగా అవే పేర్లు ఇవ్వటం జరిగింది.

వైదర్భి రీతిలో *"There is not the least touch of any poetical flaw and it is replete with the ten excellences – sweetness, clarity, etc."*[69]

కాళిదాసుని కవిత్వం వైదర్భి రీతికి అద్భుత ఉదాహరణ. గౌడి రీతిలో దీర్ఘ సంయుక్తాలు, ఉచ్ఛ స్వర పదాలు ఓజా మరియు కంటిల లక్షణాలలో కలగలసి ఉంటాయి. దీనికి ఉదాహరణగా భవభూతి శైలిని చెప్పుకోవచ్చు.

---

[67] విమర్శక పారిజాతము 1925 పుట:237

[68] నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:39

[69] cultural leaders of India Aestheticians page:42

భవభూతి రాముడు శివుని విల్లు విరిచిన సందర్భాన్ని వర్ణిస్తూ రాసిన శ్లోకంలో మూడున్నర వాక్యాలలో కేవలం మూడు సంయుక్త పదాలు మాత్రమే ఉంది ఒక్కొక్క వరుస శార్ధుల విక్రీడితంగా పంతొమ్మిది వర్ణాలను కలిగి ఉంది.

పాంచాల రీతి ఈ రెండిటికీ మధ్యలో ఉంటుంది. ఇది తియ్యదనాన్ని, మెత్తదనాన్ని రెండింటినీ కలిగి ఉంటుంది. వామనుడి దృష్టిలో అద్భుత కవిత్వమంటే దోష రహితంగా, గుణ, అలంకార సహితంగా ఉండాలి. ఈ రెండింటిలో దోష మరియు గుణాలు రెండు దగ్గరి సంబంధాన్ని కలిగి ఉంటాయి. కవిత్వంలో సమత లేకుంటే అది దోషానికి దారితీస్తుంది. అందువలన అతడు తన మూడో అధికరణంలో గుణాలతో పాటు దోషాలను గురించి కూడా చర్చించాడు. దోషాలని వామనుడు 4 ఉప విభాగాలుగా విభజించాడు. అవి.

1. పద (దీని కింద అసాధు, కష్ట, గ్రామ, అప్రతీత, అనర్థకాలు ఉన్నాయి.), 2. పదార్థ (దీని కింద అన్యార్థ, నేయర్థ, సూతార్థ, అశ్లీన, క్లిష్ట అనే ఐదు దోషాలు వస్తాయి.), 3. వాక్య (దీనిలో భిన్న వృత్త, యతి భ్రష్ట, సంధి దోషాలు మొదలైన అంశాలు ఉన్నాయి.), 4. మ్యూర్థ (దీని కింద వ్యర్థ, ఏకార్థ, సందిగ్ధ, అయుక్త, అవాక్రమ, లోక విద్య, విరుద్ధ అనే దోషాలు ఉన్నాయి.) పైన చెప్పినవే కాక నాలుగో అధికరణం ఉపమాలో ఉపమ అసంపూర్తి, సంఖ్యా, లింగ దోషాలు, పోలికల మధ్య దోషాలు వంటి ఇతర దోషాల గురించి చర్చించారు.

*"వామనాచార్యుడు మొదట 'కావ్యం గ్రాహ్యమలంకారాత్, సౌందర్య మలంకారః సదోష గుణాలంకార హానాదానాభ్యామ్' అనే సూత్రాల ద్వారా సౌందర్యమే కావ్యోపాదేయతకు మూలమని 'ఆ సౌందర్యం సాధించడానికి సాధనాలు – ప్రయోజకాలు – దోషాలు విడిచి గుణాలంకారాలు పరిగ్రహించడం' అని సూక్ష్మంగా ప్రతిపాదించాడు. ఇక్కడ సౌందర్య శబ్దాన్ని విస్తృతమైన పరిధిలో అర్థం చేసుకోవలసి ఉంది. దీని వల్ల సౌందర్య దర్శనమే సాహిత్య శాస్త్ర పరమ లక్ష్యమని తేలింది."*[70]

గుణాలు అలంకారాల వలే కవిత్వానికి అదనపు ఆకర్షణలు అన్న అంశాన్ని వామనుడు అంగీకరించాడు. అతని ఉద్దేశ్యంలో గుణాలు అంతర్గతంగా కవిత్వానికి విలక్షణ ఆకర్షణని

[70] నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:18

అందిస్తాయి గనుక అవి అత్యావశ్యకమని అలంకారాలు కవిత్వానికి అదనపు ఆకర్షణలు ఆపాదించటం వలన అవి అవసరం లేవని అవి స్వాభావికంగా అందమైన అమ్మాయికి నగలు ఎలా అదనపు ఆకర్షణని అందిస్తాయో అలానే ఇవి కూడా అని చెప్పాడు.

అలంకారాలలో ఈయన శబ్దార్థాలంకారాలు రెండింటికీ సమ ప్రాధాన్యమిస్తూ ముఖ్యంగా యమక మరియు అనుప్రాసాలను బహుళంగా చర్చించాడు.[71] రూపకాన్ని విశ్లేషిస్తూ భవభూతి 'ఉత్తర రామ చరిత్ర' (I.39) ఉదాహరిస్తూ రాముడు సీతని గురించి వర్ణించడాన్ని ఈ కింది విధంగా తెలిపాడు.

*"She is the Fortune in my home, a streak of nectar to my eyes, this touch of hers, a thick flow of sandal paste, her arm around my neck, a cool, soft pearl – String what of hers is not dear! Only separation from her would be most unbearable"*[72]

వ్రక్రోక్తిని ఒక అర్థం ఇంకో అర్థాన్ని సూచించేదిగా విరోధిని వ్యతిరేక భావాలతో పోల్చేదిగా అభివర్ణించాడు. నిదర్శన, విశేషోక్తులను కుమార సంభవం లోని ఉదహరణలను ఉల్లేఖిస్తూ ఉదహరించాడు.

వామనుడు విశ్లేషించిన మరికొన్ని అంకాలలో సమాసోక్తి, అప్రస్తుత ప్రశంస, అపహ్నుతి, శ్లేష, ఉత్ప్రేక్ష, అతిశయోక్తి, సందేహ, విభవన, అనన్వయ, ఉపమేయోపమ, పరివృత్తి, క్రమ, దీపక మొదలైనవి కొన్ని.

ఆఖరి ఐదో అధికరణంలో ప్రాయోగికాలు, కవితా ప్రయోగాలను చర్చించాడు. కవిత్వపు ఆత్మను స్పృశించిన మొట్ట మొదటి కవి వామనుడు సూత్ర శైలిలో కవితాత్మక ధోరణిని విశ్లేషించిన వారిలో కూడా మొదటి వాడు వామనుడు. శాస్త్రీయాంశాన్ని సరళ భాషలో

[71] VI.1 వ శ్లోకం 6వ పాదం మరియు IV.1 వ శ్లోకం 9వ పాదం

[72] (cultural leaders of India Aestheticians; Page 45)

సరసమైన ఉదాహరణలతో ఆసక్తిదాయకంగా మలచడంలో వామనుడు విజయం సాధించాడు. సౌందర్యశాస్త్ర రీతిలో కవిత్వపు విశ్లేషణ చేసిన వారిలో ముఖ్యుడు వామనుడు.

**4.1.30. కళాతత్త్వ శాస్త్ర ప్రయోజనం**

పురాణం సూరిశాస్త్రి కళాతత్త్వ శాస్త్ర ప్రయోజనం గురించి వివరిస్తూ *''ఈస్థటిక్సు ప్రయోగ కౌశల మేర్పరచు శాస్త్రము కాదు. దీని నభ్యదించినందున కవులకు చిత్రకారులకు లేనితెలివి పుట్టబోవదు. విమర్శకులకు స్వాభావికముగ నేర్పడని రససౌందర్య విచక్షణ సామర్థ్యమలవడదు. వైచక్షణ్యము కావ్య కల్పనా సామర్థ్యము, సహజ శక్తులే కాని రస రహస్య పరిశోధనంబున నలవడునవి కావు. ఈస్థెటిక్సు మనకు యిష్టార్థములుగను, గుణ వంతములుగను, ప్రయోజకకారులుగను, యదార్థ విభూషితంబులగను. దోచెడి వస్తువులలో నొకజాతి వస్తువుల స్వభావమును నిర్ణయింప ప్రయత్నించు శాస్త్రమై పూతమెరుపులకును నిగ్గుదేలిన నిక్కంపుటందమునకును గల భేదమేర్పడలలో దోడగుచుండును''* [73] అని కళాతత్త్వ శాస్త్ర ప్రయోజనాన్ని తెలియజేశారు.

పురాణం సూరిశాస్త్రి *'వస్తు సౌందర్యాన్ని'* గురించి తెలుపుతూ వస్తు సౌందర్యంలో లోకంలో భిన్నాభిప్రాయాలు ఉండడం వల్ల *'లోకోభిన్నరుచిః'* అనే ఆర్యోక్తి ఏర్పడిందని ఎంత రుచిభేదం ఉన్నప్పటికి కొన్ని విషయాలను ప్రజలు చూసినప్పుడు రసానందం పొందుతారని మరికొన్ని చూసినప్పుడు అలాంటి అనుభవాన్ని పొందలేరని చెప్తూ ప్రజలు ఏ వస్తువు పట్ల రసానందాన్ని అనుభవిస్తున్నారో వాటినే సౌందర్యమూర్తులుగా ఎన్నుకుంటున్నారని విషయాలలోని గుణ రూప సౌందర్యం వలన అందరికి ఒకే విధమైన రసానుభవం కలగటం వలన వారి అనుభవాలను ఏక ముఖంగా చేర్చి సౌందర్య తత్త్వాన్ని ఊహిస్తున్నామన్నారు. దీని వల్లనే లలిత కళల యొక్క గుణదోష నిర్ణయం, కావ్య కళా విమర్శనలు సాధ్యపడుతున్నాయని చెప్పారు.

ఇలా ప్రాచ్య, పాశ్చాత్య కళా విలువల సమ్మేళనంతో దేశీయ కళా విమర్శను స్థాపించే ప్రయత్నం పురాణం సూరిశాస్త్రి గారిలో కనిపిస్తుంది. అయితే, స్వీయానుభవ ప్రమాణాలపై

---

[73] విమర్శక పారిజాతము 1925 పుట:243

అధికంగా ఆధారపడటం, ఆత్మాభిమానం ఎక్కువ కావడం వల్ల, మార్క్సిస్టు భావజాల ప్రచారం అధికంగా ఉండటం వల్ల పురాణం సూరిశాస్త్రికళా విమర్శకు రావలసినంత ప్రాచుర్యం రాలేదు. కళా విమర్శలో దేశీయతా భూమికను తెలుసుకోవటానికి అనేక ప్రమాణాలను గమనించడానికి పురాణం సూరిశాస్త్రిరచనలు ఎంతగానో దోహదపడతాయి!

### 4.2. సంజీవ్‌దేవ్ సౌందర్య దృక్పథం

సంజీవ్‌దేవ్ *''రసానుభూతి సంబంధించిన వివరాలను తెలిపే దాన్ని రసతత్త్వం అంటారు. సౌందర్యతత్త్వం అనికూడా అంటారు. సౌందర్యాన్ని అనుభవించే సమయాన కలిగే అనుభూతినే రసం''*[74] అని సౌందర్యాన్నికి పర్యాయంగా రసం, రమ్యత అనే పదాల్ని ఉపయోగించారు. రసాన్ని రకరకాల పేర్లతో పిలిచారు. వీరు తమ రచనలలో సౌందర్యాన్ని రసం అనే ఉద్దేశ్యంతో వాడినప్పటికి కొన్ని సందర్భాలలో వీరు ఒకచోటనే ఈ రెండు శబ్దాలను ప్రయోగించారు.

సంజీవ్‌దేవ్ ఈస్థటిక్స్ గురించి పేర్కొంటూ *''భారతీయ రసతత్త్వం, విజ్ఞాన జగత్తులో కళా జగత్తులో ఒక విశిష్ట స్థానాన్ని ఏర్పరుచుకున్నట్లుగానే పాశ్చాత్య రస తత్త్వం కూడా ఏర్పరచుకున్నది. అయితే పాశ్చాత్య రస తత్త్వానికి గల 'యీస్థటిక్స్' అనే పేరు అతి ప్రాచీన కాలం నుంచీ కాక 1735లో బౌమ్‌గార్డెన్ అనే రసతాత్త్వికుని ద్వారా ఏర్పడింది. రస తత్త్వ విచారణలో కొంత ఉన్నతమైన కృషి చేశాడు. మిగతా విషయాల అధ్యాపనలతో పాటు రసతత్త్వం కూడా చేయబడాలి.''*[75] అని వీరు కళాతత్త్వ శాస్త్రాన్ని రసతత్త్వంగా పేర్కొన్నారు. అంతేగాక సౌందర్యాన్ని అనుభవించే సమయాన కలిగే అనుభూతినే రసంగా పేర్కొన్నారు. భారతీయ ఆలంకారికులు కూడా రసాన్ని సౌందర్యంగా గుర్తించారు.

ప్రపంచ సాహిత్యప్రస్తానంలో ఇప్పటికీ, ఎప్పటికీ సమగ్రమైన, స్పష్టమైన నిర్వచనాలకు, నియమాలకు లొంగని భావన ఏదైనా ఉందంటే అది సౌందర్య శబ్దమే అని చెప్పుకోవాలి. సౌందర్యశబ్దం ఇటు సాహిత్యవిమర్శకుల్లో, అటు కళాతత్వశాస్త్ర నిపుణుల్లో ఈ రోజుకీ

[74] సంజీవ్‌దేవ్; కాంతిమయి పుట:128

[75] సంజీవ్‌దేవ్; కాంతిమయి పుట:131–132

వాదోపవాదాలకు అవకాశాన్ని కలిగిస్తూనే ఉంది. ఏది సౌందర్యం అనే విషయం పట్లప్రాచీనకాలం నుండి ఈనాటి వరకు పాశ్చాత్యల్లోనూ, భారతీయశాస్త్రాల్లోనూ శోధన జరుగుతూనే ఉంది. ఆ పరిశోధనలో అంతర్భాగంగానే ఎంతో మంది తెలుగు రచయితలు కూడా సౌందర్యశాస్త్రంలో భాగస్వాములయ్యారు. ఆ దిశగా శోధనలు, పరిశోధనలు. సమీక్షలు, విమర్శలు జరుగుతున్నాయి. అలా సౌందర్య శాస్త్రం పట్ల తనకంటూ ఒక ప్రత్యేకమైన దృక్పథాన్ని ఏర్పరచుకున్నవారిలో సంజీవ్ దేవ్ ఒకరు.

సౌందర్యం అంటే ఏమిటి? ఏది సౌందర్యం? సౌందర్య ఎక్కడ నిక్షిప్తమై ఉంటుంది? సౌందర్య ఆస్వాదన ఎలా కలుగుతుంది? తదితర అనేకాంశాల పట్ల సంజీవ్ ఎన్నో అభిప్రాయాలను వ్యక్తపరచారు. వాటిని సూక్ష్మంగా పరిశీలిద్దాం.

నిజానికి సౌందర్యాన్ని నిర్వచించలేము, అనుభవించటం తప్ప హద్దులులేని అనుభూతి. సంజీవ్ దేవ్ కూడా సౌందర్యాన్ని నిర్వచించటం కష్టం అని చెప్పారు. సంజీవ్ దేవ్ సౌందర్యం అన్న పదానికి రసం, అమృతం అన్న పదాల్ని పర్యాయపదాలుగా వాడారు. సౌందర్యానికి ఒకే ఒక నిర్వచనం కావాలంటే కొంత వ్యగంగా తట్టే వాక్యం చెప్పాలనిపిస్తుంది. *ఆ వాక్యం ఈ విధంగా ఉండాల్సి వస్తుంది. "సౌందర్యం కాదో దానికి వ్యతిరేకమైంది సౌందర్యం* అని అంటారాయన. కనుక సౌందర్యాన్ని నిర్వచించటం ఒక్కమాటలో అదంటే ఏమిటో చెప్పటం కుదిరే పనికాదు. సౌందర్యం ఏమిటి అన్న విషయాన్ని సంజీవ్ ఒకానొక సందర్భంలో ఆయనకు ఆయనే ప్రశ్నసంధించుకుని సౌందర్యం అంటే ఒక నిర్ణయాణికి వచ్చారు. "వ్యక్తిలోని ఆనందం తన బయటి అస్తిత్వంలో గోచరించటమే సౌందర్యం" అని సమాధానమిచ్చుకున్నారు. అంటే సంజీవ్ దేవ్ దృష్టిలో ఆనందం అన్నది సౌందర్యంలోని ప్రధానాంశం. ఒక వస్తువుని చూసి ఒక వ్యక్తి తనకు తానే బాహ్య,అంతర్గత మానసిక ఆనందాన్ని పొందుతున్నాడంటే ఆ వస్తువు అందంగా ఉందని అర్థం. తన హృదయంలోని ఆ ఆనందాన్ని వ్యక్తి బయటి రూపాల్లో దర్శిస్తారనేది సంజీవ్ దేవ్ సౌందర్యానికి ఇస్తున్న నిర్వచన సారాంశం.

#### 4.2.1. సంజీవ్ దేవ్ సౌందర్య లక్షణాలు

##### 4.2.1.1. నవ్యత

సౌందరాస్వాదనేది సంజీవ్ దేవ్ దృష్టిలో ఒకరమ్యాలోకన నిరంతరం చూసిన ప్రతిసారి ఆ కళాఖండం నూతనత్వానికి నోచుకుంటుంది ఆ నూతనత్వంలోనే సౌందర్యం ఉందంటారు సంజీవ్ దేవ్.[76]

ఈ సందర్భంలో ప్రాశ్చాత్య అలంకారికుడైన ఎమర్సన్, సౌందర్యాన్ని విశిష్టమైన విషయంగా భావించిన వాళ్ళలో ఇతను ఒకడు. ఈయన అభిప్రాయంలో కళ అన్నది దాని స్రష్ట తన కృతికి వేసిన బాట. స్వచ్ఛమైన, పవిత్రమైన దేహంలోని నిర్మలమైన ఆత్మకే రమణీయ దర్శనం కలుగుతుంది అన్నాడు ఎమర్సన్. ఈయన సౌందర్యాన్ని ఒక విషయంగా భావించకుండా, అది (ప్రకృతిగతమైన సౌందర్యం) దాన్ని ప్రేమించే కన్ను తటస్థపడినప్పుడు ద్విగుణీ కృతమవుతుందంటారు.[77] అంటే ఆస్వాదకుని హృదయంలోనే సౌందర్యం వాసనా రూపంగా ఉండి ప్రకృతిగతంగా ఉండే సౌందర్యం యొక్క ప్రోద్దీపనలో అది ఉద్బుద్ధమవుతుందని అర్థం. ఎమర్సన్ సౌందర్యాన్ని పరమేశ్వర సృష్టికే సృజన శక్తిగా పేర్కొన్నాడు. సృష్టి సుందరంగా తీర్చిదిద్దబడలేదని అది మొదటి నుండి సుందరమైనదే అని అంటారు. సౌందర్యంతోనే సృష్టి పుట్టిదంటారు.

సత్యం, శివం, సుందరం పై నూతన వ్యాఖ్యానం చేస్తూ 'విశ్వానికి ముగ్గురు బిడ్డలనీ, ఆ ముగ్గురు ఒకే సమయంలో పుట్టారనీ ఈ ముగ్గురికి ఒక్కొక్క క్షేత్రంలో ఒక్కొక్క పేరుందనీ, ఒక క్షేత్రంలో హేతు, వ్యాపార ఫలితాలనే పేర్లతో మరో క్షేత్రంలో Jove, Pluto, Neptune అనే పేర్లతో ఇంకో క్షేత్రంలో పిత, ఆత్మ, పుత్రుడు అన్న పేర్లతో, ఇక సాహిత్య క్షేత్రంలోనేమో జ్ఞాత (Knower), కర్త (Doer), వక్త (Sayer) అన్న పేర్లతో వ్యవహారింపబడుతూ మళ్ళీ ఈ మూడే సత్యం మీద ప్రేమగా, మంచి మీద (శివం) ప్రేమగా, సుందరం మీద ప్రేమగా నిలుస్తాయన్నాడు. అంతేకాక, ఈ మూడింటిలో ప్రతిదానిలోను తక్కిన రెండింటి శక్తి గుప్తంగా ఉంటుందంటారు ఎమర్సన్.

---

[76] సంజీవ్ దేవ్: కాంతిమయి 53

[77] విశ్వనాథ సౌందర్య దర్శనము: యు.ఎ. నరసింహ మూర్తి 2009 పుట:31

ఈ విధంగా ఎమర్సన్ సౌందర్యం పై మౌళికమైన (Original) వివేచన చేస్తూ సౌందర్యం ఆస్వాదకుని హృద్గతంగానే ఉంటుందన్నాడు.

### 4.2.1.2. శాస్త్రం తెలియనక్కరలేదు

సౌందర్యభావనకు కాని సౌందర్య దార్శనికతకు కానీ కళాతత్త్వ శాస్త్ర పరిచయమో, పాండిత్యప్రావీణ్యమో అవరం లేదు. వ్యక్తిలో స్పందించగలిగే హృదయం ఉంటే సౌందర్యం తనంతట తానే వ్యక్తి అనుభవంలోకి వస్తుంది, ఆవిష్కరమతుంది. సంజీవ్ దేవ్ కూడా "రసానుభూతికి హేతువాదం కాని, వివేచనం కాని సౌందర్యతత్వ పరిజ్ఞానం కాని ఆవశ్యం కాదు. ఇవి అన్నియు రసనిర్ణయమునకు అవసరం. ఒక ప్రత్యేక వస్తువు సుందరంగా ఉన్నది? అని తెలియట మాత్రమే రసానుభూతికి ఆవశ్యకము. ఆ వస్తువు ఎందువలన సుందరంగా ఉన్నది? తక్కిన వస్తువులు ఎందువలన సుందరంగా లేవు? సుందరముగా ఉండుటకు లేకపోవుటకు కారణములు ఏవి? సౌందర్యం అనగా ఏమిటి ? అను వానిని గురించి జ్ఞానము రసానుభూతిని పొందటానికి ఉండవలసిన అవసరం లేదు. ఒక దృశ్యము పరికించినంతట హృదయం చలించుట మాత్రమే వానికి చాలును అని సౌందర్యానుభూతిని పొందటానికి శాస్త్రజ్ఞానం అవసరం లేదు అని చెప్పారు. [78]

### 4.2.1.3. సమగ్రత

విడి విడి వస్తువులు ఒక విశిష్ట భంగిమలో సంశ్లిష్టమైనప్పుడు సౌందర్యం పుడుతుంది. అంటే సౌందర్యం వస్తువు సమగ్రతాభివ్యక్తిలోనే ఉంటుంది. విడివిడిగా ఏ అంశానికి ఆ అంశంగా చూస్తే సౌందర్యం గోచరించదు. సమగ్రతలోనే సౌందర్యం ఉంటుంది. ఉదాహరణకు ఏదైనా ఒక పువ్వులోని సౌందర్య దృక్పథాన్ని చూడాలంటే పువ్వు మొత్తం అంటే సమగ్రంగా పరిశీలిస్తే పువ్వులోని సౌందర్యం దర్శనమిస్తుంది. అంతేకాని పువ్వుని రేకులుగా విడదీసి చూస్తే సౌందర్య హీనంగా కన్పిస్తుంది. కనుక ఎక్కడైతే సమగ్రత ఉంటుందో అక్కడ సౌందర్యం తప్పకుండా ఉంటుంది. ఇంకా చెప్పాలంటె ఐక్యత ఉన్నచోట సౌందర్యం తప్పక ఉండే ఉంటుంది. ఇదే అభిప్రాయాన్ని ప్రాచీన ఆలంకారికులు కూడా వ్యక్తపరచారు.

[78] సంజీవ్ దేవ్, లలిత కళలు సమీక్ష– వికసన చరిత్ర. పుట:11

*“ అంగప్రత్యంగ కానాం యో సన్నివేశో యధోచితం*

*సుస్నిగ్ధ సంధిబంధ : స్వాత్తత్సౌందర్య మితీర్యతే’* అని అన్నారు.[79] అంటే అంగ ప్రత్యంగాలలో సముచిత సన్నివేశం, చక్కని కూర్పు ఉంటుంది. అవయవముల సంధిబంధం సంక్లిష్టమై ఉండడాన్నే సౌందర్యం అంటారని అర్థం.

**4.2.1.4. చలనం**

జడత్వంలో కన్న నిశ్చలత్వంలో కన్నా చలనంలో సౌందర్యం ద్విగుణీకృతంగా ఉంటుంది. చలనం మానవ ఆనందానుభూతిని రెట్టింపు చేస్తుంది. సూర్యోదయ సూర్యాస్తమయాలు అంతగా మనకు ఆనందం కలిగించడానికి వాటిలోని చలనం కారణమనే విషయం తెలిసిందే. చలనం సౌందర్య ద్యోతకం కావడాన్ని గురించి ఆచార్య పింగళి లక్ష్మీకాంతం ఈ కింది ఉదాహరణ ఇచ్చారు.

“కళలన్నియు సౌందర్యద్యోతకములే కాని ఏ కళయందు ఆ సౌందర్యం చలించునో అది గుణాతిశాయి అని చెప్పనొప్పును. చలనము సౌందర్యమునకుమోహనత్వమాపాదించును. నిశ్చల జలపూర్ణమై ఒక సరస్సు విచ్చిన తామర పూవులతో నిండి చూచుటకెంతో సుందరంగానుండును. తలవని తలంపుగా ఒక సన్నని మందవాయువు లేచి ఆ సరస్సులో చిన్న చిన్న తరగలు పుట్టింపగా ఆ నీటి కదలికతో తామరలు కూడా ఊగుచుండగా ఆ సరోవర సౌందర్యమంతయూ చలితమై అంతకు ముందులేని మోహనత్వం తాల్చును. అట్లే సహజ సౌందర్యరాశియైన ఒక నర్తకి అభినయార్థం వేషధారణ చేసి రంగమునకవతరించి మన ఎదుట నిలిచినపుడు ఆ పాత్ర సౌందర్యం కనువిందొనర్చును. అంతలో సూత్రధారుడు ప్రార్థనారూపమైన ఏదోగీతిక నందుకుని తాళయుక్తంగా చరణము నందించుట తోడనే ఆ నరక్తి అంతకు పూర్వము నిశ్చలముగానున్న తన హస్తములను పాదములను కదిలించి విన్యాసములు చూపమొదలిడును. అప్పుడామె సౌందర్యము చలితముకాగా చూపరులు మొదట అనుభవించిన రూప సందర్శనాందమునకు ద్విగుణీకృతమైన ఆనందమును అనుభవింతును. ఈ అతిశయానందమునకు కారణము ఆ సౌందర్య చలనము’[80]

---

[79] సంజీవ్ దేవ్. దీప్తిధార. పుట:189

[80] సంజీవ్ దేవ్, లలిత కళలు సమీక్ష– వికసన చరిత్ర. పుట:22

**4.2.1.5. ఇంద్రియ సంబంధం**

నా జ్ఞానేంద్రియ ద్వారాలు ఎప్పుడూ మూయును. నా దృష్టి శ్రవణ అనుభవాలు నీ ఆనందాన్ని తీసుకొనివచ్చి నాకిస్తాయి' అని గీతాంజలిలో టాగూర్ అంటారు. [81] సౌందర్యానుభూతి కావాలంటే ఇంద్రియ ద్వారాల్ని తెరచక తప్పదు. కళ ఇంద్రియ గ్రాహ్యము. అందుకే కళకు అంత విలువ అంటారు సంజీవ్ దేవ్. అంటే కళలోని విలువే అందులోని సౌందర్యం.

ఇక్కడ గమనించవలసిన విషయం ఏమిటంటే సౌందర్యం రెండు ప్రమాణాల మీద ఆధారపడి ఉంటుంది. మొదటిది ఆంతరం, రెండవది బాహ్యం. అంతరమైన సౌందర్యదృష్టి లేదా సౌందర్యస్వాదన రుషితుక్యులకు తప్ప అందరికి సాధ్యం కాదు. కనుక ఆంతరమైన సౌందర్యానుస్వాదనతో మనకిక్కడ పనిలేదు. ఎందుకంటే సంజీవ్ దేవ్ ఎక్కడా కేవలం నిరపేక్ష సౌందర్యాన్ని గురించి చెప్పలేదు. బాహ్యమైన సౌందర్యాస్వాదన ఇంద్రియ సంబంధమైంది. ప్రకృతి సౌందర్యం కానీ,  కళా సౌందర్యం కానీ ఇంద్రియాల ద్వారానే మనల్ని చేరుతుంది. మనల్ని చేరడమంటే మన అనుభవంలోకి వస్తుంది. సంజీవ్ దేవ్ కూడా రసానుభూతి అనగా సౌందర్యానుభూతి ఇంద్రియమూలమున జనించును' అని పేర్కొన్నారు.

*"నిజమైన సౌందర్య రాగం అనాసక్తిజనకమైంది. అనగా ఇంద్రియ వాంఛలేనట్టిది. సౌందర్య గర్భితమైన ప్రకృతి చేయు సూచనల ద్వారా అభివ్యక్తి ఆగోచర పదార్ధమేసౌందర్యం"* [82] అంటారు జ్యూయల్ ప్రాయ్.

సౌందర్యం వేరు, ఇంద్రియ సంబంధమైన ఉల్లాసం వేరు. ఉల్లాసం స్థాయి కిందిది. సౌందర్యపు స్థాయి పైది. ఉల్లసాన్ని మించిన ఆనందపు వ్యక్తరూపమే సౌందర్యం అన్న అరవిందుని అభిప్రాయం ఇక్కడ సరైనది.

**4.2.1.6. విశ్వజనీనత**

సౌందర్యానికి ప్రధాన లక్షణం విశ్వజనీనత్వం(Universal Validity). TheBeautiful is that which a part from concept, pleases univesrsally.

---

[81] సంజీవ్ దేవ్, లలిత కళలు సమీక్ష– వికసన చరిత్ర. పుట:4

[82] యస్వీ జోగారావు పుట సంఖ్య:10

అంటారు క్యాంట్. సుతరాం అద్రియతే ఇతి సుందరమ్ అన్నారు మన ప్రాచీనులు. అంటే సౌందర్యం అనేది మిక్కిలిగా ఆదరింపబడేదని అర్థం. అది ప్రకృతి సౌందర్యమైన లేక కళాసౌందర్యమైన అందరికీ అనుభవంలోకి వస్తుంది.

### 4.2.1.7. నిరంతరావిష్కారం

సౌందర్యానుభవం ఎప్పుడూ ఉంటుంది. నిత్యం అనుభవంలోకి వస్తూ ఉంటుంది. అది అయిపోవడమంటూ ఉండదు. సౌందర్యానుభూతి అయిపోయింది. తృప్తి కలిగించింది. ఇక సౌందర్యాన్వేషణ కాని అనుభూతి కాని అవసరం లేదని ఎప్పుడూ అనిపించదు. " ఒక పూవు రంగును చూస్తూ నేను శతాబ్దాలు బ్రతకగలనను' అని శేషేంద్ర అన్నది బహుశా ఇందుకేనేమో!

సౌందర్యానుభవం ఉదాత్తమైంది. తాత్కాలిక ప్రభోధం దాని లక్ష్యం కాదు. "స్థూలమైనదీ, సత్యమైనదీ, సౌందర్యవంతమైనదీ ఎప్పటికీ నశించదు.దానికి మరణం లేదు' అని చలం విశ్లేషణ.[83]

### 4.2.1.8. అలౌకికం

సౌందర్యం అలౌకికమైనది. అది ఆత్మానంద హేతువు. జనసామాన్యం దృష్టిలో ఆనంద హేతువైన అందం కేవలం నేత్రానందం వరకే పరిమితం. అందం వస్తువుకి వ్యక్తికి సంబంధించినదైతే సౌందర్యం పరిధి చాలా విస్తృతమైంది. ఎన్నో దివ్యగుణాల సమ్మేళనమైన సౌందర్యంలో సౌజన్యం అంతర్లీనంగా ఉంటుంది. సౌందర్యం లౌకిక సంపదలనుభవించి తరిగిపోయేది కాదు. సౌందర్యం అనుభవించే కొద్ది పెరుగుతూనే ఉంటుంది. అందుకే సౌందర్యం అలౌకికం అయినది. అంతేకాకుండా సౌందర్యం అనేది ఏఒక్కరిది కాదు అనుభవించే ప్రతి ఆస్వాదకుడి ఉమ్మడి ఆస్తి. ఉదాహరణకు తాజ్ మహల్, చార్మినార్ మొదలైన కట్టడాలను సందర్శించినపుడు వ్యక్తిలో కలిగే అనుభూతి వర్ణించలేనిది. అంతేకానీ వాటీని దర్శించినపుడు ఏ ఒక్కరూ కూడా అవి నావి, లేదా మనవి అనరు కేవలం అవి మనవి అంటారు అంటే సౌందర్యం అనేది ఉమ్మడి ఆస్తి లేదా ఆలౌకికమైనవిగా అభివర్ణించుకోవచ్చు.

సౌందర్యదృష్టికి దూరసామీప్యములనిగాని, జడచేతనములనిగాని, తారతమ్యాలుండవు. సౌందర్యం సచేతనము కనుక సౌందర్యమనేది అచేతన పదార్థమున ఉన్ననూ ఆ అచేతన

[83] చలం మ్యూజింగ్స్, పుట సంఖ్య:286

పదార్థము సచేతనముగా రూపాంతరము పొందును. తత్ఫలితంగా మానవ హృదయమునకు సుదూర దృశ్యములతో సన్నిహిత బాంధవ్యము ఏర్పడును. అప్పుడు మనవ హృదయము తన్నుతాను మరచిపోయి తానే ఇంద్రధనువుని భావించును. ఈ మధురమైన తాదాత్మ్యమనే తన్మయత అని వ్యవహరింతురు అని సంజీవ్ దేవ్ తన్మయతను సౌందర్యానుభవాన్ని పొందటానికి అత్యవసరమైన మూలకంగా చెప్పారు. అందువల్ల స్థలకాల వ్యక్తిగత సంకుచిత పరిధులను దాటిందే సౌందర్యం.

**4.2.1.9. నైరూప్యం**

సౌందర్యం విడిగా వస్తురహితంగా కనిపించదు. "యదృశ్యం తన్నశ్యం . ఏది కనిపిస్తుందో అది నశిస్తుంది. సుందరం కంటికి కనిపించేది కాబట్టి నశిస్తుంది. సౌందర్యం కనిపించేది కాదు కాబట్టి నిలిచి ఉంటుంది. కింది సంజీవ్ దేవ్ మాటలు సుందర సౌందర్యాల భేదాన్ని గురించి, సౌందర్య శాశ్వతత్వాన్ని గురించి వివరిస్తాయి.

*'తాను ప్రేమించే వాటిలో సౌందర్యం చాలా ప్రధానమైంది. నిజానికి సౌందర్యాన్ని ప్రేమించలేడు మనిషి, సుందరాన్ని ప్రేమించగలుగుతాడు. సుందరం సౌందర్యం వేర్వేరు. సౌందర్యం అనేది భావవాచకం. సుందరం అనేది వస్తువాచకం. సౌందర్యం మనకు కనిపించదు. సుందరం మాత్రమేకనిపిస్తుంది. వస్తువు ద్వారానో పశువు ద్వారానో సౌందర్యం వ్యక్తమవుతుంది. అప్పుడే వాటిని మనం సుందరం అంటాం. సుందరవ్యక్తి, సుందరవస్తువు, సుందర స్థలం మొదలైనవి అంటాం. కనుక సుందరం అనేది వ్యక్తం, సౌందర్యం అనేది అవ్యక్తం. సుందరం నశిస్తుంది. కాని సౌందర్యం ఉండిపోతుంది. అయినా సుందరాలన్నింటికి మూలం సౌందర్యమే కనుక సౌందర్యమనేది ఎక్కువగా చర్చించబడుతుంది'*[84]

**4.2.1.10. ఆధ్యాత్మికత**

Beauty is the gift of god అంటారు అరిస్టాటిల్. ఉదాత్త స్థాయిలో సౌందర్యానుభూతి భౌతికమైనది కాదు. అది ఆనందానుభవం. అది భావనలో తెచ్చుకున్న తేలికపాటి ఊహా కాదు. మైమరపు కాదు. మనో వికారం కాదు. అది దివ్య సుందర దృశ్యాన్నో పులకింపచేసే గానమాధుర్యాన్నో ఆవరించి ఉంటుంది. చెదిరిపోని ఆనందానుభవం

[84] సంజీవ్ దేవ్, కాంతిమయి పుట:114

ఆధ్యాత్మికమైంది. బాహ్యమైన ప్రకృతిగతమైన వస్తువిశేషాల్లో ఉండేది కాదు. సౌందర్యం భగవదంశ అని ఎంతో మంది కళాతాత్త్వికులు అభిప్రాయపడ్డారు. ఎమర్సన్ అయితే Beauty is the hand writting of god అంటారు. అంటే సౌందర్యం భగవంతుని చేతిరాత అని అనడంలో సౌందర్యానికి ఉన్న ఆధ్యాత్మికత సంబంధం తెలుస్తుంది.

### 4.2.1.11. అసౌందర్యం

అసౌందర్యాన్ని వివరించటం ద్వారా కూడా సౌందర్యం ఏమిటో వివరించే ప్రయత్నం చేయవచ్చు. కళాతాత్త్వికులు సౌందర్యాన్ని గురించే గాక, తద్విరుద్ధమైన అసౌందర్యాన్ని కూడా వివేచిస్తారు. *'రమ్యం కాని వస్తువును రమ్యంగా వీక్షించటానికి చిత్తసంస్కారం, మానస సాధన అవసరం. అంటే సహజంగా వస్తువులలో లేని లావణ్యాన్ని వ్యక్తి తన దృష్టితో సృష్టించుకోవాలి. అపుడు గులాబిపూవు ఎంత సుందరమో ? మురికి గుంట అంత సుందరమే. వెన్నెల ఎంత సుందరమో చీకటి అంత సుందరమే. నవకిసలయాలు ఎంతో, ఎండిన ఆకులూ అంతే అని చెబుతారు సంజీవ్ దేవ్.'* [85]

### 4.2.1.12. సౌందర్యం - ఆనందం

సంజీవ్ వ్యక్తీకరణలో సౌందర్యనందాలకు భేదం తప్ప స్పష్టంగా ఉంటుంది. ' వస్తు రూపంలో ఉన్న ఆనందమే సౌందర్యం' అనటంలో సంజీవ్ దేవ్ దృష్టిలో సౌందర్యానందాలకు అవస్థా భేదం తప్ప నిజ భేదం లేదు. సౌందర్యం అంర్యానికి సంబంధించిన విషయం. ఆనందపు వ్యక్తరూపమే సౌందర్యం అనటం మరింత సమజసంగా ఉంటుంది.ఈ వ్యక్త స్థితికి ఆవల సౌందర్యంలో ఆనందం తన ఉనికిని పోగొట్టుకుంటుది. అంటే "ఆనంద సౌందర్యాలేకమవుతాయి' అన్న అరవిందుల వారి అభిప్రాయానికి సంజీవ్ దేవ్ దగ్గరలో ఉన్నారు. కాబట్టి సౌందర్యం లేక ఆనందం కలుగదు. ఆనందం కల్గించనది సౌందర్యం కాదు. వస్త్వాశ్రయంగా ఉద్దీపన పొంది ఆవిష్కరమయ్యే ఆనందం వస్తువులో సౌందర్యమవుతుంది. వస్తువు ఆస్వాదకుల మధ్య అభేదం కుదిరితే ఆనందానుభూతి అవుతుంది. కనుక ఆనందం సౌందర్యం రెండూ ఒకటే అని చెప్పవచ్చు.

[85] సంజీవ్ దేవ్, రూపారూపాలు పుట:205

సౌందర్యం అనేది ప్రధానంగా రెండువిధాలని సంజీవ్ దేవ్ వర్గీకరణ చేశాడు. అవి సేంద్రియ సౌందర్యం, నిరింద్రియ సౌందర్యం. సేంద్రియ సౌందర్యం అనగా ప్రాణం ఉన్న జీవుల్లో మనకు కన్పించే సౌందర్యం. రెండవది నిరింద్రియ సౌందర్యం అనగా అప్రాణి సంబంధమైన అంటే వస్తుగతమైనది. ఈ రెండింటిలో ఒకటి కొంతమందికి రసానందాన్ని అంటే సౌందర్యదృక్పథాన్ని కలిగిస్తే మరొకటి మరికొంతమందికి రసానందాన్ని కలిగిస్తుంది. కాకపోతే వాటిని చూసే వ్యక్తుల బట్టి ఉంటుంది. సౌందర్యం అనేది మాత్రం తప్పక ఉంటుందని అంటారు సంజీవ్ దేవ్.

**4.2.2. సత్యం,శివం, సుందరం భావనలు**

సంజీవ్ దేవ్ దృష్టిలో సత్యం అనేది విజ్ఞాన్ని, శివం అనేది శ్రేయాన్ని, సుందరం అనేది రసానందాన్ని ప్రసాదిస్తాడు అంటారు. అయితే ఈ మూడింటిని కలిపి చూశారు ఆయన సౌందర్యాన్ని సత్యశివాల నుండి వేరుగా చూడలేదు. “మనిషిలో సౌందర్యానుభూతి పోషింబడుతూ ఉంటే లోకంలోని అనేక చీకటి గుణాలు మనసులో ప్రవేశించటానికి ఖాళీ ఉండదు. వెలుగు గుణాల కూడికే సౌందర్యానుభూతి. సౌందర్యానుభూతి హృదయంలో ఉన్నది అంటే మిగతా గుణాలు కూడా హృదయంలో ఉన్నాయనే సత్యం, శివం నుంచి సుందరం వేరు కాదు’’ అన్నది వారి సౌందర్యతత్త్వం.

పైన సౌందర్యం అంటే ఏమిటో వాటికి కావాల్సిన ప్రధాన లక్షణాలను సంజీవ్ దేవ్మాటల్లో పరిశీలించాం. ఇప్పుడు సౌందర్యోపాసన అంటే ఏమిటి? అది ఎలాకలుగుతుంది అనే భావనలను సంజీవ్ మాటల్లో పరిశీలిద్దాం.

సంజీవ్ దేవ్ మానవుడికి సహజంగానే సౌందర్యంపై ఉండే అనురాగాన్ని వివరిస్తూ “మాములు మానవుడు నుండి కళాజీవుల వరకు, కళాజీవులు మొదలు తత్త్వ సాధకుల వరకూ అందరిలోనూ ప్రకృతి సౌందర్య పిపాస ఆగమ్యంగా గోచరిస్తుంది. ప్రకృతి బంధనం నుండి విడివడాలనే యోగ సాధకులకి కూడా ప్రకృతి సౌందర్యపు అనురాగం వదలదు’’ అని అన్నారు.[86] భరతుని ఉద్దేశ్యం విశ్లేషణలో కళ లేదా జీవితపు ముడిసరుకు మానవుని మానసిక ప్రపంచం, ఇది అన్నివేళలా భావనలు, ఉద్వేగాలు, మానసిక స్థితులతో నిండి ఉండి అతన్ని

[86] సంజీవ్ దేవ్, కాంతిమయి. పుట:118

నడిపిస్తూ ఉంటుంది .కానీ నిజ జీవిత భావనలు కళాత్మకంగా ఉండవు .జీవితంలో మానసిక స్థితులు తమదైన శైలిలో సుఖ దుఖాలను కలిగి ఉంటాయి .ఒక కళాకారుడు వాటిని చూసినపుడు వాటిని ఒక శైలిలో తన ఊహని జోడించి పెట్టి భూమి మీద ఉండని విధంగా నడిపిస్తాడు .కేవలం ఈ శైలీకృత మానసిక స్థితులు, ఊహాత్మక, సృష్టి మేధావితనపు నియమాలను అనుగుణంగా నడిచేవి మాత్రమే శాస్త్రీయంగా భావాలుగా పిలువబడతాయి . సృష్ట్యాత్మక ఊహా ప్రక్రియ భావనగా పిలువబడుతుంది .ఇది కళాత్మక సునిశితత్వానికి ఉదాహరణ.

"కనిపించే దానిలోని నూతనత్వాన్ని పోగొట్టుకోకుండా చూడటమే సౌందర్యోపాసన" అంటారు సంజీవ్ దేవ్. అంటే జీవితంలోకి, దృష్టిలోకి పాతదనాన్ని ప్రవేశించనీయకుండా చూడటమన్నమాట. ఇదే సౌందర్యం దర్శనంలో అత్యంత ముఖ్యమైన విషయం. దీన్నే రమ్యాలోకం అని ఒక కళాంశంగా ప్రతిపాదించారు.

ఈ రమ్యాలోకన గురించి సౌందర్యానుభూతికి సంబంధించిన మూడు రకాల వ్యక్తులను వారికి తగ్గ మూడు కారణాలను సంజీవ్ దేవ్ వివరించాడు. 1.సుందరమైన వస్తువులను చూసి ఆనందించలేనివారు(రసదృష్టి మేల్కొని లేదు), 2.సుందరమైన వాటిని మాత్రమే ఆనందించేవారు(రసానుభూతి మేల్కొని ఉంది.), 3.సుందరం కాని వస్తువుల్లోను సౌందర్యాన్ని దర్శించేవారు. (రసదృష్టి పూర్ణంగా మేల్కొని ఉంది.) మానవులంతా పై మూడు తరగతులకు చెందిన వ్యక్తులుగా ఎదగాలనేది సంజీవ్ దేవ్ ఆశయం. అందుకే ఆయన కింది విధంగా పేర్కొంటారు. "చిత్రాన్ని రచించటం ఒక మధుర సాధన? చిత్రాన్ని ఆనందించటం మధురత సాధన' అంటే సంజీవ్ దేవ్ సృజన కంటే ఎక్కువగా ఆస్వాదనకే విలువనిస్తున్నారు. అది కూడా రమ్యంగా ఆస్వాదించాలంటాడు.[87]

సౌందార్యానుభూతి మానవుని ప్రాథమిక ఆవస్థలలో ఒకటి. మానవ జీవితంలో ముఖ్యమైంది సౌందర్యమే. మానవుడు కష్టించేది, పరిశీలించేది, అన్వేషించేది ఆనందం కోసమే. "మనమంతా బ్రతికేది సుందరమంటే ఏమిటో కనుగొనడానికే, తక్కినదంతా వట్టి నిరిక్షణే అంటారు. ఖలీల్ జిబ్రాన్? (1) అనందం సౌందర్యరూపంలో దొరుకుతుది. సౌందర్య

[87] సంజీవ్ దేవ్, కాంతిమయి. పుట:118

రాహిత్యం జీవితాన్ని జడత్వ రూపంలోకి దిగజారుతుంది. కనుక మానవ జీవితం జడత్వ స్థాయి నుండి చైతన్యం వైపు పురోగమించడానికి సౌందర్యభావన, మానవ అనుభవం ఒక మహాశక్తిలా తోడ్పడుతుంది. కనుక జీవిత సమగ్రతకు, సౌందర్యోపాసనకు అవినాభసంబంధం ఉంది. మానవజీవితంలో అత్యంత ఆసక్తికరమైన సౌందర్యోపాసన గురించి సంజీవ్ దేవ్ తన రచనల్లో విలువైన అభిప్రాయాలను తెలియజేసాడు. సంజీవ్ దేవ్ సౌందర్యాన్ని జీవితపు ప్రాధమిక అవసరంగా భావించాలి. ఇందుకు సంజీవ్ దేవ్ సౌందర్యాన్ని ఉపాసించాలంటారు. సౌందర్యోపాసన కన్న ఉత్తమ జీవితం ఏదీ లేదంటారు. సౌందర్యోపాసనలోనే మానవతకు సమగ్రత చేకూరుతుందని ఆయన ప్రగాఢ విశ్వాసం. మానవునికి సౌందర్య వీక్షణం వలన కలిగే ఆనందం ప్రకృతి సిద్ధమైంది. అది ఎంతటీ వారినైనా ఆకర్షిస్తుంది, ఆకట్టుకుంటుంది, లోబర్చుకుంటుంది. షేక్స్పీయర్ తన As you like it(1.iii.13) లో beauty provoteth thieves sooner than gold (3) అన్నది ఇందువల్లే. కాల్పనిక కవుల్లో ప్రధానంగా కనిపించే లక్షణాల్లో సౌందర్యారాధన ఒకటి. ఠాగూర్, కృష్ణశాస్త్రి, కీట్స్, షెల్లీ మొదలైన కవులు ప్రకృతి సౌందర్యాన్ని కీర్తించారు. చలం కూడా సౌందర్యాన్ని తలమునకలుగా ఆరాధించారు. సౌందర్య స్థాయి బేధాల్ని మ్యూజింగ్స్ లో వివేచించారు.

సంజీవ్ దేవ్ మానవునికి సౌందర్యంపై సహజంగా ఉండే అనురాగాన్ని వివరిస్తూ *"మామూలుమానవుడు మొదలు కళాజీవుల వరకు, కళాజీవులు మొదలు తత్త్వ సాధకులు వరకు అందరిలోనూప్రకృతి సౌందర్య పిపాస ఆగమ్యంగా గోచరిస్తుంది. ప్రకృతి బంధనం నుండి విడివడాలనే యోగ సాధకులకు కూడా ప్రకృతి సౌందర్యపు అనురాగం వదలదు"* [88]

*"కనిపించే దానిలోని నూతనత్వాన్ని పోగొట్టుకోకుండా చూడటమే సౌందర్యోపాసన"*[89] అంటారు సంజీవ్ దేవ్. అంటె మొదటిసారి వస్తువులో కనిపించిన కొత్తదనం, ఆకర్షణ ఎల్లప్పుడూ పాతబడి పోకుండా ఉండాలి. వస్తువు ఎప్పటికప్పుడు నూతనంగా గోచరించాలి. అలా కాకుండా మన చూపులో పాతదనం వస్తే వస్తువు నూతనంగా కనిపించదు. కనుక చూపులో నూతనత్వాన్ని నింపుకుంటే వస్తువులన్నీ సుందరంగా కనిపిస్తుంటాయి. అంటే

[88] సంజీవ్ దేవ్ రస రేఖలు పుట71

[89] సంజీవ్ దేవ్ రూపా రూపాలు పుట సంఖ్య : 208

సంజీవ్ దేవ్ అన్నట్టు *'దృష్టి రమ్యంగా ఉన్నప్పుడు సృష్టి అంతా రమ్యంగానే ఉంటుంది. సృష్టి రమ్యంగా తట్టినప్పుడు హృదయం ఆనందంతో నిండుతుంది. జీవితపు ప్రమిదలో చైతన్యపు దీపిక వెలుగుతుంది. ఆ వెలుగులో దైనందిన బాధల నీడలు పలుచబడతవి'*[90] సమగ్ర జీవనానికి సౌందర్య దృష్టి కూడా అవసరం. మానవ జీవితంలో కేవలం తిండికోసమే కాదు జీవితానికి సౌందర్యానుభూతి కూడా కావాలి. భౌతికావసరం, మానసికానందం రెండూ ఉండి తీరాలి. కింది సంజీవ్ దేవ్ మాటలు ఈ విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

మానవుని ప్రాథమికావసరం ఆకలి తీరడమే, అన్నం లేంది మానవుడు జీవించలేడు. అదే మాదిరి అన్నంతో మాత్రమే జీవించలేడు. ఆకలి తీరే వరకే అన్నం యొక్క అవసరం. తర్వాత అన్నంతోనే సంతృప్తిపడి ఉండలేడు. కారణం మానవుడంటే కేవలం శరీరంలోని ఆకలి అంతరిస్తుంది, దీనితో మనసులోని ఆకలి తలెత్త సాగుతుంది"[91] ఇదే అభిప్రాయాన్ని అంగీకరిస్తూ మనస్సు సౌందర్యాన్నే హాయినీ వదులు కోలేదు. అది మనోధర్మం అంటారు ఆర్.ఎస్. సుదర్శనం.[92] సంజీవ్ దేవ్ అన్నట్టు " ఒకవ్యక్తిలోని శిల్ప గుణం అంటే రసానుభూతి తగ్గి విజ్ఞాన గుణం(బుద్ధి జనిత పరిశీలన) హెచ్చితే ఆ వ్యక్తి రసస్పందన లేని ఒక ఆలోచించే శుష్క యంత్రంగా మారిపోతాడు. తన చుట్టూ సౌందర్యదీప్తితో స్పందిస్తున్న రంగు, రాగం, చలనం వీటితో పొంగుతూ ఉన్న చిరంతన లయ, వీటన్నింటికి ఆ వ్యక్తి ద్రవించడు. ఆ వ్యక్తి ఆరసిక చక్రవర్తిగా ఉండిపోతాడు.[93] కాబట్టి హృదయానికి, బుద్ధికి, అనుభూతికి, ఆలోచనకూ, ఆవేశానికి హేతువుకు మధ్య ఒక విధమైన భావస్వామ్యం ఉండాలంటారు సంజీవ్ దేవ్.

తన తేజోరేఖలు లో కూడా సంజీవ్ ఇదే విషయాన్ని చెప్తూ *"మానవుడు జ్ఞానంతో మాత్రమేజవించలేడు, జ్ఞానానికి తోడు ఆనందంఉంటేనే కాని జీవితం సుఖమయం కాదు. జ్ఞానం లేకపోయినా జీవించవచ్చు కానీ ఆనందం లేకపోతే అసలే జీవించలేడు. ఒక్క మానవుడు మాత్రమే కాదు, ప్రతి జీవికూడా జననం మొదలు మరణం వరకు సాగే తన జీవ*

[90] సంజీవ్ దేవ్, రస రేఖలు 262

[91] సంజీవ్ దేవ్, రస రేఖలు 170

[92] శేషేంద్ర శర్మ, రక్తరేఖ (ప్రస్థావన)

[93] సంజీవ్ దేవ్, రస రేఖలు 170

*యాత్రలో ఆనందం కోసం తహతహలాడి పోతుంది."*[94] అని ఇతర జీవుల్ని కూడా కలుపుతారు

పైన చెప్పిన సామాజికానుభూతి సౌందర్యోపాసనల గురించి సంజీవ్ దేవ్ ఒకరికి రాసిన లేఖలో ఇలా అన్నారు. *"నేటి పారిశ్రామిక యుగంలో కవితాజీవితానికీ రసానుభూతికి అంతగా తావు లేదు. పరిశ్రమలూ, వ్యాపారము పనికి రావనటం తెలివి తక్కువ. అవి లేంది దేశం పురిగమించదు. అందుకని దేశంలో అవి మాత్రమే ఉండి లలితమైనవి లేకపోతే దేశం మొద్దుబారి రసానందము, ప్రాణ స్పందన లేని ప్రజలు తయారవుతారు. అందుకని దేశంలో పరిశ్రమలు వ్యాపారాలు మొదలైన భౌతిక సంపత్తి పెరగాలి. మానసిక సంబంధమైన లలితకళలు రసజీవితం పెరగాలి."*[95]

సంజీవ్ దేవ్ దృష్టిలో ఆనందం, ఆలోచన రెండూ అధిక పరిణామంలో ఉండటం ఎంతో శ్రేయస్కరం. సంజీవ్ దృష్టిలో జీవితం ఎప్పుడూ ఆనందదాయకంగా ఉండాలంటారు. ఈయన దృష్టిలో సైన్సు, ఆర్ట్స్ రెండూ ఉండాలంటారు. ఆయన మాటల్లో చెప్పాలంటే ...

*"అద్వైతం ఒక సైన్సు, ద్వైతం ఒక కళ, ఆర్ట్స్ లో దొరికే అనందం సైన్సులో దొరకదు, సైన్సులోని కాంతి, ఆర్ట్స్ లోని శాంతి. ఈ కాంతి, శాంతి సమభాగంలో ఉంటే లోకం పోకడలలో కల్యాణం, లేకుంటే కన్నీళ్ళే"* [96]

*"సౌందర్యదృష్టిని సాధన ద్వారా సృష్టించుకుంటే దృష్టికి గోచరించే సృష్టంతా సుందరమే అవుతుంది"* [97] అంటారు సంజీవ్ దేవ్. అందువల్ల ప్రజలు మానసిక అంతస్థులు పెంచుకొని సౌందర్యాన్ని ఆనందించడం నేర్చుకోవాలి. రసపిపాసను సంపాదించుకోవాలి. కేవలం కళాకారులు, కళావిమర్శకులు మాత్రమే ఈ రస దృష్టికి కలిగి ఉంటే చాలదు. సామాన్య మానవులు కూడా సౌందర్యాన్ని ఆనందించడం నేర్చుకోవాలి. సౌందర్యం వ్యక్తుల ఆరోగ్యకరమైన జీవితానికి చాలా అవసరం. "రసకృత్, రసవిత్, ప్రజా సామాన్యము కళా పుష్టికి సమానంగా అవసరం.ఇందులో ఎవరు లోపించా కళ కుంటిదే" అవుతుందంటారు

---

[94] సంజీవ్ దేవ్,త తేజో రేఖలు 47

[95] సంజీవ్ దేవ్ సంజీవ్ దేవ్ లేఖలు 170, 171

[96] సంజీవ్ దేవ్ సంజీవ్ దేవ్ లేఖలు 18

[97] సంజీవ్ దేవ్ రూపారూపాలు 206

సంజీవ్ దేవ్. [98] ఈ మాటలు మానవ జీవితానికి కూడా వర్తిస్తాయి. భౌతిక అవసరాలు, సౌందర్యోపాసన రెండూ జీవితానికి అవసరమే. ఈ రెండింటిలో ఏది లోపించినా జీవితం అంధకారమవుతుంది.

ప్రకృతిలోని ప్రతి వస్తువులోనూ సౌందర్యం ఉంటుంది. చూడగలిగితే ఇందులో లేదు, అందులో లేదు, అందులో ఉంది, ఇందులో లేదు అనటానికి ఆస్కారం లేదు, చూసే గుణాన్ని బట్టి ప్రతి చోట సౌందర్యం ఉంటుంది. అయితే సూర్యాస్తమయాలు, వెన్నెల రాత్రులు, పగలు, చీకటులు ఇలా ఎన్నో సుందర విషయాలను చూసి అందరూ ఆనందించలేకున్నారు. అంటే వారికి సహజంగా బాహ్య ప్రకృతిలోని సౌందర్య దర్శనం కలగడం లేదు. ఇందుకు కారణాన్ని అన్వేషిస్తూ సంజీవ్ దేవ్ "మన చుట్టూ ఉన్న సౌందర్యాన్ని మనం ఎప్పుడూ ఆనందించకలుగుతామంటే మన హృదయాల్లో సౌందర్య చేతన మేల్కొని ఉన్నప్పుడే. సౌందర్యోపాసన యొక్క ఒత్తి వెలగందే మన చుట్టూ ఉన్న సౌందర్యం మనకు కురూపపు చీకటిగా గోచరిస్తుంది' [99] అని చెబుతూ *"హృదయంలో సౌందర్యం మేల్కొనసాగినప్పుడు ప్రకృతి అంతా మనకొక లీలానికేతనంగా గోచరిస్తుంది. ఎంత అప్రధానమైన వస్తువైనా మనకొక ఆహ్లాదకర రూపంలో గోచరిస్తుంది. దీని అర్థం మనలోని సౌందర్య తీక్షణత యొక్క పొర మనం చూచే బాహ్య వస్తువుల మీద పడి మనకు ఎంతో సుందరంగా తడతవి"*[100] అంటారు.

పై మాటల్లో మనలోని సౌందర్య తీక్షణత యొక్క పొర మనం చూసే బాహ్య వస్తువుల మీద పడి మనకు ఎంతో సుందరంగా తడతవి అనటం వల్ల సౌందర్యం మనలోనే అంటే ఆస్వాదకుని హృదయంలోనే ఉంటుందనే విషయం స్పష్టం. ఇక సౌందర్య చేతన మేల్కొని ఉండటం అనటం వల్ల ప్రతి మానవ హృదయంలోనూ సౌందర్య చేతన ఉంటుందనే విషయం సంజీవ్ దేవ్ రచనల ద్వారా తెలుస్తుంది. అందుకే సంజీవ్ దేవ్ అన్నట్లు *"జీవితంలో అన్నం తర్వాత సౌందర్యానిదే గొప్ప స్థానం".*[101]

---

[98] సంజీవ్ దేవ్, రస రేఖలు పుట:114

[99] సంజీవ్ దేవ్, రస రేఖలు పుట:263

[100] సంజీవ్ దేవ్, రస రేఖలు పుట:264

[101] సంజీవ్ దేవ్, స్మృతి బింబాలు పుట:257

### 4.2.3. సౌందర్యం యన్నిష్టం

కళాతత్వ సమస్యల్లో కెల్లా సౌందర్యం యన్నిష్టం అనేది అత్యంత ముఖ్యమైన సమస్య. కళాతత్త్వ శాస్త్రంలో ఈ చర్చ ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది. ఇది భారతీయ ఆలంకారికుల మధ్య రస సిద్ధాంతమును పోలి ఉంటుంది. సౌందర్యం అంటే ఏమిటి ? సౌందర్యానుభవ ప్రయోజనం ఏమిటి? మొదలైన విషయాలపై వివేచించిన సంజీవ్ దేవ్ సౌందర్యం ఉనికిని గురించిన వివేచన నిర్ధిష్టపరచారు. ఆయన వివేచన మాములు కళాతత్త్వ శాస్త్రజ్ఞుల కన్న భిన్నంగా ఉండి విశిష్టతను పొందింది. అయన సౌందర్యాన్ని వ్యక్తిగతంగానూ, వస్తుగతంగానూ కూడా భావించిన సౌందర్యం వ్యక్తిగతంగా ఉన్నప్పుడే దాన్ని వస్తువులో చూస్తామని తీర్మానించారు.

కళకు సౌందర్య దృష్టి ప్రధానంగా ఉండాలా ? లేక ఉపయోగదృష్టికూడా ఉండాలా ? అన్నది సౌందర్య చర్చకు సంబంధించిన ఒక కోణం. కళకు సౌందర్య దృష్టి ప్రధానమైందా? లేక సౌందర్య ఉపయోగాల కలయిక మంచిదా ? అసలు రసానుభూతి పొందుతున్నప్పుడు ఉపయోగ సంబంధం ఉంటుందా ? అన్న ప్రశ్నలు సౌందర్య ఉపయోగాలకు సంబంధించిన చర్చలోకి వస్తాయి.

మానవుడు కవిత్వం, సంగీతం, చిత్రలేఖనం, నాట్యం, శిల్పం వంటి మొదలైన కళల సాహచర్యంతో మాత్రమే తన నిత్య జీవితాన్ని గడపలేడు. ఈ కవిత్వ, సంగీత, చిత్ర, లేఖన, నాట్యాదులు మనసుకు అంటే హృదయానికి సంబంధించిన కళలయినందు వలన మానవుడికి భౌతిక ప్రయోజనం తీర్చే కళలు అవసరం. అందుకే A man Should so live as to be like A poem and a thing should so look as to be like a picture [102] అంటారు సంజీవ్ దేవ్.

అంటే మానవుడు కవితలాగా జీవించడం, వస్తువులు బొమ్మల్లాగా కన్పించటం జరిగితే ప్రపంచం ఎంత విచిత్రంగా ఉంటుందో అన్నది సంజీవ్ దేవ్ ఉద్దేశ్యం. వస్తువుల్లో సౌందర్య దృష్టే కాక, మొత్తం జీవిత గమనమే కవితలాగ సుందరంగా ఉండాలని ఆశిస్తున్నారు. ఆయన

[102] సంజీవ్ దేవ్ సంజీవ్ దేవ్ లేఖలు 83

ఆశయానికి అనుగుణంగానే నేడు నిత్యావసర వస్తువులన్నీ కళాత్మకంగా నిర్మించటంతోనే మానవుడు సంతృప్తి చెందుతున్నాడు.

సంజీవ్ దేవ్ దృష్టిలో *"ఉపయోగాని కంటే రసానిదే ప్రధాన స్థానం"*[103] కౌశలము కలది అంతయును కళ కాగలదు. కాని లలిత కళ కాజాలదు. రసానుభూతి ప్రధానమైనవే లలిత కళ. అటులని రసానుభూతిని ఇచ్చెడు కళలు ఉపయోగకారులు కాకూడదను నియమము ఉన్నటుల భావింపతగదు.[104] అన్నది ఈ విషయంలో సంజీవ్ దేవ్ సౌందర్యదృక్పథం. వస్తువులోసౌందర్య ఉపయోగాలను సంబంధించి అంటే ఏది ప్రధానమనే విషయాన్ని గురించి ఆయన అభిప్రాయం కింది విధంగా ఉంది.విషయ ప్రాధాన్యం రూప ప్రాధాన్యానికి వ్యతిరేకమైంది కాదు. ఒక వస్తువు యొక్క ఉపయోగం ఎంతబ ప్రయోజనకరమో ఆ వస్తువు యొక్క సౌందర్యం కూడా అంతే ప్రయోజనకరమే.[105] అంటారు సంజీవ్ దేవ్. అంటే వస్తువు సౌందర్యాన్ని, ప్రయోజనాన్ని రెండింటిని ఇస్తే మంచిదే. మానవాళి జగత్తుకు సౌందర్యమయం, సౌభాగ్యమంతం రెండూ కావాలి. సంజీవ్ దేవ్ దృష్టిలో లలితకళ ఇస్తే ఉపయోగాన్ని సౌందర్యాన్ని రెండింటినీ ఇవ్వాలి. లేదా సౌందర్యాన్ని ఇచ్చి ఊరుకోవాలి. సంజీవ్ దేవ్ దృష్టిలో ఒక వస్తువు ఉపయోగం కంటే అందులో వ్యక్తమయ్యే రసానుభూతే ప్రధానం.

పురాణం సూరిశాస్త్రి, సంజీవ్ దేవ్ ల విమర్శకృషిని చూసినప్పుడు కావ్యాలను, నాటకాలను పురాణం సూరిశాస్త్రి, ఇతర కళలన్నింటిని సమన్వయిస్తూ సౌందర్యాస్తిత్వాన్ని నిర్ణయించే దిశగా సంజీవ్ దేవ్ సౌందర్యశాస్త్ర విమర్శ కొనసాగిందని తెలుస్తుంది.

---

[103] సంజీవ్ దేవ్ సంజీవ్ దేవ్ లేఖలు 55

[104] సంజీవ్ దేవ్, లలిత కళలు సమీక్ష– వికసన చరిత్ర. పుట:18

[105] సంజీవ్ దేవ్, కాంతిమయి 236

## ఐదవ అధ్యాయం

# శ్రీశ్రీ, చలం, బుచ్చిబాబు సౌందర్యశాస్త్ర విమర్శ

ఐదవ అధ్యాయం

# శ్రీశ్రీ, చలం, బుచ్చిబాబు సౌందర్యశాస్త్ర విమర్శ

## 5.0. ఉపోద్ఘాతం

శ్రీశ్రీ కేవలం కవిత్వం మాత్రమే కాకుండా కథలు, వ్యాసాలు, స్వీయచరిత్ర, పాఠకులకు ఇంటర్వ్యూలు ఇస్తున్న సందర్భాల్లో వ్యక్తంచేసిన సౌందర్యశాస్త్ర భావనలను ప్రత్యేకంగా గుర్తించి సమన్వయించాల్సిన అవసరం ఉంది. అలాగే, చలం సృజనశీలిగానే కనిపిస్తున్నా వివిధ సందర్భాల్లో సౌందర్యానికి సంబంధించిన అనేకాంశాలను వెల్లడించారు. కథలు, నవలు, నాటకాలు, మ్యూజింగ్స్ లో ఈ అభిప్రాయాలు కన్పిస్తాయి. ఇదే ధోరణిలో బుచ్చిబాబు రచనలను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ముగ్గురు కూడా ప్రధానంగా సృజనాత్మక రచయితలైనప్పటికీ, సౌందర్యశాస్త్ర విమర్శానాంశాలు వాటిలో కనిపిస్తాయి. వాటితోపాటు ఈ ముగ్గురు కూడా వచనరచనలు కూడా చేశారు. అవి ప్రధానంగా విమర్శ విభాగానికి చెందినవాటిగానే భావించవచ్చు. అలాచూసినప్పుడు పురాణం సూరిశాస్త్రి, సంజీవ్ దేవ్ ల రచనలకంటే భిన్నమైన రచనావిధానాన్ని కొనసాగించినవారిగా చెప్పుకోవచ్చు. అందువల్ల వీరిని ఈ అధ్యాయంలో ప్రత్యేకంగా పరిశీలన చేస్తున్నాను.

## 5.1. శ్రీశ్రీ సౌందర్య దృక్పథం

శ్రీశ్రీ కవిత్వంలోనూ, విమర్శ వ్యాసాల్లోనూ సౌందర్యశాస్త్ర భావనలను గుర్తించే అవకాశం ఉంది. ఆయన రచనల్లోని సౌందర్య భావనలను సౌందర్యశాస్త్రాంశాలతో సమన్వయించడానికి ప్రయత్నిస్తున్నాను. శ్రీశ్రీ చాలా కవితల్లో కవి కవిత్వం రాసేటప్పుడు పడే వేదనను వర్ణించాడు. ఋక్కులు, కళారవి, ప్రతిజ్ఞ , కవితా ఓ కవితా, నవ కవితలు ఖండికల్లో కళాకారుని ఆవేదన వ్యక్తం చేస్తూనే దిశానిర్దేశం కూడా చేశాడు.

శ్రీశ్రీ *"ఏదైతే అనుక్షణ నవీనమైన ఆశ్చర్యం మనకి కలుగజేస్తుందో అదే సౌందర్యం."*[1] అని పేర్కొన్నారు. అంతేగాక దీనికి ఉదాహరణగా ఆయన శాకుంతల కథను

[1] శ్రీశ్రీ వ్యాసాలు. శ్రీశ్రీ. పుట.114

పేర్కొన్నారు. ''శాకుంతల కథ మనకు తెలుసు. అయినా మళ్ళీ శాకుంతలం మనల్ని ఆకర్షిస్తుంది. ఎన్నిసార్లు చదివితే అన్ని సార్లు ఆశ్చర్యం కలుగుతుంది. ఒక కొత్త విశేషం గోచరిస్తుందని''[2] నూతనత్వం విశేషం వల్ల కలిగే నవీనత్వమే సౌందర్యం అని చెప్పాడు. అంటే ఒక కొత్త భావం, ఒక కొత్త జీవకళ, ఒక కొత్త చైతన్యం ఉంటే అదే సౌందర్యం. సౌందర్యంలో నూతనత్వం ఎప్పుడూ ఉంటుంది. అది ఎప్పటికీ పాతబడి పోదు. ఒక కళా ఖండాన్ని చూసి మనం ఆనంద పడతాం. కాని ఆ కళా ఖండాన్ని మనం ఎప్పుడూ చూసిన *మనకీ అదే ఆనందం కలగాలి. ఆనందం నశించకూడదు అప్పుడే అది సౌందర్యం అనిపించుకుంటుంది. "There is no excellent beauty that hath not some strangeness in the proportion"*[3] కొత్తదనం లేకపోతే అద్భుత సౌందర్యం ఉండదు. అని అంటారు ఫ్రాన్సిస్ బెకాన్. మన ఆలంకారికులు సౌందర్యం రచనకి సార్వకాలికతని ప్రసాదించి, రచనలోకి అనుక్షణ నవీనమైన ఆశ్చర్యాన్ని తెచ్చి పెడుతుంది. దీనినే 'అపూర్వత' అని నిర్ధారించారు మన ఆలంకారికులు. నన్నయ కూడా తన భావతావతారికలో *''ఏయది హృద్యమపూర్వం బేయది.....''*[4] అని అపూర్వతని పారిభాషిక పదంగా ప్రయోగించారు. కథ అనేది అపూర్వంగా ఉండాలన్న రహస్యాన్ని ఆలంకారికులు ఎప్పుడో చెప్పారు. రచన అపూర్వతని సాధించినందు వల్లనే అదికళా జగత్తులో శాశ్వతంగా నిలవగలుగుతుంది. ఒక్క సాహిత్య రచనకే వర్తించే సూత్రం కాదిది, మొత్తం కళలన్నింటికీ సార్వత్రికంగా వర్తిస్తుంది. ఇలాంటి సూత్రాలనే కళాతత్త్వశాస్త్రం అందిస్తుంది. ఇదే అభిప్రాయాన్ని చలం ఒక రచన సౌందర్య భరితం అయ్యిందంటే ఇక దానికి మరణం ఉండదని *''సత్యమైనదీ, అందమైనదీ ఎప్పటికీ నశించదు''*[5] అని అంటారు చలం. ఒక కళాఖండానికి శాశ్వతత్వం అందులోని వస్తువు వల్ల కానీ మరే ఇతరమైన అంశం వల్ల కానీ రారు, అది శాశ్వతత్వాన్ని కేవలం అది సాధించుకున్న సౌందర్యం వల్లనే వస్తుంది అని చలం సౌందర్యం మీద చేసిన ముఖ్యమైన నిర్ణయం, అంటే కళా ఖండానికి

[2] శ్రీశ్రీ వ్యాసాలు. శ్రీశ్రీ. పుట.114

[3] *(the new international Webster's comprehensive dictionary of the English language. (Encyclopedic Edition) P: 1850)*

[4] శ్రీ మదాంధ్ర మహాభారతము. ఆది పర్వము. ప్ర.ఆ. 28వ పద్యం

[5] మూజింగ్స్, చలం: పుట286

సౌందర్యమే ప్రాణమని చలం అభిప్రాయం శ్రీశ్రీ అభిప్రాయన్నికి దగ్గరగా ఉందని చెప్పవచ్చు. సంజీవ్ దేవ్ కూడా *''రూపం అనేది రసాత్మకంగా ఎందుకు గోచరిస్తుందీ అంటే దానిలో కొంత అసామాన్యత ఉండాలి. అటువంటి రూపాలు నిత్య జీవితంలో ఎక్కడ పడితే అక్కడ గోచరించకుండా ఉండాలి. ఆ రూపం అతి పరిచిత రూపంగా ఉండకూడదు.''* [6] శ్రీశ్రీ సౌందర్య శబ్దానికి పర్యాయంగా 'ఋక్కులు' అనే గేయంలో 'శోభ' అనే పదాన్ని ప్రయోగించారు.

*''కాదేది కవిత కనర్హం*

*ఔనౌను శిల్పమనర్ఘం*

*ఉండాలోయ్ కవితావేశం*

*కానీవోయి రసనిర్దేశం*

*దొరకదటోయ్ శోభాలేశం''* [7] భారతీయ ఆలంకారిక శాస్త్ర చరిత్రలో 'శోభ' అనే పదానికి ముఖ్యమైన స్థానం ఉంది. సౌందర్యానికి పర్యాయ వాచకాలుగా వాడిన అనేక శబ్దాలలో శోభ ఒకటి. అమరకోశంలో కూడా మనకి ఈ శోభ అనేది సౌందర్యంకు ఒక పర్యాయపదంగా కనిపిస్తుంది.

*''సుందరం రుచిరం చారు సుషమం సాధు శోభనమ్*

*కాంతం మనోహరం రుచ్యం మనోజ్ఞం మంజు మంజులమ్*

*అభీష్టే భీప్సితం హృదయం దయితం వల్లభం ప్రియమ్''* [8] సరస్వతీ కంఠాభరణం రచించిన భోజుడు కావ్యం యొక్క శోభని పెంచేదిగా అలంకారం ఉంటుందని చెప్తూ కావ్యంలోని అందానికి పర్యాయపదంగా శోభ అనే పదాన్ని వాడి దాన్ని కావ్యం యొక్క ఆంతర గుణంగా భావించాడు.

---

[6] సంజీవ్‌దేవ్, 'రూపం రసాత్మకం చిత్రం' (వ్యాసం). నాట్యసుధ. పుట:43

[7] శ్రీశ్రీ, మహాప్రస్థానం. పుట:26

[8] అమరకోశం, తృతీయ కాండం

''వయో వస్థాది సంభూతం, జాజ్జ్యలం రామణీయకం

భూషణా, లేపనాద్యత్ర శోభా సౌందర్య మిష్యతే''[9] అంటే యౌవన దశలో కలిగిన ఉజ్జ్వలత్వం, రామణీయకత, భూషణ లేపనాదులచే కలిగే శోభను సౌందర్యంగా చెప్పారు. అంతేగాక ప్రాచీన కవుల రచనలలో వాచ్యార్థం కంటే అతీతంగా రమణీయార్థం గోచరిస్తూ ఉంటుంది. దీనినే ఆనందవర్ధనుడు స్త్రీలలో మనకి భౌతికంగా కనిపిస్తున్న శరీర భాగాల కంటే అతీతమైన లావణ్యం లాగానే కావ్యంలో కూడా లావణ్యం ఉంటుందని

*''ప్రతీయ మానం పునరన్య దేవ*

*వస్త్వస్తి వాణీషు మహా కవీనాం*

*యత్తత్ ప్రసిద్ధావ యవాతి రిక్తం*

*విభాతి లావణ్య మివాంగ నాసు''*[10] చెప్పాడు. కావ్యంలోని రామణీయకత శబ్దార్థాలకు పరిమితమై ఉన్నట్లుగా అనిపించినప్పటికి సుందరమైన ఒక అన్యార్థం గోచరిస్తూనే ఉంటుంది. దీన్నే వ్యంగ్యార్థమని, వ్యవహరిస్తుంటారు. దీని వలనే మనకి సౌందర్యం గాని, శోభ గాని రచనలో గోచరిస్తుంటాయి. ఇలా సౌందర్యానికి పర్యాయంగా ఆలంకారిక గ్రంథాలలో రమణీయత, రామణీయకతలు కూడా పర్యాయ పదాలుగా కనిపిస్తున్నాయి. వామనుడు కావ్యమలంకార్ణ అంటే, కుంతకుడు సౌందర్యాన్ని కవికర్మ అని వ్యాఖ్యానించాడు.

*''దృష్టోపి శైల స్సము హర్మురారే రపూర్వవత్ విస్మయ మాతతాన*

*క్షణే క్షణే యన్నవతా ముపైతీ, తదేవరూపం రమణీయతా''*[11]

*''రమణీయతాచ లకొత్తరాహ్లాద జనక జ్ఞాన గోచరతా లోకొత్తరత్వాంచ*

---

[9] భోజదేవుడు, సరస్వతీ కంఠాభరణము. వాఖ్యాత . టి. భాస్కరరావు. పుట:446

[10] ధ్వన్యాలోకం 1–4

[11] మాఘుడు. శిశుపాలవధ. 4–17

*ఆహ్లాద గతిశ్చమత్కార పర్యయోను భవ సాక్షికో జాతివిశేష్ట''*[12] కావ్య సౌందర్యాన్ని వ్యక్తం చేయడానికి అన్ని పదాల్ని వాడటం కావ్యశాస్త్రంలో ఆలంకారికులు చేసిన గాఢ పరిశోధనను వ్యక్తం చేస్తుంది.

శ్రీశ్రీ తన కవితలో రస నిర్దేశం చెయ్యమని అంటున్నాడు. కళాతత్త్వ శాస్త్ర రీత్యా మన మనస్సు సంపూర్ణమైన సాత్త్విక స్థితిలో ఉన్నప్పుడు సౌందర్యం, అసౌందర్యం అనే ద్వంద్వాలు, కష్ట సుఖాలు అనే ద్వంద్వాలు నశించిపోయి సంపూర్ణమైన సత్యం, సౌందర్యం మనకి కనిపిస్తాయి. లోకంలో రస భావాన్ని పొందని వస్తువు అంటూ ఏమి ఉందదు. అందుకే శ్రీశ్రీ కాదేదీ కవిత కనర్హం అంటున్నాడు. శోభాలేశం దొరికితేనే రస నిర్ధేశ్యం చేయగలమని చెబుతున్నాడు.

దీన్నే షెల్లి కవిత్వం అన్నది సర్వ వస్తువులను సమ్మోహనం చేస్తుందని, స్వయంగానే అందంగా ఉన్న దాన్ని మరింత రమణీయంగా చేస్తుందని వికృతమైన దాన్ని అందంగా మలుస్తుందని *"Poetry dons all things to liveliness it exalts the beauty of that which is not beautiful and it adds beauty to that which is deformed"*[13] కవితావేశం ఉన్నప్పుడు సర్వ ప్రపంచం శోభాయామానంగా కనిపిస్తుందని చెప్పాడు. గుంటూరు శేషేంద్ర శర్మ తన 'కవిమేనఫెస్టోలో కవిత్వం గురించి లోకంలో ఉన్నదాన్ని ఉన్నట్లు కవిత్వంలో పెడితే అది ఉదాత్తంగా ఉండదు. గ్రంథన కౌశల్యం, రస నిర్దేశ్యం వల్ల కవితా వస్తువుకు ఉదాత్తత చేకూరుతుందని ''మానవ జీవితాన్ని తిని దాన్ని మన మీద వమనం చేయడం మాత్రం సాహిత్యం కాదు. మానవ జీవితాన్ని జీర్ణించుకొని ఆ బలంతో ఒక మాట చెప్పడం సాహిత్యం''[14] అని చెప్పారు.

శ్రీశ్రీ చెప్పిన శోభకు ఆలంకారిక గ్రంథాలలో రమణీయత, రామణీయకత అనేవి పర్యాయ పదాలుగా కనిపిస్తున్నాయి. అనుక్షణం నవీనత్వాన్ని కలిగించడం,లోకోత్తరమైన ఆహ్లాదం కలిగించడం రామణీయకతా లక్షణంగా చెప్పవచ్చు. అందుకే శ్రీశ్రీ చెప్పిన నవ్యత

---

[12] వాదాల తిరువెంగళాచార్యులు (వ్యాఖ్యాత), ఆంధ్ర రసగంగాధరము. పుట:10,11

[13] ఎస్.వి. జోగారావు. సాహిత్య భావలహరి. పుట:113

[14] పుట:218

అనేది రామణీయకతకు సంబంధించిన లక్షణమే గాని వస్తువుకు గాని, కాలానికి గాని సంబంధించింది కాదని తెలుస్తుంది. అందుకే శ్రీశ్రీ కూడా శాకుంతలం కథ మనకు బాగా తెలిసిన కథే అయినా మనం ఎన్నీ సార్లు చదివినప్పటికి అది మనల్ని ఆకర్షిస్తుంది. ఎన్ని సార్లు చదివితే అన్ని సార్లు మనకి ఆశ్చర్యం కలిగిస్తుంది దానికి కారణం అందులోని నిత్య నవీనత్వమే అంటారు.

### 5.1.1. సౌందర్యం మనోగతం

శ్రీశ్రీ శోభ అనేది మనం చూసే చూపును బట్టి అది మనకు వస్తువులో ఉన్నట్లు అనిపిస్తుందని చెబుతూ ''కళ్లంటూ ఉంటే చూసీ, వాక్కుంటే వ్రాసీ''[15] అది కవి ప్రతిభ మీద ఆధారపడి ఉంటుందని లేక పోతే కవి దర్శించింది ఒకటయితే పాఠకుడు చేతే దర్శింప చేసేది మరొకటి అవుతుందని చెప్తున్నాడు. లోకంలో అందరూ చూసే విధానానికి కవి చూసే విధానానికి కొంతైనా వైవిధ్యం ఉంటుందని రవి గాంచనిచో కవి కాంచును అన్న మాటల ద్వారా భౌతిక దృష్టికి అతీతమైన వస్తువు లోతును కవి యొక్క అంతర్నేత్రం దర్శిస్తుందని తెలుస్తుంది.

వస్తువులో సౌందర్యం ఉందనే విధంగా కవి దర్శనం మనకి కనిపించినప్పటికి అంత మాత్రాన సౌందర్యం వస్తువులో ఉందని కాదని నువ్వు చూడాలే గాని, నీకు చూసే శక్తి ఉండాలే గానీ శోభ లేశ మాత్రమైనా దొరికితీరుతుందని చెప్పి సౌందర్యం మనోగతమే అనే అభిప్రాయన్ని వెలిబుచ్చాడు శ్రీశ్రీ. ఎడిసిన్ పేర్కొన్నటూ లోకంలో మనకి అసహ్యంగా కనిపించేది కూడా కవి యొక్క వర్ణన మహాత్యం వల్ల అది మనకి అందంగా గోచరిస్తుంది. అంటే మనస్సు భౌతిక వస్తువుని శబ్ద జన్య భావాల్ని తులనాత్మకంగా పరిశీలిస్తుంది. అందుచే మనకి ఆనందం కలుగుతుందని అది మనకి కవి వ్యాపారం వల్ల కలుగుతుందని చెప్పాడు.

*"Anything that is disagreeable when looked upon, pleases us in an apt description. Here, therefore we must inwhire a new principle of pleasure, which is nothing else but the action of mind, which*

[15] మహా ప్రస్థానం. పుట:26

*compares the ideas that arise from words with the ideas that wise from the objects themselves. For this reason, therefore, the description of a dung hill is pleasing to the imagination if the image be represented to our mind by suitable expressions*"[16] అందుకే శ్రీశ్రీ *"కళ్ళుంటే చూసి"*[17] అన్నది ఇందుకే. జార్జి సాంటాయన కూడా కళలో సౌందర్యం భావనను గురించి తెలుపుతూ *"కళా విమర్శకుడు తనలో అంతర్గతంగా ఉన్న భావాల్ని ఆధారం చేసుకొని కళలోని సౌందర్యం యొక్క విలువల్ని చూడగలుగుతున్నాడని ఆ విధంగా చూడబడుతున్నదే సౌందర్యమని వ్యాఖ్యానించాడు."*[18]

మనలో సౌందర్యాన్ని చూసే శక్తిని బట్టి కూడా మనకి సౌందర్య దర్శనం కలుగుతుంటుంది. అంటే అది అందరికీ ఒకే విధంగా కాక ఒక్కొక్కరికీ ఒక్కో విధంగా కనిపిస్తుటుంది. వ్యక్తి చూడగలిగితే అనంతంగా ఉండే సౌందర్యం ఎటుచూసినా కనిపిస్తుంది. ఇదే అభిప్రాయానే శ్రీశ్రీ పైన పేర్కొన్నారు. "నిక్కముగా రస నిలయము ప్రేక్షక హృదయమే కాని రమ్య వస్తువు కాదు. అందుచేతనే రసానుభవమునకు సహృదయత అవశ్యమని పెద్దలు చెప్పుచున్నారు.

మన బుద్ధులు, తెలువులు, విజ్ఞానానుభవములు, ఆత్మ ప్రబోధములు, జీవితానుభవములు, శక్తి యుక్తులు, భావ చాంచల్యము, రసానుభవములు ఎంతవరకు విప్పాంగా యుండునో, అంతవరకే స్వానుభవాను రూప వికసనముననే అది రమ్య వస్తువులందగ పడగలవు.[19] అని పురాణం సూరిశాస్త్రి కూడా సౌందర్యం మనోగతమే అని తెల్పారు. అంతేగాక శ్రీశ్రీ రసానికి సౌందర్యానికి భేదం లేదని చెప్తున్నాడు. ఎందుకంటే రసం యొక్క ముఖ్యలక్షణం చిత్తద్రుతిని కలిగించడం. కవితావేశం ఉంటే చిత్తద్రుతి కలుగుతుంది.

---

[16] Krishna Chaitanya. Sanskrit Poetics. P:50

[17] శ్రీశ్రీ. మహాప్రస్థానం. పుట:29

[18] Encyclopedia of Britannic P: 151,152

[19] పురాణం సూరిశాస్త్రి. విమర్శక పారిజాతము పుట:258,259

అప్పుడు ఎదుటి వస్తువులోని శోభ, అప్రత్యక్ష ప్రతీయ మానవత్వం మనకు గోచరిస్తుందనీ అందుకే ''*రసానికి సౌందర్యానికి భేదం లేదని చెబుతారు''*[20] అని చెప్పాడు.

శ్రీశ్రీ సాహిత్యాన్ని పరిశీలించినట్లయితే మొదట్లో ఆయనకు రీతి, ధ్వని మీద మక్కువ ఎక్కువ అనే విషయం అవగతమవుతుంది. కానీ ఆయనే తను గానీ, ఇతరులు గానీ ధ్వని కావ్యాన్నింత వరకు రచించలేదని, అది కమ్యూనిజం వచ్చిన సమాజంలోనే సాధ్యమనీ చెప్పడం వల్ల ఆయన రచనలలో ధ్వని ప్రధానం కాదనే సందేహం కలగినప్పటికి ఆయనే స్వయంగా కవిత్వం యొక్క లక్షణం పేర్కొంటూ చెప్పిన *''ఒక ఆలంకారికుడిగా మాట్లాడి వలసి వస్తే ధ్వన్యాలంకారాన్ని అభిమానిస్తున్నానని చెప్పాలి. కమ్యూనిజాన్ని ధ్వనించేది కవిత్వమని ఒకప్పుడు నేనన్న మాట ఇక్కడ జ్ఞాపకం చేస్తున్నాను.''*[21] అన్న మాటలలో ఆయనకు ధ్వన్యాలంకారం అన్నను అభిమానమని తెలుస్తున్నది. ఆయన మరోక చోట ''నాకు తెల్సింది స్వల్పమని ఇప్పటికీ అనుకుంటాను. రీతి రహస్యా కావ్యమ్ అన్నాడు వామనుడు. జీవితం వ్యంగ్య వైభవమ్ అన్నాడు పండిత రాయలు. ధ్వని ఉన్నదే కావ్యమన్నాడు ఆనంద వర్ధనుడు.

శ్రీశ్రీకి Poetry is nothing else but Dhvani. నేను అవును అంటే దానర్థం కాదు అని. నేను కాదంటే దానర్థం అవును. నేనే ఒకటి అంటే దానర్థం ఒకటి. అదే ధ్వని. ఊరికే ప్రగల్భాల కోసం చెప్పానే గానీ నేను రీతి కవిని గానీ, ధ్వని కవిని కాదు. మొత్తం ప్రపంచం లోనే ధ్వని కవులు లేరు. విశ్వనాథ కూడా రీతి కవే. ధ్వని కమ్యూనిజాన్ని ధ్వనించినప్పుడే ధ్వని.''[22] అని వాచ్చార్థాన్నికి అతీతంగా ఉండే వ్యంగ్యార్థాన్ని స్ఫురింప చేసే ధ్వని కవిత్వాన్ని తను గానీ, ఇతరులు గానీ రాయలేదని చెప్పాడు.

కావ్య శాస్త్రంలో ప్రధాన సిద్ధాంతాలైన రీతి, ధ్వని, రసం మొదలైన వాటిని శ్రీశ్రీ చదివాడు. కాని వాటిని యధాతథంగా అంగీకరించలేదు. వాటిని ఆధారంగా చేసుకొనే కొన్ని కొత్త సిద్ధాంతాన్ని చెప్పడానికి ప్రయత్నించారనిపిస్తుంది. రసంతో సంబంధం ఉన్న 'రసన' అనే కొత్త అభిప్రాయాన్ని ప్రకటించారు. అంతేకాకుండా రీతి మీద కొన్ని మౌలిక విషయాలను

---

[20] శ్రీశ్రీ వ్యాసాలు. సంక్షుబ్ద సౌందర్యం. పుట:99

[21] శ్రీశ్రీ. ప్ర.జ. పుట:173

[22] శ్రీశ్రీ. ప్రజ. పుట:22

కూడా ప్రస్థావించడం జరిగింది. ఆయన రీతి మీద తన అభిప్రాయాలను పేర్కొనే సందర్భాలాలలో కేవలం భారతీయుల పారిభాషిక పదాలే కాకుండా, పాశ్చాత్య పారిభాషిక పదాలు కూడా ప్రయోగించడం జరిగింది. ఆయన ఒక చోట 'వ్యాఖ్యాత కొన్ని సామాన్య సూత్రాలకు లంగే ప్రధాన ప్రవాహాలకు వంతెనలు నిర్మిస్తూ ఉంటాడు. అపుడతని లాక్షణికుడంటారు.'[23] అని పేర్కొంటూ కేవలం వ్యాఖ్యాతలు, విమర్శకులే కాకుండా కవులు కూడా తమ కభిమానమైన సాహిత్య సిద్ధాంతాల మీద కొన్ని అభిప్రాయాలను వెలువరిస్తుంటారని వాటిని వివేచించడం అవసరం అని పేర్కొన్నారు. ఆయన రచనలు పరిశీలించినట్లయితే శ్రీశ్రీలో సృజనాత్మక రీతి నిర్వహణ కనిపిస్తుందే తప్ప, దాన్ని రసాభిముఖంగా ప్రయోగించాలి అన్న స్పృహ ఉన్నట్లు మనకి అనిపించదు. కానీ ఆయన రచనలోని రీతి 'రస స్ఫూర్తి' మాత్రం కలిగిస్తుందని మాత్రం అవగతమవుంతుంది. ఉదాహరణకు ఆయన మహాప్రస్థానం లోని 'బాటసారి' కవితను పరిశీలించినట్లయితే

*''కూటి కోసం కూలి కోసం*

*పట్టణంలో బ్రతుకుదామని*

*తల్లి మాటలు చెవిని పెట్టక*

*బయలు దేరిన బాట సారికి*

*మూడు రోజులు ఒక్క తీరుగ*

*నడుస్తున్నా దిక్కు తెలియక*

*నడి సముద్రపు నావ రీతిగ*

*సంచరిస్తూ, సంచలిస్తూ*

*దిగులు పడుతూ దీనుడౌతూ*

[23] శ్రీశ్రీ. మన గురజాడ. పుట:15

*తిరుగుతుంటే...''*[24] పల్లెలో జీవనం గడవక పట్టణానికి బయలు దేరిన సామాన్యుని కష్టాలను కళ్ళకు కట్టినట్లు చెప్పడమే కాకుండా దీనికి హృదయాన్ని కదిలించే మాధర్య గుణ సంకలితమైన వైదర్భీ రీతిని వాడటం ఆయన ప్రత్యేకత.[25] దీనిలో శబ్దం వల్లనే కరుణ రసస్ఫూర్తి కూడా కలుగుతుంది. ఆయన తన కవిత్వంలో రీతి ఉంటుందని కానీ దాన్ని అనుసరించడం అసాధ్యమని చెప్పారు. అందుకే ఆయన *''నా శైలి వేరు..అందులో రైమూ ఉంది. రీజనూ ఉంది. అదే నా శైలి. నాకు తెలుసు నా మీద వచ్చే విమర్శలు. శబ్దగత ప్రాణం శ్రీశ్రీ కవిత్వం అని. అర్థగత ప్రాణుల అనర్థ భాష అది. శబ్దం ప్రథమం.అర్థం ఆ తరువాత''* [26] ఎంత గొప్ప భావం అయినా రీతి లేకుండా, టెక్నిక్ లేకుండా చెబితే గొప్ప కళ కాదని ''ఒక కళా ఖండం కళగా నిలదొక్కుకోవాలంటే అంతర్ స్వరూపమైన కంటెంట్‌తో పాటు బహి: స్వరూపమైన సారం కూడా అవసరమే. భావం కంటెంట్ కి సంబంధించింది. శైలి ఫార్మ్‌కి సంబంధించింది.''[27] అని పేర్కొన్నారు.

**5.1.2. కళా దృక్పథం**

కళాతత్త్వ అంశాలుగా శ్రీశ్రీ చెప్పినవి అన్ని కళలకు సంబంధించేవిగా కన్నా, సాహిత్యానికి సంబంధించి ఎక్కువగా ఉన్నాయని చెప్పవచ్చు. దీనికి కారణం ఏ కళకు సంబంధించిన కళా కారుడు ఆ కళ యొక్క భూమికతో, దానికి అధిక ప్రాధాన్యాన్నిస్తూ సిద్ధాంతాన్ని రూపొందించడానికి ప్రయత్నించడం.

శ్రీశ్రీ చేసిన సిద్ధాంత చర్చ సాహిత్య కళా స్పర్శను అధికంగా కలిగి ఉంది. మన భారతీయులు కూడ "*It is the Aesthetics of poetry that has been studied in great detail in India today. The aesthetic of music, painting, sculpture and architecture have not received the same attention as the*

---

[24] పుట:37

[25] నరేష్ బాబు, డి. *శ్రీశ్రీ రచనలు – కళాతత్త్వ శాస్త్ర దృక్పథం.* (ఎం.ఫిల్. ఆముద్రిత సిద్ధాంత వ్యాసం)

[26] శ్రీశ్రీ వ్యాసాలు. పుట:129

[27] శ్రీశ్రీ. ప్ర.జ. పుట:219

*aesthetics of poetry"*[28] చాలా మంది సాహిత్య భూమికతోనే సాహిత్య తత్త్వ చర్చగానీ, కళా తత్త్వ చర్చగానీ చేశారు

శ్రీశ్రీ కావ్య ప్రయోజనం గురించి పేర్కొంటూ *'ఉన్నదున్నట్టు చెప్పాలనీ, జరిగింది జరిగినట్టు రాయాలనీ నా తపన... అది చేతగాక కాదు ఇష్టం లేక ఇలా రాస్తున్నాను. పోనీ, పోనీ పోతే పోనీ, సతుల్ సుతుల్ హితుల్ పోతే పోనీ. ఈ త్యాగమంతా ఎందుకంటే కానీ కానీ గానం, ధ్యానం, హాసం లాసం అనగా ఒకటి రెండు మాటల్లో చెప్పాలంటే కళ కోసం కవిత్వం కోసం. శివేతర క్షతి నా ధ్యేయం"*[29] అని లౌకిక ప్రయోజనమైన శివేతరక్షతి కూడా ప్రధానమని పేర్కొన్నారు. శ్రీశ్రీ కావ్యం యొక్క ప్రయోజనం కళ కోసం అని కవిత్వం కోసం అని చెబుతూనే దాని ప్రయోజనం దానిదే అని పేర్కొనడం గమనించవచ్చు. శ్రీశ్రీ కవిత్వం యొక్క లక్షణం గురించి చెప్తూ *"ఒక ఆలంకారికుడిగా మాట్లాడివలసి వస్తే ధ్వన్యలంకారాన్ని అభిమానిస్తున్నానని చెప్పాలి. కమ్యూనిజాన్ని ధ్వనించేది కవిత్వమని ఒకప్పుడు నేనన్న మాట ఇక్కడ జ్ఞాపకం చేస్తున్నాను."*[30] అని పేర్కొన్నారు.

శ్రీశ్రీ కళ కళాకారుని జీవితం గురించి పేర్కొంటూ కళకీ జీవితానికీ అవినావభావ సంబంధం ఉందని చెప్తూ *"నా మట్టుకు కవిత్వం ఒక ఎడతెగని అన్వేషణ. నా జీవితం కూడా అంతే, కవిత్వంలో జీవితాన్నీ, జీవితంలో కవిత్వాన్ని వెదుక్కుంటూ ఉంటాను"*[31] నిజమైన కళాకారుల జీవితాల్లో గొప్ప ఆందోళన, తిరుగుబాటు, ఆదర్శ ప్రయత్నం అనేవి గొప్పగా ప్రతిఫలిస్తుంటాయి. వారు ధనానికీ, చవక కీర్తికీ, సుఖానికీ అలవాటు పడి ఉండరు. జీవితంలో నైతికత లోపించిన కళాకారులు పైకి ముసుగులేసుకొని తమ రచనల్లో తాము నిజాయితీ కలవారమని, నిబద్ధత ఉన్నవాళ్ళమని చెప్పుకొంటూ ఉంటారు. కళాకారుడు తనకి వస్తున్న భౌతిక సుఖాలనీ, ఆనందాలనీ నిరాకరిస్తాడు, బాధలకు ఆహ్వానం పలుకుతాడు, అందరూ సుఖాలకూ పొంగి పోతున్నప్పుడు తానొక్కడూ సుఖానికి దూరంగా జరిగిపోతుంటాడు. అతను

[28] G. Hanumantha Rao – Comparative Aesthetics page: 6

[29] శ్రీశ్రీ. అనంతం. పుట:78, 79

[30] శ్రీశ్రీ. ప్రజ్ఞ పుట:173

[31] శ్రీశ్రీ వ్యాసాలు. శ్రీశ్రీ. పుట.246

ఆరాట పడిన కొద్దీ, నలిగిన కొద్దీ, శ్రమపడి అన్వేషించిక కొద్దీ ఇతరులు వినలేని గానామృతాన్ని అనుభవించగలడు. అతడే శ్రీశ్రీ చెప్పిన కళారవి.

శ్రీశ్రీ కళ గాని కళాకారుడు గాని ఎవరికీ బందీలు కారనీ చెప్తున్నాడు. నిజమైన కళ అనేది కళాకారునికే బందీ కాదు. దీన్ని గురించి చెబుతూ కళా యాత్రికులకి శాశ్వతమైన రాజ మార్గాలంటూ ఏవి లేవని చెబుతూ రోజర్ ఫ్రై యొక్క అభిప్రాయన్ని ఉటంకించాడు *"We have no longer any system of aesthetic which can rule out, a priori, the most fantastic and un real artistic forms. They must be judged in themselves and by their own standards."*శ్రీశ్రీ.[32] వారి వారి అర్హతలను బట్టి ఏ కళాకారుడికి ఆ కళా కారుడు స్వతంత్రంగా మార్గాలు నిర్మించుకోవాల్సిందే తప్ప అందరికీ సర్వసామాన్యమైన ఒకే మార్గం అంటూ ఏదీ లేదని అర్థం.

శ్రీశ్రీ గొప్పవాడైనా కళాకారుడు గొప్ప గొప్ప నియమాల్ని ప్రశ్నిస్తాడని పేర్కొన్నారు. ఆయన కళలలోని నియతిరాహిత్యం గురించి ఏ లలిత కళయినా నిత్యం ఒకే పంథాలో నడవడం సహజం కాదని *"ప్రయోగం లేకపోతే సైన్స్ లేదు. ఈ సూత్రం కళలకు కూడా వర్తిస్తుంది."*[33] అంటే లలిత కళలు నియతిననుకసరించి నిత్యం ఒక రీతిలో నడవడం సాధ్యమయ్యేది కాదు కాబట్టి మార్పు అనే లక్షణం లలిత కళల స్వభావంలోనే ఉందనుకోవచ్చు.

కవిత్వం గాని మిగిలిన లలిత కళలు ఏవైనా గానీ నిత్యం ఒకే మూస పద్ధతిలో నడవడం సహజం కాదని అది వాటి స్వభావం కాదని శ్రీశ్రీ చెబుతున్నాడు. కవిత్వంలోనూ లలిత కళలలోనూ సామాన్యంగా కనిపించే కొన్ని మౌలిక తాత్త్వికాంశాలను గమనించి కావ్యశాస్త్ర వేత్తలు, కళా తాత్త్విక శాస్త్ర వేత్తలు కావ్య శాస్త్రానికి సంబంధించిన కళాతత్త్వ శాస్త్రానికి సంబంధించిన కొన్ని లక్షణాలను సిద్ధాంతాలను ఏర్పాటు చేస్తుంటారు అలాంటి నియమాలను గురించి శ్రీశ్రీ *"ఏ కళాకారుడైనా నవరించే నియమానికి విధేయంగా ఉంటాడన్నాడొక గొప్ప ఆర్టిస్ట్. నిజమైన కళాకారుడు ఆ నియమాన్నే ప్రశ్నిస్తాడన్నాడు అంత కన్నా గొప్ప ఆర్టిస్ట్"*[34]

[32] శ్రీశ్రీ. శ్రీశ్రీ వ్యాసాలు. పుట 307

[33] శ్రీశ్రీ. అనంతం. పుట:134

[34] శ్రీశ్రీ. అనంతం. పుట:140

అనటంలో ప్రతిభావంతుడైన కళాకారుడి యొక్క ప్రశంసనీయమైన కళాసృష్టి వలన కళలో ఏర్పడిన సిద్ధాంతం లేదా నియతిలో పాతది విస్మృతమై పోతుందనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. అంతేగాక లాక్షణిక గ్రంథాలలో గానీ, కళా సూత్రాలలో గానీ ఏదైనా మార్పు వచ్చినట్లయితే ఆ తరువాత వచ్చిన కళాకారులు కూడా దాన్ని అనుసరించే కళా రచన చేయడం జరుగుతుంటుంది. కానీ నిజమైన కళాకారుడు కళా సూత్రాలలో ఆ మార్పు రావడానికి గల కారణం ఏమిటి? అని ప్రశ్నిస్తాడు.

కళాతత్త్వ శాస్త్రం చేసే పని కూడా ఇటువంటిదే. సాధారణంగా కళాతత్త్వ శాస్త్రంలో కళ యొక్క సిద్ధాంతాల గురించి కళ యొక్క గమ్యం గురించి నిరంతరం చర్చ జరుగుతూ ఉంటుంది. ఈ రకమైన ప్రశ్నలనే శ్రీశ్రీ తన మహా ప్రస్థానంలోని 'దేశ చరిత్రలు' గేయంలోని చివరి భాగంలో కనిపిస్తున్నాయి.

*''ఏ శిల్పం? ఏ సాహిత్యం*

*ఏ శాస్త్రం? ఏ గాంధర్వం*

*ఏ వెల్లులకీ ప్రస్థానం?*

*ఏ స్వప్నం? ఏ దిగ్విజయం''* అని శిల్పం, సాహిత్యం మొదలైనవి అన్నీ కూడా సాంఘిక ప్రయోజనం కాక్షించి వాటి ఆశయంగా సాగాలని సూచిస్తున్నాడు శ్రీశ్రీ. అంతేగాక ఏ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రస్థానాన్ని ఇవన్నీ సాగిస్తున్నాయని ప్రశ్నిస్తున్నాడు శ్రీశ్రీ. ఇదేవిధంగా ఆలోచనలు సాగించిన ప్రాశ్చాత్య అలంకారికుడు సౌందర్య మీమాంసాలో క్రోచే ప్రతి పాదించిన అంశాలు ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి. క్రోచే 1920లో 'ఈస్తటిక్స్' అనే గ్రంథాన్ని రాశారు. ''కవిలోక సామాన్యాలూ, దురతిక్రమాలు అయిన కావ్య శాస్త్ర నియమాలను, ప్రక్రియలనూ కాదని వైయక్తికానుభూతులకూ, వాటి దర్శనాభి వ్యక్తికీ అవకాశమిచ్చే నూత్న సృజన రీతులకు మార్గం చూపడంలో క్రోచే కళాతత్త్వ వివేచన మొదలైంది. కవిత్వాన్ని ఏ చట్రంలోనూ ఇమడ్చరాదనేది క్రోచే అచంచల విశ్వాసం. పక్షపాత రహితమూ, శాస్త్రీయమూ అయిన ప్రయోజనాన్ని ఆశించినప్పుడు వైయక్తిక దర్శనం నుండి

అమూర్తం వైపు దృష్టి సారించాలే తప్ప అమూర్తం నుండి వైయక్తిక దర్శనానికి ప్రయత్నించరాదని క్రోచే భావించాడు. అన్ని రకాల కళాభివ్యక్తీ కేవలం ఇంద్రియ పరితోషణ మాత్రమే కాదని క్రోచే పేర్కొన్నాడు. రసాన్నీ, కవితాత్మనీ వేరు చెయ్యలేమని అతడు భావించాడు. భావగీతం, నాటకం, మహా కావ్యం అనే మూడింట్లో గల కవితా ధర్మం ఒకటే నని అతడు భావించాడు.

క్రోచే అనుభూతిని కళా విషయంగా లేదా కళలోని ప్రధానాంశంగా చెయ్యడం ద్వారా కళకు, కళాత్మక విలువకు గల నిర్వచనాన్నే మార్చివేసాడు. అనుభూతి అనేది ఒక రకమైన గాఢంగానూ, ఉద్వేగంగానూ ఉంటుందని, ఇది గుర్తింప దగిన స్వభావం గల దర్శనాభివ్యక్తి ననుసరించి ఉంటుందే గానీ దీనికి వేరే లక్షణం ఉండదని క్రోచే పేర్కొన్నాడు. మానవ చైతన్యంతో నిర్మితమైన ప్రకృతి కంటే భిన్నమైన పరిశుద్ధ ఆధ్యాత్మిక చైతన్యంతో నిండిన కళా ప్రపంచాన్ని గూర్చి క్రోచే వివరించాడు. కళా ప్రపంచమంతటా వాస్తవిక ప్రకృతిని నిరాకరిస్తూ వాస్తవం కంటే వాస్తవం వెనుక నున్న అమూర్త భావనను, దాని యధార్థ స్వభావాన్ని గుర్తిస్తూ అతడు తన సిద్ధాంతంలో ముందుకు పోతాడు. క్రోచే దృష్టిలో దార్శనికత ఉందంటేనే చాలు. అభివ్యక్తి ఉన్నట్లే. అతడు జ్ఞానానికి రెండు రకాల రూపాలున్నాయని అందులో ఒకటి దార్శనికమైనదని, రెండోది తార్కికమైనదని పేర్కొన్నాడు.

ఒకటి ఊహ వల్ల కలిగినది, రెండోది బుద్ధి వల్ల సాధ్యమైనదని చెప్పాడు. వ్యక్తి నిష్ఠమూ, సార్వజనీనమూ అని జ్ఞానం రెండు విధములని ఒకటి వస్తువులకీ, వాటి సంబంధానికీ చెందినది. రెండవది భావ చిత్రాలకీ, భావనలకీ సంబంధించినది. భావచిత్ర కల్పనా సామర్థ్యంలో కళా ప్రాదుర్భావం కనిపిస్తుంది. మానసిక ప్రపంచాన్ని మనం స్వాయత్తం చేసుకున్నప్పుడు మనం దాన్ని స్పష్టంగా, సర్వాంగీణంగా ఒక శిల్పంగా గాని, చిత్రంగా గాని, మన భావనా లోకంలో మలుచుకున్నప్పుడు మన సంకల్పంలో ఒక స్వర రచన రూపు కట్టినప్పుడు – అదే క్షణంలో అభివ్యక్తి పుడుతుంది. మనసులో అభివ్యక్తమైన దాన్నే మనం తిరిగి పాటగానో, మాటగానో బహిర్గతం చేస్తాము. అని క్రోచే తన సిద్ధాంతంలో పేర్కొన్నాడు. క్రోచే సిద్ధాంతంలో కళలో వికృతత్వానికి స్థానం లేదు.[35]

[35] విశ్వనాథ సౌందర్య దర్శనము: యు.ఎ. నరసింహ మూర్తి 2009 పుట:30, 31

క్రోచే బౌమ్ గార్టెన్ పుట్టని బిడ్డకి నామకరణం చేశాడని ఈ పేరు కొత్తదైనా ఇందులో కొత్త విషయం అంటూ ఏమి లేదని, ఆ తాత్త్విక కవచం వెనుక బలిష్టమైన దేహం లేదని క్రోచే అన్నాడు.[36] కళాతత్త్వ శాస్త్రంలో అభివ్యక్తి సిద్ధాంతానికి పట్టం కట్టిన క్రోచే ఈ శాస్త్రాన్ని గూర్చి మొదట చెప్పిన ఖ్యాతి ఇటలీ దేశీయుడైన Gliambattista Vico కు దక్కవలసి ఉందని అన్నాడు.

కళ వ్యక్తీకరణకి ఒక రూపమని ఒక సాధారణ నమ్మకం, ఇంకా ఇది భావ వ్యక్తీకరణా, కాదా అని కూడా. దీని మీద అనేక చర్చలు జరిగాయి. అసలు కళ అంటే ఏమిటి, అది ఎలా వ్యాప్తి చెందింది అన్న ప్రశ్నకు సమాధానంగా టాల్ స్టాయ్

*"art is a human activity consisting in this, that one man consciously by means of certain external signs, hands on to others feelings he has lived through, and that others are infected by these feelings and also experience them"*[37] ఒక మనిషి తన భావాలు, సంకేతాల ద్వారా తన జీవనానుభావాలని వ్యక్తీకరిస్తే వాటిని ప్రక్క మనిషి అనుభవించడమే కళ. ఈ వ్యక్తీకరణ వాదం పాశ్చాత్య అలంకార శాస్త్రపు 1850-1930 మధ్య కాలంలో బాగా ప్రాచుర్యం పొందింది. ఇందులో ముఖ్యంగా క్రోచే, కొలింగ్ ఉడ్ ముఖ్యులు.

క్రోచే కళని ఒక ఉద్దేశ్యంగా భావించాడు. ఇది టాల్ స్టాయ్ భావాలకి ప్రతిబింబంగా అనిపిస్తుంది. క్రోచే తన భావం టాల్ స్టాయ్ భావాలకి భిన్నమని నిరూపించటానికి ప్రయత్నించాడు. కానీ వీటి మధ్య గీత గీయటం చాలా కష్టం క్రొస్ ప్రకారం

*"What lends coherence and unity to intuition is intense feeling. Intuition is truly such because it expresses an intense feeling and can arise only when the latter is its source and base. Not idea but intense*

---

[36] Benedetto Croce, Aesthetic, IV Chapter, Page: 218, 219

[37] Tolstoy, L. (1930) What is Art?, trans. A . Maude, Oxford: Oxford University Press. Page: 123

*feeling is what confers upon art the ethereal lightness of the symbol."*[38]

ఒక తీవ్రమైన, గంభీరమైన భావన ఉద్దేశ్యానికి దారితీస్తుంది. ఎందుకంటే ఉద్దేశ్యం కూడా ఒక తీవ్రమైన భావనే కాబట్టి, ఉద్దేశ్యానికి వాస్తవ, అవాస్తవ భేదం ఉండదు. ఇది కేవలం ఒక భావన కనుక ఇది ఒక రకంగా అరూపంగా ఉంటుంది. అలాగే కళ కూడా భౌతికమైనది కాదు. ఇది జీవన స్ఫూర్తిని సూచిస్తుంది.

*"Art is symbol, all symbol, that is all significant. But symbol of what? Signifying what? Intuition is truly artistic, is truly intuition and not a chaotic accumulation of images, only when it has a vital principle which animates it and makes for its complete unit."*[39]

తీవ్రభావనని సూచించేదే కళ అని , కళని తీవ్ర భావాలకి సంకేతంగా వాడతారని అంటారు. కానీ ఇతని సిద్ధాంతాలకి చాలా అభ్యంతరాలు ఉన్నాయి. మొదటిగా కళని దాని మూలాల నుండి చారిత్రక ఆధారాలను బట్టి అవి తీవ్ర భావ వ్యక్తీకరణలుగా భావించటం. ఉదాహరణకి షేక్స్ పియర్, మైకెలాంజిలో మొదలైల వారు. రెండు ప్రతి కళ రచనని 'ఒక తీవ్ర భావన'గా చూడటం వలన సరళ మరియు సంక్లిష్ట రచనల మధ్య భేదాన్ని విస్మరించటం. మూడవది కొన్ని రకాల కళా రచనలలో భావ గాఢతని గుర్తించకపోవటం, నాలువది కొంచెం క్లిష్టమైనది, ఒక రచన వ్యక్తీకరించే భావం ఆ రచనలో ఇమిడి ఉండాలి. ఎందుకంటే అప్పుడే ఆ రచన ఏ భావానుభవ సందర్భంలో వ్యక్తమైందో తెలుస్తుంది. ఇంక ఐదవది ప్రేక్షకులు ఈ వ్యక్తీకరణ వాదంలో పోషించే పాత్ర గురించి. కొన్ని సందర్భాలలో ప్రేక్షకుడు అవే భావాలను అనుభవించటం సహజమే కానీ ఉదాహరణకి నవ్వు, ఏడుపు మొదలైన వాటిలో మిగతా కొన్ని అంటే ఈర్ష, అసూయలు, కోపం వంటి కొన్ని తీవ్ర భావాల సందర్భంలో వాటిని ప్రేక్షకుడు అనుభవించటం కొంచెం కష్టమే.

[38] Croce, B. (1965) Guide to Aesthetics, trans. P. Romanell, New York: Bobbs-Merrill. Page:25

[39] Croce, B. (1965) Guide to Aesthetics, trans. P. Romanell, New York: Bobbs-Merrill. Page:23

క్రోచే రూపాన్ని గురించి చెప్తూ కళ, సంగీతం, కావ్యం పుస్తకాలలో లేదని అది కళాకారుని ఆత్మలో ఉందంటారు. ఆయన కళ ఆంతరికం, అవిభాజ్యంగా చెప్పెను. నైరుప్య కళ ఒక రోగమని ఆరోగ్యమైన కళ కాదంటారు క్రోచే. క్రోచే సఫలీ కృత అభివ్యంజన లేక అభివ్యక్తే సౌందర్యమని నిర్వచించెను. సౌందర్యంలో పరిణామ భేదం ఉండదంటారు క్రోచే. ఇతడు కళను ఇంద్రియ ప్రభావాల సంస్కారాల అఖండ పరస్పర ప్రగాఢ సమ్మేళనంగా భావించాడు. ఆయన కళా ప్రక్రియకు నాలుగు దశలను పేర్కొన్నాడు. 1. ఇంద్రియగత ప్రభావాలు, 2. అభివ్యక్తి, 3. సౌందర్యాత్మక ఆనందం, 4. సౌందర్యం భౌతిక రూపాలలో ఉంటే ధ్వనుల్లో, రేఖల్లో, రంగుల్లో, లయల్లోకి రూపాంతరం చెందడం. ఈ నాలుగింటిలో అభివ్యక్తే ప్రధానమంటాడు క్రోచే. క్రోచే కళ దేశ కాలాలకు అతీతం కాదని, కళను ఒక పరిపూర్ణ ప్రక్రియగానూ, సమగ్రమైనది గానూ, సంశ్లిష్టమైనది గానూ గుర్తించి కళా స్వభావం లోతుల్లోకి వెళ్లాడు. ఈయన కళాకృతిని అర్థం చేసుకోవాలంటాడు. ఎందుకంటే, కళాకారుని వ్యక్తిత్వం రూపొందేది వీటి వల్లనే గనుక కళకు అనువాదం అసంభవం అంటారు క్రోచే.

### 5.2. చలం సౌందర్య దృక్పథం

చలం చిత్రలేఖనం మీదా, సంగీతం మీదా, సాహిత్య కళ మీదా విలువైన వేవచనలు చేసాడు. రసానుభవం గురించీ, కళ ఎలా స్రష్టమవుతుంది అన్న విషయాల గురించి చలం చేసిన వివేచన ఆయనను కళా తాత్వికుడిగా నిలుపుతున్నాయి.

కళా తాత్వికుడైన చలం సౌందర్యానికి అర్థం వెతుకుతూ *''ఏదో అర్థం కాని నూతనత్వం''* [40] అంటారు. అంటే రచనలలో ఉండే ఏదో అర్థంగాని నూతనత్వాన్ని సౌందర్యంగా చలం భావిస్తున్నాడు. ఇది రచనలోని ప్రతి అంశంలోనూ ఇంకి పోయి పాఠకులకు అనుభవమవుతుంది. దీన్నే భారతీయ ఆలంకారికులు 'రామణీయకం, శోభ, చారత' అని వివేచించి ఉన్నారు. *''ఆనందం పొందడానికి మనసు చూపే మార్గమే అందం''*[41] అని చెప్తూ సౌందర్యాన్ని 'ఆనందం, జ్ఞానం, సత్యం, శాంతి' [42] అని సౌందర్యాన్నికి విస్తృతమైన

[40] మూజింగ్స్, చలం: పుట 172

[41] మూజింగ్స్, చలం: పుట 310

[42] మహాస్థాన్, చలం: పుట89

వైవిధ్యాన్ని పరిధిని ఏర్పరచాడు. సౌందర్యం అంటే ఆనందం అనే అభిప్రాయాన్ని శ్రీ అరవిందుల, సంజీవ్‌దేవ్ వంటి కళాతాత్త్వికులు కూడా పేర్కొనడం గమనించవచ్చు. ఆనందానికి తొడగబడ్డ రూపమే సౌందర్యం అని *"Beauty is ananda taking form"*[43] అరవిందుల వారి అభిప్రాయం. సంజీవ్‌దేవ్‌కూడ *"వ్యక్తిలోని ఆనందం తన బయటి అస్తిత్వంలో గోచరించడం సౌందర్యం"*[44] పేర్కొన్నారు. జ్ఞానం సత్యం, శాంతి మొదలైన వాటిని కూడా సౌందర్యానికి పర్యాయపదాలుగా పేర్కొన్నారు. సత్యం స్వస్వరూప దర్శనాన్ని కలిగిస్తుందని, జ్ఞానం మనిషి మానసికంగా ఎదగడానికి తోడ్పడుతుందని, శాంతి మనిషికి ఆధ్యాత్మిక లోకాలకి తలుపులు తెరుస్తుందని ఈ అన్ని ప్రభావాల వెనక సౌందర్య స్వభావం ఇమిడి ఉందని సౌందర్య మంటే ఇంత లోతుని కలిగి ఉన్న అంశమని చలం అభిప్రాయం. చలం ఆధ్యాత్మికానుభవాన్ని కళ వెనుకుండే కాంతిగా పేర్కొన్నారు.[45]

'*కళ వెనుక ఉండే శక్తి సౌందర్యం*"[46] కళా తాత్త్వికుడైన చలం సౌందర్యానికి కళా పక్షంగా స్పష్టంగా ఇచ్చిన నిర్వచనం ఇది. ఇక్కడ చలం సౌందర్యాన్ని ఒక శక్తిగా చెబుతున్నాడు. అంటే కళ వెనుక ఉన్న శక్తికి ఏదైతే ఉందో దానికి చలం పెడుతున్న పేరు సౌందర్యం.[47] ఒక రచన సౌందర్య భరితం అయ్యిందంటే ఇక దానికి మరణం ఉండదని *"సత్యమైనదీ, అందమైనదీ ఎప్పటికీ నశించదు"*[48] అని అంటారు చలం.

ఒక కళాఖండానికి శాశ్వతత్వం అందులోని వస్తువు వల్ల కానీ మరే ఇతరమైన అంశం వల్ల కానీ రాదు, అది శాశ్వతత్వాన్ని కేవలం అది సాధించుకున్న సౌందర్యం వల్లనే వస్తుంది అని చలం సౌందర్యం మీద చేసిన ముఖ్యమైన నిర్ణయం, అంటే కళా ఖండానికి సౌందర్యమే ప్రాణమని చలం అభిప్రాయం. ఇదే అభిప్రాయాన్ని శ్రీశ్రీ కూడా *"ఏదైతే అనుక్షణ నవీనమైన*

---

[43] The future poetry.sri aurobindo. Page 491

[44] సంజీవ్‌దేవ్ వ్యాసాలు–1 (సం.పా.) ముదిగొండ వీరభద్రయ్య. వెలిచాల కొండలరావు.పుట:7

[45] సంజీవ్‌దేవ్‌కు చలం. చలం. పుట.24

[46] మూజింగ్స్, చలం: పుట261

[47] మూజింగ్స్, చలం: పుట261

[48] మూజింగ్స్, చలం: పుట286

*ఆశ్చర్యం మనకి కలుగజేస్తుందో అదే సౌందర్యం.''*[49] అని పేర్కొన్నారు. చలం మనిషిలోని బహుముఖమైన ఎదుగుదలకీ, వికాసానికీ ఈశ్వరుడు అని పేరు పెడుతూ ఈశ్వరుడు కళల నుండీ తన అందాన్నీ, ఆనందాన్నీ వినిపిస్తున్నారు, విశ్వతేజాన్నీ చూడలేని వారికి తన కళాకారుల ద్వారా సౌందర్యాన్ని స్పష్టం చేస్తున్నారు అంటారు చలం.[50] మనిషిలోని ఉన్నతమైన ఆధ్యాత్మిక భూములే సౌందర్య సీమలు అని చలం అభిప్రాయం. చలం కళలోకి సౌందర్యం ఎలా వచ్చి చేరుతుందో చెబుతూ *''గుణం లేని పరమాత్మ యీ కళా రచయితల ద్వారా సత్యం, శివం, సుందర రూపాలతో లోకానికి వ్యక్తమవుతాడు.''*[51] అని నిర్గుణుడైన పరమాత్మ లోకానికి వ్యక్తమయ్యేది సత్యశివ సుందర రూపమైన కళా సృజన ద్వారానే అని చలం పేర్కొన్నారు. సౌందర్యాన్ని చలం విద్యగా కూడా చెప్తున్నాడు. విద్యలో జ్ఞానం, తత్త్వం ఇమిడి ఉంటాయని *''ఈ లైఫ్ ఆన్ ఎర్త్ యీ సౌందర్య విద్యలో నిరంతరాన్వేషణలు చేస్తుందేమో, సెల్ఫ్ ఇంప్రూవ్‌మెన్ట్ కోసం''*[52] అంటూ సౌందర్యం నుండే పొందుతున్న సమస్తమైన కార్య కాలాపాలను చలం మొత్తంగా 'సౌందర్య విద్య' అంటున్నాడు.

చలం కళని సౌందర్య ప్రతి ఫలంగా పేర్కొంటూ *''కవి సౌందర్యానికి ప్రతిఫలంగా ప్రతిఫలించే కళని సృష్టిస్తాడు సృష్టి సౌందర్యాన్ని వ్యాఖ్యానం చేసి చూపుతాడు ప్రజల మంద దృష్టికి''*[53] సృష్టి సౌందర్యానికి వ్యాఖ్యాత కళాకారుడు.సౌందర్యం అత్యంత శక్తివంతం, అది లలితమైందే కాదు, వ్రజం లాంటిది కూడా, దాన్నే చలం ఇలా అంటున్నారు.. *''అందం మనుష్య సాధారణ స్వభావాల కన్నా శక్తివంతం, ఉజ్వలం, లోకాన్ని నింపే విద్యుచ్ఛక్తి కన్న శక్తివంతం''*[54] అని దాన్నీ, దాని ప్రభావాలనూ అర్థం చేసుకోవడం మనుషులకి చాతకావడం లేదంటారు చలం. చలం సౌందర్యానికి పర్యాయపదంగా 'మైస్టరియోస్ ఫోర్స్' ని పేర్కొంటూ హేతువుకీ – సౌందర్యానికీ ఉన్న భేదాన్ని వివేచిస్తూ *''రీజన్ కన్నా గొప్పగా మనసుని పాలించే*

---

[49] శ్రీశ్రీ వ్యాసాలు. శ్రీశ్రీ. పుట.114

[50] చలం అరుణాచలం లేఖలు. చలం. పుట 51

[51] కవి హృదయం. చలం. పుట:51

[52] మూజింగ్స్, చలం: పుట167

[53] మూజింగ్స్, చలం: పుట185

[54] మూజింగ్స్, చలం: పుట312

*యీ మైస్టరియోస్ ఫోర్స్క ని అందం కింద ఆరాధించి జీవితపులోతుల్ని ఇంకా దగ్గరగా చూడగలుగుతున్నాడు ఆర్టిస్టు; జీవితాన్ని జ్ఞానవంతం కన్నా సౌందర్యవంతం చేసుకోవడంలో అందుకనే ఎక్కువ విలువ''*[55] అని కళాస్వాదన హేతువుకి అందదనేది చలం అభిప్రాయం. ఇంతకన్నా ఎక్కువ శక్తివంతమైనది సౌందర్యం ఆ అదృశ్య శక్తినే సౌందర్యం కింద ఆరాధిస్తాడు కళాకారుడు అని చలం కళాకారుడికి కర్తవ్యాన్ని బోధిస్తున్నాడని. స్రష్టమైన కళా ఖండంలోని వస్తువు లోకోత్తరత్వాన్ని పొందాలంటే స్రష్ట మొదటగా సౌందర్యం, ఆధ్యాత్మిక అనుభూతులను ఆర్జించాలి అంటూ చలం ఒక విశిష్టమైన సత్యాన్ని వెల్లడించాడు.

ఈ విధంగా చలం కళ వెనుక ఉండే శక్తి సౌందర్యమనీ, ఆధ్యాత్మిక అనుభవమన్నది కళ వెనుకున్న కాంతీ అనీ, కళ ఎప్పుడు నూతనమైనదని ఈ నూతనత్వం సౌందర్యానుభవం వల్ల, ఆనందాను భూతి వల్ల కలుగుతుందనీ అయితే అది మన మాటలకందదని చలం సౌందర్యాన్ని వివేచించాడు.

### 5.2.1. సౌందర్యం మనోగతం

కళాతాత్త్వికుడైన చలం సౌందర్యాన్ని మనోగతం గా పేర్కొంటున్నారు. చలం సౌందర్యం గురించి సౌందర్యానుభవం గురించి సౌందర్యం ఉనికిని గురించి తన రచనలలో విస్తృతంగా చర్చించాడు. వివేచన చేసాడు. చలం సౌందర్యం ఉనికిని గురించి పేర్కొంటూ సౌందర్యం వస్తుగతం అన్న దానిని పూర్తిగా నిరాకరించడం జరిగింది. చలంసౌందర్య వివేచన అంతయూ రెండు మార్గాలలో కొనసాగింది. అది 1. సౌందర్యం కేవలం దానంతట అదిగా ఉండే Absolute Beauty గానూ, 2. సౌందర్యాన్ని మనోగతం (Subjective) గానూ, చెప్పారు.[56] ఈ రెండు విధాలుగా ఆయన సౌందర్య అస్తిత్వాన్ని దర్శించి వివేచించారు. చలం సౌందర్యాన్ని నిరపేక్షమైన అంశంగా చెప్పినప్పటికి సౌందర్యం మనోగతం అనే విషయాన్ని చెప్పాడు.

---

[55] మూజింగ్స్, చలం: పుట 254

[56] శ్రీనివాసరావు, కాకుమాని. *కళాతత్త్వ శాస్త్ర సమస్యలు: తెలుగు కళాతాత్త్వికుల వివేచన.* (పిహెచ్.డి. ఆముద్రిత సిద్ధాంత వ్యాసం).

చలం సౌందర్య కాంక్ష అనేది యుగ యుగాల నుండి మనిషిలో పేరుకొని పోయిందని వర్తమాన కాలం అనేది పైకి కనిపించేది మాత్రమే అని మనిషి చాలా యుగాల వెనకటివాడని, మనిషి సృష్టితో పాటు అతడిలో సౌందర్య సృష్టి కూడా జరిగిందని *'అందాల ఆకర్షణ అనేది యుగ యుగాల నుంచి నా మనసు నేర్చుకుంది క్రమ క్రమంగా'*[57] అని అంటున్నారు. చలం మనిషి ఆనందానికి మూలం అతను తనలో నిక్షిప్తం చేసి సౌందర్యాంశానికి తన పంచేంద్రియాలను అర్పించుకోవటమే అని బయటి వస్తువులు అతడిలోని సౌందర్య కాంక్షని ప్రజ్వలనం చేసి ఆశ్చర్యానందాలతో మెంచెత్తుతున్నాయని చెబుతున్నాడు. ఇదో అభిప్రాయాన్ని ప్లేటో కూడా వసువ్వులన్నీ కేవలం సౌందర్యం నుండీ కొంత కొంత సౌందర్యాంశని తెచ్చుకొంటాయి. అందువల్లనే అవి సౌందర్యవంతంగా కన్పిస్తున్నాయని *"If anything is beautiful it is beautiful for no other reason than that it partakes of absolute beauty"*[58] పేర్కొన్నారు. చలం సౌందర్యాన్ని ఆత్మకల్పితం అని చెబుతూ *''అసలే సౌందర్యం చూశాము అనుకుంటామే, అది మన మనసులు కల్పిస్తున్నాయి గావును. ఆ యింద్రజాలాన్ని కల్పించుకొని చూసే గుణం మనసుతోనే పుడుతుంది గావును.''*[59] అని సౌందర్యాన్నికి మనో భూమిక తోనే ఆధారం ఉందనే విషయాన్ని చలం స్పష్టంగా చెప్పాడని భావించవచ్చు. *''సౌందర్యం ఆధారం నేను, నేను, నేను, అంతా నేను, ఇంకేం లేదు. యీ సముద్రం, ఆకాశం, యీ లోకం అంతా నేనే''*[60] అని సౌందర్యం మనోగతం అని స్పష్టంగా పేర్కొన్నారు. అంతే కాకుండా వస్తువుల్లో తాను చూస్తున్న సౌందర్యమంతా కన్ను కల్పించుకుంటున్న ఇంద్రజాలమని, చాలా వాంఛనీయమైన ఇంద్రజాలమని[61] చలం పేర్కొంటూ ఇంత సౌందర్యాన్ని, ఆనందాన్ని కల్పించుకోగలిగిన నా మనసు వస్తువు లేకుండానే కల్పించుకోలేదా[62] అంటూనే వస్తువు లేకుండా అందాలను కల్పించుకోవటం అందరికీ

---

[57] మూజింగ్స్, చలం: పుట169

[58] Dictionary of world literature. Joseph Shipley. P: 36

[59] మూజింగ్స్, చలం: పుట103

[60] మూజింగ్స్, చలం: పుట63

[61] మూజింగ్స్, చలం: పుట170

[62] మూజింగ్స్, చలం: పుట63

చాతకావడం లేదనీ *''ప్రతిచోట సౌందర్యం కనబడే యీ గుణం, యెప్పుడూ యీ ఆధారాన్ని వీడి, తనంతట తాను యీ సౌందర్యాన్ని కల్పించుకోని మనుష్య సంబంధంగా కాక, యీ జడ ప్రపంచ సంబంధంగా కాక, తనలోనే కల్పించుకోగలిగితే, ఆ ఆనందానికి, ఆ సౌందర్యారాధనకి, ఆ మాధుర్యానికి అంతం వుంటుందా''*[63] అని వస్తువు లేకుండా మనసులోనే సౌందర్య సృష్టి చేసుకొంటున్నప్పుడు మనిషి యోగి అవుతాడని యోగి ఆనందంలో రహస్యం అదే అంటారు[64] చలం. విశ్వ సౌందర్యం లోని అంశమే ఈ ఆకర్షణ అంతా, విశ్వాత్మ అనేది అన్ని వస్తువుల్నీ సృష్టించింది, సౌందర్యాన్ని కూడా అన్న అరవిందులుమాటలతో చలం చెప్పిన మాటలకి పోలిక కన్పిస్తుంది. చలం సౌందర్యం అనేది పూర్తిగా మనోగతం అని అన్నిచోట్లా ఆస్వాదకుడే సౌందర్యాన్ని మనోగతం చేసుకొని అనుభవిస్తున్నాడని సౌందర్యానుభవంలో ఈశ్వరుదుని అందుకోవటమే ఉత్కృష్టమైన స్థాయిగా పేర్కొంటూ  సౌందర్యం కేవలం తన దర్శనాన్ని భరించలేని వారిని మాత్రం ఆనందం అనే మాధ్యమం ద్వారా వస్తువుల నుండీ ఆస్వాదకుడికి అనుభవం అవుతుందే కాని సౌందర్యం పూర్తిగా మనోగతం గా చలం పేర్కొన్నాడు.

### 5.2.2. సౌందర్యానుభవం చలం

చలం సౌందర్యానుభవంను విషయ జగత్తుకి సంబంధించని అలౌకికమైన అనుభవంగా వాస్తవత్వం అంటే అల్పాత్ములు ఏర్పరచుకొన్న క్షుద్రభావం గా పేర్కొంటూ కవి ఈ క్షుద్రభావాన్ని దాటి సౌందర్య రూపాల వెనక్కి వెళ్ళి చూడగలిగితే మైస్టిక్ అవుతాడని సౌందర్యానుభవ ప్రస్థానంలో మైస్టిక్ అయిన తరువాత మౌని, యోగిగా మారుతాడంటాడు చలం. చలం సౌందర్యానుభవం గురించి పేర్కొంటూ అది సౌందర్యాలను కల్పించే శక్తిగా మారుతుందని *''ముఖ్యంగా సౌందర్యంలో, యీ అశాంతిని కలిగించే శక్తి విశేషంగా వుంది. ఆలోచించగా ఏమనిపిస్తుందంటే యీ సౌందర్యాన్ని ఆకర్షకంగా చేసే సూత్రం వుందే, దాంలో సౌందర్యం నించి మనసుని, సౌందర్యాన్ని మించి, ఆ వస్తువుకి ఆ సౌందర్యాన్ని కలించే శక్తి దగ్గరికి, యీ బాధ ద్వారా, దృష్టిని మళ్ళించే ప్రయత్నం వుందేమో''*[65] అని ఒక గొప్ప

---

[63] మూజింగ్స్, చలం: పుట110

[64] చలం అరుణాచలం లేఖలు. చలం. పుట65

[65] మూజింగ్స్, చలం: పుట168

కళాంశాన్ని ఇక్కడ ఆవిష్కరిస్తున్నారు చలం. ఇక్కడ బాధను వస్తువుకి సౌందర్యాన్ని కల్పించే శక్తి దగ్గరికి చేరుకోవడానికి మార్గంగా పేర్కొంటున్నాడు చలం. ఈ సంవేదనలే కవి సృష్టిలో సౌందర్య రచనకు ప్రేరణలవుతాయని, సౌందర్యానుభవం కళాకారుడిని పర్యుత్సుకుడ్ని చేసి సౌందర్య దర్శనంలో అతడిని ముంచి అతడు సృష్టిస్తున్న కళాకృతికి సౌందర్య రచన చేయగల శక్తిని ప్రసాదిస్తుందని, సౌందర్యానుభవం ఫలితంగా కళాకారుడు సౌందర్య రచన చేయగలుగుతున్నాడని కళాకారుడు తను పొందుతున్న సౌందర్యానుభవం లోంచే సౌందర్య రచన చేస్తాడని చెప్తూ నిజ సంఘటనను ఒకటి తన మూజింగ్స్‌లో పేర్కొన్నాడు.

*'అందమైన తోటనీ, సెలయేరు నీ చూసి తన ముందే నండూరి సుబ్బారావు ఒక పాట రాయగా దాన్ని చలం దీనికి నిరూపణగా చెప్తున్నాడు. ఇలా పొందిన అనుభూతిని పైపైనే కాకుండా లోపలికి తీసుకొని వెళ్ళి రియాక్ట్ చేసి, రసం తీసి అందాల్ని పలికించాలంటాడు చలం'.*[66] తను పొందుతున్న అనుభూతిలోని తీవ్రత ఎంతగా ఉంటుందో అంతగా రచయిత బలంగా రాయగలుగుతాడు అంటారు చలం.

చలం లాగానే కావ్యాన్ని సౌందర్యంగా భావించిన ప్రాచీన అలంకారికుడు అభినవగుప్తుడు. నిజమైన సౌందర్య భావన అలంకారిక భావనలనే కాక కాల్పనిక శక్తిని కూడా ఉత్తేజితం చేస్తుంది. కల్పన అలంకారిక భావనలో రెండవ స్థాయిగా భావించవచ్చును.

అభినవగుప్తుని ప్రకారం అలంకారిక అనుభవంలో ఉచ్ఛస్థాయి కర్త మరియు విషయాల మధ్య భేదం కనుమరుగవడంతో మొదలవుతుంది. ఈ స్థాయిలో సాధారణ స్థాయి భావనలు ఇంకిపోయి విశ్వైక విషయం ఆనందంగా వెలుగొందుతుంది. ఈ స్థాయిలో పరమానందానికి చేరుకోంటారు. ఇది యోగ సాధనలో వ్యతిరేక తురియతిత సమాధికి సమానం.

అభినవగుప్తుడు దీనిని వివరంగా 'రసాయతే ఇతి రస్ణ' అంటే రసం బాహ్య వ్యక్తీకరణ స్థాయిలో అదే రసం పరమానందంగా 'రసానం రస్థ' అంత్ణ స్థాయిలో ఉంటుందని వివరించారు. ఈ విధంగా చూస్తే ఈయన గురించి పండితారాజ జగన్నాథుని అభిప్రాయమైన

---

[66] మూజింగ్స్, చలం: పుట302

సౌందర్యానుభవం ఉచ్ఛ స్థాయిలో రతి వంటి మానసిక స్థాయి అని భావించడాన్ని అపార్థంగా భావించవచ్చు.

అభినవగుప్తుని అభిప్రాయం ఆయన మాటల్లోనే ''విశేషణా విశేషాయభావముఖేన యో వ్యవహార్థ స ఆత్మని నొపపాద్యతే.''[67]

అభినవగుప్తుడు అర్థ సమస్యలను మానసిక శాస్త్ర పరిధిలో అధ్యయనం చేసి దానిని అంటే అర్థాన్ని నాలుగు రకాలుగా వర్గీకరించారు. అవి. 1. అభిదేయ 2. లాక్షణిక 3. తాత్పర్య 4. వ్యంగ్య మొదలైనవి.

మమ్మటుడికి భారతీయ సాహిత్య విమర్శలో ప్రత్యేక స్థానం ఉంది. ఇతని కావ్య ప్రకాశం వంటి కావ్యం మరోకటి లేదని ముఖ్యంగా ఈ శాస్త్రంలో నిస్సందేహంగా చెప్పవచ్చు. దీనిలాగా మరే ఇతర కావ్యాన్ని దేశమంతటా అధ్యయనం చేయటం జరుగలేదనే చెప్పాలి. ఇది భట్టోజీ ధీక్షితుని సిద్ధాంత కౌముది స్థాయిని అందుకుంది. దీని గురించి తరువాత కావ్యాలలో ఈ కింది విధంగా చెప్పటం జరిగింది. *"You grasp it well, and vain is your toil with the Mahabhashya; you grasp it not, and equally vain is your toil with Mahabhashya"*[68] భట్టోజీ ధీక్షితుడు చాలా సంవత్సరాల క్రితం సంస్కృత వ్యాకరణానికి చేసిన పనిని మమ్మటుడు చిన్న వయస్సులోనే కావ్య శాస్త్రానికి చేశాడు. ఉద్భటుడు, వామనుడు, ఆనందవర్ధనుడు, భట్ట నాయకుడు, కుంతకుడు, అభినవ గుప్తుడు మరియు మహిమ భట్టుల వారసత్వాన్ని అందిపుచ్చుకొని మమ్మటుడు విమర్శ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని సృష్టించాడు.

కావ్య ప్రకాశపు ప్రాచుర్యానికి దాని మీద వచ్చిన వ్యాఖ్య రచనలే బలమైన ఉదాహరణ. భగవద్గీత తరువాత ఒకే సంస్కృతపు రచన మీద అనేక వ్యాఖ్యానాలు కేవలం కావ్య ప్రకాశానికి మాత్రమే వెలువడ్డాయి. ఇతని శిల్పాలు, ముఖ చిత్రాలు గుళ్ళలో దర్శనమిచ్చినప్పటికీ ఇతని వ్యక్తిగత చరిత్ర గురించి మాత్రం మనకు తెలిసింది అత్యల్పమనే చెప్పాలి. ఇతను ఇతని రచన

---

[67] Isvara Pratyabhijna Vimarsini Vol.I P.147

[68] (cultural leaders of India Aestheticians; P: 66)

కావ్య ప్రకాశంలో కానీ మరెక్కడా కానీ ఇతని వ్యక్తిగత వివరాలను వెల్లడించలేదు. కానీ ఇతని ఇతర రచన అయిన శబ్దవ్యాపారవిచారంలో మాత్రం ఇతని గురువుల గురించి కొంత సమాచారాన్ని వెల్లడించాడు. పరిశోధకులు పరిశోధనలలో ఇతను కాశ్మీరానికి చెందినవాడని ఇతని పేరు మరియు భాషా శైలి బట్టి అర్థమవుతుందని కొన్ని ఉదాహరణలతో వెల్లడించారు. 'రాజనాక' అన్న బిరుదు ప్రత్యేకంగా కాశ్మీరీ కవులకి ముందు వాడేది కూడా ఇతను కాశ్మీరు దేశానికి చెందినవాడని నిరుపిస్తుంది. 'రాజనాక' అర్థం రాజాభిమానం పొందినవాడు అని. ఇతను అలంకార శాస్త్రమే కాక వ్యాకరణంలో కూడా పండితుడు. ఇతని తరువాత వచ్చిన వ్యాఖ్యాతలు ముఖ్యంగా భీమసేనుని రచనల ప్రకారం మమ్మటుడు జైయతుని కొడుకుగా, కైయతుడు మరియు ఉవతుడి అన్నగా తెలుస్తుంది. వీరు మహాభాష్యానికి వ్యాఖ్యాలుగా శుక్ల ' యజుర్వేద' సైత మరియు రికోరతిసాఖ్యలని రచించారు. వీరిద్దరికీ గురువు మమ్మటుడే. బుహ్లర్ నమోదు చేసిన కాశ్మీరీ సాంప్రదాయాల కథనం ప్రకారం మమ్మటుడు శ్రీహర్షుని (నైషధ కర్త) మేనమామ. శ్రీహర్షుడు తన మామకి తన రచనని పంపి అభిప్రాయమడుగగా మమ్మటుడు ఈ విధంగా చెప్పాడని తెలిపాడు. అది *"May young Chap, your book has come to me a trifle too late. How I wish, you had brought it to me earlier. That would have saved me all the labour I had in hunting out my illustration from numerous sources for the many varieties of "Blemishes" (doshas) for the chapter on 'Poetic Blemishes' in my Kafyaprakasa. I have all her at one place in your work!"*[69] కానీ ఇది అసాధ్యమని చారిత్రక ఆధారాలు తెలుపుతున్నాయి.

అనేక వ్యాఖ్యానాలు తరువాతి రచయితల ఉల్లేఖనాలను బట్టి మమ్మటుడు 11వ శతాబ్దపు మధ్య కాలానికి చెందినవాడుగా తెలుస్తుంది. కావ్య ప్రకాశం 'ఉల్లాసాలుగా' పిలవబడే 10 అధ్యాయాల విస్తృత కావ్యం. పేరుకి తగ్గట్టుగా ఇది కవిత్వపు కోణాలని ప్రకాశింపజేస్తుంది.

[69] cultural leaders of India Aestheticians; Page 70, 71

కావ్య ప్రకాశం లోని మొదటి అధ్యాయం సాధారణ పరిచయంతో మొదలయి కవిత్వాన్ని ఉత్తమ, మధ్యమ మరియు అధమగా వర్గీకరిస్తుంది. దీనితో పాటుగా రెండు ఇతర సామాన్య అంశాలైన కవిత్వపు లాభాలు మరియు కవిని చేసే అంశాలు కూడా ప్రస్తావించబడ్డాయి. మమ్మటుడు కవిత్వాన్ని శబ్దార్థంగా దోషాలతో విభజింపబడే గుణాలతో సాగే అలంకారాలతో అలంకరించబడేదిగా వర్ణించాడు. ఇతను కవిత్వాన్ని శబ్దార్థ సహితంగా నిర్వచించి, అలంకారాల స్థానాన్ని తెలిపి పూర్వపు కవుల వివాదాన్ని తగ్గించినప్పటికీ తరువాతి మహాకవి విశ్వనాథుని ప్రకారం ఇతను రసాన్ని విస్మరించి విమర్శలకు తెరతీశాడు.

చలం సౌందర్యాన్ని అనుభవించే విషయంలో కళాకారునికి యోగికి గల తేడాను చెప్తూ సౌందర్యానుభవంలో కళాకారుడు యోగి కంటే ఒక మెట్టు కిందవాడని అందుకే కళాకారుడు కూడా సౌందర్యానుభవాన్ని యోగంగా సాధించి సౌందర్యారాధకుడు కావాలంటాడు చలం. ‘‘నువ్వు కళలో లీనం కావాలి, కళ నీలే లీనం కాదు’’ [70] అంటారు చలం. సౌందర్యానుభవాన్ని కళాకారుడు తనలో పూర్తిగా ఇంకింప చేసుకొనే స్వభావం లేనివాడని కళాకారుడు దాన్ని మళ్ళీ బయటకి అభివ్యక్తం చేసి ఆనందిస్తే, యోగి తనలోనే సౌందర్యాన్ని నింపుకొని, తనకూ సౌందర్యానికి అద్వైత్వ భావాన్ని పొదుతాడంటాడని అందుకే ఎదిగే ప్రతి కళాకారుడు మౌని అవుతాడంటాడు చలం.[71] చలం అందాల ఆకర్షణ అనేది యుగ యుగ386) అని సౌందర్యానుభవాన్నికి మనిషి ఎలా ఉద్యుక్తుడవుతున్నాడో చెప్తూన్నారు చలం. కవిని ఈశ్వరునికీ, మనిషికీ మధ్య అనుసంధాన కర్తగా పేర్కొంటూ కవి మనిషికి తన కళ ద్వారా అలౌకికతని నేర్పిస్తాడని అతడి జీవితాన్ని ఈశ్వరమయం, సౌందర్యవంతం చేయడానికి నిరంతరం కవి శ్రమిస్తాడని పేర్కొన్నారు. కళాకారుడు సృజించి సౌందర్యం పాఠకునిపై ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తుందో చెప్తూ సృష్టి సౌందర్యం ఎలాగైతే కవిలోని గత జన్మ స్మృతులను, సంస్కారాలనూ అభివ్యక్తి చేస్తుందో అలాగే పాఠకుని కళాకారుడి చేత స్రష్టమైన కళ అతనిలోని సంస్కారాన్ని అతడి అనుభూతులతో వ్యక్తం కాకుండా ఉన్న భావోద్రేకాన్ని

[70] మూజింగ్స్, చలం: పుట187

[71] మూజింగ్స్, చలం: పుట302

రేపుతుందని సృష్టి సౌందర్యాన్ని చూడలేని వారికి ఈశ్వరుడు కళా రచయితల ద్వారా తన అందాన్నీ ఆనందాన్నీ వ్యక్తపరుచుకొంటున్నాడని చెప్పారు.[72]

చలం అభిప్రాయంలో సౌందర్యంను అనుభవించే విషయంలో కవి అందరికంటే ముందుంటాడు. కవిలోని నిరంతర సౌందర్యాన్వేషణ అతడిని అనుభూతుల స్వర్గంలా మార్చివేస్తుంది. అతడు ఇప్పుడు సృజిస్తున్న సౌందర్య కల్పన అతడిలోని పూర్వ జన్మలలోని అభిజ్ఞలది అయి ఉండవచ్చు. కళాకారుడు సౌందర్య లోకానికి చిరమిత్రుడుగా కళాకారుడిలోని సౌందర్య తృష్ణ ఈ నాటిది కాదని ఎన్నో యుగాల నుండీ మోసుకొని అతడు కళాకారుడుగా జన్మిస్తున్నాడని అందుకే కళాకారుడు స్థల కాలాలకి అతీతమైన సాహిత్య సృష్టి చేయగలుగుతున్నాడని ఈ యుగంలో ఉంటూ ఇతిహాస యుగం నాటి రచననైనా ఇనుమడించిన ఉత్సాహంతో సౌందర్యవంతంగా సృష్టి చేయగలుగుతున్నాడని చెప్పవచ్చు. చలం సౌందర్యాన్ని ఉత్కృష్టమైనదిగా పేర్కొంటూ సౌందర్యాన్ని అనుభవించే విషయంలో కళాకారుడు కంటే అనుభవించే వాడే (పాఠకుడే) అధికుడిగా పేర్కొన్నాడు చలం. ''నా దృష్టిలో ఎప్పుడూ ఆర్ట్‌ని క్రియెట్ చేసేవాడికన్నా అనుభవించే వాడే అధికుడు''[73] ఎందుకంటే సౌందర్యాన్ని అనుభవించడంలనే ఎక్కువ ఆధిక్యం ఉంది. అయితే కళాకారుడు సౌందర్యాన్ని దర్శించి దానిని తన కళలో ప్రదర్శిస్తున్నప్పుడు ఆ సౌందర్యానికి సంబంధించిన అనుభూతి కృతకంగా రెండు సార్లు పొందటం వల్ల కొత్త ఇబ్బందికి గురవుతున్నాడని కాని పాఠకుడు తన అనుభవానికి ఒక ఎక్స్‌ప్రెసన్ ఇచ్చుకోవాలసిన అవసరం లేనంతగా జీర్ణించుకోవడం వల్ల పాఠకుడు కొన్ని క్షణాల పాటు యోగానందాన్ని కళ ద్వారా పొందుతాడు అందుకనే కళాకారుడి కన్నా అనుభవించే వాడే అధికుడు అంటున్నారు చలం.

''జ్ఞానం మనకి ఆ సౌందర్యాన్ని అనుభవించగల లోతును యివ్వాలి.''[74] అని చలం సౌందర్యానుభవానికి జ్ఞానము, తర్కం మొదలైన భౌతిక సూత్రాలు పనికి రావని అది అనుభవంలోనే ఆనందంగా మారుతుందని చెప్తూ ''గొప్ప ఆర్టిస్ట్ ఎంత సౌందర్యాన్ని తాని

---

[72] చలం అరుణాచలం లేఖలు. చలం. పుట 55

[73] సంజీవ్‌దేవ్‌కు చలం. చలం. పుట.26

[74] మూజింగ్స్, చలం: పుట167

స్వాధీనం చేసుకొంటున్నాననుకుంటాడో అంతకన్నా గొప్పగా సౌందర్యం అతన్ని వశ్యుణ్ణి చేసుకొంటుంది'' అని సౌందర్యం ముందు కళాకారుడి లోని అహము అతడి లోని వ్యక్తిగత జ్ఞానాంశాలు నమ్రతగా మారిపోవాలంటాడు చలం. సౌందర్యం అన్ని కళలలోను రక రకాలుగా రూపాంతరం చెంది ఉంటుందని రూపం తక్కువగా ఉంచిన కళే ఉత్తమమైనదిగా చలం సౌందర్యానుభవం గురించి వివేచించాడు.

### 5.2.3. చలంసౌందర్యశాస్త్ర విమర్శ

స్వభావరిత్యా కళాతాత్త్వికుడైన చలం విమర్శలో విలువను గురించి చెప్తూ. *''మీ నీతిని ప్రశ్నించిన చలాన్ని మీ నీతి కొలతలతో విమర్శించపూనడం, గాంధి గారిని బ్రిటిషు న్యాయ శాస్త్రాలతో విమర్శించడం వంటిదే.మీ కిష్టం లేకపోతే చలం చెప్పిన నీతితో తగాదా పడండి. కాని మీ నీతితో అతన్ని విమర్శించకండి, విలువ కట్టకండి, ఖండించకండి, కాని విలువ కట్టకండి''*[75] అని విమర్శలో విలువ కట్టడం గురించి పేర్కొన్ని రచనను విలువ కట్టడం అనేది విమర్శకుడు చేయవలసిన పనుల్లో అతి ముఖ్యమైనదని అదే సందర్భంలో చాలా మంది విమర్శకులు తప్పుడు నిర్ణయాలు చేసేది కూడా ఇక్కడే అని చెప్తున్నాడు చలం. విమర్శకుడు సాధారణంగా ఒక రచనను విలువకడుతూ, అందులో చెప్పిన నీతి తనకు ఇష్టం లేనిదైనప్పుడు విమర్శకుడు దాన్ని కొట్టివేసి ఇది ఇలాంటి రచన అని నిర్ణయం చేస్తుంటాడు అయితే అతడు ఆ వస్తువును ఖండించవచ్చు, ఆ వస్తువు పనికిరానిదనో, అవినీతికరమైనదనో, దుర్మార్గమైనదనో చెప్పవచ్చు కాని విమర్శకుడు ఆ యొక్క కావ్యత్వాన్ని వస్తువు మీది మన అభిప్రాయంతో నిర్ణయించ కూడదంటారు చలం. *''మంచి రచనకు స్థాయి వస్తు ప్రాధాన్యాన్ని బట్టే రాకపోయినప్పటికీ, వాటిల్లో వస్తువు అప్రధానంగా మాత్రం ఉండదు. ఈ మేరకు వస్తువుకు రచనలో ప్రాధాన్యం ఉన్నప్పటికీ రచనకు గొప్పతనం కలిగేది ఆ వస్తువు ఎలా తీర్చిదిద్దబడుతున్న దాని మీద ఆధారపడి ఉంటుంది''* [76] అని ఈ విధంగా చలం రచనను విలువ కడుతున్నప్పుడు వస్తు ప్రాధ్యాన్య దృష్టి తగదని ధృఢంగా అభిప్రాయపడుతున్నాడు.

---

[75] చలం అరుణాచలం లేఖలు. చలం. పుట 59

[76] విమర్శ మౌలిక లక్షణాలు. ముదిగొండ వీరభద్రయ్య పుట:38

విమర్శకుడ ఒక రచన విలువ నిర్ణయించేటప్పుడు ఆ రచన యొక్క వస్తువు పైన మమకారం చేతనో, ద్వేషం చేతనో రచనకు విలువ కట్టవద్దని చెప్తూ రచనలలోని వస్తువును అశ్లీలమైనదిగా భావించే వారిని ఉద్దేశించి *''గొప్ప కవిత్వంలో భాష, భావం, అర్థం, ధ్వనీ మాటల మాధుర్యం వీటిల్లో ఒక దాంట్లోనూ లోపం ఉండదు ప్రత్యేకంగా ప్రతిదీనీ, అన్నీ కలిసి ఏకంగానూ గొప్ప సౌందర్యానుభూతిని కలిగిస్తాయి. తమకు ఆత్మ లేదనుకునే వారికి కూడా''*[77] అని దాన్ని గొప్పగా తీర్చిదిద్దిన రచన గొప్పదే అని గొప్ప కవిత్వ గురించి పేర్కొంటున్నాడు చలం. గొప్ప రచన, అసలైన రచన, విలువైన రచన స్వయం సమగ్రమైనదవుతుంది. అందులో వస్తువు నీచమైనదిగా ఉండదని రచనలో వస్తువు ఉదాత్తమైనది అయినప్పుడే అది కవిని ముందుగా తనలో లోతుని కనుక్కోమంటుందని. ఇక వస్తువు ఉత్తమమైనది అయినప్పుడు ఇలాంటి విమర్శకులకి విమర్శించడానికి ఏమీ మిగలదని వారు కేవలం వస్తువు పొగుడుతూ రాతని పెంచుకుంటూ పోతారని ఒక గొప్ప రచనలోని అన్ని భాగాలు పాఠకునికి గొప్ప సౌందర్యానుభూతిని కలిగిస్తాయని పాఠకునిలో సైతం తమకు ఆత్మ లేదు అనుకునే పాఠకుని సైతం అనుభూతిలో ముంచి ఉన్నత పరివర్తన తెస్తుంది గొప్ప రచన అని అంటారు. చలం గొప్ప రచనకు ప్రమాణంగా 'ఒక గొప్ప సౌందర్యానుభూతిని' పేర్కొన్నాడు. ఒక రచనకు అదే విలువ అని అది ఉన్నప్పుడే రచన ఉన్నతమైనది అవుతుందని తేల్చిచెప్పాడు చలం.

చలం విమర్శకులనుద్దేశించి విమర్శను నిక్షాక్షిపతంగా చెయలంటూనే విమర్శకుడ అవసరమైతే భేదాభిప్రాయ ప్రకటనను చేయవచ్చు కాని, విమర్శకులను రచలను ఖండించవచ్చు గాని వాటికి విలవను కట్టవద్దని స్పష్టంగా చెప్పాడు. అయితే ఆధునిక సాహిత్య విమర్శలో నిర్ణయ రహిత విమర్శ నిష్ఫలమనే అభిప్రాయం కలదు. అంతేగాక విమర్శలో నిర్ణయం చేయడం వలన శాస్త్రం అభివృద్ధి చెందడానికి పనికి వస్తుంది. *''నిర్ణయ రహితంగా ఉండే విమర్శ కన్నా, నిర్ణయ సహితంగా ఉండే విమర్శే ఎక్కువ లాభదాయకం. సాధారణంగా విమర్శలోని నిర్ణయాలే వాద ప్రతివాదాలకు దారి తీస్తుంటాయి. అందువల్ల విమర్శ రంగంలో*

[77] రవీంద్ర గీతాంజలి.చలం.పుట:13

*చైతన్యానికి నిర్ణయాలే అన్నవే ప్రధానమన్నమాట''*[78] నిర్ణయం చేయడం అనేది విమర్శ చాలా ప్రధానమైన విషయం గనుక చలం నిర్ణయం గురించి చెబుతూ *''నేను విమర్శించిన ప్రతి విషయంలోనూ ఓ నిర్ణయం ఇమిడే వుంది''*[79] అని పేర్కొన్నాడు. విమర్శకుడు విమర్శలో నిర్ణయాలు చేసేటప్పుడు కళాంశాన్ని వదిలిపెట్టకూడదని చెబుతున్నాడు.

అదేవిధంగా చలం ఒక రచనను విమర్శించేటప్పుడు విమర్శకుడు పక్షపాతం లేకుండా రచనను విమర్శించాలని తనకు ఇష్టమైన అభిప్రాయాన్ని రాసినంత మాత్రానా అతని కవి అనకూడదని *''కవిత్వాన్ని బట్టి కవిగా చూడు. శ్రీశ్రీ నీకిష్టమైన అభిప్రాయాన్ని రాశాడు గనుక కవి అనకు''*[80] చలం ఉద్దేశ్యం. ఇక్కడ చలం కవిత్వం, కవి చెప్పిన అభిప్రాయలను గురించి పేర్కొంటూనే కవిత్వాన్ని బట్టి కవిని అంచనా వేయాలని కవి ఆ కవిత్వంలో చెప్పిన అభిప్రాయాలను బట్టి భావజాలాన్ని బట్టి మాత్రం కాదని చెప్తున్నాడు చలం. అయితే కొన్ని సందర్భాలలో కవి కవిత్వాన్ని తన అభిప్రాయాల ప్రచారానికి కూడా వినియోగించుకొంటాడు. అలా వినియోగ దృష్టి ఏర్పడినప్పుడు కవిత్వం తన సహజత్వాన్ని కోల్పోతుంది. అలాంటప్పుడు కవి దానికి లౌకికమైన కాలుష్యపు తొడుగులన్నీ తొడిగి మనిషికి ఇంకా కృత్రిమం చేయడానికి కవిత్వాన్ని ఉపయోగించడానికి కవి పూనుకుంటాడు. అలాంటప్పుడు కూడా కవి చెప్పినది కవిత్వం అయితేనే అందులో చెప్పిన విషయాలు ఆస్వాద్యతను పొందుతాయంటాడు చలం.

చలం ఒక రచనను విమర్శించేటప్పుడు ఏ ప్రక్రియనైతే విమర్శ చేస్తున్నామో ఆ ప్రక్రియాగతమైన దృష్టితోనే ఆ రచనను విమర్శించాలి అంతేగాని నవలని విమర్శిస్తున్నప్పుడు చిన్న కథకి చెందిన విమర్శ పద్ధతులతో విమర్శకు ఉపక్రమించడం అవివేకమని *''కుక్కని కుక్కగా విమర్శించాలి గాని, గాడిదతోనో, ఆవుతోనో పోల్చి విమర్శించడం సరైన విమర్శ కాదు. స్పష్టమైన సంగతిలో లోపాలు చూపాలని ఎన్ని తంటాలో''*[81] అని సమకాలీన విమర్శకులని వేళాకోళం చేస్తున్నాడు చలం. *''వెలువడిన ప్రతి రచనా ఏదో ఒక ప్రక్రియా*

---

[78] కళాతత్త్వశాస్త్రం మౌలికాంశ వివేచన. ముదిగొండ వీరభద్రయ్య. పుట.73

[79] మహాస్థాన్. చలం. పుట:210

[80] మహాస్థాన్. చలం. పుట:160

[81] మహాస్థాన్. చలం. పుట:290

*స్వభావాన్ని తప్పక కలిగియుంటుంది''*[82] అలా స్పష్టమైన సాహిత్య ప్రక్రియను ఆ ప్రక్రియకు చెందిన విమర్శ పద్ధతితో విమర్శించినపుడు ప్రక్రియాగతమైన విమర్శ జరిగి విమర్శ నిశితం అవుతుంది. ఇలాంటి ప్రక్రియాపరమైన విమర్శ సాహిత్య చరిత్ర నిర్మాణానికి కూడా పనికి వస్తుందని'[83] ఆధునిక విమర్శకులు ఇదే విషయాన్ని పేర్కొన్నారు.

**5.2.4. కళల పట్ల చలం అభిప్రాయాలు**

చలం కళ యొక్క ప్రయోజనం గురించి పేర్కొంటూ కళకు మనం అనుకునే ప్రయోజనాలు కాకుండా కళకి వేరే ప్రయోజనాలు ఉన్నాయని ఆ ప్రయోజనమే మనం అనుకున్న సర్వ ప్రయోజనాల్ని నెరవేరుస్తుందనీ పేర్కొన్నాడు. చలం చేసిన కళాతాత్త్విక వివేచన అంతా Transcendental Aesthetics గా చెప్పుకోవచ్చు. ముఖ్య లక్షణం 'ఏ విషయానికి సంబంధించైనా లౌకిక లక్షణం అనేదాన్ని సరిగనలోనికి తీసుకోకపోవటం' అని చెప్పవచ్చు. ఇది అలౌకికమైన యదార్థ జ్ఞానానికి సంభందించిన తత్త్వం. అంటే అవి నిశ్చితత్వం, సార్వత్రికమైన సత్యాలు. ఈ వర్గం వారు కళా ప్రయోజనాన్ని గురించి ఎలా చర్చిస్తారంటే కళకి ప్రయోజనం ఉంది. కాని అవి మనం అనుకునే ప్రయోజనం కాదు, కళే ఆంతరంగా తన నిర్మాణం లోనే ప్రయోజనాన్ని కలిగి ఉంటుంది అంటారు. చలం కూడా ఇదే కోవకి చెందినవాడుగా దీని బట్టి తెలుస్తుంది.

కళా ప్రయోజనం మీద చలం అభిప్రయాన్ని పరిశీలించినట్లైతే సౌందర్యంలో ప్రయోజనం ఉంటుంది కాని అది ప్రయోజన దృష్టికి అది కనబడదని అది నిరపేక్ష దృష్టికీ, నైతిక సంకల్పానికీ మాత్రమే అది కనబడుతుందని అది లేనట్లు అనిపిస్తున్నా అది ఉంటుందని చెప్పినా కాంట్ యొక్క అభిప్రాయన్నికి దగ్గరగా ఉందని చెప్పవచ్చు. అందులోను నిరపేక్ష కర్తవ్యంలో ఇష్టానిష్టాలు, లాభ నష్టాలు కష్ట సుఖాలతో ప్రమేయం ఉండదు. నిరపేక్ష కర్తవ్యంలో మనిషి నిర్ణయ స్వేచ్ఛ ఉంటుంది. విశ్వాసం ఉంటుంది. నైతికత ఉంటుంది. వాటి సహాయంతో అసలు యాదార్థ వస్తువులను గ్రహిస్తాడు. చలం కూడా కళకి ఉద్దేశ్యం ఉందని కానీ అది మనం ప్రయోజన రహితమైన దృష్టితో చూస్తేనే ఆ ఉద్దేశ్యం కనిపిస్తుందని చెప్తూ *''కళ ఉద్దేశ్యం*

[82] సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు. జి.వి. సుబ్రహ్మణ్యం పుట 9

[83] సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు. జి.వి. సుబ్రహ్మణ్యం పుట 22

*అందాన్ని కల్పించడం... అందం ఉపయోగ పడాలి అనడం మూర్ఖం, ఉపయోగపడకుండా అందం ఎన్నడూ ఉండదు. ఎందుకంటే తన ఆనందోపయోగం కోసం మనసు చూపేదే అందం కనుక, కానీ ఏదో ఒక ఉద్దేశ్యం మనసులో పెట్టుకొని దానికి ఉపయోగపడేట్టు అందాన్ని కల్పించాలంటే ఆ కల్పన అందమూ కాదు. కళా కాదు. అది కళ అయిందా నువ్వు తలుచుకొన్న ఉపయోగాన్ని దాటి తన స్వంత ఉద్దేశ్యాన్ని నెరవేర్చుకొంటుంది ఆ అందం''*[84] అని కళా ప్రయోజనాన్ని కళా ప్రయోజనంగా చూడక స్వీయ ఇష్టానిష్టాలతో, స్వలాభపేక్షలతో కళా ప్రయోజనాన్ని చూస్తే నిజమైన కళా ప్రయోజనం కనిపించదని ఒకవేళ దృష్టిరీత్యా ప్రయోజనం ఉందని భావించినా అది యదార్థ ప్రయోజనం కాదని చెప్తూ *''కళ లోని రసం కన్న గొప్ప సందేశం ఏముంది ప్రజలకి....నిజమైన కళ ఆత్మనే సంస్కరిస్తుంది. కాని ఆ సంస్కారం కంటికి కనబడదు. చూచి విలువ కట్టలేము... రసాన్నించ్చిందా కళ, యింక దీని ప్రయోజనమేమిటని అడగటం గుడ్డితనం. అంత ప్రయోజనాకారి యింక వుండదు.''*[85] ఇక్కడ చలం కళా ప్రయోజనాన్ని కళకి ప్రయోజనం 'రసం' కానీ ఆ రసం ప్రభావం బయటకి, కంటికి కనబడటం లేదు, రసానుభవం మనిషి ఆత్మని సంస్కరిస్తుంది. ఇదే రస ప్రయోజనం, కళా ప్రయోజనం. చలం ప్రయోజనం లేకుండా అందం ఉండదని స్పష్టంగా పేర్కొన్నాడు. చలం కళా ప్రయోజనంగా రసానుభవాన్ని పేర్కొన్నాడు.

*''గొప్ప ఆర్టు ముఖ్యం కవిత్వం వినోదం కాదు. అనుభవం. మానవుడి హృదయానికి విశాలత్వాన్నిచ్చి, ఉన్నత పరివర్తన కలగ చెయ్యాలని ప్రయత్నిస్తుంది.''*[86] ఇక్కడ చలం చెప్తున్నది సాంఘిక ప్రయోజన వాదుల ప్రయోజన సిద్ధాంతం లాంటింది కాదు. కళకు సాంఘిక ప్రయోజనం ఆనుషంగికమే కానీ ఉద్దిష్టం కాదని ఆయన స్పష్ట పరుస్తున్నాడు. చలం కళకు ప్రయోజనం లేదని చెప్పడం లేదు. మనం అనుకొన్న తాత్కాలిక సమస్యల పరిష్కారమే కళా ప్రయోజనం కాదని కళకి అంతకి మించిన వేరే ప్రయోజనం ఉందని అది మనిషిని ఉన్నతుణ్ణి చేయడమే అని చెప్తూ కవితం ప్రయోజనం అనుభవంగా చెప్తున్నాడు చలం.

---

84 మూజింగ్స్, చలం: పుట310

85 మూజింగ్స్, చలం: పుట265

86 రవీంద్ర గీతాంజలి. చలం. (ముందుమాట చలం పుట:13

అంతేగాకుండా ''కూలికి అందాన్ని పలికించే ఆర్టిస్టుకి తను స్వేచ్ఛగా ఎంచుకొని సౌందర్య రహస్యం లోకి వెతుకుతో వెళ్ళి ఎక్కడెక్కడివో రహస్యాలు పలికించే నేర్పు, విశ్వాసం, దృష్టి తక్కువవుతాయి.''[87] అని ప్రయోజన దృష్టితో కళా వ్యాపారం జరిపే వారి వల్ల 'కళా రసం' ఉదయించదని చెప్పాడు చలం.

గొప్ప కళాకారుడు తన కళని అవసరాలకి సర్దమన్నప్పుడు నరకయాతన పడతాడని చెప్తూ *''కళకి ఉద్దేశ్యం ఉండాలి. ప్రజాసేవ చెయ్యాలి అని ఆందోళన పడిన కొద్దీ అందానికి దూరమవుతున్నారు రచయితలు.''* [88] అని ప్రయోజన దృష్టి రచనలోని అందాన్ని చంపేస్తున్నదని చెప్తున్నాడు. చలం అభిప్రాయంలో కళా ప్రయోజనం కళలోని ప్రతి బిందువు లోనూ ఉంటుంది. ఇది దీని ప్రయోజనం, ఇది దీని కళ అంటూ విడివిడిగా ఉండవు కేవలం ప్రయోజన దృష్టే స్రష్టకు ఉంటే కళా స్థాయి దిగజారిపోతుంది. అందుచేత కళా సృజనకు కావాల్సిన స్వేచ్ఛను లుప్తం చేసే ప్రయోజన దృష్టి స్రష్టకు ఉండకూడదు. అప్పుడే అది పరమ ప్రయోజనవంతమైన కళా ఖండం కాగలుగుతుందంటున్నాడు చలం. అంతేగాకుండా కళా ప్రయోజనానికి సంబంధించి కమ్యూనిస్టులకున్న సాంఘిక దృష్టిని చలం తీవ్రంగా ఖడించాడు.

ఈ సందర్భంలో మనం గుర్తుచేసుకోవలసిన మరో అలంకారికుడు కుంతకుడు కవుల వాక్కులు నిరంతర రసోద్గారగర్భసౌందర్యనిర్భరములని అన్నాడు.[89] కుంతకుడు ప్రాచీన భారతపు అలంకారికులలో ఒకడు. ఇతని రచన పేరు 'వక్రోక్తి జీవిత'. వక్రోక్తి జీవత వక్రోక్తి ప్రాధాన్యతని తెలుపుతూ అలంకార సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుంది. ఇంత ముఖ్యమైన రచన డా.ఎస్.కె.డీ సరిచేసి ప్రచురించేవరకూ కేవలం ఉల్లేఖాలు, సూచనలు ద్వారా మాత్రమే తెలియజేయబడింది. ఇవి మొదట 1923లో కలకత్తా ఓరియంటల్ స్టడిస్ ద్వారా తరువాత మరన 1928లో తిరిగి ప్రచురింపబడింది. ఇతర ప్రాచీన కవుల లేనే కుంతకుని జీవితం, మరియు చరిత్రల గురించి మనకి చాలా కొద్దిగా మాత్రమే తెలుస్తుంది. నాటక కర్త

[87] మూజింగ్స్, చలం: పుట262

[88] మూజింగ్స్, చలం: పుట310,311

[89] . నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:40

రాజశేఖరుడు మరియు మహిమభట్టుల ఉల్లేఖనలు ద్వారా ఇతను 11వ శతాబ్దపు మధ్యముడిగా, ఇతని బిరుదు 'రాజనిక' ఆధారంగా కాశ్మీరానికి చెందిన వాడుగా తెలుస్తుంది. కుంతకుడిని ఆనందవర్ధుని సమకాలికునిగా భావించవచ్చు. ఇతను ఆనందవర్ధునుని ధ్వనికారునిగా ఉల్లేఖించాడు.

కుంతకుని వ్యక్తి జీవిత ఉన్మేషాలనబడే నాలుగు అధ్యాయాల రచన. ఈ రచన కారికాలనే శ్లోకాలతో వాటికి వృత్తులనే గద్య వ్యాఖ్యాలతో సాగిన రచన. ఈ గద్య వృత్తులలో కూడా విశదీకృత శ్లోకాలున్నాయి. కుంతకుని రచన 'వక్రోక్తి' సిద్ధాంతానికి పెద్ద పీట వేస్తుంది. వక్రోక్తి అంటే వంకర మాట అని అర్థం. వక్రోక్తి ఒక అసాధారణ భావ ప్రకటన ఇది సాధారణంగా కవిత్వంలో ఎక్కువగా కనిపిస్తుంది. ఇది అలంకార శాస్త్రంలో రకరకాలుగా వర్ణించబడింది. కొందరు దీనిని ఒక రకమైన అలంకారంగా గుర్తిస్తే, మరికొందరు అలంకారులకి మూలంగా గుర్తించారు. కుంతకుడు వక్రోక్తిని కవిత్వపు జీవం (జీవితగా) గుర్తించి తన రచనకి '*వక్రోక్తి జీవిత*' అని పేరు పెట్టాడు.

తరువాతి సిద్ధాంత కర్త. 'అలంకార సర్వస్వ' రచయిత సముద్రబంధుడు సంస్కృత కవిత్వ శాస్త్రాన్ని ఐదు విభిన్న శాఖలుగా వర్గీకరించాడు. అవి 1) అలంకార 2) గుణ 3) కవి వ్యాపార 4) భానితి వైచిత్ర్య 5) భోజకత్వ మొదలగున్నవి. ఈ సందర్భంలోనే సముద్ర బంధుడు మూడవదైన కవిత్వ క్రియ మరియు సౌందర్య వ్యక్తీకరణని కావ్య ప్రత్యేకతగా వక్రోక్తి జీవితకారుడు (కుంతకుడు) వర్ణించాడని తెలిపాడు. కుంతకుడు కేవలం వక్రోక్తి మీదనే కాకుండా మిగతా శాఖలైన సాహిత్య, కవి వ్యాపార, గుణ, ఔచిత్యాల గురించి తన అభిప్రాయాలను వెల్లడించాడు. కుంతకుడు బామహుడి వక్రోక్తి భావలతో స్ఫూర్తి పొంది వక్రోక్తి సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. వక్రోక్తి పదాల మరియు ఆలోచనల కాల్పనిక పారిభాషక పదం. ''వైదగ్ధ్య ' భంగి ' భానితి''.

కుంతకుని ప్రకారం అలంకారం వక్రోక్తికి మారు పేరు మాత్రమే. కవిత్వపు జీవం వక్రోక్తి కావున వక్రోక్తి లేకుండా ఎటువంటి కవిత్వము ఉండదు. దీనితో పాటు కుంతకుడు రసాన్ని దాని ప్రాముఖ్యతని గుర్తించి అది ప్రకరణ వక్రోత్త మరియు ప్రబంధ వక్రతల కిందకి వస్తుంది. ఆనందవర్థనుని ధ్వని సిద్ధాంతాన్ని కుంతకుడు తన వక్రోక్తిలో చిన్న, చిన్న మార్పులతో

అవసరమైన చోట క్రొత్త ఉదాహరణలతో ప్రస్తావించాడు. కుంతకుని రసవాద అలంకార భావన కూడా చాలా ఆసక్తికరంగా సాగుతుంది. పూర్వ అలంకారికులకు భిన్నంగా కుంతకుడు రసవాద అలంకారాలకు రస స్థాయిని ఇచ్చాడు. ఇది 'రసాన తుల్యం వర్తమానం' గా గుర్తించబడింది. ఆనందవర్ధనుడు రసావత్‌ని రెండవ రకపు కావ్యాలలో మాత్రమే ఉంచితే కుంతకుడు దీనిని అన్ని రకాల వక్రతల స్థాయిని ఆపాదించి దీనిని "A kind of Vakroki in which the rasa supplies the principal charm"[90] గా గుర్తించారు.

వక్రోక్తి బహిర్గతమైన కావ్య భావన. ఇది అసాధారణ ఆకర్షణని కలిగి ఉంటుంది. దీనికి ఆఖరి సాక్ష్యంగా "The pleasure of those who know, i.e. the men of taste"[91] అన్న వాక్యం తెలుపుతుంది. ఈ ప్రకారం కుంతకుడు ధ్వని సిద్ధాంతకర్తలను రస'సిద్ధాంతకర్తలుగా అంగీకరించాడు.

కుంతకుని ప్రకారం 'శబ్దార్థౌ సహితౌ కావ్యం'. కుంతకుడు సాహిత్య భావన గురించి కూడా చాలా పరిశోధనలు చేశాడు. కుంతకుడు సాహిత్యాని "as the quality of sabda and artha vying with each other in the suggestion of rasa, or, to put generally in enhancing the beauty of poetry"[92] అదే విధంగా కుంతకుడు రెండు, రకాల గుణాలను గుర్తించాడు. అవి 1. సాధారణ ' అన్ని కావ్యాలలో కనిపిస్తుంది., 2. అసాధారణ ' ఇవి ప్రత్యేక మార్గాలు మరియు శైలులలో మాత్రమే కనిపిస్తుంది, సాధారణ గుణాలు సౌభాగ్య, లావణ్య మరియు ఔచిత్యాలు కాగా అసాధరణ గుణాలు మాధుర్య, ప్రసాద, లావణ్య మరియు అభిజాత్యాలు. ఈ నాలుగు అసాధారణ గుణాల సుకుమార మార్గం మరియు విచిత్ర మార్గమనే రెండు మార్గాలకు చెందినవి. కుంతకుని తరువాత వచ్చిన క్షేమేంద్రుడు ఈ ఔచిత్య గుణం గురించి ఒక పెద్ద కావ్యమే రచించాడు. ఇందులో కుంతకుని భావాలను పునరుక్తిస్తూ ఔచిత్య రస వర్ణన కావించాడు. కుంతకుడు ఔచిత్య మరియు రసాల ఆధిక్యతని

---

[90] cultural leaders of India Aestheticians; P: 83

[91] cultural leaders of India Aestheticians; P: 83

[92] cultural leaders of India Aestheticians; Page:83

గుర్తించి వాటిని తన కొత్త సిద్ధాంతమైన వక్రోక్తిలో చూపించటమే కాక అలంకార శాస్త్రపు అనేక విషయాలను చర్చించి భారతీయ అలంకారికులలో అగ్రగణ్యునిగా పేరు గడించాడు.

*"సాహిత్యార్థ సుధా సింధు సారోన్మీలనానికి పూనుకొన్న కుంతకుడు కావ్య పరిజ్ఞానం వల్ల లభించే సౌందర్యం ఏ విధమైనదో తెలుపుతూ "కీ దృశ్యం తత్సౌందర్యమ్? నూతనౌచిత్యమ్. నూతన మభినవ మలౌకిక మౌచిత్య ముచిత భావోయస్య"* (వ.జీ-2). ఈ వాక్యం వల్ల కుంతకుడు కావ్యంలో అలౌకికము, అనిర్వచనీయము అయిన సౌందర్యాన్ని దర్శించినట్లు తెలుస్తుంది. కేవల సత్తా మాత్రముచే స్ఫురించే వర్ణ్యమాన స్వరూపాలైన పదార్థాలు కవులచే అభూతాలుగా సృష్టింపబడి సహృదయ హృదయ హారిణియైన రమణీయతను పొందుతాయని, అనిర్వచనీయమైన ఆ అతిశయత్వాన్ని కల్పించే గుణమే నూతనత్వమని కుంతకుడు వివరించాడు."[93]

### 5.3. బుచ్చిబాబు సౌందర్య దృక్పథం

కళా తత్త్వ శాస్త్రం ఆత్మ స్థాయిలో ఆవిష్కారమయ్యే ఆనందాన్ని గూర్చి చర్చిస్తుంది. ఆనందం ఆత్మ స్థాయిలో ఆవిష్కారమయ్యేదిగా చెప్పటానికి భారతీయులు, పాశ్చాత్యులు కొన్ని అనుభవ పరంపరలను చెప్తూ అలా అనుభవాన్ని పొందితేనే సౌందర్యానుభవాన్ని పొందినట్లుగా చెప్పారు. బుచ్చిబాబు వివేచించిన సౌందర్యం కళాతత్త్వ శాస్త్ర పరిధిలోకి రావటానికి కారణము బుచ్చిబాబు  సౌందర్యాన్ని ఆత్మ స్థాయిలో ఆవిష్కరించటమే. దీని గురించి భారతీయులు, పాశ్చాత్యులు కూడా పేర్కొన్నారు. ఆయన తన చివరికి మిగిలేది నవలలో ఆవిష్కరించిన గొప్ప సత్యాలు దయ, ప్రేమ, సౌందర్యం. బుచ్చిబాబు చివరికి మిగిలేది నవలలో ప్రేమ ద్వారా సౌందర్యం ఎట్లా ఆవిష్కారమవుతుందో నిరూపించాడు. సౌందర్య మన్నది అలౌకిక అనుభవమనీ సార్థ ప్రయోజన మన్నది సౌందర్యానుభవ వేళలో పొడచూపని స్వల్ప సుఖాలను మించిన ఒక విశేషమైన ఆనందమే సౌందర్యమనీ బుచ్చిబాబుఅభిప్రాయం. బుచ్చిబాబు సౌందర్యం అనేది స్వార్థానికీ, భౌతిక వాంఛలకు అతీతంగా ఉంటుందని స్వల్ప సుఖాలు, ఇంద్రియ వాంఛలు సౌందర్యశాస్త్ర పరిధిలోకి రావనీ పేర్కొనెను. ఈ అభిప్రాయాలనే వీరు

[93] నరసింహ మూర్తి, యు.ఎ. విశ్వనాథ సౌందర్య దర్శనము. పుట:18-19

తనదైన పద్ధతిలో ఆయన 'చివరకు మిగిలేది నవల'లో చర్చించారు. ఠాగూర్ కూడా సౌందర్యాన్ని ఆస్వాదకుని ఆత్మ గుణంగానే చూశారు. ఈ స్థితిలో ఆస్వాదకుడు సంకుచిత స్థితి నుండి బృహథ్ వ్యక్తిగా ఎదుగుతాడని ఈ స్థితిలోనే అతడు విశ్వసౌందర్యాన్ని అవగాహన చేసుకోగలుగుతాడని చెప్తూ ''తాను కేంద్రంలో ఉంటూ సాలె పురుగు తన అల్లికను అల్లినట్లుగా మన ఆత్మ కేంద్ర స్థానంలో ఉంటూ తన పరిసరాలతో సంబంధం పెట్టుకోవటంలో చురుకుగా ఉంటుంది. అది ఎప్పుడూ సుందరమైన దాన్ని సుందర విషయం చేస్తుందని మనం సౌందర్యం అని పిలిచేది దీని చేతనే సృజింప బడుతుందని''[94] చెప్పారు. కాలరిడ్జ్ కూడాసౌందర్య స్పృహ నిర్వికల్పమైనదని వివరిస్తూ ఆయన ప్రతిభ లేక ఇంద్రియాల ద్వారా మనసుకు ప్రత్యక్షంగానూ మధ్యవర్తి లేకుండానూ, అందించేది సౌందర్యం అనుభవమని చెప్పాడు. కాలరిడ్జ్ సౌందర్యాన్ని భగవత్ తత్త్వంగా భావించాడు.[95]

### 5.3.1. బుచ్చిబాబు దృష్టిలో సౌందర్య అస్తిత్వం

బుచ్చిబాబు సౌందర్యం అస్తిత్వం మీద నిర్దిష్టమైన అభిప్రాయాలను వ్యక్తం చేశాడు. బుచ్చిబాబు తన చివరికి మిగిలేది నవల ద్వారా సౌందర్యాన్ని మనోగతంగా పేర్కొన్నారు. సౌందర్యం వ్యక్తిగత సత్యమనీ, కానీ ఓ ఆలంబన ఉన్నప్పుడే వ్యక్తిగత సౌందర్యం ప్రకాశాన్ని పొందుతుందని పేర్కొన్నాడు. అయితే ఆలంబనగా మాత్రమే ఆ వస్తువు ఉంటుందనీ ఆస్వాదనలో వస్తువు తన అస్తిత్వాన్ని కోల్పోతుందనీ బుచ్చిబాబు సౌందర్యాన్ని వస్తువుకతీతంగా పేర్కొన్నాడు. బుచ్చిబాబు సౌందర్య అస్తిత్వం గురించి చెప్తూ ఒక వస్తువును మనం సుందర వస్తువుగా చిత్రించాలంటే ముందు దాని నుండి మనం ఆనందానుభవాన్ని పొందాలని అప్పుడే అది సుందర వస్తువు అవుతుందంటారు బుచ్చిబాబు.

ఒక వస్తువును సుందరమైనదిగా చూడాలంటే ముందుగా ఆ వస్తువును సుందరంగా చూసే చూపు మనలో ఉండాలంటూ సహజంగా సౌందర్యం మనలో ఉన్నప్పుడే వస్తువులో మనం సౌందర్యాన్ని చూడగలమని పేర్కొన్నారు. కాళిదాసు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

---

[94] కళాతత్త్వశాస్త్రం మౌలికాంశ వివేచన. ముదిగొండ వీరభద్రయ్య. పుట.33

[95] కళాతత్త్వశాస్త్రం మౌలికాంశ వివేచన. ముదిగొండ వీరభద్రయ్య. పుట.31

బుచ్చిబాబు సౌందర్యం వక్తిగత సత్యమే అనే తత్వాన్ని చివరికి మిగిలేది నవలలోని దయానిధి పాత్ర ద్వారా ఆవిష్కరించాడు. ఆయన ఈ నవలలో సౌందర్యాన్ని *''లోకం అంతటా వ్యాపించి తనలో యిముడ్చుకున్న శక్తి''*[96] గా సౌందర్యం విశ్వమంతా వ్యాపించి ఉంటుందని చెప్తూ సౌందర్యంను శక్తిగా పేర్కొంటున్నాడు. బుచ్చిబాబు వ్యక్తి తన అనుభవం ద్వారానే సౌందర్యాన్ని వెలుగులోకి తెచ్చుకుంటాడని పేర్కొనెను. దయానిధి కోమలి ఉనికి గురించి *''కోమలి శరీరం మట్టి హృదయం భ్రమ ఉనికి మాయ స్థలంలో సమయంలో లేదు ఆమెను గురించిన భావాలే తనకు గోచరించిన యదార్థం''*[97]ఇక్కడ సౌందర్యం వక్తిగతసత్యమే అన్నతత్వాన్ని దయానిధిద్వారా ఆవిష్కరింప జేస్తున్నాడు. సౌందర్యం వ్యక్తిగత సత్యమే అయినప్పటికి దానికి ఓ వెలుగు నివ్వాలంటే తప్పని సరిగా ఒక రూపాన్ని గాని ఒక వస్తువుని గాని ఆలంబన తీసుకోవలసిందే అని అంతమాత్రానా సౌందర్యం వస్తుగత సత్యం అయిపోదని ఇక్కడ కూడా కోమలి యదార్థం కాదని ఆమెను గురించిన భావాలే యదార్థమనీ దయానిధి భావనల ద్వారా పేర్కొన్నాడు.

బుచ్చిబాబు ఒక సౌందర్యాన్ని మనం అనుభవించాలంటే ఆ వస్తువును మనం తప్పనిసరిగా ఆలంబనగా ఉంటేనే అనుభవించగలం అంతమాత్రానా అదియే సౌందర్యం కాదు. ఆ వస్తువు ఆధారంగా మనం సౌందర్యాన్ని ఆస్వాదిస్తున్నాం అంతే ఒక విశిష్ట స్థితిలో ఆ వస్తువు తన ఉనికిని కోల్పోతుంది అలాంటిదే కోమలి శరీరం కూడా. దయానిధి కోమలి రూపం ద్వారా సౌందర్యానుభవాన్ని పొందాడు. దయానిధి అనుభవంలో కోమలి తన రూపాన్ని కోల్పోయింది. అందువల్లనే దయానిధి కోమలి సౌందర్యాన్నికి హద్దులు నిర్ణయించలేకపోతాడు. దీనికి కారణం అసలు సౌందర్య దృష్టి అనేది దయానిధిలో ఉండటం వలనే దయానిధి కోమలి రూపానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. అందుకు దయానిధి ''శరీరాలు లేని ఆత్మలైతే బావుణ్ణు''[98] అని అంటారు. ఇక్కడ దయానిధి సౌందర్యంను శరీర పరిధిలో కంటే, విశాలమైన ఆత్మ

[96] బుచ్చిబాబు. చివరికి మిగిలేది పుట:130

[97] బుచ్చిబాబు. చివరికి మిగిలేది పుట:32

[98] బుచ్చిబాబు. చివరికి మిగిలేది పుట:334

దృష్టితో చూశాడు. ఆత్మకు రూపముండదు కాబట్టి ఇక్కడ బుచ్చిబాబు సౌందర్యాన్ని వస్తుగతంగా కాకుండా మనోగతంగా చూస్తున్నాడని చెప్పవచ్చు.

సౌందర్యం అనేది వ్యక్తిలోనే ఉంటుందని సౌందర్యాన్ని, అనుభవాన్ని, వస్తువుని వేరుగా చూడలేమని అవి ఎప్పుడూ కలిసే ఉంటాయంటున్నాడు. సౌందర్యం అనేది ఎప్పుడూ తన నుండి విడిగా ఉండదని దయానిధి ద్వారా పేర్కొంటున్నాడు. దయానిధి కోమలిని తన నుండి విడిగా ఎప్పుడూ భావించుకోలేదు. అందుకే బుచ్చిబాబు ''మరో ప్రపంచంలో వారిద్దరూ ఒక శరీరమే''[99] అంటారు. అంటే కోమలి దయానిధి నుండి విడిగా లేదు. అట్లా భిన్నంగా ఉన్నట్లయితే ఆమె సౌందర్యం నశింపును పొంది ఉండేదే. కానీ ఆమె సౌందర్యం యొక్క ఉనికి దయానిధిలో ఉంది. కనుకనే భౌతికంగా ఆమె నశింపును పొందినా దయానిధిలో ఉన్న ఆమె సౌందర్యం నశింపును పొందదు. ఈ మాటలనే బుచ్చిబాబు చివరికి మిగిలేది నవలలో *''కోమలి శరీరం నా ప్రేమతో పెరిగింది హృదయం ఇప్పుడిప్పుడే జనిస్తోంది... ఆమె ఎక్కడికి వెళ్ళినా, ఎవరి హస్తాలలో నలిగిపోయినా ఏ దౌర్భాగ్యుడి శిక్షణలో వంపులు పోగొట్టుకున్నా ఆమె హృదయం దృష్టి మానసిక వైరాగ్యం అన్నీ నాకోసం కాచుకోని వుంటాయి.''*[100] అని సంజీవ్ దేవ్ పేర్కొన్నట్టూ వస్తుగత సౌందర్యం నశింపును పొందుతుంది గాని వ్యక్తిగత సౌందర్యం శాశ్వతమనే అభిప్రాయాన్ని ఇక్కడ పేర్కొన్నాడు బుచ్చిబాబు.

చివరికి మిగిలేది నవలలో కూడా దయానిధి కోమలిలో మాత్రమే సౌందర్యాన్ని చూశాడు. కోమలి కంటే అందమైన అమ్మాయిలు ఉన్నప్పటికీ దయానిధికి కోమలి మాత్రమే నచ్చింది. ఎందుకంటే అసలైన సౌందర్య దృష్టి దయానిధిలో ఉంది కాబట్టి దయానిధికి కోమలియే సౌందర్యంగా కనిపించింది. దీని బట్టి సౌందర్యం అనేది ఆంతరికమే అని స్పష్టంగా చెప్పవచ్చు.

---

[99] బుచ్చిబాబు. చివరికి మిగిలేది పుట:30

[100] బుచ్చిబాబు. చివరికి మిగిలేది పుట:172

### 5.3.2. సౌందర్యానుభవం

బుచ్చిబాబు సౌందర్యం అనుభవ సత్యంగా పేర్కొంటూనే నిరంతరం నవ్యతతో భాసించేదే సౌందర్యంగా పేర్కొనెను. బుచ్చిబాబు సౌందర్యాన్ని అతార్కిక అనుభవంగా భావించాడు. బుచ్చిబాబు సౌందర్యానుభవాన్ని గురించి పేర్కొంటూ సౌందర్యం అనేది హఠాత్తుగా మనకు తెలియకుండానే అనుభవంలోకి వస్తుందని *“ఫ్రిజిడిటీ ఏ ఒక్క దృశ్యం నిశ్చలంగా మనస్సులో ఉండిపోదు. కావలసిన వ్యక్తిని ఊహించ యత్నించిన కొద్దీ అది మరింత దూరమై మసగై మరింత అతీతమైపోతుంది. అప్రయత్నముగ ఏదో చూస్తున్నప్పుడు వాసన చూస్తున్నప్పుడు ఆకస్మికంగా కోరుకున్న వ్యక్తి ఊహలో చొరబడి రంగుల కుంచెతో తన ప్రతిమను తానే చిత్రించుకుంటుంది. ఆ ప్రతిమని ఉంచుకోవటం రప్పించటం మనకి సాధ్యం కావు.”*[101] అని సౌందర్యం అనేది ప్రయత్న పూర్వకంగా అనుభవంలోకి రాదని, అది అప్రయత్న పూర్వకంగా వెలుగు చూడవలసిందే తప్ప సౌందర్యం తనకు కావాలి దానిని అనుభవించాలి అనుకున్నప్పుడు సౌందర్యం లభించదని అది ఎప్పుడూ అప్రయత్నంగానూ ఆకస్మికంగానూ వెలుగుచూస్తుందని ప్రయత్నించి చూస్తే సౌందర్యం అతీతమవుతుందని పేర్కొన్నాడు.

అంతేకాకుండా బుచ్చిబాబు సౌందర్యానుభవం గురించి తర్కం వలన సౌందర్య అనుభూతి కలగదని సౌందర్య మన్నది అనుభవ సత్యమనీ ఆలోచనలతో వచ్చేది కాదనీ చెప్తూ సౌందర్యం అనుభవం తార్కిక అనుభవం కాదని ఎందుకంటే సౌందర్యం అనేది అనుక్షణం నవ్యతను కలిగించేది కాబట్టి దీనితో తర్కంతో సంబంధం లేదని కావున సౌందర్యం అనేది అతార్కిక అనుభవంగా చాలా నిర్ధిష్టముగా పేర్కొన్నాడు. ఇదే అభిప్రాయన్ని పాశ్చాత్య సౌందర్యశాస్త్ర విమర్శకులైన బౌమ్ గార్టెన్, క్రోచీ, బ్రూక్, హట్సన్, శాంటాయన మొదలైన వారితో భారతీయ సౌందర్యశాస్త్ర విమర్శకులు కూడా సౌందర్యం అనేది ఇంద్రియాలతో అనుభవించినప్పుడే సాధ్యం అని మన మనస్సు దేనిని కోరుకుంటుందో దేని ద్వారా మనం ఆనందాన్ని పొందుతామో అదే సౌందర్యపు విలువగా పేర్కొనడం మనం గమనించవచ్చు.

[101] బుచ్చిబాబు. చివరికి మిగిలేది పుట:25

బుచ్చిబాబు తన చివరికి మిగిలేది నవలలో అమృతం దయానిధిని *"నీకు కోమలి ఎందుకు నచ్చింది బావా అని ప్రశ్నిస్తే దానికి సమాధానంగా దయానిధి ఆ ప్రశ్నకు సమాధానం తెలిస్తే జీవిత రహస్యమే తెలుస్తుందంటారు"*[102] అని దయానిధి పాత్ర ద్వారా పేర్కొన్నాడు. కోమలి కంటే అందమైన వాళ్ళు ఉన్నప్పటికి కోమలియే దయానిధికి నచ్చింది. కోమలి తనకు ఎందుకు నచ్చిందో తెలియకపోయినప్పటికి కోమలి ద్వారా దయానిధి ఓ విశేషమైన ఆనందానుభవాన్ని పొందుతాడు. దయానిధి కోమలి అందాన్ని అనుభవపూర్వకంగా తెలుసుకుంటాడు. ఆమెను గురించి విమర్శను చేయలేకపోతాడు. దానిని విలువ కట్టడానికి దయానిధి ప్రయత్నించినప్పటికి అది అతనికి తర్కానికి అందలేదు. ఎందుకంటే సౌందర్యానుభవం తార్కిక అనుభవం కాకపోవడం చేత కావచ్చు.

ఇటువంటి అభిప్రాయన్నే శాంటాయన కూడా "సౌందర్యం అనుభవం ద్వారా ఆవిష్కారం కావలసిన సత్యమేననీ దానిని విమర్శించటం తర్కించటం ద్వారా నిర్ణయించలేమని "Values spring from the immediate inexplicable reaction of vital impulse and from irrational part of nature" [103] పేర్కొన్నాడు.

బుచ్చిబాబు సౌందర్యం అనుభవ సత్యమనీ ఒక వస్తువును అనుభవించటమనేది నవ్యత ఉన్నప్పుడే సాధ్యమని చెప్తూ *"చిత్రకారుడు అందాన్ని ప్రేమిస్తాడు ఎంత వరకు? తన రంగు ద్వారా పటంలో లభ్యమయ్యే వరకు అందాన్ని బంధించిన తరువాత అతను బాహ్య ప్రపంచానికి దాస్యం చేస్తాడు. జీవితం అంతా ఒక అనంతమైన అన్వేషణ. జీవిత రహస్యాన్ని శోధించటం రహస్యం తెలుసుకున్న తర్వాత అన్వేషణ మానడు."* [104] అని సౌందర్యం నిరంతరం నవీనం అని తర్కంలో లాగా ఒక్కసారి తెలుసుకోగానే దాని పరమార్థం నేరవరదని సౌందర్యం అనేది ప్రయోజనానికి అతీతంగా భౌతికతకు భిన్నంగా అనుభవంలోకి రావాలి అని పేర్కొనెను.

---

102 బుచ్చిబాబు. చివరికి మిగిలేది పుట:36

103 George Santayana. The Sense of Beauty. Page: 14

104 బుచ్చిబాబు. చివరికి మిగిలేది పుట:335

బుచ్చిబాబు లోకోత్తరాహ్లాదం ఉంటేనే సౌందర్యం అనుభవంలోకి వస్తుందని పేర్కొంటూ దీనికి ముందుగా స్వార్థ ప్రయోజనాన్ని అధిగమించాలని అప్పుడే స్వార్థ ప్రయోజనాన్ని మించిన సాంఘీక ప్రయోజనంతో సౌందర్యం అనుభవంలోకి వస్తుందని చెప్పెను. ఒక వస్తువు ద్వారా మనం ఆనందానుభూతిని కోరుకుంటున్నప్పుడు మానసికంగా ఆనందాన్ని పొందుతామే కానీ ఆ వస్తువు మనది కావాలని కోరుకోమని సుందర వస్తువులు ఏ ఒక్కరికో సొంతం కావని అవి ఏ ఒక్కరికో ఆనందాన్ని ఇవ్వవని ఒక అందమైన వస్తువును అందరూ చూసి ఎలా ఆనందిస్తున్నారో ఒక మధురమైన పాటను విని అందరూ ఆస్వాదిస్తున్నాదో అదే విధంగా అనుభవించటమే గాని ఆ అందమైన దానిని నాది అనటానికి వీలుండదు అని బుచ్చిబాబు పేర్కొన్నారు.[105]

దీనికి భిన్నంగా ప్రాశ్చాత్య అలంకారికులలో ఒకరైన హెగెల్ ప్రకృతిని నిర్లక్ష్యం చేసి కళని ఒక రకమైన వస్తు విషయాగత వ్యక్తీకరణ రూపంగా చూశారు. దానిలో కళ వర్గీకరణ ఉద్భవించింది. వస్తు విషయాగత కళ దాని అవసరం మేరకు మరింత సంయుక్తమై 1) సింబాలిక్ ఆర్ట్ 2) క్లాసికల్ ఆర్ట్ 3) రొమాంటిక్ ఆర్ట్‌గా వర్గీకరించబడింది. ఈ శ్రేణులన్నీ 1) వాస్తుకళ 2) శిల్ప కళ 3) చిత్ర కళ, సంగీతం మరియు కవిత్వం అన్ని సమపాళ్ళలో కలిగి ఉంటాయి. హెగెల్ సిద్ధాంతపు లోపం రొమాంటిక్ శ్రేణికి చేరగానే కళాతత్త్వ శాస్త్రంలోకి మారి అదృశ్యమైపోయింది. ఈ సిద్ధాంతం తర్క వక్రతకి దారితీసి సత్య ఉల్లంఘన చేసింది. దీనికి కారణం హెగెల్ సహజ ప్రకృతి సౌందర్యాన్ని స్వీకరించక పోవటం.

హెగెల్ భావనను ఆయన మాటలలోనే చూస్తే 'The romantic content does not remain essentially artistic, but leaves the determination both of the content and of the form to arbitrary invention; excluding nothing, but representing everything which man is capable of making his own, whether this is proper to any definite stage of art or no'[106] దీనికి విరుద్ధమైన పాత భావన ఈ కింది విధంగా ఉంది. *"The highest function of art is*

---

105 బుచ్చిబాబు. చివరికి మిగిలేది పుట:34

106 Carritt, E.F. The Theory of Beauty 1962; 113

*best performed by something which has ceased to be art; art was perfectly art only at a relatively low stage"*[107] దీనిని బట్టి హెగెల్ సిద్ధాంతం సౌందర్యశాస్త్ర భావన కన్నా తత్త్వశాస్త్ర భావనని లోతుగా కలిగి ఉన్నదని చెప్పవచ్చు.

బుచ్చిబాబులాంటి ఆలోచనకల మరో అలంకారికుడు సౌందర్యం గురించి లోతైన విచారణ గావించిన తాత్త్వికుడు సాంటాయనా. *'The Sense of Beauty'* ఈయన రాసిన ప్రముఖ గ్రంథం. ఈ గ్రంథంలో సౌందర్యం అంటే ఏంటో వివరంగా పేర్కొన్నాడు. 'సౌందర్యం అనేది మూర్తీభవింప జేయబడిన సముఖమైన, ఆంతరంగికమైన విలువ' అని చెప్పాడు. దీన్నే మరొక విధంగా నిర్వచిస్తూ 'ఒక వస్తువు యొక్క గుణంగా గుర్తింపబడిన ఆనందమే సౌందర్యం' అన్నాడు. సౌందర్యం యొక్క స్వరూప, స్వభావాల గురించి చెబుతూ, సౌందర్యానికి స్వతంత్ర అస్తిత్వం లేదని, ఆస్వాదన తప్ప దీనికీ వేరే ఉనికి లేదన్నాడు. ఆస్వాదింపబడిన సౌందర్యం అనుభవించని ఆనందం ఒక్కటే అని పేర్కొన్నాడు.

ఈయన దృష్టిలో సౌందర్యం వస్తువు యొక్క విలువగానే భావింపబడింది. దేనిని అయినా మనం మంచిది కాబట్టి కోరుకోము, దాన్ని మనం కోరుకుంటున్నాం కాబట్టే మంచిదవుతుంది. అని సౌందర్య సిద్ధాంతాన్ని ప్రతిష్టాపించాడు సాంటాయానా.

సౌందర్య శాస్త్రం బౌమ్ గార్టెన్ తో సిద్ధాంతరూపంలో కనిపించినా తర్వాత కాలంలో అనేక మంది ఈ శాస్త్రం గురించి కృషి చేశారని ఇంతవరకు వివరించిన దానిని బట్టి తెలుస్తుంది.

**5.3..3. చివరకుమిగిలేది నవల- సౌందర్య దృక్పథం**

సాధారణంగా ఆధునిక తెలుగు సాహిత్యంలో బుచ్చిబాబు(శివరాజు వెంకట సుబ్బారావు) పేరు వినగానే చివరకు మిగిలేది నవల కళ్ళముందు సాక్షాత్కారిస్తుంది. చివరకు మిగిలేది నవల అనగానే అది మనోవిశ్లేషణ నవల అనీ అందులో పాత్రలన్నీ అన్నీ కూడా మనోవిశ్లేషణని కేంద్రీకృతం చేసుకొని నవల కొనసాగి చివరకు ఏమి మిగుల్చుకోలేక మనిషి మనోవిశ్లేషణను మాత్రమే మిగిల్చి నవల ముగుస్తుంది. ఇదంతా సాహిత్య పరిజ్ఞానం ఉన్న ఏ

[107] Carritt. E.F. The Theory of Beauty Page:112

ఒక్కరికైనా తెలిసే సామాన్య విషయం. చివరకుమిగిలేది నవల్లో మనోవిశ్లేషణ తప్ప ఇంకేమన్నా ఉందా అని కొంచెం పరిశీలనాత్మక దృష్టితో ఆలోచిస్తే తప్పకుండా ఏదో బయట ప్రపంచానికి తెలియని కొత్తఅంశం ఉండేతీరుతుంది అదే బుచ్చిబాబు చివరకుమిగిలేది నవల్లో కూడా చోటుచేసుకుంది.

చివరకుమిగిలేది నవలంతా కూడా మనోవిశ్లేషణతో కూడుకుని ఉంది. దీనితో పాటుగా కూడా నవల్లో ఏకాంతము, ప్రేమ, నిరంత అనుభూతి, నిరంతరాన్వేషణ ఇలా ఎన్నో ఉన్నాయి. ప్రధానంగా మానవ జీవిన మనోవికాసానికి సాహిత్యం ఎంత అవసరమో సాహిత్యంలో ప్రతిబింబించే అందం, ఆనందం అంతే అవసరం. దీనినే మనం సాహిత్య పరిభాషలో కావ్య సౌందర్యం అంటున్నాం. ఇలాంటి కావ్య సౌందర్యాన్ని బుచ్చిబాబు తన చివరకుమిగిలేది నవల్లో ప్రతిపాదించాడు.

బుచ్చిబాబు నవల్లో ఆవిష్కరించిన గొప్ప సత్యాలు దయ, ప్రేప, సౌందర్యం.సాధారణంగా సాహిత్య, సమాజాల్లో వచ్చే ప్రతి వాదానికి ప్రతి సిద్ధాంతానికి ఒక బలమైన తాత్త్విక భూమిక, తార్కిక భూమిక ఉంటుంది. కానీ సౌందర్యశాస్త్రానికి మాత్రం అనుభవ పూర్వకమైన అంశాలే సౌందర్యంగా చెలామణి అవుతాయి. అయితే సౌందర్యశాస్త్ర నియమాల పట్ల, వాటి నిర్మాణాల పట్ల అనేక వాదోపవాదాలు జరిగాయి. అయితే ప్రస్తుత అంశం బుచ్చిబాబు చివరకు మిగిలేది నవల్లో సౌందర్య దృక్పథం కనుక బుచ్చిబాబు నవల అంతా ఈ సౌందర్య అంశాల దృష్ట్యా పరిశీలించినపుడు ఆయన అనుభవాలే నవల సౌందర్యంగా మనకు దర్శనమిస్తాయి కనుక ఆ దిశగానే అంటే అనుభవాలే సౌందర్యం అన్న భావనతో బుచ్చిబాబు నవలను పరిశీలించింటం జరుగుతుంది.

బుచ్చిబాబు సౌందర్యశాస్త్ర పరిధిని ప్రస్తావిస్తూ అనుభవాలన్నీ సౌందర్యశాస్త్ర పరిధిలోకి రావని అందులో కొన్ని అంశాలు అనగా స్వల్ప సుఖాలు, ఇంద్రియపరమైన భౌతిక వాంఛలు ఈ పరిధిలోకి రావనీ, స్వార్థానికీ, భౌతిక వాంఛలకు సౌందర్యం అతీతంగా ఉంటుందని బుచ్చిబాబు తన అభిప్రాయాలను తెలియజెప్పాడు. విశ్వ వ్యాప్తమైన సౌందర్యానికి హద్దులను కూడా నిర్ణయించటానికి సాధ్యం కాదని అభిప్రాయాన్ని చెపూ్త. సౌందర్యం విస్తృత పరిధిలో ఆవిష్కారం కావటానికి బుచ్చిబాబు కొన్ని హేతువులను సూచించాడు. బృహచ్చేతన దశలో

సౌందర్యం ప్రకాశాన్ని చూస్తుంది. ఈ స్థితిలో తన పొత్తు ఉండదు. సౌందర్యాన్నికి సంకుచిత దృష్టి లేదు. తార్కికత ఉండదు. సహజ జ్ఞానం ఉంటుంది. సర్వమూ ఆనందమయమే. ఠాగుర్ కూడా సౌందర్యాన్ని ఇంత విస్తృత పరిధిలోనే ఆవిష్కరింప చేశారు. ఆయన కూడా సౌందర్యాన్ని ఆత్మ గుణంగా పేర్కొన్నారు.[108]

అంతేకాకుండా సౌందర్యాని నాశనం ఉంటుందా? ఉండదా ? అనే అంశాలను కూడా ఈ నవల్లో పరిశీలించాల్సిన అవసరం ఉంది. దీనితోపాటుగా అసౌందర్య అంశాలు, సౌందర్య అంశాలు ఏవి అనే విషయాల పట్ల స్పష్టత రావాల్సిన అవసరం ఉంది. వాటిని కూడా ఈ నవల పరిధిలో పరిశీలించాల్సి ఉంది. ఈ అంశాలన్నీ కేవలం బుచ్చిబాబు చివరకుమిగిలేది నవల పరిధిలో పరిశీలించటం జరుగుతుంది.

సౌందర్యం అనేది కేవలం కళలలోనే కాదు మనం చూసేక? ప్రకృతిలోనూ, మనం జీవించే జీవితంలో ఉంటుంది అంటే సౌందర్యం అనేది మనం చూసే దృష్ట్యా అది వ్యక్తమవుతుంది. అయితే మనం ముందే చెప్పుకున్నట్లు సౌందర్యాత్మకమైన ప్రతి విషయం కళాశాస్త్రపరిధిలోకి రాకపోవచ్చు అంతమాత్రం చేత అది సౌందర్యం కాకపోదు.

**5.3.4. బుచ్చిబాబు తార్కికం అనుభవం**

" సౌందర్యం శాస్త్రంలోకి వచ్చే అంశాలు మనస్సుకు తెలిసే వాస్తవాల కన్నా ఇంద్రియాలకు అనుభూతమయ్యే వాస్తవాలు ఎక్కువగా వస్తాయని బౌమ్ గార్టెన్ భావించాడు. ఆ అనుభూతం కావటం కూడా అతార్కికంగా అనుభూతిలోకి రావటమే సౌదర్యమని" బౌమ్ గార్టన్ భావించాడు.?[109]

ఇదే అభిప్రాయాన్ని బుచ్చిబాబు కూడా వ్యక్తపరచాడు. "" బుచ్చిబాబు కూడా సౌందర్యాన్ని తార్కిక అనుభవం కాదంటారు. తార్కిక అనుభవం ద్వారా విలువను (Aesthetic value) సౌందర్యమన్నది అనుభవ సత్యమని ఆలోచనలతో వచ్చేది కాదనీ ఈయన తత్త్వం. సౌందర్యానుభవం అతార్కిక భూమిక నుంచి వస్తుందని, సౌందర్యం అనుభవ సత్యం కావటం వల్ల ఒక వస్తువు అనుభవించటమనేది నవ్యత ఉన్నప్పుడే జరుగుతున్నదని

---

[108] ముదిగొండ వీరభద్రయ్య. కళాతత్త్వ శాస్త్రం మౌలికాంశ వివేచన; పుట:33

[109] ముదిగొండ వీరభద్రయ్య. కళాతత్త్వ శాస్త్రం మౌలికాంశ వివేచన;పుట:1

చెబుతూ... ''చిత్రకారుడు అందాన్ని ప్రేమిస్తాడు ఎంత వరకు? తన రంగు ద్వారా పటంలో లభ్యమయ్యే వరకు అందాన్ని బంధించిన తరువాత అతను బాహ్య ప్రపంచానికి దాస్యం చేస్తాడు. జీవితం అంతా ఒక అనంతమైన అన్వేషణ జీవిత రహస్యాన్ని శోధించటం రహస్యం తెలుసుకున్న తర్వాత అన్వేషణ మానడు''[110] కళారహస్యాన్ని తెలుసుకోవడం అంటే సౌందర్య తత్త్వాన్ని అవగాహన చేసుకోవటమే. రహస్యం తెలుసుకున్న తర్వాత కూడా అన్వేషణకు సిద్ధమవుతున్నాడు. అంటే అందులో తప్పక నవ్యత ఉండి తీరాలి. కానీ జ్ఞాన విషయంలో ఈ నవ్యత ఉండదు. తర్కంతో సంబంధం లేని ఈ సౌందర్యం నిరంతరం నవీనం. సౌందర్య సద్యః అనుభవంలోకి వస్తుందనీ, సౌందర్యం అనుక్షణ నవీనతను కలిగించేది కాబట్టి దీనికి తర్కంతో సంబంధం లేదని చెప్పాడు."

బూక్ అనే కళాతాత్త్వికుడు సౌందర్యానుభవాన్ని ప్రస్తావిస్తూ సౌందర్యం సద్యః అనుభవంలోకి వస్తుందని ఇట్లాంటి అనుభవం తర్కంతో సాధ్యమయ్యేది కాదనీ చెప్తున్నాడు. బూక్ చెప్పిన ఒక్క ఉదుటున అనుభవంలోకి రావటమన్నది బౌమ్ గార్టన్ చెప్పినట్లుగా ఇంద్రియాలలో అనుభవించినప్పుడే సాధ్యం. స్వల్ప సుఖాలు, ఇంద్రియ వాంఛలు సౌందర్యశాస్త్ర పరిధిలోకి రావనీ, స్వార్థానికీ భౌతిక వాంఛలకు సౌందర్యం అతీతంగా ఉంటుందన్నది బుచ్చిబాబు అభిప్రాయం.

పైన అభిప్రాయాలను చూసినట్లైతే సౌందర్యం తార్కిక జ్ఞానం ఏర్పడిదికాదనీచెప్పుకున్నప్పుడు సౌందర్య విలువను ఎట్లా నిర్ణయించాలి అనేది ఇక్కడ మౌలికమైన ప్రశ్న. ఒక వస్తువు సౌందర్యవంతంగా ఉన్నదా ?లేక సౌందర్యహీనంగా ఉందా అని వివేచించటమే సౌందర్య విలువ అంటారు. దీనిని శాస్త్రీయంగా శాంతాయన ''కళాతత్త్వ శాస్త్రంలో విలువ అన్న దానికెంతో ప్రాధాన్యత ఉంది. అసలు ఈ విలువను సౌందర్యం నుండి వేరు చేద్దామంటాడు"[111] అయితే ఈ విలువ నిర్ణయం అన్నది ఆస్వాదకుడు చేస్తాడు. మన మనస్సు దేనిని కోరుకుంటుందో దేని ద్వారా మనం ఆనందాన్ని పొందుతామో అదే సౌందర్యపు

[110] చివరకు మిగిలేది. బుచ్చిబాబు. పుట335

[111] Santayana, George. The sense of beauty Indian philosophy of beauty:1955;12

విలువ అవుతుంది. మన మనస్సుకు నచ్చని విషయాలను మన మనస్సు తృణీకరించిన విషయాలను మనం తిరస్కరిస్తాం. ఇదే Disvalue[112]

పైన తెల్పిన అంశాల ఆధారంగా మనకు అవగతమవుతున్న విషయాలు ప్రధానంగా 1) సౌందర్యం అనేది తార్కిమైన జ్ఞానం కాదు, 2) సౌందర్యం అనేది అనుభవంతో కూడిన అంశం, 3) అనుభవంతో కూడిన ప్రతిదీ సౌందర్యశాస్త్ర పరిధిలోకి రాదు, 4) కళాతత్త్వ శాస్త్రంలో సౌందర్యం అని అసౌందర్యం అని రెండు దృక్పథాలు ఉన్నాయి., 5) సౌందర్యం చూసే లేదా ఆస్వాదించే వ్యక్తి యొక్క ప్రవర్తనలో ఉంటుంది... ఈ అంశాలు బుచ్చిబాబు చివరకు మిగిలేది నవలలో ఏయే సందర్భాలలో ఏయే పాత్రల మధ్య ఏయే సంభాషణలో ప్రతిబింబించాయో ఎక్కడ లోపించాయో నవల ఆధారంగా పరిశీలిద్దాం.

**5.3.5. సౌందర్యం అనేది తార్కిక జ్ఞానం కాదు**

చివరకు మిగిలేది నవల పరిశీలనాత్మకంగా పఠిస్తే ఇంత వరకు మనం చర్చికున్న కళా తత్త్వ తర్కం అంతా బుచ్చిబాబు దయానిధి చేత చేయిస్తాడు. ఇదంతా కళాతత్త్వ శాస్త్ర పరిధిలోకి వస్తుంది. కోమలి దయానిధికి నచ్చుతుంది. ఈ నచ్చటం సాధారణ స్థాయికి చెందినదేమీ కాదు. కానీ కోమలి ఎందుకు నచ్చిందో దయానిధికి తెలియదు. అయినా కోమలి ద్వారా దయానిధి తనకే తెలియని ఒక విశేషమైన ఆనందానుభవాన్ని పొందుతాడు. ఒక సందర్భంలో అమృతం దయానిధితో 'నీకు కోమలి ఎందుకు నచ్చింది బావా అని ప్రశ్నిస్తే సమాధానం తెలిస్తే జీవిత రహస్యమే తెలుస్తుదంటారు'.[113] కానీ ఎందుకు నచ్చిందో సమాధానం చెప్పదు. నిజానికిఆ ప్రశ్నకే కనుక సమాధానం చెప్పి ఉంటే అతను పొందినది సౌందర్యానుభవమే కాదు, కోమలెందుకు నచ్చిందో దయానిధి విలువ కట్టబోతాడు కానీ అది తర్కానికి అందలేదు.

తెలుగులో సౌందర్యశాస్త్ర విమర్శను సమన్వయం చేసి చూసినప్పుడు భారతీయ, పాశ్చాత్య సౌందర్య సిద్ధాంతాలను తమ విమర్శలో పాటించినట్లు ఇంతవరకు జరిగిన విశ్లేషణనుబట్టి తెలుస్తుంది. పురాణం సూరిశాస్త్రి కేవలం సాహిత్యానికి మాత్రమే సమన్వయించే పద్ధతిలో కాకుండా '*కళ*' అనే అర్థంలో ప్రయోగించాడు. అలాగే సంజీవ్ దేవ్

---

112 Santayana, George. The sense of beauty Indian philosophy of beauty:1955;4

113 చివరకు మిగిలేది. బుచ్చిబాబు. 36

సౌందర్యాస్వాదనను సాహిత్యంతో పాటు చిత్రకళ, శిల్పం తదితర కళలకు అనువర్తించేలా చెప్పారు. సౌందర్యాస్వాదనని బౌమ్ గార్టెన్, క్రోచి, శాంతాయన మొదలైన వారు చెప్పినట్లే ఇంద్రియానుభవాలు ప్రధానమని తెలుగు సౌందర్యశాస్త్ర విమర్శకుల తమ విమర్శకు ప్రమాణాలుగా స్వీకరించారు. తెలుగులో సౌందర్య భావనలను భావవాద దృక్పథంతో పురాణం సూరిశాస్త్రి భారతీయాలంకారిక దృక్పథాన్ని సమన్వయంచేసి చెప్పగా రెండింటిని చెప్తూనే ఆస్వాదనకూ ప్రాధాన్యతనిచ్చిన సంజీవ్ దేవ్ లకంటే భిన్నంగా వాస్తవికవాద దృష్టితో శ్రీశ్రీ తన సౌందర్య భావనలను వ్యక్తంచేసారు. అయితే శ్రీశ్రీ గురజాడ రచనల విమర్శలో భారతీయుల భాషా, రీతి, ధ్వనులను, ఆలంకారాలను ప్రస్తావిస్తూనే జీవితానుభవానికి సంబంధించిన వాస్తవికత 'రసన'లో ఉంటుందన్నారు.

ఈ రసన అనే భావన భారతీయుల భరతుని రససిద్ధాంతం కంటే భిన్నమైనది. అలాగే నాయికా నాయకుల విషయంలో కూడా కన్యాశుల్కాన్ని ఆధారంగా చేసుకొన్న విమర్శలో నాయకుని నిర్ణయాన్ని వివరించడానికి సంప్రదాయాలంకారిక సూత్రాలతో విభేదించారు. అలాంటప్పుడు అరిస్టాటిల్ ట్రాజిడి, కామిడిల సమ్మేళనంలో కొత్త ఆలోచనలను కలిగించారు. శ్రీశ్రీ సౌందర్య భావనల్లో ఉన్న ప్రత్యేకతేమిటంటే, శ్రమైకజీవనంలో సౌందర్యాని వాస్తవికతా దృష్టితో చూసారు. వీరిని సమన్వయిస్తున్నట్లుగా బుచ్చిబాబు సౌందర్య భావనలు కనిపిస్తాయి. అలాగే సౌందర్యాస్వాదనలో నైతిక విలువలకంటే అనుభవమే ప్రధానమనే పాశ్చాత్య భావనలు చలం రచనలలో కనిపిస్తాయి. సహజాభివ్యక్తితో తన రచనలను కొనసాగించి సౌందర్య భావనలో దైవభావనకంటే సహజ సౌందర్య భావనకు ప్రాధాన్యతనిచ్చారు.

పాశ్చాత్యుల్లోని అగస్టిన్ విభజించిన సహజ దైవసౌందర్య భావనలు చలంలో కనిపించినట్లుంటాయి. అలాగే విశ్వనాథ సౌందర్యాన్ని చూస్తే కళకు నైతికత ప్రధానమనే దృష్టితో కొనసాగుతుంది. ప్లాటో కవులను వెళ్ళకొట్టడం, కళకు నీతి ఉండదని చెప్పడంవంటి భావనలు విశ్వనాథలో కనిపిస్తాయి. ఇకా, కొండూరి వీరరాఘవాచార్యులు నాట్యానికి సంబంధించిన రచనలను కేవల సాహిత్య విషయాలతో మాత్రమే కాకుండా ఇతర అన్ని కళల అంశాలతోనూ సమన్వయించాల్సిన అవసరం ఉందంటారు. పురాణం సూరిశాస్త్రి, సంజీవ్ దేవ్, విశ్వనాథ, కొండూరి వీరరాఘవాచార్యులు ప్రత్యక్షంగా విమర్శ రచనల్లోనే సౌందర్య

భావనలను వివరించగా, నేనిక్కడ పరిశీలించిన వారిలో శ్రీశ్రీ, చలం, బుచ్చిబాబులు సృజనాత్మక సాహిత్యంలో ఈ అంశాలను వివరించారు. వీటన్నింటిని బట్టి తెలుగులో సౌందర్యశాస్త్ర భావనలు కేవలం విమర్శ రచనల్లోనే కాకుండా సృజనాత్మక రచనల్లో కూడా ఉన్నాయని, తెలుగువిమర్శకుల సౌందర్యశాస్త్ర భావనలు భారతీయ, పాశ్చాత్య సౌందర్యశాస్త్ర భావనల అవగాహనతో కొనసాగుతున్నాయని ఈ పరిశీలనవల్ల తెలుస్తుంది.

పురాణం సూరిశాస్త్రి, సంజీవ్ దేవ్ లు విమర్శలోనే సౌందర్యశాస్త్ర భావనలను సైద్ధాంతీకరణ సమన్వయంతో వివరించగా, ఈ ముగ్గురు అనగా శ్రీశ్రీ, చలం, బుచ్చిబాబు తమ సృజనాత్మక రచనలలో పాత్రలు, సన్నివేశాల సందర్భోచితంగా చెప్పారు. అక్కడ సరిగ్గా అవగాహన చేసుకుంటారో లేదోనని గాని, ఒక విమర్శ రూపంలో మరింత స్పష్టంగా చెప్పాలనే ప్రయత్నంలోగాని, భారతీయ, పాశ్చాత్య సౌందర్యశాస్త్ర భావాలను వివిధ సందర్భాల్లో వివరించారని ఈ పరిశీలన వలన తెలుస్తుంది.

ఆరవ అధ్యాయం

# తెలుగులో

# సౌందర్యశాస్త్ర విమర్శకుల ప్రతిపాదనలు

ఆరవ అధ్యాయం

# తెలుగులో సౌందర్యశాస్త్ర విమర్శకుల ప్రతిపాదనలు

**6.0. ఉపోద్ఘాతం**

ఈ పరిశోధనలో పరిశీలించిన తెలుగు సౌందర్యశాస్త్ర విమర్శకులు (పురాణం సూరిశాస్త్రి, సంజీవ్ దేవ్, శ్రీశ్రీ, చలం, బుచ్చిబాబు) భారతీయ, పాశ్చాత్య సౌందర్య సిద్ధాంతాలను భావనలను అనుసరించి చేసిన విమర్శలో కింది ప్రతిపాదనలను లేదా ప్రత్యేకతలను లేదా విశేషాంశాలను ఈ అధ్యాయంలో క్రోడీకరించే ప్రయత్నం చేస్తాను. దీని వల్ల తెలుగులో సౌందర్యశాస్త్ర విమర్శకుల ప్రత్యేకతను తెలుసుకునే అవకాశం ఉంటుందని అనుకుంటున్నాను.

**6.1. పురాణం సూరిశాస్త్రి – సౌందర్యశాస్త్ర విశేషాంశాలు**

పురాణం సూరిశాస్త్రి ప్రత్యేకించి సౌందర్యశాస్త్రాన్ని ఆధారంగా చేసుకొనే 'విమర్శకపారిజాతము' రాశారు. దీనితోపాటు మరికొన్ని గ్రంథాలను రాశారని ఈయన్ని పరిచయం చేసిన అధ్యాయంలో ముందే వివరించాను. అందువల్ల చర్వితచర్వణం కాకుండా ఈయన పేర్కొన్న లేదా గుర్తించిన సౌందర్యశాస్త్ర సమన్వయంశాలను కింద క్రోడీకరిస్తున్నాను.

పురాణం సూరిశాస్త్రి విమర్శకపారిజాతంలో కళాప్రయోజనాలను ఇలా పేర్కొన్నారు.[1]

1. కళలు రసభావములన గుర్తించి లోకులను తెలియపరచి విమర్శక సహాయ మొనర్చవలసి ఉన్నదని చెప్పారు.
2. కళావిమర్శ ఒక సాహితీ వ్యాపారముగా, పత్రికోపజీవనముగా ఏర్పడవలసి ఉన్నదని చెప్పారు.
3. ప్రకృతియే కళోపాసకులు పరిశీలింపవలసిన రమ్యమాతృకని పేర్కొన్నారు.[2]

---

[1] విమర్శక పారిజాతము 1925 పుట:viii

[2] విమర్శక పారిజాతము 1925 పుట:110

4. కళా సాధనాలుగా రంగులు, రాళ్లు, పదములు మొదలైన వాటిని పేర్కొన్నారు.[3]
5. ఆత్మీయ గుణ ప్రకాశము వలన సౌందర్యం ఏర్పడుతుందని చెప్పారు.[4]
6. సూరిశాస్త్రి పాశ్చాత్యుల నాటకాలలోని నాటక అభినయాన్ని తెలుపుతూనే ఆదర్శప్రాయమైన నాటకాభినయాని కోరే నటులకు ఉండవలసిన లక్షణాలను పేర్కొన్నారు.[5]
7. నటుడు సర్వాంగ సౌకుమార్యమైన అందగాడై ఉండాలి. కమనీయమైన రూప మర్యాదలతో పాటు కత్తిసాము వంటి వ్యాయము శిక్షణలచే చక్కని దృఢరూపంతో శరీర అంగాలన్ని అనేక విధాలైన ఆంగ భంగిమలకు, మూర్తీ స్వరూపధారణానికీ స్వాధీనమయే విధంగా సాధన చేయాలి.
8. ముఖం మీద గల కండలను శిక్షించి లలిత సుకుమార సుందర భావాలను, వీర గాంభీర్య భయనాక వంటి తీవ్ర భావాలను ప్రకటించ గలిగే నేర్పు ఉండాలి. అనేక వేషాలను ధరించే నేర్పు ఉండాలి. అంతకు ముందు ఆ పాత్రను ఎవరైన ప్రసిద్ధ నటుడు అభినయిస్తే ఎలా అభినయిచెనో తెలిసి ఉండాలి.
9. పాత్ర స్వభావాన్ని తెలిపే పురాణ ఇతిహాసాలు, అప్పటి మర్యాదలను సూచించే చిత్ర శిల్పాదులను చూసినవాడై ఉండాలి.
10. హస్త విన్యాసం, నేత్ర విక్షేపణం, మొదలైన సర్వాంగాలను కథా సందర్భానికి అకుకూలమైన భంగక్రమంల్లో నిలిపి ఉంచగలిగే నేర్పు సంపాదించాలి.
11. ఏ రసాన్నికి ఎట్టి భంగాన్ని ఉపయోగించాలో, ఏ రసాన్ని ప్రకటిస్తే మూర్తి రమణీయకత ఏర్పడుతుందో తెలుసుకొని అభ్యసించాలి.
12. జ్ఞాపకశక్తి, కంఠస్వరం చక్కగా సాధన చెయ్యాలి. నలుగురితో కలిసి అభినయించవలసి వచ్చినప్పుడు చిత్ర లేఖకుడు రమ్యమైన రేఖ విన్యాసాలను చిత్రించి అమర్చిన విగ్రహం ఎంత అనువుగా నిలిచి ఉంటుందో, పటంలోని విగ్రహాలన్ని ఎలా ప్రధాన కథాభి ముఖాలై

---

[3] విమర్శక పారిజాతము 1925 పుట:162

[4] విమర్శక పారిజాతము 1925 పుట:108, 109

[5] నాట్యోత్పలం: 1927 పుట:147–150

అమర్చబడి ఉంటాయో అదే విధంగా నటుడు కూడ అలాంటి అన్యోన్య రూప సమ్మేళన వైచిత్రిని ప్రకటించే భంగిమలను నేర్చుకోవాలి.

13. సమాసాలను, విడిమాటలను, భావధ్యోతకంగా ఉచ్చరించ గల నేర్పు కలిగి ఉండాలి. ఇందులో పాత్ర స్వభావాన్ని, అందులోని ఇబ్బందులను గ్రహించి ఇప్పటి సంభాషణలకు అనువైన రీతిలో ఉచ్చరించాలి. ఇతరుల అభినయాన్ని తిలకిస్తూనే తాను ఆ సమయాన అభినయంచ వలసినను, లేకున్నను జరుగుతున్న కథా సందర్భాన్నికి తగినట్లుగా జాగరూకుడై నటించాలి.

14. మాట్లాడుతున్నప్పుడు, మౌనంగా ఉన్నప్పుడు పాత్ర వ్యక్తిత్వాన్ని అనుభవించి సూచనలను అందిస్తూ ఉండాలి. రూపకం కవి నిర్దేశించిన భావానుభవాలను అన్ని వేళలా కథాక్రమమున తనలో ఆవేశ పరుచుకోని ప్రకటించాలి.

15. ఇలా అభినయించే నటుడికి ఉండవలసిన లక్షణాలను పేర్కొంటూనే ''కవి హృదయమును నిరసించు తనకు తోచిన రీతి పాత్ర స్వభావ మన్వయించుకొని తన యభిమానములు సిద్ధాంతములు స్వకీయ చేష్టావాచిక రీతులు పాత్రాభినయమందు ప్రకటించెడి నటుడు అయ్యవారిని చోయబోయి కోతిని గల్పించిన శిల్పివలె నాట్యభ్రష్టుడే సిగ్గొంద వలసి వచ్చునని'' చెప్పారు.

16. పురాణం సూరిశాస్త్రి  అనేక ఆంగ్ల నాటక గ్రంథాలను చదవటంతో పాటు ఆంగ్ల నాటకాలను సంస్కరించుటకు స్వయంగా కొన్ని సూచనలు 1910లోనే చేశారు. రూప కవిత్వం వాఙ్మయ పరిణామమని అందరు గ్రహించి వాఙ్మయంలో దానిని ప్రధానంగా అంశంగా ఆదరించాలి.

17. సమకాలీన జీవన అవస్థలను, సాంఘిక సమస్యలను నీతి ప్రచారక సంస్కరణోద్దేశ్యాలతో రూపక కథా సందర్భాలలో విస్తరించే స్వాతంత్ర్యం నాటక కవులందరు పొందాలి. ప్రాకృత సమాజాలను ఆనంద పరిచే భావోద్రేకాన్ని, విపరీత సందర్భాలను, నాటక కవులు ఆశ్రయించ కూడదు.

18. ప్రకృత జీవనాన్నికి వీలైనంత వరకు సంబంధించి సాంఘిక ఆదర్శాలను నెలకోల్పే ఉద్దేశ్యంతో నాటకాలు ఏర్పడాలి. చిత్తశుద్ధి, సమదృష్టి, పరచింతను కల్పించే గంభీర

భావాలను చక్కని సాత్విక రసానందాన్ని ఇచ్చే కథా సందర్భాలను మానవ వ్యాపార వైఖరులను క్షుణంగా అర్థం చేసుకొని గుర్తించి చక్కని నాటకాలను కల్పించవలసి ఉంది. కేవలం ప్రజావినోదమే నాటక ఆదర్శంగా ఉండకూడదు.

19. ఉత్తమ కళలను ఎలా స్థూలదృష్టితో పరిశీలించి విమర్శిస్తారో అదే విధంగా రసవిచారణ నాటకాలను కూడా పరిశీలించాలి.

20. ప్రేక్షకులు అభినయించే కథా సందర్భాలను, అందులోని రసభావ విశేషాలను తెలియ జేసే పత్రికా విమర్శలు, కర పత్రాల ద్వారా ప్రజలకు అందించాలి. సామాజిక రుచులు అభివృద్ధి చెందితే గాని నాట్య కళ బాగుపడదు.

21. నటులు, నాటక రచయితలు, సద్విమర్శకుల సూచనలను ఆదరిస్తూ అన్యోన్య సహకారంతో ఆలోచించి పనిచేసే నటులు కవి హృదయాన్ని గ్రహించి రూపక ఉదేశ్యాలను చక్కగా అభినయించ వలసి ఉంది.

22. కవులు కూడా నాట్య ప్రదర్శనోచితమైన రూపకాలను రచించాలి. నటులను శిక్షించుటకు, నాటక కవులను సంస్కరించుటకు, నవీన నాటకాలను సరిచూసి పరిష్కారించటానికి, నవ్య రూపకాలను ప్రయోగించి మంచి చెడులను నిర్ణయించటానికి ఇంగ్లాడు, అమెరికా దేశాలలో నాట్య విద్యాలయాలు, కావ్య పరిషత్తులు, విమర్శ పత్రికలు, ప్రయోగ నాట్యమందిరాలు ఉన్నాయి. అలాంటివి నాటకాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాయనడంలో నాటక రచయితలు, నటులు ఆ నాటకంలై వచ్చే విమర్శలను శ్రద్ధగా గమనించాలనే ఆలోచన కనిపిస్తుంది.

23. పురాణం సూరిశాస్త్రి  కావ్యాన్ని నిర్వచించటమే గాక కావ్యాన్ని నిర్వచించటంలో ప్రధానంగా మూడు లక్షణాలను పాటించాలన్నారు. ప్రస్తుత విషయాన్ని ఆశ్రయించి ఉండాలి. అంటే తీలుకున్న వస్తువు యొక్క స్వరూపాన్ని తెలిపే విధంగా నిర్వచనం ఉండాలి. ఆ నిర్వచనం వ్యక్తమైన కావ్య స్వరూపాన్ని తెలియజేసే విధంగా ఉండాలి.

24. దీన్ని రాయడంలో కవి పాటించిన పద్ధతులను విశదీకరించాలి. కావ్య నిర్వయనంలో పై మూడు లక్షణాలు చేరి ఉండాలని చెప్పారు. దీనితో పాటు వీరు పాశ్చాత్యుల కావ్య నిర్వచానాలను పేర్కొంటూ అవి కావ్యతత్వాన్ని పూర్తిగా నివేదించలేదన్నారు. వీటికి

ఉదాహరణలను చూపుతూ హెగేల్, షెల్లీ, వర్డ్స్‌వర్త్ మొదలగు వారి లక్షణాలను సమన్వయించారు.

25. కావ్యం యొక్క ప్రధానమైన నైతిక ఉపయోగం కావ్యాంశం కాదని అది పాఠకుల మన స్థితిని బట్టి కావ్య సందర్భం నుండి నీతి, వైరాగ్య, భక్తి సూత్రాలు ద్యోతకమవుతాయని పేర్కొన్నారు.[6]

26. పురాణం సూరిశాస్త్రి ఈస్తటిక్స్ వల్ల చక్కని కావ్య విమర్శనం సాధ్యమవుతుందని చెప్తూ ఈస్తటిక్స్ అనేది 'మిక్కిలి విఫలమై, సంకీర్ణమై, కష్టగ్రాహ్యమైన విషయం'గా చెప్పారు. కళలకు, ప్రకృతి మధ్యగల సంబంధం.

27. కళలు ప్రకృతిని అనుకరించటంపై ఎంత వరకు ఆధారపడి ఉన్నవి? సౌందర్యం అంటే ఏమిటి? సౌందర్యం లేక రసం విషయ నిష్టమా లేదా ప్రేక్షక నిష్టమా? అంటే రసానుభవం అధికరణాత్మకమా, విషయాత్మకమా? గంభీరంగాను, వికృతంగాను, హాస్యాస్పదంగాను, బీభత్యంగాను, కరుణ విషాదమైన సందర్భాలను చూపేవిగా వేర్వేరు రీతులలో కనిపించే వస్తువు ఏ విధంగా సౌందర్య సూచనలు అందిస్తూ రసోత్పత్తిని కలిగిస్తున్నాయి? కళలలో విభావ శక్తులు ఈ విధంగా పనిచేస్తాయి? కళలలో నిరూపించదగిన రసభావం ఎలాంటిది? కళ యొక్క ప్రయోజనం ఏంటి? రసానందం, ప్రీతి, ఆటకోలితనం, వినోదాపేక్ష, శృతి, సామంజస్యం, ఆరోహణ అవరోహణ క్రమాలు, నియతత్వం, వ్యవస్థా సౌకర్యాలు మొదలైనవి సౌందర్యాన్ని సంపాదించటానికి లేద రసోదయంకు ఎలా తోడ్పడుతున్నాయి? ప్రకృతి శాస్త్రాలు, నిత్యాది సాంఘిక ధర్మాలు, మతాభిమానాలు, కళలకు ఏ విధంగా సంబంధించి హేతుభూతంలు అవుతున్నాయి? కళల వలన ఉపయోగం ఏంటి? కళా విశేషాలు ఏవి? వీని ప్రత్యేక లక్షణాలు, నియమాలు, పరిమితులు, ప్రయోజనాదికాలు, వస్తు ఫలసాధనాలు ఏంటి? కళలన్నింటిని ఒకే విధమైన మానస వ్యాపారం వల్ల జనించిన వాటిగా ఎంచదగునా? కళా వైచక్షణ్యం ఎలా

---

[6] విమర్శక పారిజాతము 1925 పుట:131

కలుగుతుంది? రుచి భేదాల వల్ల ఉపయోగం ఏంటి? కళా సూత్రాల ప్రామాణ్యాన్ని నిర్ణయించే సాధనాలు ఏవి?

28. పురాణం సూరిశాస్త్రి కళా రహస్య విచారణలో విచారించవలసిన ముఖ్య సమస్యలుగా పైవాటిని పేర్కొంటూనే ఇంకా లోతుగా పరిశీలిస్తే ఇంకా నాలుగు విధాలైన సమస్యలు తెలుస్తాయన్నారు. శారీరక సంబంధాలు, మానసిక సంబంధాలు, తత్వార్థక సమస్యలు, సాంఘిక సంబంధాలు[7] మొదలైన సందర్భాలన్నారు.

29. కేవలం పై నాలుగు సమస్యలతో పాటు వాటిలో గల అంతర్లీన సమస్యలను కూడా వివరంగా పేర్కొన్నారు. ఒక విషయాన్ని లోతుగా అధ్యయనం చేయటానికి ఆ విషయాన్ని అనేక అంశాలుగా విభజించు కోవటం పురాణం సూరిశాస్త్రిసునిశిత పరిశీలనకు నిదర్శనం. అందుకనే సౌందర్యం, కళ, కళా స్వాదన వంటి అంశాలపై అనేక ప్రశ్నలను సంధించి ఆలోచింప చేస్తున్నారు.

### 6.2. సంజీవ్ దేవ్ — సౌందర్యశాస్త్ర విశేషాంశాలు

ఈయన తన రచనలైన *కాంతిమయి, దీప్తిధార, రస రేఖలు, రూపదర్శని, లేఖల్లో సంజీవదేవ్, సంజీవదేవ్ లేఖలు* మొదలైన రచనలలో సౌందర్యశాస్త్ర అంశాలను వివరించారు. ఆ అంశాలను భారతీయ, పాశ్చాత్య సౌందర్య సిద్ధాంతాలతో గత అధ్యాయాల్లో సమన్వయించే ప్రయత్నంచేసాను. ఇక్కడ ఆయన రచనలలోని సౌందర్యశాస్త్ర విశేషాంశాలను క్రోడీకరిస్తున్నాను.

సంజీవ్‌దేవ్ సౌందర్యాన్ని అనుభవించే సమయాన కలిగే అనుభూతినే రసం అని సౌందర్యానుభూతిని రసానుభూతిని సమానం అని చెబుతూ వీరు అనేక రచనలలో సౌందర్యానుభూతికి రసానుభూతిఅని, సౌందర్య దృష్టిని రస దృష్టి[8], రమ్యాలోకన అని, సౌందర్య సృష్టికి రస సృష్టి అని, సౌందర్య తత్త్వానికి రస తత్త్వం అని, సౌందర్యాస్వాదనకి రసాస్వాదన అని, రస తాత్త్వికుడుకి కళాతాత్త్వికుడు అని, రస చేతనకు సౌందర్య చేతన అని,

---

[7] విమర్శక పారిజాతము 1925 పుట:197,198

[8] సంజీవ్‌దేవ్; కాంతిమయి పుట:131–132

రస చేతనకు సౌందర్య చేతన అని, సౌందర్య దృష్టికి రమ్యాలోకన అని, రసబోధకు సౌందర్య బోధ అనే వాటిని పర్యాయపదాలుగా ఉపయోగించారు[9].

జీవితంలోనూ,జీవనవిధానంలోనూ, కళలోనూ, కావ్యాల్లోనూ, శాస్త్రంలోనూ, సంగీతంలోనూ ఇలా చెప్పుకుంటూ పోతే నిరంతరం మానవుడు కొత్తదనాన్ని ఆకాంక్షిస్తూ ఆస్వాదిస్తాడు. ఇలా ఏదైతే అనుక్షణ నవీనమైన ఆశ్చర్యం మనకి కలుగజేస్తుందో అదే సౌందర్యం. ఉదాహరణకు ఏదైనా ఒక కళాఖండాన్ని చూసినప్పుడు కలిగే అనుభూతి అదే కళాఖండాన్ని మరొకసారి చూస్తే కొత్తచైతన్యం కలుగుతుంది. [10]

సంజీవ్ దేవ్ సౌందర్యాన్ని నవ్యత, శాస్త్రం తెలియనక్కరలేదు, సమగ్రత, చలనం, ఇంద్రియ సంబంధం, విశ్వజనీనత, నిరంతరావిష్కారం, అలౌకికం, నైరూప్యం, ఆధ్యాత్మికత, అసౌందర్యం, సౌందర్యం – ఆనందం మొదలైన అంశాలుగా లోతైన పరిశీలనతో వివేచించారు.

1. సౌందర్యభావనకు కాని సౌందర్య దార్శనికతకు కానీ కళాతత్త్వ శాస్త్ర పరిచయమో, పాండిత్యప్రావీణ్యమో అవరం లేదు. [11]
2. సమగ్రతలోనే సౌందర్యం ఉంటుంది. [12]
3. చలనం మానవ ఆనందానుభూతిని రెట్టింపు చేస్తుంది. [13]
4. సౌందర్యానుభూతి కావాలంటే ఇంద్రియ ద్వారాల్ని తెరచక తప్పదు. [14]
5. సౌందర్యానుభూతికి దేశ, మత, కుల, ప్రాంత, లింగ, వయో బేధాలు లేవు. సౌందర్యం అనేది సంకుచితమైన భావన కాదు. ఎప్పుడైనా, ఎక్కడైనా చూసే

[9] సంజీవ్‌దేవ్; కాంతిమయి పుట:128

[10] సంజీవ్ దేవ్: కాంతిమయి 53

[11] సంజీవ్ దేవ్, లలిత కళలు సమీక్ష– వికసన చరిత్ర. పుట:11

[12] సంజీవ్ దేవ్. దీప్తిధార. పుట:189

[13] సంజీవ్ దేవ్, లలిత కళలు సమీక్ష– వికసన చరిత్ర. పుట:22

[14] సంజీవ్ దేవ్, లలిత కళలు సమీక్ష– వికసన చరిత్ర. పుట:4

హృదయానికి గోచరిస్తూనే ఉంటుంది. అయితే సౌందర్యానుభూతి కొందరిలో అల్పంగా సంకుచితంగా మందంగా ఉంటే మరికొందరిలో బలంగా నిండుగా శక్తిమంతంగా ఉంటుంది. కాని తమతమ భేధాలతో ఆలోచన అనుభూతిగల ప్రతి వ్యక్తిలోనూ ఉంటుంది. భావనా శక్తి బట్టి ఒకరికి గోచరించేది, మరొకరికి గోచరించకపోవచ్చు. ఒకరికి సౌందర్యవంతంగా ఉన్నదాంట్లో మరొకరికి అసౌందర్యం గోచరించవచ్చు[15]

6. సౌందర్యానుభూతికి సంతృప్తనేది ఉండదు. [16]
7. సౌందర్యం అలౌకికమైనది. అది ఆత్మానంద హేతువు. జనసామాన్యం దృష్టిలో ఆనంద హేతువైన అందం కేవలం నేత్రానందం వరకే పరిమితం. [17]
8. స్థలకాల వ్యక్తిగత సంకుచిత పరిధులను దాటిందే సౌందర్యం. [18]
9. సుందరవస్తువులో కనిపించేదాన్ని సౌందర్యం అంటున్నాం. సౌందర్యాన్ని కలిగించే వస్తువుని సుందర వస్తువు అంటాం. సుందరవస్తువు భౌతికమైంది. సౌందర్యం మానసికమైంది. అంటే సౌందర్యం నైరూప్యమైంది. సుందరవస్తువు రూపవంతమైంది. అది నశిస్తుంది. కానీ సౌందర్యం నశించదు. సుందర వస్తువు కంటికి కనిపిస్తుంది.
10. చెదిరిపోని ఆనందానుభవం ఆధ్యాత్మికమైంది. బాహ్యమైన ప్రకృతిగతమైన వస్తువిశేషాల్లో ఉండేది కాదు. సౌందర్యం భగవదంశ[19]
11. సృష్టిలో మంచి, చెడులు లాగే సౌందర్యం, అసౌందర్యం అని విభాగాలు ఉంటాయి.సౌందర్యం ఇంద్రియాల్ని మనసుని ఆకర్షించి తగిన ప్రతిస్పందనను కలుగజేస్తే అసౌందర్యం నుండి మానవుడు మనస్సు, ఇంద్రియాలు తొలగిపోతాయి. అసలు సౌందర్యభావన ఎందుకు కలుగుతుంది అంటే అందుకు కొన్ని కారణాలు

[15] సంజీవ్ దేవ్, కాంతిమయి పుట:114

[16] సంజీవ్ దేవ్, కాంతిమయి పుట:114

[17] సంజీవ్ దేవ్, రస రేఖలు పుట:263

[18] సంజీవ్ దేవ్, కాంతిమయి పుట:114

[19] సంజీవ్ దేవ్, కాంతిమయి పుట:114

కనిపిస్తున్నాయి. 1. సౌందర్యం దృష్టిలేకపోవటం, 2. సానుభూతి లేకపోవటం, 3. సవ్యంగా చూడలేకపోవటం, 4. శ్రుతి చేసుకోలేకపోవటం సంజీవ్ దేవ్ రమ్యం కాని దాన్ని రమ్యంగా వీక్షంచటానికి పరిపూర్ణ దృష్టికావాలంటాడు. చిత్తసంస్కారం, మానవ సాధనలతో పరిపూర్ణ దృష్టి వస్తుందనేది ఆయన భావన. [20]

12. సౌందర్యం అనేది ప్రధానంగా రెండువిధాలని సంజీవ్ దేవ్ వర్గీకరణ చేశాడు. అవి సేంద్రియ సౌందర్యం, నిరింద్రియ సౌందర్యం. [21]

13. ఈ రమ్యాలోకన గురించి రాసిన వ్యాసంలోనే సౌందర్యానుభూతికి సంబంధించిన మూడురకాల వ్యక్తులను వారికితగ్గ మూడు కారణాలను సంజీవ్ దేవ్ వివరించాడు. 1. సుందరమైన వస్తువులను చూసి ఆనందించలేనివారు (రసదృష్టి మేల్కొని లేదు), 2. సుందరమైన వాటిని మాత్రమే ఆనందించేవారు (రసానుభూతి మేల్కొని ఉంది.), 3. సుందరం కాని వస్తువుల్లోను సౌందర్యాన్ని దర్శించేవారు. (రసదృష్టి పూర్ణంగా మేల్కొని ఉంది.) [22]

14. ప్రతి మానవ హృదయంలోనూ సౌందర్య చేతన ఉంటుందనే విషయం సంజీవ్ దేవ్ రచనల ద్వారా తెలుస్తుంది. [23]

15. మానవుడు కవిత్వం, సంగీతం, చిత్రలేఖనం, నాట్యం, శిల్పం వంటి మొదలైన కళల సాహచర్యంతో మాత్రమే తన నిత్య జీవితాన్ని గడపలేడు. ఈ కవిత్వ, సంగీత, చిత్ర, లేఖన, నాట్యాదులు మనసుకు అంటే హృదయానికి సంబంధించిన కళలయినందు వలన మానవుడికి భౌతిక ప్రయోజనం తీర్చే కళలు అవసరం. [24]

---

[20] సంజీవ్ దేవ్, రూపారూపాలు పుట:205

[21] సంజీవ్ దేవ్, కాంతిమయి. పుట:118

[22] సంజీవ్ దేవ్, కాంతిమయి. పుట:118

[23] సంజీవ్ దేవ్, స్మృతి బింబాలు పుట:257

[24] సంజీవ్ దేవ్ సంజీవ్ దేవ్ లేఖలు 83

### 6.3. శ్రీశ్రీ – సౌందర్యశాస్త్ర విశేషాంశాలు

ఈయన తన రచనలైన *అనంతం, ప్ర.జ., మన గురజాడ, మహాప్రస్థానం, శ్రీశ్రీ వ్యాసాలు* మొదలైన రచనలలో సౌందర్యశాస్త్ర అంశాలను వివరించారు. ఆ అంశాలను భారతీయ, పాశ్చాత్య సౌందర్య సిద్ధాంతాలతో గత అధ్యాయాల్లో సమన్వయించే ప్రయత్నంచేసాను. ఇక్కడ ఆయన రచనలలోని సౌందర్యశాస్త్ర విశేషాంశాలను క్రోడీకరిస్తున్నాను.

1. సౌందర్యమనేది నిరంతరం నూతనత్వాన్ని కలిగించేదిగా ఉండాలన్నారు.[25]
2. కొంతమందికి సామాన్యంగా కన్పించేవి కళకు నిరాధరణకు గురైయే వాటిని చూసి లోకంలో రసభావాన్ని పొందని వస్తువంటూ ఏమి ఉండదు.[26]
3. కవిత్వం సామాజిక జీవిత వాస్తవాన్ని ధ్వనింపజేయాలనేది శ్రీశ్రీ దృష్టి.[27]
4. కావ్య శాస్త్రంలో ప్రధాన సిద్ధాంతాలైన రీతి, ధ్వని, రసం మొదలైన వాటిని శ్రీశ్రీ చదివాడు. కాని వాటిని యధాతథంగా అంగీకరించలేదు. వాటిని ఆధారంగా చేసుకొనే కొన్ని కొత్త సిద్ధాంతాన్ని చెప్పడానికి ప్రయత్నించారనిపిస్తుంది. రసంతో సంబంధం ఉన్న 'రసన' అనే కొత్త అభిప్రాయాన్ని ప్రకటించారు.[28]
5. ఒక కళా ఖండం కళగా నిలదొక్కుకోవాలంటే అంతర్ స్వరూపమైన కంటెంట్‌తో పాటు బహి: స్వరూపమైన సారం కూడా అవసరమే. భావం కంటెంట్ కి సంబంధించింది. శైలి ఫార్మ్‌కి సంబంధించింది.[29]
6. భారతీయాలంకారికులు చెప్పిన శివేతరక్షతి భావవాదాన్నికి సంబంధించినదికూడా అవుతుంది. కాని శ్రీశ్రీ లౌకికప్రయోజనమే శివేతరక్షతి ప్రధానమన్నాడు.[30]

---

[25] శ్రీశ్రీ వ్యాసాలు. శ్రీశ్రీ. పుట.114
[26] మహా ప్రస్థానం. పుట:26
[27] శ్రీశ్రీ. మహాప్రస్థానం. పుట:29
[28] శ్రీశ్రీ. మన గురజాడ. పుట:15
[29] శ్రీశ్రీ. ప్ర.జ. పుట:219
[30] శ్రీశ్రీ. అనంతం. పుట:78, 79

7. *ఒక ఆలంకారికుడిగా మాట్లాడివలసి వస్తే ధ్వన్యలంకారాన్ని అభిమానిస్తున్నానని చెప్పాలి. కమ్యూనిజాన్ని ధ్వనించేది కవిత్వమని ఒకప్పుడు నేనన్న మాట ఇక్కడ జ్ఞాపకం చేస్తున్నాను.*[31] అనడం ద్వారా భారతీయాలంకారికులు చెప్పిన ధ్వనికి భిన్నమైన ధ్వనిని చెప్పాడు.
8. కళలలోని నియతిరాహిత్యం గురించి ఏ లలిత కళయినా నిత్యం ఒకే పంథాలో నడవడం సహజం కాదని *"ప్రయోగం లేకపోతే సైన్స్ లేదు. ఈ సూత్రం కళలకు కూడా వర్తిస్తుంది."*[32] అన్నాడు.
9. *"ఏ కళాకారుడైనా సవరించే నియమానికి విధేయంగా ఉంటాడన్నాడొక గొప్ప ఆర్టిస్ట్. నిజమైన కళాకారుడు ఆ నియమాన్నే ప్రశ్నిస్తాడన్నాడు అంత కన్నా గొప్ప ఆర్టిస్ట్"*[33] ఇలా వివిధ సందర్భాలలో శ్రీశ్రీ సౌందర్యశాస్త్రాంశాల పట్ల తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

**6.4. చలం – సౌందర్యశాస్త్ర విశేషాంశాలు**

ఈయన తన రచనలైన *చలం పురూరవ, అమీనా, అరుణా చలం లేఖలు, మూజింగ్స్, రవీంద్ర గీతాంజలి* మొదలైన రచనలలో సౌందర్యశాస్త్ర అంశాలను వివరించారు. ఆ అంశాలను భారతీయ, పాశ్చాత్య సౌందర్య సిద్ధాంతాలతో గత అధ్యాయాల్లో సమన్వయించే ప్రయత్నంచేసాను. ఇక్కడ ఆయన రచనలలోని సౌందర్యశాస్త్ర విశేషాంశాలను క్రోడీకరిస్తున్నాను.

1. *ఆనందం పొందడానికి మనసు చూపే మార్గమే అందం.*[34]
2. *"సత్యమైనదీ, అందమైనదీ ఎప్పటికీ నశించదు"*[35]

---

[31] శ్రీశ్రీ. ప్రజ్ఞ పుట:173
[32] శ్రీశ్రీ. అనంతం. పుట:134
[33] శ్రీశ్రీ. అనంతం. పుట:140
[34] మూజింగ్స్, చలం: పుట 310
[35] మూజింగ్స్, చలం: పుట286

3. సౌందర్యం ఒక విద్యలాంటిది. నిరంతరాన్వేషణలోనే సౌందర్యం ఆస్వాద యోగమవుతుందని అంటారు. [36]

4. *రీజన్ కన్నా గొప్పగా మనసుని పాలించే యీ మైస్టరియోస్ ఫోర్స్‌క ని అందం కింద ఆరాధించి జీవితపులోతుల్ని ఇంకా దగ్గరగా చూడగలుగుతున్నాడు ఆర్టిస్టు; జీవితాన్ని జ్ఞానవంతం కన్నా సౌందర్యవంతం చేసుకోవడంలో అందుకనే ఎక్కువ విలువ* [37]

5. సౌందర్యం మనోగతమన్నారు. [38]

6. సౌందర్యం కేవలం తన దర్శనాన్ని భరించలేని వారిని మాత్రం ఆనందం అనే మాధ్యమం ద్వారా వస్తువుల నుండీ ఆస్వాదకుడికి అనుభవం అవుతుందే కాని సౌందర్యం పూర్తిగా మనోగతం గా చలం పేర్కొన్నాడు. [39]

7. చలం సౌందర్యాన్ని అనుభవించే విషయంలో కళాకారునికి యోగికి గల తేడాను చెప్తూ సౌందర్య అనుభవంలో కళాకారుడు యోగి కంటే ఒక మెట్టు కిందవాడని అందుకే కళాకారుడు కూడా సౌందర్యానుభవాన్ని యోగంగా సాధించి సౌందర్యారాధకుడు కావాలంటాడు చలం. [40]

8. సౌందర్యాన్ని అనుభవించే విషయంలో కళాకారుడు కంటే అనుభవించే వాడే (పాఠకుడే) అధికుడిగా పేర్కొన్నాడు చలం. [41]

9. విమర్శకుడు రచనను విలువకట్టేటప్పుడు నీతికొలతలతో నిర్ణయాలు ప్రకటిస్తారని, అవి కేవలం విలువ కట్టేవారినుండి చూడటం జరగకూడదన్నారు. [42]

10. *'కళ లోని రసం కన్న గొప్ప సందేశం ఏముంది ప్రజలకి....నిజమైన కళ ఆత్మనే సంస్కరిస్తుంది. కాని ఆ సంస్కారం కంటికి కనబడదు. చూచి విలువ కట్టలేము...*

---

[36] మూజింగ్స్, చలం: పుట167

[37] మూజింగ్స్, చలం: పుట 254

[38] మూజింగ్స్, చలం: పుట63

[39] మూజింగ్స్, చలం: పుట63

[40] మూజింగ్స్, చలం: పుట187

[41] సంజీవ్‌దేవ్‌కు చలం. చలం. పుట.26

[42] చలం అరుణాచలం లేఖలు. చలం. పుట 59

*రసాన్నించ్చిందా కళ, యింక దీని ప్రయోజనమేమిటని అడగటం గుడ్డితనం. అంత ప్రయోజనాకారి యింక వుండదు.''*[43] ఇలా వివిధ సందర్భాలలో చలం సౌందర్యశాస్త్రాంశాల పట్ల తన అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

### 6.5. బుచ్చిబాబు – సౌందర్యశాస్త్ర విశేషాంశాలు

ఈయన తన రచనలైన *చివరకు మిగిలేది, బుచ్చిబాబు సాహిత్య వ్యాసాలు తదితర రచనల్లో* సౌందర్యశాస్త్ర అంశాలను వివరించారు ,ఆ అంశాలను భారతీయ .పాశ్చాత్య సౌందర్య సిద్ధాంతాలతో గత అధ్యాయాల్లో సమన్వయించే ప్రయత్నంచేసానుఇక్కడ ఆయన రచనలలోని . .సౌందర్యశాస్త్ర విశేషాంశాలను క్రోడీకరిస్తున్నాను

బుచ్చిబాబు '*చివరికి మిగిలేది'* నవలకు ఫ్రాయిడ్ ఇడిప్లక్స్ కాంప్లెక్స్ ప్రాతిపదికని కోడూరి శ్రీరామూర్తిగారి అభిప్రాయం.[44]

జీ.వి. సుబ్రహ్మణ్యం బుచ్చిబాబు గురించి వ్యాఖ్యానిస్తూ పాశ్చాత్య విస్తృతంగా పఠించిన వాడని సైకోఎనాల్సిస్ సిద్ధాంతాన్ని కూలంకషంగా అధ్యయనం చేసి ఆ సిద్ధాంత సారాంశానంత ప్రతీకాత్మకంగా, ప్రతిభావంతంగా చివరికి మిగిలేది నవలలో కళాకృతిగా అందించాడంటారు.[45] బుచ్చిబాబు రచనల్లో పరమార్థాన్వేషణ కంటే పరిశీలన దృక్పథం అధికంగా ఉంటుందని ఆయన అన్నారు.[46] 'అత్తాకోడళ్ళు కలహాలు' శీర్షికలో ఒక వ్యాసంలో ''బాహ్య జగత్తులో వొస్తువు ఎంత అద్భుతమైనదైనా, అది కథకుడి అంతరంగ జగత్తులో ఆవిర్భవించే వొక కళాదృష్టితో సమన్వయం కుదరాలనీ, ఇతివృత్తం ఊహాలో కొంతకాలం తిప్పుకుంటే గాని, కథకి స్వరూపం ఏర్పడదనీ, మళ్ళా మళ్ళా చదివించే ఖండకావ్యాలుగా కథానిక కొనసాగాలనీ, జీవితాన్ని మరింత తీక్షణంగా సందర్శించాలని కథ ద్వారా, బాహ్య జగత్తు, అంతరంగ జగత్తు – వీటిల్లో ఒక కొత్త వెలుగు కనబడాలి. ఇలాంటి లక్షణ సూక్తుల్ని అలవోకగా చెప్పివేస్తారు. సోమర్ సెట్ మామ్ ప్రభావం వీరి కథాశిల్పం మీదా కథా విమర్శ

---

[43] మూజింగ్స్, చలం: పుట265

[44] సుబ్రహ్మణ్యం, జి.వి.యస్. ఆధునిక సాహిత్య విమర్శరీతులు: పుట: 170

[45] సుబ్రహ్మణ్యం, జి.వి.యస్. ఆధునిక సాహిత్య విమర్శరీతులు: పుట: 242

[46] సుబ్రహ్మణ్యం, జి.వి.యస్. ఆధునిక సాహిత్య విమర్శరీతులు: పుట: 243

మీదా బలంగా కనబడుతుందని''[47] చెప్పారు. విమర్శలో కూడా కళాహృదయాన్ని, కళా సౌందర్యాన్ని చూడగల, ప్రదర్శింపగల ప్రజ్ఞ ఆ రచనల ప్రభావం వలన అలవడింది.[48] బుచ్చిబాబు రిచర్డ్స్ ను చదవక పూర్వమే ఆయన సిద్ధాంతంలోని కొన్ని భావాలు తామే స్వయంగా ఏర్పరచుకున్న భావకుడు.[49] కళకు విమర్శ మూలం అన్న సత్యాన్ని చాటిన సాహితీమూర్తులు ఈ వెలుగులు.వారి దృక్పథాలు వీచికలు .[50] అని పేర్కొన్నారు.

1. ఒక వస్తువును మనం సుందర వస్తువుగా చిత్రించాలంటే ముందు దాని నుండి మనం ఆనందానుభవాన్ని పొందాలని అప్పుడే అది సుందర వస్తువు అవుతుందంటారు బుచ్చిబాబు. [51]
2. సౌందర్యం అనేది వ్యక్తిలోనే ఉంటుందని సౌందర్యాన్ని, అనుభవాన్ని, వస్తువుని వేరుగా చూడలేమని అవి ఎప్పుడూ కలిసే ఉంటాయంటున్నాడు. [52]

**6.6. ముక్తాయింపు**

ఈ విధంగా తెలుగులో సౌందర్యశాస్త్ర విమర్శను, ఆ విమర్శకులను అధ్యయనం చేసినప్పుడు మూడు రకాలుగా ఆ విమర్శ-విమర్శకులు ఉన్నారని తెలుస్తుంది. 1. ప్రాచీనాంధ్ర ఆలంకారికులు, 2. కావ్యాలలో లక్షణ ప్రతిపాదిత ఆంధ్రాలంకారిక కవులు, 3. భారతీయ , పాశ్చాత్య సౌందర్య సమన్వయ విమర్శకులుగా వీరిని వర్గీకరించే అవకాశం ఉందని ఈ పరిశీలనలో తేలింది. అయితే ఈ పరిశోధన ప్రధానంగా మూడవ వర్గానికి చెందినది. దీనిలోను వివిధ భావజాలాలకు ప్రక్రియలకు భిన్నకాలాలకు చెందిన వారిని పరిశీలనకు తీసుకోవడం జరిగింది. భారతీయాలంకారిక సూత్రాలనే పాశ్చాత్యుల సిద్ధాంతాలతో సమన్వయిస్తూ పురాణం సూరిశాస్త్రి, సంజీవ్ దేవ్ ల సౌందర్యశాస్త్రవిమర్శ కొనసాగిందని తెలుస్తుంది. శ్రీశ్రీ సౌందర్యశాస్త్ర అంశాలను గుర్తిస్తూనే మార్క్సిస్ట్ కళాసౌందర్య దృక్పథంతో సామాజిక వాస్తవికత కేంద్రంగా పాశ్చాత్యుల సౌందర్యశాస్త్ర సిద్ధాంతాలను అవసరమైనంతమేరకు తన

[47] సుబ్రహ్మణ్యం, జి.వి.యస్. ఆధునిక సాహిత్య విమర్శరీతులు: పుట: 243
[48] సుబ్రహ్మణ్యం, జి.వి.యస్. ఆధునిక సాహిత్య విమర్శరీతులు: పుట: 244
[49] సుబ్రహ్మణ్యం, జి.వి.యస్. ఆధునిక సాహిత్య విమర్శరీతులు: పుట: 244
[50] సుబ్రహ్మణ్యం, జి.వి.యస్. ఆధునిక సాహిత్య విమర్శరీతులు: పుట: 245
[51] బుచ్చిబాబు. చివరికి మిగిలేది పుట:130
[52] బుచ్చిబాబు. చివరికి మిగిలేది పుట:30

సాహిత్యానికి విమర్శకు ఉపయోగించుకున్నారని తెలుస్తుంది. సౌందర్యంలోని ఇచ్ఛా, నిరపేక్షత, అభివ్యక్తి, శారీరక, మానసిక అనుభూతుల కేంద్రంగా చలం, బుచ్చిబాబులు తమ సృజనాత్మక రచనలు విమర్శల్లో సౌందర్య భావనలను ప్రతిపాదించారు. మొత్తంమీద కళలన్నీ సౌందర్య కేంద్రంగా వ్యక్తివస్తునిష్టలుగా వివరిస్తూనే, అభివ్యక్తి, ఆస్వాదనలను కళాకారుడు ప్రేక్షకపక్షాల దృష్టితో అధ్యయనం చేయడం అవసరమని తెలుగులో సౌందర్యశాస్త్ర విమర్శకుల ప్రతిపాదనల్లో ఈ ఏకాభిప్రాయం పరోక్షంగా వ్యక్తమయింది.

ఏడవ అధ్యాయం

# సింహావలోకనం

ఏడవ అధ్యాయం

# సింహావలోకనం

తెలుగులో సౌందర్యశాస్త్ర విమర్శను మొత్తంమీద పరిశీలించినప్పుడు భారతీయ, పాశ్చాత్య సౌందర్య సిద్ధాంతాలను తమ విమర్శలో సమన్వయించినట్లు ఇంతవరకు జరిగిన విశ్లేషణను బట్టి తెలుస్తుంది. పురాణం సూరిశాస్త్రి కేవలం సాహిత్యానికి మాత్రమే సమన్వయించే పద్ధతిలో కాకుండా '*కళ*' అనే అర్థంలో ప్రయోగించారు. అలాగే సంజీవ్ దేవ్ సౌందర్యాస్వాదనను సాహిత్యంతో పాటు చిత్రకళ, శిల్పం తదితర కళలకు అనువర్తించేలా చెప్పారు. సౌందర్యాస్వాదనని బౌమ్ గార్టెన్, క్రోచి, శాంతాయన మొదలైన వారు చెప్పినట్లే ఇంద్రియానుభవాలు ప్రధానమని తెలుగు సౌందర్యశాస్త్ర విమర్శకులు తమ విమర్శకు ప్రమాణాలుగా స్వీకరించారు.

తెలుగులో సౌందర్య భావనలను భావవాద దృక్పథంతో పురాణం సూరిశాస్త్రి భారతీయాలంకారిక దృక్పథాన్ని సమన్వయంచేసి చెప్పగా రెండింటిని చెప్తూనే ఆస్వాదనకూ ప్రాధాన్యతనిచ్చిన సంజీవ్ దేవ్ లకంటే భిన్నంగా వాస్తవికవాద దృష్టితో శ్రీశ్రీ తన సౌందర్య భావనలను వ్యక్తంచేసారు. అయితే శ్రీశ్రీ గురజాడ రచనల విమర్శలో భారతీయుల భాషా, రీతి, ధ్వనులను, ఆలంకారాలను ప్రస్తావిస్తూనే జీవితానుభవానికి సంబంధించిన వాస్తవికత 'రసన'లో ఉంటుందన్నారు. ఈ రసన అనే భావన భారతీయుల భరతుని రససిద్ధాంతం కంటే భిన్నమైనది. అలాగే నాయికా నాయకుల విషయంలో కూడా కన్యాశుల్కాన్ని ఆధారంగా చేసుకొన్న విమర్శలో నాయకుని నిర్ణయాన్ని వివరించడానికి సంప్రదాయాలంకారిక సూత్రాలతో విభేదించారు. అలాంటప్పుడు అరిస్టాటిల్ ట్రాజిడి, కామిడిల సమ్మేళనంతో కొత్త ఆలోచనలను కలిగించారు.

శ్రీశ్రీ సౌందర్య భావనల్లో ఉన్న ప్రత్యేకతేమిటంటే, శ్రమైకజీవనంలో సౌందర్యాని వాస్తవికతా దృష్టితో చూసారు. వీరిని సమన్వయిస్తున్నట్లుగా బుచ్చిబాబు సౌందర్య భావనలు

కనిపిస్తాయి. అలాగే సౌందర్యాస్వాదనలో నైతిక విలువలకంటే అనుభవమే ప్రధానమనే పాశ్చాత్య భావనలు చలం రచనలలో కనిపిస్తాయి. సహజాభివ్యక్తితో తన రచనలను కొనసాగించి సౌందర్య భావనలో దైవభావనకంటే సహజ సౌందర్య భావనకు ప్రాధాన్యతనిచ్చారు. పాశ్చాత్యుల్లోని అగస్టిన్ విభజించిన సహజ దైవసౌందర్య భావనలు చలంలో కనిపించినట్లుంటాయి. అలాగే విశ్వనాథ సౌందర్యాన్ని చూస్తే కళకు నైతికత ప్రధానమనే దృష్టితో కొనసాగుతుంది. ప్లాటో కవులను వెళ్ళకొట్టడం, కళకు నీతి ఉండదని చెప్పడంవంటి భావనలు విశ్వనాథలో కనిపిస్తాయి. ఇకా, కొండూరి వీరరాఘవాచార్యులు నాట్యానికి సంబంధించిన రచనలను కేవల సాహిత్య విషయాలతో మాత్రమే కాకుండా ఇతర అన్ని కళల అంశాలతోనూ సమన్వయించాల్సిన అవసరం ఉందంటారు.

పురాణం సూరిశాస్త్రి, సంజీవ్ దేవ్, విశ్వనాథ, కొండూరి వీరరాఘవాచార్యులు ప్రత్యక్షంగా విమర్శ రచనల్లోనే సౌందర్య భావనలను వివరించగా, నేనిక్కడ పరిశీలించిన వారిలో శ్రీశ్రీ, చలం, బుచ్చిబాబులు సృజనాత్మక సాహిత్యంలో ఈ అంశాలను వివరించారు. వీటన్నింటిని బట్టి తెలుగులో సౌందర్యశాస్త్ర భావనలు కేవలం విమర్శ రచనల్లోనే కాకుండా సృజనాత్మక రచనల్లో కూడా ఉన్నాయని, తెలుగువిమర్శకుల సౌందర్యశాస్త్ర భావనలు భారతీయ, పాశ్చాత్య సౌందర్యశాస్త్ర భావనల అవగాహనతో కొనసాగుతున్నాయని ఈ పరిశీలనవల్ల తెలుస్తుంది.

ఇక, ఈ పరిశోధనలో అధ్యయనం చేసిన ముఖ్యాంశాలను అధ్యయాల వారీగా కింద వివరిస్తున్నాను.

మొదటి అధ్యాయం **తెలుగులో సాహిత్యవిమర్శ: సౌందర్యశాస్త్ర పరిచయం**లో ఇంతవరకు తెలుగులో వచ్చిన సౌందర్యశాస్త్ర విమర్శకులను పరిచయం చేసి వారి ప్రత్యేకతలను గుర్తించటానికి వీలుగా తెలుగు సాహిత్య విమర్శ స్వరూప స్వభావాలను సంక్షిప్తంగా పరిచయం చేశాను.

విమర్శ గురించి విమర్శకులు ఇచ్చిన విమర్శ నిర్వచనాలను, విమర్శ యొక్క ప్రయోజనాలను పేర్కొని విమర్శకుడికి ఉండవలసిన లక్షణాలను పేర్కొన్నాను.

ఈ అధ్యాయంలోనే తెలుగు సాహిత్య విమర్శ యొక్క నేపథ్యాన్ని తెలిపి వివిధ సాహిత్య విమర్శ పద్ధతులను పరిచయం చేస్తూ సౌందర్య శాస్త్ర విమర్శ యొక్క ప్రత్యేక ప్రతిపత్తికి జరిగిన ప్రయత్నాలను వివరించాను.

ఆలంకారిక విమర్శ కంటే సౌందర్య శాస్త్ర విమర్శ లలిత కళలతో పాటు ఇతర కళలన్నింటిని అధ్యయనం చేసే విస్తృత పరిధిని విశ్లేషించాను.

రెండవ అధ్యాయం **భారతీయ, పాశ్చాత్య సౌందర్యశాస్త్ర సిద్ధాంతాలు**లో మానవ జీవిత అవసరాల నుండి సౌందర్య దృష్టి ప్రారంభమైనదని దాన్ని సిద్ధాంతీకరించిన భారతీయులలో భరతుడు ప్రథమముగా చెబుతున్నారు. భారతీయ సౌందర్యశాస్త్ర సిద్ధాంతాలుగా ప్రాచుర్యంలో ఉన్న రస సిద్ధాంతం, వాటి ప్రతిపాదకులను, ఈ ధ్వని సిద్ధాంతాలను, చమత్కార, ఔచిత్య, రీతి, వక్రోక్తి అలంకార అధ్యాయాలలో వివరించాను.

అలాగే పాశ్చాత్యుల సౌందర్యశాస్త్ర సిద్ధాంతాలలో అనుకరణ, క్షాలన, రమణీయోదాత్తత, వాస్తవికవాద సిద్ధాంతాలతో పాటు భావనాశక్తి కళాప్రయోజనం, కళాస్వాదనలో గల నైతికతను వివరించే సిద్ధాంతాలను వివరించాను. సౌందర్యాస్వాదనలో జ్ఞానం, తర్కం వహించే పాత్రను తెలిపే విశ్లేషణను క్రోడికరించాను.

పాశ్చాత్య సౌందర్యశాస్త్రానికి ఆద్యుడిగా పేర్కొంటున్న బౌమ్ గార్టెన్ జ్ఞానేంద్రియ చైతన్యశాస్త్రంగా దీన్నీ భావించటానికి కారణమైన ఇంద్రియానుభూతిని పట్టించే అంశాలను పేర్కొన్నాను. అలాగే పంచేద్రియాలకు అనుభూతమయ్యే సౌందర్య వాస్తవికతను, అనుభూతిని బౌమ్ గార్టెన్ ప్రతిపాదించిన తీరుని వివరించాను. సౌందర్యం వస్తుగతమా? వ్యక్తిగతమా? అనే తార్కిక వాదాలను కూడా పేర్కొన్నాను. సౌందర్యం ప్రయోజనాపేక్షతో కూడిందో కాదో వివరించే కాంట్ సిద్ధాంతాలను పేర్కొన్నాను.

సౌందర్యం ధ్వని, రేఖ, రంగు, లయ రూపాలలో భౌతికంగా వ్యక్తమైన ఇంద్రియానుభవాలు సౌందర్యాన్ని దీప్తివత్తం చేస్తాయనే క్రోచే సిద్ధాంతాలను వివరించాను. ఇంకా శాంతాయన సౌందర్యానికి స్వతంత్ర అస్తిత్వంలేదని, ఆస్వాదించేదే సౌందర్యమని,

ఆస్వాదించగలిగేవాడే సౌందర్యాస్వాదకుడని సౌందర్య అస్తిత్వ సిద్ధాంతాన్ని పేర్కొన్నాను. భారతీయులు సౌందర్యాన్ని అన్వేషించేదిశగా నిర్ధిష్టమైన ఒక సిద్ధాంతచట్టంలో పేర్కొన్నట్లుగా కాకుండా సౌందర్యం ఏకీభూతంగా కాకుండా వస్తు, వ్యక్తినిష్టాలుగా పాశ్చాత్యులు భావించారని అటువంటి భావన భారతీయాలంకారికులలో భరతుని రసాస్వాదన సిద్ధాంతం తెలియజేస్తుంది.

మూడవ అధ్యాయం **తెలుగులో సౌందర్యశాస్త్ర విమర్శ – విమర్శకులు** లో తెలుగులో సౌందర్య శాస్త్ర విమర్శ మూడు రకాలుగా కనిపిస్తుంది. సంస్కృతాలంకార శాస్త్రాలను కొనసాగిస్తూ వచ్చిన లక్షణ గ్రంథానుగుణ విమర్శ. దీనిని పూర్తిగా ఆధునికశాస్త్రదృష్టితో దాన్ని విమర్శగా పరిగణించకపోయిన సౌందర్యదృష్టితో చూసినప్పుడు దీనిలో గ్రహించాల్సిన అనేకాంశాలున్నాయి. అందువల్ల సంస్కృతాలంకారిక సూత్రాలను ఆధారంగా చేసుకొని వచ్చిన తెలుగు సాహిత్యవిమర్శను ఒక భాగంగానూ, తెలుగు కవులు వ్యక్తం చేసిన సౌందర్య శాస్త్ర అంశాలను మరోక విభాగంగానూ, పాశ్చాత్య విమర్శ సౌందర్య శాస్త్ర, సంస్కృతాలంకారిక శాస్త్రాలతో సమన్వయంతో వచ్చినటువంటి విమర్శగా మూడు రకాలుగా కనిపిస్తుంది. వీరిని ప్రాచీనాంధ్ర ఆలంకారికులు, కావ్యాలలో లక్షణ ప్రతిపాదిత ఆంధ్రాలంకారిక కవులు, భారతీయ, పాశ్చాత్య సౌందర్య సమన్వయ విమర్శకులుగా విభజించి విశ్లేషించాను.

నాల్గవ అధ్యాయం **పురాణం సూరిశాస్త్రి, సంజీవ్ దేవ్ సౌందర్యశాస్త్ర విమర్శలో** తెలుగులో సౌందర్యశాస్త్రవిమర్శను భారతీయ పాశ్చాత్య దృక్కోణంతో పరిశీలించిన విమర్శకుల్లో పురాణం సూరిశాస్త్రి, సంజీవ్ దేవ్ ముఖ్యులు. అలాగే వీరు ప్రధానంగా సౌందర్యశాస్త్రాన్ని ఒకవిమర్శగా అనుశీలించిన వారు. సృజనాత్మక సాహిత్యానికంటే, సృజనాత్మక సాహిత్యం, కళలను ఆధారంగా చేసుకొని తమ పరిశీలనను కొనసాగించినవారు. అందువల్ల వీరి కృషి ప్రత్యేకంగా అధ్యయనం చేశాను.

పురాణం సూరిశాస్త్రి, సంజీవ్ దేవ్ ల విమర్శకృషిని చూసినప్పుడు కావ్యాలను, నాటకాలను పురాణం సూరిశాస్త్రి, ఇతర కళలన్నింటిని సమన్వయిస్తూ సౌందర్యాస్తిత్వాన్ని నిర్ణయించే దిశగా సంజీవ్ దేవ్ సౌందర్యశాస్త్ర విమర్శ కొనసాగిందని నిరూపించాను.

ఐదవ అధ్యాయం **శ్రీశ్రీ, చలం, బుచ్చిబాబు సౌందర్యశాస్త్ర విమర్శలో** శ్రీశ్రీ కేవలం కవిత్వం మాత్రమే కాకుండా కథలు, వ్యాసాలు, స్వీయచరిత్ర, పాఠకులకు ఇంటర్వ్యూలు ఇస్తున్న సందర్భాల్లో వ్యక్తంచేసిన సౌందర్యశాస్త్ర భావనలను ప్రత్యేకంగా గుర్తించి సమన్వయించాల్సిన అవసరం ఉంది. అలాగే, చలం సృజనశీలిగానే కనిపిస్తున్నా వివిధ సందర్భాల్లో సౌందర్యానికి సంబంధించిన అనేకాంశాలను వెల్లడించారు. కథలు, నవలు, నాటకాలు, మ్యూజింగ్స్ లో ఈ అభిప్రాయాలు కన్పిస్తాయి. ఇదే ధోరణిలో బుచ్చిబాబు రచనలను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ముగ్గురు కూడా ప్రధానంగా సృజనాత్మక రచయితలైనప్పటికీ, సౌందర్యశాస్త్ర విమర్శానాంశాలు వాటిలో కనిపిస్తాయి. వాటితోపాటు ఈ ముగ్గురు కూడా వచనరచనలు కూడా చేశారు. అవి ప్రధానంగా విమర్శ విభాగానికి చెందినవాటిగానే భావించవచ్చు. అలాచూసినప్పుడు పురాణం సూరిశాస్త్రి, సంజీవ్ దేవ్ ల రచనలకంటే భిన్నమైన రచనావిధానాన్ని కొనసాగించినవారిగా చెప్పుకోవచ్చు. అందువల్ల వీరిని ఈ అధ్యాయంలో ప్రత్యేకంగా పరిశీలన చేశాను.

పాశ్చాత్యుల్లోని అగస్టిన్ విభజించిన సహజ దైవసౌందర్య భావనలు చలంలో కనిపించినట్లుంటాయి. అలాగే విశ్వనాథ సౌందర్యాన్ని చూస్తే కళకు నైతికత ప్రధానమనే దృష్టితో కొనసాగుతుంది. ప్లాటో కవులను వెళ్ళకొట్టడం, కళకు నీతి ఉండదని చెప్పడంవంటి భావనలు విశ్వనాథలో కనిపిస్తాయి. ఇకా, కొండూరి వీరరాఘవాచార్యులు నాట్యానికి సంబంధించిన రచనలను కేవల సాహిత్య విషయాలతో మాత్రమే కాకుండా ఇతర అన్ని కళల అంశాలతోనూ సమన్వయించాల్సిన అవసరం ఉందంటారు. పురాణం సూరిశాస్త్రి, సంజీవ్ దేవ్, విశ్వనాథ, కొండూరి వీరరాఘవాచార్యులు ప్రత్యక్షంగా విమర్శ రచనల్లోనే సౌందర్య భావనలను వివరించగా, నేనిక్కడ పరిశీలించిన వారిలో శ్రీశ్రీ, చలం, బుచ్చిబాబులు సృజనాత్మక సాహిత్యంలో ఈ అంశాలను వివరించారు. వీటన్నింటిని బట్టి తెలుగులో సౌందర్యశాస్త్ర భావనలు కేవలం విమర్శ రచనల్లోనే కాకుండా సృజనాత్మక రచనల్లో కూడా ఉన్నాయని, తెలుగువిమర్శకుల సౌందర్యశాస్త్ర భావనలు భారతీయ, పాశ్చాత్య సౌందర్యశాస్త్ర భావనల అవగాహనతో కొనసాగుతున్నాయని ఈ పరిశీలనవల్ల తెలుస్తుంది.

పురాణం సూరిశాస్త్రి, సంజీవ్ దేవ్ లు విమర్శలోనే సౌందర్యశాస్త్ర భావనలను సైద్ధాంతీకరణ సమన్వయంతో వివరించగా, ఈ ముగ్గురు అనగా శ్రీశ్రీ, చలం, బుచ్చిబాబు తమ సృజనాత్మక రచనలలో పాత్రలు, సన్నివేశాల సందర్భోచితంగా చెప్పారు. అక్కడ సరిగ్గా అవగాహన చేసుకుంటారో లేదోనని గాని, ఒక విమర్శ రూపంలో మరింత స్పష్టంగా చెప్పాలనే ప్రయత్నంలోగాని, భారతీయ, పాశ్చాత్య సౌందర్యశాస్త్ర భావాలను వివిధ సందర్భాల్లో వివరించారని ఈ పరిశీలన వలన తెలిసిందని వివరించాను.

ఆరవ అధ్యాయం **తెలుగులో సౌందర్యశాస్త్ర విమర్శకుల ప్రతిపాదనలు**లో పురాణం సూరిశాస్త్రి, సంజీవ్ దేవ్, శ్రీశ్రీ, చలం, బుచ్చిబాబులు చేసిన భారతీయ, పాశ్చాత్య సౌందర్య సిద్ధాంతాలను భావనలను అనుసరించి చేసిన విమర్శలో గల ప్రతిపాదనలను లేదా ప్రత్యేకతలను లేదా విశేషాంశాలను ఈ అధ్యాయంలో క్రోడీకరించే ప్రయత్నం చేశాను. దీని వల్ల తెలుగులో సౌందర్యశాస్త్ర విమర్శకుల ప్రత్యేకతను తెలుసుకునే అవకాశం ఉంటుందని భావించాను. ఆ విధంగా తెలుగు సాహిత్యవిమర్శలో కేవలం విమర్శకులు మాత్రమేకాకుండా కవులు, సృజనాత్మక రచయితలు తమ రచనల్లో సౌందరశాస్త్రవిమర్శకు ఉపయోగపడే అంశాలను చెప్పే అవకాశం ఉందని ఈ పరిశోధన వ్యాస సారాంశాన్ని ఈ అధ్యాయంలో వివరించే ప్రయత్నం చేశాను.

ఏడవ అధ్యాయం **సింహావలోకనం**లో నా ఈ పరిశోధనల్లో గల అధ్యాయాల విభజన ముఖ్యాంశాలను వివరించాను.

తెలుగులో సౌందర్యశాస్త్రవిమర్శకులను, వారి విమర్శను అధ్యయనం చేస్తున్నప్పుడు తెలుగు విమర్శకులలో ముఖ్యంగా కట్టమంచి, పురాణం సూరిశాస్త్రి, సంజీవ్ దేవ్, శ్రీశ్రీ, చలం, బుచ్చిబాబు మొదలైన రచయితల రచనలతో విడివిడిగా ప్రత్యేకంగా తులనాత్మక అధ్యయనం చేసే అవకాశం ఉంది. భవిష్యత్తులో పరిశోధకులు ఈ దిశగా అధ్యయనం చేస్తే బాగుంటుంది. అలాగే తెలుగులో వచ్చిన విమర్శ పరిణామాన్ని ఎస్వీ. రామరావు పరిశోధించినట్లుగా తెలుగు సౌందర్యశాస్త్ర పరిణామ వికాసాలను ప్రత్యేకంగా పరిశీలన చేయవచ్చు. దీనితో పాటు సౌందర్యశాస్త్ర విమర్శకుల జీవిత పరిశీలనలు విడిగాను, సారూప్యాంశాల విశ్లేషణతోను పరిశోధనలు చేయవచ్చు. ఇలియట్ ని, విశ్వనాథని తులనాత్మకంగా జి.వి. సుబ్రహ్మణ్యం

అధ్యయనం చేసినట్లుగానే తెలుగు సౌందర్యశాస్త్ర విమర్శకులని పాశ్చాత్య సౌందర్యశాస్త్ర విమర్శకులతోను పరిశోధన చేయవచ్చు. అలాగే సృజనాత్మక రచయితల భావనల ఆధారంగ కూడా సౌందర్యశాస్త్రాంశాలను గుర్తించవచ్చు. ఇప్పటికే జి. నాగయ్య, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి కావ్యావతారికలపై కొనసాగించిన పరిశోధనలవలె సౌందర్యశాస్త్రాంశాలను కూడా కవుల రచనలను ఆధారంగా చేసుకొని పరిశీలించవచ్చు.

# ఉపయుక్త గ్రంథసూచిక

# ఉపయుక్త గ్రంథసూచిక

(**Bibliography**)


- అనంతకృష్ణశర్మ, రాళ్లపల్లి. *సారస్వతాలోకము.* మదరాసు: త్రివేణి పబ్లిషర్స్, 1966.
- అభినవ గుప్తుడు. *ధ్వన్యాలోకము (వ్యాఖ్యాత. పుల్లెల శ్రీరామ చంద్రుడు).* హైదరాబాదు: జయలక్ష్మీ పబ్లికేషన్స్, 1998.
- అయిలయ్య, బన్న. *తెలుగు కవిత అభినవ దృక్పథం.* వరంగల్: నానీ ప్రచురణలు, 2001.
- ఆరుద్ర., రవి, తెలకపల్లి. *చలం జీవిత సాహిత్యాలు.* హైదరాబాదు: ప్రజాశక్తి బుక్ హౌస్, ద్వి.ము. 2009.
- ఆర్వీయార్. *సాహిత్యతత్వం.* హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, (ప్ర.ము. 1988), (రెం.ము.)1997.
- ఇనాక్, కొలుకలూరి. *తెలుగు వ్యాస పరిణామమము.* అనంతపురం: జ్యోతి గ్రంథమాల, 1980.
- కవికుమార్, పారుపల్లి (సం). *సంజీవదేవ్ రచనల సమీక్ష, విశ్లేషణ, జీవితం.* విశాఖపట్నం: కవికుమార్ పబ్లికేషన్స్, 2003.
- కాత్యాయనీ, విద్మహే. *బుచ్చిబాబు వాఙ్మయ జీవిత సూచిక.* వరంగల్: స్వీయముద్రణ, 1983.
- కుటుంబరావు, కొడవటిగంటి. *సాహిత్య ప్రయోజనం (వ్యాసావళి).* విజయవాడ: విశాలాంధ్ర పబ్లికేషన్స్, 1969.
- కుసుమారెడ్డి, కె. *నాట్యశాస్త్ర దిశ రసతత్త్వ పరంపర్యః సమీక్షనము.* వారణాసి: కన్యాకుమరి దీపకళిక, 2008.
- కుసుమారెడ్డి, కె. *సాహిత్య పరిశోధన పద్ధతులు.* హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2001.

- కృష్ణమూర్తి, నే.శ్రీ. *తెలుగు రచయితలు – రచనలు(1875–1980).* హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, 1984.
- కృష్ణమూర్తి, నే.శ్రీ. *వ్యాసరచనల సూచి(1875–1972).* హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, 1977.
- కృష్ణారావు, యం.ఎస్.ఆర్. (అను.). *ఆలంకారికులు.* న్యూఢిల్లీ: పబ్లికేషన్స్ డివిజన్, 2002.
- కొండలరావు, వెలిచాల. *భాష – పరిభాష, సాహిత్యం – సంస్కృతి.* హైదరాబాదు: తెలుగు అకాడమి, 1990.
- కోటేశ్వరరావు, తుమ్మపూడి. *సాలభంజిక.* అనంతపురం: (స్వీయ ప్రచురణ), 1984.
- గంగప్ప, ఎస్. *వేయిపడగలు – విశ్లేషణాత్మక విమర్శ.* గుంటూరు: శశీ ప్రచురణలు, 1993.
- గణపతిశాస్త్రి, చర్ల. *సాహిత్య సౌందర్య దర్శనము.* హైదరాబాదు: (స్వీయ ప్రచురణ), 1972.
- గోపాలరెడ్డి, ముదిగంటి., సుజాతరెడ్డి, ముదిగంటి. *సంస్కృత సాహిత్య చరిత్ర.* హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2007.
- చంద్రశేఖరం, వేలూరి (అను.). *శ్రీ అరవింద వ్యాసావళి (వంగభాష నుండి అనువాదము).* మద్రాసు: వావిళ్లవారి ముద్రణాలయము, ౧౯౪౦ (1940).
- చలపతిరావు, సుంకర. *వడ్డాది పాపయ్య, సంజీవదేవ్ లేఖలు.* విశాఖపట్నం: స్వీయముద్రణ, 2007.
- చెన్న కేశవ రెడ్డి, జి. (ప్ర.సం.). *ఆచార్య కొలకలూరి ఇనాక్ షష్టిపూర్తి సన్మాన సంచిక.* హైదరాబాదు: ఆచార్య కొలకలూరి ఇనాక్ షష్టిపూర్తి కమిటి, 1999.

- జయప్రకాష్, ఎస్. *పరిశోధన విధానం.*
  హైదరాబాదు: (ప్ర.ము. 1980), (ఏ.ము.) 2005.
- జోగారావు, ఎస్.వి. *సాహిత్య భావ లహరి.*
  హైదరాబాదు: తెలుగు అకాడమి, 1989.
- తిరుమలరావు, సర్దేశాయి. *విమర్శ – ప్రతి విమర్శ.*
  హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, 2002.
- తిరువేంగళాచార్యులు, వేదాల. *ఆంధ్ర రస గంగాధరం.*
  హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1969.
- దక్షిణామూర్తి, ఇసుకపల్లి (సం.). *రజత రంజని.*
  హైదరాబాదు: రంజని రజతోత్సవ సంఘం, 1988.
- దైవాశీర్వాదం, జి. *విమర్శకునిగా శ్రీశ్రీ.* (ఎం.ఫిల్. అముద్రిత సిద్ధాంత వ్యాసం). హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం. తెలుగుశాఖ, 1989.
- నరసింహమూర్తి, యు.ఎ. *విశ్వనాథ సౌందర్య దర్శనము.*
  హైదరాబాదు: అజో– విభో – కందాళం ప్రచురణలు, 2009.
- నరసింహారావు, బి.వి. (సం.) *సంజీవదేవ్ కు చలం.*
  గుడివాడ: బాలబంధు ప్రచురణలు, 1987.
- నరేష్ బాబు, డి. *శ్రీశ్రీ రచనలు– కళాతత్త్వ శాస్త్ర దృక్పథం.* (ఎం.ఫిల్. అముద్రిత సిద్ధాంత వ్యాసం). హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం. తెలుగుశాఖ, 1992.
- నాగయ్య, జి. *తెలుగు సాహిత్య సమీక్ష.* తిరుపతి:
  నవ్య పరిశోధక ప్రచురణలు, (ప్ర.ము 1983), (నా.ము.) 2003.
- ప్రభాకరరెడ్డి, కోడూరు. *దువ్వూరి రామిరెడ్డి కవిత్వం – వ్యక్తిత్వం.*
  హైదరాబాదు: స్వీయముద్రణ, 2001.
- బుచ్చిబాబు. *చివరకు మిగిలేది.* విజయవాడ: పల్లవి పబ్లికేషన్స్, 1994.

- బుచ్చిబాబు. *బుచ్చిబాబు సాహిత్య వ్యాసాలు.*
  హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1997.
- బుద్ధ ప్రసాద్, మండలి (సం.). *వజ్రభారతి 1947-2007 (స్వతంత్ర భారతదేశంలో వివిధ రంగాలలో తెలుగు వారి 60 ఏళ్ళ ప్రగతి సమీక్షా వ్యాసాలు).*
  విజయవాడ: కృష్ణా జిల్లా రచయితల సంఘం, 2007.
- భాస్కర్ రెడ్డి, వరుగు. *సంజీవ్ దేవ్ – సౌందర్యతత్త్వం (కళాతత్త్వ వివేచన).*
  హైదరాబాదు: పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, 2008.
- మంజులాదేవి, ఆర్.వి.యన్. *కళాతాత్వికుడిగా బుచ్చిబాబు.*
  (ఎం.ఫిల్. అముద్రిత సిద్ధాంత వ్యాసం). హైదరాబాదు:
  హైదరాబాదు విశ్వవిద్యాలయం. తెలుగుశాఖ, 1994.
- మందేశ్వరరావు, వడలి. *అనుశీలన.* హైదరాబాదు:
  తెలుగు అకాడమీ, 1992.
- మందేశ్వరరావు, వడలి. *పాశ్చాత్య సాహిత్య విమర్శ చరిత్ర – సిద్ధాంతాలు.*
  హైదరాబాదు: తెలుగు విశ్వ విద్యాలయం, 1994.
- మందేశ్వరరావు, వడలి. *సాహిత్య ప్రస్థానం – కొన్ని మజిలీలు.*
  హైదరాబాదు: (సొం.ప్ర.), 2002.
- మధుజ్యోతి, కొలకలూరి. *డా. బెజవాడ గోపాలరెడ్డి కవిత్వం – సౌందర్యం.*
  అనంతపురం: జ్యోతి గ్రంథమాల, 2000.
- మధుజ్యోతి, కొలకలూరి. *దళిత సాహిత్య సౌందర్యతత్త్వం.*
  హైదరాబాదు: తెలుగు అకాడమి, 2010.
- మాఘుడు. *శిశుపాల వధ.* తెనాలి: సాహితీ గ్రంథమాల, 1969.
- మాచిరెడ్డి, తక్కోలు. *చీకటి నుండి స్వప్నం దాకా.*
  అభ్యుదయ రచయితల సంఘం, 2006.

- యాదగిరి, కె. *రాయప్రోలు సౌందర్య దర్శనం.* సికింద్రాబాద్: చార్ మీనార్ ఆర్ట్ ప్రింటర్స్, 1989.
- రమణ, కె.యస్. *చలం మ్యూజింగ్స్ విమర్శనాత్మక పరిశీలన సిద్ధాంత వ్యాసం.* హైదరాబాదు: శ్రీవల్లీ పబ్లికేషన్స్, 1987.
- రమణయ్య, కడప. *తెలుగు కరదీపిక.* కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయం, 2011.
- రమాంజని కుమారి, వి. *విమర్శకునిగా రాళ్ళపల్లి.* (ఎం.ఫిల్. అముద్రిత సిద్ధాంత వ్యాసం). హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం. తెలుగుశాఖ, 1983.
- రమాపతిరావు, అక్కిరాజు (సం.). **సాహితీ వైజయంతి (ప్రసిద్ధ రచయితల ప్రశస్త వ్యాస సంపుటి).** హైదరాబాదు: అజో– విభో – పబ్లికేషన్స్, 2003.
- రాధాకృష్ణ, జంధ్యాల. *ప్రపంచ రంగస్థలి.* మచిలీపట్నం: అవంతీ పబ్లికేషన్స్, 2006.
- రాధాకృష్ణ, బూదరాజు. *మహాకవి శ్రీశ్రీ.* న్యూఢిల్లీ: సాహిత్య అకాదెమీ, 1999.
- రామబ్రహ్మం, బేతవోలు. *పద్యారామం (ఇటీవల పద్యకృతులపై విమర్శ వ్యాసాలు).* రాజమండ్రి: శ్రీ రత్నాప్రింటర్స్, 2004.
- రామరాజు, బిరుదురాజు (సం.మం). *విజ్ఞాన సర్వస్వము (రెండవ సంపుటము, తెలుగు సంస్కృతి–2).* హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం, 1988.
- రామానుజరావు, దేవులపల్లి (సం.). *తెలుగులో పరిశోధన రజతోత్సవ సంచిక (సమీక్షా వ్యాస సంకలనం).* హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, 1983.

* రామారావు, ఎస్వీ. *తెలుగులో సాహిత్య విమర్శ అవతరణ – వికాసములు.* పసిడి ప్రచురణలు, 1999.
* రామారావు, చేకూరి. *సాహిత్య వ్యాసరింఛోళి.* హైదరాబాదు: చేరా పబ్లికేషన్స్, 2001.
* రామిరెడ్డి, దువ్వూరి. *కవికోకిల గ్రంథావళి–4.* నెల్లూరు: కవికోకిల గ్రంథమాల, 1967.
* లక్ష్మణ చక్రవర్తి, సి.హెచ్. (సం). *ఆధునిక సాహిత్య విమర్శ రీతులు.* హైదరాబాదు: ఆంధ్ర విద్యాలయ స్నాతకోత్తర తెలుగు శాఖ, 2004.
* లక్ష్మణ చక్రవర్తి, సి.హెచ్. (సం). *ఆధునిక సాహిత్య విమర్శకులు – ప్రస్థానాలు (సమకాలీకులు).* హైదరాబాదు: ఆంధ్ర విద్యాలయ స్నాతకోత్తర తెలుగు శాఖ, 2008.
* లక్ష్మణ చక్రవర్తి, సి.హెచ్. (సం). *ఆధునిక సాహిత్య విమర్శకులు – ప్రస్థానాలు (తొలి మలి తరాలు).* హైదరాబాదు: ఆంధ్ర విద్యాలయ స్నాతకోత్తర తెలుగు శాఖ, 2008.
* లక్ష్మీకాంతం, పింగళి. *సాహిత్య శిల్ప సమీక్ష.* హైదరాబాదు: మాధవి బుక్ సెంటర్, 1966.
* విజయ భారతి, బి (పరిష్కర్త). *తెలుగు సాహిత్య కోశము.* హైదరాబాదు: తెలుగు అకాడమి, 1999.
* విశ్వనాథ శాస్త్రి, సరిపెల్ల. (అను.). *ప్రాక్పశ్చిమ తత్త్వ శాస్త్ర చరిత్ర (ద్వితీయ సంపుటము – పశ్చిమ విభాగము).* హైదరాబాదు: ఆంధ్ర సారసత్వ పరిషత్తు, 1962.
* వీరభద్రయ్య, ముదిగొండ (సం). *సంజీవదేవ్ వ్యాసాలుI.* హైదరాబాదు: తెలుగు అకాడమి, 1990.
* వీరభద్రయ్య, ముదిగొండ. *కళాతత్త్వ శాస్త్రం మౌలికాంశ వివేచన.* హైదరాబాదు: జాతీయ సాహిత్య పరిషత్తు, 1993.

- వీరభద్రయ్య, ముదిగొండ. *విమర్శ మౌలిక లక్షణాలు.* హైదరాబాదు: తెలుగు అకాడమి, 1990.
- వీరభద్రయ్య, ముదిగొండ. *విశ్వనాథ సాహిత్య తత్త్వ వివేచన.* హైదరాబాదు: ఆర్కియాలాజిక్ సొసైటి, 2000.
- వెంకట రామనరసింహం, కాకర్ల. *సాహిత్య దర్శనము.* విజయవాడ: గంగాధర పబ్లికేషన్స్, 1985.
- వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. *వల్లంపాటి సాహిత్య వ్యాసాలు.* హైదరాబాదు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1997.
- వెంకటప్పయ్య, వెలగా (సం.). *తెగిన జ్ఞాపకాలు.* తెనాలి: సంజీవదేవ్ ఫౌండేషన్, 1999.
- వెంకటా చలం, గుడిపాటి. *చలం అరుణా చలం లేఖలు.* గుడివాడ: బాలబంధు ప్రచురణలు, 1984.
- వెంకటా చలం, గుడిపాటి. *మూజింగ్స్.* విజయవాడ: అరుణా పబ్లిషింగ్ హౌస్, 1986.
- వెంకటా చలం, గుడిపాటి. *రవీంద్ర గీతాంజలి.* హైదరాబాదు: చలం సాహితి, 1975.
- వెంకటేశం, ఎన్.ఆర్. *వ్యాస ప్రసూనాలు.* హైదరాబాదు: దివ్యదీప్తి ప్రచురణలు, 1993.
- వెంకటేశం, బి. *అరిస్టాటిల్ కావ్యశాస్త్రము.* కరీంనగర్: సరోజ ప్రచురణలు, 1993.
- వెంకటేశం, బి. *భారతీయ – పాశ్చాత్య తులనాత్మక సాహిత్య దర్శనము, గ్రీకు – రోమన్ సాహిత్య శాస్త్రము.* కరీంనగర్: సరోజ ప్రచురణలు, 1994.
- వెంకటేశం, బి. *సౌందర్య శాస్త్ర తత్త్వాలు.* కరీంనగర్: సరోజ ప్రచురణలు, 2011.

- వెంకటేశం, బి. *సౌందర్యదర్శన విమర్శ.* కరీంనగర్: సరోజ ప్రచురణలు, 2007.
- వెంకటేశ్వరరావు, కొల్లు. *విమర్శకుడిగా కె.వి. రమణారెడ్డి.* హైదరాబాదు: స్వీయముద్రణ, 2004.
- వెంకటేశ్వరరావు, దార్ల. *పరిశోధకుడుగా ఆరుద్ర.* (పిహెచ్.డి. అముద్రిత సిద్ధాంత వ్యాసం). హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం. తెలుగుశాఖ, 2003.
- వెంకటేశ్వరరావు, దార్ల. *పునర్మూల్యాంకనం (సాహిత్య వ్యాసాలు).* హైదరాబాదు: సొసైటి & ఎడ్యుకేషన్ ట్రస్టు, 2010.
- వెంకటేశ్వరరావు, దార్ల. *బహుజన సాహిత్య దృక్పథం.* హైదరాబాదు: సొసైటి & ఎడ్యుకేషన్ ట్రస్టు, 2012.
- వెంకటేశ్వరరావు, దార్ల. *వీచిక (సాహిత్య విమర్శ వ్యాసాలు).* హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం, 2009.
- వెంకటేశ్వరరావు, దార్ల. *సృజనాత్మక రచనలు చేయడం ఎలా?.* హైదరాబాదు: స్వీయముద్రణ, 2005.
- వేంకట సత్యన్నారాయణరావు, రావూరు. *రాయప్రోలు వారి సాహిత్య సౌందర్య దర్శనం (వ్యాస సంపుటి).* హైదరాబాదు: వంశీ ఆర్ట్ థియేటర్స్, 1980.
- వేంకటావధాని, దివాకర్ల. *సాహిత్య సోపానములు.* హైదరాబాదు: ఆంధ్ర సారస్వత పరిషత్తు, (ప్ర.ము. 1996), (తొ.ము.) 2003.
- శరత్ జ్యోత్స్నారాణి, యస్. *స్వాతంత్ర్యానంతరం తెలుగు కవిత వస్తువు రూపం శిల్పం.* హైదరాబాదు: జ్యోత్స్న కళాపీఠం ప్రచురణ, 2003.
- శిఖామణి. *వివిధ (ఆధునిక సాహిత్య వ్యాసాలు).* హైదరాబాదు & తెనాలి: లిటరరీ సర్కిల్ ప్రచురణ, 1998.

- శేషగిరిరావు, చీమకుర్తి (సం.). *లలితకళా పదకోశం.* హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం, 1991.
- శేషేంద్ర శర్మ, గుంటూరు. *రక్తరేఖ.* హైదరాబాదు: ఇండియన్ లాంగ్వేజెస్ ఫోరం, 1992.
- శేషేంద్రశర్మ, గుంటూరు. *కవిసేన మేనిఫెస్టో (ఆధునిక కావ్య శాస్త్రం).* హైదరాబాదు: ద ఇండియన్ లాంగ్వేజ్స్ ఫోరమ్, 2009.
- శేషేంద్రశర్మ, గుంటూరు. *శేషేంద్ర సాహిత్యంI.* హైదరాబాదు: శ్రీ శేషేంద్ర శర్మ లిటరరీ ఫౌండేషన్, 2009.
- శ్రీ వీరరాఘవాచార్య, కొండూరి. *శిల్ప దర్శనము (పరివర్ధిత సంస్కరణము).* తెనాలి: ప్రత్నానంద, తృ.ము. 1983.
- శ్రీనివాసరావు, కాకుమాని. *కళాతత్త్వ శాస్త్ర సమస్యలు: తెలుగు కళాతాత్త్వికుల వివేచన.* (పిహెచ్.డి. ఆముద్రిత సిద్ధాంత వ్యాసం). హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం. తెలుగుశాఖ, 2002.
- శ్రీనివాసరావు, కె. *చలం రచనల్లో కళాతాత్త్వికాంశాల పరిశీలన.* (ఎం.ఫిల్. ఆముద్రిత సిద్ధాంత వ్యాసం). హైదరాబాదు: హైదరాబాదు విశ్వవిద్యాలయం. తెలుగుశాఖ, 1995.
- శ్రీనివాసరావు, శ్రీరంగం. *అనంతం.* విజయవాడ: అరుణా పబ్లిషింగ్ హౌస్, 1986.
- శ్రీనివాసరావు, శ్రీరంగం. *ప్ర.జ..* హైదరాబాదు: విరసం ప్రచురణలు, 1990.
- శ్రీనివాసరావు, శ్రీరంగం. *మన గురజాడ (కూర్పు చలసాని ప్రసాద్).* హైదరాబాదు: విరసం ప్రచురణలు, 1988.
- శ్రీనివాసరావు, శ్రీరంగం. *మహాప్రస్థానం.* విజయవాడ: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1984.

- శ్రీనివాసరావు, శ్రీరంగం. *శ్రీశ్రీ వ్యాసాలు.* హైదరాబాదు:
 విరసం ప్రచురణలు, 1990.
- శ్రీనివాసరావు, శ్రీరంగం. *శ్రీశ్రీ సాహిత్యం II.* విజయవాడ:
 విశాలాంధ్ర ప్రచురణాలయం, 1970.
- శ్రీరామ అప్పారావు, పోణంగి. *నాట్యశాస్త్రము (విశ్లేషణాత్మక అధ్యయనం).*
 హైదరాబాదు: నాట్యమాల ప్రచురణము, 1959.
- సంజీవదేవ్. *కాంతిమయి.* తెనాలి: కాంతికుంజ సాంస్కృతిక సంస్థ, 1982.
- సంజీవదేవ్. *దీప్తిధార.* మచిలీపట్నం: తెలుగు విద్యార్థి ప్రచురణలు, 1975.
- సంజీవదేవ్. *రస రేఖలు.* తెనాలి: కాంతికుంజ సాంస్కృతిక సంస్థ, 1963.
- సంజీవదేవ్. *రూపదర్శని* (వ్యాస సంపుటి). మచిలీపట్నం:
 స్పందన ప్రింటర్స్, 1988.
- సంజీవదేవ్. *లేఖల్లో సంజీవదేవ్.* తెనాలి: కాంతికుంజ
 సాంస్కృతిక సంస్థ, 1982
- సంజీవదేవ్. *సంజీవదేవ్ లేఖలు.* విజయవాడ: దేశి కవితా మండలి, 1964.
- సంపత్కుమారాచార్య, కోవెల. *ఆధునిక తెలుగు సాహిత్య విమర్శ –
 సాంప్రదాయక రీతి.* వరంగల్: స్వీయముద్రణ, 1981.
- సంపత్కుమారాచార్య, కోవెల. *విశ్వనాథ సాహిత్య దర్శనం.*
 హైదరాబాదు: అభినవ ప్రచురణలు, 2004.
- సత్యనారాయణ, విశ్వనాథ. *కావ్యానందము.* విజయవాడ:
 అరవింద ప్రచురణలు, 1972.
- సిమ్మన, వెలమల. *తెలుగు సాహిత్య విమర్శ సిద్ధాంతాలు.*
 విశాఖపట్నం: దళిత సాహిత్య పీఠం, (రె.ము.) 2009.
- సిమ్మన, వెలమల. *సహృదయలహరి.* విశాఖపట్నం:
 దళిత సాహిత్య పీఠం, 2003.

- సీతారామయ్య, కురుగంటి. *నవ్యాంధ్ర సాహిత్య వీధులు.* హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయం, 1994.
- సుధాకర్, ఎండ్లూరి. *జాషువా సాహిత్యం దృక్పథం–పరిణామం.* రాజమండ్రి: మానస మనోజ్ఞ ప్రచురణలు, 2007.
- సుబ్బారావు, చందు. *శిల్ప దృష్టి (సాహిత్య వ్యాస సంకలనం).* విశాఖపట్నం: అరసం, 1999.
- సుబ్బారావు, వావిరాల (సం.). *చలం ఆత్మకథ.* హైదరాబాదు: ప్రియదర్శిని ప్రచురణలు, 2011.
- సుబ్రహ్మణ్య శర్మ, పురాణం. *తెలుగు వెలుగు చలం.* విజయవాడ: న్యూ స్టూడెంట్సు బుక్ సెంటర్, 1983.
- సుబ్రహ్మణ్యం, జి.వి. *20వ శతాబ్ది విశ్వ సాహిత్య విమర్శ.* హైదరాబాదు: జివియస్ సాహితి కళాపీఠం, 1999.
- సుబ్రహ్మణ్యం, జి.వి. *ఆంధ్ర సాహిత్య విమర్శ – ఆంగ్ల ప్రభావం.* హైదరాబాదు: యువభారతి, 1983.
- సుబ్రహ్మణ్యం, జి.వి. *జీవీయస్ వ్యాసాలు.* హైదరాబాదు: శ్రీవాణి ప్రచురణలు, 1993.
- సుబ్రహ్మణ్యం, జి.వి. *సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు.* హైదరాబాదు: తెలుగు అకాడమి, 1991.
- సుబ్రహ్మణ్యం, జి.వి. (గౌ.సం), వెంకటప్పయ్య, వెలగా (సం.). *20వ శతాబ్ది తెలుగు వెలుగులు (మొదటి భాగం).* హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, 2005.
- సుబ్రహ్మణ్యం, జి.వి. (గౌ.సం), వెంకటప్పయ్య, వెలగా (సం.). *20వ శతాబ్ది తెలుగు వెలుగులు (రెండవ భాగం).* హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, 2005.

- సుబ్రహ్మణ్యం, జి.వి. (గౌ.సం), సుబ్రహ్మణ్యం, వడ్లా (సం.). *సాహిత్య వ్యాసాలు*. హైదరాబాదు: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, 2003.
- సూరిశాస్త్రి, పురాణం. *నాట్యఅశోకము*. బందరు: విద్యానిలయము, 1925 – 1927.
- సూరిశాస్త్రి, పురాణం. *నాట్యాంబుజము*. బందరు: విద్యానిలయము, 1923.
- సూరిశాస్త్రి, పురాణం. *నాట్యోత్పలము*. బందరు: విద్యానిలయము, 1924.
- సూరిశాస్త్రి, పురాణం. *విమర్శక పారిజాతము*. బందరు: విద్యానిలయము, 1925.
- సూర్యనారాయణ శాస్త్రి, సన్నిదానం. *కావ్యాలంకార సంగ్రహం*. విజయవాడ: ఎమెస్కో బుక్స్, 2008.
- సూర్యసాగర్, బి. *సాహిత్యం – సౌందర్యం*. గుంటూరు: జనసాహితి, 1995.

# పత్రికా వ్యాసాలు


- (సంపాదకీయం). *'విమర్శా సాహిత్యం'* తెలుగు (సాహిత్య త్రైమాసిక పత్రిక). డిసెంబరు 1989.
- గంగాధర్, వేంపల్లి. *'విమర్శ – ప్రస్థానం'* తెలుగు (సాహిత్య త్రైమాసిక పత్రిక). జులై–సెప్టెంబర్–2001.

  తెలుగు (సాహిత్య మాస పత్రిక). జనవరి 1996.
- దత్తకిశోర్, ఆలూరి. *'ప్రాచీన కవుల విమర్శ దృక్పథాలు'* తెలుగు (సాహిత్య త్రైమాసిక పత్రిక). జులై–సెప్టెంబర్–2001.
- దేవదానం రాజు, దాట్ల. *'విమర్శ: ప్రాచ్య, పాశ్చాత్య దృక్పథాలు'* తెలుగు (సాహిత్య త్రైమాసిక పత్రిక). జులై–సెప్టెంబర్–2001.
- నరసింహ మూర్తి, యు.ఎ. *'కళాత్మక రచన – కొ.కు.'* మిసిమి (మాస పత్రిక). ఫిబ్రవరి 2009.
- నరసింహ మూర్తి, యు.ఎ. *'కవిత్వము – అలౌకిక సౌందర్యము.'* మిసిమి (మాస పత్రిక). ఫిబ్రవరి 1999.
- నరసింహ మూర్తి, యు.ఎ. *'కవిత్వము –సౌందర్యము.'* మిసిమి (మాస పత్రిక). ఆగష్టు 1998.
- నాగరాజ్యలక్ష్మి, వి. *'సాహిత్య విమర్శ – లక్షణాలు'* తెలుగు (సాహిత్య త్రైమాసిక పత్రిక). జులై–సెప్టెంబర్–2001.
- నారాయణ గౌడ్, కోటగిరి. *'ఆధునిక కావ్య విమర్శ'* తెలుగు (సాహిత్య త్రైమాసిక పత్రిక). జులై–సెప్టెంబర్–2001.
- నారాయణ శర్మ, ఎం. *'ప్రాచీన కావ్య విమర్శ'* తెలుగు (సాహిత్య త్రైమాసిక పత్రిక). జులై–సెప్టెంబర్–2001.
- నారాయణరావు, రూపనగూడి. *'కళ యనగ నేమి?'* నాట్యకళ

(మాస పత్రిక). మార్చి 1967.

- నారాయణరావు, రూపనగూడి. '*కళోత్పత్తి*' నాట్యకళ (మాస పత్రిక). మే 1967.
- పద్మజ, మద్దాలి. 'తులనాత్మక విమర్శ' తెలుగు (సాహిత్య త్రైమాసిక పత్రిక). జులై–సెప్టెంబర్–2001.
- మాచిరెడ్డి, తక్కోలు. *'క్రోచే సౌందర్య శాస్త్రం'* మిసిమి (మాస పత్రిక). ఏప్రిల్ 2005.
- మాచిరెడ్డి, తక్కోలు. *'మానవత్వం పెంచే సౌందర్యానుభూతి'* మిసిమి (మాస పత్రిక). జనవరి 1996.
- రమేష్ బాబు, హెచ్. *'సాహిత్య విమర్శకు తెలుగు పత్రికల సేవ'* తెలుగు (సాహిత్య త్రైమాసిక పత్రిక). జులై–సెప్టెంబర్–2001.
- రాఘవ, బళ్ళారి. *'నాటక కళ: ఆదర్శము'* మిసిమి (మాస పత్రిక). ఏప్రిల్ 1998.
- లక్ష్మిరెడ్డి, జె. (అను.). *కళ కళ కోసం కాదు–జీవితం కోసం (మూలం విష్ణు సఖారామ్ ఖండేకర్).* మిసిమి (మాస పత్రిక). ఫిబ్రవరి 2006.
- లక్ష్మిరెడ్డి, జె. (అను.). *మనిషిని మంచి మార్గంలో నడిపేదే కళ (మూలం పి.వి. అఖిలందమ్).* మిసిమి (మాస పత్రిక). మార్చి 2006.
- లక్ష్మీకాంత మోహన్. *'కళను గురించి టాల్ స్టాయి అభిప్రాయాలు'* నాట్యకళ (మాస పత్రిక). జులై 1967.
- వరద రాజేశ్వరరావు, అబ్బూరి. *'అనగనగా విద్యాలయం'* ఆంధ్రజ్యోతి (దిన పత్రిక). 4 ఫిబ్రవరి 2004.
- వసంత. '*సౌందర్యము*' నాట్యకళ (మాస పత్రిక). జులై 1972.
- వెంకట రామారావు, వొద్దిరాజు. '*తిలక్ పద్య కవితా సౌందర్యం*' తెలుగు (సాహిత్య మాస పత్రిక). ఆగష్టు 1998.
- వెంకటేశ్వర రెడ్డి, అన్నవరెడ్డి. '*ఆధునికానంతరతా వాదం*' మిసిమి (మాస పత్రిక). ఏప్రిల్ 1999.

- వెంకటేశ్వరరెడ్డి, అన్నపరెడ్డి. *'సాహిత్యం – సృజనాత్మకత'* మిసిమి (మాస పత్రిక). జనవరి 2009.
- శంకర్, కారం. *'సాహిత్య విమర్శకుని వ్యక్తిత్వం'* తెలుగు (సాహిత్య త్రైమాసిక పత్రిక). జులై–సెప్టెంబర్-2001.
- శ్రీ జయచామరాజ వడయార్. *'సౌందర్య శాస్త్రము: భారతీయ దృక్పథము'* నాట్యకళ (మాస పత్రిక) డిశంబరు 1968.
- శ్రీ వెంకటేశ్వరరావు, రెంటాల. *'విమర్శకుడిగా కట్టమంచి'* తెలుగు (సాహిత్య మాస పత్రిక). సెప్టెంబరు 1995.
- శ్రీనివాసరావు, కాకుమాని. *'లలితకళలు – కళాతత్వం'* మిసిమి (మాస పత్రిక). ఏప్రిల్ 2007.
- శ్రీరామ అప్పారావు, పోణంగి. *'తెలుగు నాటక వికాసము (సమీక్షాత్మక వ్యాసము)'* నాట్యకళ (మాస పత్రిక). జనవరి-ఫిబ్రవరి 1969.
- శ్రీశ్రీ, ఆచార్య. *'విశ్వనాథ విమర్శ – శిల్ప దృక్పథం'* తెలుగు (సాహిత్య త్రైమాసిక పత్రిక). జులై–సెప్టెంబర్-2001.
- సతీష్ చందర్. *పోస్ట్ మోడర్నిజం – దళిత సాహిత్యం* మిసిమి (మాస పత్రిక). డిసెంబర్ 1999.
- సత్యనారాయణమూర్తి, జొన్నలగడ్డ. *'నాట్య కళ'* నాట్యకళ (సచిత త్రైమాసిక పత్రిక) డిసెంబర్34 ప్రథమ సంపుటం, తృతీయ సంచిక.

# నిఘంటువులు


- *తెలుగు నిఘంటువు (విద్యార్థుల కొరకు).* హైదరాబాదు:
  ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1967.
- *తెలుగు వ్యుత్పత్తి కోశం రెండవ సంపుటము (క-ఘ).* విశాఖపట్నం:
  ఆంధ్ర విశ్వకళా పరిషమ్ముద్రణం, 1981.
- నళిని, యస్.యస్. *సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ.* హైదరాబాదు:
  రమేష్ పబ్లికేషన్స్, 1998.
- *బౌణ్య ఇంగ్లీషు తెలుగు నిఘంటువు.* హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి,
  తొలి.ము. 1974, ద్వి.ము. 1983.
- రాధాకృష్ణ, బూదరాజు. *ఆధునిక వ్యవహార కోశం.* హైదరాబాదు:
  ప్రాచీ పబ్లికేషన్స్, 2000.
- రాధాకృష్ణ, బూదరాజు. *తెలుగు — తెలుగు నిఘంటువు.* హైదరాబాదు:
  తెలుగు అకడామి, 2009.
- రెడ్డి, జి.యన్. *ఇంగ్లీషు – తెలుగు నిఘంటువు.* హైదరాబాదు:
  తెలుగు అకాడమి, (ప్ర.ము. 1978), (ద్వి.ము.) 1995.
- వేంకటరాయ శాస్త్రి, వేదం. *ఆంధ్ర తమిళ కన్నడ త్రిభాషా నిఘంటువు.* హైదరాబాదు:
  ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, 1979.
- *శంకరనారాయణ తెలుగు — ఇంగ్లీషు నిఘంటువు.* విజయవాడ: విక్టరీ పబ్లికేషన్స్.
- *శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువు రెండవ సంపుటము (క-ఛ).* హైదరాబాదు:
  తెలుగు విశ్వవిద్యాలయం, (తృ.ము.) 1988
- శ్రీరామ చంద్రుడు, పుల్లెల. *ఆంధ్ర సంస్కృత కోశము.* హైదరాబాదు:
  సాహిత్య అకాడమి, 1971.
- సీతారాచార్యులు, బహుజనపల్లి. *శబ్దరత్నాకరము.* మద్రాసు:
  ఏషియన్ ఎడ్యుకేషనల్ సర్వీస్, 1988.

# ఆంగ్ల ఉపయుక్తగ్రంథాలు


- Aurobindo. *THE FUTURE POETRY. VOL-IX.* Pondicherry:
  Sri Aurobindo Ashram. 1972.
- Benedetto Croce. *AESTHETIC (Translated by Douglas Ainslie).*
  Newyork: Noonday press. 1962
- Berlyne, D. E. *Aesthetics and psychobiology.* New York:
  Appleton-Century-Crofts, 1971.
- Berys Gaut and Dominci McIver Lopes. *The Routledge companion to Aesthetics*
  *2nd edition*. London and NewYork: Routledge taylor &
  Francis Group, S.E. 2005.
- Carritt, E.F. The Theory of Beauty. London: University Paperbacks, (F.E.) 1962.
- Chalapati Rao, Sunkara. *Vaddadi Papaiah The Waking Dreamer in Colours.*
  Visakhapatnam: Chitrakala Parishad, 1994.
- Collingwood, R.G. Principles of Art. Oxford: Clarendon Press, 1938
- Croce, B. *Guide to Aesthetics, trans. P. Romanell*. New York:
  Bobbs-Merrill, 1965.
- Croce, Benedetto. *Aesthetic.* Noonday Press, 1955.
- Danto, A. C. *The Philospphical Disenfranchisement of Art*, New York:
  Columbia University, 1986.

- Else, G.F. *Aristotle on the Beauty of Tragedy*. Harvard Studies in Classical Philology, 1938.
- Ghoshal Shastry, S.N. *ELEMENTS OF INDIAN AESTHETICS.* Varanasi: Chaukambha Orientalia. 1978.
- Hanumantha Rao, G. *COMPARITIVE AESTHETICS.* Mysore: D.V.K.Murthy Krishnamurthy puram. 1974.
- Hegel, G. W. F. *Aesthetics: Lectures on Fine Art, trans. I. M. Knox*. Oxford: Oxford University Press, 1975.
- Hume, D. *Of the standard of Taste, Essays Moral, Political and Literary, ed. E. Miller.* Indianapolis: Liberty Classics, 1985.
- Hutcheson, F. *An Inquiry Concerning Beauty, Order, Harmony, Design, ed. P. Kivy.* The Hague: Martinus Nijhoff, 1973.
- Kant, I. *Critique of Judgment, trans. J. H. Bernard*. New York: Haffner, 1951.
- Krishna Chaitanya. *SANSKRIT POETICS.* Bombay: Asian publishing House. 1965.
- Pandey, K.C. *COMPARITIVE AESTHETICS-II.* Varanasi: Chaukambha Orientalia. 1972.
- Sambasiva Rao, Ravela. *POET-PAINTER SANJEEV DEV.* Guntur: The Adavi BapiRaju Kalapeetham. 1999.
- Santayana, George. *THE SENSE OF BEAUTY.* Newyork: Dover publishers. 1955.
- Schopenhauer, A. *The World as Will and Representation, 2 vols, trans.*

*E.F.J. Payne.* New York: Dover, 1966.

- Sidney, P. *A Defense of Poetry in K. Duncan – Jones and J. van Dorsten (eds) Miscellaneous Prose of Sir Philip Sidney.* Oxford: Oxford University Press, 1973.
- Tatarkiewicz, W. Medieval Aesthetics, trans. R.M. Montgomery. The Hague: Mouton, 1970.
- Tolstoy, L. What is Art?, trans. A . Maude. Oxford: Oxford University Press, 1930.